## బి.ఏ. మొదటి సంవత్సరం : ఆధునిక భాష : తెలుగు - పేపర్ - 1 - పాఠ్యప్రణాళిక

### ప్రాచీన కవిత్వం

1. ఉదంకోపాఖ్యానం - నన్నయ - మహాభారతం - ఆదిపర్వం - ప్రథమ : 91 - 119 పద్యాలు
2. మాలదాసరి కథ - శ్రీకృష్ణదేవరాయలు - ఆముక్తమాల్యద - షష్ఠాశ్వాసం - 3 - 66 పద్యాలు
3. కాళహస్తీశ్వర శతకం - ధూర్జటి

### ఆధునిక కవిత్వం

1. మాతృగీతాలు - నాయని సుబ్బారావు
2. బానిసల దండయాత్ర - అవంత్స సోమసుందర్ - వజ్రాయుధం నుండి
3. నగరంలో వాన - కుందుర్తి ఆంజనేయులు

**Publishers**
**University Publishing House, Guntur**

### గద్యభాగము

1. బాలచంద్రుడు - సురవరం ప్రతాపరెడ్డి (సప్త స్వరాలు నుండి - సంకలన కర్త : కె. ఈశ్వర్)
2. ఐకమత్యం - కందుకూరి వీరేశలింగం (సప్త స్వరాలు నుండి - సంకలన కర్త : కె. ఈశ్వర్)
3. పాండురంగ మహాత్మ్యం - పుట్టపర్తి నారాయణాచార్యులు (సప్త స్వరాలు నుండి - సంకలన కర్త : కె. ఈశ్వర్)
4. పరిచయం - శ్రీశ్రీ (సప్త స్వరాలు నుండి - సంకలన కర్త : కె. ఈశ్వర్)

**Publishers**
**Lorven Publications, Guntur**

### ఛందస్సు

దశవిధయతులు, షడ్విధ ప్రాసలు, (కవిజనాశ్రయము)

### అలంకారములు

చంద్రాలోకము నుండి

ఉపమ, ఉత్ప్రేక్ష, రూపక, అర్థాంతరన్యాస, అతిశయోక్తి, దృష్టాంత, ఉల్లేఖ, శ్లేష, అనుప్రాస, యమకం

# విషయసూచిక

## ప్రాచీన కవిత్వం


| | | |
|---|---|---|
| 1. | ఉదంకోపాఖ్యానం - నన్నయ | 1 - 32 |
| 2. | మాలదాసరి కథ - శ్రీకృష్ణదేవరాయలు (3 - 33 పద్యాలు) | 33 - 64 |
| 3. | మాలదాసరి కథ - శ్రీకృష్ణదేవరాయలు (34 - 66 పద్యాలు) | 65 - 99 |
| 4. | మాలదాసరి కథ - శ్రీకృష్ణదేవరాయలు | 100 - 116 |


## ఆధునిక కవిత్వం


| | | |
|---|---|---|
| 5. | శ్రీకాళహస్తీశ్వర శతకం - ధూర్జటి (1 - 35 పద్యాలు) | 117 - 147 |
| 6. | శ్రీకాళహస్తీశ్వర శతకం - ధూర్జటి (36 - 70 పద్యాలు) | 148 - 179 |
| 7. | శ్రీకాళహస్తీశ్వర శతకం - ధూర్జటి (71 - 108 పద్యాలు) | 180 - 205 |
| 8. | శ్రీకాళహస్తీశ్వర శతకం - ధూర్జటి (ప్రశ్నలు - సమాధానాలు) | 206 - 212 |
| 9. | మాతృగీతాలు - నాయని సుబ్బారావు | 213 - 233 |
| 10. | బానిసల దండయాత్ర - అవంత్స సోమసుందర్ | 234 - 252 |
| 11. | నగరంలో వాన - కుందుర్తి ఆంజనేయులు | 253 - 266 |


## గద్యభాగము


| | | |
|---|---|---|
| 12. | బాలచంద్రుడు - సురవరం ప్రతాపరెడ్డి | 267 - 278 |
| 13. | ఐకమత్యం - కందుకూరి వీరేశలింగం | 279 - 286 |
| 14. | పాండురంగ మహాత్మ్యం - పుట్టపర్తి నారాయణాచార్యులు | 287 - 304 |
| 15. | పరిచయం - శ్రీశ్రీ | 305 - 310 |


## ఛందస్సు


| | | |
|---|---|---|
| 16. | దశవిధయతులు, షడ్విధ ప్రాసలు | 311 - 317 |


## అలంకారములు


| | | |
|---|---|---|
| 17. | అలంకారములు | 318 - 328 |

**పాఠం - 1**

## ప్రాచీన కవిత్వం

# ఉదంకోపాఖ్యానము

## (ఆంధ్ర మహాభారతం - ఆదిపర్వం - ప్రథమాశ్వాసం)

**- నన్నయ**

**శీర్షికలు :**

1.0 లక్ష్యం
1.1 కవి పరిచయం
1.2 పాఠ్యభాగ సందర్భం
1.3 పాఠ్యభాగ సారాంశం
1.4 కఠిన పదాలకు అర్థాలు, సమగ్ర వ్యాఖ్యలు
1.5 సందర్భసహిత వ్యాఖ్యలు
1.6 ప్రశ్నలు - సమాధానాలు

## 1.0 లక్ష్యం

నన్నయ భట్టారకుడు ఉదంకోపాఖ్యానంలో ఉదంకుని గురుభక్తి, కార్యదీక్ష, బ్రహ్మణ క్షత్రియ మనస్తత్వ విశ్లేషణ, నాగరాజుల వైశిష్ట్యాన్ని వివరించాడు. ముఖ్యంగా మహాభారతంలో అత్యంత ప్రధానాంశం అయిన సర్పయాగం జనమేజయుడు చేయడానికి ప్రేరేపించిన ఉదంకుని వృత్తాంతం యిందు వర్ణితమైంది.

## 1.1 కవి పరిచయం

నన్నయ ప్రథమాంధ్ర కావ్యకర్త - సంస్కృత లౌకిక సారస్వతమునందు వాల్మీకి ఆదికవి వలె, ఆంధ్ర సాహిత్యమునందు నన్నయ ఆదికవి. అవిరళ జపహోమతత్పరుడు. విపుల శబ్దశాసనుడు. సంహితాభ్యాసుడు. బ్రహ్మాండాది నానా పురాణ విజ్ఞాన నిరతుడు. లోకజ్ఞుడు. ఉభయభాషా కావ్యరచనాభి శోభితుడు. సత్ప్రతిభాభియోగ్యుడు. నిత్య సత్య వచనుడు. రాజరాజ నరేంద్రుని కులబ్రాహ్మణుడు.

తూర్పు చాళుక్యవంశపు రాజరాజ నరేంద్రుని (క్రీ.శ.1022-1061) ప్రేరణతో నన్నయ మహాభారత ఆంధ్రీకరణకు పూనుకున్నాడు. నన్నయాంధ్రీకరణము తర్వాత దేశములో తెలుగుపై గౌరవం ఏర్పడింది. క్రమంగా వాఙ్మయ వికాసం జరిగింది. ఈయనకు మహాభారతాంధ్రీకరణలో నారాయణభట్టు అను మిత్రుడు సహాయపడినాడు. భారత యుద్ధములో అర్జుననకు శ్రీకృష్ణుడు సహాయపడినట్లు తనకు నారాయణభట్టు తోడైనాడని అవతారికలో నన్నయ తెలిపినాడు.

"శ్రీవాణీ గిరిజశ్చిరాయ" అను శ్లోకములో ఇష్టదేవతా స్తుతి చేసి శ్రీమదాంధ్ర మహాభారతమును నన్నయ ప్రారంభించినాడు. ముందుగా రాజరాజ నరేంద్రుని ఔన్నత్యాన్ని కొనియాడాడు. తన కవితలో ప్రసన్న కథా కలితార్థ యుక్తి, అక్షరరమ్యత, నానారుచిరార్థ సూక్తి నిధిత్వం ఉంటాయని వెల్లడించాడు. ముఖ్యంగా నన్నయది కథాకథనశైలి.

భాషకు నుడికారము ప్రాణము. ఆ నుడికారము నన్నయ రచనలో అధికముగా కలదు. నన్నయ ప్రధానముగా తత్సమ శబ్దములను అధికముగా ప్రయోగించాడు.

నన్నయ ఆది సభా పర్వములను, అరణ్య పద్యములో నాల్గవ ఆశ్వాసము 142వ పద్యము వరకు రచించెను. ఈతని శైలి మృదుమధురమై లలితార్థ చమత్కృతమై, ఉచితాలంకార శోభితమై, రసార్ధస్ఫూర్తి కలిగి ద్రాక్షా పాకమున సహృదయ రంజకమై పండిత పామరులకు కర్ణరసాయనముగ ఉంటుందని పండితులు తలుస్తారు. కేవలం కథను చెప్పడమే కాక, అందంగా పదాలను పదబంధాలను కూర్చడమేకాక, ఎన్నో ధర్మాలను ధర్మసూక్ష్మాలను ఆయన మనోహరంగా చెప్పాడు. మూలంలోని అనావశ్యక విషయాలను, పునరుక్తులను పరిహరించి, క్లిష్టతను తొలగించి కథను తేటతెల్లం చేశాడు. రసమయం చేశాడు. సందర్భానుసారంగా ఔచిత్యాన్ని పోషించాడు. ఆ కథల పరమార్థాన్ని భాసింపజేసాడు.

సంస్కృత వృత్తములలో తెలుగు కావ్యాలను రచించడానికి, చంపూరీతన పురాణాలను స్వతంత్ర పద్ధతిలో ఆంధ్రీకరించడానికి నన్నయయే మార్గదర్శకుడు.

## 1.2 పాఠ్యభాగ సందర్భము

మహాభారతంలోని మొదటి పర్వమైన ఆదిపర్వంలో పాండవుల జననం, విద్యాభ్యాసం, వివాహం మొదలైన ప్రధాన కథాంశాలు ఉన్నాయి. ప్రధాన కథతో పాటు అనేక ఉపాఖ్యానాలు ఉన్నాయి. వాటిలో మొదటిది ఉదంకోపాఖ్యానము.

జనమేజయుడు సర్పయాగం చేయడానికి ప్రేరేపించిన వాడు ఉదంకుడు. ఉదంకుడికి సర్పముల మీద ఎందుకంత క్రోధం కలిగినది? ఆ సందర్భంగా ఉదంకుని వృత్తాంతాన్ని వివరిస్తాడు నన్నయ. ఉదంకుడు తన గురుపత్ని కోరిక తీర్చుటకై కుండలాలను పౌష్యమహాదేవి వద్ద నుండి తీసుకొని వస్తుండగా, మార్గమధ్యంలో తక్షకుడు వాటిని అపహరించుకొనిపోతాడు. వానిని వెంబడిస్తూ ఉదంకుడు నాగలోకం పోయి, అక్కడ నాగపతులను స్తుతించి, దివ్యపురుషుని అనుగ్రహం పొందుతాడు. ఆయన పనుపున గుఱ్ఱం చెవిలో ఊదగా మహాప్రళయాగ్ని సంభవించి సంక్షోభముద్భవిస్తుంది. తక్షకుడు కుండలాలను తెచ్చి ఉదంకునకు సమర్పించినాడు. ఉదంకుడు వాటిని తీసుకొనివెళ్ళి గురుపత్నికి సమర్పించినాడు. కాని అతనికి తక్షకుని మీద కోపం పోలేదు. అతని నేరాన్ని, తన ప్రయాసని మరిచిపోలేదు.

ఉదంకుడు జనమేజయ మహారాజు వద్ద కేగి, 'రాజా! నేను గురుహిత కార్యం చేయబూనగా తక్షకుడు అకారణముగా నాకపకారము చేసిన వంచనోన్నతమతి. నీ తండ్రి పరీక్షిత్తు మరణానికి కూడ అతడే కారకుడు. అతని మీద నీవు పగ సాధించాలి. ఒక కుల పాంసనుడు చేసిన తప్పిదానికి కులమెల్ల దూషితమగును కాన నీవు తక్షక వంశాన్ని నాశనం చేయడానికి సర్పయాగం చేయుము' అని ప్రోత్సహించాడు.

ప్రధాన కథకు కారాణభూతమైన ఉదంకుని వృత్తాంతము ముందుగా చెప్పబడింది.

## 1.3 పాఠ్యభాగ సారాంశం

ఉదంకుడు పైలుని శిష్యుడు. గురుపత్ని పంపగా పౌష్య మహారాజుగారి ధర్మపత్ని కుండలాలను తెచ్చుటకు బయలుదేరాడు. దారిలో ఒక ఎద్దు నెక్కి పోతూవున్న దివ్యపురుషుడు కనిపించాడు. ఆ దివ్యపురుషుని ఆజ్ఞననుసరించి ఉదంకుడు 'వృషభ గోమలాము' తిన్నాడు. ఆయన అనుగ్రహాన్ని పొంది, వేగంగా పోయి, పౌష్య మహారాజును చూచి, దీవించి, సత్కారం పొందాడు.

'నేను గురువు గారి పని మీద వచ్చాను. నీ భార్య కుండలాలను యివ్వు. నా కోరిక సఫలమవుతుంది' అని ఉదంకుడు అడుగగా, తన ధర్మపత్ని నడిగి తీసుకొమ్మని అంతఃపురానికి పంపాడు పౌష్యుడు. అక్కడ ఉదంకునికి దేవి కనిపించలేదు. ఉదంకుడు తిరిగి పౌష్యుని వద్దకు వచ్చి దేవి కనబడలేదని, కుండలాలను ఇప్పించమని అన్నాడు. 'నువ్వు అశుచివై వున్నట్లున్నావు. ఆమె పతివ్రత అశుచులకు కనబడదు. కనుక శుచివై పొమ్మ' న్నాడు పౌష్యుడు. గోమయ భక్షణం గుర్తుకు వచ్చిన ఉదంకుడు,

కాళ్ళు చేతులు మొగము మంచినీటితో శుభ్రపరచుకొని, ఆచమించి, అంతఃపురానికి వెళ్ళాడు. దేవిని దర్శించాడు. ఆమె కుండలాలను ఇస్తూ 'తక్షకుడు వీటిని అపహరించదలచాడు. జాగ్రత్తగా ఉండుము' అని చెప్పినది. తన యింట భుజింపుమని రాజు కోరగా, ఉదంకుడు సరేనని భోజనమునకు కూర్చున్నాడు. భోజనంలో వెంట్రుక రాగా కోపించిన ఉదంకుడు పౌష్యుని అంధుడవగుమని శాపమిచ్చినాడు. అల్ప దోషానికే శాపం ఇచ్చినందుకు కినిసి రాజు 'నీవు సంతానము లేనివాడవగుదు' వని ప్రతి శాపం ఇచ్చాడు. శాపం ఉపసంహరింపుమని ఉదంకుడు ప్రార్థించగా రాజు తానశక్తుడనినాడు. ఉదంకుడు శాపమోక్షమును ప్రసాదించాడు.

ఉదంకుడు కుండలాలను తీసుకొని వెళుతూ, ఆచమనం కోసం చెరువులోనికి దిగుతూ, వాటిని గట్టున పెట్టాడు. వెంటనే తక్షకుడు వాటిని అపహరించి పారిపోసాగాడు. ఉదంకుడు వానిని వెంబడిస్తూ నాగలోకానికి వెళ్ళాడు. అక్కడ నాగపతులను స్తుతించాడు. సర్పాలన్నీ తనకు వశం అయ్యేట్టు అక్కడ ఒక దివ్యపురుషునిచే వరం పొందాడు. ఆయన ఆజ్ఞచే ఆ గుఱ్ఱం చెవిలో ఊదగా, మహా ప్రళయాగ్ని సంభవించింది. తక్షకుడు కుండలాలను తెచ్చి ఇచ్చాడు. ఆ గుఱ్ఱాన్ని అధిరోహించి, వెంటనే గురుపత్ని వద్దకేగి కుండలాలు సమర్పించాడు.

అరణ్యంలో ఉదంకునకు కనబడిన దివ్యపురుషుడు ఇంద్రుడని, ఆ ఎద్దు పేడ అమృతమని, నాగలోకంలో కనబడిన స్త్రీలు ధాత, విధాతయని, వారు నేస్తున్న తెలుపు నలుపు దారాలు పగలు రాత్రి అని, పన్నెండు రేకులు గల చక్రం సంవత్సరమని, దాన్ని తిప్పే ఆరుగురు కుమారులు ఆరు ఋతువులని, ఆ గుఱ్ఱం ఇంద్రుని మిత్రుడు మేఘుడని పైలుడు శిష్యునికి వివరించాడు.

## 1.4 కఠినపదాలకు అర్థాలు, సమగ్ర వ్యాఖ్యలు :

| | | | |
|---|---|---|---|
| 91. | అనవరత | = | ఎల్లప్పుడు |
| | శాంతిక పౌష్టిక క్రియలు | = | శాంతిక, పౌష్టిక నామములు గల కర్మకాండలు |
| | మహీదేవ | = | బ్రాహ్మణులను |
| | తర్పణ+అభిరతూడై | = | తృప్తి కలిగించుట యందు కోరిక గలవాడై |

| | | | |
|---|---|---|---|
| 92. | పంకజ భవసన్నిభుడు | = | బ్రహ్మతో సమానుడు |
| | అఘపంక | = | పాపమనెడి బురదను |
| | క్షాళన మహా తపస్సలిలుడు | = | గొప్ప తపస్సు అనే నీటితో కడిగినవాడు |
| | అనాతంకమతి | = | శంకలేని మనసు గలవాడు |

తాత్పర్యము : పైల మహాముని శిష్యుడు, బ్రహ్మతో సమానమైనవాడు, గొప్ప తపస్సు అనే నీటితో పాపం అనే బురదను కడిగినవాడు, అవమానరహితమైన మనసు కలవాడు అయిన ఉదంకుడు అనే ముని శ్రేష్ఠుడు మిక్కిలి భక్తితో

| | | | |
|---|---|---|---|
| 93. | పరిచర్య | = | సేవ |
| | అణిమాదిక+అష్టగుణములు | = | అణిమ, గరిమ, లఘిమ, మహిమ, ప్రాప్తి, ప్రాకామ్యం, ఈశత్వం అనే ఎనిమిది సిద్ధులు |

తాత్పర్యము : గురువు ఇంట సేవచేస్తూ, మిక్కిలి నిష్ఠగలిగి గురువు దయవలన అణిమాది సిద్ధులతో కూడిన జ్ఞానం సంపాదించాడు.

| | | | |
|---|---|---|---|
| 94. | తేరన్+పూని | = | తెచ్చుటకు పూనుకొని |
| | మహా+ఉక్షంబు | = | గొప్ప యెద్దు |
| | వాని పన్నిన | = | అతడు నిర్దేశించిన |
| | గోమయ భక్షణము | = | పేడ తినుట |
| | గృహీత సత్కారుడై | = | సత్కారము గ్రహించినవాడై |

తాత్పర్యము : గురుదక్షిణ స్వీకరింపుమని గురువుని ప్రార్థించాడు. గురువుగారు తన పత్నిని అడగమన్నాడు. ఆమె ఉదంకునితో తనకు పౌష్యమహారాజు గారి భార్య కుండలాలు తెచ్చి యిమ్మంది. ఉదంకుడు వాటిని తీసుకొని రావడానికి బయలుదేరి అరణ్యంలో వెళ్ళుతూవుండగా ఒక దివ్యపురుషుడు ఎద్దునెక్కి వచ్చి కనబడ్డాడు. ఆ ఎద్దు యొక్క పేడను తినమని ఉదంకునితో అన్నాడు. ఉదంకుడు ఆ దివ్యపురుషుడు చెప్పినట్లే చేసి, అతని దయకు పాత్రుడయ్యాడు. తరువాత, పౌష్యుని వద్దకేగి, అతణ్ణి దీవించి, అతనిచే సత్కారంపొంది, ఇట్లు పలికాడు.

| | | | |
|---|---|---|---|
| 95. | గురు+అర్థము | = | గురుదక్షిణ |
| | దండిత+ఆరాతి | = | శత్రువులను జయించినవాడా |
| | పూన్కి | = | ప్రయత్నము |

తాత్పర్యము : ఓ రాజా! నేను గురువుగారి కోరిక మీద యిక్కడకు వచ్చాను. నీ భార్య యొక్క కుండలాలను ఇచ్చి, నా కోరిక సఫలము చేయుము.

| | | | |
|---|---|---|---|
| 96. | మదీయ ధర్మపత్ని | = | నా భార్య |
| | ఇప్పించుకొమ్ము | = | అడిగి తీసుకో |
| | క్రమ్మరి | = | తిరిగివచ్చి |

తాత్పర్యము : అనగా విని, పౌష్యుడు ఇంత గొప్పవానికి కుండలములనిచ్చు భాగ్యం కలిగినది. నా జన్మ సఫలమైంది అని మనసులో సంతోషించి, ఉదంకునితో ఇలా అన్నాడు "అయ్యా, నా భార్య ఆ కుండలములు ధరించే సమయం ఇది. నేను చెప్పానని చెప్పి, వాటిని అడిగి తీసుకో". ఉదంకుడు అంతఃపురానికి వెళ్ళి చూస్తే, అక్కడ పౌష్యుని భార్య కనబడలేదు. తిరిగి పౌష్యుని వద్దకు వచ్చి 'నీ భార్య ఎక్కడా కనబడలేదు. నీవే ఆ కుండలాలు తెప్పించి ఇవ్వు' అన్నాడు. అప్పుడు ఉదంకునితో పౌష్యుడు ఇలా అన్నాడు.

| | | | |
|---|---|---|---|
| 97. | భూవినుత | = | అందరిచే పొగడబడువాడా |
| | అ అవద్యా | = | దోషరహితుడా |
| | త్రిభువన పావనున్ | = | ముల్లోకాల్లో పవిత్రుడైన వానిని |
| | అశుచివి+అని | = | అపవిత్రుడవని |

తాత్పర్యము : ఓ పుణ్యాత్ముడా! ముల్లోకాల్లో పవిత్రుడవైన నిన్ను అపవిత్రుడవని ఎలా అనగలను! ఆ దేవి పరమ పతివ్రత కనుక అశుచులకు కనబడదు.

| | | | |
|---|---|---|---|
| 98. | వృషభ గోమయ భక్షణంబునన్ | = | ఎద్దు పేడ తినడంచే |
| | అశుచి భావంబునన్+కాకేమి | = | మైలపడుట వలన కాబోలు |
| | పూర్వ+అభిముఖుడై | = | తూర్పుగా తిరిగినవాడై |
| | ప్రక్షాళిత పాణి పాద వదనుడు | = | చేతులు, కాళ్ళు, ముఖం కడుక్కున్నవాడై |

| | | |
|---|---|---|
| ఆచమించి | = | ఆచమనం చేసి |
| పౌష్య+అనుమతంబునన్ | = | పౌష్యుని అంగీకారముతో |

తాత్పర్యము : ఉదంకునకు గోమయ భక్షణ విషయం మనసులో దలచుకొని, కనుకనే అశుచిత్వంవల్ల ఆ దేవి కనబడలేదు అని గ్రహించి, తూర్పు దిక్కుకు తిరిగి చేతులు, కాళ్ళు, మొగము కడుగుకొని, ఆచమించి, పౌష్యుని అనుమతితో ఆ దేవి వద్దకు పోగా, ఆమె నమస్కరించి, ఆ కుండలములనిచ్చి ఇలా అన్నది.

| | | | |
|---|---|---|---|
| 99. | రవినిభతేజా | = | సూర్యునితో సమానమైన కాంతిగలవాడా |
| | అపేక్షించు | = | కోరుచు |
| | అభేద్యుడు | = | లొంగనివాడు |
| | మాయాదక్షుండు | = | మాయలో ఆరితేరినవాడు |
| | సురక్షితముగ జేసి | = | రక్షించుకొనుచు |

తాత్పర్యము : సూర్యునితో సమానమైన తేజస్సు గలవాడా! తక్షకుడనే వాడు ఈ కుండలాలను అపహరించాలని ఉన్నాడు. వానిని జయించడం కష్టం. మాయోపాయం కలవాడు. వాని నుండి కాపాడుకుంటూ వెళ్ళు.

| | | | |
|---|---|---|---|
| 100. | కృతభోజనుండవు | = | భోజనము చేసినవాడవు |
| | క్షణియించిన | = | భోజనమునకు ఆహ్వానింపగా |
| | ఒడంబడి | = | ఒప్పుకొని |
| | కుడుచుబోన్ | = | తినుచుండగా |
| | కేశదుష్టంబు | = | వెండ్రుక చేత దూషితము |
| | రోసి | = | అసహ్యించి |
| | కరంబు+అలిగి | = | మిక్కిలి కోపగించి |
| | అపరీక్షితంబైన | = | పరీక్షింపబడని |
| | అశుద్ధాన్నంబు | = | పరిశుభ్రముకాని అన్నము |
| | అ+అపత్యుండవగుము | = | సంతానము లేనివాడవు అగుము |
| | ఓప | = | సహింపను |
| | క్రమ్మరింపుము | = | త్రిప్పుము, మరిలింపుము |

తాత్పర్యము : ఆ దేవి మాటలకు అంగీకరించి ఉదంకుడు సెలవు తీసుకొని రాగా, పౌష్యుడు 'అయ్యా నీవు అతిధివి. మా ఇంట భోజనము చేసి వెళ్ళు' అని ఆహ్వానించగా, అందుకు ఒప్పుకొని ఉదంకుడు భోజనం చేస్తూ ఉండగా, అన్నంలో వెండ్రుక వుండడం చూసి, కోపగించి ఉదంకుడు 'అపరిశుభ్రమైన అన్నం పెట్టావు గాబట్టి గ్రుడ్డివాడవు అగుము' అని పౌష్యుని శపించాడు. 'చిన్న తప్పుకు శాపం ఇచ్చావు. నీకు సంతానం లేకుండు గాక' అని పౌష్యుడు ప్రతి శాపం ఇచ్చాడు. ఇప్పుడు ఉదంకుడు 'నేను సంతాన హీనుణ్ణి అవడం సహించలేను. ఈ శాపాన్ని మరలింపుము' అనగా పౌష్యుడు ఇలా అన్నాడు.

101. నిండు మనంబు నవ్యనవనీత సమానము పల్కు దారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత విప్రుల యందు నిక్కమీ
రెండును రాజులందు విపరీతము గావున విప్రుడోపునో
పండతి శాంతుడయ్యు నరపాలుడు శాపము గ్రమ్మఱింపగన్

**కవి పరిచయము :**

ఈ పద్యము ఉదంకోపాఖ్యానము అను పాఠ్యభాగములోనిది. మహాభారతములోని ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఇది గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. నన్నయ 11వ శతాబ్దివాడు. ఆదికవి, శబ్దశాసనుడు (వాగనుశాసనుడు) ఆయన బిరుదములు.

**సందర్భము :**

ఉదంకునకు పౌష్య మహారాజు పెట్టిన భోజనములో వెంట్రుక రాగా, ఉదంకుడు కోపించి పౌష్యుని అంధుడగునట్లు శపించెను. అల్పదోషమునకే శాపం ఇచ్చినందులకు నీకు సంతానము లేకుండుగాక అని ప్రతి శాపం ఇచ్చాడు పౌష్యుడు. ఉదంకుడు ఆ శాపాన్ని ఉపసంహరింపుమనినప్పుడు పౌష్యుడు తానశక్తుడనని పలుకు సందర్భములోనిది ఈ పద్యము.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| జగత్+నుత | = | లోకముచే ప్రశంసింపబడినవాడా |
| నిండుమనంబు | = | మనసంతయు |
| నవ్యనవనీతసమానము | = | అప్పుడే తీసిన వెన్నతో సమానము |
| పల్కు | = | మాట |
| దారుణ+అఖండ శస్త్ర తుల్యము | = | భయంకరమైన వజ్రాయుధముతో సమానము |
| ఈ రెండును | = | పైన చెప్పిన రెండును |
| విప్రులయందు | = | బ్రాహ్మణుల యందు |
| నిక్కము | = | నిజము |
| రాజులందు | = | రాజుల విషయంలో |
| విపరీతము | = | పై వాటికి వ్యతిరేకము |
| కావున | = | కాబట్టి |
| విప్రుడు+ఓపున్ | = | బ్రాహ్మణుడు శాపమును ఉపసంహరింప గలడు |
| నరపాలుడు | = | రాజు |
| అతిశాంతుడు+అయ్యు | = | మిక్కిలి శాంత గుణము కలిగిన వాడైనా |
| శాపము | = | శాపమును |
| క్రమ్మరింపగన్ | = | త్రిప్పివేయుటకు |
| ఓపండు | = | సమర్థుడుకాడు |

**తాత్పర్యము :**

ఓ ఉత్తముడైన ఉదంకా! బ్రాహ్మణుని మనసు అప్పుడే తీసిన వెన్నవలే సున్నితమైనది. కానీ అతని మాట మాత్రము వజ్రాయుధం లాగా కఠినంగా ఉంటుంది. రాజు మనసు మాత్రం సరిగ్గా దీనికి వ్యతిరేకం. కావున బ్రాహ్మణుడు శాపాన్ని ఉపసంహరింపగలడు. రాజు ఎంత శాంతస్వభావి అయినా శాపం మరల్చలేడు.

**సంధులు :**

| | | |
|---|---|---|
| దారుణ+అఖండల | = | సవర్ణదీర్ఘసంధి |

| | | |
|---|---|---|
| జగత్+నుత | = | అనునాసికసంధి |
| శాపమున్+క్రమ్మరించు | = | సరళాదేశసంధి |

**సమాసములు :**

| | | |
|---|---|---|
| నిండుమనంబు | = | నిండైన మనము<br>విశేషణ పూర్వపదకర్మధారయము |
| జగన్నుత | = | జగముచేతనుత<br>తృతీయా తత్పురషము |
| నరపాలుడు | = | నరులకుపాలుడు<br>షష్ఠీ తత్పురుషము |

**ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| UII | UIU | III | UII | UII | UIU | IU |
| నిండుమ | నంబున | వ్యనవ | నీతస | మానము | పల్కుదా | రుణా |
| భ | ర | న | భ | భ | ర | వ |

ఇది ఉత్పలమాల. భ ర న భ భ ర వ అను గణములు వచ్చును. 10వ అక్షరము యతి. నిం - నీ

**కవితా విశేషములు :**

ఇది నన్నయ రచించిన ప్రసిద్ధ పద్యములలో ఒకటి. ధారా శుద్ధికి, కూర్పు చిక్కదనానికి మచ్చుతునక. మూల భారతంలోని భావానికి నన్నయ అధికమైన సొగసును కల్పించాడు. బ్రాహ్మణ, రాజ మనస్తత్త్వాల తారతమ్యం ఇంత చక్కగా చెప్పిన పద్యం వేరొకటి లేదని చెప్పవచ్చు.

| | | | |
|---|---|---|---|
| 102. | మగడిపోవునెడన్ | = | తిరిగి పోయేటప్పుడు |
| | ఈన్ +కంటిని | = | ఇవ్వగలిగాను |
| | నగ్న వేషధరుడై | = | బట్టలు లేనివాడై |
| | పాఱినకా | = | పరుగెత్తగా |
| | పిఱుందన | = | వెనువెంటనే |

తాత్పర్యము : కనుక నేను శాపాన్ని ఉపసంహరింపలేను. నువ్వు ఇచ్చిన శాపాన్ని ఉపసంహరింపుమనగా, ఉదంకుడు అలాగే అని 'నీకు కొద్దికాలంలో శాపవిమోచనం అవుతుంది' అని పౌష్యునితో పలికి, తిరిగి వెళుతూ గురుపత్నికి కుండలములు ఇచ్చే భాగ్యం కలిగింది అనుకొంటూ ఒక చెరువును చూచి, శుభ్రమైన ప్రాంతంలో తన చేతిలోని కుండలాలను పెట్టి, ఆచమనం చేస్తూండగా, తన వెనుకనే వచ్చిన తక్షకుడు దిగంబరుడై ఆ కుండలాలను కాజేసి పారిపోయాడు. ఉదంకుడు వానిని వెన్నంటి పట్టుకున్నాడు.

| | | | |
|---|---|---|---|
| 103. | విషధరపతి | = | సర్పరాజైన తక్షకుడు |
| | అహిలోకమునకున్ | = | నాగలోకానికి |
| | భూవివరమునన్ | = | పుట్టలోపలనుండి |

తాత్పర్యము : పారిపోతున్న తక్షకుని వెంటబడి, ఉదంకుడు భూరంధ్రం గుండా సర్పలోకానికి పోయి అక్కడ సర్పరాజులను ఇలా స్తుతించాడు.

104. ఉరగలోకంబు = నాగలోకము

105. బహువన పాదపాబ్ధి కులపర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహిత మహా మహీభర మజస్ర సహస్ర ఫణాళి దాల్చిదు
స్సహతరమూర్తికిన్ జలధిశాయికి బాయక శయ్యయైనయ
య్యహిపతి దుష్కృతాంతకు డనంతుడు మాకు ప్రసన్నుడయ్యెడున్

**కవి పరిచయము :**

ఈ పద్యము ఉదంకోపాఖ్యానము అను పాఠ్యభాగములోనిది. మహాభారతములోని ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఇది గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. నన్నయ 11వ శతాబ్దివాడు. ఆదికవి, శబ్దశాసనుడు (వాగనుశాసనుడు) ఆయన బిరుదములు.

**సందర్భము :**

ఉదంకుడు ఆచమనము చేయుటకై సరస్సులో దిగివచ్చుసరికి, అతడు గట్టున పెట్టియున్న మణికుండలములను తక్షకుడు అపహరించి పారిపోయెను. ఉదంకుడు వానిని వెంబడించి, పుట్ట తొర్రలో నుండి నాగలోకమునకేగి, అచట సర్పరాజైన శేషుని స్తుతించు సందర్భము లోనిది ఈ పద్యము.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| బహు | = | అనేక |
| వన | = | అరణ్యములందలి |
| పాదప | = | వృక్షాలతోను |
| అబ్ధి | = | సముద్రములతోను |
| కులపర్వత | = | సప్తకుల పర్వతములతోను |
| పూర్ణసరః | = | నిండైన సరస్సులతో |
| సరస్వతీ సహిత | = | నదులతోను కూడిన |
| మహీభర | = | భూ భారమును |
| అజస్ర | = | స్థిరమైన |
| సహస్ర ఫణాళిన్ | = | వెయ్యి పడగలను |
| తాల్చి | = | ధరించి |
| దుస్సహతర మూర్తికిన్ | = | భరింప శక్యముగాని రూపముగల |
| జలధి శాయికిన్ | = | విష్ణుమూర్తికి |
| పాయక | = | ఎడబాయక |

| | | |
|---|---|---|
| శయ్యయైన | = | పాన్పు అయిన |
| అహిపతి | = | సర్పరాజు |
| దుష్కృత+అంతకుడు | = | పాపాలను పోగొట్టేవాడైన |
| అనంతుడు | = | ఆదిశేషుడు |
| మాకున్ | = | మాపై |
| ప్రసన్నుడు+అయ్యెడున్ | = | అనుగ్రహము చూపుగాక |

**తాత్పర్యము :**

అనేక వృక్షాలతో కూడిన అరణ్యాలు, సముద్రాలు, సప్త పర్వతాలను, నిండిన సరస్సులు, నదులు ఉన్న ఈ భూభారాన్ని తన వేయి పడగలపై ధరించి, చూడశక్యముగాని ఆకారము గల విష్ణుమూర్తికి ఎప్పుడూ పాన్పుగా ఉండే సర్పరాజు పాపాలను పోగొట్టే వాడయిన ఆదిశేషుడు మాపై దయచూపుగాక!

**సంధులు :**

| | | |
|---|---|---|
| పాదప+అబ్ధి | = | సవర్ణదీర్ఘసంధి |
| సరః+సరస్వతీ | = | విసర్గసంధి |
| ఫణాళిన్+తాల్చి | = | సరళాదేశసంధి |

**సమాసములు :**

| | | |
|---|---|---|
| మహామహాభరము | = | గొప్ప మహాభరము<br>విశేషణ పూర్వపదకర్మధారయము |
| సహస్రఫణాళి | = | సహస్ర సంఖ్యగల ఫణాళి<br>ద్విగు సమాసము |
| దుష్కృతాంతకుడు | = | దుష్కృతములకు అంతకుడు<br>షష్ఠీ తత్పురుషము |

**ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| III | IUI | UII | IUI | IUI | IUI | UIU |
| బహువ | నపాద | పాబ్దికు | లపర్వ | తపూర్ణ | సరస్స | రస్వతీ |
| న | జ | భ | జ | జ | జ | ర |

ఇది చంపకమాల. న జ భ జ జ జ ర అను గణములు వచ్చును. 11వ అక్షరము యతి. బ - ప

**కవితా విశేషములు :**

నన్నయ అక్షర రమ్యతకు ఈ పద్యము చక్కని ఉదాహరణ. నాగరాజు ప్రపంచ భారాన్ని మోసే దృశ్యం కళ్ళకు కట్టినట్టు వర్ణించాడు. పద్యం అర్థం తెలియకముందే ఇందులోని సరస్సరస్వతీ, మహామహీ, అజస్రసహస్ర మొదలైన మాటలు వినడానికి ఇంపుగా ఉంటాయి. పాద, పర్వత, పూర్ణ అనే శబ్దాలలోని పకారాలు శ్రుతిపేయంగా వుంది. ''మాకు'' అని ఉదంకుడు బహువచనం ప్రయోగించి ''గురుకులాన్ని'' మొత్తాన్ని తనతోపాటు కలుపుకున్నాడు.

106. అరిది తపోవిభూతి నమరారుల బాధలు వొందకుండగా
నురగుల నెల్ల గాచిన మహోరగ నాయకుడా నమత్సురా
సుర మకుటాగ్ర రత్నరుచి శోభిత పాదునకద్రి నందనే
శ్వరునకు భూషణంబయిన వాసుకి మాకు ప్రసన్నుడయ్యెడున్

**కవి పరిచయము :**

ఈ పద్యము ఉదంకోపాఖ్యానము అను పాఠ్యభాగములోనిది. మహాభారతములోని ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఇది గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. నన్నయ 11వ శతాబ్దివాడు. ఆదికవి, శబ్దశాసనుడు (వాగనుశాసనుడు) ఆయన బిరుదములు.

**సందర్భము :**

ఉదంకుడు ఆచమనము చేయుటకై సరస్సులో దిగివచ్చుసరికి, అతడు గట్టున పెట్టియున్న మణికుండలములను తక్షకుడు అపహరించి పారిపోయెను. ఉదంకుడు వానిని వెంబడించి, పుట్ట త్రొర్రలో నుండి నాగలోకమునకేగి, అచట సర్పరాజైన వాసుకిని స్తుతించు సందర్భము లోనిది ఈ పద్యము.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అరిది | = | అపురూపమైన |
| తపోవిభూతిన్ | = | తపస్సు అనే సంపదతో |
| అమరారుల | = | రాక్షసులచే బాధలు |
| పొందక+ఉండగాన్ | = | పొందకుండా ఉండునట్లు |
| ఉరగలన్+ఎల్లన్ | = | పాములన్నిటినీ |
| పూర్ణసరః | = | నిండైన సరస్సులతో |
| కాచిన | = | రక్షించిన |
| మహా+ఉరగనాయకుడు | = | గొప్ప సర్పరాజు |
| ఆనమత్ | = | నమస్కరించుచున్న |
| సుర+అసుర | = | దేవతల, రాక్షసుల |
| మకుట+అగ్ర | = | కిరీటములపై |
| రత్న రుచి శోభిత | = | రత్నకాంతులచే ప్రకాశించు |
| పాదునకు | = | పాదములు గలవానికి |
| అద్రినందన+ఈశ్వరునకున్ | = | పార్వతి భర్తయైన శివునకు |
| భూషణంబు+అయిన | = | అలంకారమైన |
| వాసుకి | = | వాసుకి అను నాగరాజు |
| మాకు | = | మాకు |
| ప్రసన్నుడయ్యెడున్ | = | అనుగ్రహము చూపుగాక |

**తాత్పర్యము :**

అపూర్వమైన తపస్సుతో పాములకు రాక్షసుల బాధలేకుండా చేసినవాడు, దేవదానవులచే పాదాభివందనం పొందినవాడు, శివునికి అలంకారం అయినవాడు అయిన వాసుకి మమ్మల్ని అనుగ్రహించు గాక.

**సంధులు :**

| | | |
|---|---|---|
| తపః+విభూతి | = | విసర్గసంధి |
| అమర+అరులు | = | సవర్ణదీర్ఘసంధి |
| బాధలు+పొందు | = | గసడదవాదేశసంధి |
| మహా+ఉరగ | = | గుణసంధి |

**సమాసములు :**

| | | |
|---|---|---|
| మకుటాగ్ర | = | మకుటము యొక్క అగ్ర షష్ఠీ తత్పురుషము |
| అద్రినందనేశ్వరుడు | = | అద్రినందనకు ఈశ్వరుడు షష్ఠీ తత్పురుషము |

**ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| అరిది | తపోవి | భూతిన | మరారు | లబాధ | లువొంద | కుండగా |
| న | జ | భ | జ | జ | జ | ర |

ఇది చంపకమాల. ఇందు న జ భ జ జ జ ర అను గణములు వచ్చును. 11వ అక్షరము యతి. అ - అ

**కవితా విశేషములు :**

నాగరాజులను ప్రస్తుతించే ఈ నాలుగు పద్యరత్నాలు నన్నయ కవితా ప్రతిభకు మచ్చుతునకలు. చక్కని సంస్కృత సమాసములను భక్తి ప్రపత్తులు ఉట్టిపడునట్లు ఆయన ప్రయోగించాడు. ఇందులో రకారం పునరావృతం కావడం చేత అనుప్రాస శోభితమై అక్షరరమ్యత ప్రస్ఫుటమగుచున్నది.

107. దేవ మనుష్య లోకముల ద్రిమ్మరుచున్ విపుల ప్రతాపసం
భావిత శక్తి శౌర్యులు నపార విషోత్కట కోప విస్ఫుర
త్పావక తాపితాఖిల విపక్షులు నైన మహానుభావులై
రావతి కోటి ఘోర ఫణిరాజులు మాకు బ్రసన్నులయ్యెడున్

**కవి పరిచయము :**

ఈ పద్యము ఉదంకోపాఖ్యానము అను పాఠ్యభాగములోనిది. మహాభారతములోని ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఇది గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. నన్నయ 11వ శతాబ్దివాడు. ఆదికవి, శబ్దశాసనుడు (వాగనుశాసనుడు) ఆయన బిరుదములు.

**సందర్భము :**

ఉదంకుడు ఆచమనము చేయుటకై సరస్సులో దిగివచ్చుసరికి, అతడు గట్టున పెట్టియున్న మణికుండలములను తక్షకుడు అపహరించి పారిపోయెను. ఉదంకుడు వానిని వెంబడించి, పుట్ట తొర్రలో నుండి నాగలోకమునకేగి, అచట సర్పరాజైన వాసుకిని స్తుతించు సందర్భము లోనిది ఈ పద్యము.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| దేవ | = | దేవతల |
| మనుష్య | = | మానవుల |
| లోకములన్ | = | లోకములందు |
| త్రిమ్మరుచున్ | = | తిరుగుచు |
| విపుల | = | విస్తారమైన |
| ప్రతాప | = | పరాక్రమముచే |
| సంభావిత | = | గౌరవించబడిన |
| శక్తిశౌర్యులు | = | బలపౌరుషములు కలవారు |
| అపార | = | మిక్కిలి |
| విష | = | విషముతో కూడిన |
| ఉత్కటకోప | = | అధిక కోపం అనే |
| విస్ఫురత్ | = | భగభగమండే |
| పావక | = | అగ్నిచే |
| తాపిత | = | తపింపజేయబడిన |
| అఖిల విపక్షులును | = | సర్వశత్రువులు కలవారును |
| ఐన | = | ఐనట్టి |
| మహానుభావులు+ఐ | = | గొప్ప మహిమ గలవారు అయిన |
| ఐరావత | = | ఐరావతము యొక్క |
| కోటి | = | జాతికి చెందిన |
| ఘోర | = | భయంకర |
| ఫణిరాజులు | = | సర్పరాజులు |
| మాకున్ | = | మాకు |
| ప్రసన్నులు+అయ్యెడున్ | = | అనుగ్రహము చూపుదురుగాక! |

**తాత్పర్యము :**

దేవలోకంలో, మానవలోకంలో తిరుగుతూ గొప్ప పౌరుషముతో గౌరవింపబడేవారూ, మిక్కిలి విషంతో కూడిన అధిక కోపం అనే భగభగలాడే అగ్నిజ్వాలలచే తపింపజేయబడిన సర్వశత్రువులు కలవారును అయినట్టి, ఐరావతజాతికి చెందిన భయంకర సర్పరాజులు మాపై అనుగ్రహము చూపుగాక!

**సంధులు :**

| | | |
|---|---|---|
| విష+ఉత్కట | = | గుణసంధి |
| తాపిత+అఖిల | = | సవర్ణదీర్ఘసంధి |

**సమాసములు :**

| | | |
|---|---|---|
| దేవమనుష్యలోకములు | = | దేవలోకము, మనుష్యలోకమును<br>ద్వంద్వ సమాసము |
| ఫణిరాజులు | = | ఫణులకు రాజులు<br>షష్ఠీ తత్పురుషము |
| శక్తిశౌర్యులు | = | శక్తి శౌర్యముగలవారు<br>బహువ్రీహి సమాసము |

**ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| దేవమ | నుష్యలో | కముల | ద్రిమ్మరు | మన్విపు | లప్రతా | పసం |
| భ | ర | న | భ | భ | ర | వ |

ఇది ఉత్పలమాల. ఇందు భ ర న భ భ ర వ అను గణములు వచ్చును. 10వ అక్షరము యతి. దే - త్రి

**కవితా విశేషములు :**

నన్నయ ఉదంకోపాఖ్యానములో సర్పరాజులను ప్రస్తుతించే నాలుగు పద్యములలో నిది ఒకటి. ఐరావతం అనేది ఒక సర్పజాతి పేరు. ఈ సర్పరాజులు సర్గలోకంలో భూలోకంలో సంచరిస్తూ గొప్ప ప్రతాపం చూపుతారు. విషము చిమ్మి శత్రువులను నాశనము చేయగలరు. వారి భయంకరతను కవి 'అపార విషోత్కట' అనే సమాసంలో చక్కగా ప్రదర్శించాడు.

108. గోత్రమహామహాధర నికుంజములన్ విపినంబులం గురు
క్షేత్రమునం బ్రకామగతి ఖేలన నొప్పి సహాశ్వసేనుడై
ధాత్రి బరిభ్రమించు బలదర్ప పరాక్రమ దక్షు దీక్షణ
శ్రోత్రవిభుండు తక్షకుడు శూరుడు మాకు బ్రసన్నుడయ్యెడున్

**కవి పరిచయము :**

ఈ పద్యము ఉదంకోపాఖ్యానము అను పాఠ్యభాగములోనిది. మహాభారతములోని ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఇది గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. నన్నయ 11వ శతాబ్దివాడు. ఆదికవి, శబ్దశాసనుడు (వాగనుశాసనుడు) ఆయన బిరుదములు.

**సందర్భము :**

ఉదంకుడు ఆచమనము చేయుటకై సరస్సులో దిగివచ్చుసరికి, అతడు గట్టున పెట్టియున్న మణికుండలములను తక్షకుడు అపహరించి పారిపోయెను. ఉదంకుడు వానిని వెంబడించి, పుట్ట తొర్రలో నుండి నాగలోకమునకేగి, అచట సర్పరాజైన తక్షకుని స్తుతించు సందర్భము లోనిది ఈ పద్యము.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| గోత్రమహామహీధర | = | సప్తకుల పర్వతాల |
| నికుంజములన్ | = | పొదరిండ్లలో |
| విపినంబులన్ | = | అడవులలో |
| కురుక్షేత్రమునన్ | = | కురుక్షేత్రంలో |
| ప్రకామగతిఖేలనన్ | = | స్వేచ్ఛాగమనంతో |
| ఒప్పి | = | ప్రకాశించి |
| సహాశ్వసేనుడై | = | అశ్వసేనుడనే కుమారునితో కూడిన వాడై |
| ధాత్రిన్ | = | భూమియందు |
| పరిభ్రమించు | = | తిరుగునట్టి |
| బలధర్మ పరాక్రమదక్షుడు | = | బలగర్వ పరాక్రమాలతో ప్రసిద్ధుడు |
| ఈ క్షణశ్రోత్రవిభుండు | = | పాముల నాయకుడు |
| శూరుడు | = | శూరత్వము గలవాడు అయిన |
| తక్షకుడు | = | కుండలములు కాజేసిన తక్షకుడు |
| మాకు ప్రసన్నుడయ్యెడున్ | = | మాపై దయజూపుగాక! |

**తాత్పర్యము :**

ఏడు కులపర్వతాల పొదరిండ్లలో, అడవుల్లో, కురుక్షేత్రంలో, స్వేచ్ఛగా తిరుగుతూ, అశ్వసేనుడనే కుమారునితో కలిసి భూమిపై సంచరించే మహాబలశాలియైన సర్పరాజు తక్షకుడు మమ్ము దయజూచుగాక!

**సంధులు :**

| | | |
|---|---|---|
| సహ+అశ్వసేనుడు | = | సవర్ణదీర్ఘసంధి |
| ధాత్రిన్+పరిభ్రమించు | = | సరళాదేశసంధి |

**సమాసములు :**

| | | |
|---|---|---|
| మహాధరనికుంజములు | = | మహాధరమును, నికుంజమును<br>ద్వంద్వ సమాసము |
| పరాక్రమదక్షుడు | = | పరాక్రమమునందు దక్షుడు<br>సప్తమీ తత్పురుషము |

**ఛందస్సు :**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| UII | UIU | III | UII | UII | UIU | IU |
| శ్రోత్రవి | భుండుత | క్షకుడు | శూరుడు | మాకుప్ర | సన్నుడ | య్యెడున్ |
| భ | ర | న | భ | భ | ర | వ |

ఇది ఉత్పలమాల. ఇందు భ ర న భ భ ర వ అను గణములు వచ్చును. 10వ అక్షరము యతి. శ్రో - శూ

**కవితా విశేషములు :**

మహేంద్రం, మలయం, సహ్యం, శుక్తిమంతం, గంధమాదనం, వింధ్యం, పారియాత్రం అనేవి కులపర్వతములు. ఈ పద్యంలో దక్ష, ఈక్షణ, శ్రోత్ర, తక్షక అనే పదాల ప్రయోగం నన్నయ అక్షర రమ్యతకు దర్పణం పట్టుతున్నవి.

109. సితాసిత తంతు సంతాన పటంబు = తెల్లని నల్లని దారాలుగల వస్త్రాన్ని
అనువయించుచున్న = నేయుచున్న
ద్వాదశార చక్రంబున్ = పన్నెడు రేకులు గల చక్రాన్ని
పరివర్తించుచున్న = తిప్పుతున్న

తాత్పర్యము : ఇట్లు నాగపతులను స్తుతించి, అచ్చట తెల్లని నల్లని దారాలుగల వస్త్రాన్ని నేస్తున్న ఇద్దరు స్త్రీలను, పన్నెండు రేకులు గల చక్రాన్ని తిప్పుతున్న ఆరుగురు కుమారులను, మిక్కిలి పెద్దదైన గుర్రంపై ఎక్కిన గొప్ప తేజస్సు గల దివ్య పురుషుణ్ణి చూచి, విశేష అర్థాలలో కూడిన మంత్రాలను చదువుతూ ఉదంకుడు ప్రార్థన చేయగా, ఆ దివ్యపురుషుడు ఉదంకునితో ఇలా అన్నాడు.

110. మితవచన = తక్కువగా మాట్లాడేవాడా
అతిప్రీత మానసుడు = మిక్కిలి సంతోషించిన మనస్సు గలవాడు
అనిందిత చరిత = కళంకం లేని చరిత్ర గలవాడా
అభివాంఛితం = కోరిక

తాత్పర్యము : ఓ ఉత్తమ చరితా, నీ స్తోత్రాలకు చాల సంతోషించాను. నీ కోరిక ఏమిటో చెప్పు. దానిని చేస్తాను.

111. అశ్వకర్ణ రంధ్ర ధ్మానంబు = గుఱ్ఱపు చెవిలో ఊదుట
వల్లె = సరే

తాత్పర్యము : ఉదంకుడు మిక్కిలి సంతోషించి, 'ఈ నాగకులం అంతా నాకు వశం అయేట్లుగా దయచేయుడు' అన్నాడు. అప్పుడా మహనీయుడు 'అయితే ఈ గుఱ్ఱం చెవి లోపుల ఊదు' అన్నాడు. సరే అని ఉదంకుడు ఆ గుఱ్ఱం చెవిలో ఊదాడు. ఆ క్షణంలోనే

112. పాతాళైక నికేతనాంతరమునంబర్వెం దదశ్వాఖిల
స్రోతో మార్గ వినిర్గతోగ్ర దహనార్చుల్ పన్నగవ్రాతముల్
భీతిల్లెన్ భుజగాధినాధుమనమున్ భేదిల్లె గల్పాంతసం
జాత ప్రోద్ధత బాడబానల శిఖా శంకాధి కాతంకమై

**కవి పరిచయము :**

ఈ పద్యము ఉదంకోపాఖ్యానము అను పాఠ్యభాగములోనిది. మహాభారతములోని ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఇది గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. నన్నయ 11వ శతాబ్దివాడు. ఆదికవి, శబ్దశాసనుడు (వాగనుశాసనుడు) ఆయన బిరుదములు.

**సందర్భము :**

నాగలోకంలో ఉదంకుడు నలుపు తెలుపు దారాలతో వస్త్రాన్ని నేసే ఇద్దరు స్త్రీలను, పన్నెండు రేకులు గల చక్రాన్ని తిప్పుతున్న ఆరుగురు కుమారులను, ఎత్తయిన గుర్రంపై ఎక్కిన తేజస్వియైన దివ్యపురుషుణ్ణి చూశాడు. ఉదంకుని ప్రార్థనలకు సంతసించిన దివ్యపురుషుడు కోరిక ఏమిటో అడుగమనగా ఉదంకుడు నాగలోకం తనకు వశం అయ్యేట్లు వరం కోరాడు. ఆ దివ్య పురుషుడు తానెక్కిన గుఱ్ఱం చెవిలో ఊదుమని చెప్పగా ఉదంకుడట్లే చేసెను. ఆ గుఱ్ఱం యొక్క అన్ని అవయవముల నుండి పుట్టిన పెనుమంటలను వర్ణించు సందర్భం లోనిది.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| కల్పాంత | = | ప్రళయకాలంలో |
| సంజాత | = | పుట్టి |
| ప్రోర్థత | = | పైకెగసిన |
| బాడబానల | = | బడబానల |
| శిఖా | = | జ్వాలలేమో |
| శంక | = | అన్నంతగా |
| అధికాతంకమై | = | మిక్కిలి భయం పుట్టిస్తూ |
| పాతాళ+ఏక+నికేతన | = | పాతాళ లోకమనే భవనం |
| అంతరమునన్ | = | అంతటిలోనూ |
| తత్+అశ్వా | = | ఆ గుఱ్ఱం యొక్క |
| అఖిలస్రోతో మార్గ | = | సర్వేంద్రియ మార్గాలనుండి |
| వినిర్గత | = | బయల్వెడలిన |
| ఉగ్రదహన+అర్చుల్ | = | భయంకరమైన అగ్నిజ్వాలలు |
| పర్వెన్ | = | వ్యాపించెను |
| పన్నగ వ్రాతముల్ | = | సర్ప సమూహములు |
| భుజగ+అధినాధుమనమున్ | = | నాగరాజు మనస్సు |
| భేదిల్లెన్ | = | బ్రద్దలయ్యెను |

**తాత్పర్యము :**

ప్రళయకాలంలో సముద్రం నుండి లేచిన అగ్ని జ్వాలలేమో అనేంతగా, భయంకరంగా పాతాళం అంతటా ఆ గుఱ్ఱపు అవయవము లన్నింటినుండి పుట్టిన పెనుమంటలు వ్యాపించినవి. పాములన్నీ గజగజలాడినాయి. నాగరాజు గుండె పగిలిపోయింది.

**సంధులు :**

| | | |
|---|---|---|
| పాతాళ+ఏక | = | వృద్ధిసంధి |
| అశ్వ+అఖిల | = | సవర్ణదీర్ఘసంధి |
| వినిర్గత+ఉగ్ర | = | గుణసంధి |
| భుజగ+అధినాధం | = | సవర్ణదీర్ఘసంధి |
| కల్ప+అంత | = | సవర్ణదీర్ఘసంధి |
| శంక+అదిక+అంతక | = | సవర్ణదీర్ఘసంధి |

**సమాసములు :**

| | | |
|---|---|---|
| కల్పాంత | = | కల్పము యొక్క అంత<br>షష్ఠీ తత్పురుషము |
| బాడబానలశిఖ | = | బడబానలము యొక్క శిఖ<br>షష్ఠీ తత్పురుషము |
| భుజగాధినాధుడు | = | భుజగములకు అధినాధుడు<br>షష్ఠీ తత్పురుషము |
| పాతాళైక నికేతన | = | పాతాళమనెడి భవనము<br>రూపక సమాసము |

**ఛందస్సు :**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| UUU | IIU | IUI | IIU | UUI | IUI | U | |
| పాతాళై | కనికే | తనాంత | రమునం | బర్వెంద | దశ్వాఖ | ల | (ప్రో) |
| మ | స | జ | స | త | త | గ | |

ఇది శార్దూలము. ఇందు మ స జ స త త గ అను గణములు వచ్చును. 10వ అక్షరము యతి. పా - ప

**కవితా విశేషములు :**

ఇది ఒక భయంకరమైన దృశ్యం. దీనికి కవి శార్దూల వృత్తాన్ని ప్రయోగించాడు. ఇందులో ఉన్నది భయానక రసం. మార్గ, వినిర్గత, అర్చి అనే శబ్దాలలో ద్విత్వాక్షరాలతో, భ కార ధ కార ఖ కారలతో అది బాగా వ్యక్తం అయింది. సమాసయుక్తమైన ఓజోగుణం మిక్కిలి రసపోషణకు ఉపయుక్తంగా ఉంది. గుల్జంలో నుండి వెలువడిన అగ్ని జ్వాలలు బడబాగ్ని జ్వాలలుగా ఊహించడం చేత ఉత్ప్రేక్షాలంకారం ఉంది.

| | | | |
|---|---|---|---|
| 113. | శంకర నిభుడు | = | శివుని వంటివాడు |
| | జీత+అతంకుడు | = | భయపడినవాడు |

తాత్పర్యము : శివుని మూడవ కన్ను యొక్క అగ్నివంటిది బ్రాహ్మణుని కోపాగ్ని అనుకుంటూ తక్షకుడు భయంతో, తాను దొంగిలించిన కుండలాలను ఉదంకునికి తెచ్చి ఇచ్చాడు.

| | | | |
|---|---|---|---|
| 114. | క్షోభము | = | అలజడి |
| | ఆత్మగతంబునన్ | = | తనలో |

తాత్పర్యము : ఈ విధంగా నాగకులాన్ని అలజడికి గురిచేసి, తక్షకుడి వలన కుండలాలను తిరిగి పొంది, ఉదంకుడు మనసులో ఇలా అనుకున్నాడు.

| | | | |
|---|---|---|---|
| 115. | నాల్గవ నాటికి | = | నాల్గో రోజుకి |
| | పనిచె | = | పంపెను |
| | నేడ | = | నేడే |
| | తోడ్గ | = | ధరించు |
| | దివసము | = | దినము |
| | అతిక్రమింపకుండంగ బోక | = | దాటి పోకుండ |
| | ఎట్లు ఒనగూడు | = | ఎలా జరుగుతుంది |
| | ఏ పాట | = | ఏ విధముగ |
| | హయంబు | = | గుఱ్ఱము |
| | గాడ్పు | = | గాలి |

తాత్పర్యము : కుండలాలు వేగంగా తీసికొని నాల్గవ నాటికి రమ్మని గురుపత్ని చెప్పింది. ఈ కుండలాలు ఆమె ధరించే రోజు ఇవాళే. ఈ రోజు దాటకుండా పోవడం ఎలా? ఈ నాగలోక భవనాన్ని ఏ విధంగా దాటి బయటపడాలి. ఇవాళ పోకపోతే ఈ గొప్ప ప్రయత్నమంతా వ్యర్థం అవుతుంది అని మిక్కిలి దిగులుపడి ఉండగా, అతని అభిప్రాయం గ్రహించిన దివ్యపురుషుడు ఇలా అన్నాడు. 'ఈ గుఱ్ఱం ఎక్కి వెళ్ళు. ఇది మనసు కంటె, గాలి కంటె వేగంగా పోతుంది'.

| | | | |
|---|---|---|---|
| 116. | స్నాన | = | స్నానము చేసినది |
| | పరిధాన | = | వస్త్రము |
| | ఆనీత | = | తీసుకు రాబడిన |

తాత్పర్యము : ఆ దివ్యపురుషుని మాట విని, ఆ గుఱ్ఱం మీద ఎక్కి, ఆ క్షణమే ఉదంకుడు గురువుగారి యింటికి వచ్చాడు. ఇక్కడ గురుపత్ని శుభ్రంగా స్నానం చేసి, నూతన వస్త్రాన్ని ధరించి, ఆ కుండలాలు ధరించాలనే కోరికతో ఉదంకుని కోసం ఎదురు చూస్తుండగా, అతడు రావడం చూసి మిక్కిలి సంతోషించి, అతడు తెచ్చిన రత్న కుండలాలచే అలంకరింపబడి, బ్రాహ్మణులను పూజించి, తాను సంకల్పించిన వ్రతం పూర్తి చేసింది. ఇట్లు గురువు గారి కార్యాన్ని పూర్తి చేసిన ఉదంకుని చూచి గురువు ఇలా అన్నాడు.

| | | | |
|---|---|---|---|
| 117. | అతి+ఆయత+మలతపోమహిమ | = | నిర్మలము, విస్తారమూ అయిన తపోమహిమ గలవాడా! |
| | ఈ+ఉన్న | = | ఇంత దగ్గరగా ఉన్న |
| | ప్రోలు | = | పట్టణము |
| | మసలితి | = | ఆలస్యం చేశావు |

తాత్పర్యము : గొప్ప తపోమహిమ గలవాడా! ఇంత దగ్గరగా ఉన్న పౌష్యుని ఊరికి పోయి, చాల దూరం పోయినట్లుగా ఇన్ని రోజులు ఆలస్యం ఎందుకు చేసావో చెప్పుమా!

118. మసలన్+వలవదు = ఆలస్యము చేయనక్కర లేదు
అపహృత కుండలుండును+ఐ = కుండలములు పోగొట్టుకొన్నవాడనై
ఆదేశంబునన్ = ఆజ్ఞచేత

తాత్పర్యము : అనగా ఉదంకుడు ఇలా అన్నాడు 'అయ్యా, మీ ఆజ్ఞ ప్రకారం ఆలస్యం జరగదు. కాని తక్షకుడనే దుష్టసర్పం అడ్డంకి కల్పించడం వలన ఇంత ఆలస్యం అయింది. మిమ్మల్ని వీడిపోతూ వుంటే, ఎదురుగా ఒక గొప్ప ఎద్దునెక్కి వస్తున్న మహా తేజస్వి అయిన దివ్యపురుషుణ్ణి చూసాను. ఆయన చెప్పిన విధంగా గోమయాన్ని తిన్నాను. ఆ తరువాత వెళ్ళి పౌష్యుని దేవి కుండలాలు స్వీకరించాను. వచ్చేటప్పుడు తక్షకుడు వాటిని దొంగిలించాడు. వాని వెంటబడి పాతాళ లోకానికి పోయి, నాగరాజులను ప్రార్థించి, అక్కడ తెల్లని నల్లని వస్త్రాలు నేస్తున్న ఇద్దరు స్త్రీలను, చక్రం తిప్పుతున్న ఆరుగురు కుమారులను, ఎత్తైన గుఱ్ఱం మీద ఎక్కిన దివ్యపురుషుణ్ణి చూశాను. అతని దయతో కుండలాలు పొంది, అతని ఆదేశంతో ఆ గుఱ్ఱం ఎక్కి వచ్చాను. ఇదంతా ఏమిటి? వీటి వెనుక వుండే రహస్య విషయం ఏమిటో నాకు వివరించండి' అని అడుగగా గురువు పైల మహాముని ఇలా అన్నారు.

119. సత్+ముని+ఇంద్ర = ఉత్తముడైన ముని
పొలతులు = స్త్రీలు
అమృత+అశివి = అమృతము భుజించేవాడివి
అభిమత+అర్థసిద్ధి = కోరిన కోరిక నెరవేరుట

తాత్పర్యము : ఓ మునిశ్రేష్ఠా! నీకు మొదట కనబడినవాడు ఇంద్రుడు. ఆ ఎద్దు ఐరావతం. దాని పేరు అమృతం. నాగలోకంలో కనబడిన స్త్రీలు ఇద్దరూ ధాత, విధాత. వీరు తెల్లని, నల్లని దారాలతో నేస్తున్న మగ్గం పగలు, రాత్రి. పన్నెండు రేకులు గల చక్రం సంవత్సరం. దాన్ని తిప్పే ఆరుగురు కుమారులు ఋతువులు. ఆ గుఱ్ఱం ఇంద్రుని మిత్రుడు మేఘుడు. ఇంద్రుణ్ణి చూచి, అమృతం తినడం వల్ల నీ కోరిక నెరవేరింది.

## 1.5 సందర్భ సహిత వ్యాఖ్యలు

1. ఇమ్ము నా పూన్కి యిది సఫలమ్ముగాగ
2. అశుచులకు గాన గాదనవద్యా
3. సురక్షితముగ జేసి చనుము రవినిభతేజా
4. ఓ పండతి శాంతుడయ్య నరపాలుడు శాపము గ్రమ్మరింపగన్
5. అనంతుడు మాకు ప్రసన్నుడయ్యెడున్
6. వాసుకి మాకు ప్రసన్నుడయ్యెడున్
7. ఘోరఫణి రాజులు మాకు ప్రసన్నుడయ్యెడున్
8. శూరుడు మాకు ప్రసన్నుడయ్యెడున్
9. దాని చెపుమా చేయుదుననిన్
10. వడి గలదు మనము కంటె గాడ్పు కంటె
11. ఇన్ని దినంబులేల మసలితి చెపుమా
12. నీ కభిమతార్థ సిద్ధి యయ్యెనయ్యా

**1. ఇమ్ము నా పూన్కి యిది సఫలమ్ముగాగ**

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

ఉదంకుడు పౌష్యమహారాజు కడకు కుండలములు నర్థించి వెళ్ళాడు. గురుపత్ని కోరిక మేరకు వచ్చిన ఉదంకుడు పౌష్య మహారాజుని మహారాణి యొక్క కుండలమ్ముల నిమ్మని అడుగు సందర్భము.

**అర్థం**

నీ భార్య కుండలముల నిచ్చి నా ప్రయత్నము సఫలమగునట్లు చేయుము.

**వ్యాఖ్య**

ఉదంకుడు తాను వచ్చిన కార్యాన్ని వినయపూర్వకంగా పౌష్య మహారాజుకు నివేదించి తనది గురువు గారికి సంబంధించిన పని అయినప్పటికీ తన పనిగానే భావించి, తన కోరికను సఫలం చేయుమని ప్రార్థించాడు.

**2. అశుచులకు గానగాదనవద్యా**

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

ఉదంకుడు పౌష్యుని కడకేగి అతని దేవి కుండలముల కొరకు ప్రార్థించగా, తన ధర్మపత్ని నడిగి తీసుకొనుమని పౌష్యుడు పలికాడు. ఉదంకుడు అంతఃపురానికి పోగా అక్కడ ఆ దేవి కనబడలేదు. ఉదంకుడు తిరిగి వచ్చి ఈ సంగతి చెప్పగా, పౌష్యుడు తన దేవి పతివ్రత గాన అశుచులకు కలబడదని చెప్పు సందర్భము.

**అర్థం**

అశుభ్రముగా ఉన్నవారికి ఆమె కానరాదు.

**వ్యాఖ్య**

ఉదంకుడు దివ్యపురుషుని ఆదేశము చొప్పున గోమయమును భక్షించెను. అందువల్ల అశుచుడయ్యాడు. కనుక పతివ్రతయైన పౌష్యుని దేవి కనబడలేదు.

**3. సురక్షితముగ జేసి చనుము రవినిభతేజా**

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి

ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

తాను అశుచియై ఉండుట వలన పౌష్యుని దేవి కనబడలేదని తెలిసికొని ఉదంకుడు మంచినీటితో చేతులు, కాళ్ళు, మొగము కడిగికొని, అచమించి, ఆ దేవి దగ్గరకు పోగా, ఆమె ఉదంకునకు కుండలములనిచ్చినది. "తక్షకుడు ఈ కుండలాలను ఆపేక్షిస్తూ ఉంటాడు. వాడు మాయావి. జాగ్రత్త సుమా" అని ఆమె చెప్పు సందర్భము.

**అర్థం**

సూర్యునితో సమానమైన తేజస్సు గలవాడా! మాయావి యైన తక్షకుని విషయంలో జాగ్రత్త వహించి తిరిగివెళ్ళుము.

**వ్యాఖ్య**

పౌష్యుని భార్య చెప్పిన విధముగానే తక్షకుడు టక్కరితనముతో ఆ కుండలములను కాజేసెను. ముందుగానే ఆమె హెచ్చరిక చేసినది. ఆమె మహాపతివ్రత యగుటకు ఇదే నిదర్శనము.

**4. ఓ పండతి శాంతుడయ్యు నరపాలుడు శాపము గ్రమ్మరింపగన్**

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

అన్నము కేశదుష్టమగుటచే కోపించి ఉదంకుడు పౌష్యుని అంధుడవు కమ్మని శపించెను. పౌష్యుడు ఉదంకునికి సంతానము లేకుండుగాక అని ప్రతి శాపమిచ్చెను. శాపము త్రిప్పివేయుమని ఉదంకుడు పౌష్యుని ప్రార్థింపగా పౌష్యుడు సమాధానమిచ్చు సందర్భము.

**అర్థం**

రాజు ఎంత శాంత స్వభావుడయ్యును శాపమును వెనుకకు త్రిప్పలేడు.

**వ్యాఖ్య**

బ్రాహ్మణులకు, రాజులకు ఉన్న భేదమును ఈ సందర్భమున నన్నయ అతిమనోహరముగ చెప్పెను. బ్రాహ్మణుల మనసు వెన్న. మాట కఠినము. రాజుల మనసు ఇందుకు పూర్తిగా తారుమారు కావున వారి మనసు కఠినము. వారి మనసు మారదు.

**5. అనంతుడు మాకు బ్రసన్నుడయ్యెడున్**

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

తక్షకుడు ఉదంకుడు చెరువు గట్టున పెట్టిన కుండలములను హరించుకొనిపోగా, ఉదంకుడు వాని వెంటపడెను. అతడు భూరంధ్రము గుండా పాతాళమున కేగగా, ఉదంకుడు నాగలోకమున కేగెను. అచ్చట ఉదంకుడు నాగపతులను స్తుతించు సందర్భము.

**అర్థం**

ఆదిశేషుడు మమ్ము అనుగ్రహించుగాక.

**వ్యాఖ్య**

ఈ సందర్భమున నన్నయ రచించిన 'బహువన పాదపాబ్ది' అను మనోహర పద్యము లోనిది ఈ వాక్యము. అక్షర రమ్యతకు ఈ పద్యము చక్కని ఉదాహరణ. అట్టి గొప్ప విష్ణుమూర్తికి శయ్యగా నున్నవాడు, పాపములను పోగొట్టువాడైన ఆదిశేషుడు మాకు ప్రసన్నుడు కావాలని ఉదంకుడు ప్రార్థించాడు. 'మాకు' అని బహువచనం వాడడం విశేషం. తన గురు కులమునకు అని ఉదంకుని భావన.

**6. వాసుకి మాకు ప్రసన్నుడయ్యెడన్**

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

తక్షకుడు ఉదంకుడు చెరువు గట్టున పెట్టిన కుండలములను హరించుకొనిపోగా, ఉదంకుడు వాని వెంటపడెను. అతడు భూరంధ్రము గుండా పాతాళమున కేగగా, ఉదంకుడు నాగలోకమున కేగెను. అచ్చట ఉదంకుడు నాగపతులను స్తుతించు సందర్భము.

**అర్థం**

వాసుకి అనే పేరుగల నాగరాజు మమ్ము అనుగ్రహించుగాక.

**వ్యాఖ్య**

ఇది వాసుకిని గూర్చిన ప్రార్థన. వరసగా నాగరాజులను ప్రార్థన చేయుచు ఉదంకుడు రెండవ స్థానమున వాసుకిని ప్రార్థించెను. శివునకు భూషణముగుటచే సురాసురులందరు వాసుకి పాదములను పూజింతురు. పరమేశ్వరునికి భూషణమయిన అట్టి వాసుకి మాకు ప్రసన్నుడు కావలెనని ఉదంకుడు ప్రార్థించెను.

**7. ఘోర ఫణి రాజులు మాకు ప్రసన్నులయ్యెడున్**

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

తక్షకుడు ఉదంకుడు చెరువు గట్టున పెట్టిన కుండలములను హరించుకొనిపోగా, ఉదంకుడు వాని వెంటపడెను. అతడు భూరంధ్రము గుండా పాతాళమున కేగగా, ఉదంకుడు నాగలోకమున కేగెను. అచ్చట ఉదంకుడు నాగపతులను స్తుతించు సందర్భము.

**అర్థం**

భయంకరమైన సర్పరాజులు మమ్ము అనుగ్రహింతురుగాక.

**వ్యాఖ్య**

ఉదంకుడు నాగరాజులను ప్రార్థించుచు ఐరావతి అనే జాతికి చెందిన సర్పరాజులను ప్రార్థించెను. మిగతా నాగరాజులను వ్యక్తిగతముగా ప్రార్థించిన ఉదంకుడు ఇచ్చట మాత్రము ఐరావతి నాగముల సమూహమును మొత్తముగా ప్రార్థించెను.

**8. శూరుడు మాకు ప్రసన్నుడయ్యెడున్**

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

తక్షకుడు ఉదంకుడు చెరువు గట్టున పెట్టిన కుండలములను హరించుకొనిపోగా, ఉదంకుడు వాని వెంటపడెను. అతడు భూరంధ్రము గుండా పాతాళమున కేగగా, ఉదంకుడు నాగలోకమున కేగెను. అచ్చట ఉదంకుడు నాగపతులను స్తుతించు సందర్భము.

**అర్థం**

వీరుడైన తక్షకుడు మాపై అనుగ్రహము చూపుగాక.

**వ్యాఖ్య**

చివరగా ఉదంకుడు తనకెంతో అపకారము చేసిన, కుండలముల నపహరించిన తక్షకుని స్తుతించాడు. "పరాక్రమ దక్షుడు ఈ క్షణ శ్రోత్ర విభుండు తక్షకుడు" ప్రసన్నుడు కావాలని ఉదంకుడు ప్రార్థించాడు. ఇది ఉదంకుని మహోన్నత వ్యక్తిత్వానికి ప్రతీక.

**9. దాని చెపుమా చేయుదుననిన్**

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

ఉదంకుడు నాగకులాన్ని స్తుతించాడు. అంతలో వస్త్రం నేస్తున్న ఇద్దరు స్త్రీలు, చక్రం తిప్పుతున్న ఆరుగురు కుమారులు ఎత్తైన గుర్రం మీద కూర్చున్న దివ్యపురుషుడు కనబడ్డారు. ఉదంకుడు ఆ దివ్య పురుషుని స్తుతింపగా అతడు ప్రసన్నుడై నీ కోరిక ఏదో తెలుపుము తీర్చెదనని చెప్పు సందర్భము.

**అర్థం**

నీ యిష్టమేదో దానిని చెప్పుమా! ఆ విధముగా నొనరించెదను.

**వ్యాఖ్య**

నాగరాజులను స్తుతించినా వారు ప్రసన్నులు కాలేదు. కానీ ఆ దివ్యపురుషుడు "విపులార్థవంతములైన మంత్రంబుల నతి భక్తి యుక్తుండై" స్తుతించగా వెంటనే ప్రసన్నుడయ్యాడు.

## 10. వడిగలదు మనముకంటె గాడ్పుకంటె

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

ఉదంకుడు ఎంతో ప్రయత్నం గావించి పౌష్య మహాదేవి కుండలాలను సంపాదించి, తిరిగి వాటిని తక్షకుని నుండి గైకొని, గురుపత్నికి సమర్పించే సమయం ఆసన్నమైనపుడు, పాతాళలోకం నుండి సకాలంలో ఎలా చేరడమా అని బాధ నొందాడు. ఉదంకుని అభిప్రాయం తెలిసికొని, దివ్యపురుషుడు తన గుఱ్ఱాన్నిచ్చి, దానిపై వెళ్ళుమని చెప్పు సందర్భము.

**అర్థం**

ఈ గుఱ్ఱం మనసుకంటె, గాలికంటె వేగంగా వెళుతుంది.

**వ్యాఖ్య**

అన్నిటికంటే వేగం గలది మనసు. దాని తరువాత చెప్పదగింది గాలి. ఆ గుఱ్ఱం ఆ రెంటి కంటే వేగం కలది. కనుకనే ఉదంకుడు వెంటనే దానిపై వెళ్ళి గురు గృహం చేరగలిగాడు.

## 11. ఇన్ని దినంబులేల మసలితి చెపుమా

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

పౌష్యుని దేవి యొక్క కుండలములను తెచ్చిన ఉదంకుని గాంచి గురువు 'ఇంత దగ్గరలో ఉన్న పౌష్యుని వద్దకు పోయి, ఎంతో దూరం పోయినట్లుగా ఇంత ఆలస్యంగా వచ్చావేమిటి?' అని ప్రశ్నించే సందర్భము.

**అర్థం**

ఇన్ని రోజులు ఎందుకు ఆలస్యం చేసితివో చెప్పుము.

**వ్యాఖ్య**

ఆలస్యమునకు కారణం ఏమిటని గురువు ప్రశ్నించడం ఉదంకున్ని తప్పు పట్టడానికి కాదు. 'అత్యాయత విమల తపోమహిమా' అని ముందు సంభోధించాడు కనుక, తన శిష్యుడు గాంచిన అద్భుత సన్నివేశాలను వినవలెననే కుతూహలంతో ఈ ప్రశ్న వేశాడు గురువు.

**12. నీ కభిమతార్థ సిద్ధియయ్యెనయ్య**

**కవి పరిచయము**

ఈ వాక్యం ఉదంకోపాఖ్యానము అను పాఠ్య భాగములోనిది. మహాభారతము ఆదిపర్వము ప్రథమాశ్వాసము నుండి ఈ ఉపాఖ్యానము గ్రహింపబడినది. కవి నన్నయ భట్టారకుడు. కాలము 11వ శతాబ్దము. బిరుదములు ఆదికవి, వాగనుశాసనుడు.

**సందర్భము**

శిష్యుడైన ఉదంకుడు ఆలస్యంగా ఎందుకు వచ్చాడో సొంతం విన్న పైలుడు అనేక రహస్యాలను విప్పి చెప్పి, అతణ్ణి దీవిస్తూ ఈ విధంగా పలికాడు.

**అర్థం**

నీ కోరిక నెరవేరును.

**వ్యాఖ్య**

'ఉత్తమమునీ' అని గురువు శిష్యున్ని సంబోధించాడు. నీకు మొదట కనబడినవాడు ఇంద్రుడు. ఆ ఎద్దు ఐరావతము. గోమయం అమృతం. నాగలోకంలో కనబడిన స్త్రీలు ధాత, విధాత. వారు నలుపు తెలుపు దారాలతో నేసే వస్త్రం రాత్రి పగలు. పన్నెండు రేకులుగల చక్రం 12 నెలలతో కూడిన సంవత్సరం. ఆరుగురు కుమారులు తిప్పుచున్నారు. అవి ఆరు ఋతువులు. గుఱ్ఱం ఇంద్ర మిత్రుడు పర్జన్యుడు. ఇంద్రుని చూచి, అమృత భక్షణం చేయడం వల్ల నీ కోరిక తీరింది అని గురువు ఉదంకుని అనుభవాల అంతరార్థాన్ని వివరించాడు.

## 1.6 ప్రశ్నలు - సమాధానాలు

**1. ఉదంకుడు గురుదక్షిణ చెల్లించిన విధమును వివరింపుము. (లేదా)**

**ఉదంకుని వృత్తాంతమును తెలియజేయుము. (లేదా)**

**ఉదంకుడు పౌష్యమహాదేవి యొక్క కుండలములను తెచ్చి గురుపత్నికిచ్చిన విధమును విశదీకరింపుము.**

జ. ఆంధ్రమహాభారతకర్త, కవిత్రయములో మొదటివాడైన నన్నయ భట్టారకుడు తెలుగులో ఆదికవి. నన్నయ తెనిగించినది ఆది, సభా, అరణ్యపర్వ సగభాగములోని 'శారదరాత్రులు...' పద్యము వరకు, ఆదిపర్వములోని ప్రథమాశ్వాసమున 'ఉదంకోపాఖ్యానము' రసవత్తరమైన వృత్తాంతము.

**గురుపత్ని నియోగం:** ఉదంకుడు పైలుని శిష్యుడు. బ్రహ్మజ్ఞాని. గురుకులంలో గురువులకు సేవలు చేసి, అపరిమితమైన నిష్ఠాపరుడై అణిమాది అష్టసిద్ధులతో పాటు గొప్ప జ్ఞానమును పొందాడు. గురుపత్ని పంపగా పౌష్య మహాదేవి యొక్క కుండలములు తీసికొని రావడానికి ఉదంకుడు బయలుదేరాడు.

**దివ్యపురుషుని దర్శనం:** ఉదంకుడు అరణ్యంలో పోతూవుండగా ఒక గొప్ప ఎద్దుపై దివ్యపురుషుడు కనబడ్డాడు. ఆయన ఆజ్ఞ మేరకు ఉదంకుడు గోమయ భక్షణం చేసి, ఆ మహాత్ముని అనుగ్రహం పొందాడు. తరువాత వేగముగా పౌష్య మహారాజు కడకేగి, దీవించి, సత్కారం పొందాడు.

**ఉదంకుడు కుండలములు పొందుట:** ఉదంకుడు పౌష్యునితో తాను గురువు గారి పనిమీద వచ్చానని, పౌష్య మహాదేవి కుండలములు కావాలని పలికాడు. అటువంటి మహాత్మునికి ఇవ్వగలిగినందుకు సంతోషిస్తూ అతన్ని అంతఃపురానికి పంపాడు. అక్కడ ఉదంకునికి పౌష్య మహాదేవి కనబడలేదు. అతడు తిరిగి వచ్చి నీ దేవి కనబడలేదు, కాబట్టి నీవే ఆ కుండలములను తెచ్చి యిమ్మని ఉదంకుడు కోరాడు. ఆమె అశుచులకు కానరాదని పౌష్యుడు పలికాడు. తాను గోమయ భక్షణము చేసినందువల్ల, ఆ అశుచిత్వంవల్ల ఆ మహాపతివ్రత తనకు కనబడలేదని ఉదంకుడు గ్రహించాడు. వెంటనే మంచినీటితో కాళ్ళు, చేతులు, మొగము ప్రక్షాళనం చేసికొని, ఆచమించి, పౌష్యుని అనుమతితో మరల వెళ్ళగా ఆమె ఉదంకునకు నమస్కరించి కుండలములను ఇచ్చి ఇలా అన్నది 'ఓ సూర్యతేజా! తక్షకుడు ఎప్పుడూ వీటిని కోరుతూ వుంటాడు. వాడు మాయావి. కాబట్టి వీటిని జాగ్రత్తగా తీసికొనిపో.'

**శాపవృత్తాంతం:** ఉదంకుడు ఆమె వద్దనుండి కుండలాలు తీసికొని రాగా, పౌష్యుడు భోజనం చేసి పొమ్మని కోరినాడు. ఉదంకుడు అంగీకరించి భోజనానికి కూర్చున్నాడు. భోజనంలో వెంద్రుక ఉండడంతో కోపించి 'అశుద్ధాన్నం పెట్టావు కాబట్టి గ్రుడ్డివాడవగుము' అని ఉదంకుడు పౌష్యునికి శాపం ఇచ్చాడు. ఇంత చిన్న తప్పుకు శాపం ఇచ్చావు కాబట్టి నీకు సంతానం కలుగదు అని పౌష్యుడు ప్రతిశాపం ఇచ్చాడు. ఉదంకుడు శాపాన్ని గ్రమ్మరింపవలసినదిగా కోరాడు.

నిండు మనంబు నవ్యనవనీత సమానము పల్కు దారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత విప్రుల యందు నిక్కమీ
రెండును రాజులందు విపరీతము గావున విప్రుడోపునో
పండతి శాంతుడయ్యు నరపాలుడు శాపము గ్రమ్మఱింపగన్

'బ్రాహ్మణుల మనసు నవనీతము. పులుకు కఠినము. క్షత్రియుల పద్ధతి ఇందుకు పూర్తి వ్యతిరేకము. కాబట్టి బ్రాహ్మణుడు శాపాన్ని వెనక్కి తీసుకోగలడుగాని, క్షత్రియుడు అలా చేయలేడు. కాబట్టి నాకు అది అశక్యము. నువ్వు యిచ్చిన శాపాన్ని వెనక్కి తీసుకో' అని పౌష్యుడు కోరగా ఉదంకుడు అంగీకరించి శాపమోక్షం ప్రసాదించాడు.

**తక్షకుడు కుండలాలను హరించడం:** గురుపత్నికి కుండలము లీయబోతున్నానని సంతోషంతో ఉదంకుడు వెళుతూ, మధ్యలో ఒక శుచి ప్రదేశంలో పెట్టాడు. వెంటనే తక్షకుడు నగ్నవేషధరుడై వచ్చి ఆ కుండలాలను తస్కరించి పారిపోయాడు. ఉదంకుడు వాని వెంటబడి పట్టుకున్నాడు. అప్పుడు తక్షకుడు తన దిగంబర వేషం వదిలి మణికుండలాలతో సహా భూమియొక్క రంధ్రములో నుండి నాగలోకానికి వెళ్ళిపోయాడు. ఉదంకుడు కూడ అతని వెంట నాగలోకానికి పోయి నాగపతులను స్తుతించాడు.

**ఉదంకుని నాగస్తుతులు:** అరణ్యాలు, సముద్రాలు, పర్వతాలు, సరస్సులు, నదులు గల ఈ భూభారాన్ని తన వేయిపడగలపై ధరించి, చూడశక్యం గాని అద్భుత ఆకారం గల విష్ణుమూర్తికి ఎప్పుడూ శయ్యగా ఉండే సర్పరాజు అయిన ఆదిశేషుడు మమ్ము అనుగ్రహించుగాక!

అపూర్వమైన తపస్సుతో పాములకు రాక్షస భయం లేకుండా చేసినవాడూ, దేవదానవులచే పాదాభివందనం పొందినవాడూ, శివునకు అలంకారం అయినవాడూ అయిన వాసుకి మమ్ము దయతో చూచుగాక!

దేవలోకంలో, మానవలోకంలో సంచరిస్తూ, అగ్నిజ్వాలలవంటి విషంతో శత్రువుల్ని తపింపజేసేవారు అయిన ఐరావత జాతికి చెందిన భయంకర సర్పరాజులు మాపై అనుగ్రహము చూపుదురుగాక!

స్వేచ్ఛగా సంచరిస్తూ అశ్వసేనుడనే కుమారునితో గూడి భూమిపై సంచరించే మహాబలశాలియైన సర్పరాజు తక్షకుడు మమ్ము దయతో చూచుగాక!

**ఉదంకుడు చూచిన దృశ్యాలు:** ఉదంకుడు నాగలోకంలో నలుపు, తెలుపు దారాలతో వస్త్రాన్ని నేసే ఇద్దరు స్త్రీలను, పన్నెండు రేకులుగల చక్రాన్ని తిప్పుతున్న ఆరుగురు కుమారులను, ఎత్తయిన గుఱ్ఱంపై ఎక్కిన తేజస్వియైన దివ్యపురుషుణ్ణి చూశాడు. ఉదంకుడు పవిత్ర మంత్రాలతో ప్రార్థన చేయగా ఆ దివ్యపురుషుడు "నీ యదార్థ స్తుతులకు ప్రీతి చెందాను. నీ కోరిక ఏమిటో అడుగు. దానిని తీరుస్తాను" అన్నాడు.

ఉదంకుడు సంతోషించి 'ఈ నాగకులం నాకు వశం అయ్యేట్టు వరం ఇవ్వు' అనగా ఆ దివ్యపురుషుడు 'అయితే ఈ గుఱ్ఱం చెవిలో ఊదుము' అన్నాడు. అతడు చెప్పినట్టే ఉదంకుడు ఊదగా ఆ గుఱ్ఱం యొక్క అవయవాల నుండి పుట్టిన పెనుమంటలు నాగలోకంలో వ్యాపించి, పాములన్నీ భయంతో వణికిపోయాయి. నాగరాజు గుండె పగిలిపోయింది. తక్షణమే తక్షకుడు తాను తస్కరించిన కుండలాలను ఉదంకునకు ఇచ్చివేశాడు.

**ఉదంకుడు గురుపత్నికి కుండలాలు సమర్పించుట:** కుండలాలను తిరిగి సంపాదించిన ఉదంకుడు గురుపత్నికి కుండలాలను సమయం దాటకుండా అందజేయడం ఎలా అని దిగులు చెందుతుండగా, అతని అభిప్రాయం గ్రహించిన దివ్యపురుషుడు ఆ గుఱ్ఱం మీద వెళ్లవలసినదని, అది గాలికంటే మనసుకంటే వేగంగా పోతుందని పలికాడు.

ఉదంకుడు ఆ గుఱ్ఱంపై ఎక్కి, ఆ క్షణమే గురువుగారి వద్దకు చేరాడు. గురుపత్ని స్నానంచేసి, నూతన వస్త్రాలను ధరించి, ఆ కుండలాలను ధరించడానికి సిద్ధంగా వుంది. ఉదంకుడు రావడం చూసి ఆమె మిక్కిలి సంతోషించింది. అతడు తెచ్చి యిచ్చిన రత్నకుండలాలను ధరించి, బ్రాహ్మణులను పూజించి, తాను సంకల్పించిన వ్రతం పూర్తి గావించుకొన్నది.

**దేవరహస్యాలు:** నాగలోకంలో తాను చూచిన దృశ్యాలను గురువునకు వివరించి వాని అర్థమేమిటో సెలవిమ్మని కోరాడు. 'ఓ మునిశ్రేష్ఠా! నీకు మొదట కనబడినవాడు ఇంద్రుడు. ఆ ఎద్దు ఐరావతం. దాని పేడ అమృతం. నాగలోకంలో కనబడిన స్త్రీలు ఇద్దరూ ధాత, విధాత అనేవారు. వారు తెల్లని నల్లని దారాలతో నేస్తున్న మగ్గం పగలు రాత్రి. పన్నెండు రేకులు గల చక్రం సంవత్సరం. దాన్ని తిప్పే ఆరుగురు కుమారులు ఋతువులు. ఆ గుఱ్ఱం ఇంద్రుడి మిత్రుడు మేఘుడు. ఇంద్రుని చూచి, అమృతం తినడం వలన నీ ప్రయత్నం నేరవేరింది' అని పైలుడు తన శిష్యుడైన ఉదంకునికి వివరించాడు.

ఈ విధంగా ఉదంకుడు గురుపత్నికి ఆమె కోరిన కుండలాలు తెచ్చి ఇచ్చి గురుదక్షిణ చెల్లించాడు.

2. ఉదంకోపాఖ్యానమాధారంగా నన్నయ కవితా విశేషములను విశదీకరింపుడు.

జ. తెలుగులో మొదట వెలువడిన గ్రంథము మహాభారతము. దీనికి మూలము వ్యాసమహర్షి విరచితమైన సంస్కృత భారతము. పంచమ వేదమని ప్రసిద్ధి గాంచిన మహాభారతమును తెనుగున అనువదించిన కవిత్రయంలో ప్రథముడు నన్నయ భట్టారకుడు. నన్నయ తన కవితా లక్షణములను తెలియజేయు అవతారిక పద్యము మిగుల ప్రసిద్ధమైనది.

సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకవితార్థ యుక్తిలో
నారసి మేలునా నితరులక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్

ఈ పద్యమునందు నన్నయ తనవిగా చెప్పుకున్న కవితా లక్షణములు మూడు, మొదటిది ప్రసన్నకథా కవితార్థయుక్తి. రెండవది అక్షరరమ్యత. మూడవది నానారుచిరార్థ సూక్తి నిధిత్వము. ఇవి ప్రస్తుత పాఠ్యభాగమగు ఉదంకోపాఖ్యానములో నెట్లు ప్రతిబింబించునో చూతము.

**ప్రసన్న కథాకవితార్థ యుక్తి:** ప్రసన్నకథా కవితార్థ యుక్తి నన్నయ కవితా గుణములలో మొదటిది. అనగా కథా నిర్మాణ చాతుర్యము. నన్నయ కథా రచనమునందు మిగుల నేర్పరి. రచన ప్రసన్నమగు కథతోడను, అర్థయుక్తి తోడను నిండియుండును. అనగా కథా విధానము కనులకు కట్టినట్లు కూర్చుట. ఈ విధానము నందు మనోహర వర్ణనము, పాత్రల గుణశీల చిత్రవర్ణనము, సంభాషణ చాతుర్యము, సమయోచిత అలంకారప్రయోగము నన్నయ రచనలో విశేషముగా కన్పట్టును.

ఉదంకుడు పౌష్యుని శపించినాడు. పౌష్యుడు మరల శపించినాడు. శాపమును మరలించుటకు పౌష్యుడు తాను సమర్థుడను కాదన్నాడు.

నిండు మనంబు నవ్యనవనీత సమానము పల్కు దారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత విప్రుల యందు నిక్కమీ
రెండును రాజులందు విపరీతము గావున విప్రుడోపునో
పండతి శాంతుడయ్యు నరపాలుడు శాపము గ్రమ్మఱింపగన్

మూలములో హృదయమని ఉండగా తెలుగులో నిండుమనంబు అని ఉన్నది. మూలములో బ్రాహ్మణ శబ్దముండగా తాను విప్ర శబ్దమును వాడినాడు. మూలమున బ్రాహ్మణవాక్కు క్షురము (కత్తి) అని వుండగా నన్నయ 'అఖండలశస్త్రతుల్యము'. ఇంద్రుని వజ్రాయుధము వంటిదట. పైగా క్షత్రియ శబ్దమునకు బదులు 'రాజు' శబ్దము ప్రయోగించినాడు. 'నరపాలుడు' అనినాడు.

విప్రుడెల్లప్పుడు వేదమును పఠించును. వేదము కఠినమైనది. దానిని పఠించు విప్రుని వాక్కూ కఠినమైనదే. కాని వాని మనసు అప్పుడే తీసిన వెన్నవంటిది. వెన్న ఎంత మెత్తడిదో వజ్రాయుధమంత కఠినమైనది. క్షత్రియ శబ్దము కులవాచకము. క్షత్రియులందరూ రాజులుకారు. రాజు, నరపాలుడు అనగా నేలనేలు, నరులను పాలించు అన్న అర్థము స్పష్టముగా ఉన్నది. ఇట్లు నన్నయ కథాకథనంలో, పదప్రయోగంలో ప్రత్యేకతను చూపి కథకు పటిష్టతను చేకూర్చినాడు.

**అక్షరరమ్యత:** నన్నయ కవితా గుణములలో రెండవది అక్షరరమ్యత. చెవులకు యింపు గొలుపు పదముల కవిత్వము. అర్థపుష్టి

భావసౌందర్యము దీనికి భూమికలు, చెవుల కింపుసొంపుల నొనగూర్చు అక్షరముల పొందికతో శోభించును. అక్షర రమ్యత అనగా శబ్ద స్వారస్యమనియే చెప్పుకొనవలెను. దీని వలన నన్నయ పద్యరచనలో ఒకానొక నాదసౌందర్యమును సాధించినాడు. ప్రసన్నకథా కవితార్థయుక్తిని సారమతితో కవీంద్రులు ఆనందింతురనియు, ఇతరులు అనగా సామాన్యులు అక్షరరమ్యతను మెచ్చుకొందురని తెలిపినాడు కదా! తెలుగు సహజముగా మధురమైన భాష. తన అక్షరరమ్యత చేత మరింత మాధురీభరితమొనర్చినాడు నన్నయ.

పంకజ భవ సన్నిబాడఘు
పంకక్షాళన మహా తపస్సలిలుడనా
తంకమతి పైల శిష్యుడు
దంకుండను మునివరుండు తద్దయు భక్తిన్

ఈ పద్యాన్ని వింత పోకడలతో నడిపినాడు నన్నయ. బంధుపూర్వక కకారప్రాస, ఒక పాదము నుంచి వేరొక పాదానికి ప్రాకిన సమాసం పద్యానికి వింత సొబగులను అందిస్తున్నాయి.

బహువన పాదపాబ్ది కులపర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహిత మహా మహీభర మజస్ర సహస్ర ఫణాళి దాల్చిదు
స్సహతరమూర్తికిన్ జలధిశాయికి బాయక శయ్యమైనయ
య్యహిపతి దుష్కృతాంతకు డనంతుడు మాకు ప్రసన్నుడయ్యెడున్

ఈ పద్యంలో సరస్సరస్వతీ, మహామహీ, అజస్ర, సహస్ర, శాయికి, బాయక, అంతకుడు, అనంతుడు అనే పదాలను ప్రయోగించడం వలన నాదసౌందర్యం కలిగిస్తున్నది. పాద, పర్వత, పూర్ణ అనే ప కార అక్షరావృత్తి పద్యార్థం తెలియకముందే శ్రుతి సుఖం కలిగిస్తాయి.

నన్నయకు ఛందస్సుకు సంబంధించిన ఔచిత్య పరిజ్ఞానం అధికం. నాగలోకంలో ఉదంకుడు గుఱ్ఱం చెవిలో ఊదగనే దాని సర్వావయవాల నుండి ప్రచండమైన అగ్నిజ్వాలలు ఉద్భవించాయి. ఈ సందర్భంగా "పాతాళైక నికేతన ...... " అన్న శార్దూల వృత్తాన్ని నన్నయ రచించాడు. ఇది భయంకరమైన దృశ్యం. దీనిలో ఉన్నది భయానకరసం. కనుకనే శార్దూల పద్యాన్ని తీసుకొన్నాడు. మూర్గ, వినిర్గత, అర్చి అనే శబ్దాలలోని ద్విత్వాక్షరాలతో, భ కార ధ కార ఒ కారలతో భయంకర దృశ్యాన్ని ప్రత్యక్షంగా కళ్ళకు కట్టినట్టు వర్ణించినాడు.

**నానారుచిరార్థసూక్తి నిధిత్వం:** ఇక నానారుచిరార్థసూక్తి నిధిత్వం నన్నయ కవితలోని మూడవ లక్షణము. నన్నయ అర్థవంతములైన సూక్తులకు, సుభాషితములకు నిధి. మానవ స్వభావమును మధించి, నన్నయ అనేక జీవిత రహస్యములను, లోకరీతులను ప్రకటించును. వీటిలో కొన్ని హితభాషణములు, కొన్ని మృదు దూషణములు. అవకాశము దొరికినపుడెల్ల వేదోక్తములైన సూక్తులను అందించును. సార్వకాలీనమైన సత్యములను ప్రస్ఫుటము గావించును. లోకోక్తులను జాతీయములను స్వీకరించును. కొన్ని నన్నయ ప్రయోగములు తర్వాతి కాలంలో లోకోక్తులుగా, జాతీయములుగా రూపొందినవన్నచో నన్నయ రుచిరార్థ సూక్తి నిధిత్వ మెట్టిదో తెలియుచున్నది.

'ఓ పండతి శాంతుడయ్యు నరపాలుడు శాపము గ్రమ్మరింపగన్
వడిగలదు మనముకంటె గాడ్పుకంటె'

నన్నయ చక్కని తెలుగు నుడికారాన్ని ప్రయోగిస్తాడు. అందువలన సంభాషణలో సహజత్వం ఉట్టి పడుతుంది.

ఈయున్న పౌష్యపాలకి
బోయి కడుంపెద్ద దవ్వు పోయినయట్ల
త్యాయత విమల తపోమహి
మా యిన్ని దినంబులేల మసలితి చెపుమా

'ప్రక్కనే ఉన్న' అన్న అర్థంలో 'ఈ యున్న' అన్న ప్రయోగం తెలుగు ప్రజలకు సర్వసాధారణం.

ఆంధ్రసాహిత్యం మొగ్గతొడిగిన తోడనే పరిమళము దశదిశల వ్యాపించుటకు కారణము నన్నయ ప్రతిభా విశేషమే. కావ్యమున కత్యంత ప్రధానములని ఆలంకారికులు తెల్పిన రసము, ధ్వని, ఔచిత్యములు నన్నయ రచనలో మిక్కిలి విశిష్టముగ నిర్వహింపబడినవి. నిత్యసత్యవచనుడైన నన్నయ మితహిత వాక్కులతో మహాభారతమును ధర్మ శాస్త్రముగా, పురాణముగా, వేదాంతముగా, మహాకావ్యముగా తీర్చిదిద్ది రెండవ వాల్మీకి అయినాడు.

నన్నయ శైలి హృదయరంజకమైనది. సంభాషణా శైలి సహజమైనది. ఉదంకుడు, పౌష్యమహారాజు సంభాషణ, ఉదంకుడు దివ్యపురుషుడు సంభాషణ ఇందుకు ఉదాహరణ.

"నన్నయ ప్రతిభ అసాధారణమైనది. ఇతనివలె మూర్తులను సృష్టింప నెవరికి సాధ్యముకాదు. ఈతని కవిత్వమునకు చైతన్యమును, తేజస్సు నిచ్చిన జీవకళ గాంభీర్యగుణమని చెప్పవలయును. ఇదే యాతని శైలికి ప్రాణము. సందర్భాను సారముగ నన్నయ కవిత్వశైలి మనోహరముగ మారుచుండినను గాంభీర్యమును వదలదు అని శిష్టా రామకృష్ణ శాస్త్రి నన్నయ శైలి ప్రత్యేకతను (ఆంధ్ర వాఙ్మయా చరిత్ర సర్వస్వము. 178వ పేజీ) ప్రశంసించారు.

3. నన్నయ భారతాంధ్రీకరణ పద్ధతిని వివరించునది. (లేదా)

సంస్కృతంలోని ఉదంకోపాఖ్యానమునకు తెలుగులో నన్నయ చేసిన మార్పులు చేర్పులను విశదీకరించునది.

జ. మహాభారతము పంచమవేదముగా ప్రసిద్ధి కెక్కినది. వేద వ్యాసుడు భారతమును పద్యమయముగా రచించాడు. కాని తెలుగులో నన్నయ గద్యపద్యాత్మకంగా రచించాడు. నన్నయ వ్యాస భారతాన్ని మక్కీకి మక్కీ భాషాంతరీకరణము చేయకుండా ఔచిత్యవంతంగా రచించాడు. ఉచితజ్ఞుడు, రసజ్ఞుడు, లోకజ్ఞుడు అయిన నన్నయ భారతాన్ని ఆంధ్రీకరించటంలో మూలంలోని కొన్ని భాగాలను సంగ్రహించి, కొన్నిటిని పెంచి, కొన్నిటిని పూర్తిగా తొలగించి, కొన్నిటిని మార్పులు చేసి, కొన్నిటిని నూతనంగా కల్పించి, ప్రధాన కథకు భంగము కలుగకుండా సర్వవిధాల హృదయంగమముగా రచించాడు.

నన్నయ వ్రాసిన ఆది సభాపర్వములు, అరణ్యపర్వంలో కొంతభాగంలో సుమారు నాలుగువేల పద్యాలున్నాయి. ఆ భాగము సంస్కృతములో సుమారు పదిహేడువేల శ్లోకాలలో ఉన్నది. దీన్ని బట్టి నన్నయ తన గ్రంథాన్ని నాల్గవవంతుకు తగించాడని భ్రమపడకూడదు. కొన్నిచోట్ల ఆయన రెండు మూడు శ్లోకాల అర్థాన్ని ఒక పద్యంలో ఇమిడ్చాడు. మరికొన్ని చోట్ల అనేక శ్లోకాల అర్థాన్ని ఒకే పదంలో వ్రాశాడు. రమణీయమైన కొన్ని శ్లోకాలకు మాత్రము శ్లోకమున కొక పద్యమును రచించాడు.

మహాభారతంలోని ఉదంకుని చరిత్రలో వచ్చు ఉపమన్యుని వృత్తాంతాన్ని నన్నయ పూర్తిగా విడిచిపెట్టాడు.

ఉదంకుడు నాగలోకమున కనిపించిన పురుషుని స్తుతించిన ఘట్టములో వైదిక మంత్రము లున్నవి మూలమున. వైదిక మంత్రములు సంస్కృతమునందే ఉండవలయునని, భాషాంతరీకరింపరాదని సంప్రదాయము. అందు వలన నన్నయ ఆ మంత్రములను ఆంధ్రీకరింపలేదు. "ఒక్క దివ్యపురుషునింగని విపులార్థవంతములైన మంత్రముల నతి భక్తి యుక్తుండై స్తుతియించి" అని మాత్రమే సూచించాడు.

నిండు మనంబు నవ్యనవనీత సమానము పల్కు దారుణా
ఖండల శస్త్రతుల్యము జగన్నుత విప్రుల యందు నిక్కమి
రెండును రాజులందు విపరీతము గావున విప్రుడోపునో
పండతి శాంతుడయ్యు నరపాలుడు శాపము గ్రమ్మఱింపగన్

మూలమున బ్రాహ్మణ శబ్దమున్నది. నన్నయ విప్ర శబ్ద ప్రయోగించాడు. విప్రుడు అనగా నిత్యము వేదమును పఠించువాడు. వేదము కఠినమైనది. దానిని పఠించు విప్రుని వాక్కు కఠినముగా ఉండుట సహజమే. మూలమున క్షురము (కత్తి) అని వుండగా, నన్నయ 'అఖండల శస్త్రతుల్కము' అని వాడినాడు. అంటే ఇంద్రుని వజ్రాయుధము. కతి కంటే పదునైనది. కఠినమైనది. ఇది దధీచి వెన్నెముక. వెన్న యెంత మెత్తటిదో ఎముక అంత కఠినమైనది.

మూలమున 'క్షత్రియ' శబ్దమున్నది. తెలుగున నన్నయ 'రాజు' (నేలను పాలించువాడు), 'నరపాలుడు' (నరులను పాలించువాడు) అన్న పదములను ప్రయోగించినాడు. రాజనీతిలో రాజు ఏదీ సూటిగా మాట్లాడడు, ప్రవర్తింపడు. నన్నయ ఔచిత్యవంతమైన పదప్రయోగానికి తార్కాణమెన్నో!

సంస్కృత భారతమున ఉదంకుడు చేసిన నాగస్తోత్రమును నన్నయ గారు "పద్యములలోనికి దింపిరి. మూలములో అనంతుని ప్రసక్తిలేదు. ఇందు మొదటి పద్యము (బహువన పాదపాబ్ది ....) లో అనంతుడున్నాడు. మూలములో "అద్రినందనేశ్వరునకు భూషణంబయిన వాసుకి" లేదు. ఈ సమాసపు కూర్పులేదు. ఈ మాధుర్యము, ఈ చిక్కదనము లేదు. మరియు 'మాకు ప్రసన్నుడయ్యెడున్' అని నాలుగు పద్యములలో వచ్చు మకుటము నన్నయ కల్పించినదే. తర్వాత కాలంలో తెలుగున ప్రారంభమైన శతక రచనకిది మార్గదర్శకమైనదని తలచవచ్చు.

కావ్యనాటకాలలో ప్రతి పదార్థ భావాలు ప్రధానమైనవి. కాబట్టి వాటి భాషాంతరీకరణము మూలానుసరణముగ ఉండి తీరాలి. పురాణేతిహాసములు కథాధర్మములు మాత్రమే ప్రధానముగా గలవి. వాటిని యథేచ్ఛగా అనువదింపవచ్చు. మార్పులు, చేర్పులు, కూర్పులు, చేర్పులు ఆంధ్రీకర్త అభీష్టము. అది మాతా పుత్రికానుబంధము. నన్నయ భారతాంధ్రీకరణము స్వతంత్ర పద్ధతి.

వ్యాసుని భారత రచనకు ధర్మప్రబోధమే ప్రధాన లక్ష్యము. నన్నయ మహాభారతమును ఒక మహాకావ్యముగా, కావ్యకళ భాసిల్లునట్లు కాంతా సమ్మిత మొనరించినాడు. మూలమున నున్న పదాన్నో, పదబంధాన్నో ఆసరా చేసుకుని నన్నయ విస్తృత వర్ణనలు చేసిన సందర్భాలు కూడ ఉన్నాయి.

దేశకాలపాత్రముల నెరిగి నన్నయ అమూలకములైన అంశాలను కొన్నిటిని తెలుగు భారతంలో ప్రవేశపెట్టాడు. సంస్కృత భారతాన్ని ఆంధ్రీకరించడంలో నన్నయ వ్యాసుని అనుసరించడమే కాక, కన్నడ మహాకవి పంపను కూడ అనుసరించాడు. ఆంధ్రీకరణకు మార్గదర్శక సూత్రాలను చెప్పకుండానే నన్నయ తన రచన ద్వారా ఆంధ్రీకర్తలందరికీ మార్గదర్శకుడయ్యాడు.

ఆంధ్రభాషకు నన్నయ పెట్టినది భిక్ష. తక్కిన కవులందరు నన్నయ నుండి భాషా శబ్దములు, పద్యరచనలోని వొడుపులు గ్రహించిన వారేనని విశ్వనాథ సత్యనారాయణ భావించారు.

**ముగింపు :**

విద్యను నేర్పిన గురువుకు గురుదక్షిణ సమర్పించుకొనటం ఉత్తమ శిష్యుడి లక్షణంగా, అటువంటి గురుదక్షిణకు ఎన్ని కష్టాలెదురైనా సమర్పించుకోవాలని ఉదంకుడు ఆ విధంగానే చేశాడని మనం తెలుసుకున్నాం.

**ప్రశ్నలు :**

1. ఉదంకుడు గురుదక్షిణను చెల్లించిన విధమును వివరింపుము.
2. ఉదంకోపాఖ్యానం ద్వారా నన్నయ కవితా విశేషములను విశదీకరింపుము.
3. సంస్కృతంలో ఉదంకోపాఖ్యానమునకు తెలుగులో నన్నయ చేసిన మార్పులు, చేర్పులను విశదీకరించండి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఆంధ్ర మహాభారతము - నన్నయ

2. ఆంధ్ర వాఙ్మయా చరిత్ర సర్వస్వము - శిష్టా రామకృష్ణ శాస్త్రి

డా॥ సి.హెచ్. సుశీలమ్మ
రీడర్ - తెలుగు శాఖ
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
గుంటూరు

**పాఠం - 2**

# మాలదాసరి కథ

## (3 - 33 పద్యాలు)

**- శ్రీకృష్ణదేవరాయలు**

**శీర్షికలు :**


2.0 లక్ష్యము

2.1 కవి పరిచయం

2.2 రాయల కృతులు

2.3 ఆముక్తమాల్యదా ప్రబంధత్వం

2.4 ఆముక్తమాల్యద - గ్రంథ పరిచయం

2.5 రచనా విధానం

2.6 మాలదాసరికథా సంగ్రహం

2.7 సమగ్రవ్యాఖ్యలు - ప్రతిపదార్థాలు


## 2.0 లక్ష్యం

తెలుగు సాహిత్యంలో స్వర్ణయుగాన్ని సృష్టించినవాడు శ్రీకృష్ణదేవరాయలు. ఆయన రచన ఆముక్తమాల్యద. అది బనారసు పట్టు చీరల పెట్టె. అందులో మాలదాసరికథ నల్లంచు తెల్లచీర. పిఠాపురంలో దొరికే అరుదైన 'కొత్తపల్లి కొబ్బరి' రసాలు మామిడి ఫలం. రుచికి ఇమాందీక వంటిది. అని శ్రీ విశ్వనాథవారి భావన.

బ్రాహ్మణుడి కన్న భక్తుడు ఉన్నతుడు. వేదాధ్యయనం కన్న ఆచరణం మిన్న. భక్తిగానం ముక్తి విధానం. విష్ణు కీర్తనం కన్న తపస్సు సున్న. శారీరక సౌందర్యం కన్న మానసిక సౌందర్యం శోభస్కరం. సత్యవాక్పరిపాలన, దానం, ధర్మజ్ఞత వంటి పలుభావాల కేంద్ర బిందువు మాలదాసరికథ. ఇలా ఈ కథ బహు ప్రౌఢమై తెలుగు భాషకు రత్నకిరీటంగా భాసిస్తుంది.

## 2.1 కవి పరిచయం

సర్వతంత్ర స్వాతంత్రంతో విద్యానగర సామ్రాజ్యాన్నీ విద్వత్కవి కవితా సామ్రాజ్యాన్నీ ప్రాభవ వైభవోపేతంగా పాలించాడు శ్రీకృష్ణదేవరాయలు. ఇతడు నాగాంబికా వీరనరసరాయ ప్రియనందనుడు. తెలుగు వల్లభుడు. సాహితీ సమరాంగణ సార్వభౌముడు. ఆంధ్రభోజుడు. అష్టదిగ్గజ కవిరాజ విరాజితుడు. కవిరాజు రాజకవి. కవితా స్త్రీలోలుడు. సంస్కృతాంధ్ర కవిశేఖరుడు. కావ్య నాటకాలంకార మర్మజ్ఞుడు. ధర్మజ్ఞుడు. నిస్తంద్రప్రతిభా సుధీనుతుడు. విష్ణుభక్తుడు. నేద్దోపనా ప్రవీణుడు. ఏవం విధంగా లోక ప్రసిద్ధుడు.

## 2.2 రాయల కృతులు

మదాలస చరిత్ర, జాంబవతీ పరిణయం సత్యభామా ప్రీణనం సకలకథా సారసంగ్రహం రసమంజరి జ్ఞాన చింతామణి మొ॥నవి రాయల వారి కృతులు. ఇందులో ఆముక్తమాల్యద, జాంబవతీ పరిణయం మాత్రమే ప్రస్తుతం మనకు లభిస్తున్న గ్రంథాలు.

## 2.3 ఆముక్తమాల్యద ప్రబంధత్వం

ఆంధ్ర భాషలోని అగ్రశ్రేణి ప్రబంధాలలో ఆముక్తమాల్యద పేరెన్నిక గన్నది. రాయల ఆస్థాన ఉద్యానంలో ప్రబంధ ప్రక్రియా పారిజాతం పుష్పించి పరిమళించింది. ప్రబంధ ప్రక్రియలో ఇతివృత్త ప్రపంచీకరణం వస్త్వైక్యం శృంగార ప్రాధాన్యం అష్టాదశవర్ణనలు ఆలంకారికశైలి ప్రధానాంశాలు - అన్ని లక్షణాలూ అన్ని ప్రబంధాలలో ప్రస్ఫుటం కాకపోవచ్చు. కానీ వర్ణనా బాహుళ్యం ఆలంకారికా శైలి మాత్రం సర్వత్ర సాక్షాత్కరిస్తాయి. ఆముక్తమాల్యదలో భక్తి రస ప్రాధాన్యం వస్త్వైక్యలోపం ప్రబంధ లక్షణాలకు అపవాదంగా నిలిచినా, వర్ణనా బాహుళ్యం ఆలంకారిక శైలి అంతకు రెండింతలుగా కనిపిస్తాయి. ఆముక్త మాల్యదా ప్రబంధత్వాన్ని ప్రకటిస్తాయి.

## 2.4 ఆముక్తమాల్యద గ్రంథపరిచయం

'శూడి కొడుత్తాళ్' అనే తమిళ పద సంపుటికి సంస్కృత కరణమే ఈ 'ఆముక్త మాల్యద' నామం. ఆముక్త = ధరించిన, మాల్య = మాలను, దా = ఇచ్చేది అని వివరిస్తుంది ప్రసన్నామృతం అనే గ్రంథం. విల్లిపుత్తూరులోని వటపత్రశాయికి నిత్యం విష్ణుచిత్తుడు తులసి మాలను కట్టిఉంచేవాడు. అతడి పుత్రిక గోదాదేవి దానిని తండ్రికి తెలియకుండా ధరించేది. నూతిలో తన ప్రతిబింబాన్ని చూచుకొని మురిసిపోయేది. కొద్దిసేపు తరువాత ఆ దండను తీసి యథాప్రకారం స్వామి అర్చనకు ఉంచేది. ఇలా తాను ధరించిన మాలను గోదాదేవి స్వామికి ఇవ్వడంచేత ఆముక్తమాల్యద అని పేరు వచ్చింది. విష్ణుచిత్తుడికి సంబంధించిన కావ్యం కనుక 'విష్ణుచిత్తీయం' అని కూడ దీనికి వ్యవహారం. దీనిలో గోదా శ్రీరంగేశుల కల్యాణం ప్రధాన విషయం. ఏడు ఆశ్వాసాల ఈ ప్రబంధం విశిష్టా ద్వైత సంప్రదాయ సంబంధి. ఇందులో భక్తి అంగరసం - అలౌకిక శృంగారం అంగరసం - ఇలా ప్రబంధ సాహిత్యంలో విశిష్టమూ విలక్షణమూ ఈ ఆముక్తమాల్యద. విష్ణుచిత్తుని కథ, ఖాండిక్య కేశిధ్వజ సంవాదం, యామునాచార్యకథ, మాలదాసరికథ, గోదాదేవి కథ ఇందులో ప్రముఖమైనవి.

## 2.5 రచనా విధానం

ఆముక్తమాల్యద నూతన కథాకల్పనలతో దీర్ఘసమాసాలతో కూడి అత్యద్భుత వర్ణనలు ఊహావైరుధ్యము సందర్భచారుత్వము అలంకార విన్యాసం, భావగాంభీర్యం, శిల్పప్రౌఢి, శైలీవైవిధ్యం, శాస్త్రవైదుష్యం, కలిగి ఉంటుంది. ఇందులోని కవిత్వం నారికేళ పాకం క్వచిత్తుగా ద్రాక్షా పాకం. సంస్కృత జాతీయాలు తెలుగు జాతీయాలతో పాటు ద్రావిడ జాతీయాలూ ద్రావిడ శబ్ద ప్రయోగాలతో కూడి ఉంటుంది. వర్ణాశ్రమ ధర్మాలు సత్యసంధత ధర్మనిష్ఠలకు నిలయం. ప్రకృతి పరిశీలన లోక పరిశీలన సంశోభితం. విష్ణు పారమ్యానికి వైదిక ధర్మ పరిరక్షణకు నైతిక మూల్యాలకు ప్రయోగశాల ఆముక్తమాల్యదా ప్రబంధం.

## 2.6 మాలదాసరి కథా సంగ్రహం

తన భక్తుడైన మాలదాసరి చరిత్రను శ్రీమహావిష్ణువు విష్ణుచిత్తుడితో చెప్పిన కథ ఇది. మాలదాసరి నా భక్తుడు. వామనావతారంలో నేనున్న ప్రాంతానికి మూడామడల దూరంలో ఉండేవాడు. వాడి దేహం అశుచి. వాడి హృదయం శుచి. మసిపాతలో ముడిచిన మాణిక్యం లాంటివాడు. నిత్యం వేకువనే లేచి కురుంగుడికి వచ్చి, నా కిష్టమైన మంగళకైశికి రాగంలో కీర్తించేవాడు. అక్కడ వాతాతపాలు మరచి పరవశించేవాడు. దేవళం వద్ద దయతో ఎవడో శూద్రుడిచ్చిన తీర్థప్రసాదాలు భక్తిశ్రద్ధలతో స్వీకరించేవాడు.

ఒక అర్ధరాత్రి పిల్లికి భీతిల్లి అరచిన కుక్కుటాల కారణంగా నా సేవా సమయం అయిందని భ్రమించి కురుంగుడికి ప్రయాణమైనాడు. దారిలో మర్లు మాతంగి తీగను త్రొక్కి దారి తప్పాడు. దిక్కు తెలియక తిరిగాడు. వేకువలో ఒక పాడుపడ్డ ప్రాంతంలో కాలి బాటన పోతూ ఒక మహావటవృక్షాన్ని దర్శించాడు. అక్కడ అంతా పీనుగుల అవశేషాలతో భీభత్సంగా వుంది.

ఒక బ్రహ్మరాక్షసుడు తన ఆడ పిశాచాలతో ఆ వృక్షం మీద ఆవాసమున్నాడు. అతడు దాసరిని పట్టి భక్షించాలని యత్నించాడు. ఇద్దరూ కలియబడ్డారు. ప్రాణరక్షణ కోసం పారిపోయే యత్నంచేశాడు దాసరి. పిశాచాల సాయంతో దాసరిని పట్టితెచ్చి చెట్టువద్ద కట్టిపడేశాడు రాక్షసుడు.

అప్పుడు దాసరి, తనకు నిత్యం మంగళకైశికీ గానవ్రతం ఉందనీ అది పూర్తిచేసుకొని తిరిగివచ్చి నీకాహారమైతానని అందుకోసం కురుంగుడికి పంపమని ప్రార్థించాడు. ఎన్నో ప్రమాణాలు చేశాడు. రాక్షసుడు ఆ మాటలకు నవ్వి అపహాసంగా చెక్కిలి మీద కొట్టి, నీవెంత చదివిన వాడవైనా ప్రయోజనంలేదు. నన్ను మోసగించలేవు. చదివి నే సాధించేదేముంది? ప్రమాణాలు నమ్మి నోటి ముద్దనెవడు వదులుకుంటాడన్నాడు. అప్పుడు దాసరి తాను తిరిగి రాకపోతే, సృష్టిస్థితిలయ కారకుడైన శ్రీమహావిష్ణువుతో సమానంగా మరొక వేల్పును పోల్చిన పాతకినవుతానని ఘోర ప్రమాణం చేశాడు. దానితో కనికరించిన రాక్షసుడు బంధలూడ్చి పంపాడు. వ్రత సమాప్తి చేసి ఇచ్చిన మాట ప్రకారం తిరిగి వచ్చి తనను భక్షించమన్నాడు దాసరి. బ్రహ్మరాక్షసుడు దాసరిని ఆశ్చర్యంగా చూచి, నీ లాంటి సత్యసంధుడిని చూడలేదు, నిన్ను భక్షించలేనని పల్కాడు. బ్రాహ్మణుడైన తాను చేసిన అకృత్యాల కారణంగా బ్రహ్మరాక్షసుడనైనానని తెల్పాడు. విష్ణుకీర్తన ఫలాన్ని ధారవోసి మోక్షప్రాప్తి కలిగించమని, భక్తితో ప్రదణించి పాదాల మీద పడ్డాడు. అయినా దాసరి తిరస్కరించాడు. గానఫలం దానంచేసి దేహాన్ని రక్షించుకోవటం ఉప్పుకోసం కర్పూరాన్ని అమ్ముకోవడమే అన్నాడు. ఆ మాటలకు రాక్షసుడు, ఎవరో పుణ్యాత్ముడు రాకపోతాడా? ముక్తి లభించక పోతుందా అని ఇన్నాళ్లూ ఎదురుచూచాను, కాని ఇప్పుడు నీవు వచ్చి కూడా కాదంటే ఎలా? భగవంతుడి కన్న భాగవతుడు మిన్న కదా! నీవు నన్ను రక్షించలేవా? ప్రాణిహితం చెయ్యడం పరమేశ్వరార్చనే కదా! చేపత్రాగిన గుక్కెడు నీటితో సముద్రజలం తగ్గదుకదా! సంగీత ఫలదానంతో నీకు అఖండ విష్ణుకీర్తన ఫలం కొరవడుతుందా? అని పలువిధాల ప్రాధేయపడ్డాడు.

అందుకు దాసరి, నీ భేతాళ సహజమైన మాయమాటలు మానుకో, నా దేహాన్ని తీసుకో. అంతేకాని గానఫలం కోసం నన్ను పీడిస్తే ముక్తి కాదు కదా భుక్తి కూడ దక్కదన్నాడు. అప్పుడు, రాక్షసుడు విచారంతో వైష్ణవమత గురువులైన రామానుజుల వంటి వారెలా భక్తులనుద్ధరించారో తెల్పాడు. దేహం పాపరహితం కాకుంటే మోక్షం రాదు. కనుక నేటి ప్రభాతంలో పాడిన చరమగీతంలో కనీసం పాతిక పాలైనా ధారవోయమని పాదాల మీద పడి ప్రాధేయపడ్డాడు. అప్పుడు దాసరి కరుణాళువై అంగీకరించాడు.

వరహపురాణంలో పలుచగా కొకిబికిగా ఉన్న మాలదాసరి కథను శ్రీకృష్ణదేవరాయలు మార్పులుచేర్పులు చేసి ఆముక్త మాల్యదలో మహోత్కృష్టకథగా మలిచాడు.

## 2.7 సమగ్రవ్యాఖ్యలు - ప్రతిపదార్థాలు :

3. చ॥ కలడొకరుండు ............ మంగళనామ కైశికిన్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| పేరుకొనగాని | = | ఉచ్చరింపకాని |
| కులంబు | = | కులంలోని |
| మదీయ | = | నా భక్తుడు |
| ఒకరుండు | = | ఒక్కడు |
| కలడు | = | ఉండేవాడు |
| వాడు | = | అతడు |
| మును | = | పూర్వం |

| | | |
|---|---|---|
| వామనతన్ | = | వామనావతార సమయంలో |
| ఏన్ | = | నేను |
| వసియించిన | = | నివశించిన |
| పుణ్యభూమి | = | పవిత్ర ప్రదేశమైన 'తిరుక్కురుంగుడి' కి |
| ఒక యోజన త్రయపు దూరపుటూరన్ | = | ఒక మూడు యోజనాల దూరంలో వున్న గ్రామంలో |
| వశించి | = | కాపురముండి |
| బ్రాహ్మవేళన్ | = | బ్రాహ్మీ ముహూర్తంలో - తెల్లవారుజామున గం॥4.30 ని॥లు ప్రాంతంలో |
| చనుదెంచి | = | వచ్చి |
| మంగళ నామ కైశికిన్ | = | మంగళ నామ కైశికి అనే రాగంలో |
| లాలసతన్ | = | కోరికతో |
| మమ్ము | = | నన్నుగూర్చి |
| పాడున్ | = | కీర్తించేవాడు |

**తాత్పర్యం :**

పంచమకులంలో జన్మించిన మా భక్తుడొకడుండే వాడు. పూర్వం వామనావతార సమయంలో నేను నివశించిన 'తిరుక్కురుంగుడి' కి మూడు యోజనాల దూరంలో గల ఒక గ్రామంలో నివశించేవాడు. అతడు ప్రతి రోజు ప్రభాత సమయంలో నాకు ఇష్టమైన మంగళకైశికీ రాగాలాపనతో స్తుతించేవాడు.

4. వ॥ అహరహంబు నమ్మహాత్ముడు ........

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అహః+అహంబు | = | ప్రతిదినమూ |
| ఆ+మహాత్ముండు | = | ఉత్తముడైన ఆ మాలదాసరి |

5. కం॥ జాత్యుచిత చరిత్రమ ........ మొదుగున్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| జాతి+ఉచిత | = | తన జాతికి తగిన |
| చరిత్రము+అ | = | ప్రవర్తననే |
| మత్+ప్రీతి+అర్థము | = | మా సంతోషం కోసం |
| ఊది | = | అవలంబించి |
| తనదు హృదయము | = | తన మనస్సు |
| శుచితా | = | పరిశుద్ధిలో |
| నిత్యత్వంబుగన్ | = | స్థిరపడేట్లుగా |
| తత్+తను సాంగత్యము | = | ఆ చండాల శరీరంతో కలసి ఉండటం అనే |
| మసిపాత | = | మసిగుడ్డలోని |
| మానికంబు+ఐ | = | మాణిక్యమై |
| ఒదుగున్ | = | ఒదిగి ఉండేది |

**తాత్పర్యం :**

ఆ మాలదాసరి మా భక్తుడైనప్పటికీ, మాకు వర్ణాశ్రమాచారాల పట్ల మక్కువ ఎక్కువ కనుక, అది తెలిసి తాను తన కులోచితాచారంలోనే జీవించేవాడు. తన హృదయాన్ని నిత్యం పరిశుద్ధం చేసుకుంటూ తన చండాల శరీర సాంగత్యం అనే మసిగుడ్డలో కట్టిన మాణిక్యంలాగ ఉండేవాడు. మాసిన బట్టలో ఉన్నా మాణిక్యానికి విలువ తగ్గదు కదా! అలం - వాక్యార్థగత నిదర్శన.

6. సీ॥ చమురైన ........ వైష్ణవుండు.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| చమురైన | = | చమురు పట్టిన |
| తోల్+కుబుసము | = | చర్మంతో కుట్టిన చొక్కా |
| టెంకియు | = | తలపాగాను |
| ఇత్తడి శంఖ చక్ర కుండలములు | = | శంఖ చక్రాకారాలుగా ఉన్న ఇత్తడి చెవి కమ్మలు |
| అమరన్ | = | ప్రకాశిస్తుండగా |
| దివెదారి కొమ్మున్ | = | దీప స్తంభము |
| తోల్+తిత్తియున్ | = | తోలు తిత్తి |
| జోడమ్ము | = | చేతితో పొడిచే బాణము |
| మెడమీది | = | మెడమీద ఉన్న |
| మొగలాకు గొడుగు | = | మొగలి ఆకులతో చేసిన గొడుగు |
| తనరన్ | = | ప్రకాశించగా |
| మత్+పాదరక్షయున్ | = | నా పాదుకనూ |
| మావు+పెన్+వెంటుకన్+కుట్టిన | = | గుర్రపు పొడవైన వెంట్రుకతో కట్టిన |
| ఓటి తిపిరి దండెయును | = | ఓటి సొరకాయ దండే |
| మెరయన్ | = | ప్రకాశిస్తుండగా |
| చిటితాళములు | = | చిన్నవైన భజన చెక్కలు |
| చంకపుటికన్ | = | చంకలో వ్రేలాడుతున్న బుట్టకు |
| ఒక్కొక్కమాటు | = | ఒక్కోసారి |
| గతిరయంబున | = | నడక వేగంవల్ల |
| తాకి | = | తగిలి |
| కలిసి | = | ఏకమై |
| మొరయన్ | = | ధ్వని చేస్తుండగా |
| వలుద | = | పెద్దవైన |
| వనమాల కంటెయు | = | తులసి పూసలు కూర్చిన కంఠాభరణమూ |
| మలిన తనువున్ | = | మాసిన శరీరము |
| పట్టె తిరుమన్ను | = | తిరుమణితో నుదుట దిద్దిన పంగనామాలూ |
| బెదురు-కెంపు+ఉట్టు చూపులున్ | = | ఎర్రదనం ఉట్టిపడుతున్న బెదురుచూపులూ |
| పసుపుపొడి | = | పసుపు రాచిన |

| | | |
|---|---|---|
| తోలు పల్లంబు | = | తోలు జందెమూ |
| ఎసకము+ఎసగన్ | = | అతిశయిస్తుండగా |
| సురియాళు | = | ఖడ్గ శోభితుడైన |
| వైష్ణవుండు | = | విష్ణు భక్తుడు అయిన మాలదాసరి |
| సేవింపన్ వచ్చున్ | = | సేవించటానికి వస్తుండే వాడు. |

**తాత్పర్యం :**

నూనె పట్టిన తోలు చొక్కా, తలపాగా ఇత్తడితో చేసిన శంఖ చక్ర కర్ణాభరణాలు ధరించాడు. దీప స్తంభమూ తోలు తిత్తి జోడమ్ము మొగలాకు గొడుగు మా పాదుకలూ చేత బట్టాడు. గుర్రపు వెంట్రుకను తంత్రులుగా బిగించిన సొరకాయ దండెను ధరించాడు. చిటి తాళాలు చంకలో తగిలించిన బుట్టకు తగిలి శబ్దం చేస్తున్నాయి, తులసి మాలను ధరించాడు. మలిన శరీరంతో ఎర్రటి తిరునామాన్ని పసుపు పట్టించిన తోలు జందెమునూ ధరించేవాడు. ఎర్రటి బెదురు చూపులతో ఆ దాసరి మా సేవ కోసం నిత్యం వస్తుండేవాడు.

7. శా॥ గండాభోగములన్మదద్రుశులహరుల్గప్పన్నుతుల్పాడి యా
దండవ్రేగులుడించి భక్తిజనితోద్యత్తాండవంబాడు నా
చండాలేతరశీలుఁడుత్పులకియై చండాలికన్మీటుచున్
గుండుల్నీరుగ నెండ గాలి పసితాఁకుం జూడకాప్రాహ్ణమున్.

**కవి - కావ్యం :**

ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడూ శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధంలోని షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది ఈ పద్యం.

**సందర్భం :**

భాగవతోత్తముడైన మాలదాసరికి తమ పట్ల గల అచంచల భక్తి విశ్వాసాలను శ్రీవిల్లుపుత్తూరు మన్నారుస్వామి విష్ణుచిత్తుడికి వివరిస్తున్న సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| ఆ + చండాల + ఇతర | = | ఆ చండాలురకంటె ఉన్నతమైన |
| శీలుడు | = | నడవడి గల మాలదాసరి |
| ఆ దండన్ | = | ఆ కుటుంగుడి సమీపాన |
| వ్రేగులు | = | బరువులను |
| డించి | = | క్రింద ఉంచి |
| ఎండ; గాలి | = | కసరు గాలి |
| పసి | = | ఆకలి (తమిళ పదం) |
| తాకున్ | = | బాధను |
| చూడక | = | లెక్కసేయక |
| ఆ + ప్రాహ్ణమున్ | = | మధ్యాహ్నం దాకా |
| గుండుల్ - నీరుగ | = | రాళ్లు కరిగేలాగా |

| | | |
|---|---|---|
| చండాలికన్ | = | తన వీణను |
| మీటుచున్ | = | వాయిస్తూ |
| ఉత్ + పులకి + ఐ | = | గగుర్పాటును పొంది |
| గండ + ఆభోగములన్ | = | చెక్కిళ్ల నిండా |
| ముత్ + అశ్రులహరుల్ | = | (భక్తి) ఆనందబాష్పాల జాలు |
| క్రమ్మన్ | = | ముంచెత్తగా |
| నుతుల్ | = | గీతాలను |
| పాడి | = | గానం చేసి |
| భక్తిజనిత | = | భక్తిపారవశ్యం వల్ల కలిగిన |
| ఉత్యత్ | = | ప్రకాశిస్తున్న |
| తాండవంబున్ | = | నాట్యాన్ని |
| ఆడున్ | = | చేసేవాడు |

**తాత్పర్యం :**

మాలదాసరి జాతి చేత చండాలుడైనా ఉత్తముల ఆచారాలను పాటిస్తాడు. ప్రతిరోజూ తన వద్ద ఉన్న బరువును దేవళ సమీపంలో దించుకుంటాడు. అక్కడ ఎండను గాలిని ఆకలిని లెక్కచేయకుండా మధ్యాహ్నందాకా, శరీరం గగుర్పొడుస్తుండగా, చండాలికను మీటుతూ, రాళ్లు కరిగేలా పాడుతూ, చెక్కిళ్లంతటా ఆనందబాష్పాలు క్రమ్ముతుండగా భక్తిజనితోద్యత్తాండవం చేస్తుండేవాడు.

**విశేషాంశాలు :**

చండాలేతర సమాసం 'కులం కన్న గుణం మిన్న' అనీ, ముదశ్రు, గండాభోగ, ఆప్రాహ్ణమున్ అనే సమాసాలు, దాసరి భక్త్యాధిక్యాన్నీ, గుండుల్నీరుగ ప్రయోగం దాసరి సంగీత సరసతనూ చాటిచెబుతాయి. భవిష్యత్కథా సూచకాలు. పసితాకు అన్నది ద్రావిడ శబ్ద ప్రయోగం.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| ముత్ + అశ్రు = ముదశ్రు | = | జస్త్వసంధి |
| పాడి + ఆ = పాడియా | = | యడాగమ సంధి |
| చండాల + ఇతర = చండాలేతర | = | గుణసంధి |
| తాకున్ + చూడక = తాకుంజూడక | = | ద్రుత కార్యం |
| అశ్రులహరుల్ | = | షష్ఠీ సమాసం |

**ఛందస్సు :**

శార్దూలం. గణాలు - మ స జ స త త గ. యతి - 1-13 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
|---|---|---|---|---|---|---|
| గండాభో | గముల | న్ముదశ్రు | లహరు | ల్గప్పన్ను | తుల్పాడి | యా |

**అలంకారం :**

లోకోక్తి అలంకారం.

గుండుల్నీరుగ = రాళ్లు కరిగేలాగ అనేది లోకోక్తి.

లోకోక్తితో కూడి ఉంది కనుక లోకోక్తి అలంకారం.

8. తే॥ అట్లుతడవుకు .......... గ్రోలి

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అట్లు | = | ఆ రీతిగా |
| తడవుగన్ | = | చాలసేపు |
| కొల్చి | = | సేవించి |
| స+అష్ట+అంగము+ఎఱగి | = | ఎనిమిది అవయవాలూ నేల తగిలే రీతిగా మ్రొక్కి |
| గర్భమంటపిన్ | = | గర్భాలయాన్ని |
| కడిగిన | = | శుభ్రపరచిన |
| కలకజము | = | మలినోదకం |
| లోని | = | లోపల ఉన్న |
| ఱా తొట్టి నిండి | = | ఱాతి తొట్టి నిండి |
| కాలువగన్+చాగి | = | కాలువగా సాగి |
| గుడివెడలి వచ్చునది | = | గుడి బయటకు వస్తుండగా |
| శూద్రుడు | = | నాల్గవ జాతివాడు ఒకడు |
| ఇడగన్+క్రోలి | = | ఇవ్వగా త్రాగి |

**తాత్పర్యం :**

ఇలా చాలసేపు సేవించి సాష్టాంగ నమస్కారం చేసి, గర్భ మంటపాన్ని కడిగిన నీళ్లు లోపలి రాతి తొట్టి నిండి బయటకురాగా, ఆ నీటిని తాను ముట్టక ఒక శూద్రుని అడిగి తీసుకొని ప్రీతిగా భక్తి పారవశ్యంతో స్వీకరించాడు - అలా సేవించి,

9. ఉ॥ ఆతడు ముఖ్య జాతి ........ డంబువుల్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఆతడు | = | ఆ మాలదాసరి |
| ముఖ్యజాతిన్ | = | బ్రాహ్మణాదులను |
| కనినంతన | = | చూడగానే |
| పాయుచున్ | = | తొలగిపోతూ |
| ఎండన్ గాలిన్ | = | ఎండలోనూ గాలిలోనూ |
| ఎంతో తడవున్ | = | ఎంతో సేపు |
| ప్రసాద వినియోగము | = | ప్రసాదాన్ని తనకంటె పెద్దలకు పంచిపెట్టే వరకు |
| వార్చి | = | కనిపెట్టుకొని |
| వసించున్ | = | ఉంటాడు |

| | | |
|---|---|---|
| త్రివర్ణ+ఇతర+జాతి | = | బ్రాహ్మణ క్షత్రియ వైశ్యుల కంటె వేరొక జాతివాడైన శూద్రజాతివాడు |
| మెచ్చి | = | సంతోషించి |
| దయన్+ఇడ్డ | = | దయతో ఇచ్చిన |
| ప్రసాదమున్ | = | భగవంతుని ప్రసాదాన్ని |
| దండె సాచి | = | చేతిలో ఉన్న తన కన్నెర దండెను ముందుకు చాపి |
| శ్రద్ధ+అతిశయంబుగన్ | = | మిక్కిలి శ్రద్ధతో |
| వినతిన్ | = | నమస్కారం చేస్తూ |
| అంది | = | తీసుకొని |
| భుజించున్ | = | తింటాడు |
| తత్+అంబువుల్ | = | ఆ శూద్రుడిచ్చిన నీటిని |
| కొనున్ | = | త్రాగుతాడు |

**తాత్పర్యం :**

ఆ దాసరి బ్రాహ్మణాది ఉన్నత జాతి వారిని చూడగానే దూరంగా తొలగిపోతాడు. నిగర్వి. ఎండను గాలిని లెక్కసేయక ఎంతసేపైనా సరే పెద్దలందరకు ప్రసాద వినియోగం అయ్యేదాకా వేచి ఉంటాడు. ఆ తరువాత ద్విజేతరుడెవరైనా వచ్చి ఆతడి భక్తికి మెచ్చి, తాను తెచ్చుకున్న ప్రసాదంలో దయతో కొంత పెట్టజూపితే, తన చేతిలో ఉన్న సొరకాయ దండెను ముందుకు సాచి, దానితో ఆ ప్రసాదాన్ని స్వీకరిస్తాడు. ఆతడిచ్చిన తీర్థాన్ని తీసుకుంటాడు. విశ్వాసంతో అతడికి నమస్కరిస్తాడు.

10. వ॥ ఇట్లు తన దివాకీర్తి ........ యొక్కనాడు

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| తన దివాకీర్తిజనిన్ | = | తన చండాల జన్మంచేత |
| పరమ+ఆర్తిన్ | = | మిక్కిలి ఇబ్బంది |
| నైచ్యంబు | = | నీచభావం |
| సకలజన శోచ్యంబు+కాన్ | = | అందరూ జాలిపడేలాగ |
| లాపరా | = | చదరమైన పలకరాళ్లుగల |
| తూపరాణి కడన్ | = | నీళ్ల వచ్చే తూము దగ్గర (తూము యొక్క రాయివద్ద) |
| బహిః+ఆవరణ | = | బయటి ప్రాకారము |
| నిజ పక్కణంబునకున్ | = | తన పట్టణానికి |

**తాత్పర్యం :**

దాసరిది పంచమ వర్ణం. అందువలన అందరూ జాలిపడి కనికరిస్తారని భావించి కోవెల వెలుపలి భాగంలో వేచి ఉండేవాడు. దేవాలయ ప్రాకారం చుట్టూ ప్రదక్షిణం చేసేవాడు. ప్రొద్దుపోగానే తన మాలవాడకు బయలుదేరేవాడు. ఇలా ఉండగా ఒకరోజు,

11. కం॥ అద్దమరే ........ ద్రోవన్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అద్దమరేయి | = | అర్థరాత్రి సమయంలో |
| ఆ+దాసరి | = | ఆ మాలదాసరి |

| | | |
|---|---|---|
| ఆ+దండన్ | = | ఆ సమీపంలో |
| బిడాల | = | పిల్లి |
| గాహిత | = | చొరబడిన |
| ఆలయ | = | ఇంటిలో = కోళ్ల గూటిలోని |
| కృకవాకు+ఉద్దండరవము విని | = | పెద్దదైన కోళ్ల అఱుపు విని |
| చను ప్రొద్దు | = | స్వామి సేవకు వెళ్లే వేళ |
| ఆయెన్+అటంచు | = | అయిందని |
| పాడన్+పోవుచున్ | = | పాడటానికి పోతూ |
| త్రోవన్ | = | దారిలో |

**తాత్పర్యం :**

ఒకనాటి అర్థరాత్రి సమయంలో దాసరి ఇంటి సమీపంలో ఉన్న కోళ్ల గూటిలోకి ఒక పిల్లి దూరింది. దానికి భయపడి కోళ్లు పెద్దగా కూశాయి. ఆ కోడి కూతలు విని దాసరి, తాను నిత్యం విష్ణుసేవకు వెళ్లే సమయం అయిందని భ్రమ పడ్డాడు. లేచి ప్రయాణమై పోతూ ఉండగా దారిలో -

12. ఆ॥ మరులు తీగ మెట్టి ........ జొచ్చిజనుచు

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఆ+దాసరి | = | ఆ మాలదాసరి |
| మరులుతీగెన్ | = | 'మర్లుమాతంగి' అనే తీగెను(దీనిని త్రొక్కినవారు దారితప్పి తిరుగుతారు) |
| మెట్టి | = | త్రొక్కి |
| ఇరుల్+అన్నన్ | = | ఓ చీకటీ! అని పిలువగానే |
| ఓ+అనియెడు | = | ఓ! అని పలికే |
| తమిస్రన్ | = | చీకటి రాత్రిలో |
| కాడు+పడి | = | దారితప్పి |
| పొలంబులు+ఎల్లన్+తిరిగి | = | అన్ని వైపులా తిరిగి |
| తూర్పుతెల్లన+ఔ+తరిన్ | = | తూర్పున తెల్లవారే సమయంలో |
| ఒక్క శూన్యగహిన వాటిన్ | = | జనసంచారంలేని ఒక అడవిలో |
| చొచ్చి | = | ప్రవేశించి |
| చనుచున్ | = | పోతూ |

**తాత్పర్యం :**

ఆ దాసరి మరులు తీవ త్రొక్కి ఆ కటిక చీకటి రాత్రిలో దారి తప్పి దిక్కు తెలియక తిరిగాడు. చివరకు తెల్లవారు జాము సమయంలో జనసంచారంలేని కీకారణ్యంలో ప్రవేశించాడు.

13. సీ॥ ఇడిసిన యిడుపులు ........ సీమజనుచు

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఇడిసిన | = | పడిపోయిన |

| | | |
|---|---|---|
| ఇడుపుల+ఎడలన్ | = | గోడలమీద |
| పొ్రేను | = | చిట్టిరేగ, ఉత్తరేణి, కసింద కోరింద చెట్ల పొదలచేత |
| కెడసిన | = | క్రిందికి ఒరిగిన |
| గరిసెల క్రిందన్ | = | గాదెల క్రింది |
| లాగలన్ | = | కలుగులలో |
| కృస్సి | = | కృశించి |
| ఆదవ కాపురము+ఉండు | = | అస్థిరంగా నివసించే |
| ఆబాలతతులన్ | = | ఎలుకల గుంపులచేత |
| సగము | = | సగ భాగం |
| దుమ్ముననన్ | = | దుమ్ముతో |
| పూడి | = | పూడిపోయి |
| చిగిరింత | = | చికిలింత గడ్డి |
| వాయి మూయగన్ | = | గు(ఆ గోతుల) ముఖ భాగాన్ని మూయగా |
| పెరిగిన | = | ఎదిగిన |
| నూతి, పాతర, బొరియల్ | = | బావుల పాతరల కలుగులలోకి |
| చీమలు ప్రాలు+ఈడ్వన్ | = | చీమలు గింజలను లాగికొని పోగా |
| చివికిన | = | శిథిలమైన |
| వెలుగు-పట్టులన్ | = | దొడ్డికంచెల తావున |
| పండి ఎండి కృంగిన | = | పంటకు వచ్చి, శుష్కించి, అణగి పోయిన |
| గునుకులన్ | = | గునుకు గడ్డితోను |
| పెంట దొగ్గల్లలోన్ | = | ఎరువుకుప్పల మీది దొగ్గలి చెట్లలో |
| కడుపు+అంటి | = | పొట్టలోపలికి |
| అంటుకొని పోయి | = | శుష్కించి |
| శ్మశ్రుచలనములన్ | = | మీసాలను కదలిస్తూ |
| క్రుక్కు జీర్ణ+ఓతువులన్ | = | అడగి ఉన్న ముసలి పిల్లుల చేతనూ |
| పొలంబు | = | పొలంలోని |
| దుండిగల | = | దుండిగ చెట్ల చేత |
| మళ్ల | = | వరిమళ్లలోని |
| ఔరులన్ | = | గడ్డి దుబ్బులు |
| తూలి | = | నేలమీదకి ఒరిగి |
| రాడు చిక్కు | = | నిట్రాళ్లు మాత్రమే మిగిలిన |
| ఏతాలన్ | = | ఏతాలతోను |
| పాడేరు సీమన్ | = | పాడుపడిన ప్రదేశంలో నడుస్తూ |

**తాత్పర్యం :**

పాడుపడిన గోడలమీద పొ్రేగు, కసింద, కోరిందలు పొదలు పొదలుగా పెరిగాయి. గాదెలు పడిపోగా వాటి క్రింది బొరియలలో పంది కొక్కులు తాత్కాలిగంగా కాపురమున్నాయి. బావులు పాతరలు పాడుపడి సగం పూడిపోగా వాటి పై భాగాల్ని

మూసివేస్తూ చికిలింత గడ్డి పెరిగింది. చీమలు గునుకు వరిగింజలను ఈడ్చుకొని పోయే దారిలో శిథిలమైన కంచెల వద్ద ఆ గింజలు పడ్డాయి. అవి మొలిచి వెన్నులు పెరిగి పండి ఎండి రాలి అణిగిపోయాయి. కసవుకుప్పల మీద ఎదిగిన దొగ్గలి చెట్లలో, బక్కచిక్కిన ముసలి పిల్లులున్నాయి. అవి ఆకలి బాధతో మిసాలను మాత్రమే కదల్చగలుగుతున్నాయి. పొలాలన్నీ గడ్డిపట్టి బీళ్లయినాయి. మళ్లలో గడ్డిదుబ్బులు ముమ్మరంగా పెరిగాయి. ఏతాలు నాశనమైపోయి, వాటి తావులలో పాతిన నిట్రాళ్లు ఒరిగిపోయి ఉన్నాయి. అటువంటి పాడుపడిన ప్రదేశం గుండా ఆ దాసరి ప్రయాణిస్తున్నాడు. (స్వభావోక్తి అలంకారం).

14. కం॥ అపమార్గత ........ జనుచున్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అపమార్గతన్ | = | పెడదారిలో |
| అరుగుచున్ | = | పోతూ |
| మార్గపు | = | దారిలోని |
| ధా మార్గవపున్ | = | ఉత్తరేణి చెట్ల యొక్క |
| కంటకంబులన్ | = | ముళ్ళను |
| కాళ్లన్ | = | కాళ్లనుండి |
| విపరీతతన్+ఊడ్చుచున్ | = | వ్యతిరేక దిశలో తొలగించుకుంటూ |
| నేరుపునన్ | = | నేర్పుతో |
| పల్లేరుల్+ఈడ్చి | = | పల్లేరు కాయలను పీకి |
| త్రోయుచున్+చనుచున్+ | = | పారవేస్తూ పోతూ |

**తాత్పర్యం :**

మాలదాసరి దారితప్పి ప్రయాణిస్తూ, కాళ్ల కంటిన ఉత్తరేణి ముళ్లను విపరీత దశలో తుడిచి వేస్తూ సాగాడు. వాటిని సవ్యదిశలో లాగితే మరింతగా గుచ్చుకుంటాయి. కనుక వాటికిదే సరైన పద్ధతి. పల్లేరుగాయలను నేర్పుగా తొలగించుకొంటూ పోతున్నాడు. ఇందులో కృష్ణదేవరాయల నిశితదృష్టి కన్పిస్తుంది. (అలంకారం - స్వభావోక్తి)

15. శా॥ కాంచెన్వైష్ణవు డర్ధయోజన జటాఘాటోత్థ శాఖోప శా
ఖాంచజ్ఝాటచరన్మరుద్రయ దవీయః ప్రేషితోద్యచ్ఛదో
దంచత్కోటకృత వ్రణచ్ఛలన లిప్యాపాది తాధ్యన్య ని
స్సంచారాత్త మహాఫలో సమఫలస్ఫాయద్వటక్ష్మాజమున్.

**కవి - కావ్యం :**

సాహితీ సమరాంగణ సార్వభౌముడు ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసం మాలదాసరి కథాభాగంలోనిది ఈ పద్యం.

**సందర్భం :**

ప్రభాతమైందనే భ్రాంతిలో తిరుక్కురుం గుడికి విష్ణుసేవకు పోతూ మాలదాసరి మరులు మాతంగి తీవను త్రొక్కి దారి తప్పాడు చీకటిలో; మార్గమధ్యంలో అతడు దర్శించిన మహావటవృక్ష వైభవాన్ని వర్ణించిన సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| వైష్ణవుడు | = | విష్ణుభక్తుడైన మాలదాసరి |
| అర్ధయోజన | = | ఆమడ దూరంలో సగం నిడివి గల |
| జటా | = | ఊడల యొక్క |
| ఘాటా | = | పైభాగాన |
| ఉత్థ | = | మొలిచిన |
| శాఖా | = | కొమ్మల యొక్క |
| ఉపశాఖా | = | ప్రక్క కొమ్మలతో |
| అంచత్ | = | శోభిస్తున్న |
| ఝాట | = | సమూహాలలో |
| చరత్ | = | వీస్తున్న |
| మరుత్ + రయ | = | వాయువేగంతో |
| దవీయః | = | దూరంగా |
| ప్రేషిత | = | పంపబడిన |
| ఉద్యత్ | = | పైకి ఎగురుతున్న |
| ఛద | = | ఆకుల మీద |
| ఉత్ + అంచత్ | = | స్ఫుటంగా ఉన్న |
| కీటకృత వ్రణ | = | పురుగులు చేసిన (గాయాలు) గీతలనే |
| ఛలన | = | మిష గల |
| లిపి | = | వ్రాత చేత |
| ఆపాదిత | = | కలిగించిన |
| అధ్వన్య | = | బాటసారుల యొక్క |
| నిస్సంచార | = | సంచార రాహిత్యం వల్ల |
| ఆత్త | = | పొందిన |
| మహత్ + ఫల | = | ఉత్తమ పుణ్యఫలాలతో |
| ఉపమ | = | సాటిరాగల |
| ఫల | = | పండ్ల చేత |
| స్ఫాయత్ | = | విస్తరిస్తున్న |
| వట | = | వటం - మఱ్ఱి అనే పేరు గల |
| క్ష్మాజమున్ | = | భూమి నుండి పుట్టిన దానిని = చెట్టును |
| కాంచెన్ | = | చూశాడు. |

**తాత్పర్యం :**

ఆ భాగవతుడు దారిలో రెండు క్రోసులు నిడివి ఊడలు దిగి, ఆ ఊడలకే శాఖోపశాఖలు గల పెద్ద మఱ్ఱిచెట్టును చూశాడు. దాని ఆకులు రాలి వాయువేగానికి దూరంగా కొట్టుకొనిపోయి పైన ఎగురుతున్నాయి. అవి, ఇక్కడ బ్రహ్మరాక్షసుడున్నాడు, కనుక మీరు ఇటు రావద్దని బాటసారులకు చాటిచెప్పటానికి ఆ వృక్షం, ఆకులు అనే జాబుల మీద పురుగులు తొలిచిన గీతలనే అక్షరాలు

రాసి పంపిస్తున్నదో అన్నట్లుంది - అందువల్ల బాటసారులెవరూ అటువైపు సంచరించటం లేదు. అందుచేత ఆ వృక్షానికి వారిని కాపాడిన మహాపుణ్యఫలం దక్కింది. అందుకు నిదర్శనంగా అది పెద్ద పెద్ద పండ్లతో శోభిస్తున్నది. అటువంటి మహావటవృక్షాన్ని మాలదాసరి దర్శించాడు.

**విశేషాంశాలు :**

మాలదాసరి వ్యక్తిత్వానికి, బ్రహ్మరాక్షసుడి అస్థిత్వానికి ఆటపట్టు ఈ మఱ్ఱిచెట్టు. దాని ఫలాలు ప్రాణరక్షణ సుకృతానికి ప్రతిఫలాలనటం రాయల ధర్మరక్షణ చణత్వం. దాసరి కథలో రాయలు ఊహకు ఊసులు నేర్పాడు. ఈ పద్యంలో - ఇది దీర్ఘ సమాస భూయిష్టమై గౌడీరీతిలో సాగింది. రాకాసి నివాసభూమి కనుక తదనుగుణంగానే వర్ణింపబడింది.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| వైష్ణవుడు + అర్ధ యోజన = వైష్ణవుడర్ధయోజన | = | ఉత్వసంధి |
| ప్రేషిత + ఉద్యత్ = ప్రేషితోద్యత్ | = | గుణసంధి |
| శాఖా + అంచత్ = శాఖాంచత్ | = | సవర్ణదీర్ఘ సంధి |
| చరత్ + మరుత్ | = | అనునాసిక సంధి |
| మరుత్ + రయ = మరుద్రయ | = | జస్త్వసంధి |
| లిపి + ఆపాదిత = లిప్యాపాదిత | = | యణాదేశ సంధి |

**ఛందస్సు :**

శార్దూలం. గణాలు - మ స జ స త త గ గణాలు. యతి - 1-13 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| కాంచెన్వై | ష్ణవుడు | ర్ధయోజ | నజటా | ఘాటోత్థ | శాఖోప | శా |

**అలంకారం :**

1. ప్రాణాలు రక్షించిన మహాపుణ్యఫలాలో అన్నట్లుగా చెట్టు నిండా లెక్కలేనన్ని పండ్లు ఒప్పుతుండటం వల్ల ఉత్ప్రేక్ష.
2. ఘుణాక్షర న్యాయం ఉంది.

16. ఆ॥ కాంచి యాతడొక్క ........ గదిసి

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఆతడు | = | ఆ మాలదాసరి |
| కాంచి | = | ఆ మఱ్ఱిచెట్టును చూచి |
| అంతటన్ | = | అప్పుడు |
| కాలిత్రోవయున్ | = | కాలి బాటలోని |
| అందున్ | = | ఆ పాడుబడిన ప్రదేశంలో |
| తెఱవున్+కాంచిన+ఆది+అ | = | దారిగా దొరకటమే |
| పరమలబ్ధికాన్ | = | పరమ ప్రయోజనంగా |
| త్వరితంపుగతిన్ | = | వేగంగా |
| ఆ+వట+అవనీజమున్ | = | ఆ మఱ్ఱిచెట్టును |
| అంతన్+అంతన్+కదిసి | = | మెల్లమెల్లగా సమీపించి |

**తాత్పర్యం :**

మాలదాసరి ఆ వటవృక్షాన్ని జూచినంతలో అక్కడొక కాలిబాట కన్పించింది. ఆ ప్రాంతంలో ఆ దారి దొరకటమే మహాభాగ్యంగా భావించి అతి త్వరగా ఆ వృక్షాన్ని సమీపించాడు.

17. సీ॥ ఎలనీటి బొండలంబులువోలె ........ నరిగె యెదుట

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఎలనీటి | = | లేత నీరు గల |
| బొండలంబుల+పోలెన్ | = | కొబ్బరి బొండాల లాగ |
| మెదడు+ఎల్లన్ | = | మెదడు మొత్తాన్ని |
| జుఱ్ఱి | = | ఆస్వాదించి |
| వైచినన్ | = | పారవేయగా |
| డొల్లు పుఱ్ఱెగములున్ | = | దొర్లుతున్న మనుష్యుల పుఱ్ఱెల సమూహాలూ |
| ఎరచిగిరినన్ | = | మాంసాన్ని (పళ్లతో) గీరగా |
| జీరలు ఏర్పడన్ | = | ఆ గీరిన గీతలు స్పష్టంగా కనపడే రీతిగా |
| తుదముట్టన్ | = | చివరి వరకు |
| చీకిన | = | చప్పరించిన |
| నులు పచ్చి కీకసము | = | కొద్దిపాటి పచ్చిగల ఎముకలును |
| దొన దొన+అను+ఈగల తుట్టెలన్ | = | దొనదొన మని శబ్దం చేస్తూ ముసురుతున్న ఈగల తెట్టెల చేత |
| రూపు+ఏరుపడక | = | స్వరూపం కనబడకుండా |
| క్రంపలన్ | = | ముళ్లకంపల మీద |
| వ్రేలెడు గరుసులున్ | = | వ్రేలాడుతున్న పచ్చితోళ్లను |
| ధూళ్లన్ | = | ధూళి సమూహంతో |
| మక్కు+ఎక్కి | = | మక్కుడు పట్టి |
| మంగళ్ల | = | మంగలి వాళ్లు గొరిగిన |
| తిప్పలు | = | వెంట్రుకల కుప్పలు |
| రేగు వడువునన్ | = | ఎగసి అంతటా వ్యాపించేరీతిగా |
| గాలిన్ | = | గాలిలో |
| ఆడెడు వెఱకలున్ | = | ఎగురుతున్న వెంట్రుకలూ |
| తునిసిన | = | తెగిపోయిన |
| నర+అంగకములున్ | = | మానవ అవయవాలూ |
| పొత్తులన్+కమిచిపోక | = | కలసి మెలసి నోట పట్టుకొని పోకుండా |
| ఒండొంటితోన్ | = | ఒకదానితో ఒకటి |
| పెఱునీకులాడు | = | కాట్లాడుకొంటున్న |
| శ్వాపదంబులున్ | = | కుక్కల గుంపులూ |
| పదహతిన్+వ్రస్సి | = | కాలితాపుల చేత నలిగి |
| వలుచు | = | కంపుకొడుతున్న |

| | | |
|---|---|---|
| వరుగున్ | = | ఎండిన మాంసపు ముక్కలూ |
| తఱచు+అగు | = | దట్టంగా ఉన్న |
| ముఱు+త్రోవన్ | = | మాంసం మురిగి పోయి ఉన్న దారిలో |
| అరిగె | = | ప్రయాణించాడు |
| ఎదుటన్ | = | (అప్పుడు) తన ఎదురుగా |

**తాత్పర్యం :**

ఆ బ్రహ్మరాక్షసుడనేక మందిని పట్టి చంపేవాడు. అందువల్ల ఆ ప్రదేశంలో మెదడును జుర్రివేయగా మిగిలిన కపాలాలూ, మాంసాన్ని నోటితో పట్టి పళ్లతో గీరి తిని పారవేసిన ఎముకలూ, శరీరం నుండి ఒలిచి కంపల మీద వేసినప్పుడు ఈగలు మూగి రూపం కనరాకుండా ఉన్న చర్మాలూ ఉన్నాయి. మరణించినవారి తల వెంట్రుకల కుప్పలు గాలికి రేగినట్లు ఎగిసి వ్యాపిస్తున్నాయి. విరిగి పోయిన మానవ శరీర భాగాల్ని కుక్కలు కలసి కట్టుగా గొని పోకుండా ఒక దానితో ఒకటి పోట్లాడు కుంటున్నాయి. కాళ్లతో తన్నిపట్టి ముక్కలు చేసిన మాంసఖండాలు వరుగులుగా ఎండవేసి ఉన్నాయి. ఇటువంటి భీభత్స రసాస్పదమైన మార్గంలో మాలదాసరి ప్రయాణిస్తున్నాడు.

18. సీ॥ ముంగాళ్ల జాగి ........ సంశయించు వేళ

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ముంగాళ్లన్ | = | ముందరికాళ్ల మీద |
| సాగి | = | ముందుకు వంగి |
| పైన్ | = | (చెట్టు) మీదికి |
| ప్రుచ్చు చూపులు పర్వన్ | = | దొంగ చూపులు చూస్తూ |
| బొమికలు | = | ఎముకల్ని |
| ఎత్తుచున్ | = | నోట కరచి |
| పారిపోవు శునులన్ | = | పరుగిడుతున్న ఆడ కుక్కలతోనూ |
| పలల తోరణములు | = | మాంసపు పోగులు గుచ్చిన తోరణాలను |
| పట్టి | = | కాళ్లతో పట్టుకొని |
| బిట్టు | = | తటాలున |
| ఎగయన్ | = | ఎగిరి పోతున్నప్పుడు |
| శాఖా ధూతిన్ | = | కొమ్మలు తగలటం వల్ల |
| ఎగయు | = | పుడుతున్న |
| కంకముల రొదలన్ | = | గద్దల అరుపుల చేతనూ |
| అడ్డంబు తిరిగి | = | ఆ బ్రహ్మ రాక్షసుడికి అడ్డం తిరిగి |
| తల+ఆహతిన్+పడి | = | వాడి అరచేతి దెబ్బను తిని |
| రొండిన్ | = | నడుముల మీద |
| హస్తంబులు+ఇడి | = | చేతులు పెట్టుకొని |
| అంగలార్చు కపులన్ | = | ఏడుస్తున్న కోతులతోనూ |
| డబ్బాటుమైన్ | = | ఆకస్మికంగా |
| ఒక్క యెడన్ చూపి | = | ఒక ప్రక్క కనిపించి |

| | | |
|---|---|---|
| అవి | = | ఆ ప్రదేశాలు |
| మాయన్ | = | టక్కుచేత |
| అడగన్ | = | కనుపించకపోగా |
| వేఱు+ఎడన్ | = | మరొక దిక్కున |
| చూపు | = | కనబరుస్తున్న |
| వ్యాపృతులను | = | పనులచేతనూ |
| ఇందున్ | = | ఈ ప్రదేశంలో |
| ఎవ్వడో+ఒక్కడు+ఉన్నాడు | = | ఎవడో ఒకడు ఉన్నాడు, వాడు |
| నరుడుగాడు | = | మానవమాత్రుడు కాడు |
| ఇంధన | = | వంట కట్టెలు |
| ఆదిగ | = | మొదలైన వాటియొక్క |
| ఆహరణమునకున్ | = | తెచ్చుకొనేందుకు |
| వేళయును కాదు | = | సమయం కూడా కాదు |
| పొలగాలి వీచె | = | మాంసపు వాసనతో గాలి తోలింది |
| తెఱువున్+ఎడవు | = | దారి కూడ చాల దూరం |
| అనుచున్ | = | అని తలపోస్తూ |
| జాలిగొని | = | బాధ పడి |
| సంశయించువేళన్ | = | సందేహిస్తున్నప్పుడు |

(అలం = స్వభావోక్తి) (అనుమానం)

**తాత్పర్యం :**

ఆ మర్రిచెట్టు దగ్గర ఆడ కుక్కలు దొంగ చూపులతో ముందరి కాళ్లు పైకిసాచి ఎముకల్ని నోట కరచుకొని పారిపోతున్నాయి. తోరణాలుగా కట్టిన మాంస ఖండాల్ని గద్దలు అపహరించుకొని తటాలున ఎగసిపోతున్నాయి. ఆ ప్రయత్నంలో చెట్ల కొమ్మలు తగలి బాధతో రొద పెడుతున్నాయి. కొమ్మల మీది కోతులు బ్రహ్మరాక్షసుడి అరచేతి దెబ్బలు తిని రెండు చేతులనూ నడుముల మీద పెట్టుకొని రోదిస్తున్నాయి. ఉన్నట్టే ఉండి చెట్టున కొన్ని తావులు కొద్దిసేపు కనిపిస్తూ మరి కొద్దిసేపు అదృశ్యమై పోతూ ఏవేవో క్రియలు జరుగుతున్నాయి. ఈ దృశ్యాల్ని చూచిన ఆ దాసరి ఈ చెట్టు మీద మానవేతరుడెవడో ఉన్నాడని తనలో భావించాడు. ఒకవేళ ఆకులు కట్టెలు తీసికొని పోవడానికి ఎవడైనా వచ్చాడా అని అనుమానించాడు. కాని అందు కిది వేళ కాదని, పైగా మాంసపు గాలి వీస్తున్నదని సంశయించాడు.

అలంకారం - (1) స్వభావోక్తి, (2) అనుమాన.

19. సీ॥ మృతమర్త్య ........ కచంబు వాని

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| మృతమర్త్యున్ | = | మరణించిన మనుష్యుని |
| రెంటానన్ | = | గోచిగా |
| ఇడ్డన్ | = | పెట్టుకొనగా |
| చాలక | = | చాలనందువల్ల |

| | | |
|---|---|---|
| నెత్తురంజిల్లు | = | నెత్తురంటి ఉన్న |
| పెను బొడ్డన్ | = | పెద్ద బొడ్డు మీద |
| ముంజి వానిన్ | = | మొలత్రాడు కలవాడిని |
| పల్ల చీమలన్ | = | ఎర్ర చీమలతో |
| వక్ర భల్లాతకితలు పోలెన్ | = | వంకర తిరిగిన జీడి చెట్టు లాగా |
| ఎఱ్ఱి దుప్పటిన్ | = | ఎర్రటి దుప్పటితోనూ |
| ఒప్పు | = | అతిశయిస్తున్న |
| కఱ్ఱి వానిన్ | = | నల్లటి దేహంగల వాడిని |
| వ్యత్యస్త | = | తల్లక్రిందులైన |
| హస్తిమస్త | = | ఏనుగు తల యొక్క |
| ఆభన్ | = | తీరుతో |
| పాయ+అగు గడ్డమున్ | = | పాయలు దేరిన గడ్డమూ |
| దంష్ట్రికలన్ | = | కోరలతోనూ |
| పొల్చు మొగము వానిన్ | = | ఒప్పుతున్న ముఖం కలవాడిని |
| కడుఁదుర్ల | = | కణుదురు ఈగల |
| నిడుత్రుట్టెగతిన్ | = | పొడవైన తుట్టెలాగా |
| చోగలన్ | = | సంతలో |
| పాండురత | = | తెల్లదనము |
| మించు | = | అతిశయిస్తున్న |
| కపిల కూర్చంబు వానిన్ | = | గోరోచన వర్ణంలో ఉన్న కనుబొమల మధ్య భాగం కలవాడునూ |
| ఎఱకున్ | = | తన తిండి కోసం |
| తెఱువరిన్ కనన్ | = | బాటసారి రాక కోసం చూడటానికి |
| శాఖ లెక్కన్ | = | చెట్టు కొమ్మలను ఎక్కుతుండగా |
| జాఱు | = | క్రిందికి జాఱిపోతున్న |
| ప్రేవు జందెంబున్ | = | ప్రేవులతో చేసిన జన్నిదాన్ని |
| కసరి | = | కోపించి |
| పైన్ | = | భుజము మీదికి |
| పెట్టు వానిన్ | = | త్రోసికొనే వాడిని |
| వ్రేలుడు+అగు | = | వ్రేలాడుతున్న |
| బొజ్జగల | = | బొర్రవున్న వాడిని |
| బూర కాలి వానిన్ | = | ఏనుగు కాళ్ల వాడిని |
| చెంబు తల వానిన్ | = | చెంబు లాగా నున్నగా ఉన్న బట్టతల వాడిని |
| అవటు | = | ముచ్చెన గుంటలో |
| కచంబు వానిన్ | = | వెంట్రుకలు కలవాడిని |

(బ్రహ్మ రాక్షసుడి వర్ణన - స్వభావోక్తి)

**తాత్పర్యం :**

మరణించిన మానవుని కౌపీనంగా ధరించటంతో అది పొడవు చాలక బిగుతైంది. అప్పుడు రక్తమోడుతున్న బొడ్డు మీద మొలత్రాడు గలవాడును ఎర్రచీమలు పట్టిన వంకర జీడి మామిడి చెట్టులాగ, ఎర్రటి దుప్పటి కప్పుకున్న నల్లని దేహం వాడును, తలక్రిందులైన ఏనుగు తలలాగ ఉన్న గడ్డాలు మీసాలు గలవాడును, పెద్ద పెద్ద కోరలతో ఉన్న ముఖంగలవాడును, కందిరీగల గుంపులాంటి కనుబొమలు కలవాడును, తన ఆహారం కోసం ఎవరైనా బాటసారులు వస్తున్నారేమోనని చెట్టెక్కి చూస్తున్న వాడును, చెట్టెక్కుతున్నప్పుడు జారిపోతున్న ప్రేవుల జన్నిదాన్ని భుజం మీదికి ఎగద్రేసుకుంటున్న వాడును, వ్రేలాడుతున్న పెద్ద బొజ్జగలవాడును, ఏనుగు కాళ్లవాడును, చెంబులాంటి పెద్ద బట్ట తల గల వాడును ముచ్చెన గుంటలో వెంట్రుకలు కలవాడును అయిన బ్రహ్మరాక్షసుడిని మాలదాసరి చూచాడు.

20. తే॥ కండ కన్నుల ........ గనియెన్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| కండ కన్నుల వానిన్ | = | కండలు పెరిగిన కళ్లు గలవాడూ |
| ఆకటన్ | = | ఆకలితో |
| బేతాళికలన్ | = | ఆడ పిశాచాలను |
| సారెకున్ | = | మాటి మాటికీ |
| బండ బూతులన్ | = | పచ్చి బూతులు |
| తిట్టు వానిన్ | = | తిడుతున్నవాడూ |
| నగ గరిమ వానిన్ | = | కొండంత బరువు గలవాడు |
| కుంభ జానువు+అను | = | కుండల వంటి మోకాళ్లు గలవాడు అనే |
| అన్వర్థనామున్ | = | సార్థక నామధేయుడిని |
| ఒక్క ద్విజ నిశాచరునిన్ | = | ఒక బ్రహ్మ రాక్షసుడిని |
| కనియెన్ | = | చూచాడు |

**తాత్పర్యం :**

కండలు పెరిగిన కళ్లతో, ఆకటి బాధతో ఆడ పిశాచాలను మాటి మాటికి బండ బూతులు తిడుతున్న వాడిని, కొండంత బరువు గలవాడిని కుండల వంటి మోకాళ్లు ఉండటం వల్ల కుంభ జానుడనే అన్వర్ధ నామధేయంగల ఒక్క బ్రహ్మరాక్షసుడిని మాలదాసరి చూచాడు.

21. ఉ॥ వాడును ........ వీడు నుద్ధతిన్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| వాడును | = | ఆ బ్రహ్మరాక్షసుడు |
| కంటిన్+పోకుము+అని | = | నేను చూచాను ఇక పోవద్దని |
| మహీరుహపాళిన్ | = | వృక్ష సమూహాల్ని |
| నుగ్గుగాన్ | = | శిథిల మయ్యేట్లుగా |
| వ్రాలెన్ | = | దుమికాడు |
| వీడును | = | ఈ మాలదాసరి కూడ |

| | | |
|---|---|---|
| మున్ను | = | ఇంతకుముందు |
| రే పగటి వేళకున్ | = | రేయిం బగళ్లకు |
| మానిసి+ఔటన్ | = | తగిన వీరుడు కావటం వల్ల |
| పోరిలోన్ | = | యుద్ధంలో |
| వాడిమిన్ | = | మగటిమితో |
| కొంతకాలము | = | కొన్నాళ్లు |
| ఇలన్ | = | భూమిలో |
| వ్రాలుటన్ | = | ప్రసిద్ధి పొందటం వల్ల |
| లావరి+ఔటన్ | = | బలమువాడవటం చేతనూ |
| నిల్చి | = | ఎదిరించి |
| ఆ+వాడి శరంబుచేన్ | = | చేతి బాణంతో |
| అడుపన్ | = | కొట్టగా |
| వాడు | = | ఆ రాక్షసుడు |
| ఆది త్రుంపుడు | = | ఆ బాణాన్ని ఖండించగా |
| వీడును | = | ఈ దాసరి కూడ |
| ఉద్ధతిన్ | = | దర్పంతో |

**తాత్పర్యం :**

ఆ బ్రహ్మరాక్షసుడు మాలదాసరిని చూచి నీవు నా కంటబడ్డావు. ఇక పారిపోవద్దంటూ వృక్షాలన్నీ నుగ్గయ్యేలా క్రిందికి దూకాడు. ఆ దాసరి కూడ బలశాలి కనుక, రాత్రనక పగలనక పూర్వం యుద్ధంలో పనిచేసిన వీరుడు కనుక, తన చేతిలోని జోడమ్ముతో రాక్షసుడిని పొడిచాడు. రాక్షసుడా బాణాన్ని ఒడిసి పట్టి ఖండించాడు. ఆ దాసరి కూడ రాక్షసుడికి ఎదురొడ్డి నిలబడ్డాడు.

22. సీ॥ తిగిచిన యడుగులు ........ యతడు

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| తిగిచినన్ | = | పడలాగి నప్పటికీ |
| అడుగులు | = | తన పాదాల్ని |
| తెమలక | = | కదలనీక |
| ఱొమ్ము+అప్పళించి | = | రొమ్ముమీద చరచికొని |
| అవ్వలికిన్ | = | అవతలకు |
| కేడంచి | = | తొలగి |
| దాటి | = | లంఘించి |
| చఱచినన్ | = | రాక్షసుడు తనను కొట్టగా |
| వంచించి | = | ఉపాయంతో తప్పించుకొని |
| చరమ భాగమునకున్ | = | వాడి వెనుక వైపునకు తిరిగి |
| తత్క్రియన్ | = | వాడు చేసే పనికి |

| | | |
|---|---|---|
| అగుదృష్టిన్ | = | అవసరమయ్యే చూపును |
| నిలిపి | = | వాని వైపు ఉంచి |
| పైన్+వడ్డన్ | = | తన మీద పడగా |
| చనుమర పట్లకున్ | = | రొమ్ము మీదికి (చనుల నలుపులు ఉండే తావు) |
| ఒడ్డుచునుండు పిడికిళ్ల బలిమిన్ | = | గురిపెట్టిన తన పిడికిలి బలంతో |
| లోబడక | = | రాక్షసుడికి తగ్గకుండా |
| నిలిచి | = | నిలబడి |
| చొరజూడన్ | = | చొచ్చుకొని రావటానికి రాక్షసుడు ప్రయత్నించగా |
| క్రుంగి | = | వంగి |
| తిరిగిన బోన తిరిగి | = | వాడెటుతిరిగితే అటు తిరిగి |
| అసుర | = | రాక్షసుడు |
| వధసాధనమున్ | = | మారణాయుధం కోసం |
| రోయునప్పుడు | = | వెతుకునప్పుడు |
| గ్రుద్ది | = | పిడికిలితో కొట్టి |
| తాచి | = | తన్ని |
| తిరిగినన్ | = | వాడు వెనుకకు తిరుగగానే |
| కృతముష్టిన్ | = | పిడికిలి బిగించి |
| దండన్ నిలిచి | = | సమీపాన నిలబడి |
| ఎడకొలది | = | సందు దొరకినప్పుడు |
| వెన్క నడకన్ | = | వెనుకకు తగ్గుతూ |
| ఒయ్యన్ | = | వీలువెంట |
| అడచి | = | కొట్టి |
| మత్+పదస్మృతిన్ | = | నా పద ధ్యానంతో |
| ఆత్మన్ | = | మనస్సులో |
| ఏమరక | = | మరచిపోకుండా |
| అతడు | = | ఆ దాసరి |

**తాత్పర్యం :**

బ్రహ్మరాక్షసుడు తనను పడలాగి నప్పటికీ దాసరి కదలలేదు. పైగా వాడి రొమ్ముమీద బాది పక్కకు తప్పుకున్నాడు. రాక్షసుడు తనను చేతితో చరచబోగా ఉపాయంతో తప్పుకున్నాడు. వాడి కదలికలను గమనిస్తున్నాడు. వాడికి చిక్కకుండా వాడెలా తిరిగితే తానూ అలాగే తిరిగాడు. వాడు మారణాయుధం కోసం వెతుకుతున్నప్పుడు వాడి వీపు మీద నడుం మీద పిడి గుద్దులు కురిపించి వాడిని త్రోసి తప్పించుకో చూచాడు. ఈ ప్రయత్నంలో దాసు నా పద ధ్యానం మాత్రం మరచిపోలేదు.

23. త్రోచిన బోజూడ ........ బట్టుకొనుడు

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| త్రోచిఁబోజూడన్ | = | (దాసరి) త్రోసికొని పోవటానికి ప్రయత్నించగా |

| | | |
|---|---|---|
| రాక్షసీచయంబున్ | = | రాక్షస స్త్రీలందరినీ |
| చీరినన్ | = | పిలువగా |
| వారు డిగ్గి | = | వారు చెట్టు దిగి |
| ఏగుదేరన్ | = | రాగా |
| పోయెన్+అదె | = | అదిగో పోతున్నాడు |
| రారె రారే+అటంచున్ | = | రండి రండి అంటూ |
| పాఱి | = | పరిగెత్తి |
| తానును | = | కుంభజానుడునూ |
| వారును | = | ఆడ పిశాచాలూ |
| పట్టుకొనుడున్ | = | పట్టుకోగా |

**తాత్పర్యం :**

దాసరి పారిపోవటానికి ప్రయత్నించాడు. వెంటనే రాక్షసుడు తన రాక్షసీ గణాన్ని రండి రండని బిగ్గరగా పిలిచాడు. వాడు పారిపోతున్నాడు పట్టుకొండని హెచ్చరించాడు. అందరూ కలసి దాసరిని వెన్నంటి పట్టుకొన్నారు.

24. కం॥ పెంబోతద్దాసరి ........ డిట్లనియెన్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| పెన్+పోతు+అగు | = | బలిసిన వాడైన ఆ దాసరి |
| అప్డున్ | = | అప్పుడు గూడ |
| పదహతులన్ | = | కాలి తన్నులతోనూ |
| కపోణి పోటులన్ | = | మోచేతి పోట్లతోనూ |
| ఇరు+మైలను | = | రెండు ప్రక్కలను |
| పొడుచుచున్ | = | పొడుస్తూ |
| పెనగుచున్ | = | లాగికొంటూ |
| పోవన్ | = | పోగా |
| పట్టి | = | ఆ దాసరిని పట్టుకొని |
| వటంబుఁజేర్చి | = | మర్రిచెట్టు వద్దకు తీసుకువెళ్లి |
| ఆవాడు | = | ఆ రాక్షసుడు |
| ఇట్లనున్ | = | ఈ విధంగా అన్నాడు |

**తాత్పర్యం :**

మాలదాసరి బలవంతుడవటం చేత, ఆ రాక్షసుడిని తన కాళ్లతో తంతూ మోచేతులతో ఆతడి ప్రక్కలను కుమ్ముతూ పెనగులాడుతూ పోతున్నాడు. అయినా రాక్షసుడు దాసరిని పట్టుకొని మర్రిచెట్టు వద్దకు చేర్చి ఇలా అంటున్నాడు.

25. శా॥ సారాస్వాదనఁ బ్రాణపంచకము తృష్ణంబాసి సంతర్పణ
న్మారింబో నసిఁ ద్రుంచి పొంగెడు భవన్మండాగ్రధారోష్మ మిం
పారం గ్రోలి, పిశాచి నీదు కఱకుట్లందీ, నదస్త్రాల కాం
తారాంతర్న్బు కపాలకుండ విగళన్మెరేయముం గ్రోలెదన్.

**కవి - కావ్యం :**

ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడూ శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది.

**సందర్భం :**

దారితప్పిన మాలదాసరి బ్రహ్మరాక్షసుడున్న వటవృక్షాన్ని సమీపించాడు. అప్పుడు మాలదాసరి బ్రహ్మరాక్షసుల మధ్య సాగిన సమరానంతర సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| సార + ఆస్వాదన | = | కమ్మని (నీ క్రొవ్వును) త్రాగి |
| తృష్ణన్ + పాసి | = | దప్పిక తీర్చుకొని |
| ప్రాణపంచకము | = | నా పంచప్రాణాలూ |
| మూరిన్ + పోన్ | = | అతిశయించేలాగా |
| పొంగిన | = | పొగరెక్కిన |
| భవత్ + ముండంబు | = | నీ బోడి తలను |
| అసిన్ | = | ఖడ్గంతో |
| త్రుంచి | = | ఖండించి |
| అస్ర + ధారా + ఊష్మ | = | కవోష్ణ రక్తధార యొక్క వెచ్చదనం |
| ఇంపారన్ | = | ఇష్టంగా |
| క్రోలి | = | త్రాగి |
| పిశాచి | = | (నా భార్య అయిన) ఆడదయ్యం |
| నీదు | = | నీయొక్క |
| కఱకుట్లు | = | కఱ్ఱుకు గుచ్చి కాల్చిన మాంసపు ముక్కలను |
| అంది + ఈన్ | = | అందిస్తుండగా |
| అదః | = | ఈ సమీపంలోని |
| తాలకాంతార | = | తాటితోపు |
| అతః | = | లోపల ఉన్న |
| నృ-కపాల | = | మానవుల పుఱ్ఱెలు అనే |
| కుండ | = | దుత్తలలో నుంచి |
| విగళత్ | = | జాలువారుతున్న |
| మైరేయమున్ | = | తాటికల్లును |
| క్రోలెదన్ | = | ఆస్వాదిస్తాను |

**తాత్పర్యం :**

ఓ మాలదాసరీ! పొగరెక్కిన నీ బోడి తలను నా ఖడ్గంతో తెగనరుకుతాను. నీ మొండెం నుండి స్రవించే కవోష్ణ రక్తాన్ని ఆస్వాదిస్తాను. నా పంచప్రాణాలకూ సంతర్పణ చేస్తాను. నీ మాంసఖండాలను నా పిశాచి పెళ్లాం కరకుట్లుగా కాల్చి అందిస్తుంది. వాటిని నంజుకుంటూ, ఇక్కడి తాటితోపులో దుత్తలుగా వ్రేలాడుతున్న మానవ కపాలాల నుండి స్రవిస్తున్న కల్లును తనివితీర

త్రావుతాను.

**విశేషాంశాలు :**

బ్రహ్మరాక్షసుడి ఆహార కాంక్ష రాక్షసానందానికి సంకేతం. ఇది బీభత్స భావన. దానికి తగిన ఓజోగుణం రచనలో సరినడలు నడిచింది. ప్రాణపంచకాలు = ప్రాణ, వ్యాన, అపాన, సమాన, ఉదాన.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| సార + ఆస్వాదన = సారాస్వాదన | = | సవర్ణదీర్ఘసంధి |
| భవత్ + ముండంబు = భవన్ముండంబు | = | అనునాసిక సంధి |
| అదః + తాల = అదస్తాల | = | విసర్గ సంధి |
| నీదు | = | దుగాగమ సంధి |
| నృ కపాల | = | షష్ఠీ సమాసం |
| అంది + ఈన్ | = | ఇది శబ్దపల్లవం, క్వార్థేకార సంధి |

**ఛందస్సు :**

శార్దూలం. గణాలు - మ స జ స త త గ. యతి - 1-13 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
|---|---|---|---|---|---|---|
| సారాస్వా | దనప్రా | ణపంచ | కముత్స | ష్ణంబాసి | సంతర్ప | ణం |

**అలంకారం :**

పరిణామాలంకారం.

'కపాలకుండ విగళన్మైరేయము' అనే వాక్యంలో విషయి విషయతా పరిణామాన్ని పొంది క్రియతో కలసి ఉంది.

26. కం॥ నన్నింతలయించిన ........ నవ్యక్తోక్తిన్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| నన్నున్+ఇంత+అలయించిన | = | నన్ను ఇంతగా అలసట పెట్టిన |
| బాలున్+నిన్నున్ | = | దుష్టుడివైన నిన్ను |
| ఋజువిధిన్ | = | తిన్ననైన రీతిలో |
| వధింతును+ఎ+అని | = | సంహరిస్తానా అని అంటూ |
| ఆర్పుల్ | = | అరుపులు |
| మిన్నందగా | = | మిన్ను ముట్టేలాగా |
| బుసకొట్టుచున్ | = | నిట్టూర్పులు విడుస్తూ |
| ఆ+నీచుడు | = | నీచుడైన ఆ రాక్షసుడు |
| పొగరు వెలువడన్ | = | అహంకారం వెల్లడయ్యేలాగా |
| అవ్యక్త+ఉక్తిన్ | = | అస్పష్టమైన మాటలతో |

**తాత్పర్యం :**

నన్నింతగా బాధపెట్టావు కాబట్టి నిన్ను తిన్నగా చంపను. చిత్రవధ చేస్తానంటూ, అరుస్తూ కోపంతో బుసలు కొడుతున్నాడు

బ్రహ్మరాక్షసుడు. ఆ పాపాత్ముడలా అలసిపోవటంచేత అరవటంచేతా అస్పష్టంగా ఇంకా ఏదో అంటున్నాడు.

27. తే॥ అసియు బాత్రియు ........ నాతండు వలికె

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అసియున్+కత్తినీ పాత్రియున్ | = | (రక్తాన్ని పట్టడానికి) పాత్రనూ |
| తేన్ | = | తేవటానికి |
| పంచి | = | ఆజ్ఞాపించి |
| ఆంత్రవల్లిన్ | = | తీగ వంటి ప్రేవుతో |
| కోలగగ్గరన్ | = | పశువును కట్టి త్రోసే సాధనంతో లాగి కట్టి |
| త్రోయన్ | = | పడత్రోయగా |
| ఆ+కుజము+తోడన్ | = | ఆ మర్రి చెట్టు మీదికి |
| ఒరిగి | = | తూలిపోయి కూడా |
| దైన్యవిరహితముగ | = | అధైర్యపడకుండా |
| ధర్మము+ఎరిగించు+సు+ఉక్తిన్ | = | ధర్మాన్ని తెలిపే మంచి మాటను |
| పలికెన్ | = | తెలిపాడు |

**తాత్పర్యం :**

ఆ బ్రహ్మరాక్షసుడు దాసరిని సంహరించడానికి ఖడ్గాన్ని, రక్తాన్ని పట్టడానికి పాత్రను తెమ్మని ఆడ పిశాచాలను ఆజ్ఞాపించాడు. దాసరిని ప్రేగు తాళ్లతో కట్టి కోలగగ్గరతో లాగ పడవేశాడు. దాసరి చెట్టు మీదికి పడిపోయాడు. అయినా ధైర్యాన్ని కోల్పోలేదు. దైన్యాన్ని పొందలేదు సరికదా! ధర్మ సూక్తులను చెప్పాడు బ్రహ్మరాక్షసుడికి.

28. చ॥ వినుమొకమాట రాత్రిచర, వేగిరమేటికి? నిన్ జయింతురే
యనిమిషులైన? భాజన గతాన్నము నేనిక నెందుఁ బోయెదన్?
బెనఁగక ప్రాణరక్షణ ముపేక్ష యొనర్చుట పాప, మిందుకై
కనలకు, నాకు మేనియెడఁ గాంక్షయు లేదిది వోవుటే యురున్.

**కవి - కావ్యం :**

సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది.

**సందర్భం :**

మాలదాసరిని బ్రహ్మరాక్షసుడు వటవృక్షానికి కట్టి సంహరించటానికి ఉద్యుక్తుడైన సమయంలో మాలదాసరి ధర్మోపదేశం చేసిన సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| రాత్రి చర | = | ఓ రాక్షసుడా! |
| వినుము + ఒక మాట | = | నా మాట ఒకటి విను |
| వేగిరము + ఏటికి | = | తొందరెందుకు |

| | | |
|---|---|---|
| అనిమిషులు + ఐనన్ | = | దేవతలే అయినా |
| నిన్ + జయింతురు + ఏ | = | నిన్ను గెలువగలరా? |
| నేన్ | = | నేను |
| భాజనగత + అన్నము + ఆ | = | కంచంలోని భోజనాన్ని |
| ఇకన్ | = | ఇకమీద |
| ఎందు + పోయెదన్ | = | ఎటు పోగలను, కానీ |
| ప్రాణరక్షణము | = | ప్రాణాన్ని కాపాడటం కోసం |
| పెనగన్ | = | పోరాడకుండా |
| ఉపేక్ష + ఒనర్చుట | = | మిన్నకుండుట |
| పాపము | = | పెద్ద తప్పు (ఇందువల్ల నేను పోరాడాను) |
| ఇందుకై | = | ఈ కారణంగా |
| కనలకు | = | నామీద కోపించవద్దు |
| నాకున్ + మేని + ఎడన్ | = | నాకు దేహం పట్ల |
| కాంక్షయు లేదు | = | కోరిక కూడా లేదు |
| ఇది | = | ఈ శరీరం |
| పోవుట + ఏ | = | నశించటమే |
| ఉరున్ | = | మంచిది |

**తాత్పర్యం :**

ఓ నిశాచరా! ఓ బ్రహ్మరాక్షసుడా! నా మాట ఒకటి విను. తొందరపడతావెందుకు. దేవతలు కూడ నిన్ను యుద్ధంలో జయింపలేరు. ఇక నేనెంత? నీకు నేను కంచంలోని అన్నాన్ని. ఇంక నేనెక్కడకి పోతాను. దేహ రక్షణ కోసం పెనగకుండా ఉపేక్షించటం మహాపాపం. అందువల్ల నేను పోరాడాను. ఇందుకోసం నన్ను కోపించవద్దు. నాకీ దేహం మీద మమకారం లేదు. ఇది నశించటమే ఉత్తమం.

**విశేషాంశాలు :**

వడ్డించిన విస్తరి అనే తెలుగు జాతీయం భాజనగతాన్నంగా సంస్కృతీకరింపబడింది. దేహ రక్షణ పట్ల ఉపేక్ష తగదని, అంత మాత్రాన దేహభ్రాంతి పనికిరాదని పలికిన మాలదాసరి హితోక్తి వైదికోక్తి.

రాత్రించరులు = రాక్షసులు; అనిమేషులు = రెప్పపాటు లేనివారు - దేవతలు.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| భాజనగత + అన్నము = భాజనగతాన్నము | = | సవర్ణదీర్ఘసంధి |
| మేని + ఎడన్ + కాంక్ష = మేనియెడన్ కాంక్ష | = | యడాగమ, ద్రుత ప్రకృతిక సంధులు |
| ప్రాణి రక్షణము + ఉపేక్ష | = | ఉత్వసంధి |

**ఛందస్సు :**

చంపకమాల. గణాలు - న జ భ జ జ జ ర. యతి - 1-13 అక్షరాలు. ప్రాస నియమం ఉంది.

I I I  I U I  U I I  IUU  I U I  I U I  U I U
వినుమొ కమాట రాత్రిచ రవేగి రమేటి కినిన్జ యింతురే

**అలంకారం :**

లోకోక్తి అలంకారం.

'భాజనగతాన్నము' అనే లోకోక్తి ప్రయోగం ఉండటం చేత లోకోక్తి అలంకారం.

29. ఆ॥ హీన జన్మమరుట ........ పరముగొనుట

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| హీనజన్మము | = | చండాల జన్మం |
| అఱుట | = | నశించటం |
| ఎవ్వడేన్ | = | ఎవడైనా |
| ఒక ప్రాణి | = | ఒక జీవి |
| సంతసిలుట | = | సంతోషించుటం |
| ముక్తిపొంత కనుట | = | ముక్తిని పొందటం |
| మేలు+ఎ+కాదు+ఎ | = | మంచిదే కదా |
| నశ్వరపు దేహము | = | అశాశ్వతమైన ఈ శరీరం |
| అమ్మి | = | వెల పుచ్చుకొని |
| పరమున్+కొనుట | = | మోక్షాన్ని పొందటంలో |
| శిబి+అ | = | శిబి చక్రవర్తి మాత్రమే |
| మేల్బంతి కాదే | = | ఆదర్శం కదా! |

**తాత్పర్యం :**

నా దేహాన్ని నీ కాహారంగా అర్పించటం చేత నాకు చాల మేలు కలుగుతుంది. ఎలాగంటే, ఈ చండాల జన్మం తొలగి పోతుంది. ఒక ప్రాణి కడుపునిండి సంతోషిస్తుంది. నాకు మోక్షం వస్తుంది. ఇటువంటి విషయంలో డేగ కోసం, పావురానికి బదులుగా ఆహారంగా తన దేహాన్ని కోసి యిచ్చిన శిబి చక్రవర్తి ఉత్తమోదాహరణం కదా!

(అలం : అర్థాంతరన్యాసం - పరివృత్తి - అప్రస్తుత ప్రశంస)

30. చం॥ తెవులయినన్ ........ బ్రోచుటొప్పదే

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| తెవులు+అయినన్ | = | వ్యాధి అయినా |
| గ్రహంబు+అయిన | = | పిశాచమైనా |
| తేలు+ఐనన్ | = | తేలయినప్పటికీ |
| గరము+ఐన | = | విషమైనా |
| ఆత్మ+పెన్+తెవులు+అయిన | = | పెద్ద మనోవ్యాధి అయినా |
| జలంబు+అయినన్ | = | నీరే అయినా |
| తెక్కలి+అయిన | = | చోరుడైనా |

| | | |
|---|---|---|
| మృగ+అగ్నులు+ఐన | = | మృగమైనా, అగ్ని అయినా |
| మేల్+తవులు+అయిన | = | పరదారా లంపటమైనా |
| వ్రణంబు+అయిన | = | పుండయినా |
| త్రాచు+అయిన | = | పామైనా |
| పిడుగు+ఐన | = | పిడుగే అయినా |
| తీర్చు | = | చంపునట్టి |
| పేలవ తనువు | = | దుర్బల శరీరం |
| ఊరక+ఏ | = | నిష్ప్రయోజనంగా |
| చెడక | = | చెడిపోక |
| ఇలన్ | = | భూమి మీద |
| కృశున్ | = | ఆకలితో అలమటించే |
| ఒక్కనిన్ | = | ఒక ప్రాణిని |
| ప్రోచుటన్+ఒప్పదు+ఏ | = | రక్షింప దగదా? |

**తాత్పర్యం :**

రకరకాల రోగాలతోనూ, వ్యసనాలతోను ప్రాకృతిక ప్రమాదాలతోను ఈ శరీరాన్ని నశింపనీయ వద్దు. ఆకలి గొన్న ఒక్క ప్రాణిని తృప్తిగా ఆహారంగా చేయటం మంచిది కదా! ఒక ప్రాణి సంతోషిస్తుంది - అని దాసుడు రాక్షసుడితో అన్నాడు.

31. వ॥ అది యట్లుండె ........ సురద్రోహి యిట్లనియె

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| మాధ్యస్థంబకాన్ | = | మధ్యవర్తి మాటుగా |
| వృక | = | తోడేలు |
| శరారువులు | = | ఘాతుక మృగాలు |
| తిర్యక్కులు | = | పశువులు, పక్షులు |
| దేవయోని | = | దేవతా జన్మం |
| అపఘనము | = | శరీరం |
| స్థావరములు | = | స్థిరంగా ఉండేవి |
| పతంగ | = | పక్షి |
| అకర్త వ్యకర్త వ్యతలు | = | చేయరానివి, చేయదగినవి |
| కరణ కళేబర+అది | = | ఇంద్రియాలు దేహం మొ॥వి |
| ఏకాంత కుత్సావహము | = | కేవలం నిందాకరమైంది |
| దురిత అవతంస | = | పాపాలతో గొప్పది |
| గీర్వాణులు | = | దేవతలు |
| చండాంశు సుతుడు | = | సూర్యుని కొడుకు యముడు |
| సౌరి | = | సూర్య పుత్రుడు |
| బహిర్ముఖులు | = | దేవతలు |
| ఆహుతులు | = | ఆహారాలు |

| | | |
|---|---|---|
| వ్యాహృతులు | = | భూర్భువస్సువరాది మంత్రాలు |
| చరు | = | అన్నం |
| పురోడాశ | = | హవిస్సు |
| చతురుతూ+అంశజుడు | = | బ్రహ్మ వంశంలో జన్మించినవాడు |
| సుధాంశుడు | = | చంద్రుడు |
| ఆప్యాయనంబు | = | తృప్తి |
| దోహరి | = | మాలదాసరి |
| సురద్రోహి | = | రాక్షసుడు |

32. కం॥ చంపకు చదువుల ........ మాటవుగాదే

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| చదువులన్ | = | చదువులతో |
| చంపకు | = | చంపవద్దు |
| మేము పఠింపని | = | మేము చదువని |
| శాస్త్రములె | = | చదువులా ఇవి |
| మా పఠింపని శ్రుతులె | = | మేము చదువని ధర్మశాస్త్రాలా? |
| అవి | = | ఆ ధర్మశాస్త్రాలూ చదువులూ |
| ఇంపవు | = | సంతోషాన్ని కలిగించవు |
| నమ్మవు+ఏన్ | = | నీవు నమ్మకపోతే |
| ప్రథమాం పిబతే వహ్నిః | = | అగ్ని భట్టారకుడు మొదటి చంద్రకళను త్రాగుతాడు (ఇది దేవీ పురాణ వాక్యం) |
| అనెడు | = | అనే |
| మాట | = | పల్కు |
| అవున్ కాదే | = | తప్పదుకదా |

**తాత్పర్యం :**

నేను కూడ వేదవేదాంతాది ధర్మశాస్త్రాలు చదివిన వాడినే. నేను చదవనివేమి ఉన్నాయి. అవి నాకు ఆనందాన్ని కల్గించవు. నీవు దేవతా గుణ కీర్తనం చేస్తున్నావు. వారిని బ్రహ్మాంశ సంభూతు లన్నావుకదా! ఆ చంద్రుడి కళల్ని అగ్ని దేవుడు కూడ గుంటి పెట్టి త్రాగిన వాడే కదా! దేవతలూ అంతే! మరి వారికి యోగ్యత ఎక్కడుంది?

(అలం - వ్యాఘాతాలంకారం)

33. మ॥ నిలుమోహో మము వారి భ్రాత లనుచున్ నీవంటి, వారల్సుధా
శులపూతాశులుగా రంటి; ప్రతిపత్సోమాంశము గ్నోలు మున్
జ్వల నుండం, టిక నొండు నిన్నడిగెదన్? సర్వాశిగాడా? యతం
డిలఁ దన్యాయము చాలు, మాకు నఘమే? వృద్ధాను చారం బికన్.

**కవి - కావ్యం :**

ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడూ శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధంలోని షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది ఈ పద్యం.

**సందర్భం :**

ధర్మోపదేశం చేస్తూన్న మాలదాసరితో బ్రహ్మరాక్షసుడు 'ప్రథమాం పిబతే వహ్నిః' అంటూ ప్రతివాదం చేస్తున్న సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| నిలుము | = | ఆగు |
| ఓహో! | = | ఆశ్చర్యంగా ఉందే |
| మమున్ | = | మా రాక్షసుల్ని |
| వారిభ్రాతలము + అనుచున్ | = | దేవతలకు సోదరులమని |
| నీవు + అంటి | = | నీవు పలికావు; సరే |
| వారల్ | = | ఆ దేవతలు |
| సుధా + ఆశుల్ | = | అమృతాహారులనీ |
| అపూత + ఆశులు | = | అపవిత్రమైన ఆహారాన్ని తినేవారు |
| కారు + అటు + అంటివి | = | కాదని అన్నావు |
| ప్రతిపత్ | = | పాడ్యమి తిథి నాటి |
| సోమ + అంశమున్ | = | చంద్రుని ప్రథమ కళను |
| జ్వలనుండు | = | అగ్నిదేవుడు |
| మున్ | = | ప్రథమంగా |
| క్రోలున్ + అంటి | = | త్రాగుతాడన్నావు |
| ఇకన్ + ఒండు | = | ఇంకొక్కటి |
| నిన్ను + అడిగెదన్ | = | నిన్నడుగుతాను |
| అతండు | = | ఆ అగ్నిదేవుడు |
| సర్వ + ఆశి కాడే | = | సర్వభక్షకుడు కాదా? |
| ఇలన్ | = | లోకంలో |
| తత్ + న్యాయము + ఎ | = | ఆ ఆచారమే |
| మాకున్ | = | రాక్షసులమైన మాకు కూడ |
| చాలున్ | = | సరిపోతుంది |
| వృద్ధ + అనుచారము | = | పెద్దల ననుసరించడం |
| అఘము + ఏ | = | పాపమా? |

**తాత్పర్యం :**

ఆగు! ఒక్కమాట! ఆశ్చర్యంగా ఉంది; ఒక్క విషయం చెప్పు. మా రాక్షసుల్ని దేవతలకు సోదరులన్నావు. వాళ్లు పవిత్రమైన అమృతాంశులే కాని, శవాల వంటి అపవిత్రమైన భోజనం చేయరన్నావు. మరి ప్రతిపత్తిథి నాటి చంద్రకళను భక్షించటంలో అగ్ని ముందుగా ఉంటాడు కదా! మేమూ అతడి ఆచారాన్నే అవలంబించాం. పెద్దల ఆచారాన్ని పాటించటం పాపంకాదు కదా! దేవతలకూ

రాక్షసులకూ చెరొక న్యాయం కాదు కదా!

**విశేషాంశాలు :**

ఇందులో దేవ రాక్షసుల ఆహార చర్చ సాగింది. అపూతాశులు రాక్షసులే కాని దేవతలు కారు. వృద్ధాచారం అనుసరణీయం అంటూ కుతర్కం సాగింది.

భ్రాతలు = దేవతలూ రాక్షసులూ ఇద్దరూ దితి అదితులకు కలిగిన కశ్యప సంతానం. అందువల్ల ఇద్దరూ భ్రాతలే. 'ప్రథమాం పిబతే వహ్నిః ద్వితీయాం పిబతే రవిః' - దేవీ పురాణం. నిలుము - (రూపం) నిలువుము - "పిలుచు మొదలగు వానికి ముత్తు పరం బగునపుడు కడ వాయి బహుళంబుగ లోపించు". బాల - క్రియా 101 సూ.

**వ్యాకరణాంశాలు :**

| | | | |
|---|---|---|---|
| సర్వ + అసి = సర్వాసి | = | సవర్ణదీర్ఘ సంధి |
| అంటి + ఇక | = | ఇకార సంధి |
| అఘము + ఎ | = | ఉత్వసంధి |

**ఛందస్సు :**

మత్తేభం. గణాలు - స భ ర న మ య వ. యతి - 1-14 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| నిలుమో | హోమము | వారిభ్రా | తలను | చున్నీవం | టివార | ల్సుధా |

**సారాంశం :**

ఓ దాసరీ! పూర్వకాలంలో మతప్రవర్తకుడై వేదవేదాంతాల్ని వ్యాఖ్యానం చేసి విశిష్టాద్వైతాన్ని స్థాపించారు రామానుజాచార్యుల వారు. వారికి గురువైన పెరియనంబి అనే పేరుగల పూర్ణాచార్యులు మంత్రోపదేశం చేశారు. దానిని యోగ్యతలేని వారికి ఉపదేశించ వద్దని కూడా ఆదేశించారు. కాని రామానుజులు దయార్ద్రులై శ్రీరంగంలోని బంగారు గోపురాన్ని అధిరోహించి పెద్దగా ఆ మంత్రాన్ని అందరకూ ఉపదేశించారు. అందుకు గురువుగారు కోపించగా, సమాధానంగా, తానొక్కడే తరించటంకంటె భక్తులందరను ఉద్ధరించటం మంచిది కదా అని పల్కారు. దానితో గురువుగారు ఆనందించారు. తరువాత తమ రామానుజ కూటాలలో నిరపేక్షంగా నిత్యం సపర్యలు చేసే భక్తులను ముక్తులను చేశారు. అనంతర కాలంలో రామానుజులవారు బంధముక్తులైనారు. కాలాంతరంలో వారే సుందర జామాతృనామంతో జన్మించారు. ఆర్చిరాది గతిని భక్తులకుపదేశించారు. అతడే మళ్లీ భవిష్యత్తులో శఠగోపులనే నామంతో జన్మించి యాదవగిరి ప్రాంతంలో వేదబాహ్యులను తమ ప్రసంగ పరంపరలతో పరాస్తం చేస్తారు. కాలక్రమంలో ఆంధ్రదేశ పండితుల నుండి భగవద్విషయిక భిక్ష గ్రహించి దేశమంతటా తన వాద పటిమతో అందరనూ జయించగలరు. అహోబిల స్వామి అనుగ్రహంతో యత్యాశ్రమాన్ని స్వీకరించి నిఖిల ఋషిప్రోక్త శాస్త్ర నిచయ విషయాలను తమ మత పండితులకూ శిష్యులకూ బోధిస్తారు. రాగ ద్వేషాలను వదలించుకొని తమ వద్దకు వచ్చిన వ్యక్తులకు భక్తి ప్రబోధం చేసి లోకాన్ని పవిత్రం చేస్తారు. అనంతర కాలంలో వేదాంత దేశికుడనే మరో విద్వాంసుడు శ్రీమన్నారాయణుడే పరమదైవమని ప్రతిపాదిస్తాడు. నూరు ప్రబంధాల నేర్పరుస్తాడు. అగిసె చెట్టుకు నిర్వాణం ప్రసాదిస్తాడు - అని బ్రహ్మరాక్షసుడన్నాడు.

ఇలా భవిష్యత్తును నేను దివ్యజ్ఞానంతో గ్రహిస్తాను. భవిష్యత్ జ్ఞానాన్ని బోధించటం జాతి సంబంధమైన విషయం. దానికి వారు పవిత్రులు కానక్కరలేదు. ఎందుకంటే? ఎరుకలది సోదె చెబుతుంది. పశుపక్ష్యాదులు కూడ భవిష్యత్తును సూచిస్తాయికదా! కనుక నా జ్ఞానం కూడ అటువంటిదే. నాస్తిక్యం వల్ల అధీతి బోధలు తప్ప, ఆచరణ శూన్యంగాను, ధర్మ బాహ్యం గాను లోకం మారింది. పాపరహితమైతేనే దేహానికి మోక్షం కలుగుతుంది. అందువల్ల నా వికృత రూపం పోవడానికి నేటి

నీ విష్ణు గీతాలాపన పుణ్యంలోని నాల్గవ భాగమైనా దానమివ్వు, అని దాసరి పాదాల మీద పడి వేడుకున్నాడు బ్రహ్మరాక్షసుడు. అపుడు దాసరి కృపాళుడై అలాగే కానిమ్మని లెమ్మన్నాడు. అసలు ఈ బ్రహ్మరాక్షసత్వం ఎందుకు ఎలా వచ్చిందో చెప్పమన్నాడు. దానితో చెప్పటం ప్రారంభించాడు బ్రహ్మరాక్షసుడు.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. ఆముక్తమాల్యద - శ్రీ వావిళ్ల రామస్వామి శాస్త్రుల వారి రుచివ్యాఖ్య
2. ఆముక్తమాల్యద - శ్రీ వేదం వేంకటరాయ శాస్త్రుల వారి సంజీవనీ వ్యాఖ్య
3. ఆముక్తమాల్యద - శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారి పీఠిక (ఎమెస్కో)
4. ఆముక్తమాల్యద సౌందర్యం - ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు.



డా॥ మేళ్లచెర్వు భానుప్రసాదరావు,
ఎం.ఏ. ఎం.ఫిల్, పిహెచ్.డి
రీడర్ - తెలుగు శాఖ
శ్రీ సుబ్బరాయ & నారాయణ కళాశాల
నరసరావుపేట - 522 601.

**పాఠం : 3**

# మాలదాసరి కథ

(34-66 పద్యాలు)

**- శ్రీకృష్ణదేవరాయలు**

శీర్షికలు :

3.0 లక్ష్యము

3.1 సమగ్రవ్యాఖ్యలు - ప్రతిపదార్థాలు

## 3.0 లక్ష్యం :

జాత్యుచిత ఆహారం ప్రాణికి తగినదంటూ బ్రహ్మరాక్షసుడు సాగించిన సంభాషణ నుండి మాలదాసరి రాక్షసుడికి బ్రహ్మరాక్షసత్వం ఎందుకు కలిగిందో అడిగిన పర్యంతం సాగిన కథ ఇందులో ప్రధానాంశం.

## 3.1 సమగ్రవ్యాఖ్యలు - ప్రతిపదార్థాలు :

34. తే॥ హరికి సఖుడును ........ సమయె

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| హరికిన్ | = | విష్ణుమూర్తికి |
| సఖుడున్ | = | స్నేహితుడూ |
| రథమును+అగు | = | వాహనం కూడ అయిన |
| గరుడుడు | = | గరుత్మంతుడు |
| దొరకిన | = | తనకు లభించిన |
| అమృతంబు | = | అమృతాన్ని |
| సురలకున్ | = | దేవతలకు |
| మరలన్ ఇచ్చి | = | తిరిగి ఇచ్చివేసి |
| కూడుగన్ | = | తనకు ఆహారంగా |
| అహులన్ | = | పాముల్ని |
| వరమునన్ | = | వరంగా |
| అడిగి కొనడె | = | అడిగి తీసుకొన్నాడు కదా! |
| అమృతము+ఐనను | = | అమృతమైనప్పటికీ |
| చవులన్ | = | రుచికి |
| జాతి+అన్నసమము+ఎ | = | ఆ జాతికి ప్రీతికరమైన ఆహారంతో సమానం కాదుకదా! |

**తాత్పర్యం :**

ఏ ఆహారమైనా సరే ఆ జాతికి సహజంగా ప్రీతికరమైన భోజనంతో సమానం కాదు. ఎలాగంటే, విష్ణుమూర్తికి సఖుడూ వాహనమూ అయిన గరుత్మంతుడు తనకు లభించిన ఉత్తమాన్నమైన అమృతాన్ని దేవతలకు తిరిగి ఇచ్చేశాడు. ఆపై దానికి బదులుగా పాముల్ని తాను ఆహారంగా వరంగా కోరి తీసుకున్నాడు గదా!

(అలంకారం - అర్థాంతరన్యాసం)

35. చ॥ నిదురయుఁ గూడుఁ బోఁ జదివి, నేనిటఁన్నది యేమి? యెవ్వడీ
చదువుల యర్థవాదపు మృషల్విని బేల్పడు, నీవు మాయెడం
జదువుల మాటలాడి కనజాల వొకానొక మెచ్చు, నొక్కడీ
చదివిన కూర వింత చవి, చాలగ దెమ్మను మెచ్చు దక్కగన్.

**కవి - కావ్యం :**

ఆంధ్రభోజ బిరుదాంకితుడు సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది ఈ పద్యం.

**సందర్భం :**

వృద్ధానుచారమే లోక సమ్మతం, అమృతం కంటె జాత్యన్నమే మేలంటూ రాక్షసుడు మాలదాసరితో సాగించిన సంభాషణ సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| నిదురయున్ + కూడున్ | = | నిద్రాహారాలను |
| పోన్ + చదివి | = | లేకుండా చదువుకొని |
| నేను + ఇట | = | నేనిక్కడ |
| కన్నది + ఏమి? | = | సాధించిందేమిటి? |
| ఈ చదువులన్ | = | ఈ శాస్త్రాలలోని |
| అర్థవాదపు | = | అర్థవాదం కోసం చెప్పే |
| మృషల్ విని | = | అవాస్తవాల్ని నమ్మి |
| ఎవ్వడు + బేలు + పడున్ | = | ఎవడు మోసపోతాడు; కనుక |
| నీవు మా + ఎడన్ | = | నీవు మావద్ద |
| చదువుల మాటలాడి | = | విద్యాప్రసంగాలు చేసి |
| ఈ చదివిన కూర | = | ఈ చదువుకొన్నవాడైన దాసరి మాంసంతో చేసిన కూర |
| వింత చవి | = | క్రొత్త రుచిగా ఉంది |
| చాలగన్ | = | మరింత |
| తెమ్ము + అను | = | తీసుకరా! అనే |
| మెచ్చు తక్కగన్ | = | పొగడ్త తప్ప |
| ఒకానొక | = | మరొక (ప్రత్యేకమైన) |
| మెచ్చు | = | పొగడ్తను |
| కనన్ + చాలవు | = | పొందలేవు. |

**తాత్పర్యం :**

ఓ దాసరీ! లోగడ రేబవళ్లు నిద్రాహారాలు మాని శాస్త్రాధ్యయనం చేసి నేనిక్కడ సాధించిందేముంది? ఈ శాస్త్ర ప్రసంగాల

శుష్క సంభాషణలతో ఎవడు లోబడతాడు. నన్ను మోసగించలేవు. శాస్త్రార్థసార మెరిగిన నీ మాంసపు కూర ఎంతో వింత చవిగా ఉంది. మరికొంత తెమ్మని ప్రశంసించటం తప్ప, నీకిక్కడ మరో ప్రత్యేకమైన పురస్కారం ప్రశంస దక్కదు. నీ చదువుకు ప్రయోజనం ఇదే. నీవెంత పండితుడివైనా వధించక మానను - అన్నాడు బ్రహ్మరాక్షసుడు.

**విశేషాంశాలు :**

ఎంత శ్రమపడి చదివినా ప్రయోజనమేమీ లేదు. శాస్త్రార్థ వాదాలు శుష్క ప్రసంగాలు - అవి ఆకలికి ఆదుకోవు - చావుకు అడ్డుపడవు. కనుక ఉదర పోషణమే జీవికి పరమావధి, అంటూ చదువులను గూర్చి భీతావహ భావన కల్పించాడు బ్రహ్మరాక్షసుడు. 'క్షుధాతురాణాం న రుచిః న కాలః' - అన్న ఆభాణకం ఇక్కడ స్ఫురిస్తుంది.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| పోన్ + చదివి = పోఁజదివి | = | ద్రుతప్రకృతిక సంధి |
| కన్నది + ఏమి = కన్నది ఏమి? | = | ఇకార సంధి |
| ఒక + ఒక | = | అకారసంధి, అన్యరూపం |
| మా + ఎడన్ | = | యడాగమ సంధి |

**ఛందస్సు :**

చంపకమాల. గణాలు - న జ భ జ జ జ ర. యతి - 1-11 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| నిదుర | యుఁగూడు | బోఁజది | వినేని | టగన్న | దియేమి | యెవ్వడీ |

**అలంకారం :**

వ్యాఘాతాలంకారం.

లోకంలో ఉన్నతికి సాధనం విద్య. ఆ భావాన్ని ఖండించి 'చదివిన కూర వింత చవి' అని లోక విరుద్ధంగా పల్కటం వల్ల వ్యాఘాతాలంకారం.

36. వ॥ అని గీష్పతి ........ గావింపుము

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| గీష్పతి | = | బృహస్పతి |
| బుద్ధి క్షోభము | = | మనః క్లేశం |
| ఛందః | = | వాని యిష్టం |
| శబ్ద+ఛలనము | = | శబ్ద వ్యాజం |
| ముఖ+ఉల్లాసము | = | ముఖ ప్రీతి |
| స్ఖాలిత్యము | = | తప్పు |

37 శా॥ ప్రఖ్యాతుండవు దైత్యులందు మును, పాపై నొక్క నీకా యశో
భిఖ్యన్నేనును జేర్తు, మే యొసగుఁ దప్పింప వ్రతం బొక్కడే
ముఖ్యంబై యొనరింతు, దాని సఫలంబు జ్జేయగా లేవుగా?
'సఖ్యం సాప్తపదీన' మన్మన మిథ సాజ్గత్య మూహించుచున్.

**కవి - కావ్యం :**

ఈ పద్యం సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయ కృతమైన ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది.

**సందర్భం :**

మాలదాసరి బ్రహ్మరాక్షసుడితో తన పల్కులలోని దోషాల్ని మన్నించి తన ప్రార్థనను నెరవేర్చుమని కోరిన సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| మునుపు | = | ఇంతకు ముందే |
| దైత్యుల + అందున్ | = | రాక్షస వర్గంలో |
| ప్రఖ్యాతుండవు | = | ప్రసిద్ధుడివి |
| నేనును | = | నేను కూడ |
| నీకున్ + ఔ | = | నీకు చెందే విధంగా |
| యశః + అభిఖ్యన్ | = | కీర్తికాంతిని |
| ఒకదు | = | ఒకదానిని |
| చేర్తున్ | = | సమకూరుస్తాను |
| మే + ఒసగున్ | = | (నా) దేహార్పణాన్ని |
| తప్పింపన్ | = | మానుకోను |
| ముఖ్యంబు + ఐ | = | ప్రధానమైన |
| వ్రతంబు + ఒక్కడు + ఎ | = | ఒక్క వ్రతాన్నే |
| ఒనరింతున్ | = | ఆచరిస్తాను |
| సఖ్యం | = | స్నేహం |
| సాప్తపదీనమ్ | = | ఏడడుగులు కలసి నడిస్తే స్నేహం కలుగుతుంది |
| అను | = | అనే రీతిగా; కల్గిన |
| మిథస్ + సాంగత్యము | = | పరస్పర స్నేహాన్ని |
| ఊహించుచున్ | = | తలపోస్తూ |
| దానిన్ | = | ఆ వ్రతాన్ని |
| సఫలంబున్ | = | నెరవేరేటట్లు |
| చేయగాలేవుగా | = | చేయలేవా! |

**తాత్పర్యం :**

ఓ బ్రహ్మరాక్షసా! ఇప్పటికే నీవు రాక్షసులలో సుప్రతిష్ఠుడివి. నీకు మరింత కీర్తి కలిగేలా చేస్తాను. నీకు దేహార్పణం చేస్తాను. కాని మానను. అయితే నేను నిత్యం చేసే వ్రతం ఒకటుంది. దానిని ఈరోజు కూడ జరపటానికి సహకరించు. ఏడడుగులు కలసి నడిస్తే సఖ్యం కలుగుతుందని ఒక సుద్దీ ఉంది; మన స్నేహం అలా ఏర్పడిందే. ఆ చెలిమిని దృష్టిలో పెట్టుకొని నా కోరికను నెరవేర్చు - అన్నాడు మాలదాసరి.

**విశేషాంశాలు :**

స్వకార్య సాధన కోసం అల్పుడినైనా అనల్పుడిగా శ్లాఘించడం లోకరీతి. పొగడ్తలకు పొంగిపోని పురుషపుంగవులుండరు. దాసరి చేసిందీ అదే. అతడి భాషణలో యుక్తి శరణాగతి సంప్రార్థన చాతుర్యం లోకజ్ఞత సువ్యక్తం. రాయల తెలుగు రచనలో సంస్కృత సూక్తుల కూర్పు, అల్పాక్షరాల అనల్ప భావ ఘటనా దక్షత స్పష్టం.

'సాప్తపదీనమ్' - పదం అంటే, పాదం - లేదా పలుకు అని అర్థం. కనుక ఏడు అడుగులు కలిసి వేయడం వల్ల గాని, ఏడు మాటల వల్ల గాని సఖ్యం కలుగుతుందని భావం.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| నీకున్ + ఔ = నీకౌ | = | ప్రథమేతర విభక్తికి చెందిన సంధి |
| యశః + అభిఖ్య = యశోభిఖ్య | = | విసర్గ సంధి, షష్ఠీతత్పురుష సమాసం |
| ముఖ్యంబు + ఐ | = | ఉత్వసంధి |

**ఛందస్సు :**

శార్దూలం. గణాలు - మ స జ స త త గ. యతి - 1-13 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| ప్రఖ్యాతుం | డవుదై | త్యులందు | మునుపా | పైనొక్క | నీకాయ | శో |

**అలంకారం :**

లోకోక్తి అలంకారం.

'సఖ్యం సాప్తపదీనమ్' అనే లోకోక్తితో కూడింది కనుక లోకోక్తి అలంకారం.

38. వ॥ అది యెద్ది యంటేని ........

39. కం॥ ఈ కుఱగటి ........ దుదకున్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఈ కుఱగటి | = | ఈ సమీపంలోని |
| ఈ కుఱుగుడి | = | ఈ తిరుక్కుఱుంగుడి అనే క్షేత్రంలో |
| వైకుంఠునిన్ | = | నారాయణ మూర్తిని |
| వ్రతముగ | = | నిత్యం దీక్షగా |
| పాడి వత్తున్ | = | పాటలతో స్తుతించి వస్తుంటాను |
| తత్ సేవాకృతి కడపటన్ | = | ఆతడిని కొలిచిన తరువాత |
| ఆశనము నీకు+అగుదున్ | = | నీకు ఆహారం అవుతాను |
| నేడు+అగు+తుదన్ | = | నేటి సంకీర్తన అనంతరం |
| ఇది+అ = ఇదే | = | ఈ విధంగా జరపటమే |
| ముఖ్యం | = | ఉత్తమం |

**తాత్పర్యం :**

నా ప్రతిదిన నియమం ప్రకారంగా ఈ సమీపంలో ఉన్న కుఱుంగుడికి వెళ్ళి అక్కడి విష్ణుమూర్తిని కీర్తించి సేవించి వస్తా. అనంతరం నీకు ఆహారమైతాను. అలా నీకు ఆహారంగా నన్ను నేను సమర్పించుకోవడమే ఉత్తమమైన పద్ధతి.

40. ఉ॥ అంచు నతండు పల్కు, దరహాసితఁ జెక్కిలిఁ గొట్టి లెస్స పం
డించితి వోయి దాసరి, వనిం దెరువాటులుఁ గొట్టి కొట్టి మే
న్పెంచి విరక్తి దాసరివి, నిన్నఁగదా యయినాడ, వీ మమున్
గొంచెముఁజేసి ట్రాడ్గొఱికికోఁ దలపోసెదు, మెచ్చితి నిన్నున్.

**కవి - కావ్యం :**

సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది ఈ పద్యం.

**సందర్భం :**

మాలదాసరి సమీపంలోని తిరుక్కురుం గుడిలోని విష్ణుమూర్తిని దర్శించి మంగళకైశికి రాగంతో సేవించి వచ్చి తరువాత నీకాహారమవుతానని రాక్షసుడితో అంటున్న సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| అంచున్ | = | అంటూ |
| అతండు | = | ఆ మాలదాసరి |
| పల్కన్ | = | చెప్పగా |
| దరహాసితన్ | = | (హేళనతో గూడిన) చిరునవ్వుతో |
| చెక్కిలిఁగొట్టి | = | చెంపమీద (చిన్నగా) కొట్టి |
| ఓయి దాసరి | = | ఓరి దాసూ! |
| లెస్స | = | చక్కగా |
| పండించితివి | = | మాయమాటలు నేర్చావురా! |
| వనిన్ | = | అటవిలో |
| తెఱువు + వాటులు | = | దారిదోపిడీలు |
| కొట్టి కొట్టి | = | చేసి చేసి |
| మేన్ + పెంచి | = | కండలు పెంచి |
| నిన్నన్ + కదా | = | నిన్ననే గదా! |
| విరక్తిన్ | = | వైరాగ్యంతో |
| దాసరివి | = | హరిదాసువి అయినావు |
| ఈ మమున్ | = | ఈ నన్ను |
| కొంచెము + చేసి | = | తెలివితక్కువ వానిగా చేసి |

| | | |
|---|---|---|
| త్రాడ్ + కొటికికోన్ | = | (బంధనాలు తెంచుకొని) తప్పించుకోవాలని |
| తలపోసెదు | = | భావిస్తున్నావు |
| నిమన్ | = | నీ టక్కరితనాన్ని |
| మెచ్చితిన్ | = | ప్రశంసిస్తున్నాను |

**తాత్పర్యం :**

ఓ దాసరీ! నిన్ను నమ్మను, అంటూ చెక్కిలిమీద కొట్టాడు అపహాసంగా బ్రహ్మరాక్షసుడు. నీకు ఓపిక ఉన్నంత కాలం దారి దోపిడీలు చేసి చేసి విసిగిపోయావు. ఇక శక్తి ఉడిగి చేవచచ్చి, ఈనాటికిది సుఖజీవనంగా భావించి వైరాగ్యాన్ని తెచ్చిపెట్టుకున్నావు. దాసరి వేషం వేశావు. భాషనూ మార్చావు. లోకాన్ని వంచిస్తున్నావు. కానీ, నీ జిత్తులూ ఎత్తులూ నాదగ్గర సాగవు అని రాక్షసుడన్నాడు.

**విశేషాంశాలు :**

చెక్కిలిగొట్టు - జాతీయం. లాలన చేసినట్లుగానూ, తన శక్తిని చూపటానికీ, ఇక నోరు మూసుకోమనటానికీ అవహేళనగా రాక్షసుడు చేసిన చర్య ఇది. నిన్నగదా దాసరివి - ఆతుర సన్యాసి అని భావం. త్రాడ్+కొటికికోన్ = బంధనాలను కొరికి తప్పించు కొనేందుకు ప్రయత్నించటం. ఇవన్నీ రాక్షసుడి వంచనాశిల్ప సూచికలు. రాయలు ఈ సందర్భాన్ని నాటకీయంగా మలిచాడు.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| చెక్కిలిన్ + కొట్టు | = | ద్రుతప్రకృతిక సంధి |
| మేన్ + పెంచి | = | గసడదవాదేశ సంధి |
| పండించితివి + ఓయి | = | ఇకార సంధి |

**ఛందస్సు :**

ఉత్పలమాల. గణాలు - భ ర న భ భ ర వ. యతి - 1-10 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
|---|---|---|---|---|---|---|
| అంచున | తండువ | ల్కదర | హాసిత | చెక్కిలి | గొట్టిలె | స్వపం |

41. శా॥ ఏ రాజ్యంబు నరుండు నోరి కడివో నీ బోధ యాలించు? నిం
కే రాజ్యంబు నరుండు బాసకయి మే నీఁదాన యేతెంచుఁ? దీ
పారన్నేఁ జననీమియు, న్మగిడి నీవారామియుండెల్లఁ; మే
లారంతు, ల్పలు పల్కు లంత్యకుల! యేలా చింతలేలా వగల్.

**కవి - కావ్యం :**

మాలదాసరి వ్రతం పూర్తిచేసుకొని తిరిగి వస్తానన్నప్పుడు, బ్రహ్మరాక్షసుడు పరిహాసంగా చెక్కిలిగొట్టి, నీ టక్కులకు మోసపోనని పల్కిన కథా సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| అంత్యకుల! | = | ఓ చండాలుడా! |
| ఏ రాజ్యంబు నరుండు | = | ఏ దేశంలోని మనుష్యుడు |
| నోరికడి +పోన్ | = | నోటి ముద్ద పోయేటట్లుగా |

| | | |
|---|---|---|
| ఈ బోధమున్ | = | (ఇప్పటికి వెళ్లిరమ్మనే) ఈ ఉపదేశాన్ని |
| ఆలించున్ | = | వింటాడు |
| ఇంకన్ | = | ఇంకా |
| ఏ రాజ్యంబు నరుండు | = | ఏ దేశంలోని మానవుడు |
| బాసకు + అయి | = | తన మాట కోసం |
| మేను + ఈన్ | = | శరీరాన్ని ఇవ్వటానికి |
| తాన్ | = | తనకు తానుగా |
| ఏతెంచున్ | = | వస్తాడు? |
| తీపు + ఆరన్ | = | (నీవు) ప్రీతికరంగా |
| నేన్ | = | నేను |
| చననీమియున్ | = | (నిను) పోనీయక పోవటమూ |
| నీవు + ఆ | = | నీవేమో |
| మగిడి | = | తిరిగి |
| రామియున్ | = | రాకపోవటమూ |
| తెల్లము | = | స్పష్టం |
| ఏలా రంతుల్ | = | రగడ ఎందుకు? |
| చింతలు + ఏలా | = | ఆలోచనలెందుకు? |
| వగల్ + ఏలా | = | దుఃఖాలెందుకు? |

**తాత్పర్యం :**

ఓ దాసరీ! నోటిదగ్గరి ముద్దను వదలుకొమ్మంటే ఎవడూ వినడు. తన ప్రతిజ్ఞా నిర్వహణం కోసం దేహాన్ని అర్పించుకొనడానికి ఎవడూ తిరిగిరాడు. నిన్ను నేను పోనీకపోవడమూ నిజమే. నీవు తిరిగి రాకపోవడమూ నిజమే. వ్యర్థ ప్రసంగాలతో రచ్చ చేసుకోవద్దు. నీవెంత విచారించినా, ఎంత దుఃఖించినా ప్రయోజనం శూన్యం.

**విశేషాంశాలు :**

ఆకలితో అలమటించే సామాన్యుడు మాట కోసం మాడిపోడు. ఉదర క్షుధా బాధా నివృత్తికే ప్రాధాన్యమిస్తాడు. దాసరిని సామాన్యుడిగా పరిగణించి పల్కిన తీరు రాక్షసుడి వాక్య రచనా విన్యాసంలో గోచరిస్తుంది. ఇందులో రాయలవారి ప్రశ్నార్థక పరిపూర్ణ నిర్మాణ చాకచక్యం ప్రస్ఫుటమౌతున్నది.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| బోధము + ఆలించు = బోధమాలించు | = | ఉత్వ సంధి |
| మేను + ఈన్ = మేనీన్ | = | ఉత్వ సంధి |
| తీపు + ఆరన్ = తీపారన్ | = | ఉత్వ సంధి |

**ఛందస్సు :**

శార్దూలం. గణాలు - మ స జ స త త గ. యతి - 1-13 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

UUU IIU IUI IIU UUI UUI U
ఏరాజ్యం బునరుం డునోరి కడివో నీబోధ యాలించు నా

42. తే॥ అనిన చెవిమూసి ........ వినకయున్న

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అనినన్ | = | ఆ రాక్షసుడన్న మాటలకు |
| చెవిమూసి | = | చెవుల్ని మూసుకొని |
| నారాయణా అటంచు | = | నారాయణ నామస్మరణం చేసి |
| అతడు | = | ఆ దాసుడు |
| పిశితాసి | = | మాంస భక్షకుడివైన ఓ రాక్షసుడా! |
| ననున్+నమ్మవు+ఏన్ | = | నా మాట మీద నమ్మకం లేకపోతే |
| ఒక్క శపథమునన్ | = | ఒక ప్రమాణంతో |
| నమ్ముము+అని | = | విశ్వసించుమని |
| వాడు సమ్మతింపన్ | = | వాడు ఒప్పుకొనే విధంగా |
| వేనవేల్ సత్యములు పల్కి | = | వేలకొలది ప్రమాణాలు చేసి |
| వినక+ఉన్నన్ | = | విననందువల్ల |

**తాత్పర్యం :**

రాక్షసుడి మాటలకు మాలదాసరి బాధపడ్డాడు. ఆ మాటలవలన కలిగిన పాప పరిహారం కోసం చెవులు మూసుకుంటూ నారాయణ నామస్మరణం చేశాడు. ఒక్క శపథంతో తన మాట నమ్మవలసిందన్నాడు. వాడిని ఒప్పించేందుకు వేలవేలు ప్రమాణాలు చేశాడు. కానీ ఆ మాటలు వినకపోవటంతో ఇలా అంటున్నాడు.

43. ఉ॥ ఎవ్వని చూడ్కిఁ జేసి జనియించు జగంబు, వసించు నిజ్జగం
బెవ్వని యందు, డిందు మఱి యెవ్వని యం దిది, యట్టి విష్ణుతో
నివ్వల నొక్క వేల్పు గణియించిన పాతకి నౌదు నేఁడ నే
నెవ్విధినైన నిన్గదియనేని, యనన్విని బంధ, మూడ్చినన్.

**కవి - కావ్యం :**

ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడూ శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది ఈ పద్యం.

**సందర్భం :**

తాను తిరుక్కురుం గుడికి వెళ్లి విష్ణు కీర్తన చేసి తిరిగి వస్తానని శపథపూర్వకంగా ఒప్పించే ప్రయత్నంలో దాసరి బ్రహ్మరాక్షసుడితో పల్కిన సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| నేడు + అ | = | ఈరోజే |
| నేను | = | దాసరినైన నేను |

| | | |
|---|---|---|
| ఏ విధిన్ + ఐనన్ | = | ఎలాగైనా సరే |
| నిన్ + కదియన్ + ఏని | = | నిన్ను చేరకపోతే |
| ఎవ్వని చూడ్కిన్ + చేసి | = | ఎవరి దృష్టితో |
| జగంబు | = | ఈ లోకం |
| జనియించున్ | = | పుడుతుందో |
| ఇది - మఱి | = | తరువాత ఈ లోకం |
| ఎవ్వని + అందున్ | = | ఎవరిలో |
| డిందున్ | = | లయమవుతుందో |
| అట్టి | = | అటువంటి |
| ఆ విష్ణుతోన్ | = | ఆ శ్రీమహావిష్ణువుతో |
| ఈ + మున్ | = | ఇవతల |
| ఒక్క వేల్పున్ | = | ఒక సామాన్య దేవతను |
| గణియించిన | = | (సమంగా) భావించిన |
| పాతకిన్ + ఔదున్ | = | పాపిని అవుతాను |
| అనన్ | = | అనగానే |
| విని | = | (రాక్షసుడు) విని |
| బంధమున్ + ఊడ్చినన్ | = | కట్లు విప్పగా. |

**తాత్పర్యం :**

నే నెలాగైనా ఈరోజు నీవద్దకు తిరిగి వస్తాను. అలా రాకపోతే సృష్టి స్థితి లయ కారకుడైన శ్రీమహావిష్ణువుతో సమానంగా మరొక వేల్పును భావించిన మహాపాపి నవుతానని దాసరి అన్నాడు. ఆ శపథాన్ని విన్నంతనే రాక్షసుడు దాసరి కట్లు విప్పేశాడు. బంధవిముక్తుణ్ణి చెయ్యగానే,

**విశేషాంశాలు :**

'యతోవా ఇమాని భూతాని జాయన్తే' అనే ఉపనిషద్వాక్యానికి వ్యాఖ్యాసదృశమే 'నా విష్ణుః పరమో దైవః' అనే భావానికి ప్రాణస్ఫాయువై, విశిష్టాద్వైత సంప్రదాయ సుప్రతిష్ఠితమై మాలదాసరి విష్ణుభక్తి సువిదితమైందీ పద్యంలో. 'ఎవ్వనిచే జనించు' అనే పద్యానుకరణ రాయలవారికి గల పోతన మీది శ్రద్ధాభక్తులను చాటుతుంది.

**వ్యాకరణాంశాలు :**

ఏ + విధి = ఎవ్విధి; ఈ + వల = ఇవ్వల; ఈ + జగము = ఇజ్జగము - త్రిక సంధులు

పాతకిని + ఔదు = ఇకార సంధి

**ఛందస్సు :**

ఉత్పలమాల. గణాలు - భ ర న భ భ ర వ. యతి - 1-10 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

చం॥ 44 అతడు తదల్ప పాపఫల మందుట సుంకముఁదీరిపోయి, త
చ్ఛ్యుత దళపత్రనేత్రునకుఁ జాగిలి మ్రొక్కి, రణద్విపంచియై,

స్తుతికలిత ప్రబంధములఁ జొక్కఁగఁబాడి, యసత్య భీభర
ద్రుతగతి వచ్చి, రాత్రిచరుతో వ్రతపూర్తి గతార్తి నిట్లనున్.

**కవి - కావ్యం :**

సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసం మాలదాసరి కథాభాగంలోనిది.

**సందర్భం :**

సృష్టి స్థితి లయ కారకుడైన శ్రీమహావిష్ణువుతో ఇతర దైవాన్ని సరిపోల్చటంతో కలిగే మహాపాపానికి లోనౌతానన్నాడు దాసరి. ఆ మాట విని బంధమూడ్చాడు బ్రహ్మరాక్షసుడు. ఆ విషయం విష్ణుమూర్తి విష్ణుచిత్తుడితో చెప్పిన సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| అతడు | = | ఆ మాలదాసరి |
| తత్ | = | (బందీ కావటమనే) ఆ |
| అల్ప | = | కొద్ది |
| పాప | = | పాపం యొక్క |
| ఫలం | = | ఫలాన్ని |
| అందుట | = | అనుభవించటం అనే |
| సుంకము | = | పన్నును |
| తీర్చి | = | చెల్లించి |
| పోయి | = | కురుంగుడికి వెళ్లి |
| తత్ | = | భగవంతుడైన |
| శతదళపత్రనేత్రునకున్ | = | పద్మాల వంటి కండ్లు గలవాడైన విష్ణుమూర్తికి |
| చాగిలి మ్రొక్కి | = | దండప్రణామం చేసి |
| రణత్ + విపంచి + ఐ | = | వీణ మ్రోగిస్తున్నవాడై |
| స్తుతికలిత | = | స్తోత్రసహితాలైన |
| ప్రబంధములన్ | = | కీర్తనల్ని |
| చొక్కగన్ + పాడి | = | విష్ణుమూర్తి పరమానందపడేటట్లు పాడి |
| అసత్య | = | మాట తప్పటం వల్ల కలిగే |
| భీ | = | భయము యొక్క |
| భర | = | భారంతో |
| ద్రుతగతిన్ | = | తొందర నడకతో |
| వచ్చి | = | చేరి |
| రాత్రిచరుతో | = | రాక్షసుడితో |
| వ్రత పూర్తిన్ | = | వ్రత పరిసమాప్తి వల్ల |
| గత + ఆర్తిన్ | = | బాధ తొలగి |
| ఇట్లు + అనున్ | = | ఇలా అన్నాడు |

**తాత్పర్యం :**

ఆ దాసరికి ఏదో పాపలేశం మిగిలింది. దాని ఫలితంగానే రాక్షసుడికి బందీగా దొరికిపోయాడు. అతడి వద్ద చెర తొలగిపోవటం అనే అపరాధ రుసుంతో ఆ పాపం తొలగిపోయింది. వెంటనే కురుంగుడికి వెళ్లి గానంతో ఇష్టదైవమైన విష్ణుమూర్తిని పరమానంద పులకితహృదయుణ్ని చేశాడు. అనంతరం అసత్య దోషం కలుగుతుందన్న భయంతో వేగంగా రాక్షసుడి వద్దకు తిరిగి వచ్చేశాడు. తన వ్రతం పరిపూర్తి అయిందన్న సంతోషంతో అతడితో ఇలా అంటున్నాడు-

**విశేషాంశాలు :**

పాపఫలం = ఫలానుభవం వల్ల, తపస్సు వల్ల పాపం నశిస్తుంది. దాసరికి భగవత్సేవ వల్ల పాపం నశించింది. రణత్ విపంచియై = దీనితో దాసరి ద్విగుణీకృతానందం తెలుస్తున్నది. చొక్కగన్ - దాసరి రసోత్తర గాన ఫలితంగా భగవంతుడు ఆనందపారవశ్య సూచక పదం. 'అసత్య భీభర' ద్రుతగతో ప్రయోగం దాసరి సత్యవాక్పాలన పట్ల గల తొందరకు నిదర్శనం.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| అసత్య భీభరము | = | షష్ఠీతత్పురుష సమాసం |
| శతదళపత్రనేత్రుడు | = | బహువ్రీహి సమాసం |
| గత + ఆర్తి = గతార్తి | = | సవర్ణదీర్ఘ సంధి |
| తత్ + శతదళపత్ర = తచ్ఛతదళపత్ర | = | శ్చుత్వసంధి |

**ఛందస్సు :**

చంపకమాల. గణాలు - న జ భ జ జ జ ర. యతి - 1-11 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| అతడు | తదల్ప | పాపఫ | లమందు | టసుంక | ముదీరి | పోయితత్ |

ఉ॥ 45 నీ చెఱ బాసి పోయి రజనీచర, చక్రి భజింప, ముక్తి పొం
దే చెర, యే చఱుం దవుల నే, నిక, నుండగఁ జూడు పంచుచో
నే చరణంబు లే యుదర మే యుర మే శిర మే కరంబు, లీ
వా చరణంబు లా యుదర మా యుర మా శిర మా కరంబులున్.

**కవి - కావ్యం :**

సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది ఈ పద్యం.

**సందర్భం :**

వ్రతం పూర్తి అయి బాధా నివృత్తి పొంది దాసరి ఆనందంగా రాక్షసుడితో సంభాషిస్తున్న సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| రజనీచర | = | రాత్రుల్లో సంచరించేవాడా! రాక్షసుడా! |
| నీ చెఱన్ | = | నీ నిర్బంధాన్ని |
| పాసి | = | విడిచి |

| | | |
|---|---|---|
| పోయి | = | వెళ్లి |
| చక్రిన్ | = | విష్ణుమూర్తిని |
| భజింపన్ | = | సేవించగా |
| ముక్తి పొందు | = | మోక్షానుభవం |
| ఏ చెర | = | వర్ధిల్లిందిరా! |
| నేను + ఇకన్ | = | నేనికముందట |
| ఏ చెఱన్ | = | ఏ బంధనాలకూ |
| తగులన్ | = | చిక్కను |
| పంచుచోన్ | = | నన్ను నీ చెఱ నుండి పంపేటప్పుడు |
| ఏ చరణంబులు | = | ఏ పాదాలు |
| ఏ + ఉదరము | = | ఏ కడుపు |
| ఏ + ఉరము | = | ఏ ఱొమ్ము |
| ఏ + శిరము | = | ఏ తల |
| ఏ కరంబులు | = | ఏ చేతులు, ఉన్నాయో |
| ఈవు | = | నీవు |
| ఆ చరణంబులు | = | ఆ ఉదరము, ఆ ఉరము, ఆ శిరము, ఆ కరములు |
| ఉండగన్ | = | ఉన్నవని |
| చూడు | = | సరిచూసుకో |

**తాత్పర్యం :**

నేటితో నా వ్రతం నెరవేరింది. స్వామి సేవతో నా బంధనాలన్నీ సమసిపోయాయి. నాకిక ఎవరి చెర భయం లేదు. మోక్షానందం ముమ్మరించింది - నన్ను నీవు కురుంగుడికి అనుమతించినప్పుడు ఏయే అవయవాలున్నాయో ఆయా అవయవాలప్పుడు అన్నీ భద్రంగా ఉన్నాయని ఒకసారి సరిచూసుకో.

**విశేషాంశాలు :**

చక్రి = భవబంధాలను తన చక్రంతో ఛేదిస్తాడని సార్థక ప్రయోగం; 'ముక్తిపొందేచెర' ప్రయోగం దాసరి భక్త్యానంద పరాకాష్ఠ సూచన. పద్యమంతటా దాసరి భక్తిని, సత్యసంధతని, వాక్చమత్కృతిని గమనించవచ్చు.

**వ్యాకరణాంశాలు :**

రజనీచరుడు - సప్తమీ తత్పురుష సమాసం

చక్రి - బహువ్రీహి సమాసం

నీ చెఱ - షష్ఠీతత్పురుష సమాసం

'ఏ ఏ ..... ఆయా' పదాలు యత్తదర్థక ప్రయోగం

**ఛందస్సు :**

ఉత్పలమాల. గణాలు - భ ర న భ భ ర వ. యతి - 1-10 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| నీచెఱ | బాసిపో | యిరజ | నీచర | చక్రిభ | జింపము | క్తిపొం |

**అలంకారం :**

రెండవ పాదంలో 'ఏ చెర యే చెఱం' పదాలలో యమకాలంకారం; 'చెర' శబ్ద పునరావృత్తితో వృత్యనుప్రాసాలంకారం; రేఫావృత్తి మూలకమైన వృత్యనుప్రాసాలంకారాలున్నాయి.

46. తే॥ అనిన తత్సత్యమునకు ........ పాఱుదెంచి

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అనినన్ | = | ఆ విధంగా దాసరి పల్కగానే |
| పాఱుటసురర | = | ఆ బ్రహ్మరాక్షసుడు |
| తత్+సత్యమునకున్ | = | ఆ దాసరి సత్యసంధతకు |
| నేత్ర+అంబులు+ఉఱల | = | ఆనంద భాష్పాలు రాలుతుండగా |
| ప్రమద | = | ఆనందంతో |
| పులకిత | = | గగుర్పొడిచిన |
| గాత్రుడు+ఐ | = | శరీరం గలవాడై |
| ఇనుని | = | సూర్యుడి యొక్క |
| మధ్యందినపు+ఎండ | = | మధ్యాహ్న కాలపు వేడి |
| తనదు+పెద్ద+బట్టతలన్ | = | తన పెద్దదైన బట్టతలమీద |
| మించన్ | = | మెఱుస్తుండగా |
| ప్లవున్ | = | మాలదాసరిని |
| చేరన్ | = | దరిచేరటానికి |
| పాఱుదెంచి | = | పరుగెత్తి వచ్చి |

**తాత్పర్యం :**

దాసరి ఇలా చెప్పగానే అతడి సత్యసంధతకు బ్రహ్మరాక్షసుడు సంతోషించాడు. కండ్ల వెంట ఆనంద బాష్పాలు రాలాయి. ఒళ్లంతా గగుర్పొడిచింది. ఆ సమయంలో ఆతడి బట్టతల మీద మధ్యందిన మార్తాండుడి మండు టెండపడి మెరిసింది. అప్పుడాతడు ఆ దాసరి వద్దకు పరుగెత్తుకొచ్చాడు.

47. ఉ॥ కొండయుఁబోలె భక్తి వలగొంచునె, వాడు నిజద్రుమద్రభమీ
హిండన వ్రాలు పాకలపు టేనుగు బోలె, నొసల్తదంఘ్రులం
దుండ రొదన్మహాగిరులు హోరనఁ, బ్రస్తుతి వ్రాలి, దంష్ట్రికా
దండము లెత్తి పట్టిన పదం, బొకఁడొక్కడ నెత్తిఁ జేర్చుచున్.

**కవి - కావ్యం :**

ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడూ శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది ఈ పద్యం.

**సందర్భం :**

దాసరి తన వద్దకు తిరిగిరాగా ఆతడి సత్యసంధతకు ఆనందతరంగిత హృదయుడై పులకితగాత్రుడై దాసరితో రాక్షసుడంటున్న

సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| నిజద్రుమ | = | తన(ను కట్టి ఉంచిన) చెట్టు చుట్టూ |
| భ్రమీ | = | మండలాకారంగా |
| హిండన | = | తిరుగుతూ |
| వాలు | = | పడిపోయే |
| పాకలపు | = | పాకలం రోగం తగిలిన |
| ఏనుగు పోలెన్ | = | ఏనుగు లాగానే |
| కొండయు + పోలెన్ | = | కొండలాగా ఉన్న |
| వాడు | = | ఆ బ్రహ్మరాక్షసుడు |
| భక్తిన్ | = | భక్తిభావంతో దాసరికి |
| వలగొంచున్ + ఏ | = | ప్రదక్షిణం చేస్తూనే |
| నొసల్ | = | ఫాలభాగాన్ని |
| తత్ + అంఘ్రుల + అందు | = | ఆ దాసరి పాదాలమీద |
| ఉండన్ | = | ఉండగా |
| రొదన్ | = | ఆపకుండా పెద్ద గొంతుతో |
| మహాగిరుల్ | = | పెద్ద కొండలు |
| హోరు + అనన్ | = | హోరులెత్తేలాగా |
| ప్రస్తుతిన్ | = | మిక్కిలిగా స్తుతిస్తూ |
| వ్రాలి | = | ప్రణామం చేస్తూ |
| దంష్ట్రికా దండంబులు | = | దండాల వంటి బారైన కోరలతో |
| ఎత్తి | = | పైకెత్తి |
| పట్టిన | = | తాను పట్టుకొన్న |
| పదంబు | = | దాసరి పాదాల్ని |
| ఒకడు + ఒక్కడు + ఆ | = | ఒక్కొక్కటే |
| నెత్తిన్ | = | తలమీద |
| చేర్చుచున్ | = | ఉంచుకుంటూ |

**తాత్పర్యం :**

పాకలం అనే రోగం వచ్చిన ఏనుగు పెద్దగా ఘీంకరిస్తూ తనను కట్టిన చెట్టు చుట్టూ తిరుగుతూ చివరకు శిరసును వృక్ష మూలంలో చేర్చి పడిపోతుంది. అలాగే, కొండంత శరీరంతో బ్రహ్మరాక్షసుడు భక్తితో దాసరికి ప్రదక్షిణం చేస్తూ తన కంఠధ్వనితో పర్వతాలు ప్రతిధ్వనించేలా ప్రస్తుతిస్తూ అతడి పాదాలమీద తన ఫాలభాగాన్ని ఉంచి వాలిపోయాడు - బారైన తన కోరలతో దాసరి పాదాల్ని మెల్లగా ఒక్కొక్కటిగా ఎత్తి తన తలమీద చేర్చుకున్నాడు.

**విశేషాంశాలు :**

పాకలం - 'గజరోగస్తు పాకలం' ఏనుగులకు వచ్చే రోగం. ఆ రోగం వచ్చినపుడు మదంతో దాని శిరస్సు పగులుతుంది.

అంతటి బ్రహ్మరాక్షసుడు కూడ నిజమైన విష్ణుభక్తుడు సత్యసంధుడూ అయిన దాసరికి దాసోహం అన్నాడు - ఇది హరి భక్తి మహాత్మ్యం.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| పాకలపు+ఏనుగు = పాకలపుటేనుగు | = | కర్మధారయ సమాసం |
| మహాగిరులు | = | విశేషణపూర్వపద కర్మధారయ సమాసం |
| దంష్ట్రికా దండము | = | ఉపమాన ఉత్తరపద కర్మధారయము |
| హోరు + అనన్ | = | ఉత్వ సంధి |
| ఒకడు + ఒక్కడు | = | ఉత్వ సంధి |

**ఛందస్సు :**

ఉత్పలమాల. గణాలు - భ ర న భ భ ర వ. యతి - 1-10 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

**అలంకారం :**

ఉపమాలంకారం

| | | |
|---|---|---|
| ఉపమానం | - | ఏనుగు చెట్టు చుట్టూ తిరిగి వృక్ష పాదం వద్ద తల చేర్చటం. |
| ఉపమేయం | - | బ్రహ్మరాక్షసుడు దాసరి చుట్టూ ప్రదక్షిణించి అతడి పాదాల మీద పడటం. |
| సమాన ధర్మం | - | వ్రాలటం, పెద్దగా అరవటం |
| ఉపమావాచకం | - | పోలె |

48. శా॥ ఈ సర్వంసహ దేవదానవ మహీభృన్మౌని వాచాతప
శ్శ్రీ సర్వస్వము నేతదన్యకృతులం జెప్పంబడు, న్మోర మౌ
నీ సత్యం బురరీకృతాంత, మిల నెంతే వృద్ధనై మంటి నే,
నా సత్యంబిక నిన్నుఁ బోలెఁ గృతసంథాధూర్వహుల్లేమికిన్.

**కవి - కావ్యం :**

సాహితీ సమరాంగణ సార్వభౌముడు ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగం.

**సందర్భం :**

మాలదాసరి సత్యసంధతకు సంతోషించి సంభ్రమాశ్చర్యాలతో ప్రశంసిస్తూ భక్తిపురస్సరంగా అతడి పాదాల మీద పడిన బ్రహ్మరాక్షసుడు పల్కుతున్న సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| ఈ సర్వంసహన్ | = | ఈ భూమిమీద |
| దేవ దానవ | = | దేవతల, రాక్షసుల |
| మహీభృత్ | = | రాజుల |
| మౌని | = | తపస్వుల |
| వాచా | = | వాగ్రూపమైన |

| | | |
|---|---|---|
| తపః + శ్రీ | = | తపస్సంపద |
| సర్వస్వమున్ | = | సర్వమూ |
| ఏతత్ | = | (నీవు చేసిన) ఈ శరీర దానం కంటె (అల్పమైన) |
| అన్య | = | ఇతర |
| కృతులన్ | = | కార్యాలలో |
| చెప్పంబడున్ | = | ప్రశంసింపబడుతుంది |
| ఘోరము + ఔ | = | దారుణమైన |
| నీ సత్యము | = | నీవు చేసిన ప్రమాణం |
| ఉదరీకృత + అంతము | = | అంగీకరించిన ముగింపు గలది (అంగీకరించాను) |
| ఇలన్ | = | భూమిమీద |
| ఏన్ | = | నేను |
| ఎంతేన్ | = | చాల |
| వృద్ధను + ఐ | = | ముదుసలివాడినై |
| మంటిని | = | జీవించాను |
| ఇకన్ | = | ఇకమీదట |
| నిన్నున్ + పోలెన్ | = | నీవంటి |
| కృత సంధా | = | చేసిన ప్రతిజ్ఞ యొక్క |
| ధూర్వహుల్ | = | భారాన్ని మోసేవాళ్లు |
| లేమికిన్ | = | లేరనటానికి |
| నా సత్యంబు | = | నేనే ప్రమాణం. |

**తాత్పర్యం :**

ఈ ప్రపంచంలో ఉన్న దేవ దానవుల మునుల రాజుల తపస్సంపద అంతా నీ శరీరదానం కన్నా భిన్నమైన చిన్న చిన్న క్రతువులలోనే ప్రశంసింపబడుతుంది. ఈ భయంకర ప్రతిజ్ఞా నిర్వహణం సర్వజనాంగీకృతం. నీవంటి ప్రతిజ్ఞాపాలనా దక్షులు లేరనడానికి ఎంతో లోకాన్ని చూచిన, ఎంతో వృద్ధుడినైన నేనే ప్రమాణం.

**విశేషాంశాలు :**

సర్వంసహ = సర్వస్వాన్నీ సహించేది - భూమి

మహీభృత్ = భూమిని భరించేవాడు - రాజు

'సత్యానాస్తి పరోధర్మః' అనే శ్రుతివాక్యం ఆచరణలోకి వచ్చిన సన్నివేశం ఇది.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| మహీభృత్ + మౌని = మహీభృన్మౌని | = | అనునాసిక సంధి |
| తపః + శ్రీ = తపశ్శ్రీ | = | విసర్గ సంధి |
| ధూః + వహుల్ | = | విసర్గ సంధి |
| ఏతత్ + అన్య = ఏతదన్య | = | జశ్త్వ సంధి |

**ఛందస్సు :**

శార్దూలం. గణాలు - మ స జ స త త గ. యతి - 1-13 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| UUU | IIU | IUI | IIU | UUI | UUI | U |
|---|---|---|---|---|---|---|
| ఈసర్వం | సహదే | వదాన | వమహీ | భృన్మౌని | వాచాత | పః |

**అలంకారం :**

వ్యతిరేకాలంకారం

ఉపమాన ఉపమేయాలు రెండింటిలో ఒకదానికి ఆధిక్యం చెప్పటం.

ఉపమానం - దేవ దానవ మహీభృన్మౌని . . . . . . . ;

ఉపమేయం - నిన్ను (మాలదాసరి)

అధిక విశేషం - ఏతదన్య కృతులం జెప్పటం, ఇందులో ఉపమేయాధిక్యం ఉంది.

49. చ॥ ఇతరులు నీకు నీడె మఱి? యీ ధృతి, నీ స్మృతి, నీఋతేరిత
స్థితగతి, నీ మురారిపద సేవన జీవన వన్మతిన్, సమా
దృత కలగాన సింధులహరీ ప్లవన ప్లవభావ భాగురు
శ్రుతి తతబద్ధతుంబికిఁ గురుంగుడి నంబికృపావలంబికిన్.

**కవి - కావ్యం :**

సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజ బిరుదాంకితుడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధంలోని షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది ఈ పద్యం.

**సందర్భం :**

మాలదాసరి మాహాత్మ్యాన్ని జీవన విధానాన్నీ సంగీత సౌరభాన్ని భక్తిప్రపత్తుల్ని బ్రహ్మరాక్షసుడు ప్రస్తుతించిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| సమాదృత | = | బాగా ఆదరణ పొందిన |
| కలగాన | = | అవ్యక్త మధురమైన పాట అనే |
| సింధు | = | నదీ |
| లహరీ | = | ప్రవాహంలో |
| ప్లవన | = | ఈదటంలోను |
| ప్లవభావ | = | తేలటంలోను (తెప్పలాగా) |
| భాక్ | = | పొందిన |
| ఉరు | = | శ్రేష్ఠమైన |
| శ్రుతి | = | నాదం గలదిగా |
| తీత | = | వీణాదండానికి |
| బద్ధ | = | కట్టబడిన |

| | | |
|---|---|---|
| తుంబికిన్ | = | సొరకాయ గలవాడికి |
| కురుంగుడి | = | కురుంగుడి క్షేత్రంలోని |
| నంబి | = | భగవంతుడి యొక్క |
| కృపా | = | దయ |
| అవలంబికిన్ | = | ఆధారమైన వానికి |
| నీకు | = | నీకు |
| ఈ ధృతిన్ | = | ఈ సత్యమైన |
| ఈరిత | = | వాక్కులలోను |
| స్థిత | = | నిలుకడ గల |
| గతిన్ | = | నడవడిలోను |
| ఈ మురారి | = | ఈ శ్రీహరి యొక్క |
| పద | = | చరణాలను |
| సేవన | = | సేవించటమనే |
| జీవనవత్ | = | బ్రతుకు గల |
| మతిన్ | = | బుద్ధిలోను |
| మఱి, ఇతరులు | = | మరి అన్యులు |
| ఈడు + ఎ | = | సమానులా? |

**తాత్పర్యం :**

నీవు మధుర మనోహరమైన శ్రీహరి స్తోత్రగానం అనే నదీతరంగాలలో, దివ్యనాదప్రదమైన తుంబికి కట్టిన వీణ అనే తెప్పతో తేలుతున్నావు. కురుంగుడిలోని భగవంతుని కరుణ నీకు పట్టుకొమ్మగా ఉంది. అటువంటి నీకు ఈ ధైర్యంలోనూ ఈ జ్ఞప్తిలోనూ ఈ మాటల నిలుకడలోనూ, శ్రీహరి సేవాతత్పర బుద్ధిలోనూ ఎవరూ సాటిరారు.

**విశేషాంశాలు :**

ఏదో భక్తిపారవశ్యంతో గంగాప్రవాహంలాగా పెల్లుబికినట్లు తోస్తుంది ఈ పద్యం. దాసరి సంగీత సామర్థ్యం, వీణావాదన మాధుర్యం సత్యసంధతతోడి జీవన విధానం, వ్యక్తిత్వం వన్నెకెక్కాయని బ్రహ్మరాక్షసుడెలిగెత్తి చాటిన సన్నివేశం ఇది.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| జీవనవత్ + మతి = జీవనవన్మతి | = | అనునాసిక సంధి |
| కృపా + అవలంబి = కృపావలంబి | = | సవర్ణదీర్ఘ సంధి |
| కురుంగుడినంబి | = | సప్తమీ తత్పురుష సమాసం |

తత్ = 'తతం వీణాదికం వాద్యం' - అమరకోశం

**ఛందస్సు :**

చంపకమాల. గణాలు - న జ భ జ జ జ ర. యతి - 1-11 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| ఇతరు | లునీకు | నీడెమ | ఱియీధృ | తినీస్మృ | తనీబు | తేరిత |

**అలంకారం :**

1. వ్యతిరేకాలంకారం - ఉపమాన ఉపమేయాలలో ఒకదానికి ఆధిక్యం చెప్పటం.
   ఉపమానం - ఇతరులు; ఉపమేయం - మాలదాసరి; సమాదృత కలగాన -- కృపావలంబి; గుణాధిక్యం - 'నీ ధృతి నీ స్మృతి --- జీవనవన్మతిన్'; గుణాధిక్య వాచకం - 'ఇతరులు నీకు నీడె' - ఇందులో ఉపమేయ గుణాధిక్యం వర్ణించబడింది.
2. తకారావృత్తి అధికంగా ఉండటం చేత వృత్యనుప్రాస
3. తుంబికి - నంబికి - కృపావలంబికి వంటి వాటితో అంత్యానుప్రాస శబ్దాలంకారాలున్నాయి.

50. తే॥ అనిన నాతని ........ ధన్యుడనైతి ననఘ

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| భాగవత వతంసము+ఓయి | = | ఓ విష్ణు భక్తులలో ఉత్తముడా! ఓ దాసరీ! |
| వ్రతము | = | నా గాన వ్రతాన్ని |
| ఒనర్పించితి | = | చేయించావని |
| అతనిన్ | = | ఆ రాక్షసుడిని |
| కౌగిటన్+ఉనిచి | = | ఆలింగనం చేసుకొని |
| ఓయి+రజనీచర+ఇంద్ర | = | ఓ రాక్షస శ్రేష్ఠుడా! |
| అనఘా | = | ఓ పాపరహితుడా |
| నీ+ఉరు | = | నీ గొప్పదైన |
| కృపా కటాక్షమునన్+చేసి | = | నీ దయా దృష్టితో |
| ధన్యుడన్+ఐతిని | = | కృతార్థుడనయ్యాను అని |
| పల్కెన్ | = | చెప్పాడు |

**తాత్పర్యం :**

రాక్షసుడీ విధంగా పల్కగానే దాసరి ఆనందంతో ఓ రాక్షస శ్రేష్ఠుడా నీవీ రోజు నా వ్రతం నెరవేరేటట్లు చేశావు అంటూ కౌగిలించుకున్నాడు. నీ దయా దాక్షిణ్యాలవల్ల ధన్యుణ్ణి అయ్యాను అని ప్రశంసించాడు.

51. ఉ॥ బాసలు బండి కండ్లు, మఱి ప్రాణ భయంబున లక్షసేసినం,
గ్రాసము గృచ్ఛలబ్ధ ముడుగన్వసమే? యిది నీక చెల్లె, నో
భూసురవంశ్య, పుణ్యజన పుణ్యజనాంకము దావకీనమే
పో, సమకూరెడిం గులము పొత్తున దైత్యులకెల్ల నంకతన్.

**కవి - కావ్యం :**

సాహితీ సమరాంగణ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు ఆముక్తమాల్యదా ప్రబంధకర్త శ్రీకృష్ణదేవరాయ కృతం - అందులోని షష్ఠాశ్వాసం మాలదాసరి కథాభాగంలోనిదీ పద్యం.

**సందర్భం :**

బ్రహ్మరాక్షసుడు తన వ్రతాన్ని పరిసమాప్తి చేయించాడని, దాసరి ఆనందంతో నీవల్ల ధన్యుడ నయ్యానని బ్రహ్మరాక్షసుడితో పల్కుతున్న సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| బాసలు | = | ప్రమాణాలు |
| బండి కండ్లు | = | బండి చక్రాలు, నిలుకడగా ఉండవు |
| మఱి | = | ఆపైన |
| ప్రాణభయంబున్ | = | ప్రాణంమీది భయంతో |
| లక్ష | = | లక్ష సంఖ్యలో ప్రమాణాలు |
| చేసినన్ | = | చేసినప్పటికీ |
| కృచ్ఛ్ర | = | కష్టపడి |
| లబ్ధ | = | పొందిన |
| గ్రాసము | = | ఆహారాన్ని |
| ఉడుగన్ | = | వదలుకోవటం |
| వసమే | = | సాధ్యమా |
| ఇది | = | ఇలా వదలుకోవటం |
| నీకు + అ | = | నీకే |
| చెల్లెన్ | = | సాధ్యమైంది |
| భూసురవంశ్య | = | బ్రాహ్మణ వంశంలో జన్మించినవాడా! |
| పుణ్యజన | = | పుణ్యాత్ముడా! |
| పుణ్యజన + అంకము | = | పుణ్యజనుడనే బిరుదు |
| తావకీనము + ఏ + పో | = | నీదే సుమా! |
| కులము పొత్తునన్ | = | జాతి వారితో కలిసి ఉండటం వల్ల |
| దైత్యులకు + ఎల్లన్ | = | రాక్షసులందరికీ |
| అంకతన్ | = | నామధేయంగా |
| సమకూరెడిన్ | = | కలుగుతున్నది |

**తాత్పర్యం :**

ప్రతిజ్ఞలను నమ్మవచ్చునా! ప్రాణాలకు ముప్పు వచ్చిన ఆపన్నుడు లక్ష ప్రమాణాలు చేయవచ్చుగాక! అంతమాత్రాన వాటిని నమ్మి, కష్టపడి సంపాదించుకొన్న నోటికందిన ఆహారాన్ని వదలుకుంటాడా ఎవడైనా? నీవు ఒక్కడివే అటువంటి పుణ్యాత్ముడివి నాకు కన్పించావు - బ్రాహ్మణ వంశంలో పుట్టిన పుణ్యాత్ముడా! రాక్షసులకు పుణ్యజనులని పేరుంది. అది నీ ఒక్కడికే దక్కుతుంది. సహజంగా వారికీ పేరు లేదు. నీ మూలంగానే నీ వంశంలోని వారందరికీ ఆ పేరు వచ్చింది. నీవంటి పుణ్యాత్ములు లేరు.

**విశేషాంశాలు :**

'బాసలు బండికండ్లు' అనటం రాయల లోకజ్ఞత - అందిన ఆహారాన్ని వదలుకోవటం వల్ల రాక్షసుడికి 'పుణ్యజన' శబ్దం సార్థకమైంది. ఈ శబ్దాన్ని రెండర్థాలతో ప్రయోగించటం రాయల శబ్దాధికార దక్షత.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| లక్ష + చేయు = లక్షసేయు | - | గసడదవాదేశ సంధి |
| పుణ్యజన + అంకము = పుణ్యజనాంకము | - | సవర్ణదీర్ఘ సంధి |

కులము పొత్తు - షష్ఠీ సమాసం

**ఛందస్సు :**

ఉత్పలమాల. గణాలు - భ ర న భ భ ర వ. యతి - 1-10 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| బాసలు | బండికం | డ్లుమరి | ప్రాణభ | యంబున | లక్షసే | సినన్ |

**అలంకారం :**

నిరుక్తి అలంకారం. యౌగిక శబ్దాలకు అవయవార్థం వల్ల అర్థాంతర కల్పనం చెయ్యటం - 'యాతు ధానః పుణ్యజనః' - అని నిఘంటువు - పుణ్యజన శబ్దానికి రాక్షసుడని అర్థం. పుణ్యజన శబ్దానికి యౌగికార్థం - రాక్షసులు; అవయవార్థం - పుణ్యాత్ములు; ఇలా రాక్షసులనే అర్థాన్నిచ్చే 'పుణ్యజన' శబ్దానికి పుణ్యాత్ములని అర్థాంతర కల్పనం చెయ్యటం వల్ల నిరుక్తి అలంకారం.

52. చ॥ కడుపు మహాక్షుధ న్నకనకంబడ నన్నుత కృత్యుం జేయఁబో
విడిచితి, వేము జాత్యముగ వేధ విధించిన కూడు మీకు, మీ
యెడ నొకకీడు గల్గ, దిఁక నేమనిన న్మతి నీకు నాన సూ,
బడలిక దీఱ నిత్తనువుఁ బారణ సేయుము మైత్రి గల్గినన్.

**కవి - కావ్యం :**

ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడూ శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధంలోని షష్ఠాశ్వాసగత మాలదాసరి కథాభాగంలోనిది ఈ పద్యం.

**సందర్భం :**

వ్రత సమాప్తి కోసం నన్ను వదలిన పుణ్యాత్ముడివి - మీకు మేము బ్రహ్మ విధించిన ఆహారం. కనుక నన్ను దయతో భుజించి ధన్యుణ్ని చెయ్యమని రాక్షసుడితో దాసరి చేసుకున్న విన్నపంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| కడుపు | = | నీ పొట్ట |
| మహాక్షుధన్ | = | అధికమైన ఆకలి బాధతో |
| నకనకన్ + పడన్ | = | నకనకలాడుతున్నప్పుడు |
| నన్ | = | నన్ను |
| కృతకృత్యున్ | = | కార్య సఫలుడుగా చేయడానికి |
| పోన్ + విడిచితివి | = | పొమ్మని కట్లు విప్పావు |
| ఏము | = | మా మనుష్య జాతి |
| మీకున్ | = | మీ రాక్షసుల |
| జాత్యముగన్ | = | జాతికి ఇంపైనదిగా |
| వేధ | = | బ్రహ్మ |
| విధించిన కూడు | = | నిర్ణయించిన ఆహారం |
| నీ + ఎడన్ | = | నీకు |
| ఒక కీడున్ + కల్గదు | = | ఏ పాపం అంటదు |

| | | |
|---|---|---|
| మఱి + ఏమి + అనినన్ | = | మరొకటి ఏది మాట్లాడినా |
| నీకున్ + ఆన + చూ! | = | నీకు నా ఒట్టు సుమా! |
| మైత్రి కల్గినన్ | = | నా పట్ల స్నేహభావం ఉంటే |
| బడలిక తీరన్ | = | సొక్కు తీరేలాగా |
| ఈ తనువున్ | = | ఈ నా దేహాన్ని |
| పారణసేయుము | = | భుజించుము. |

**తాత్పర్యం :**

నీ కడుపు ఆకలితో నకనకలాడుతున్నప్పుడు నా విష్ణుగాన వ్రత పరిసమాప్తి కోసం బంధముక్తుడిని చేసి పంపిన మహాత్ముడివి. మా మానవజాతిని బ్రహ్మదేవుడు మీకు జాత్యుచిత ఆహారంగా నిర్ణయించాడు. కనుక నీ బడలిక తీరేలాగా నన్ను భక్షించు. ఇది సమంజసం. ఇందువల్ల నీకే పాపమూ సోకదు. నిజంగా నాపట్ల నీకు స్నేహభావం ఉంటే నాకు ఎదురు చెప్పకు. నామీద ఒట్టు అన్నాడు మాలదాసరి.

**విశేషాంశాలు :**

పారణ విధి 'అభ్యవహార కర్మ'; పారణము = వ్రతాంత భోజనము, ఉపవాసముండి మర్నాడు చేసే భోజనం. 'పారణసేయుము మైత్రి కల్గినన్' ప్రయోగం వల్ల మాలదాసరి సత్యసంధత, వ్రతం పట్ల గల పవిత్రభావం సువ్యక్తం. జాత్యుచిత కర్మ ఎటువంటిదైనా దోషం రాదనటం దాసరి ధర్మజ్ఞత. 'నకనక' అనేది ధ్వన్యనుకరణ శబ్దం.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| ఏమి + అనినన్ = ఏమనినన్ | - | ఇకార సంధి |
| ఈ + తనువు = ఇత్తనువు | - | త్రిక సంధి |
| పారణ + చేయుము = పారణసేయుము | - | గసడదవాదేశసంధి |
| మహాక్షుధ | - | విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం. |

**ఛందస్సు :**

చంపకమాల. గణాలు - న జ భ జ జ జ ర. యతి - 1-11 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U U | I U I | I U I | U I U |
| కడుపు | మహాక్షు | ధన్నక | నకంబ | డనన్న | తకృత్యు | జేయబో |

53. కం॥ ఈ మాటన్ ........ నార్తికిన్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| నిలింప విరోధీ | = | ఓ బ్రహ్మ రాక్షసుడా! |
| ఈ మాటన్ | = | నేను పల్కిన ఈ మాటలో |
| పొరపొచ్చెము | = | కపటం |
| లేమిన్ | = | లేదనటానికి |
| ఈశ్వరుడు+ఏ+కరి | = | భగవంతుడే సాక్షి |
| నామెయి | = | నా శరీరంలోని |

| | | |
|---|---|---|
| మేదోమయ | = | మెదడుతో కూడిన |
| దృప్త | = | క్రొవ్విన |
| ఆమిషములు | = | మాంస భాగాలను |
| మెసవుము+అన్నన్ | = | భక్షింపుమని పల్కగానే |
| అతడు | = | ఆ రాక్షసుడు |
| ఆర్తిన్+అనున్ | = | దుఃఖంతో ఇలా అన్నాడు |

**తాత్పర్యం :**

ఓ రాక్షసుడా! నా మాటల్లో కపటం కాని లోపంకానీ లేదు. నేను త్రికరణ శుద్ధిగా చెప్పాను. ఇందుకు భగవంతుడే సాక్షి. కనుక నా దేహంలో సమృద్ధిగా ఉన్న మెదడునూ కొవ్వు బట్టిన మాంస భాగాల్ని సంతృప్తిగా భక్షించు అని దాసరి ఆనందంగా చెప్పాడు. ఆ మాటలు విని రాక్షసుడు దుఃఖంతో ఇలా అంటున్నాడు.

54. శా॥ ఎట్టూ? యిట్టగునయ్య పల్క దయ లే? కిన్నాళ్ల నీ కూడె యీ
పొట్టం బెట్టి, మహాఘలబ్ధిఁ దనువుం బోషించి, యెన్నాళ్లకే
నెట్టే నొక్క తపస్వి యొక్క వ్రతి రాడే, చూడడే, తత్కృపన్
బుట్టన్నీగెద దీని, నా నొదవి, యో పుణ్యాత్మ యెట్లంటివే!

**కవి - కావ్యం :**

సాహితీ సమరాంగణ సార్వభౌముడు ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసం మాలదాసరి కథాభాగంలోనిది.

**సందర్భం :**

మానవులు రాక్షసులకు వేధ నిర్ణయించిన ఆహారం. కనుక నా దేహంలో సమృద్ధిగా ఉన్న మెదడును క్రొవ్విన మాంసాన్ని భక్షింపమన్నాడు దాసరి. ఆ మాటలకు దుఃఖంతో రాక్షసుడంటున్న సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| ఎట్టూ | = | ఏమన్నావూ! |
| ఇట్టు - దయలేక | = | ఇలా దయలేకుండా |
| పల్కన్ + అగును + అయ్య | = | పల్కవచ్చునా స్వామీ! |
| ఇన్ని+నాడు+లు | = | పుట్టినప్పటినుండీ |
| ఈ కూడె | = | ఈ నరమాంసాహారాన్నే |
| ఈ పొట్టన్ | = | ఈ పాడు పొట్టకు పెట్టి |
| మహత్ + అఘలబ్ధిన్ | = | మహాపాపాన్ని పొంది |
| తనువున్ | = | ఈ దేహాన్ని |
| పోషించి | = | పెంచి |
| ఎన్ని+నాళ్లకు+ఏని | = | ఎప్పటికైనా |
| ఎట్టు + ఏని | = | ఏలాగైనా |
| ఒక్క తపస్వి | = | ఒక ముని |

| | | |
|---|---|---|
| ఒక్క వ్రతి | = | ఒక వ్రతదీక్షాపరుడు |
| రాడు + ఏ | = | ఈ దారిని రాకపోతాడా! |
| చూడడు + ఏ | = | (నన్ను) కటాక్షించకపోతాడా! |
| తత్ + కృపన్ | = | ఆతడి దయతో |
| దీనిని + పుట్టున్ | = | ఈ రాక్షస జన్మని |
| ఈగెదన్ | = | తొలగించుకుంటాను |
| నాన్ | = | అని నేను అనుకొంటుండగా |
| ఓ పుణ్యాత్మ | = | ఓ మహానుభావా! |
| ఒదవి | = | తటస్థపడి |
| ఇట్లు + అంటివి + ఏ | = | ఇలా పల్కావేమిటి? |

**తాత్పర్యం :**

ఓ పుణ్యాత్ముడా! నీవు అలా అనవద్దు. నేను పుట్టినప్పటినుండీ, ఈ నరమాంసాన్నే నా పొట్టన బెట్టి, ఈ దేహాన్ని పెంచి, మహాపాపాన్ని సంపాదించాను. తరువాత దుఃఖించాను. ఏనాటికైనా ఒక మహాముని గానీ, వ్రతి గానీ, మహాపురుషుడు గానీ ఈ దారిని రాకపోతాడా! నన్ను కరుణించకపోతాడా! అనీ, అతడితో నా బ్రహ్మరాక్షసత్వాన్ని తొలగించుకోలేకపోతానా? అని చాలాకాలం నుండి ఎదురుచూస్తున్నాను. ఇప్పుడేమో నీవు వచ్చి కూడా ఇలా నిన్ను భుజింపుమని అంటున్నావు - అలా అనవద్దు మహానుభావా! అని రాక్షసుడు దాసరితో దుఃఖిస్తూ పల్కాడు.

**విశేషాంశాలు :**

దాసరి వ్యక్తిత్వ నిరూపణంతో నివ్వెరపోయిన రాక్షసుడిలోని రాక్షసత్వం నశించి వైరాగ్యం వెల్లువెత్తింది. 'పొట్టంబెట్టు' అనేది తెలుగు జాతీయం. ఎట్టూ = ఎట్లూ? ప్రశ్నార్థకం. రాడే, చూడడే = వ్యతిరేకార్థక ప్రశ్నార్థకాలు.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| చూడడు + ఏ = చూడడే | = | ఉత్వ సంధి |
| ఎట్లు + అంటివి = ఎట్లంటివి | = | ఉత్వ సంధి |
| పుణ్య + ఆత్మ = పుణ్యాత్మ | = | సవర్ణదీర్ఘ సంధి |
| మహా + అఘము = మహాఘము | = | సవర్ణదీర్ఘ సంధి, విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం. |

**ఛందస్సు :**

శార్దూలం. గణాలు - మ స జ స త త గ. యతి - 1-13 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| ఎట్టూయి | ట్టగున | య్యపల్క | దయలే | కిన్నాళ్లు | నీకూడె | యీ |

55. కం॥ మీవంటి ........ కృపన్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| మీవంటి భాగవతులున్ | = | మీ బోటి భక్తులు కూడ |

| | | |
|---|---|---|
| పావనులుగన్ | = | మమ్ము పవిత్రుల్నిగా |
| చేతురు+ఏని | = | చేయకపోతే |
| మావంటి వారికిన్ | = | మావంటి రాక్షసులకు |
| మరిగతి+ఎద్ది | = | ఇక మాకు దారేది? |
| ఇకన్ | = | ఇక మీదట |
| మా ఏవము వెనుకటిది | = | పూర్వము మేము చేసిన హేయమైన పనులను గూర్చి |
| చూడక | = | ఆలోచించక |
| ఈక్షింపు కృపన్ | = | దయతో చూడు |

**తాత్పర్యం :**

మీవంటి భగవద్భక్తులు పావనులు. పావనులైన మీరు ఇతరులను గూడ పవిత్రుల్ని చేస్తారు. అలా మీరు మమ్మల్ని పవిత్రుల్ని చేయకపోతే మాగతి ఏమవుతుంది. గతంలో మేము చేసిన నీచ కృత్యాల్ని గూర్చి నీవు భావించవద్దు. నన్ను దయతో రక్షించు.

56. తే॥ స్వధితి యైనను ........ భవాదృశులకు

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| పరుసవేది | = | పరుసవేది అనే రసవిశేషం (ఇది ఇనుమును బంగారంగా మారుస్తుంది) |
| స్వధితిన్+ఐనను | = | గొడ్డలినయినా |
| ద్విజున్+తిన్న | = | బ్రాహ్మణుని చంపిన |
| శస్త్రమైనన్ | = | ఆయుధాన్నయినా |
| సరియకాన్ | = | భేదభావం లేకుండా |
| కాంచనము+అ+చేయున్ | = | బంగారంగానే మారుస్తుంది |
| మాదృశుల చోటన్ | = | మావంటి వారి వద్దకు |
| కదియు | = | చేరవచ్చే |
| భవాదృశులకున్ | = | మీవంటి వారికి కూడ |
| ఈ+అసాధారణ న్యాయము | = | ఈ ఉత్తమ ధర్మం |
| ఎన్నవలదు+ఎ | = | పరిగణించవద్దా? = పరిగణించాలిగదా! |

**తాత్పర్యం :**

పరుసవేది రసం నిరపరాధి అయిన ఇనుపగొడ్డలి నయినా బ్రహ్మ హత్య చేసిన ఖడ్గాన్నైనా బంగారంగానే మారుస్తుంది. దానికి భేదం లేదు. ఇటువంటి ఉత్తమ న్యాయాన్నే మీలాంటి వారు మాబోటి వారి పట్ల అవలంబించాలి. మీ కరుణకు పవిత్రుడు పాత్రుడనీ, పాపి పాత్రుడు కాడనీ భేదభావం ఉండకూడదు. అందర్నీ సమానంగానే అనుగ్రహించాలి. కనుకనే పాపినైన నన్ను కరుణించి కడతేర్చటం మీకు ఉచితం గదా!

(అలంకారం : దృష్టాంతం)

57. తే॥ అనిన దేహార్పణము ........ యనుకంపగాక

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అనినన్ | = | ఈ విధంగా పల్కగానే |
| దేహ+అర్పణమున్ | = | శరీరాన్ని అర్పించటానికి |
| ఒల్లక | = | అంగీకరించకుండా |
| ఆర్తిన్ | = | దుఃఖంతో |
| పలుకు-కృపణతకున్ | = | ఆ రాక్షసుడు వచించిన దైన్యానికి |
| అతడు | = | ఆ దాసరి |
| అభిప్రాయము+ఎద్ది+అనినన్ | = | నీ ఉద్దేశం ఏమిటని అడగ్గా |
| మత్+ఆత్మ+కసటున్ | = | నా జీవుని పాపాన్ని |
| పాపుట+ఏ | = | పోగొట్టటమే |
| అనుకంపకాక | = | దయ అనిపించుకొంటుంది గాని |
| ఇత్తున్+తనువు+అంట | = | శరీరాన్ని ఇస్తాననటం |
| అనుకంప+ఏ | = | కనికరం అవుతుందా? |

**తాత్పర్యం :**

దేహార్పణానికి అంగీకరించకుండా జాలిపడి వేడుకుంటున్న ఆ రాక్షసుడితో దాసరి, మరి నీకు కావలసిందేమిటి అని అడిగాడు. అందుకు వాడు 'అయ్యా! నా బ్రహ్మరాక్షసత్వాన్ని తొలగించటమే నా పట్ల దయచూపటం అవుతుంది గాని, నీ దేహాన్ని నా కాహారంగా అర్పించటం దయ చూపటం కాదు. కనుక నీ దేహం నాకు వద్దు. నాకీ పాడు జన్మను తొలగించు' అని ప్రార్థించాడు రాక్షసుడు.

58. శా॥ ఘంటాకర్ణుని మించు కర్మమొకొ నాకర్మంబు? మౌనీంద్రులం
దుంటల్సేయడె? మాన్పి యీడె భగవంతుం డట్టిశ్రీ? యట్టిశ్రీ
కంటె న్భాగవతుండు మించ నొసగంగా లేడె? యా మేలు నా
కంటింప న్మఱి రాదె? పూజనముగాదా ప్రాణి మేల్చక్రికిన్.

**కవి - కావ్యం :**

సాహితీ సమరాంగణ సార్వభౌముడు ఆంధ్రభోజుడు ఆముక్తమాల్యద కర్త శ్రీకృష్ణదేవరాయలు - ఆ ప్రబంధంలోని షష్ఠాశ్వాసంలోని మాలదాసరి కథాభాగంలోనిది.

**సందర్భం :**

'ఈ దేహం నాకు వద్దు నన్ను శుద్ధుని చేసి నాకు వచ్చిన ఈ పాడు జన్మను తొలగించు' మని బ్రహ్మరాక్షసుడు మాలదాసరిని ప్రార్థించిన సందర్భంలోనిదీ పద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| నా కర్మంబు | = | నేను చేసిన దుష్కర్మ |
| ఘంటాకర్ణునిన్ | = | ఘంటాకర్ణుడి దుష్కర్మాల కంటె |

| | | |
|---|---|---|
| మించు కర్మము + ఒకొ | = | మించిన కర్మ అవుతుందా? |
| మౌని + ఇంద్రులన్ | = | మునీశ్వరులను |
| తుంటల్ + చేయడు + ఎ | = | ముక్కలు చేయలేదా |
| భగవంతుడు | = | విష్ణుమూర్తి |
| మాన్చి | = | (అతడి దుష్కర్మలను) పోగొట్టి |
| అట్టి శ్రీ | = | మహోన్నతమైన అంతటి సంపదను |
| ఈడు + ఎ | = | ఇయ్యలేదా? |
| భాగవతుండు | = | భగవద్భక్తుడు |
| అట్టి | = | అంతటి |
| శ్రీ కంటెన్ | = | ఘంటాకర్ణుడికి శ్రీమహావిష్ణువిచ్చిన సంపద కంటె |
| మించన్ | = | అధికంగా |
| ఒసగంగాన్ + లేడు + ఎ | = | ఇయ్యలేడా? |
| మఱి | = | ఇక |
| ఆ మేలు | = | ఆ హితాన్ని |
| నాకున్+అంటింపన్+రాదె | = | నాకు కూడ కలిగించకూడదా? |
| ప్రాణి మేల్ | = | ప్రాణికి చేసే హితం |
| చక్రికిన్ | = | భగవంతుడికి |
| పూజనము గాదా | = | అర్చన చెయ్యటం కాదా? |

**తాత్పర్యం :**

నేనేమైనా ఘంటాకర్ణుడి కన్న ఎక్కువ పాపం చేశానా? అతడు మునివర్యుల్ని ముక్కలు ముక్కలు సేయలేదా? అతడి పాపాల్ని పోగొట్టి శ్రీహరి అతడికి మోక్షసామ్రాజ్యాన్ని ఇయ్యలేదా? హరిభక్తులు శ్రీహరికన్నా అధిక శుభాల్ని ఇయ్యగలరు గదా! కనుక ఆ ఘంటాకర్ణుడికి విష్ణుమూర్తి చేసిన మేలు, నీవు నాకు చెయ్యలేవా? ఒక ప్రాణిని సంతోషపెట్టటం హరిని పూజించటమే కదా! కాబట్టి నాకు మేలు చెయ్యటం వల్ల నీకు హరిపూజనం చేసినంత పుణ్యం లభిస్తుంది - అన్నాడు బ్రహ్మరాక్షసుడు.

**విశేషాంశాలు :**

ఘంటాకర్ణుడు పిశాచ నాయకుడు. చెయ్యని దుష్కృత్యం లేదు. కాని అతడికి శ్రీకృష్ణుడు ముందుగా ఇంద్రపదవిని, ఆ తరువాత మోక్షాన్ని అనుగ్రహించాడని హరివంశ కథ. "సంతోషం జనయేత్ప్రాజ్ఞ స్తదేవేశ్వర పూజనమ్" అనే వాక్యానికి రాయల తెలుగుసేత 'పూజనము గాదా ప్రాణి మేల్చక్రికిన్' అని. ఇక భగవంతుడి కన్న భాగవతుడే మిన్న అనే భావం కనిపిస్తుంది.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| మౌని + ఇంద్రులు = మౌనీంద్రులు | - | సవర్ణదీర్ఘ సంధి |
| తుంటల్ + చేయడె = తుంటల్సేయడె | - | గసడదవాదేశ సంధి |
| నాకు + అంటింపన్ = నాకంటింపన్ | - | ఉత్త్వ సంధి |
| ప్రాణి మేలు | - | చతుర్థి తత్పురుష సమాసం |

**ఛందస్సు :**

శార్దూలం. గణాలు - మ స జ స త త గ. యతి - 1-13 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

**అలంకారం :**

అర్థాంతరన్యాసం.

బ్రహ్మరాక్షసుడు తనకు మేలు చెయ్యమనడం - విశేష వాక్యం.

ప్రాణులకు మేలు చెయ్యటం భగవదర్చన కాదా అనడం - సామాన్య వాక్యం.

ఇక్కడ విశేషవాక్యాన్ని సామాన్యవాక్యం సమర్థించింది. అందువల్ల అర్థాంతరన్యాసాలంకారం.

59. వ॥ అనిన విని ........ దాసుండిట్లనియె

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| న్యగ్రోధంబు | = | వటవృక్షం |
| పంచజనుడు | = | మనుష్యుడు |
| చర్వణము | = | తినటం |
| భూబర్హిర్ముఖుండు | = | బ్రాహ్మణుడు |
| ప్రాక్+జని | = | పూర్వజన్మ |
| కైటభారి | = | విష్ణుమూర్తి |
| సజలంబుగా నాకున్+ఇచ్చితివి+ఏని | = | నాకు ధారాదత్తం చేసినట్లయితే |
| భీభత్సము | = | రోత |
| కుత్సా | = | నింద |
| వేఁగున్ | = | తుదముట్టుతుంది |

60. కం॥ ఇటువంటివి ........ యిమ్మెయికిన్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఇటువంటివి | = | ఇటువంటి దేహాలూ |
| ఇటకున్+ఎక్కుడు | = | ఇంతకంటె ఉత్తమమయిన దేహాలూ |
| ఇటన్ దిగుడువి | = | ఇంతకంటె హీనమైన దేహాలూ |
| ఎన్ని+ఒందన్ | = | ఎన్ని దేహాలను నేను పొందలేదు |
| ఇదియును | = | ఈ చండాల దేహం కూడ |
| ఒకటి | = | నా దేహ పరంపరలో ఒకటి |
| ఈ+మెయికిన్ | = | ఈ పాటిదైన దేహ రక్షణ కోసం |
| ఒకనాటిది+అ+కాదు | = | ఒక రోజు పాడిన స్తోత్రఫలాన్ని (ఇవ్వను సరికదా) |
| ఒక తృటి గీత ఫలంబున్ | = | ఒక అరక్షణంలో చేయగలిగే విష్ణుగాన ఫలాన్ని కూడ |
| ఒసగుదును+ఎ | = | ఇస్తానా? = ఇవ్వను |

**తాత్పర్యం :**

నాకీ శరీరం ప్రీతి పాత్రం కాదు. ఇప్పటికి నేనెత్తిన దేహ పరంపరకు అంతే లేదు. ఇంత కంటె ఉత్తమమైనవీ, హీనమైనవీ ఎన్నో జన్మలెత్తాను. ఆ పరంపరలో ఇదొకటి మాత్రమే. ఇటువంటి ఈ దేహాల జనన మరణాల నుండి ముక్తిని కోరాలి. అంతే

కాని దీనికోసం శాశ్వతమైన హరినామ స్తుతి ఫలాన్ని దానమీయలేను. అది ఒక రోజు పాడిన ఫలంగాదు కదా, ఒక క్షణకాల గానఫలాన్ని కూడ నేనియ్యలేను.

61. సీ॥ దిక్పాలతనువెత్తి ........ కాముగాని

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| కంసరిపు భక్తులము+ఒకండె | = | ఒక హరిభక్తులగా మాత్రం |
| కాముగాని | = | జన్మించలేంకాని |
| ఈ+ఏను+నీవున్ | = | ఈ మన మిద్దరం |
| దిక్పాల తనువు | = | ఇంద్రాది అష్ట దిక్పాలకుల శరీరాన్నీ |
| తోన | = | వెంటనే |
| తిరిపె తనువుతోన | = | బిచ్చగాని దేహంతోనూ |
| ఎన్ని మార్లు | = | ఎన్ని సార్లు |
| ఎత్తము | = | జన్మించలేదు |
| అలాగే; ధరణీశ | = | రాజులుగా |
| దాస | = | సేవకులుగా |
| కేసరి | = | సింహాలుగా |
| కీట | = | పురుగులుగా |
| మాతంగ | = | ఏనుగులుగా |
| మశకంపు | = | దోమలుగా |
| సోమయాజులము | = | యజ్ఞం చేసిన వారిగా |
| శ్వపచ | = | చండాలురుగా |
| ఖగ కులములు | = | పక్షి జాతులుగా |
| పాము గాములము | = | పాములుగా, పిశాచాలుగా |
| ఎన్నిమార్లు; ఎత్తము | = | జన్మలు ఎత్తలేదూ! |

**తాత్పర్యం :**

విష్ణు భక్తి చాల గొప్పది. ఈ దేహం అశాశ్వతమయింది. మనం చేసుకున్న పుణ్యావేశం వల్ల ఉత్తమ జన్మలూ పాపాల వల్ల నీచ జన్మలూ లభిస్తాయి. నీవూ నేనూ దిక్పాలాది అనేక జన్మలెత్తాం గాని, ఏ జన్మలోనూ విష్ణు భక్తులం కాలేదు. మనకు విష్ణు భక్తి కలిగితే మోక్షం లభిస్తుంది. అంటే జన్మరాహిత్యం కలుగుతుంది. కనుక ఇతర జన్మల కన్న విష్ణు భక్తునిగా జన్మించటం చాల అదృష్టం.

(అలంకారం = వ్యతిరేక)

62. ఆ॥ ఊత నీరు ........ యుప్పుగొనుట

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| మేను | = | ఈ శరీరం |

| | | |
|---|---|---|
| ఊత నీరు | = | (చేపలు పట్టడానికి వెదురు బద్దలతో అల్లిన గూడ అనే సాధనం) ఊతలో నిలిచే నీరు లాంటిది (నీళ్ళు నిలువని క్షణికమనీ భావం) |
| చెలదినేత మూట | = | సాలె పురుగు నేసిన నేతతో కట్టిన మూట |
| ఆయిటి దూది | = | గాలిలో పెట్టిన దూది |
| ఎండ పసుపు | = | ఎండలో పెట్టిన పసుపు |
| తొ్ఱ్ఱి అక్కరంబు | = | బోసినోటి వాడు పల్కిన అక్షరం |
| దీనిరహిన్ | = | ఇటువంటి ఈ శరీరం కోసం |
| పుణ్యము అమ్మట | = | పుణ్యాన్ని అమ్ముకోవటం |
| కప్పురంబు | = | కర్పూరాన్ని |
| పెట్టి | = | ఇచ్చి |
| ఉప్పు | = | ఉప్పును |
| కొనుట | = | తీసుకోవటమే |

**తాత్పర్యం :**

చేపలు పట్టడానికి నీళ్ల తోడిపోసే సాధనం ఊత. దీన్ని వెదురు బద్దలతో చేస్తారు. దానిలో నీళ్లు ఎక్కువ సేపు నిలవవు. అలాంటి ఊతలో నీరు నిలువనట్లు గానూ, సాలెపురుగు దారాలతో అల్లిన నేతతో కట్టిన మూట ఉండనట్లుగానూ, గాలిలో ఆరబెట్టిన దూది ఎగిరి పోయేరీతిగానూ బోసినోటి వాడు ఉచ్చరించిన అక్షరం అస్పష్టంగా ఉండి క్షరమైనట్లుగానూ, ఎండలో పెట్టిన పసుపు తాత్కాలికంగా మెరిసినా దాని రంగు కోల్పోయిన విధంగానే, ఈ దేహం అశాశ్వతం. నిలిచేది కాదు. కనుక దీని కోసం పుణ్యాన్ని అమ్ముకోవడం, ఉప్పు కోసం కర్పూరాన్ని అమ్ముకోవటం వంటిదే.

(అలంకారం = రూపక, నిదర్శనాల సంసృష్టి)

63. వ॥ అనిన ........ ఇట్లనియె

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| దనుజుడు | = | రాక్షసుడు |

64. కం॥ సంగీత ఫలంబున్ ........ కనియెన్

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| గోసంగి | = | ఓ మాలదాసరీ! |
| దయపొసగి | = | దయతో |
| సంగీత ఫలంబున్ | = | నేడు చేసే విష్ణు కీర్తన పుణ్యంలో |
| సగము+ఐనన్+ఈవే | = | సగభాగమైనా ఇయ్యవా |
| మీన్+మింగిన గ్రుక్కన్ | = | చేప త్రాగిన గ్రుక్కెడు నీటితో |
| వారిధికిన్ | = | సముద్రానికి |
| కొఱతయె | = | లోటు కలుగుతుందా |
| విష్ణు కీర్తనకున్ కొదయె | = | విష్ణు కీర్తన ఫలం (ఒకనాటి కీర్తన ఫలంలో సగం నా కివ్వటం వల్ల) తరిగిపోదు |

అనినన్ = అనగానే

**తాత్పర్యం :**

ఓ మాల దాసరీ! దయచేసి నేటి నీ విష్ణు కీర్తన ఫలంలో సగపాలు నాకోసం వెచ్చించు. చేప మ్రింగిన గుక్కెడు నీటితో సముద్రంలోని నీరు తరిగిపోదుకదా! అలాగే నా కిచ్చే ఈ కొద్దిపాటి విష్ణుగాన ఫలంతో నీ అపారమైన పుణ్యానికి కొదువ రాదు - అని బ్రహ్మరాక్షసుడనగానే దాసరి ఇలా అన్నాడు.

(అలంకారం = ప్రతివస్తూపమ)

65. శా॥ ఏలానొంచె దదేయ? మిట్లడిగి యెంతో బాస మేనం బలం
బో, లీలావటుగీత కీర్తన ఫలంబో, నీయెడ న్మున్ను? పా
తాళ ప్రశ్నలు మాని మే న్గొనుముఁ, బేతాళచ్ఛలోక్తిన్ రుషం
దూలింపం దలతేని, పుట్టుమతి నూతుల్ద్రవ్వ బేతాళముల్.

**కవి - కావ్యం :**

సాహితీ సమరాంగణ చక్రవర్తి ఆంధ్రభోజుడు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధ షష్ఠాశ్వాసం మాలదాసరి కథాభాగంలోనిది.

**సందర్భం :**

చేప మింగిన గ్రుక్కతో సముద్ర జలం తగ్గనట్లే ఏకదిన గీత ఫలంలో సగమిస్తే నీ అపార హరికీర్తన ఫలం తగ్గదని దాసరితో బ్రహ్మరాక్షసుడన్న సందర్భం.

**ప్రతిపదార్థాలు :**

అదేయము = ఇయ్యకూడని దానిని (గీత ఫలాన్ని)
ఇట్లు + అడిగి = ఇలా కోరి
ఏలా + నొంచెదు = ఎందుకు పీడిస్తావు
ఎంతేన్ = ఎంత పీడించినా
మున్ను = మునుపు
నీ + ఎడన్ = నీ పట్ల
బాస = నీకు నేను చేసిన ప్రతిజ్ఞ
మేనన్ = నా శరీరంలోని
పలంబు + ఓ = మాంసమా?
లీలావటు = మాయా బ్రహ్మచారి (అయిన వామనుడు = విష్ణుమూర్తి) యొక్క
గీత = గానరూపమైన
కీర్తన = స్తుతి
ఫలంబు + ఓ = పుణ్యమా?
పాతాళ ప్రశ్నలు = అగాధ ప్రశ్నలు = సమాధానం లేని ప్రశ్నలను అడగటం మానుకొని
మేన్ = (నా) శరీరాన్ని

| | | |
|---|---|---|
| కొనుము | = | తీసుకో |
| బేతాళ | = | పిశాచజాతి సహజమైన |
| ఛల + ఉక్తిన్ | = | (నీ) మాయమాటల చేత |
| రుషన్ | = | కోపంతో |
| తూలింపన్ | = | (మాట) జారే విధంగా చేయాలని |
| తలతు + ఏని | = | నీవు భావిస్తే |
| మఱి | = | అంతట |
| నూతుల్ | = | బావులను |
| త్రవ్వన్ | = | త్రవ్వగా |
| బేతాళముల్ | = | మరికొన్ని పిశాచాలు |
| పుట్టున్ | = | పుట్టుకవస్తాయి (అసలుకే మోసం వస్తుంది) |

**తాత్పర్యం :**

నీవు నా దేహాన్ని తప్ప మరొకటి అడగటం తగదు. కురుంగుడికి నన్ను పంపేటప్పుడు నీవడిగిన ప్రమాణం నా దేహాన్ని యిమ్మని మాత్రమే. కానీ నా విష్ణుగాన ఫలాన్ని కాదు. ఇక నీ బేతాళ ప్రశ్నలు మానుకో. నా దేహాన్ని తీసుకో. నీ పిశాచ జాతి సహజ ఛలన వచనాలతో నాకు కోపం తెప్పిస్తే, నేను నోరుజారి నా సంకీర్తన ఫలాన్ని ఇస్తానంటా ననుకొంటున్నావేమో. అలా జరగదు - నీళ్ల కోసం బావిని త్రవ్వితే భూతాలు పుట్టుకవచ్చి మనిషినే తిన్నాయన్న సామెత అవుతుంది నీ పని. నీ యుక్తితో నీకు ముక్తి కాదుగదా భుక్తి కూడ కరువవుతుంది. నీ యెత్తులు నాదగ్గర సాగవు - అన్నాడు దాసరి రాక్షసుడితో.

**విశేషాంశాలు :**

'కూపం ఖనతా భేతాళ ఉత్థాపితః' అని సంస్కృత న్యాయం. 'బావి త్రవ్వితే భూతం బయలుదేరినట్లు' అని తెలుగు సామెత. భేతాళ ప్రశ్నలు = విక్రమాదిత్యుడికి శ్మశానంలో భేతాళుడు వేసిన కఠిన ప్రశ్నల వంటి ప్రశ్నలు, (లేదా) సమాధానం చెప్పటానికి అతి కష్టతరమైన ప్రశ్నలు - అని భావం.

**వ్యాకరణాంశాలు :**

| | | |
|---|---|---|
| ఇట్లు + అడిగి = ఇట్లడిగి | = | ఉత్వసంధి |
| ఛల + ఉక్తి = ఛలోక్తి | = | గుణసంధి |
| ఎంత + ఏన్ = ఎంతేన్ | = | అకారసంధి |

**ఛందస్సు :**

శార్దూలం. గణాలు - మ స జ స త త గ. యతి - 1-13 అక్షరాలకు. ప్రాస నియమం ఉంది.

**అలంకారం :**

1. లోకోక్తి 2. విషమాలంకారం

1. 'పుట్టు మరి నూతుల్ త్రవ్వ బేతాళముల్' అనే లోకోక్తి వల్ల లోకోక్తితో సన్నివేశం అందగించింది - అందువల్ల లోకోక్తి అలంకారం.

2. ఇష్ట సిద్ధి కోసం యత్నిస్తే అనిష్టం సిద్ధించటం విషమాలంకారం.

ఇష్ట సిద్ధి - భేతాళ ఛలోక్తితో గానఫలాన్ని పొందగోరటం.

అనిష్ట సిద్ధి - మరికొన్ని భేతాళాలు పుట్టి (దాసరి) తనను తినగల వనటం.

మొత్తంమీద ఈ పద్యంలో లోకోక్తితో కూడిన విషమాలంకారం ఉంది.

66. వ॥ అనిన సాలకటంకటేయుడు .......

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| సాలకటంకటేయుడు | = | సాలకటంక వంశంవాడు అయిన బ్రహ్మరాక్షసుడు |
| డింగరీలు | = | భక్తులు |
| దర్శన ప్రవర్తకుడు | = | మత ప్రభోధకుడు |
| వైయాసిక | = | వ్యాసుడి రచన |
| విష్టర శ్రవుడు | = | విష్ణుమూర్తి |
| పూర్ణాహ్వయుడు | = | పూర్ణాచార్యుడనే పెరియనంబి |
| చామీకర గోపురం | = | బంగారు గోపురం |
| కల్యము | = | ప్రాతఃకాలం |
| పాషండులు | = | వేదబాహ్యులు |
| వల్లవి | = | గొల్ల స్త్రీ |
| టెంకణము | = | ప్రాంతము |
| నీరంధ్ర | = | దట్టమైన |
| కుసుంభాంబరము | = | కాషాయ వస్త్రం |
| ఫణిప | = | శేషుడు |
| అక్షపాద | = | గౌతముడు |
| మహానసం | = | వంటిల్లు |
| పల్లేర్లు | = | (అరిషడ్వర్గాలనే) ముళ్లు |
| మధుమధనుడు | = | విష్ణుమూర్తి |
| అగస్త్య ఉర్వీరుహము | = | అగసిచెట్టు |
| ఏష్యములు | = | రాగలవి |
| నిర్వాణము | = | మోక్షము |
| శమదమములు | = | అంతరింద్రియ, బహిరింద్రియ నిగ్రహం |
| నిషాది | = | ఎఱుకల జాతి స్త్రీ |
| కౌశికము | = | గుడ్లగూబ |
| గౌళి | = | బల్లి |
| కనుంబెంటి | = | ఒక జాతి పక్షి |
| భవోత్తారకంబు | = | సంసార బంధాలనుండి తప్పించేది |
| అధీతి బోధములు | = | చదవటం గ్రహించటం |
| కల్యాణం | = | మోక్షం |

అవిపన్నుడు = ముప్పులేనివాడు

**సారాంశం :**

ఓ దాసరీ! పూర్వకాలంలో మతప్రవర్తకుడై వేదవేదాంతాల్ని వ్యాఖ్యానం చేసి విశిష్టాద్వైతాన్ని స్థాపించారు రామానుజాచార్యుల వారు. వారికి గురువైన పెరియనంబి అనే పేరుగల పూర్ణాచార్యులు మంత్రోపదేశం చేశారు. దానిని యోగ్యతలేని వారికి ఉపదేశించ వద్దని కూడా ఆదేశించారు. కాని రామానుజులు దయార్ద్రులై శ్రీరంగంలోని బంగారు గోపురాన్ని అధిరోహించి పెద్దగా ఆ మంత్రాన్ని అందరకూ ఉపదేశించారు. అందుకు గురువుగారు కోపించగా, సమాధానంగా, తానొక్కడే తరించటంకంటె భక్తులందరను ఉద్ధరించటం మంచిది కదా అని పల్కారు. దానితో గురువుగారు ఆనందించారు. తరువాత తమ రామానుజ కూటాలలో నిరపేక్షంగా నిత్యం సపర్యలు చేసే భక్తులను ముక్తులను చేశారు. అనంతర కాలంలో రామానుజులవారు బంధముక్తులైనారు. కాలాంతరంలో వారే సుందర జామాతృనామంతో జన్మించారు. ఆర్చిరాది గతిని భక్తులకుపదేశించారు. అతడే మళ్లీ భవిష్యత్తులో శఠగోపులనే నామంతో జన్మించి యాదవగిరి ప్రాంతంలో వేదబాహ్యులను తమ ప్రసంగ పరంపరలతో పరాస్తం చేస్తారు. కాలక్రమంలో ఆంధ్రదేశ పండితుల నుండి భగవద్విషయిక భిక్ష గ్రహించి దేశమంతటా తన వాద పటిమతో అందరనూ జయించగలరు. అహోబిల స్వామి అనుగ్రహంతో యత్యాశ్రమాన్ని స్వీకరించి నిఖిల ఋషిప్రోక్త శాస్త్ర నిచయ విషయాలను తమ మత పండితులకూ శిష్యులకూ బోధిస్తారు. రాగ ద్వేషాలను వదలించుకొని తమ వద్దకు వచ్చిన వ్యక్తులకు భక్తి ప్రభోధం చేసి లోకాన్ని పవిత్రం చేస్తారు. అనంతర కాలంలో వేదాంత దేశికుడనే మరో విద్వాంసుడు శ్రీమన్నారాయణుడే పరమదైవమని ప్రతిపాదిస్తాడు. నూరు ప్రబంధాల నేర్పరుస్తాడు. అగిసె చెట్టుకు నిర్వాణం ప్రసాదిస్తాడు - అని బ్రహ్మరాక్షసుడన్నాడు.

ఇలా భవిష్యత్తును నేను దివ్యజ్ఞానంతో గ్రహిస్తాను. భవిష్యత్ జ్ఞానాన్ని బోధించటం జాతి సంబంధమైన విషయం. దానికి వారు పవిత్రులు కానక్కరలేదు. ఎందుకంటే? ఎరుకలది సోదె చెబుతుంది. పశుపక్ష్యాదులు కూడ భవిష్యత్తును సూచిస్తాయికదా! కనుక నా జ్ఞానం కూడ అటువంటిదే. నాస్తిక్యం వల్ల అధీతి బోధలు తప్పు, ఆచరణ శూన్యంగాను, ధర్మ బాహ్యం గాను లోకం మారింది. పాపరహితమైతేనే దేహానికి మోక్షం కలుగుతుంది. అందువల్ల నా వికృత రూపం పోవడానికి నేటి నీ విష్ణు గీతాలాపన పుణ్యంలోని నాల్గవ భాగమైనా దానమివ్వు, అని దాసరి పాదాల మీద పడి వేడుకున్నాడు బ్రహ్మరాక్షసుడు. అపుడు దాసరి కృపాళుడై అలాగే కానిమ్మని లెమ్మన్నాడు. అసలు ఈ బ్రహ్మరాక్షసత్వం ఎందుకు ఎలా వచ్చిందో చెప్పమన్నాడు. దానితో చెప్పటం ప్రారంభించాడు బ్రహ్మరాక్షసుడు.

**ముగింపు :**

బ్రహ్మరాక్షసుడు మనుష్య మాంసాన్ని ఆశించటం అనంతరం మాలదాసరి నీతి, ధర్మ ప్రవర్తనలతో మారిపోయి రాక్షస రూపాన్ని పోగొట్టుకోవాలని ఆశపడటం తెలుసుకున్నాం.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. ఆముక్తమాల్యద - శ్రీ వావిళ్ల రామస్వామిశాస్త్రులవారి 'రుచి' వ్యాఖ్య.
2. ఆముక్తమాల్యద - శ్రీ వేదం వేంకటరాయశాస్త్రులవారి 'సంజీవనీ' వ్యాఖ్య.
3. ఆముక్తమాల్యద - శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారి పీఠిక (ఎమెస్కో)
4. ఆముక్తమాల్యదా సౌందర్యము - ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు.



**డా॥ మేల్లచెర్వు భానుప్రసాదరావు**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
రీడర్ - తెలుగు శాఖ
శ్రీ సుబ్బరాయ నారాయణ కళాశాల
నరసరావుపేట - 522 601

పాఠం : 4

# మాలదాసరి కథ

## (సందర్భసహిత వ్యాఖ్యలు, ప్రశ్నలు - సమాధానాలు)

-శ్రీకృష్ణదేవరాయలు

**శీర్షికలు :**

4.0 లక్ష్యం
4.1 సందర్భసహిత వ్యాఖ్యలు
4.2 ప్రశ్నలు - సమాధానాలు

### 4.0 లక్ష్యం :

అముక్తమాల్యదలోని మొత్తం సందర్భసహిత వ్యాఖ్యలు ప్రశ్నలు-సమాధానాలు ఇందులోని ప్రధానాంశాలు.

### 4.1 సందర్భసహిత వ్యాఖ్యలు :

**1. పాడుము లాలస మంగళనామకైశికిన్**

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

శ్రీరంగనాధుడు విష్ణుచిత్తునకు మాలదాసరి కీర్తన సేవ యొక్క గొప్పతనమును వివరించు సందర్భము నందలిది.

**అర్థము :**

ఆసక్తితో, భక్తిభావముతో మంగళకైశికి రాగమున మమ్ములను సేవించు వైష్ణవ గీతాలాపన చేయునని అర్థము

**సమన్వయము :**

శ్రీరంగనాధుడు విష్ణుచిత్తునితో నా భక్తుడైన మాలదాసరి పూర్వము నేను వామనావతారమున నివశించిన ఆశ్రమప్రాంతమునకు మూడామడల దూరాన ఒక గ్రామములో నివసించుచుండును. అతడు ప్రతిరోజు వేకువనే వచ్చి నా స్తోత్రములు మంగళకైశికి రాగమున పాడి తరించునని వివరించెను.

**2. "మసిపాత మానికంబైయెదుగన్"**

**కవి పరిచయము :**

పై సందర్భ సహిత వాక్యమునకు వలెనె.

**సందర్భము :**

శ్రీరంగనాధుడు మాలదాసరి మలినమైన తన శరీరమందు మనస్సును శుభ్రముగా ఉంచుకొను విధానమును విష్ణుచిత్తుడు వివరించు సందర్భమునందలిది.

**అర్థము :**

మసిగుడ్డలో మాణిక్యము (కెంపు) ఒదిగినట్లుగా ఉన్నదని అర్థము.

**సమన్వయము :**

చండాలజాతికి చెందిన మాలదాసరి శ్రీరంగనాధునికి కైంకర్యము చేయు అవకాశము లేదు. అందువలన గానముతో సేవించి తరించెను. మలినమైన అతని శరీరములో ఎల్లప్పుడు పవిత్రముగా నుండు మనస్సు మసిగుడ్డలో ఒదిగిన మాణిక్యము వలె నున్నదని పోలిక చెప్పటం ఎంతో చక్కగానున్నది.

### 3. గాలి పసితాకుంజూడకాప్రాహ్ణమున్

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి పరవశముతో శ్రీరంగనాధుని కీర్తనలను గానము చేయునపుడు ఆకలిని, ఎండ తీవ్రతను పట్టించుకొనడని చెప్పు సందర్భమునందలిది.

**అర్థము :**

ఎండ తీవ్రతను, ఆకలిని, గాలిని లెక్కచేయకుండ మధ్యాహ్న సమయమున విష్ణుకీర్తనలను గానము చేయునని అర్థము.

**సమన్వయము :**

చండాలుడైన మాలదాసరి సద్వంశమందు జన్మించిన వారి ఆచారముల ననుసరించి ప్రతిరోజు శ్రీరంగనాధుని ఆలయము దగ్గర ఎండను, గాలిని, ఆకలిబాధను లెక్కచేయక రాళ్ళు కరుగు విధముగా తన వీణపై విష్ణునామ సంకీర్తనలను గానము చేసి పరవశముతో తాండవమాడును.

### 4. ప్రొద్దాయెనటంటు పాడబోవుచుత్రోవన్

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి ఒకనాటి అర్ధరాత్రి వేళ కోడికూతలను విని వేకువజామని భ్రమపడి విష్ణు నామ సంకీర్తనకై వెళ్ళు సందర్భము లోనిది.

**అర్థము :**

శ్రీరంగనాధుని గుడి దగ్గర సంకీర్తనకు వేళైనదని పాడబోవుచు మార్గమధ్యము నందు పాడునని అర్థము.

**సమన్వయము :**

ఒకరోజు అర్ధరాత్రి మాలదాసరి యింటి సమీపమున గల కోళ్లగూటిలోనికి పిల్లి ప్రవేశించుట వలన భయపడి కోళ్ళు అరిచెను. వాటిని విని వేకువ కోడికూతలుగా భ్రమపడి విష్ణుసంకీర్తనకు బయలుదేరి వెళ్ళు మార్గములో జరిగిన సంఘటనను వివరించు సందర్భమునందలిది.

**5. మహా ఫలోపమఫలస్ఫాయయద్వటక్ష్మాజమున్**

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని “మాలదాసరికథ” నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

కోడికూతలను విని వేకువజామని భ్రమించి మాలదాసరి శ్రీరంగనాధుని సేవకై బయలుదేరి మరులు తీగెత్రొక్కి దారితప్పి పెద్ద మఱ్ఱిచెట్టును చూచిన సందర్భమునందలిది.

**అర్థము :**

మహాభక్తుడు మాలదాసరి గొప్ప పుణ్యఫలమో అనునట్లుగానున్న పెద్దమఱ్ఱి చెట్టును చూచెను.

**సమన్వయము :**

కొమ్మల నుండి మొలచిన కొమ్మలతో గూడి అర్ధ యోజనము విస్తీర్ణము గలిగిన మఱ్ఱిచెట్టు కన్పించెను. గాలి తీవ్రత వలన చెట్టు నుండి పురుగులు ఆకులు ఎగిరి దూరముగా పడుచున్నవి. చెట్టు మీద నున్న బ్రహ్మరాక్షసుని భయముతో బాటసారులు ఆ ప్రాంతమునకు వచ్చుటకు భయపడుచుండిరి. ఆకులలోని గీరలు చెట్టుమీద రాక్షసుని ఉనికి తెలుపుచు బాటసారులను హెచ్చరించు నట్లున్నవని కవి వర్ణించెను.

**6. వరుగుతఱుచగుముఱుత్రోవ నెరిగి యెదుట.**

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని “మాలదాసరికథ” నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి దారితప్పి దుర్గంధముతో నిండిన దారిన వెళ్లి పెద్ద మఱ్ఱిచెట్టు వద్దకు వచ్చినపుడు భయంకరమైన ఆ ప్రదేశమున గద్దలు తిరుగుచున్నవను సందర్భమునందలిది.

**అర్థము :**

కొన్ని గద్దలు దుర్గంధముతో నిండిన ఆ ప్రాంతమున తిరుగుచున్నవని అర్థము.

**సమన్వయము :**

ఆ మఱ్ఱిచెట్టు చుట్టు మెదడు తిని పారవేసిన పుఱ్ఱెలు, మాంసపు ముక్కలపై ముసిరిన ఈగలు, మానవుల తలవెంట్రుకల తుట్టెలతో మిక్కిలి భయంకరముగా నుండెను. మాంసపు ముక్కలకై యితర జంతువులతో పాటు గద్దలు తిరుగుచున్నవి.

**7. పాటివారును తానును పట్టికొనుడు**

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని “మాలదాసరికథ” నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి బ్రహ్మరాక్షసునితో పోరాడి పారిపోవునపుడు పిశాచగణము పరుగెత్తి అతనిని పట్టుకొనిన సందర్భమునందలిది.

**అర్థము :**

పరుగెత్తుచున్న మాలదాసరిని బ్రహ్మరాక్షసుడు పిశాచగణము పట్టుకొనిరి.

**సమన్వయము :**

మహాబలవంతుడైన మాలదాసరి బ్రహ్మరాక్షసునితో పోరాడి అతనిని పిడిగ్రుద్దులతో పొడిచి తప్పించుకొని పారిపోవుచుండగా బ్రహ్మరాక్షసి తన అనుచరులైన పిశాచగణాన్ని పిలిచి వారి సహకారంతో అతనిని పట్టుకొని బంధించెను.

**8. నాకు మేనియెడ గాంక్షయు లేదిదిహోవుటేయురున్**

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

బ్రహ్మరాక్షసుడు మాలదాసరిని బంధించి అతనిని చంపుటకు కత్తిని, రక్తము పట్టుటకు పాత్రను తెమ్మని పిశాచములను పంపినపుడు మాలదాసరి తనకు శరీరముపై కాంక్ష లేదని పలుకు సందర్భములోనిది.

**అర్థము :**

మాలదాసరి బ్రహ్మరాక్షసునితో నాకు ఈ శరీరముపై కోరిక లేదు, ఈ శరీరము నీకు ఆహారమైపోవుటే తగునని అర్థము.

**సమన్వయము :**

ఓ రాక్షసుడా! నిన్ను జయించుట దేవతలకు కూడా సాధ్యము కాదు. నీ ఆహారమైన నేనెక్కడకు పోవుదును. ప్రాణరక్షణకు పోరాడకుండుట పాపము గనుక నీతో పారాడితిని. అంతేగాని నాకీ శరీరముపై కోరిక లేదు. నీకాహారమగుటయే నాకు తగుననెను.

**9. నశ్వరపుదేహమమ్మిపరముగొనుట**

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి బ్రహ్మరాక్షసునితో అశాశ్వతమైన శరీరమును అమ్మి శాశ్వతమైన మోక్షమును సాధింతునని పలుకు సందర్భము నందలిది.

**అర్థము :**

అశాశ్వతమైనట్టి శరీరమును ఖరీదుగా నిచ్చి మోక్షమును పొందుదునని అర్థము.

**సమన్వయము :**

చండాలుడైన మాలదాసరి తన హీనజన్మ వలన ఒక ప్రాణి ఆకలి తీరి సంతసించుట తాను మోక్షమును పొందుట తనకు ఎంతో ఆనందమని, శిబిచక్రవర్తి తన శరీరమును కోసి యిచ్చిన మహాదాత, అందువలన అశాశ్వతమైన తన శరీరమునిచ్చి శాశ్వతమైన ముక్తిని పొందుట సంతోషమని చెప్పెను.

## 10. "ప్రథమాంపిబతేవహ్ని" యనెడి మాటవుగాదె!

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి వేదశాస్త్ర విషయములను తెలిపి దేవతల గొప్పతనమును తెలుపునపుడు ఆ మాటలను ఖండించుచు రాక్షసుడు అగ్నిదేవుని నిందించు సందర్భమునందలి.

**అర్థము :**

చంద్రకళలను మొట్టమొదట ఆస్వాదించువాడు అగ్ని అని అర్థము.

**సమన్వయము :**

రాక్షసుడు దాసరితో నేను వేదములను, అన్ని శాస్త్రములను చదివినాడనే. నాకవేవియు ప్రియములు గావు, నీవు దేవతలను బ్రహ్మాంశసంభూతులని పొగిడితివి. చంద్రకళలను మొదట ఆస్వాదించునది అగ్ని కనుక దేవతలకా ఘనతను ఆపాదించనక్కరలేదనెను.

## 11. అమృతమైననుఁజనుల జాత్యన్నసమమే?

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

రాక్షసుడు అమృతమైనను జాత్యన్నముతో సమానమైనది కాదని పలుకు సందర్భమునందలిది.

**అర్థము :**

అమృతమైనను ఆయా జాతికి సహజమైన ఆహారముతో సమానమైనది కాలేదని అర్థము.

**సమన్వయము :**

దేవతలు మాకు సోదరులంటివి. సర్వభక్షకుడు అగ్నికి లేని పాపం మాకెక్కడిది. విష్ణువు వాహనమైన గరుత్మంతుడు అమృతభాండమును ఇంద్రుని గెలిచి తెచ్చి తిరిగి దేవతలకిచ్చెను. ఎంత అమృతమైనను ఆయా జాతికి సహజమైన ఆహారముతో సమానము కాదు. పక్షిరాజు గరుత్మంతుడు అమృతమునిచ్చి బదులుగా పాములను కోరెనని అదియే దీనికుదాహరణ మనెను.

## 11. ఈ చవిన కూర వింత చవిచాలగదెమ్మనుమెచ్చుదక్కగన్.

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

రాక్షసుడు మాలదాసరితో శాస్త్రజ్ఞానము కలిగిన ఈ దాసరి శరీరము వింత రుచిగా నుండునను సందర్భములోనిది.

**అర్థము :**

శాస్త్రజ్ఞానము కలిగి ఈ దాసరి శరీరము నాకు ఆహారమైన వింత రుచిగా నుండునని అర్థము.

**సమన్వయము :**

మాలదాసరి బ్రహ్మరాక్షసునితో వేదశాస్త్ర వచనములు, ఉపనిషత్తులను ఉదహరించుటతో రాక్షసుడు దాసరితో శాస్త్ర వచనములతో నన్ను నీవు మోసగించలేవు. శాస్త్రజ్ఞానము కలిగిన నీ మాంసము వింత రుచితో నుండుననెను.

## 12. సఖ్యంసాప్త పదీన మన్మనమిథస్సాంగత్య మూహించుచున్

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి బ్రహ్మరాక్షసునితో సాప్తపదీనమైన తమ స్నేహమును పురస్కరించుకొని తన కోరికను తీర్చుమని కోరు సందర్భమునందలిది.

**అర్థము :**

ఏడడుగులు కలిసి నడచిన వారి మధ్య స్నేహము కలుగునన్న పెద్దల మాటల ననుసరించి మన స్నేహబంధము గూర్చి ఆలోచింపుమని అర్థము.

**సమన్వయము :**

ఓ రాక్షసుడా! నీవు రాక్షసవంశ శ్రేష్ఠుడవు. నేను నీ కీర్తిని పెంపొందింతును. నేను నిత్యము ఆచరించు వ్రత మొకటి గలదు. నేడు దానికి భంగము వాటిల్లినది. ఏడడుగులు కలసి నడచిన స్నేహబంధమేర్పడు నందురు. దానిని పురస్కరించుకొని నేనా వ్రతమును తీర్చుకొను నవకాశము నొసగుమని దాసరి కోరెను.

## 13. అశనము నీకౌదున్మమ్మఖ్యమదియే నేడగుఁదుదకున్

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

శ్రీరంగనాధునికి తాను ప్రతినిత్య మొనరించు గాన కైంకర్య వ్రతదీక్షా నంతరము వచ్చి బ్రహ్మరాక్షసున కాహార మగుదు నని చెప్పు సందర్భమునందలిది.

**అర్థము :**

వ్రతదీక్ష చాలా ముఖ్యమైనదని, అది పూర్తికాగానే వచ్చి రాక్షసునకు ఆహార మగుదునని అర్థము.

**సమన్వయము :**

మాలదాసరి ప్రతిరోజు సమీపమునందున్న కురుంగుడిలో శ్రీరంగనాధుని స్తోత్రములు పాడు వ్రతము నాచరించుచుండెను. ఆ వ్రతము నీరోజు పూర్తిచేసుకొని వచ్చి రాక్షసునకు ఆహార మగుదునని చెప్పెను.

## 14. వేనవేల సత్యములు వల్కి వినకయున్న

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం పష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి బ్రహ్మరాక్షసునితో తన వ్రతమును పూర్తి చేసికొని వచ్చెదనని ఎన్ని ప్రతిజ్ఞలు చేసినను నమ్మక తిరస్కరించిన సందర్భమునందలిది.

**అర్థము :**

మాలదాసరి బ్రహ్మరాక్షసునితో వేలకొలది సత్యములు పలికినను వినలేదు.

**సమన్వయము :**

మాలదాసరీ! సిద్ధాన్నమును ఎవడు వదలుకొనును. తన ప్రతిజ్ఞను నెరవేర్చుకొనుటకు శరీరమును త్యాగము చేయువారుండరు. అని రాక్షసుడనగా హరినామస్మరణతో దాసరి చెవులు మూసుకొని తనను నమ్మమని వేలకొలది సత్యములు పలికినను రాక్షసుడు నమ్మలేదు.

## 15. రాత్రిచరుతో వ్రతపూర్తి గతార్తినిట్లనున్

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం పష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి బ్రహ్మరాక్షసుని ఒప్పించి గుడికి వెళ్ళి వ్రతదీక్షను ముగించుకొని తిరిగి వచ్చి యతనితో పలుకు సందర్భము నందలిది.

**అర్థము :**

తన వ్రతమును పూర్తిచేసికొని వచ్చిన మాలదాసరి బ్రహ్మరాక్షసునితో సంతోషముతో నిట్లనెను.

**సమన్వయము :**

బ్రహ్మరాక్షసుని ఎట్లో అంగీకరింపజేసి మాలదాసరి కురుంగుడికి వెళ్ళి తనవ్రతమును పూర్తి చేసికొని అసత్యదోష భీతితో వడివడిగా వచ్చి రాక్షసునితో తన వ్రతము పూర్తియైనదని సంతోషముతో చెప్పెను.

## 16. నీయురు కృపాకటాక్షమున జేసి ధన్యుడనైతి

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం పష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి వ్రత నియమమును, సత్యనిష్ఠను బ్రహ్మరాక్షసుడు మిక్కిలి ప్రశంసించెను. మాలదాసరి యతనిని కౌగిలించుకొని నీ దయ వలన నేను ధన్యుడనైతినని పలుకు సందర్భమునందలిది.

**అర్థము :**

గొప్పదగు నీదయా కటాక్షము చేత నేను ధన్యుడనైతినని అర్థము

**సమన్వయము :**

మాలదాసరి తన వ్రతదీక్షను పూర్తిచేసికొని పాపభీతితో తిరిగి రాగానే రాక్షసుడు అతని సత్యసంధతను మెచ్చుకొనెను. దాసరి యతనిని కౌగిలించుకొని నీ దయ వలన నా వ్రతము పూర్తిచేసికొంటిని ధన్యుడనైతినని పలికెను.

## 17. బడలికదీఱనిత్తనువుఁబారణసేయుము మైత్రిగల్గినన్

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం పష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి బ్రహ్మరాక్షసునితో నేను బ్రహ్మచేత మీకు విధించబడిన ఆహారమును. కనుక నా శరీరమును తిని నీ ఆకలిని తీర్చుకొనుమనెను.

**అర్థము :**

నీ అలసట తీఱునట్లు నా శరీరమును భక్షింపుము. స్నేహధర్మమును ప్రదర్శింపుమనెను.

**సమన్వయము :**

నీవు ఆకలితో బాధపడుచు గూడ నా వ్రతధర్మమును నిర్వర్తించుకొను అవకాశమును కల్పించితివి. బ్రహ్మ నన్ను నీకు ఆహారముగ విధించినాడు. దీనివలన నీకే కీడు కలుగదు. స్నేహ ధర్మమును పాటించి నీ బడలిక తీరునట్లు నన్ను భక్షించి నీ ఆకలి తీర్చుకొనుమనెను.

**18. మాయేవము వెనుకటిది చూడకీక్షింపుకృపన్**

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మావంటి వారికి మోక్షము కలుగవలెననిచో మీవంటి వారి కృపావీక్షణము కావలయును. నీచమైన నాగత జీవితమును గూర్చి ఆలోచింపక నన్ను కరుణింపు మనిన సందర్భమునందలిది.

**అర్థము :**

వెనుకటి నా నీచమైన జీవితమును గురించి పట్టించుకొనక దయతో నన్ను ధన్యుని చేయుమని అర్థము.

**సమన్వయము :**

బ్రహ్మరాక్షసుడు మాలదాసరితో నీవంటి విష్ణుభక్తులు పట్టించుకోకపోతే మావంటి పాపాత్ములు ఎట్లు పవిత్రులగుదురు. కావున వెనుకటి నా నీచజీవితమును గురించి పట్టించుకొనక నీ దయను ప్రసాదింపుము. నన్ను ధన్యుని జేయుమని ప్రార్థించెను.

**19. మదాత్మకసటుబాపుటయే యనుకంపగాక!**

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

కుంభజానువను పేరు గల బ్రహ్మరాక్షసుడు మాలదాసరితో నీ దేహమును ఆహారముగా నాకిచ్చుట నాపై దయ చూపుటగాదు. నా జీవుని పాపమును తొలగించి నన్ను ధన్యుని చేయుమని అర్థించు సందర్భమునందలిది.

**అర్థము :**

నా పాపములను తొలగించి నన్ను పవిత్రుని చేయుట నా పట్ల దయచూపి నట్లగునని అర్థము.

**సమన్వయము :**

మాలదాసరి తన శరీరమును భక్షింపుమనగా బ్రహ్మరాక్షసుడు మిక్కిలి దుఃఖముతో నిన్ను భక్షింపుమనుట నాపై దయ చూపుట గాదు. నా పాపములను ప్రక్షాళన మొనర్చి నన్ను ధన్యుని చేయమనెను.

**20. పూజనము గాదా ప్రాణమేల్చక్రికిన్**

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

బ్రహ్మరాక్షసుడు మాలదాసరి తనను భక్షింపుమనగా అదికాదని తనను కాపాడుమని, అట్లు చేయుట విష్ణువును అర్చించుట వంటిదనిన సందర్భము నందలిది.

**అర్థము :**

ఒక ప్రాణికి మేలు చేయుటనగా శ్రీమహావిష్ణువును అర్చించుటతో సమానమని అర్థము.

**సమన్వయము :**

కుంభజానువను బ్రహ్మరాక్షసుడు మాలదాసరితో తన పాపములను తొలగించి తనను ధన్యుని చేయుమనెను. ఒక ప్రాణిని కాపాడుటనగా విష్ణువును అర్చించుటతో సమానమని తెలిపెను. హరిభక్తులు విష్ణువు కంటె గొప్పవారు గనుక నాకు మేలు చేసిన పుణ్యము కలుగునని తెలిపెను.

### 21. ఒక త్రుటి గీత ఫలంబు నొసగుదునె! యిమ్మెరుకిన్

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

బ్రహ్మరాక్షసుడు తన పూర్వజన్మ వృత్తాంతమును తెలిపి, శాపవశమున తనకు సంభవించిన రాక్షసత్వము నుండి విముక్తి పొందుటకు మాలదాసరితో నాటి విష్ణు గాన ఫలమును ప్రసాదింపుమని ప్రార్థించినపుడు మాలదాసరి పలికిన సందర్భములోనిది.

**అర్థము :**

ఈ నా శరీరమును రక్షించుకొనుటకు ఒక్క క్షణకాలపు గీత ఫలమునైనను యివ్వజాలనని అర్థము.

**సమన్వయము :**

మాలదాసరి రాక్షసునితో ఓ రాత్రించరా! నీవు నేను యిప్పటికెన్నో జన్మలెత్తితిమి. ఏనాడు విష్ణుభక్తిని కలిగియుండలేదు. అందుకనే మళ్ళీ మళ్ళీ జన్మించుచున్నాను. ఈ జన్మలో విష్ణుభక్తితో ముక్తిని పొందవలెను. అందువలన విష్ణుగాన ఫలమును నీకివ్వ లేనని చెప్పెను.

### 22. కప్పురంవెట్టి యుప్పుగొనుట

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి బ్రహ్మరాక్షసునితో అశాశ్వతమైన ఈ శరీరమును రక్షించుకొనుటకు విష్ణునామ సంకీర్తన ఫలము నివ్వజాలనని పలుకు సందర్భములోనిది.

**అర్థము :**

కర్పూరమును యిచ్చి దానికి బదులుగా ఉప్పును తీసుకొనుట అవివేకమని అర్థము.

**సమన్వయము :**

మాలదాసరి రాక్షసునితో యిప్పటికి మనమెన్నో జన్మలెత్తితిమి. విష్ణునామ సంకీర్తనతో మోక్షమును పొందదలచితిని. విష్ణు భక్తులకు మరుజన్మ లేదు. ఊత నీరు, సాలీడు నేత, ఎండబెట్టిన దూది, పసుపు యేవిధముగా అస్థిరములో అట్లే శరీరము నశాశ్వతము. దాని కొఱకు పుణ్యమును వ్యయము చేయుట కర్పూరమునమ్మి ఉప్పు కొనుటవంటి దనెను.

**23. మీన్‌మ్రింగఁగ్రక్కన్ వారధింగొఱతయే?**

**కవి పరిచయము :**

ఈ వాక్యము సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడగు శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం షష్ఠాశ్వాసంలోని "మాలదాసరికథ" నుండి గ్రహింపబడినది.

**సందర్భము :**

మాలదాసరి నశ్వరమైన శరీరము కొఱకు గానఫలము నివ్వననినపుడు బ్రహ్మరాక్షసుడు మాలదాసరితో ఒక్కరోజు గాన ఫలములో సగమిచ్చినంత మాత్రమున నీకు పోయినదేమున్నదనిన సందర్భమునందలిది.

**అర్థము :**

చేప మ్రింగిన గుక్కెడు నీటి వలన సముద్రమునకు ఎట్టి కొఱత రాదని యర్థము.

**సమన్వయము :**

అశాశ్వతమైన శరీరము నపేక్షించి గానఫలము నివ్వజాలననిన మాలదాసరితో బ్రహ్మరాక్షసుడు ఒకరోజు పుణ్యములో సగమైనను యిచ్చి తనకు శాపవిమోచనము కలిగింపుమనెను. దాని వలన దాసరికేమియు కొదవరా దనెను. చేప సముద్రములో ఒక గ్రుక్కెడు నీటిని తాగినంత మాత్రమున సముద్రమునకు ఏ కొఱతయు రాదుగదా యనెను.

## 4.2 ప్రశ్నలు - సమాధానములు

**1. మాలదాసరి నిత్యకృత్యములను తెలిపి అతడు దారితప్పుటకు గల కారణములు వివరింపుము.**

శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యద ఆరవ ఆశ్వాసమునందు మాలదాసరి కథను మిక్కిలి మనోహరముగా రచించెను. "పేరు కొనగాలికులం"లో ఒక భక్తుడున్నాడని విష్ణువే ఈ కథను విష్ణుచిత్తునకు చెప్పెను. శ్రీమహావిష్ణువు వామనావతారమున నివసించిన భూమికి మూడు యోజనముల దూరమున గల నొక పల్లెటూరిలో విష్ణుభక్తుడగు మాలదాసరి యొకడు జీవించుచుండెను. అతడు ప్రతి దినము బ్రహ్మముహూర్తమున (వేకువజామున) దేవాలయమునకు వచ్చి మంగళకైశికి నామ గాత్రముతో దేవుని స్తుతించి పోవుచుండెడివాడు. అతని హృదయము నిర్మలమై పరిశుద్ధమై, చండాల సాంగత్యముతో మసిగుడ్డను కట్టిన మాణిక్యము వలె నుండెను. చమురంటిన తోలుచొక్కా, కుళ్ళాయి ఇత్తడి శంఖచక్రముల కమ్మలు, దీపస్తంభము, చర్మపుతిత్తి చేతితో పొడచెడు బాణము, మొగలాకు గొడుగు, గుజ్జుపు వెంద్రుకలు బిగించిన నొకరకపు వీణ, చిటితాళములు చంకను భావనాశి యివన్నియు తగిలి ధ్వనించుచుండగా వనమాల కంటెను ధరించి మాసినశరీరముతో తిరునామము ధరించి బెదరు చూపులతో పసుపురాసిన తోలు జంధ్యమును ధరించి భగవంతుని సేవించుటకు వచ్చి ఎండ, గాలి, ఆకలిని లెక్కింపక మధ్యాహ్నము వరకు రాళ్ళు కరుగునట్లు వీణను మీటుచు స్తోత్రము పాడును.

ఈ విధముగా మిట్టమధ్యాహ్నము వరకు సేవించి గర్భగుడిని కడిగిన నీరు లోపలి తొట్టి నుండి బయటకు రాగా తాను పంచమకులస్థుడగుటచే శూద్రుడెవరైనను దయతో తెచ్చి యివ్వగా దానిని స్వీకరించును. గర్వమేమాత్రము లేని యా దాసరి దైవ ప్రసాదముపై ప్రీతితో బ్రాహ్మణులను చూచి వినయముతో తొలగుచు ఎంతో సేపు వేచియుండి చివరకే శూద్రుడో దయతలచి యిచ్చిన తీర్థప్రసాదములను స్వీకరించును. పంచమకులస్థుడైనందుకు బాధపడుచు కోవెల వెలుపల నుండి సేవించి బహిఃప్రాకారము చుట్టును ప్రదక్షిణము చేసి ప్రొద్దుపోయిన తరువాత తన పల్లెకు చేరుచుండెను. ఇట్లుండగా నొకనాడు అర్ధరాత్రి కోళ్ళగూడులోనికి పిల్లి ప్రవేశించుటచే భయపడి కోళ్ళు కూయగా వేకువ యైనదని భ్రమించి మాలదాసరి నిత్యము వలె గుడికి బయలుదేరెను. దారిలో దాసరి మరులు తీగె త్రొక్కి దారితప్పి ఆ కటికచీకటిలో పొలములన్నియు తిరిగి తెల్లవారు సమయమునకు ఒక నిర్మానుష్య అడివి ప్రాంతమును చేరెను. ఆ ప్రాంతమంతయు చిటిరేగుచెట్ల కోరింద చెట్లతో నిండియుండెను. బావులు సహితము గడ్డితో కప్పబడిపోయినవి. అ తప్పుదారిలో పోవుచు మార్గము మధ్యమునందు ఉత్తరేణి ముళ్ళు కాళ్ళకంటుకొనగా వానిని మెల్లగా తీసి వేయుచు, పల్లీరుకాయలు గుచ్చుకొనగా వానిని మెలకువతో తొలగించుకొనుచు పోవుచుండెను. ఈ విధముగా మాల దాసరి దారితప్పిన వాడయ్యెను.

## 2. దారితప్పిన మాలదాసరి అడవిలో చూచిన విశేషములను వివరించునది.

మాలదాసరి దారితప్పి పోవుచూ నిర్మానుష్యమైన అడవిలో ప్రవేశించాడు. అతడచ్చట రెండు క్రోసుల నిడివి కలిగి, ఊడలు దిగి, వాటియందే శాఖోపశాఖలుగా విస్తరించిన పెద్ద మఱ్ఱిచెట్టును చూచెను. ఆ చెట్టుకొమ్మల మీద పురుగులు తొలచి, బొందలతో గూడినివి, గాలి తాకిడితో దూరముగా కొట్టుకొచ్చిన ఆకులు ఎగురుచుండెను. ఆ వృక్షముపై బ్రహ్మరాక్షసి ఉన్నాడు, ఈ వైపునకు రావలదని మార్గస్తులను హెచ్చరించుటకు ఆకులనెడి పత్రములపై గీతలను అక్షరములను వ్రాసి పంపుచున్నదో అన్నట్లుండెను. దానివలన బాటసారులు ఆ మార్గమున ప్రవేశింపకుండుట చేసి పుణ్యఫలమును పొందెననునట్లు అనేకమయిన పండ్లచేత నొప్పుచున్న మఱ్ఱిచెట్టును చూచెను. ఆ చెట్టుపై నివశించు బ్రహ్మరాక్షసుడు మార్గస్తులను చంపి తినును గనుక ఆ ప్రాంతమంతయు మెదడు తిని పారవేసిన పుఱ్ఱెలు, ఎముకలు, శరీరము నుండి చర్మమునొలిచి కంపలల మీద వేయగా ఈగలు ముసిరి రూపము తెలియకుండా వ్రేలాడుచున్న పచ్చి చర్మములు, ఎంతో కాలమునుండి ఎందరినో చంపుట చేత వారి తల వెంట్రుకలు కుప్పలై పడి వుండి, ధూళి చేత మక్కడువారి గాలిచేత మంగళ్ళ వెంట్రుకల సముదాయము రేగినట్లు చలించుచున్నవని, ముక్కలైన మానవ శరీరావయములను అటు ఇటు లాగుకొనుచు పెనుగులాడుచున్న క్రూరమృగములతో కూడినది, కాలితన్నుల చేత ముక్కలై కంపుకొట్టుచున్న ఎండుమాంసమును, మురిగిపోయిన మాంసము కంపుతో భయంకరమైన మార్గమున వెళ్ళుచుండెను. అచ్చట ముంగాళ్ళపై సాగిలపడి దొంగచూపులు చూచుచు ఎముకలను ఎత్తుకొని పారిపోవుచున్న కుక్కలతోను, మాంసము ముక్కలను ఎత్తుకొని పైకెగురగా కొమ్మలు కదులుచుండగా రాబందులు శబ్దములచేతను రాక్షసుని అరచేతి దెబ్బతిని నడుమున చేతులుంచుకొని అంగలార్చు కోతుల గుంపుతోను, హఠాత్తుగా కనిపించిన ప్రదేశములు కనపడకపోగా మరియొక దిక్కున కనపడుచున్న వ్యాపారములచేత ఈ ప్రదేశమున ఎవరో వున్నాడు. వాడు మానవుడు కాడు. మాంసపు గాలి వీచుచున్నది అని దిగులు పడుచుండగా బ్రహ్మరాక్షసుడు కనిపించెను. చచ్చిన మానవుని శరీరము గోచీగా పెట్టుకొనగా పొడవు చాలక రక్తము కారుచున్న పెద్ద పొట్టయందు మొలత్రాడు కలవానిని, నల్ల చీమల బారుతో నుండిని వంకర జీడిమామిడి చెట్టువలె. రక్త వర్ణము గల దుప్పటి చేత నొప్పుచున్న నల్లని శరీరము కల వానిని. తలక్రిందులైన ఏనుగు తల వలె నున్న గడ్డము వానిని, కోరలతో నొప్పుచున్న ముఖము గలవానిని, కందిరీగల గుంపువలె తెలుపు నతిశయించిన కనుబొమ్మలు గలవానిని, ఎవరైనను బాటసారులు వచ్చుచున్నారేమో పట్టి తినవలయునను కోరికతో చెట్టుకొమ్మల నెక్కి చూచుచు జారిపోవు ప్రేగుల జందెమును భుజముపై వేసుకొనెడు వాడును, వ్రేలాడు పెద్ద బొజ్జగల వాడును, ఏనుగు కాళ్ళవంటి కాళ్ళు గలవాడును, చెంబువంటి తల గల వానిని ఒక రాక్షసుని జూచెను. కండలు పెరిగిన కన్నులు కలిగిన వానిని, ఆకలి చేత ఆడదయ్యములను బూతులు తిట్టువానిని, పర్వతము వలె నున్న కుంభజానువను నొక బ్రహ్మరాక్షసుని జూచెను.

**3. మాలదాసరికి, బ్రహ్మరాక్షసునికి జరిగిన సంవాదమును వివరించునది.**
**(లేదా) మంగళకైశికీ గాన ప్రభావమును తెలుపుము.**

మాలదాసరి శ్రీమహావిష్ణువు వామనావతారమున తిరిగిన పుణ్యభూమికి మూడామడల దూరమున నున్న మాలవాడలో నివశించుచుండెను. అతడు రోజూ మూడామడలు నడచివచ్చి ఆ దేవుని కీర్తించి తీర్థప్రసాదములు గ్రహించుచు ప్రొద్దెక్కిన తరువాత పల్లెకు చేరుచుండెను.

ఇట్లుండగానొకనాడు అర్ధరాత్రి పిల్లి కోళ్లగూడులో ప్రవేశించగా వాటి అరుపులకు మేలుకొని వేకువజామైనదని తలచి స్వామి సేవకు బయలుదేరెను. ఆ అర్ధరాత్రి మరులుతీగె త్రొక్కి దారితప్పి కటిక చీకటిలో పొలములన్నియూ తిరిగితిరిగి తెల్లవారువేళకు ఒక భయంకర ప్రదేశముననున్న మఱ్ఱిచెట్టును, దాని నాశ్రయించియున్న బ్రహ్మరాక్షసిని జూచెను.

ఆ రాక్షసుడు మాలదాసరిని జూచి నా కంటబడితివి, ఎచ్చటికి పోయెద వనుచు చెట్టుపైనుండి దూకి మాలదాసరితో కలపడెను. దాసరియు బలవంతుడు ధైర్యవంతుడగుటచే తనవద్ద నున్న బాణముతో రాక్షసుని పొడిచెను. రాక్షసుడు దానిని విరచి దాసరిని పట్టుకొన ప్రయత్నించెను. భగవంతుడిని స్మరించుకొనుచు అతని నుండి తప్పించుకొనుటకు యత్నించెను. అంత రాక్షసుడు తన పరివారమును పిలిచి దాసరిని పట్టుకొని మఱ్ఱిచెట్టునకు కట్టెను. అప్పుడు మాలదాసరి ధైర్యముతో రాక్షసునితోనిట్లనెను. "ఓ రాక్షసుడా! ఒక్క మాట వినుము. తొందరెందులకు దేవతలైనను నిన్ను జయింపలేరు. నేను నీకు వడ్డించిన అన్నము వంటి వాడను. ఆత్మరక్షణ చేసుకొనకుండుట మహాపాపము. కోపింపకుము నాకీ శరీరముపై ఆశ లేదు ఇది పోవుటయే మేలు. చండాల జన్మ పోయి ముక్తిని పొందుటకు మించినది యేమున్నది. దీనికి శిబిచక్రవర్తి మార్గదర్శకు డాయెనుగదా! రోగాదులచే నశింపక ఆకలితో బాధపడు నొకనికి ఈ శరీరము నిచ్చుట మంచిదిగదా! అంతేగాదు. ఇంకను వినుము. నేను ప్రాణభయముతో నిట్లు చెప్పుచున్నాని భావింపక వినుము. వేదములు చంద్రుని ప్రథమ కళను అగ్ని స్వీకరించునని చెప్పుచున్నవి. మంచి చెడులు ఆలోచింపుమని ధర్మసూక్ష్మమును తెలుపగా రాక్షసుడు పకపకా నవ్వుచూ దాసరితో నిట్లనెను.

ఓయీ దాసరి! చదువులను గుర్తుచేసి చంపకుము, మేముచదువని శాస్త్రములు, శ్రుతులు లేవు. అవి మాకు రుచింపవు. మమ్ము దేవతలకు తోబుట్టువు లనుచున్నావు. వారు అపవిత్రాహారులుగారు. నిన్నొకమాటడిగెదను. అగ్ని సర్వభక్షకుడుగదా! మా పెద్దలననుసరించుట పాపముగాదు గదా! అనుచూ గరుత్మంతుడు అమృతమునకు బదులుగా పాములను స్వీకరించెనని తెలిపి అమృతమైనను జాత్యన్నమునకు సరిగాదనెను. నీవెన్ని శాస్త్రములు చదివినను నిన్ను వధింపక మాననెను.

రాక్షసుని వికృతపు మాటలకు దాసరి విష్ణునామ స్మరణ చేసి నిట్లనెను. నేను శాస్త్రజ్ఞానము లేనివాడను. నీకు సమాధానము చెప్పలేను. నా తప్పులను మన్నించి నా ప్రార్థన నాలకింపుము. నీవు రాక్ష శ్రేష్ఠుడవు. నీకు కీర్తి కలిగించునొక మాట చెప్పెదను. నాకొక వ్రతమున్నది. దానిని సఫలము చేయుము. ఏడడుగులు కలిసి నడిచిన స్నేహము కలుగునను శాస్త్ర వాక్యములను తలచి నా వ్రతమును సఫలము చేయుము. ఈ సమీపమందలి తిరుక్కురుంగుడి స్వామిని సేవించి వత్తును నా వ్రతము సఫలమగు ననెను. అతని ప్రార్థనకు రాక్షసుడు నవ్వుచూ పరిహాసముతో నిట్లనెను. దారులు కొట్టి దేహమును పెంచి విరక్తిచెంది దాసరివైతివి. తప్పించుకొన దలచితివా, నీ తెలివితేటలకు మెచ్చుకొంటిని. ఏదేశమందైనను ఎవరైనను నోటి దగ్గర కూడు విడువరు. నిన్ను విడువను. నీ మాట నమ్మను. నీ అధిక ప్రసంగములు మాను మనగా దాసరి చెవులు మూసుకొని నారాయణ నామస్మరణ చేసి వినకున్న తుదకిట్లనెను "నేటి దినమే నిన్ను చేరరాకపోయితినేని విష్ణునితోడ సరియగు దేవుడున్నాడని చెప్పెడు వాని పాపమున పోగలవాడ నని" ప్రమాణము చేయగనే ఆ రాక్షసుడు మారు పలకక కట్లు విప్పెను. వెంటనే మాలదాసరి తిరుక్కురుం గుడికేగి స్వామిని మ్రొక్కి వీణ వాయించుచూ స్తుతించి. అసత్యము వలని భయాతిశయముచే వేగముగా రాక్షసుని చేరి యిట్లనెను.

రజనీచర! నీ చెఱ వదలి పోయి స్వామిని సేవించి సమస్త బంధములు వదలి వచ్చితిని. నన్ను స్వీకరింపమనెను. అతని సత్యసంధతకు ఆనందభాష్పములతో దాసరిని స్తుతించుచూ నాతని పాదములపైబడి యిట్లనెను. ఓ దాసరి! దేవదానవులలో,

మునులలో నీవంటి సత్యవంతులు లేరని ప్రమాణము చేయుచున్నాను అనెను. అప్పుడు మాలదాసరి నీ దయచే నా గాన వ్రతమును పూర్తిచేసి ధన్యుడనైతిని. నీవింత పుణ్యాత్ముడవు గాన పుణ్యజనుడను బిరుదు నీకే చెల్లినది. నీ వలన నీ కులము వారందరు పుణ్యజనులైనారని రాక్షసుని పొగిడెను. నన్ను ఆహారముగా స్వీకరింపుమనెను. అంత రాక్షసుడు ఇప్పటివరకు నరమాంసమే ఆహారము గాని శరీరమును పెంచి, ఏ తాపసియైనను రాడా, ఆయన దయచేత ఈ పాపపు జన్మ పోగొట్టుకొందునని యున్నాను. నీవు వచ్చి ఇట్లంటివి. నీవంటి పరమపుణ్యాత్ములు, భాగవతోత్తములు మావంటి వారిని పవిత్రులుగా చేయరేని మాగతి యేమి? పరుసువేది గొడ్డలిని బంగారము చేసినట్లు నన్ను దయచూడుము. పవిత్రుని చేయుము. నీ దేహార్పణముకంటే నన్ను పవిత్రుని చేయుటే కోరెదను. ఘంటాకర్ణుని కంటె నేనుపాపాత్ముడనుగాను. భగవంతుడతనికి మోక్షము నొసగెను. భగవంతుడి కంటెను భాగవతులెక్కువ మేలు చేయలేరా! నీవు నాకు అట్టి మేలు చేయుము. ఒక ప్రాణికి మేలు చేయుట పరమేశ్వర పూజ గదా! కావున నన్ను రక్షింపమనెను. ఆ తెఱగేమిటో చెప్పుమనిన దాసరితో రాక్షసుడిట్లనెను మహాత్మా! నేనొక బ్రహ్మరాక్షసుడను. కుంభజానువను పేరు గలవాడను. ఈ మఱ్ఱిచెట్టు నాశ్రయించి వంచనతో దారిని పోవువారిని చంపి తినుచుండెడి వాడను. పూర్వ జన్మమున సోమశర్మ యను బ్రాహ్మణుడను. ఒక పాపకార్యము చేసి ఇట్లయితిని. విష్ణువును స్తుతించు గాన ఫలమును నాకొసగి నా రాక్షసత్వమును తొలగింపుము. ధర్మసాధనమైన ఈ శరీరమున ఇల్లు చేరుదును అనగా ఆ మాటలకు దాసరి పకపకనవ్వుచు నిట్లనెను. ఇటువంటి యింతకు మించిన జన్మములెన్నియో యెత్తినాను. అట్టి ఈ శరీరము కొఱకు ఒకనాటి నా పాపఫలమేగాదు, ఒక క్షణకాలపు ఫలమైనను నీయ ననెను. నీవు నేను యిప్పటికి యెన్నో జన్మలెత్తినాము. ఏనాడు విష్ణుభక్తి గలిగి యుండలేదు. విష్ణుభక్తి గలిగినవారికి మరుజన్మ యుండదు. అశాశ్వతమగు ఈ శరీరము కొఱకు పుణ్యమును ధారపోయుట కర్పూరము నమ్మి ఉప్పును గొనుట వంటిది. అనగా రాక్షసుడు సంగీత ఫలములో సగము ధారపోయుము. చేప మ్రింగిన గుక్కనీటి వలన సముద్రమునకే కొఱత రాదు. అట్లే నీకు హరి కీర్తన తఱుగదు గదా! అనెను అంత దాసరి ఓ రాక్షసుడా! నీవు పాతాళ ప్రశ్నలు మాని నేను చేసిన ప్రమాణము ప్రకారము నా శరీరమును భక్షింపుము. ఆలస్యము చేసినచో యితర భూతములు వచ్చి నన్ను తినును. కావున మన మాట ప్రకారము నీవే నన్ను తినుము అనెను. అప్పుడు రాక్షసుడు కన్నీటితో నిట్లనెను. విష్ణుభక్తులు దయాసముద్రులు కావలదా? అనుచు ఈ ప్రభాత సమయమున పాడిన పాట ఫలము నిచ్చి నాకు శాపవిమోచనము గావింపు మనుచు దాసరి పాదములపైబడి లేవకున్న దాసరి దయతో నిండినవాడై యట్లేకానిమ్మని లేవనెత్తి రాక్షసాకారము వచ్చుటకు కారణ మడుగగా బ్రహ్మరాక్షసుడు తన కథనంతటిని చెప్పెను.

### 4. తన్ను భక్షింపుమనిన మాలదాసరి మాటలకు బాధపడిన బ్రహ్మరాక్షసుడేమనెను?

పాతాళ ప్రశ్నలు మాని తనను అనుగ్రహించుమని పలికిన విని ఆ రాక్షసుడు కన్నీరు గార్చుచు అయ్యయ్యో! శ్రీమహావిష్ణువుకు హితులగు భక్తులు కృప గలిగినవారు కావలదా? పూర్వము దర్శనప్రవర్తకుడైన వ్యాసుడు తెలిపిన వేదాంత సూత్రము వ్యాఖ్యానము చెప్పి నారాయణుని విశిష్టాద్వైతము సిద్ధాంతము చేసినటువంటి రామానుజాచార్యులనెడు యోగి శ్రేష్ఠుడు బహుకాల శుశ్రూష చేత సంతృప్తి చెంది తన గురువు ప్రసాదించిన తిరుమంత్రమును గోపురమెక్కి చాటగా కోపించిన స్వామితో దేవరవారి యాజ్ఞ మీరక నేనొక్కడనే రౌరవ నరకంబునపడకుండుట మంచిదో, భక్తుల సమూహమునకు మోక్షము లభించుట మంచిదో యని ఆలోచించి మీయుపదేశమునే మన్నించితినని గురువుగారిచేత అభినందితుడయ్యెను ఆ రామానుజుడు తన శిష్యులయొక్క కూటములకు ప్రతినిత్యము వేకువనే మూల్యము చెల్లింపక ఆవు నెయ్యి, పాలు, పెరుగు యాచించి గోపకులమునకు మోక్షమునిచ్చెను. ఆ రామానుజుడు కర్మబంధము వలన ముక్తుడయ్యెను. అవతారంబున, సంకుచితజ్ఞానులైన నరులకు ముక్తి కలిగించుటకు సుందర జామాతృడను పేరుతో మోక్షమార్గమును బోధించెను. ఆ రామానుజుడే భవిష్యత్కాలమందు తిరునారాయణపురము వేద బాహ్యులచే సంకరక వచ్చినందున వారిని నాశనము చేయుటకు శఠగోపులను నామముతో యవతారమెత్తి తన యెడతెగని ప్రసంగముల చేత విద్వాంసులను భగవంతుని సంబంధమైన వాదములు వేడి దిగ్విజయము చేసి అహోబిలమునందలి శ్రీనరసింహస్వామి కపటసన్యాసి రూపమున నొసగిన జపాసనమును, కాషాయమును కమండలమును గ్రహించి సన్యాసము స్వీకరించి అష్టాధ్యాయి మహాభాష్యకర్త

ఫణిపుని యొక్క, న్యాయవైశేషికశాస్త్రకర్తలను, కణాదుడు, గౌతముల యొక్కయు, వేదవ్యాస, కపిలాది మహర్షుల యొక్కయు, పూర్వమీమాంస శాస్త్రకర్తయగు జైమిని యొక్క విధులు, తమ మతము నందలి మహానస మొదలైన శిష్యులకు బోధించుటకై యతీశ్వరుల యాచారములకు పరాకాష్ఠయైన పరమేశ్వరుని పదయుగ ప్రతిష్ఠజేసి, లోకమునందలి మానవుల మనసు లనెడి గృహములందు పద్మాక్షులు, కామ, క్రోదములనెడు కంటకములను ఛేదించి భక్తిమార్గమునుపదేశించి పవిత్రము చేయగలడు.

ఇంకను హయగ్రీవస్వామి యొక్క పాదములను సేవించువాడై వేంకటేశ పరనామము గల వేదాంత దేశికులను మరియొక పండితుడు శ్రీమన్నారాయణ పరతత్త్వమును తెలుపుటకు నూరు ప్రబంధములను రచించి శిలోంఛ వృత్తితో జీవించుటచేత, తపస్సు చేయుచుండగా అతనికి స్వామి ముదురాకులనెడు శాకదనము, అగిసెగ్రానికి నిర్వాణము దయసేయగలడు. ఈ విషయము లన్నియు నాయొక్క దివ్యబోధనము వలన తెలిసికొంటిని. అట్టి జ్ఞానమును పొందిన శరీరము మాననీయమేగదా! అజ్ఞానము జాతి యుక్తమే గాని శమదమాదులచే పొందబడినది కాదు. ఎఱుకలసాని భవిష్యత్తును చెప్పుచున్నది అంతమాత్రమున నది జ్ఞానియా? గూబి, శకునపక్షి, అడవికోడి, ఒక జాతి బాతు, పైడికంటె మొదలగు తిర్యగ్జంతువులు రాబోవు పనులను తెలుపుచున్నవి. అంత మాత్రమున నవన్నియు తపస్సంపన్నములా? మా విజ్ఞానమును అటువంటిదే. అదెట్లన నాస్తిక్యంబు వలన, శాస్త్రములు చదువుటేగాని ఆచరణ ప్రచారంబులు లేకుండుట వలన ధర్మము మాకు దూరము. దాని వలన మోక్షమును సాధింపలేము. మోక్షము పాపరహితమైన శరీరము వలన గాని లభింపదు. కావున యీ నా వికృత రూపమును పోగొట్టి నాకు ముక్తిని పొందు మార్గమును దయచేయుమనెను. అంతవరకు నీ పాదములు విడువననెను. నీ పాట ఫలములో పాతికపాలైన నిమ్మనగా దాసరి యివ్వలేననెను. అంత రాక్షసుడు ఈనాటి గానములో చివరి గీత ఫలము నొసగుమనగా దాసరి దయార్ద్ర హృదయుముతో అట్లే కానిమ్ము అనుచు రాక్షసుని లేవనెత్తెను. ఇట్టి రాక్షసాకారమును నీవు పొందిన విధమును తెలుపమనగా నా రాక్షసుడు తన కథను తెలిపెను.

**5. మీ పాఠ్యభాగమాధారముగా శ్రీకృష్ణదేవరాయల కవితా రీతుల నెన్నునది.**
**(లేదా) ఆముక్తమాల్యద ప్రాశస్త్యమును వివరించునది.**

శ్రీకృష్ణదేవరాయలు క్రీ.శ. 16 వ శతాబ్దమున విజయనగర సామ్రాజ్యమును పాలించెను. ఆ మహారాజు స్వయముగా కవి, పండితుడు. అష్టదిగ్గజములను కవులను తనయాస్థానమున నిలుపుకొనెను. సాహితీ సమరాంగణ సార్వభౌమ బిరుదాంకితుడయ్యెను. విష్ణు భక్తుడైన రాయలవారు ఆముక్తమాల్యద అను ప్రబంధమును రచించెను. ఇది పంచకావ్యములలో నొకటిగా ప్రసిద్ధమైనది. దీనిని శ్రీవేంకటేశ్వరస్వామికి అంకితమిచ్చెను. అవతారికయందలి "పలికితుత్ప్రేక్షోపములు జాతిపెంపక్కరసికులేనని మదాలస చరిత్ర", సత్యవధూప్రీణనము లోనగు సంస్కృత కావ్యములను రచించినట్లు తెలియుచున్నది. ఇవేవియూ నేడు లభించుటలేదు.

"ఆముక్తమాల్యద" అనగా ధరించిన పూలదండ నొసగునది అని యర్థము. ఆముక్త = తనచే ధరింపబడిన, మాల్య = పూలదండను, ద= ఇచ్చునది యని శబ్దార్థము. దీనికి సరియైన ద్రావిడ భాషాపదము "చూడికొడుత్తాళ్" (ధరించి యిచ్చినది). ఇది విష్ణుచిత్తుని కూతురగు గోదాదేవి పేరు. అందలి యితివృత్తము ననుసరించి రాయలీకావ్యమును రచించెను. 16వ శతాబ్ది అందును రాయల యుగము ఆంధ్ర సాహితీ చరిత్రలో స్వర్ణయుగము. అందు ఆముక్తమాల్యద రత్నాల మాల వంటిది.

ఈ గ్రంథమునందు రాయలు తన ఉద్దంత భాషాపాండిత్యములో కొత్త వర్ణనా చమత్కారము, ఉత్ప్రేక్షాదిమనోహర అలంకార చాతుర్యము, విలక్షణమైన శైలి మొదలగు అంశములను సమకూర్చెను. ఇతని శైలి పెద్దనాది ప్రబంధకవుల శైలి కన్న భిన్నమైనది.

**శైలి :** ఆముక్తమాల్యద యందలి శైలి నారికేళపాకము. ప్రబంధ లక్షణములన్నియు గలది. పాండిత్య మను సాధనచే అది మరింత భోజ్యమైనది. ఈ పాఠ్య భాగమునందలి

"కాంచెన్వైష్ణవుడర్ధయోజనజటాఝూటోత్థ శాఖోపశా
సంచారాత్తమహాఫలోపము ఫలస్సాయద్వక్ష్మాజమున్"

అను పద్యమున ఓజోగుణ మున్నది. ఓజోగుణ మనగా దీర్ఘ సమాసములు కలిగియుండుట. ఇందలి పదములెంత కఠినములో భావమంత రసరంజితమైనది. అక్కడక్కడ నారికేళపాకముతో పాటు కదళీపాకమును కనిపించును. ఉదాహరణమునకు 1) హరికి సఖుడును రథమును నగు గురుడు, 2) ఏ రాజ్యంబు నరుండు నోరికడివో, 3) ఎవ్వరిని చూడ్కిఁజేసి జనియించుజగంబు" మొదలగు పద్యము లెన్నియో కలవు.

**వర్ణనాచమత్కారము :**

ప్రతి కవికి, అందును ప్రబంధ కవులకు వర్ణనములే ముఖ్యము. అందు అష్టాదశవర్ణనలుండును. ఏ వర్ణనమైనను సముచితము, సందర్భ సహితము, సమయోచితమైనపుడే రాణించును. రాయల వర్ణనా చాతుర్యమపూర్వము, రమణీయాలంకారములతో కూడినది. మధుర మంజుల భావవిలసితములు. అందువలననే రాయలకు కవితాలోకమున ప్రత్యేక స్థానము గలదు. ఈ పాఠ్య భాగమునందలి వర్ణనలు మిక్కిలి మనోహరమైనవి. బ్రహ్మరాక్షసుని వర్ణనములో నిది కనిపించును.

సీ. "మృతమర్త్యురెంటాన నిడ్డజాలకనెత్రు
రంజిల్లు పెనుపొట్టముంజివాని
బల్లచీమలవక్రభల్లాతకియుఁబోలె
నెట్టుదుప్పటినొవుకట్టువాని ॥

మాలదాసరి హరిసేవ యొనరించుటకు పోవువేళ యాతని రూపమును వర్ణించిన తీరును గమనింపదగినది.

సీ. చమురైనతోల్కుబుసంబు టెంకియును ని
త్తడి శంఖచక్రకుండలముల మర
దివెదారికొమ్ముఁదోల్తిత్తియు జోడమ్ము
మెడమీదమొగిలాకు గొడుగుఁదనర"
"వచ్చుసేవింప సురియాళు వైష్ణవుండు"

**ఆలంకారిక రచన :**

ప్రబంధ కవులు వివిధాలంకారములు ప్రయోగింతురు. రాయలును వివిధాలంకార ప్రియుడు. సందర్భోచితముగా, క్రొత్త చమత్కారముతో కూడిన అలంకారములతో తన క్యామునకు నూతన శోభలను కూర్చెను. ఇతని కావ్యములో అలంకారములు లేని పద్యమే యుండదు. అందును ఉత్ప్రేక్షాలంకారము యితనికి మిక్కిలి ప్రీతిపాత్రము. దానిని వివిధ దృక్కోణములతో మలచి మెప్పించుట అతని ప్రత్యేకత. దానికి మాలదాసరి దారితప్పి దారిలో మఱ్ఱివృక్షమును చూచెను. దానిని వర్ణించిన సందర్భమున అపహ్నుతితో గూడిన ఉత్ప్రేక్షాలంకారము గలదు.

"కాంచెన్వైష్ణవు డర్ధయోజనజటారూఘాటోత్థశాఖోపశా
- - - - - - - - - - - -
సంచారాత్త మహాఫలోమఫలస్వాయద్వటక్ష్మాజమున్"

"ఈ సర్పసందేహవదానవ మహీభృత" అను పద్యము నందు వ్యతిరేకాలంకారము గలదు.

"స్వధితియైనను ద్విజుదిన్నశస్త్రమైన" అను పద్యము నందు దృష్టాంతాలంకారము గలదు.

"నీ చెఱబాసిపోయి రజనీచర చక్రి భజింప ముక్తి పొం

\- - - - - - - - - - - - -

నేజరణంబు లేయుదరమే యురమేశిరమేకరంబులీ

నాచరణంబులాయు దరమాయురమాశిరమాకరంబులన్"

అనుటలో వృత్యనుప్రాసాలంకారమెంత సుందరముగా కూర్చబడినదో వర్ణింప తరముగాదు. ఇంకను వివిధాలంకారములు సందర్భానుసారముగ కూర్పబడినవి.

**ఇతర విశేషములు :**

శ్రీకృష్ణదేవరాయలు గొప్ప భావుకుడు, పండిత శ్రేష్ఠుడు. అతని ప్రజ్ఞాపాటవములన్నియు ఆముక్తమాల్యద యందు ప్రతిబింబించుటతో ఆముక్తమాల్యద పంచ కావ్యములలో నొకటి యైనది. జటిలమైన రచనతో పండితులనలరించినది.

**ముగింపు :**

ఆముక్తమాల్యదలోని సందర్భసహిత వ్యాఖ్యలను, మాలదాసరికి బ్రహ్మరాక్షసుడికి జరిగిన సంభాషణలను రాయల కవితా రీతిని కూడ తెలుసుకున్నాం.

**ప్రశ్నలు :**

1. మాలదాసరి నిత్యకృత్యములను తెలిపి అతడు దారి తప్పుటకు గల కారణాలను వివరింపుము.
2. దారి తప్పిన మాలదాసరి అడవిలో చూచిన విశేషములను వివరించునది.
3. మాలదాసరికి, బ్రహ్మరాక్షసునికి జరిగిన సంవాదమును వివరించునది.
4. తనను భక్షింపుమనిన మాలదాసరి మాటలకు బాధపడిన బ్రహ్మరాక్షసుడేమనెను?
5. మీ పాఠ్యభాగ మాధారంగా శ్రీకృష్ణదేవరాయల కవితా రీతుల నెన్నునది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఆముక్తమాల్యద - వావిళ్ళవారి 'రుచి' వ్యాఖ్య
2. ఆముక్తమాల్యద - వేదంవారి 'సంజీవనీ' వ్యాఖ్య

**పంగులూరి శాంతకుమారి**
లెక్చరర్, జె.కె.సి. కళాశాల
గుంటూరు

**పాఠం:5**

# శ్రీకాళహస్తీశ్వర శతకము

(1 నుండి 35 పద్యాలు)

**-ధూర్జటి**

**శీర్షికలు :**

5.0 లక్ష్యం

5.1 కవి పరిచయము

5.2 కఠిన పదాలకు అర్థ తాత్పర్యాలు

5.3 సందర్భ సహిత వ్యాఖ్యలు

## 5.0 లక్ష్యం :

ధూర్జటి తాను ఇన్నాళ్లు అనుభవించిన భోగవంత జీవితంపై విరక్తి చెంది తనకు మోక్షాన్ని ప్రసాదించమని పరమేశ్వరుని కోరుకోవటం. ఆ క్రమంలో లోకరీతులను గూర్చి వివరించటం ఈ పాఠంలో ప్రధానాంశం.

## 5.1 కవి పరిచయము :

శ్రీకాళహస్తీశ్వర శతకమును మహాకవి ధూర్జటి రచించెను. ఇతడు 16వ శతాబ్దమునకు చెందినవాడు. శ్రీకాళహస్తీశ్వర శతకముతో బాటు శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యము అను ప్రబంధమును రచించెను. ఇతడు పరమ శివభక్తుడు. ఈ శతకంలో ఎక్కడా గ్రంథకర్త పేరు ధూర్జటి అని ఎక్కడా పేర్కొనబడలేదు. క్రీ.శ.1740లో కస్తూరి రంగ కవి తను రచించిన అనందరంగ రాట్ఛందము అనే గ్రంథంలో ధూర్జటి వారి కాళహస్తీశ్వర శతకము నుండి ఒక పద్యం ఉదాహరణగా యిచ్చాడు. ఈ శతకంలో ధార, శైలి శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యంలో లాగానే వున్నాయి.

శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యంలో ధూర్జటి తలిదండ్రుల పేర్లు సింగమ్మ, నారాయణుడు అని ఉన్నాయి. అతడు కృష్ణదేవరాయల ఆస్థానంలో ఉన్నట్లు జనశ్రుతి. ఈ ఇద్దరి సంబంధాన్ని గురించి కుమారధూర్జటి "శ్రీకృష్ణరాయ విజయం" కావ్యంలో పేర్కొన్నాడు. అరవీటి చినవెంకటరాజు ఇలా అన్నాడట కుమార ధూర్జటితో

స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పల్కులకేల గల్గెనో
అతులిత మాధురీమహిమ నాయను మీపెదతాత చాల స
న్నుతిగనె కృష్ణదేవరాయల మనోజ్ఞసభన్ విను మీవునట్ల మ
త్కృత బహుమాన వైఖరుల కీర్తి వహింపుము ధాత్రిలోపలన్.

కుమార ధూర్జటి కుమారుడు లింగరాజుకవి. ఇతడు పెదకాళహస్తి మహత్మ్యం రచించాడు. ఇందులో గూడ ధూర్జటి కృష్ణదేవరాయల ఆస్థానంలో ఉన్నట్లు చెప్పబడింది.

కాబట్టి శ్రీకృష్ణదేవరాయల ఆస్థానములోనున్న అష్టదిగ్గజ కవులలో ధూర్జటి ఒకడై యుండవచ్చును. ఇతడు ఈ శతకాన్ని వృద్ధాప్యంలో వ్రాసి ఉంటాడు. వైరాగ్యసంపన్నుడు మాత్రమే ఈ శతకాన్ని వ్రాయగలడు. రాజనింద, ఇహలోక సుఖముల పట్ల విరక్తి ఈ పద్యాలలో కనబడును. చదువులు నేర్చిన అధమాధములైన పండితులను విమర్శించడం జరిగింది. ధూర్జటి ఎక్కడా కృష్ణదేవరాయల పేరు ఎత్తలేదు. అందువలన కొందరు ధూర్జటి కృష్ణదేవరాయల ఆస్థానంలో లేడని చెబుతారు.

రాయలవారు సభలో ఇలా అన్నారట "స్తుతమతియైన ఆంధ్రకవి ధూర్జటి పలుకులకేల గలిగెనో అతులిత మాధురీ మహిమ...

అప్పుడు తెనాలి రామకృష్ణకవి ఆ పద్యాన్ని ఇలా పూరించాడనే కథ ప్రచారములోనున్నది.

..... హా తెలిసెన్ భువనైకమోహనో
ద్ధతసుకుమార వారవనితా జనతా ఘనతా పహారి సం
తతమధురాధరోదిత సుధారసధారల గ్రోలుటంజుమీ"

ధూర్జటి మహాకవి. పరమమహేశ్వరుడు, శివుడే పరదైవమని నమ్మినవాడు. వైదిక మతమునకు విరుద్ధము కాని శైవమతాన్ని ఆచరించాడు. బోధించాడు. శతకమనగా నూరు పద్యాలున్న కావ్యం. ఇందులో నూరు గాని నూటెనిమిది గాని, నూటపదహారు గాని పద్యాలుండవచ్చును శతకము ఆత్మాశ్రయ కవిత్వ మార్గమునకు చెందినది. కవి స్వీయానుభములే చెప్పబడతాయి. ప్రతి పద్యం చివర ఉండే మకుటం శతకపద్య లక్షణము. ఈ మకుటమే శతకపద్యా లన్నిటిని ఒక సూత్రముతో బంధిస్తుంది. శ్రీకాళహస్తీశ్వరా అనేది ఈ శతకమునకు మకుటము. తెలుగులో నీతి, శృంగార, భక్తి, వైరాగ్య శతకము లెన్నో వచ్చినవి. శతక రచన యనునది తెలుగు సాహిత్యములోని ప్రత్యేక విభాగముగా పేర్కొనవచ్చును. శ్రీకాళహస్తీశ్వర శతకము వీటిలో పేరెన్నికగన్నది. శతకంలో కవి వ్యక్తిత్వ ముద్ర వుంటుంది. ప్రతి పద్యం దేనికదే సంపూర్ణం. శతకంలో కవి పాఠకునితో సూటిగా తన అభిప్రాయమును చెప్పినట్లుండుట దాని యొక్క విశిష్టత.

శ్రీకాళహస్తీశ్వర శతకమును ధూర్జటి తన వృద్ధాప్యములో వ్రాసియుండచ్చునని భావింపబడుచున్నది. జీవితాంతము ఐహిక సుఖముల పట్ల గల మక్కువతో రాజాశ్రయమును పొంది, వారిని పొగడుచు, వారిచ్చు బహుమానములు స్వీకరించుచు రాజభోగములనుభవించి చివరి దశలో వైరాగ్యమును పొంది అప్పటివరకు తానునుభవించిన జీవితము పట్ల గలిగిన రోతను, బాధను ఎంతో ఆర్తితో భగవంతునికి నివేదించుకొనుట ఈ శతకము నందు కనిపించును. ప్రతి పద్యము ధూర్జటి హృదయావేదనకు ప్రతీక. మత్తులైన రాజులను ఆశ్రయించి నరకప్రాయమైన వారి సేవ చేయుచు వారిచ్చు కానుకలను స్వీకరించి, భోగము లనుభవించుటకే కంటే ఈశ్వర పాదార్చన, ఈశ్వర చింతన ప్రధానమైనదని తెలిపెను. తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు, బంధుమిత్రులను బంధములను ఛేదించుకొని ముక్తిమార్గమును పొందవలెనని తపించుట ఈ శతకములో కనిపించును. ఐహిక సుఖముల పట్ల విరక్తి కలిగినను, వాంఛలకు తానెట్లు లోబడినాడో తెలుపుచు వాటి నుండి తాను విముక్తుడగు దారి చూపుమని పరమేశ్వరుని ప్రార్థించెను. అజ్ఞానులైన పండితాధములు చేయు అకృత్యములను తన పద్యముల ద్వారా ఎత్తిచూపెను. జీవితము అశాశ్వతమని తెలిసియు మానవులు కర్మ బంధములను విడనాడలేకున్నారు. అట్టి వారికి విముక్తిని ప్రసాదించమని భగంతుని వేడుకొనెను. ధూర్జటి ఈ శతకంలో తన విషయాన్ని మిషగా పెట్టుకొని లోకరీతులను అనేక విధములుగా విమర్శించెను. కవి కోపము, బాధ, భయము మొదలగు భావాలు మనోహరమైన రీతిలో వర్ణించబడినవి. ఇందులోని కవి చిత్తశుద్ధి, ఉద్వేగము, దాపరికంలేని కవితారీతి పాఠకులను స్పందింపచేసి కట్టిపడవేయును.

శ్రీకాళహస్తీశ్వర శతకం ఉత్తమ శతకాలలో ఒకటిగా ప్రసిద్ధిచెందినది. తన తప్పులను బహిరంగంగా అంగీకరించిన వారిలో ధూర్జటి కవి ముఖ్యుడు. ఎందరో ఈ శతకము ననుసరించి రచనలు చేసినను ఇటువంటి శతకము మరొకటి రాలేదు. శ్రీకృష్ణదేవరాయలన్నట్లు ధూర్జటి పలుకులకు ఉన్న అతులిత మాధురీ మహిమ ప్రతి పద్యములోను ప్రతిబింబించును.

## 5.2 కఠిన పదాలకు అర్థ తాత్పర్యాలు :

1.ప. శ్రీవిద్యుత్కలితాజవంజవమహాజీమూతపాపాంబుధా
రావేగంబున మన్మనోబ్జసముదీర్ణత్వంబు గోల్పోయితిన్
దేవా! మీకరుణాశరత్సమయమింతే చాలు, చిద్భావనా
సేవం దామరతంపరై మనియెదన్ శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| శ్రీ | = | సాలెపురుగు |
| కాళ | = | పాము |
| హస్తి | = | ఏనుగు |
| ఈశ్వరా | = | వీటికి మోక్షమునొసగిన స్వామీ! |
| శ్రీవిద్యుత్ | = | మెఱుపుతీగల సంపదలతో |
| కలిత | = | కూడిన |
| అజవంజన | = | సంసారమను |
| మహాజీమూత | = | గొప్పమేఘము నుండి |
| పాప | = | పాపమును |
| అంబుధారావేగంబున | = | వర్షపునీరు ధారగా కురియుట చేత |
| మత్ | = | నాయొక్క |
| మనోబ్జ | = | మనస్సనెడు తామరపూవు యొక్క |
| సముదీర్ణత్వంబు | = | వికాసమును |
| కోల్పోయితిన్ | = | పోగొట్టుకుంటిని |
| నీ కరుణాశరత్సమయము | = | నీ దయ అనే శరత్కాలం |
| ఇంతే చాలు | = | ఆత్మధ్యానంతో (జ్ఞానమునకు సంబంధించిన ఆలోచనలతో) |
| తామరతంపరై | = | తామరల సమూహము వలె అధికమై |
| మనియెదన్ | = | జీవించెదను. |

**తాత్పర్యము :**

శ్రీకాళహస్తీశ్వరా! వర్షధారలకు చెరువులలోని తామరలు చెడిపోయినట్లుగా సంపదలనే మెరుపులతో గూడిన సంసార మేఘము పాపమనెడు జడివానతో నా మనస్సులోని భక్తి అనెడి తామరపువ్వు వికాసమును కోల్పోయినది. నీ దయ అనెడు శరత్కాలపు వెన్నెల నాకు ఆనందమును ప్రసాదించును. నీ ధ్యానంతో నా మనస్సు ధృఢపరచుకొని జీవించెదను.

2.ప. వాణీవల్లభ దుర్లభంబగు భవద్ద్వారంబున న్నిల్చి ని
ర్వాణశ్రీఁ జెపట్టజూచిన విచారద్రోహమో నిత్యక
ళ్యాణ క్రీడలఁబాసి దుర్దశలపాలై రాజలోకాధమ
శ్రేణీద్వారము దూరజేసెదిపుడో శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| వాణీవల్లభ | = | సరస్వతీదేవి భర్తయైన బ్రహ్మకును |
| దుర్లభంబైన | = | పొందలేని |
| భవత్ ద్వారంబున | = | నీ వాకిటియందు |
| నిర్వాణశ్రేన్ | = | మోక్షలక్ష్మిని |
| చెఱపట్టజూచిన | = | నేను పొందాలనుకొనుట యనునది |
| విచారద్రోహమే | = | ఆలోచన యందు మోసమనిపించవచ్చును |

| | | |
|---|---|---|
| నిత్యకళ్యాణ | = | ఎల్లప్పుడు శుభాలయొక్క |
| క్రీడలబాసి | = | కర్మలకు దూరమై |
| దుర్దశలపాలై | = | కష్టాలు పడి |
| రాజలోకాధమశ్రేణి | = | నీచరాజుల గుంపుల యొక్క |
| ద్వారము | = | వాకిటిని |
| దూరజేసెదవు | = | ప్రవేశింపజేసితివి |

**తాత్పర్యము :**

బ్రహ్మకైనా చేరరాని నీ ద్వారము చేరి మోక్షలక్ష్మిని పొందదలచిన నా పాప ఫలితముగానేమో ఎల్లపుడా మంచి పనులను చేయుట మాని కష్టాలపాలై నీచులైన రాజుల ద్వారములు దూరునట్లు చేసి శిక్షించితివా స్వామి!

3.ప. అంతా మిథ్య తలంచిచూచిన నరుండట్లౌటెరింగిన్ సదా
కాంతల్పుత్రులు నర్థముల్ తనువు నిక్కంబంచు మోహార్ణవ
భ్రాంతింజెంది చరించుగాని పరమార్థంబైన నీయందు దా
చింతాకంతయు చింత నిల్పడుకదా శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| తలంచి చూచిన | = | ఆలోచించి చూచినచో |
| అంతా మిథ్య | = | ఈ లోకమంతా ఒట్టిదే (మాయే) |
| అట్లౌట తెలిసి | = | ఆ సంగతి తెలిసి కూడ |
| మోహార్ణవ | = | మోహమనే సముద్రములోబడి |
| కాంతలు, పుత్రులు | = | భార్యాపిల్లలు |
| అర్థము | = | ధనము |
| తనువు | = | ఈ శరీరము |
| నిక్కంబంచు | = | శాశ్వతమనుకొనుచు |
| భ్రాంతింజెంది | = | భ్రమలో పడి |
| పరమార్థంబైన | = | మోక్షమునొసగు |
| నీయందు | = | నీపట్ల |
| చింతాకంతయు | = | చింతాకు మాత్రమైనను |
| చింత | = | ధ్యానము |

**తాత్పర్యము :**

ఈ లోకమంతయు మాయ అని తెలిసి కూడ మానవుడు ఎల్లప్పుడు భార్యాబిడ్డలు, ధనము, శరీరము నిత్యమనుకొని మోహమనెడు సముద్రములోబడి భ్రాంతిచెందునుగాని పరమాత్మవైన నీ మీద ధ్యానము నిలుపుకొనడు గదా!

4.ప. నీనాయందొడబాటు మాట వినుమా, నీచేత జీతంబున్
గానింబట్టక సతతంబు మదివేడ్కన్గొల్తు నంతస్సప
త్నానీకంబున కొప్పగింపకుము నన్నాపాటియే చాలు తే
జీ నొల్లం గరినొల్ల నొల్ల సిరులన్ శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| నీ నాయందు | = | నీకూ నాకూ మధ్య |
| ఒడబాటు మాట | = | ఒప్పందపు మాట |
| వినుమా | = | వినుము |
| నీచేత | = | నీనుండి |
| కానింబట్టన్ | = | కానీ గూడ తీసుకొనక |
| సతతంబు | = | ఎల్లప్పుడు |
| మదిన్ వేడ్కన్ గొల్తు | = | మనసులో ఆనందంగా సేవింతును |
| అంతస్సపత్నానీకంబునకు | = | భార్యాబిడ్డలు రాగద్వేషములతో కూడిన సంసారమునకు |
| ఒప్పగింపకు | = | అప్పగించకుము |
| ఆ పాటియే చాలున్ | = | అదే చాలును |
| తేజి, కరిన్ ఒల్లన్ | = | గుర్రాలను, ఏనుగులను, కోరుకోను |
| ఒల్ల సిరులన్ | = | సంపదలను కోరను |

**తాత్పర్యము :**

శ్రీకాళహస్తీశ్వరా! మన ఇద్దరి మధ్య ఒక ఒప్పందం కుదుర్చుకుందాం. అదేమంటే నీనుండి ఒక కాణీ కూడ జీతం తీసుకోను. నిత్యం నిండుమనసుతో పూజిస్తాను. గుర్రాలు, ఏనుగులు, ధనము అక్ఖర్లేదు. అరిషడ్వర్గాలతో కూడిన సంసారము నా కప్పగించకుము.

5.ప. భవకేళీమదిరామదంబున మహాపాపాత్ముడై వీడు న
న్ను వివేకింపడటంచు నేను నరకార్ణోరాశిపాలైన బ
ట్టవు బాలుండొకచోట నాటమితోడ న్నూతగూలంగ దం
డ్రి విచారింపక యుండునా కటకటా! శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| భవకేళి | = | సంసారమనెడు క్రీడలోని మాయ అనే |
| మదిర | = | మధుపానపు |
| మదంబున | = | కలిగిన గర్వము చేత |
| మహాపాపాత్ముడై | = | ఎన్నో పాపాలు చేస్తున్నవాడై |
| వీడు | = | ఈ మానుడు |
| నిన్ను | = | నిన్ను |
| వివేకింపడు + అటంచు | = | తెలుసుకోడు అని |
| నరకార్ణోరాశిపాలైన | = | నరకమను సముద్రములో పడినప్పటికి |
| పట్టవు | = | నీవు పట్టించుకొనుటలేదు. |
| కటకటా | = | అయ్యయ్యో! |
| ఒకచోట | = | ఒకానొక చోట |
| బాలుండు | = | పిల్లవాడు (కొడుకు) |

| | | |
|---|---|---|
| ఆటమితోడన్ | = | ఆటలయందు ఆసక్తి |
| నూతంగూలంగ | = | బావిలో పడిపోతే |
| తండ్రి | = | ఆ పిల్లవాని తండ్రి |
| విచారింపక యుండునా | = | పట్టించుకొనకుండా ఉంటాడా! |

**తాత్పర్యము :**

సంసారమనే మధువు మత్తులో మునిగి వీడు నన్ను పట్టించుకొనుట లేదని నేను నరకకూపంలో పడుతున్నా చూస్తూ ఊరకుంటావా స్వామి! ఆటల యందలి ఆసక్తితో కొడుకు బావిలో పడితే తండ్రి చూస్తూ ఊరుకుంటాడా! అలాగే నన్ను నీవు రక్షింపుము.

**6.ప.** స్వామిద్రోహము చేసి వేరొకని కొల్వన్ బోతినో, కాక నే
నీమాటన్విన నొల్లకుండితినో? నిన్ను దిక్కుగా జూడనో?
యేమీ యిట్టి వృధాపరాధినగు నన్నున్ దుఃఖవారాశి వీ
చీ మధ్యంబునన్ ముంచియుంప దగునా! శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| స్వామిద్రోహము చేసి | = | నిన్ను మోసం చేసి |
| వేరొకని | = | ఇంకొక దేవుని |
| కొల్వన్బోతినో | = | సేవించుటకు పోతినా? |
| కాక | = | లేనిచో |
| నే | = | నేను |
| నీ మాటన్ | = | నీ మాటలను |
| వినన్ | = | వినడానికి |
| ఒల్లకుండితినో | = | అంగీకరించుటలేదా? |
| నిన్ను దిక్కుగా | = | నీవే సర్వస్వమనీ, రక్షకుడివనీ |
| చూడనో | = | చూడకుంటినా |
| ఏమీ | = | ఎందులకు |
| ఇట్టి | = | ఇటువంటి |
| వృధాపరాధినగు | = | తప్పులు చేయని |
| నన్ను | = | నన్ను |
| దుఃఖవారాశి | = | దుఃఖమనెడు సముద్రపు |
| వీచీ మధ్యంబునన్ | = | అలల మధ్యలో |
| ముంచి | = | ముంచివేసి |
| ఉంపదగునా | = | ఉంచుట తగునా |

**తాత్పర్యము :**

స్వామీ! నిన్ను విడచి నే నింకొక దేవుని పూజించుటకు పోలేదు. నీమాటను మన్నించలేదా? నీవే దిక్కని భావించలేదా? ఇట్లు ఏ నేరము చేయని నన్ను దుఃఖసముద్రంలో ముంచి యుంచదగునా!

7.ప. దివిజక్ష్మారుహ ధేనురత్న ఘనభూతిన్ ప్రస్ఫురద్రత్న సా
నువు నీవిల్లు, నిధీశ్వరుండు సఖు, డర్ణోరాశి కన్యావిభుం
డు విశేషార్చకుడింక నీకెన్ ఘనుండున్ గల్గునే నీవు చూ
చి విచారింపులేమి నెవ్వడుడుపున్! శ్రీకాళహస్తీశ్వరా!

**సందర్భము :**

మహాకవి ధూర్జటి రచించిన కాళహస్తీశ్వర శతకము నుండి గ్రహింపబడినది. శతకము నందు ప్రతి పద్యము దేనికదే సంపూర్ణం. కవి యిందు తన హృదయావేదనను భగంతునికి నివేదించుకొనుచున్నాడు.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| దివిజక్ష్మారుహ | = | కల్పవృక్షము |
| ధేను | = | కామధేనువు |
| రత్న | = | చింతామణి అను పేరు గల రత్నము |
| ఘనభూతిన్ | = | అధికమైన సంపదచే |
| ప్రస్ఫురత్ | = | ప్రకాశించు |
| రత్నసానువు | = | మేరుపర్వతము |
| నీవిల్లు | = | నీ ధనుస్సు |
| నిధీశ్వరుండు | = | కుబేరుడు |
| సఖుడు | = | స్నేహితుడు |
| అర్ణోరాశి | = | సముద్రుని |
| కన్యా | = | కుమార్తె యగు లక్ష్మికి |
| విభుండు | = | భర్తయైన విష్ణువు |
| విశేషార్చకుండు | = | ముఖ్య భక్తుడు |
| ఇంక నీకు ఎన్ | = | ఇటువంటి నీకు సమానమైన |
| ఘనుడు | = | గొప్పవాడు |
| గల్గునే | = | వుండునా! |
| నీవు | = | నీవు |
| లేమిన్ | = | మా దరిద్రమును |
| చూచి విచారింపవు | = | చూసిగూడ పట్టించుకొనవు |
| ఎవ్వడు | = | ఇంక ఏ దేవుడు (ఎవరు) |
| ఉడుపున్ | = | పోగొట్టును |

**తాత్పర్యము :**

కల్పవృక్షము, కామధేనువు, చింతామణి, మేరుపర్వతము నీకు విల్లు. కుబేరుడు నీ స్నేహితుడు. లక్ష్మీపతి విష్ణువు నీకు భక్తుడు. నీకు సమానమైన వాడు లేడు. ఇన్ని ఉన్నా మా దారిద్ర్యాన్ని పోగొట్టుటకు నీవాలోచించుట లేదు. కాని నీవు తలచుకొన్న మా దారిద్ర్యాన్ని తొలగించగలవు.

**సంధులు :**

| | | |
|---|---|---|
| నిధి + ఈశ్వరుడు | = | నిధీశ్వరుడు (సవర్ణదీర్ఘ సంధి) |
| ఎవ్వడు + ఉడుపున్ | = | ఎవ్వడుడుపున్ (ఉకారసంధి) |

**సమాసములు :**

నిధికి ఈశ్వరుండు - కుబేరుడు (బహువ్రీహి సమాసము)

విశేషమైన అర్చకుడు - విశేషణ పూర్వపదకర్మధారయ సమాసము.

**ఛందస్సు :**

ఇది మత్తేభావృత్తము. ఇందు స భ ర న మ య వ అను గణములుండును. 1, 14వ అక్షరములకు యతిమైత్రి చెల్లును. ప్రాస నియమము కలదు.

**విశేష విషయములు :**

ధూర్జటి శివార్చకుడు. శివుని స్తుతించుటతో పాటు ఇహలోక భోగవిముఖత గూడ కవి యిందు వర్ణించెను. శివుని కెనయైన దేవుడు లోకమున లేడని కవి భావన యిందు స్పష్టముగా తెలియబరచెను. వైదికమత విరుద్ధముగాని శైవమత ప్రబోధము కనిపించును.

**8.ప.** నీతో యుద్ధము చేయనోప, గవితానిర్మాణశక్తి నిన్నున్
ప్రీతుం చేయగలేను నీకొరకు తండ్రిన్ చంపగాజాల నా
చేతన్ రోకటి నిన్ను మొత్త వెరతుం చీకాకు నా భక్తి యే
రీతిన్నాకిక నిన్ను చూడగనగున్ శ్రీకాళహస్తీశ్వరా!

**కఠిన పదములకు అర్థము :**

| | | |
|---|---|---|
| యుద్ధము చేయన్ | = | యుద్ధము చేయుటకు |
| ఓపన్ | = | శక్తి లేనివాడను |
| కవితా నిర్మాణ శైలిన్ | = | కవిత్వం అల్లే విషయంలో |
| ప్రీతుంచేయగలేను | = | సంతృప్తిపరచలేను |
| చంపగజాల | = | చంపుకోలేను |
| నాచేతన్ | = | నా చేతిలో నున్న |
| మొత్త వెరతుం | = | కొట్టుటకు భయపడతాను |
| చీకాకు | = | నన్ను చీకాకు పెడుతున్నది |
| యేరీతిన్ | = | ఏ విధముగా |
| నిన్ను చూడనగున్ | = | చూచునవకాశమున్నది |

**తాత్పర్యము :**

నేను నీతో యుద్ధము చేయలేను. కవిత్వము చెప్పి నిన్ను సంతృప్తిపరచు శక్తి లేనివాడను. నీ కోసం తండ్రిని చంపలేను. నా చేతిలో నున్న రోకటితో తలపై కొట్టలేను. నా భక్తియే నన్ను చికాకుపెట్టుచున్నది. ఇక ఏరీతిగా నీ దర్శన భాగ్యము నాకు లభించ గలదు.

**విశేషములు :**

1. శివుడు అర్జునునితో యుద్ధం చేసి మెచ్చుకొని పాశుపతమును ప్రసాదించెను.
2. నత్కీరుడను కవి శివుని కవిత్వములో తప్పుపట్టిన శాపం పొంది తరువాత మహాభక్తుడైనాడు.
3. తండ్రి శివలింగమును తన్నినందుకు కోపించిన కొడుకు తండ్రిని చంపెను.
4. శివుడు మారువేషంలో వచ్చి భక్తురాలిని పరీక్షించెను. శివ ప్రసాదమును తిరస్కరించాడనే కోపంతో ఆ భక్తురాలు తన చేత నున్న రోకటితో శివుని కొట్టినది. శివుడామెకు మోక్షమునిచ్చెను.

**9.ప.** ఆలున్ బిడ్డలు తల్లిదండ్రులు ధనంబును న్మహాబంధనం
బేలానామెడగట్టినాడవిక నిన్నేవేళ జింతుంతు ని
ర్మూలంబైన మనంబులో నెగడు దుర్మోహాబ్దిలో గ్రుంకి యీ
శీలామాలపు జింత నెట్లుడిపెదో శ్రీకాళహస్తీశ్వరా!

**కఠినపదాలకు అర్థాలు :**

| | | |
|---|---|---|
| ధనంబంచు | = | ధనము అనే |
| మహాబంధనమున్ | = | గొప్పబంధాలను |
| నా మెడన్ | = | నా గొంతుకు |
| ఏలా | = | ఎందుకు |
| కట్టినాడవు | = | చుట్టావు |
| ఏవేళన్ | = | ఎప్పుడు (ఏ సమయంలో) |
| చింతింతు | = | స్మరించగలను |
| నిర్మూలంబైన | = | అకారణముగా పుట్టిన |
| మనంబులో నెగదుచున్న | = | మనసులో పెరుగుచున్న |
| దుర్ + మోహాబ్దిలోగ్రుంకి | = | చెడ్డదైన మోహమనే సముద్రంలో మునిగి |
| ఈ శీలామాలపుచింత | = | దుర్భరమైన దుఃఖాన్ని |
| ఎట్లుడిపెదో | = | ఏ విధంగా తొలగిస్తావో గదా! |

**తాత్పర్యము :**

స్వామి! నాకు భార్యాబిడ్డలు, తల్లిదండ్రులు ధనమను బంధాలను గొంతుకు చుట్టావు. వీటితోటే సరిపోతున్నది. నేను నిన్నెప్పుడు స్మరించుకొనగలను. నా మనస్సులోని మోహమను సముద్రంలో మునిగిన యీ దుఃఖాన్ని ఎట్లు పొగొట్టుదువో కదా!

**10.ప.** నిప్పై పాతక దూలశైలమడచున్ నీనామమున్మానవుల్
దాపున దవ్వున విన్ననంతక భుజాదర్పోద్ధత క్లేశముల్
తప్పుందారును ముక్తులౌదురని శాస్త్రంబుల్మహాపండితుల్
చెప్పంగా దమకింక శంకవలెనా? శ్రీకాళహస్తీశ్వరా!

**సందర్భము :**

మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకము నుండి గ్రహింపబడినది. మహాకవి భగవంతునికి తన గోడును విన్నవించుకొనెను.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| మానవుల్ | = | మనుషులు |
| నీ నామము | = | నీ పేరును |
| దాపున | = | దగ్గరగానైనా |
| దవ్వున | = | దూరమునుండైనా |
| విన్నన్ | = | వినగానే |
| నిప్పై | = | నిప్పులాగ |
| పాతక | = | పాపమనెడు |
| దూలశైలము | = | దూదియను కొండను |
| అడచున్ | = | కాల్చివేయును |
| అంతక | = | యముని యొక్క |
| భుజాదర్ప + ఉద్ధత | = | భుజబల గర్వపు ఆధిక్యత చేత కలిగిన |
| క్లేశముల్ | = | కష్టములు |
| తప్పున్ | = | తొలగును |
| తారును | = | తాము గూడ |
| ముక్తులౌదురని | = | ముక్తిపొందెదరని |
| శాస్త్రంబులు | = | వేదములు మొదలగు గ్రంథములు |
| మహాపండితులు | = | గొప్ప పండితులు |
| చెప్పంగా | = | చెప్పుచుండగా |
| తమకింక | = | ఈ మనుషులకింకను |
| శంకవలెనా | = | అనుమానము ఉండతగునా? |

**తాత్పర్యము :**

నీ నామమును దగ్గర నుండి కాని దూరము నుండి కాని విన్నంతనే అగ్ని పాపమును దూదికొండను దహించును. యముని యొక్క గర్వము నణిచివేయును. కష్టములు తొలగి ముక్తి పొందెదరని శాస్త్రములు, పండితులు చెప్పుచుండగా ఈ మానవులెందుకు అనుమానములు విడువరు.

**వ్యాకరణాంశములు :**

శైలము + అడచున్ = శైలమడచున్ (ఉకారసంధి)

**సమాసములు :**

పాతకమనెడు దూలశైలము - రూపక సమాసము

ఉద్ధతమైన క్లేశములు - విశేషణపూర్వపదకర్మదారయ సమాసము

**ఛందస్సు :**

ఇది శార్దూలమను వృత్తపద్యము. ఇందు మ స జ స త త గ అను గణములుండును. 1, 13 అక్షరములకు యతి మైత్రి చెల్లును. ప్రాస నియమము కలదు.

**విశేషాంశములు :**

ధూర్జటి ఈ పద్యమునందు పరమేశ్వరుని గొప్పతనమును ఎంతో మనోహరముగా వర్ణించెను.

**11.ప.** వీడెంబబ్బినయప్పుడుం దమస్తుతుల్విన్నప్పుడుం బొట్టలో
గూడునప్పుడు శ్రీవిలాసములు పైకొన్నప్పుడు గాయకుల్
పాడంగా వినునప్పుడున్ జెలగు దంభప్రాయవిశ్రాణన
క్రీడాసక్తుల నేమి చెప్పవలెనో శ్రీకాళహస్తీశ్వరా!

**అర్థములు :**

| | | |
|---|---|---|
| వీడెంబు | = | తాంబూలము |
| అబ్బినప్పుడున్ | = | దొరికినప్పుడు |
| స్తుతుల్ | = | పొగడ్తలు |
| కావ్యకుల్ | = | కవులు |
| గాయకుల్ | = | గాయకులు |
| పాడంగా | = | పాడుచున్నప్పుడు |
| పొట్టలో | = | కడుపులో |
| కూడున్నప్పుడు | = | ఆహారము నిండుగా ఉన్నప్పుడు |
| శ్రీవిలాసములు | = | డబ్బు వలన కలుగు సుఖాలు |
| పైకొన్నప్పుడున్ | = | అధికముగా ఉన్నప్పుడు |
| చెలగు | = | అతిశయించు |
| దంభప్రాయ | = | బడాయి కోసము |
| విశ్రాణన | = | దానం చేయడం |
| క్రీడాసక్తులన్ | = | వినోదంతో కాలక్షేపం చేసే వారిని |
| ఏమి చెప్పవలెనో | = | ఎలా చెప్పాలో తెలియుట లేదు. |

**తాత్పర్యము :**

స్వామి! తాంబూలం దొరికినప్పుడు, కడుపు నిండుగా ఉన్నప్పుడు, తనను పొగిడినప్పుడు, సంపదలతో సుఖముగా ఉన్నప్పుడు గాయకులు పాడినపుడు గొప్పకోసం దానం చేసే వారిని గూర్చి ఎలా చెప్పాలో తెలియడం లేదు.

**12.ప.** నినుసేవింపగ నాపదల్పొడమనీ నిత్యోత్సవంబబ్బనీ
జనమాత్రుండననీ మహాత్ముడననీ సంసారమోహంబుపై
కొననీజ్ఞానము గల్గనీ గ్రహగతుల్ కుందింపనీ మేలు వ
చ్చిన రానీ యవి నాకు భూషణములే శ్రీకాళహస్తీశ్వరా!

**అర్థములు :**

| | | |
|---|---|---|
| నిను సేవింపగ | = | నిన్ను పూజించుట వలన |
| ఆపదల్పొడమనీ | = | కష్టములొస్తే రానీ |
| నిత్యోత్సవంబబ్బనీ | = | నిత్యం సుఖంతో వేడుకలు కలుగనీ |
| జనమాత్రుండననీ | = | అనంత జీవకోటిలో నేనొకనిని గానీ |
| సంసారమోహంబుపైకొననీ | = | సంసార బంధములు కలుగనీ |
| జ్ఞానమ్ము కలగనీ | = | జ్ఞానమును సంపాదించనీ |

| | | |
|---|---|---|
| గ్రహగతులు | = | గ్రహసంచారములు |
| కుందింపనీ | = | చేటుకలిగింపనిమ్ము |
| మేలు వచ్చినన్ | = | మంచి జరిగిననూ |
| రానిమ్ము | = | కలుగనిమ్ము (జరుగనిమ్ము) |
| భూషణములే | = | అలంకారముల వలెనే భాసించును |

**తాత్పర్యము :**

స్వామి! నిన్ను సేవించగా నాకు బాధలు వచ్చినా, సుఖములు కల్గినా, సామాన్యుడన్నా, మహాత్ముడన్నా, సంసారము మీద మోహము కల్గినా, జ్ఞానము కల్గినా, కీడు కలిగినా అవన్నీ నాకు అలంకారములే యగును. నీ పూజ మాత్రము మానను.

13.ప. ఏ వేదంబు పఠించె లూత భుజగంబేశాస్త్రముల్చూచె దా
నే విద్యాభ్యాసం బొనర్చె గరి చెంచేమంత్రమూహించె బో
ధావిర్భావ నిధానముల్ చదువులయ్యా? కావు మీపాద సం
సేవాసక్తియె కాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!

**అర్థములు :**

| | | |
|---|---|---|
| శ్రీకాళహస్తీశ్వరా | = | ఓ స్వామి! |
| లూత | = | సాలెపురుగు |
| ఏ వేదంబు పఠించె | = | ఏ వేదములు చదివినది |
| భుజగంబు | = | పాము |
| ఏ శాస్త్రముల్ + చూచెను | = | ఏ శాస్త్రాలను చదివింది |
| కరి | = | ఏనుగు |
| ఏ విద్యాభ్యాసంబొనర్చె | = | ఏ విద్యలు చేర్చుకొన్నది |
| చెంచు | = | తిన్నడు |
| ఏ మంత్రమూహించె | = | ఏ మంత్రాన్ని పఠించాడు |
| నీపాదసంసేవ + ఆసక్తిగాక | = | నీ పాదములు పూజించుట యందలి ఆసక్తిగాక |
| జంతుతతికిన్ | = | ప్రాణికోటికి |
| బోధావిర్భావనిధానముల్ | = | జ్ఞానంపొందుటకు కారణాలు |
| కావు | = | కావు |

**తాత్పర్యము :**

జీవులు మోక్షం పొందుటకు నీ పాదసేవయే గాని వేరు కారణములుండవు. వేదశాస్త్ర పఠనము వలన ముక్తి రాదు. సాలెపురుగు, పాము, ఏనుగు, తిన్నడు ఏ శాస్త్రములు చదివారు. కేవలము నీ పాదసేవయే ముక్తి మార్గమగును.

14.ప. కాయల్గాచె వధూనఖాగ్రములచే గాయంబు వక్షోజముల్
రాయన్రాపడెఁ బొమ్ము మన్మధవిహారక్లేశ విభ్రాంతి చే
ప్రాయంబాయెను బట్టగట్టె తల చెప్పనోరోత సంసారమే
జేయంజాల విరక్తుజేయగదవే శ్రీకాళహస్తీశ్వరా!

**సందర్భము :**

మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకము నుండి గ్రహింపబడినది. ఐహిక సుఖముల పట్ల తనకు గలిగిన విరక్తిని కవి భగవంతునికి నివేదించుకొనుచున్నాడు.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| కాయంబు | = | శరీరము |
| వధూ | = | స్త్రీలయొక్క |
| నఖాగ్రములన్ | = | గోళ్ల చివర్లచే |
| కాయల్గాచే | = | కాయలు గాచినవి |
| రొమ్ము | = | వక్షస్థలము |
| వక్షోజముల్ | = | స్త్రీల రొమ్ములు |
| రాయన్ | = | రుద్దుటచే |
| రాపడెన్ | = | మొద్దుబారినది |
| మన్మథ విహార | = | శృంగారకేళి వలన |
| క్లేశ | = | వచ్చిన కష్టముల |
| విభ్రాంతిచే | = | మాయవలన |
| ప్రాయంబు | = | వయస్సు |
| ఆయెను | = | గడచిపోయినది |
| తల | = | తల |
| బట్టగట్టె | = | బట్టతలైనది (జుట్టు రాలిపోయినది) |
| చెప్పన్ | = | ఇవన్నియు తలచుకొనుటకు |
| రోత | = | రోతగనున్నవి |
| ఏన్ | = | నేను |
| సంసారమును | = | ఈ సంసారమును |
| చేయంజాల | = | చేయలేను |
| విరక్తుచేయగదవే | = | వైరాగ్యమును ప్రసాదించుము. |

**తాత్పర్యము :**

స్వామి! స్త్రీల గోళ్ల గిల్లులతో శరీరము కాయలు కాచినది. స్థనముల రాపిడితో రొమ్ము రాయైపోయినది. కాముకకేళిలో వయసు గడచినది. తల బట్టగట్టినది. సంసారము పేరు చెప్పిన రోత గలుగుచున్నది. ఈ సంసారమిక చేయలేను. విరక్తుని చేయుము.

**సంధులు :**

| | | |
|---|---|---|
| ప్రాయంబు + ఆయెను | = | ప్రాయంబాయెను (ఉకార సంధి) |
| చేయన్ + చాల | = | చేయంజాల (సరళాదేశ సంధి) |

**సమాసములు :**

నఖముల యొక్క అగ్రములు - షష్ఠీతత్పురుష సమాసం

విహారము వలన క్లేశము - పంచమీతత్పురుష సమాసం

**ఛందస్సు :**

ఇది శార్దూల వృత్త పద్యము. ఇందు నాలుగు పాదములుండును. ప్రతి పాదమునందున మ స జ స త త గ అను గణములుండును. 1, 13 అక్షరములకు యతి మైత్రి చెల్లును. ప్రాస నియమము కలదు.

**విశేష విషయములు :**

మహాకవి ధూర్జటి ఈ పద్యమునందు తనకు స్వామిపై గల భక్తియు, ఐహిక సుఖముల పట్ల విరక్తి రోత ఈ పద్యమునందు ఎంతో మధురముగా రచించెను.

**15.ప.** నిన్నే రూపముగా భజింతు మదిలో నీరూపు మోకాలో స్త్రీ
చన్నో కుంచమో మేకపెంటియో యీసందేహముల్మాన్పి
కన్నారన్భవదీయమూర్తి సగుణాకారంబుగా జూపవే
చిన్నీరేజ విహారమత్తమధుపా శ్రీకాళహస్తీశ్వరా!

**అర్థములు :**

| | | |
|---|---|---|
| చిత్ | = | మనస్సనెడు |
| నీరేజ | = | పద్మమునందు |
| విహార | = | విహరించు |
| మత్తమధుపా | = | మదించిన తుమ్మెదవైన ఈశ్వరా! |
| నిన్ను మదిలో | = | నిన్ను నా మనసులో |
| ఏ రూపముగా | = | ఏ రూపంతో |
| భజింతు | = | పూజ చేయగలను |
| నీరూపు | = | నీ ఆకారము |
| మోకాలో | = | మోకాలిచిప్పలా ఉండునో |
| స్త్రీ చన్నో | = | స్త్రీ రొమ్ము వలె నుండునో |
| కుంచమో | = | కుంచమువలె నుండునో |
| ఈ సందేహములు మాన్పి | = | ఈ అనుమానములు తొలగించి |
| నా | = | నాయొక్క |
| కన్నారన్ | = | కనులపండువగునట్లుగా |
| భవదీయ | = | నీ యొక్క |
| మూర్తి | = | ఆకృతిని |
| సగుణాకారంబుగా | = | గుణ ప్రధానమైన రూపంలో |
| చూపవే | = | దర్శనమిమ్ము |

**తాత్పర్యము :**

పరమేశ్వరా! నిన్ను మనస్సులో ఏ రూపముతో ధ్యానింతును. నీ రూపము మోకాలి వలె నుండునా! స్త్రీ స్తనము వలెనా, కుంచము వలెనా! మేకపెంటి వంటిదా! నా యీ అనుమానములు తొలగించి నీ రూపమును చూపించుము.

**విశేషములు :**

1) శ్రీ కృష్ణుడొకసారి అర్జునుని పరీక్షింపదలచి శివపూజకు గుడికి వెళ్లుచున్న అర్జునునాపి శివుడు ప్రతిచోట ఉన్నాడు. గుడికి వెళ్లటెందుల కనగా, అర్జునుడు నీవు చెప్పినట్టే చేయుదును. ఎక్కడ పూజింపుమందువనగా నా మోకాలిచిప్ప చూడు శివలింగాకారమున నున్నది. దీనిని పూజింపుమనెను. అట్లే అని అతడు దానిని పూజించెను.

2) శివభక్తుడొకడు శివరాత్రినాటి రాత్రి వేశ్యతో గడుపుచు శివరాత్రియని గుర్తుకురాగా ఆమె చంటినే శివలింగముగా భావించి పూజించెను. అది అట్లే శివలింగముగా మారిపోయినదట. ఆ చంటేశ్వరుడు పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంటి అను గ్రామమున నున్నాడు. అక్కడి కథ ఇది.

3) ఒక వర్తకుడు ధాన్యమును కొలుచు కుంచమునే శివలింగముగా భావించి కొలుచుట జూచి తోటి వారట్లు చేయుట మంచిది కాదన్నను అతడు మానలేదు. వారు లోనికేగి చూడగా కుంచము శివలింగమైనది. అతడు కుంచేశ్వరుడు.

4) భక్తుడైన గొల్లపిల్లవాడు పూజించుటకు శివలింగము లేదని బాధపడుచుండగా నొక బ్రాహ్మణుడు మేకపెంటికయే శివలింగమని చెప్పెను. అతడు భక్తితో దానినే పూజింపగా పరమేశ్వరుడా కుర్రవాని పేరుతో కోటేశ్వరుడయ్యెను.

16.ప. నినునావాకిట గావుమంటెనో? మరున్నీలాలక భ్రాంతి గుం
టెన పొమ్మంటినో యెంగిలిచ్చి తిను తింటేగాని కాదంటినో
నిన్ను నెమ్మిందగ విశ్వసించు సుజనానీకంబురక్షింప చే
సిన నా విన్నపమేల గైకొనవయా శ్రీకాళహస్తీశ్వరా!

**అర్థములు :**

| | | |
|---|---|---|
| నిన్ను, నా వాకిలి | = | నా యింటి ముందు |
| కావుమంటినో | = | కాపుండమంటినా? (లేదు) |
| మరున్నీలాలక భ్రాంతి | = | దేవకన్యలపై కోరిక చేత |
| కుంటెన | = | రాయబారము |
| పొమ్మంటినో | = | పొమ్మని చెప్పితినా (లేదు) |
| యెంగిలిచ్చి | = | నేను తిని మిగిలినది నీకిచ్చి |
| తిను | = | తినుము |
| తింటేగాని | = | తినకపోతే |
| కాదంటినో | = | వీలుకుదరదంటినా (లేదు) |
| నిన్ను | = | నిన్నే |
| నెమ్మిన్ | = | మనస్సులో |
| తగ విశ్వసించు | = | చక్కగా నమ్ముకొనియున్న |
| సుజనానీకంబు | = | నీ భక్తసమూహమును |
| రక్షింప | = | రక్షించమని |
| చేసిన | = | చెప్పుచున్నట్టి |
| నా విన్నపమును | = | నా మనవిని |
| ఏల స్వీకరింపవు | = | ఎందుకు స్వీకరింపవయ్యా! |

**తాత్పర్యము :**

ఓ స్వామీ! నేను నిన్ను బాణాసురుని వలె నా యింటికి కాపలా ఉండమనలేదు. దేవతాస్త్రీలకు దూతగా పొమ్మనలేదు. తిన్నని వలె ఎంగిలి మాంసము పెట్టి తింటే కాని వీలుకాదనలేదు. నిన్ను నమ్మిన నీ భక్తులను రక్షింపుమని మొరపెట్టుకొనుచున్నాను.

17.ప. ఱాలన్‌రువ్వగ చేతులాడవు కుమారా! రమ్మురమ్మంచున్
చాలన్ చంపగ నేత్రముల్దివియగా శక్తుండనేగాను నా
శీలంబేమని చెప్పనున్నదిక నీ చిత్తంబు నా భాగ్యమో
శ్రీలక్ష్మీపతి సేవితాంఘ్రియుగళా శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| శ్రీలక్ష్మీపతి | = | లక్ష్మితో కల్సిన విష్ణువుచే |
| సేవిత | = | పూజింపబడిన |
| అంఘ్రియుగళా | = | పాదముల జంట కలవాడా! (ఈశ్వరా) |
| రాలన్ రువ్వగ | = | నీపై రాళ్లు రువ్వుటకు |
| చేతులాడవు | = | నాకు చేతులు రావు |
| కుమారా | = | కొడుకా |
| రమ్ము రమ్మంచున్ | = | రారా అని పిల్చి |
| చంపగ | = | నీకు బలియిచ్చుటకు |
| చాలన్ | = | సరిపోను |
| నేత్రముల్ | = | కళ్లను |
| తివియగా | = | పెరికికొనుటకు |
| నేనశక్తుడ | = | నాకు శక్తి లేదు |
| నా శీలంబు | = | నా నడవడిక, నా భక్తి యిదియని |
| నీ చిత్తంబు | = | నీ మనసున దయ గలుగుటయే |
| నా భాగ్యము | = | నా యదృష్టము |

**తాత్పర్యము :**

విజ్జడను బోయవాడు నిన్ను పూజించుటకు పూవులు దొరకక రాళ్లతో పూజించినట్లు నేను చేయలేను? చిఱుతొండనంబి వలె కొడుకును చంపలేను. తిన్నడి వలె కన్నులు పెరికికొనలేను. నా భక్తి నేవిధముగా తెలుపగలను. నీ చిత్తము నా భాగ్యమును పరమేశ్వరా!

18.ప. రాజుల్మత్తులు వారిసేవ నరకప్రాయంబు వారిచ్చు నం
భోజాక్షీచతురంతయాన తురగీభూషాదులాత్మవ్యధా
బీజంబల్ తదపేక్ష చాలు పరితృప్తి పొందితిన్ జ్ఞానల
క్ష్మీ జాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా!

**సందర్భము :**

మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకము నుండి గ్రహింపబడినది. మహాకవి ధూర్జటి రాజుల సేవలను గూర్చి భగవంతునికి మొరపెట్టుకొనిన సందర్భములోనిది.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| రాజుల్ | = | రాజులు |
| మత్తుల్ | = | గర్వముతో మదించినవారు |
| వారి సేవ | = | అటువంటివారిని సేవించడం |
| నరకప్రాయంబు | = | నరకముతో సమానమైనది |
| వారు + ఇచ్చు | = | ఆ రాజులిచ్చు |
| అంభోజాక్షి | = | పద్మముల వంటి కళ్లు కలిగిన స్త్రీలు |
| చతురంగయాన | = | పల్లకీలు |
| తురగీ | = | గుఱ్ఱములు |
| భూషాదుల్ | = | ఆభరణములు మొదలగునవి |
| ఆత్మవ్యధా | = | మనసుకు బాధ కలిగించు |
| బీజంబుల్ | = | విత్తనముల వంటివి |
| తత్ + అపేక్ష | = | వాటిపై కోరిక |
| చాలు | = | చాలును |
| పరితృప్తిన్ | = | పూర్తి సంతృప్తిని |
| పొందితిన్ | = | పొందుచున్నాను |
| జ్ఞానలక్ష్మి | = | జ్ఞానసంపద వలన |
| జాగ్రత్ | = | మేలుకొనే |
| పరిణామము | = | మార్పును |
| దయతో ఇమ్ము | = | దయతో ప్రసాదించుము |

**తాత్పర్యము :**

రాజులు మత్తులు. వారి సేవ నరకముతో సమానము. వారిచ్చు స్త్రీలు, పల్లకీలు, గుఱ్ఱములు, ఆభరణములు మనసునకు బాధ కలిగించేవి. వాటిపై నాకు కోరిక లేదు. తృప్తి చెందితిని. ముక్తిమార్గము నొసగు జ్ఞానలక్ష్మిని ప్రసాదింపుము.

**సంధులు :**

వారు + ఇచ్చు = వారిచ్చు (ఉకారసంధి)

అంభోజ + అక్షి = అంభోజాక్షి (సవర్ణదీర్ఘ సంధి)

**సమాసములు :**

జ్ఞానమనెడు లక్ష్మి - రూపకసమాసము

అంభోజముల వంటి అక్షులు గలిగిన వారు - బహువ్రీహి సమాసము

**ఛందస్సు :**

ఇది శార్దూలవృత్త పద్యము. నాలుగు పాదములుండును ప్రతి పాదమున వరుసగా 'మ స జ స త త గ' అను గణములుండును. 1, 13 అక్షరములకు యతిమైత్రి చెల్లును. ప్రాస నియమము కలదు.

**కవితా విశేషములు :**

"స్తుతమతియైన ఆంధ్ర కవి ధూర్జటి పలుకులకేల కలిగెనో అతులిత మాధురీమహిమ" అని శ్రీకృష్ణదేరాయలన్నట్లుగా మనోజ్ఞమైన రీతిలో తన బాధను పరమేశ్వరునకు మొరపెట్టుకొనెను. ఐహికసుఖముల పట్ల, రాజాశ్రయము పట్ల తనకు కలిగిన విరక్తిని అద్భుతముగా చిత్రించెను.

**19.ప.** నీరూపంబు దలంపగా తుదమొదల్నేగాన నీవైనచో
రారారమ్మనియంచు చెప్పవు వృధారంభంబులింకేటికిన్
నీరన్ముంపుము పాలముంపు మికనిన్నే నమ్మినాడం జుమీ
శ్రీరామార్చిత పాదపద్మయుగళా శ్రీకాళహస్తీశ్వరా!

**అర్థములు :**

| | | |
|---|---|---|
| శ్రీరామార్చిత | = | శ్రీరాముని చేత పూజింపబడిన |
| పాదపద్మయుగళా | = | పద్మముల వంటి పాదముల జంట కలవాడా! |
| తలపగా | = | ఆలోచింపగా |
| నీ రూపంబు | = | నీ రూపము |
| తుదమొదల్ | = | చివర ఏదో, మొదలు ఏదో |
| నేగాన | = | నేను కనిపెట్టలేను |
| నీవైనచో | = | నీవయిననూ |
| రారారమ్మనియంచు | = | రమ్మని పిలువవు |
| చెప్పవు | = | చెప్పవు |
| వృధారంభముల్ | = | వ్యర్థమైన ప్రయత్నములు |
| ఇంకేటికిన్ | = | ఇంకా ఎందుకు? |
| నీరన్ + ముంపుము | = | నీటిలో ముంచినా |
| పాలముంపు | = | లేదా పాలల్లో ముంచినా |
| నిన్నే నమ్మినాడంజుమీ | = | నిన్నే నమ్ముకొని యుంటిని స్వామి! |

**తాత్పర్యము :**

శ్రీరాముని చేత సేవింపబడిన పాదములు కలిగినవాడా! నీ రూపము ఆద్యంతములు నేనెరుగను. నీవు నన్ను రమ్మని పిలచి చెప్పవు. వృధాయత్నము లేల? నీట ముంచినా, పాల ముంచినా నీదే భారము పరమేశ్వరా!

**20.ప.** నీకున్ మాంసము వాంఛయేని కరవా! నీచేతలేడుండగా
జోకైనట్టి కుఠారముండ ననలజ్యోతుండ నీరుండగా
పాకంబొప్పఘటించి చేతిపునుకన్ భక్షింపకాబోయచే
చేకొంటెంగిలిమాంసమిట్లు తగునా శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| నీకున్ | = | నీకు, మాంసము |
| వాంఛయేని | = | కోరుకున్నచో |

| | | |
|---|---|---|
| కరవా | = | ఏం తక్కువ |
| నీచేతి | = | నీ చేతిలో లేడి ఉండగా |
| జోకైనట్టి | = | పదునైనట్టి |
| కుతారముండగా | = | గొడ్డలి ఉండగా |
| అనలజ్యోతుండు | = | అగ్ని ఉండగా, నీరుండగా |
| పాకంబు+ఒప్ప | = | రుచిగా వంట |
| ఘటించి | = | చేసుకొని |
| చేపునుకన్ | = | చేతిలోని పుట్టిలో పెట్టుకొని |
| భక్షింపక | = | తినక |
| బోయచే | = | ఆ బోయవాడగు తిన్నని |
| ఎంగిలి మాంసము, చేకొంటె | = | తిన్నావు |
| ఇట్లు తగునా | = | ఇలా చేయవచ్చునా! |

**తాత్పర్యము :**

ఈశ్వరా! నీకు మాంసము తినవలెనన్న చేతిలో లేడి ఉన్నది, గొడ్డలి ఉన్నది, అగ్ని ఉన్నది, నీరున్నది. హాయిగా వండుకొని తినవచ్చుగదా! అలాకాక బోయవాడు తిన్న ఎంగిలి మాంసము తింటావేమయ్యా? ఇట్లు చేయుట తగునా?

**21.ప.** రాజై దుష్కృతిచెందె చందురుసు రారాజై కుబేరుండు దృ
గ్రాజీవంబున గాంచె దుఃఖము కురుక్ష్మాపాలుడా మాట నే
యాజిం గూలె సమస్త రాజబంధువులతో నారాజశబ్దంబు ఛీ
ఛీ! జన్మాంతరమందు నొల్లను జుమీ! శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| రాజై | = | రాజు అనిపించుకొనుట వలనన్ |
| చందురుడు | = | చంద్రుడు, దుష్కృతిచెందును = కళంకము పొందెను. |
| కుబేరుండు, రారాజై | = | రాజులకు రాజై (గొప్పరాజై) |
| దృగ్రాజీవంబు | = | పద్మముల వంటి కన్నులలో |
| దుఃఖము | = | విచారము |
| కాంచె | = | పొందెను |
| కురుక్ష్మాపాలుడు | = | దుర్యోధనుడు |
| ఆ మాటనే | = | రారాజు అనిపించుకొనుటకే |
| సమస్త | = | మొత్తము |
| రాజబంధువులతో, ఆజిం గూలె | = | యుద్ధమునందు మరణించెను |
| ఛీ,ఛీ, జన్మాంతరమందున్ | = | మరుజన్మలో కూడా |
| ఆ రాజశబ్దమును, ఒల్లన్జుమీ | = | ఇష్టపడను సుమా! |

**తాత్పర్యము :**

రాజని పిలువబడిన చంద్రుడు కళంకమునందెను. రాజరాజైన కుబేరుడు దుఃఖము నందెను. రారాజైన దుర్యోధనుడు బంధుమిత్ర సహితముగా యుద్ధమున మరణించెను. కావున నేనా రాజపదవిని జన్మజన్మలకు అంగీకరించను.

**ప. 22.** రాజర్థాతురుడైనచో నెచట ధర్మంబుండు? నేరీతినా
నాజాతిక్రియలేర్పడున్? సుఖము మాన్యశ్రేణికెట్లబ్బు? రూ
పాజీవాళికి నేది దిక్కు? ధృతినీభక్తుల్ భవత్పాద నీ
రేజంబుల్ భజియింతురే తెరుగునన్! శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| అర్థ | = | ధనమంతుడు |
| ఆతురుడైనచో | = | ఆసక్తిగలవాడైనచో |
| ధర్మంబు | = | న్యాయము |
| ఎచట ఉండును | = | ఎక్కడ ఉంటుంది |
| నానాజతి క్రియల్ | = | వర్ణాశ్రమ ధర్మములు |
| ఏ రీతిన్ | = | ఏవిధముగా |
| ఏర్పడును, మాన్యశ్రేణి | = | గౌరవనీయులకు |
| రూపాజీవాళికి | = | వేశ్యలకు |
| దిక్కు | = | రక్షణ, ఏది, |
| ఏ తెరుగనన్ | = | ఏ విధముగా, నీ భక్తుల్ |
| ధృతిన్ | = | ధైర్యముతో |
| భవత్ | = | నీ యొక్క |
| పాదనీరేజంబుల్ | = | పాదపద్మములను |
| భజింతురు | = | కొలుతురు |

**తాత్పర్యము :**

రాజునకు ధనముపై ఆశ కలిగిన న్యాయము, ధర్మము ఎచట నుండును? వర్ణాశ్రమ ధర్మములెట్లునడచును, సజ్జనులకు సుఖమెట్లు కలుగు? వేశ్యలకు దిక్కేది? ఏ ధైర్యముతో నీ భక్తులు నిన్ను పూజింపగలరు స్వామి!

**ప.23.** తరగల్ పిప్పలపత్రముల్ మెఱగుటద్దంబుల్ మరుద్దీపముల్
కరికర్ణాంతములెండ మావులతతుల్ ఖద్యోతకీటప్రభల్
సురవీధిలిఖితాక్షరంబులసువుల్ జ్యోత్స్నాపయః పిండముల్
సిరులందేల మదాంధులౌ దురోజనుల్ శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| అసువులు | = | ప్రాణములు |
| తరగల్ | = | కెరటములు (అలలు) |
| పిప్పల పత్రముల్ | = | రావి ఆకులు |
| మెఱగుటద్దంబుల్ | = | మెరుపు అద్దాలు |
| మరుద్దీపముల్ | = | గాలిలోని దీపములు |
| కరికర్ణాంతములు | = | ఏనుగు చెవుల చివరలు |

| | | |
|---|---|---|
| ఎండమావులతతుల్ | = | ఎండమావుల సమూహము |
| ఖద్యోతకీటప్రభల్ | = | మిణుగురుపురుగల కాంతులు |
| సురవీధీలిఖితాక్షరములు | = | ఆకాశములో వ్రాయబడిన అక్షరములు |
| జ్యోత్స్నా | = | వెన్నెల అను |
| పయఃపిండముల్ | = | పాలముద్దలు |
| జనుల్ | = | లోకులు (ఈ ప్రజలు) |
| ఏల | = | ఎందుకు |
| సిరులన్ | = | అట్టి అశాశ్వతమైన సంపదలతో |
| మదాంధులు + ఔదురు | = | గర్వించుదురు. |

**తాత్పర్యము :**

సంపదలు అలల వలె, రావి ఆకుల వలె, మెరుపుటద్దముల వలె, గాలిలోని దీపము వలె, ఏనుగు చెవుల చివళ్ల వలె, ఎండమావుల వలె, మిణుగురు కాంతుల వలె, ఆకాశములో వ్రాయబడిన అక్షరముల వలె, వెన్నెల అను పాలముద్ద వలె అశాశ్వతములని తెలిసి జనులు గర్వాంధులగుచున్నారు. ఎంత ఆశ్చర్యము ప్రభూ!

**ప.24.** నిన్నున్నమ్మినరీతి నమ్మనొరులన్ నీకన్ననాకెన్నలే
రన్నల్దమ్ములు తల్లిదండ్రులుగురుండా పస్సహాయుండు నా
యన్నా! యెన్నడునన్ను సంస్కృతి విషాదాంబోధిదాటించియ
చ్ఛిన్నానంద సుఖాబ్ధి దేల్చెదొకదే శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| నిన్నున్ + నమ్మిన రీతి | = | నిన్ను నమ్మినట్లుగా |
| ఒరులన్ | = | ఇతరులను |
| నమ్మను | = | నమ్మను |
| నీకన్నన్ | = | నీకంటెను, నాకున్ |
| ఎన్నన్ | = | చూడగా |
| అన్నదమ్ములు, తల్లిదండ్రులు, గురుండు | = | అన్నదమ్ములు, తల్లిదండ్రులు, గురవు |
| అపత్సహాయుండు | = | కష్టములో ఆదుకొనువాడు |
| లేరు | = | ఎవరూ లేరు |
| నాయన్నా | = | నా స్వామీ |
| నన్ను, సంసృతి | = | సంసారమను |
| విషాద + అంబోధి | = | దుఃఖ సముద్రమును |
| దాటించి | = | దాటించి (ఒడ్డుకు చేర్చి) |
| అచ్ఛిన్నానంద | = | శాశ్వతమైన సంతోషమును |
| సుఖ + అబ్ధి | = | సుఖసముద్రమున |
| యెన్నడు | = | ఎప్పుడు |
| తేల్చెదొ కదా | = | తేల్చెదవో కదా! |

**తాత్పర్యము :**

పరమేశ్వరా! నేను నిన్ను నమ్మినట్లెవరిని నమ్మను. నీకన్న తల్లి, తండ్రి, అన్న, తమ్ముడు, గురువు కష్టాలలో ఆదుకొను వారు ఎవరు లేరు. నన్నిప్పుడీ సంసారమను విషాద సముద్రమును దాటించి సుఖ సంతోషములలో ఎప్పుడు తేల్చగలవు స్వామి!

**ప.25.** నీపంచఁ బడియుండగా గలిగినన్భిక్షాన్నమేచాలు ని
క్షేపంబబ్బిన రాజకీటకములనే సేవింపగానోప నా
శాపాశంబుల జుట్టిత్రిప్పకుము సంసారార్థమై బంటుగా
చేపట్టందయగల్గెనేని మదిలో శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| నీపంచన్ | = | నీ యెదుట |
| పడియుండగా | = | జీవింపగా |
| కలిగిన, భిక్షాన్నమే చాలును | = | అడుక్కొని తెచ్చుకున్న అన్నమే చాలును |
| నిక్షేపంబు | = | నిధులు, |
| అబ్బిన | = | దొరికినను |
| రాజకీటకముల | = | పురుగులవంటి రాజులను |
| నే | = | నేను |
| సేవింపగానోప | = | సేవించుటకు యిష్టపడును |
| ఆశాపాశంబుల | = | ఆశ అనెడు త్రాళ్ళతో |
| చుట్టి, త్రిప్పకుము | = | సంసారార్థమై = కుటుంబ పోషణకు |
| బంటుగా | = | సేవకునిగా |
| చేపట్టన్ | = | చేసుకొనుటకు |
| దయకల్గెనేని | = | నాయందు దయ కలిగితే |
| మదిలో | = | నీ హృదయములో |

**తాత్పర్యము :**

ఓ స్వామి! నన్ను నీ దగ్గరకు చేర్చుకొన్నచో భిక్షాన్నమే చాలును. నిధులిచ్చినను రాజాధములను సేవింపలేను. ఆశాపాశముల చుట్టి త్రిప్పకుము. నీ మనసులో నాయందు దయ గలిగినచో నన్ను నీ బంటుగా స్వీకరింపుము.

**ప.26.** నీ పేరున్ భవదంఘ్రి తీర్థము భవన్నిష్ఠ్యూత తాంబూలమున్
నీపళ్లెంబు ప్రసాదమున్గొనికదా నేబిడ్డనైనాడ న
న్నీపాటింకరుణింపుమోపినిక నేనెవ్వారికింబిడ్డగాన్
చేపట్టందగు పట్టిమానదగదో శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| నీపేరున్ | = | నీ నామస్మరణ |
| భవత్ | = | నీయొక్క |
| అంఘ్రి తీర్థము | = | పాదతీర్థము |

| | | |
|---|---|---|
| భవత్ + నిష్ఠ్యూత | = | నీ చేత ఎంగిలికాబడి (ఉమ్మిన) తాంబూలము |
| నీ పళ్ళెంబు ప్రసాదమున్ | = | నీ పళ్ళెములోని ప్రసాదమును |
| కొనిగదా | = | పుచ్చుకొనుట చేతనేగదా! |
| నే | = | నేను |
| బిడ్డడైనాడ | = | నీ కుమారుడనైతిని |
| నన్ | = | నన్ను |
| ఈపాటిన్ | = | ఈ మాత్రము |
| కరుణింపుము | = | అనుగ్రహింపుము |
| ఓపనిక | = | సహించలేను (ఓర్చుకొనలేను) |
| ఎవ్వారికింబిడ్డగా | = | ఇతరులెవ్వరికి బిడ్డనుగాను |
| చేపట్టన్ + తగు | = | నన్ను నీ బిడ్డగా స్వీకరింపుము |
| పట్టె | = | కుమారునిగా స్వీకరించి |
| మానదగదు | = | వదలివేయుట ధర్మము కాదు |

**తాత్పర్యము :**

ఈశ్వరా! నిత్యము నీ నామమును జపించుచు, నీ పాదతీర్థమును సేవించుచు, తాంబూలము, ప్రసాదము స్వీకరించుచు నేను నీ బిడ్డనైతిని. నేనిక ఎవరికి బిడ్డను కాలేను. నాపై దయజూపి నన్ను నీ బిడ్డగా చేసుకొనుము. ఒకసారి పట్టి విడుచుట ధర్మము కాదు స్వామి!

ప.27. అమ్మాయయ్యయటంచు నెవ్వరిని నేనన్నన్శివా! నిన్ననే
సుమీ! నేమదితల్లిదండ్రులటంచు న్జూడగాబోకునా
కిమ్మై తల్లియుతండ్రియున్ గురుడు నీవేకాగ సంసారపుం
జిమ్మంజీకటి గప్పకుండగనుమా శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| అమ్మాయయ్యాయటంచు | = | అమ్మాయయ్య యని |
| నేను | = | నేను |
| ఎవ్వరిన్ | = | ఎవరిని |
| అన్నన్ | = | పిల్చినన్ |
| శివా, నిన్ననేసుమీ | = | అది నిన్నే పిలిచినట్లగును సుమా! |
| నీమదిన్ | = | నీ మనసులో |
| తల్లదండ్రులటంచు | = | సాధారణ తల్లిదండ్రులే యనుకొనుచు |
| చూడగాబోకు | = | భావించవద్దు |
| నాకున్ | = | నాకు |
| ఇమ్మై | = | ఈవిధముగా (ఈ శరీరమునకు) |
| తల్లియు | = | తండ్రియు, గురువు, |
| నీవేకాగ | = | నీవేయైయుండి |

| | | |
|---|---|---|
| సంసారపున్ | = | సంసారమనెడి |
| చిమ్మంజీకటి | = | కటిక చీకటిలో |
| కప్పకుండ | = | మూసివేయకుండా |
| కనుమా | = | కాపాడుము. |

**తాత్పర్యము :**

ఓ పరమేశ్వరా! నేనెవరినైనా అమ్మా, అయ్యాయని పిలిచినచో అది నిన్నే యగును. నాకు తల్లిదండ్రులు వేరే ఉన్నారనుకోవద్దు. నాకు తల్లి, తండ్రి, గురువు, దైవము అన్నీ నువ్వే. నన్ను సంసారమనెడు కటిక చీకటి కప్పకుండా కాపాడు స్వామి!

**ప.28.** కొడుకుల్ పుట్టరంచు నేడ్తురవివేకుల్ జీవనభ్రాంతులై
కొడుకుల్ పుట్టరెకౌరవేంద్రునకనేకుల్ వారిచేనేగతుల్
పడసెన్? పుత్రులులేని యాశుకునకున్ వాటిల్లెనే దుర్గతుల్
చెడు నేమోక్షపదంబపుత్రకునకున్ శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| కొడుకుల్ | = | కొడుకులు |
| పుట్టరు + అటంచు | = | పుట్టలేదనుకొనుచు |
| అవివేకుల్ | = | అజ్ఞానులు (తెలివిలేనివారు) |
| జీవనభ్రాంతులై | = | జీవితము శాశ్వతమని భ్రమకులోనై ఏడ్తురు |
| కౌరవేంద్రునకు | = | ధృతరాష్ట్రునకు |
| అనేకుల్ | = | నూరుమంది (ఎక్కువమంది) |
| పుట్టరే | = | పుట్టలేదా! |
| వారిచే | = | ఆ బిడ్డలచే రాజు |
| ఏగతుల్ పడసెన్ | = | ఏ సద్గతులు పొందెను |
| పుత్రులులేని, ఆ శుకునకున్ | = | ఆ శుకమహర్షికి |
| దుర్గతులు, వాటిల్లెనే | = | కలిగినవా? |
| అపుత్రునకున్ | = | కొడుకులు లేని వారికి |
| మోక్షపదంబు | = | ముక్తపదము |
| చెడునో | = | చెడిపోవునా? రాకపోవునా |

**తాత్పర్యము :**

కొందరవివేకులు కొడుకులు పుట్టలేదని ఏడ్చెదరు. ధృతరాష్ట్రమహారాజునకు నూరుగురు కొడుకులున్నను ఏ గతి ప్రాప్తించినది. అపుత్రకుడైన శుకయోగికి దుర్గతి కలిగెనా? పుత్రులే లేనివానికి మోక్షము లభింపకుండునా?

**ప.29.** గ్రహదోషంబులు దుర్నిమిత్తములు నీ కళ్యాణనామంబు ప్ర
త్యహమున్ బేర్కొనునుత్తమోత్తముల బాధంబెట్టగా నోపునే
దహనుంగప్పజాలునే శలభసంతానంబు? నీ సేవచే
సిహతక్లేశులు గారు గాక మనుజుల్ శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| గ్రహదోషంబుల్ | = | గ్రహముల వలన కలుగు దోషములు (జ్యోతిశ్శాస్త్రమును బట్టి మానవులకు కలుగు కీడులు) |
| దుర్నిమిత్తము | = | దుశ్శకునము |
| ప్రతి + అహమున్ | = | ప్రతిరోజు (నిత్యము) |
| నీ కళ్యాణనామంబు | = | పవిత్రమైన నీ నామమును |
| పేర్కొను | = | స్మరించు (జపించు) |
| ఉత్తమోత్తముల | = | మంచివారిని (భక్తులను) |
| బాధపెట్టగానోపునే | = | బాధించగలవా? |
| శలభసంతానము | = | మిడతలదండు |
| దహనున్ | = | అగ్నిదేవుని |
| కప్పంజాలునే | = | కప్పంచగలవా? |
| నీ సేవచేసి, మనుజులు | = | మానవులు |
| హత | = | నశించిన |
| క్లేశులు | = | కలిగినవారు కాదా! |

**తాత్పర్యము :**

పరమేశ్వరా! నిత్యము నీ నామస్మరణ చేయు భక్తశ్రేష్ఠులను గ్రహదోషములు, దుశ్శకునములు బాధించగలవా? అగ్నిదేవుని మిడతల గుంపు కప్పియుంచగలవా? నీ స్మరణచే కష్టములన్నియు బాపుకొనగలరు గదా!

**ప.30.** అడుగంబోనిక నన్యమార్గరతులం ప్రాణావనోత్సాహినై
యడుంగబోయిన బోదుఁనీదు పదపద్మారాధకశ్రేణియు
న్నెడకు నిన్నుభజింపగాగనియు నాకేలపరాపేక్షకో
రెడిదింకేమి భవత్ప్రసాదమె తగున్ శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| ప్రాణ + అవన + ఉత్సాహినై | = | ప్రాణములను రక్షించుకొనుటకు |
| అన్యమార్గరతులన్ | = | నిన్నుగాక ఇతర దైవములను పూజించువారిని |
| అడుగంబోనిక | = | యాచించుటకు వెళ్ళను |
| అడుగంబోయిన | = | ఒకవేళ అడగాలని వెళ్లినా |
| నీదు | = | నీయొక్క |
| పదపద్మారాధక | = | పాదపద్మములను సేవించు |
| శ్రేణి | = | సమూహము |
| ఉన్న + ఎడకు | = | ఉన్నచోటకి |
| పోదును | = | వెళ్లెదను |
| నిన్ను, భజింపగా గనియు | = | సేవించుట చూచియు |
| నాకేలా | = | నాకెందుకు |
| పరాపేక్ష | = | ఇతరులను పూజించాలనే కోరిక |

| | | |
|---|---|---|
| కోరెడిది | = | నేను కోరుకొనునది |
| ఇంక + ఏమి | = | ఇంకేమి ఉన్నది |
| భవత్ | = | నీ యొక్క |
| ప్రసాదము | = | దయయే |
| తగున్ | = | చాలును |

**తాత్పర్యము :**

నా ప్రాణాలను రక్షించుకొనుటకు నిన్ను తప్ప యితరులను యాచింపను. ఒకవేళ అడుగవలసివచ్చినచో నీ భక్తులనే అడిగెదను. నిన్ను సేవించు నాకు పరాపేక్ష ఎందులకు. నీ దయ తప్ప నేనింకేమి కోరను.

**ప.31.** మదమాతంగములందలములు హరుల్మాణిక్యముల్పల్లకుల్
ముదితల్ చిత్రదుకూలముల్పరిమళంబుల్మోక్షమీజాలునే
మదిలో వీనినపేక్ష చేసి నృపధామద్వాదేశంబుగా
చిదనంబుల్ వృధపుత్తురజ్ఞులకటా శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| మద | = | మదించిన |
| మాతంగములు | = | ఏనుగులు |
| అందలములు | = | ఆందోళికలు (మేనాలు) |
| హరులు | = | గుఱ్ఱములు |
| మాణిక్యముల్ | = | రత్నాలు |
| పల్లకులు | = | పల్లకులు |
| ముదితల్ | = | స్త్రీలు |
| చిత్రదూలకూలముల్ | = | రంగురంగుల దుస్తులు |
| పరిమళంబుల్ | = | సుగంధద్రవ్యములు |
| మోక్షమీజాలున్ | = | మోక్షము నివ్వగలవా |
| మదిలో | = | మనస్సులో |
| వీనిన్ + అపేక్ష చేసి | = | వీటన్నింటిని కోరుకొని |
| నృపధాయ | = | రాజగృహము |
| ద్వాదేశంబుగాంచి | = | గుమ్మాలయందు పడి గాపులుపడుచు |
| దినంబుల్ | = | రోజులు (కాలము) |
| వృధపుత్తురు | = | వ్యర్థము చేయుదురు |
| అజ్ఞుల్ | = | అజ్ఞానులు |
| అకటా | = | అయ్యో! |

**తాత్పర్యము :**

పరమేశ్వరా! ఏనుగులు, గుఱ్ఱాలు, రథములు, పల్లకులు, రత్నాలు, వర్ణవస్త్రములు, పరిమళద్రవ్యములు మోక్షము నివ్వగలవా? అజ్ఞానులు కొందరు వీటిని కోరుకొని రాజుల ఇంటి ముందు పడిగాపులు పడుచు కాలమును వృథా చేయుదురు. ఎంతటి అవివేకము స్వామీ!

ప॥ 32. రోసిరోయదు కామినీజనులతారుణ్యోరు సౌఖ్యంబులన్
పాసీపాయదు పుత్రమిత్రధనసంపద్భ్రాంతి వాంఛలతల్
కోసి కోయదు నామనంబకట! నీకున్ ప్రీతిగా సత్క్రియల్
చేసి చేయదు దీని త్రుళ్ళణచవే శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| నామనంబు | = | నా మనస్సు |
| అకటా | = | అయ్యో |
| కామినీ జనుల | = | స్త్రీల యొక్క |
| తారుణ్య | = | వయసు (యవ్వనపు) |
| ఉరుసౌఖ్యంబులు | = | గొప్పవైన సుఖములను |
| రోసి | = | అసహ్యించుకుంటూనే |
| రోయదు | = | అనుభవిస్తూనే ఉంటుంది |
| పుత్రమిత్ర, ధనసంపద | = | ధనము, సందలపై గల |
| భ్రాంతి | = | కోరికలు |
| పాసీపాయదు | = | వదిలినట్లే ఉంటుంది గాని విడచిపెట్టదు |
| వాంఛాలతల్ | = | కోరికలనే తీగలను |
| కోసి కోయదు | = | కోస్తున్నట్లే ఉంటుంది గాని కోయదు |
| నీకున్ | = | నీకు |
| ప్రీతిగాన్ | = | సంతోషము కలిగించు |
| సత్క్రియల్ | = | మంచిపనులు |
| చేసిచేయదు | = | చేస్తున్నట్లే ఉంటుంది గాని చేయదు |
| దీని | = | ఈ నా మనసు |
| త్రుళ్లు | = | పొగరును |
| అణచవే | = | అణచివేయుము |

**తాత్పర్యము :**

స్వామీ! నా మనసు స్త్రీలతోడి సుఖములను అసహ్యించుకుంటూనే కోరుచున్నది. పుత్ర, మిత్ర ధనముల మీద భ్రాంతి పోయినట్లే ఉంటుంది గాని పోదు. కోరికలనే తీగలను కోసినట్లుండునే గాని కోయదు. నీకు సంతోషము కలుగు మంచి పనులు చేసినట్లే చేసి మానుతుంది. దీని పొగరణచుము దేవా!

**ప.33.** ఎన్నేళ్లుండదు? నేమిగందునిక నేనెవ్వరి రక్షించెదన్
నిన్నే నిష్ఠ భజించెద నిరుపమోన్నిద్రా ప్రమోదంబు నా
కెన్నండబ్బెడు నెంతకాలమిక నేనిట్లున్న నన్నియ్యెడం
జిన్నం బుచ్చక నన్ను నేలుకొనవే శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| ఎన్ని + ఏళ్ళు + ఉండదు | = | ఇంక ఎన్నాళ్లు బ్రతికెదను |
| ఏమి కందునిక | = | ఇంక చూడవలసినదేమున్నది |
| నేను, ఎవ్వరి రక్షించెదన్ | = | ఎవరిని రక్షించగలను |
| నిన్ | = | నిన్ను, నేను |
| నిష్ఠ భజించెదన్ | = | భక్తితో పూజింతును |
| నిరుపమ | = | సాటిలేని |
| ఉన్నిద్రప్రమోదము | = | ధ్యానమనే నిద్రలోని ఆనందము |
| నాకు, ఎన్నండు + అబ్బెడు | = | ఎప్పుడు కలుగును |
| ఇక | = | ఇకమీద, ఎంతకాలము |
| నేనిట్లున్న | = | నేనిట్లు అశక్తునిగా ఉండగా |
| నన్ను, ఇయ్యెడ | = | ఈ పరిస్థితిలో |
| చిన్నబుచ్చక | = | తక్కువగా చూడక |
| నన్ను | = | నన్ను |
| ఏలుకొనుమా | = | పాలించుమా! |

**తాత్పర్యము :**

నేనింక ఎంతకాలముందును. ఎవరిని చూస్తాను. ఎవరిని రక్షిస్తాను. నిన్నే భక్తి శ్రద్ధలతో పూజింతును ధ్యాన సమాధిలోని ఆనందము నాకెన్నడు లభించును. ఎంత కాలమిట్లుండవలెను. నన్ను చిన్నబుచ్చక ఏలుకొనుము స్వామి!

**ప.34.** చావంగాలము చేరువౌటెరిగియుంచాలింపగాలేక త
న్నే వైద్యుండు చికిత్స బ్రోవగలడో ఏమందు రక్షించునో
ఏ వేల్పుల్ కృపజూతురోయనుచు నిన్నింతైన చింతింపడా,
జీవశ్రాద్ధము చేసికొన్న యతియున్ శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| చావన్ | = | మరణించుటకు |
| కాలము | = | సమయము |
| చేరువౌటెరింగియు | = | సమీపించినదని తెలిసియూ |
| చాలింపగాలేక | = | బ్రతుకుపై ఆశను చంపుకొనలేక |
| తన్ను | = | తనను |
| ఏ వైద్యుడు, చికిత్సన్ | = | తగిన వైద్యముతో |
| బ్రోవగలడో | = | రక్షింపగలడో |
| ఏ మందు, రక్షించునో | = | రక్షించునో |

| | | |
|---|---|---|
| ఏ వేల్పుల్ | = | దేవతలు |
| కృపజూతురో | = | దయ జూపుదురో అనుచు నిన్ను |
| ఇంతైన | = | కొంచెమైనను |
| చింతింపడు | = | ఆలోచించడు |
| ఆ జీవశ్రాద్ధము చేసుకొన్న | = | తాను చనిపోయినట్లు తనకు తానే శ్రాద్ధము పెట్టుకొన్న (బ్రతికుండగానే తద్దినము పెట్టుకొనుట) |
| యతియున్ | = | సన్యాసి కూడా! |

**తాత్పర్యము :**

బ్రతికుండగానే శ్రాద్ధము పెట్టుకొన్న సన్యాసి గూడ చచ్చే రోజు దగ్గర బడినను ఆశ వదులుకోలేక ఏ వైద్యుడు రక్షించునో, ఏ మందు తగ్గించునో, ఏ దేవతలు దయజూపుదురో యని పరుగులు తీయునే గాని నిన్ను కొంచెమైనను ధ్యానించడు గదా!

**ప.35.** దినముచిత్తములో సువర్ణముఖరీతీరప్రదేశామ్రకా
నన మధ్యోపలవేదికాగ్రమున నానందంబునం పంక జా
సనినష్ఠ నిన్ను జూడగన్న నదివోసౌఖ్యంబు లక్ష్మీవిలా
సిని మాయానటనల్ సుఖంబులగునే శ్రీకాళహస్తీశ్వరా!

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| దినము | = | రోజూ |
| చిత్తములో | = | మనసులో |
| సువర్ణముఖరీతీర | = | సువర్ణముఖ నదీ తీర |
| ప్రదేశ | = | ప్రాంతమున |
| అమ్రకానన | = | మామిడితోట |
| మధ్య | = | నడుమనున్న |
| ఉపలవేదిక | = | రాతిగట్టు |
| అగ్రమున | = | పైభాగమున |
| ఆనందంబున | = | సంతోషముతో |
| పంకజ + ఆసననిష్ఠన్ | = | పద్మాసనుడవైన |
| నిన్ను | = | నిన్ను |
| చూడగన్న | = | చూడగలిగిచో |
| అదివో | = | అదియే |
| సౌఖ్యంబు | = | సుఖము నిచ్చునది |
| లక్ష్మీవిలాసిని | = | సంపదనెడు విలాసవతి యొక్క |
| మాయానటనల్ | = | మోసపు చేష్టలు |
| సుఖంబులగునే | = | నిజమైన సుఖమునిచ్చునా! (ఇవ్వవు) |

**తాత్పర్యము :**

నిత్యము సువర్ణముఖీ నదీతీరమునందలి మామిడితోట మధ్యలో నున్న రాతి అరుగుపై పద్మాసనస్థుడైన నిష్ఠతో నిన్ను దర్శింపగలుగునదే నిజమైన సుఖము. సంపదలనెడి వయ్యారి నటనలు నిజముగా సుఖమునిచ్చునా! స్వామి!

## 5.3 సందర్భ సహిత వాఖ్యలు :

### 1. చింతాకంతయు చింతనిల్పడుగదా!

**సందర్భము :**

అష్టదిగ్గజ కవులలో నొకడైన మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకము నుండి గ్రహింపబడినది. శతకములో ప్రతి పద్యము దేనికదే సంపూర్ణమైనది. కవి పాఠకునితో సూటిగా మాట్లాడుట శతక లక్షణం. కవి యిందు సంసారము మిధ్యయని తలంచును. మనిషి మోహాంధుడై పరమార్ధమును గ్రహింపలేడని తెలుపు సందర్భము నందలిది.

**అర్థము :**

మనిషి ఆలుబిడ్డలు, ధనము, శరీరము నిత్యమని భ్రాంతి చెందును. పరమాత్ముడవైన నీపై చింతాకంత గూడ ధ్యానము నిల్పలేడని యర్థము.

### 2. ఈ శీలామాలపుజింతనెట్లుడిపెదో!

**సందర్భము :**

మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకము నుండి గ్రహింపబడినది. కవి పరమేశ్వరునితో సంసార బంధమును నా మెడకెందుకు గట్టితివి స్వామీ! ఇక నేను నిన్నెప్పుడు సేవించి, పూజించగలను అని మొరపెట్టుకొను సందర్భమునందలిది.

**అర్థము :**

నీపై భక్తి తొలగుట వలన నా మనసులో పెరుగుచున్న చెడ్డదైన మోహమను సముద్రములో మునిగియున్నాను. ఈ దుర్భర దుఃఖమును ఎట్లు తొలగించెదవు స్వామీ!

### 3. నీరన్ముంపుము పాలముంపుమిక నిన్నే నమ్మినాడ

**సందర్భము :**

మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకము నుండి గ్రహింపబడినది. నీ రూపము తుది మొదలు నేను కనిపెట్టలేను. నీవయినను నన్ను రారమ్మని పిలిచి చెప్పవు. చూపవు. ఈ పనికిమాలిన ప్రయత్నము లెందుకని కవి తెలుపు సందర్భమునందలిది.

**అర్థము :**

స్వామీ! వృధా ప్రయాస ఎందులకు. నీ పాదపద్మములనే నమ్ముకొన్నాను. నన్నికమీద నీట ముంచినా పాల ముంచినా నీదే భారము.

### 4. అచ్ఛిన్నాంద సుఖాబ్ధి దేల్చెదోకదే!

**సందర్భము :**

మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకము నుండి గ్రహింపబడినది. నిన్ను నమ్మినట్లుగ నేనితరులను నమ్మను. నీకు మించిన వారు నాకెవరు లేరు. అన్నదమ్ములు, తల్లిదండ్రులు, గురువు దైవము లేరు. నన్ను సంసార సాగరమును దాటింపుమని ప్రార్థించు సందర్భమునందలిది.

**అర్థము :**

నిన్ను మించిన వారు నాకెవరు లేరు. ఈ సంసార దుఃఖసాగరమును దాటించి అవిచ్ఛిన్నమైన సచ్చిదానందమున ఎన్నడు తేల్చెదవు స్వామీ! అని అర్థము.

**5. చిమ్మంజీకటి గప్పకుండ గనుమా!**

**సందర్భము :**

అష్టదిగ్గజములలో నొకడగు ధూర్జటి మహాకవి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకము నుండి గ్రహింపబడినది. నేను అమ్మా, అయ్యా యని ఎవరిని పిలచినచో నది నువ్వే యగుదువు. ఇంకెవ్వరిని పిలువను. నాకు తల్లి తండ్రి గురువు దైవము అన్నీ నీవై నన్ను కాపాడుమని ప్రార్థించిన సదర్భమునందలిది.

**అర్థము :**

నాకు తల్లిదండ్రులు వేరే లేరు. అన్నీ నువ్వే. నువ్వే నన్ను సంసారమనెడు చీకటి (మోహము) కప్పకుండా కాపాడవలసిందని యర్థము.

**6. చెడునే మోక్షపదంబపుత్రకునకున్**

**సందర్భము :**

మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకము నుండి గ్రహింపబడినది. ఈ లోకమున మానవులు కొడుకులు లేరని దుఃఖింతురు గాని నూరుగురు కొడుకులున్న దృతరాష్ట్రునకు ఏగతి పట్టినది. పుత్రులు లేని శుకయోగికి దుర్గతి కలిగినదా యనిన సందర్భము నందలిది.

**అర్థము :**

జీవులు కొడుకులు లేరని ఏడుస్తారు. పుత్రులు లేని వారికి ముక్తిమార్గము లభించదా అని అర్థము.

**7. లక్ష్మీవిలాసినిమాయనటనల్ సుఖంబులగునే**

**సందర్భము :**

మహాకవి ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకము నుండి గ్రహించబడినది. నిత్యము సువర్ణముఖీ నదీతీరము నందలి మామిడితోటలో నున్న రాతి అరుగుపై పద్మాసనస్థుడై శివుని ధ్యానించుటకు మించిన సుఖమేమున్నదను తెలుపు సందర్భమునందలిది.

**అర్థము :**

నిష్టతో పరమేశ్వరుని ధ్యానించుటలో పొందు ఆనందమును మించినదుండదు. సంపదలనెడు విలాసిని మాయలు సుఖము నిచ్చునా అని యర్థము.

**ముగింపు :**

మోక్షాన్ని కోరుకుంటున్న కవి రాజులను, వారి ప్రవర్తనలను, అజ్ఞానులైన పండితులు చేసే అకృత్యాలను ఘాటుగా విమర్శించడమే గాక ప్రపంచంలోని అనేక విషయాలపై తను వ్యక్తీకరించిన అభిప్రాయాలను గూర్చి తెలుసుకున్నాం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. కాళహస్తీశ్వర శతకం - గొల్లపూడి వారి ప్రచురణ

2. మహాకవి ధూర్జటి కవిత్వము - వ్యక్తిత్వము - డా॥ పొన్నెకంటి హనుమంతరావు

**పి. శాంతకుమారి**

లెక్చరర్, జె.కె.సి. కళాశాల, గుంటూరు

**పాఠం : 6**

# శ్రీకాళహస్తీశ్వర శతకము

(36 నుండి 70 పద్యాలు)

**- ధూర్జటి**

## శీర్షికలు :

6.0 లక్ష్యం

6.1 కఠిన పదాలకు అర్థాలు, తాత్పర్యాలు

6.2 సందర్భ సహిత వ్యాఖ్యలు

## 6.0. లక్ష్యం :

శ్రీ కాళహస్తీశ్వర శతకంలోని 36 నుండి 70 వరకు గల పద్యాలలోని కఠిన పదాలకు, అర్థాలు, తాత్పర్యాలను, సందర్భ వ్యాఖ్యలను గురించి వివరించటం ఈ పాఠం లక్ష్యం.

## 6.1. కఠిన పదాలకు అర్థాలు, తాత్పర్యాలు :

**36.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| ఆలు అంచున్ | = | భార్యయనుచు ఒక స్త్రీని |
| మెడన్ కట్టి | = | మెడకు తగిలించి |
| దానికిన్ | = | ఆ భార్యయందు |
| అపత్యశ్రేణిన్ | = | సంతానమును |
| కల్పించి | = | కలుగునట్లు చేసి |
| తత్ | = | ఆ |
| బాలవ్రాతమున్ | = | పిల్లలను |
| ఇచ్చిపుచ్చుకొను | = | తమ కుమార్తెలనిచ్చుట, కోడండ్రను తెచ్చుకొనుటయను |
| సంబంధంబు | = | చుట్టరికములను |
| ఏర్పరచి | = | కావించి |
| ఆమాలాకోటిని | = | ఆమాలలో నుండు కొలికి పూస చుట్టును |
| బాంధవంబనెడి | = | చుట్టరికమనెడి |
| ప్రేమన్ | = | ప్రేమతో |
| కొందరన్ | = | కొందరు జనులను |
| త్రిప్పుగాన్ | = | త్రిప్పుటకై |
| సీలన్ | = | ఒక సీలతో |
| సీల | = | ఇంకొక సీలను |
| అమర్చినట్లు | = | కలిపినట్లు |
| ఒసగితో | = | ఈ చుట్టరికములను ఏర్పరచితివి కదా ! |

**తాత్పర్యము :** ఒక స్త్రీని భార్యయని మెడకు తగిలించి, దాని యందు సంతానమును కలిగించి, ఆ తర్వాత వారికి పెండ్లి పేరంటములనుచు ఇచ్చుపుచ్చుకొను బాంధవ్యములను కల్పించి మాలికలో కొలికి పూస చుట్టును మిగిలిన పూసలు తిరుగునట్లును, యంత్రములో సీలతో సీలను కలిపి త్రిప్పినట్లును ఈ సంసారమును ఏర్పరచితివి గదా !

**సందర్భము :** విడదీయరాని అనుబంధంతో సంసార బంధాలు మానవుల మధ్య ఎట్లేర్పడతాయో ఆ బంధం ఎంత శాశ్వతంగా ఉంటుందని చెప్పే సందర్భములోనిదీ పద్యం.

**37.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| తనువే | = | ఈ శరీరమునే |
| నిత్యముకాన్ | = | శాశ్వతము అగునట్లుగా |
| ఒనర్పుము | = | చేయుము |
| అదిలేదా | = | ఒకవేళ అది సాధ్యము కానట్లయితే |
| చచ్చి | = | మరణించి |
| జన్మింపకుండ | = | తిరిగిపుట్టకుండ |
| ఉపాయము | = | మార్గమును |
| ఘటోపుము | = | ఏర్పరచుము |
| ఈగతులరెంటన్ | = | పై రెండు పద్ధతులలోను |
| నేర్పు లేకున్నన్ | = | నీకు నైపుణ్యము లేకపోయినచో |
| లేదని | = | నీ అశక్తతను |
| నాకిప్పుడు | = | నాకిప్పుడే |
| చెప్పు | = | చెప్పుము |
| చేయగల | = | చేయవలసిన |
| కార్యంబు | = | పనియేమైన |
| ఉన్నన్ | = | ఉన్నట్లైతే |
| కాలమునన్ | = | సరియైన కాలములో (జీవించియున్న కాలములోనే) చేసి |
| సంసేవన్ | = | ఆసేవ వలన |
| నినున్ | = | నిన్ను |
| కాంచెదగాక | = | దర్శించెదను |

**తాత్పర్యము :** ఈశ్వరా ఈ శరీరమును శాశ్వతముగా నుండునట్లు చేయుము, లేదా చచ్చిన తర్వాత మరల జన్మింప కుండునట్లు చేయుము. ఈ రెండు పనులను నీకు సాధ్యము కాని పక్షములో నాకా సంగతి చెప్పుము. బ్రతికి యున్నప్పుడే సకాలములో చేయవలసిన పనులన్నిటిని చక్కబెట్టుకొని, మరణానంతరము నిన్ను చూచుటకు వచ్చెదను.

**సందర్భము :** భగవంతుని యొక్క అశక్తతనే ప్రశ్నిస్తున్నాడు రెండు అసంబద్ధమైన కోర్కెలతో ధూర్జటి; మరణానంతరమైనా తనకు భగవదనుగ్రహం కలిగించమని అడిగే సందర్భములో చెప్పిన పద్యమిది.

**38.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| ఒక భూపాలుండు | = | ఒక రాజు |
| పదునాల్గు మహాయుగంబుల్ | = | 14 మహాయుగములంత కాలము |
| ఏలెన్ | = | భూమిని పరిపాలించెను |
| ఒకడు | = | మరియొక రాజు |
| ఆయుష్మంతుడై | = | దీర్ఘాయువు గలవాడై |
| అయ్యుదయాస్తాచలసంధిన్ | = | తూరపు పడమటి కొండల మధ్యనున్న భూమియందు |
| ఆజ్ఞ చెల్లించెన్ | = | తన యాజ్ఞను సాగించెను |
| వీరి యభ్యుదయంబు | = | పై రాజుల ఔన్నత్యమును |
| ఎవ్వరు | = | ఎవరో ఒకరు |
| చెప్పగాన్ | = | చెప్పుకొనుచుండగా |
| వినరో | = | వినలేదా ? |
| అల్పుల్ | = | ఈ చిన్న చిన్న రాజులు |
| మత్తులై | = | మదము గలవారై |
| రాజులము అంచున్ | = | మేమును రాజులమేయని |
| అక్కటకటా | = | అయ్యయ్యో |
| ఏలచచ్చెదరో | = | ఎందుకు విఱ్ఱవీగెదరో కదా ! |

**తాత్పర్యము :** ఈశ్వరా ! ఒక రాజు కృత త్రేతాద్వాపర కలియుగములు నాలుగును కలిసినంత కాలము పాలించెను, మరియొక రాజు ఉదయాద్రి నుండి అస్తాద్రి వరకు నున్న భూమిని నిరాఘాటముగా పాలించెను. ఇటువంటి మహారాజుల యొక్క చరిత్రలను ఈ అల్పులైన రాజులు వినియుండలేదా ? తామును రాజులమేయని యేల గర్వపడుచుందురో !

**సందర్భము :** రాజుల యొక్క గర్వాన్ని, అహంకారాన్ని ప్రశ్నిస్తూ చెప్పిన సందర్భములోనిదీ పద్యము.

**39.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| రాజన్నంతనె | = | రాజపదవి నలంకరించిన వెంటనే |
| కృపయు | = | దయము |
| ధర్మము | = | ధర్మమును |
| అభిజాత్యము | = | అభిమానమును |
| విద్యాజాతక్షమ | = | విద్యావివేకముల వలన కలుగు ఓర్పు |
| సత్యభాషణము | = | సత్యము పలుకుట |
| విద్వన్మిత్ర సంరక్షయున్ | = | విద్వాంసులను మిత్రులను పోషించుటయు |
| సౌజన్యంబు | = | మంచితనము |
| కృతంబు | = | చేసిన మేలును |
| ఎఱుంగటయు | = | మరువకుండుటయు |
| విశ్వాసము | = | నమ్మకము |

| | | |
|---|---|---|
| అగ్నియును | = | పైన పేర్కొనిన వన్నియును |
| పోవునా | = | నశించునా ? |
| కాకున్నన్ | = | అట్లుకానిచో (ఈరాజులు) |
| దుర్భీజశ్రేష్టులుగాన్ | = | నీచాతినీచులగుటకు |
| కేతంబు | = | కారణము |
| కలదే | = | వేరే యున్నదా ? |

**తాత్పర్యము :** ఈశ్వరా ! రాజు అవగానే దయాధర్మములు, అభిమానము, విద్యా వివేకములు, దాని వలన కలుగు ఓర్పు, సత్యవాక్పరిపాలనము, పండితులను, స్నేహితులను పోషించుటయు, మంచితనమును కృతజ్ఞతయు, విశ్వాసము అన్నియును నశించుపోవునా ? ఏమీలేకపోయినచో రాజులిట్లు నీచులుగా నుండుటకు కారణమేమి ?

**సందర్భము :** రాజులంటే పరమ నీచులనీ, ధూర్జటి అభిప్రాయం, తన అభిప్రాయాన్ని బలపరుచుకుంటూ చెప్పిన సందర్భము లోనిదీ పద్యము

**40.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| చింతించి చూడంగన్ | = | ఆలోచించిచూడగా, |
| ముసు | = | పూర్వము |
| నీచేన్ | = | నీవలన |
| అపవర్గరాజ్యపదవీ | = | మోక్షమనెడి సామ్రాజ్య పదమునందు |
| మూర్ధాభిషేకంబు గాంచిన | = | పట్టాభిషేకము పొందిన |
| పుణ్యాత్ములు | = | గొప్పవారలునూ |
| నేనున్ | = | నేనున్నూ |
| ఒక్కసరివో | = | సమానులమే సుమా |
| ఎట్లనినన్ | = | ఎట్లనగా |
| కీట | = | సాలె పురుగు |
| ఫణీంద్ర పోత | = | సర్పరాజమును |
| మదవేదండ | = | మత్తగజమును |
| ఉగ్రహింసా విచారిని | = | కిరాతకుడును (తిన్నడు) |
| కాగాన్ | = | సమానులు అయియుండగా (నేనేల సమానుడకాను) |
| మదిలోన్ | = | మనస్సులో |
| నినున్ | = | నిన్ను |
| కానఁగాక | = | చూడలేదుకాని |

**తాత్పర్యము :** శంకరా ! ఇదివరలో నీవల్ల మోక్షమునొందిన పుణ్యాత్ములును, నేనును సమానులమే. ఎట్లందువా? సేవా విషయములో సాలె పురుగు, పాము, ఏనుగు కిరాతుడైన తిన్నడును, నేనును సమానులమే కదా ! వారు నిన్ను ఆత్మలో దర్శించినవారు. నేను దర్శించలేదు. అంటే, చిన్న భేదమే గదా ! వారికిచ్చినట్లు నాకు కూడా మోక్షమీయరాదా ?

**సందర్భము :** తనకు మోక్షాన్ని ప్రసాదించమని ఆ పరమశివుణ్ణి ప్రాధేయపడి అడుగుతున్నాడు ధూర్జటి, నిన్ను ఆరాధించటంలో నీ భక్తులతో నేనూ సమానమే అని విన్నవించుకుంటూ చెప్పిన సందర్భములోని పద్యమిది.

**41.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| పరమానాశన | = | వాయువు ఆహారముగా గల పాములు |
| భూషణప్రకరముల్ | = | ఆభరణములును |
| భద్రేభ చర్మంబున్ | = | ఏనుగు తోలును |
| ఆటవికత్వంబున్ | = | కిరాతత్వమును |
| ప్రియములై | = | నీ కిష్టములైనందున |
| భుజగ | = | పామునకు |
| శుండాల | = | ఏనుగునకును |
| అటవీచారులన్ | = | అరణ్యమునందు సంచరించు కిరాతునకును |
| భవదుఃఖాంబులన్ | = | పుట్టుకతో వచ్చు దుఃఖములను |
| పాపుట | = | తొలగించుట |
| ఒప్పున్ | = | బాగుగానున్నది |
| కాని | = | ఎందులకని |
| చెలదిన్ | = | సాలె పురుగునకు |
| పాటించి | = | పెద్దరికమిచ్చి |
| కైవల్యమిచ్చి | = | మోక్షమిచ్చి |
| వినోదించుటకు | = | ఆనందించుటకు |
| ఏమికారణమయా | = | ఏమి కారణమో తెలియకున్నది |

**తాత్పర్యము :** శంకరా ! నీకు పాముల నగలన్నను, ఏనుగుతోలన్నను, కిరాత వేషమన్నను చాల అభిమానమానియు, అందుకే పామునకు, ఏనుగునకును, కిరాతనకును, మోక్షమిచ్చినావు అందుకు సంతోషమే. కాని పనికిమాలిన సాలెపురుగునకు కూడ పెద్దపీటవేసి మోక్షమెందుకిచ్చినావో తెలియుటలేదు.

**సందర్భము :** అసమాన భక్తి ప్రపత్తులతో నీ మనస్సును వారించిన భక్తులకు కైవల్యాన్ని ప్రసాదించావు. కాని అనర్హులైన వారలకు కూడా మోక్షాన్ని ప్రసాదించావెందులకో అని ధూర్జటి అడుగుతున్న సందర్భములోనిదీ పద్యము.

**42.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| అమరస్త్రీలను | = | దేవతాస్త్రీలను |
| రమించినన్ | = | అనుభవించినను |
| ఇంతయున్ | = | కొంచమైనను |
| మోహము | = | స్త్రీవాంఛ |
| చెడదు | = | తీరదు |
| బ్రహ్మపట్టము | = | బ్రహ్మపదవి |
| సిద్ధించినన్ | = | కలిగినను |

| | | |
|---|---|---|
| ఆస | = | ఆశ |
| తీరదు | = | తొలగదు |
| సర్వలోకములన్ | = | సమస్త లోకములను |
| మ్రింగినన్ | = | కబళించినప్పటికిని |
| నిగూఢక్రోధము | = | పట్టరాని కోపము |
| మానదు | = | తగ్గదు (కనుక) |
| ఇందుగల | = | ఈలోకములో గల |
| సౌఖ్యంబు | = | సుఖములను |
| ఒల్లన్ | = | ఇష్టపడను |
| నీ సేవచేసి | = | నిన్ను ఆరాధించి |
| మహాపాతక | = | మహా పాపములనెడి |
| వారిరాశిన్ | = | సముద్రమును |
| కడతున్ | = | దాటెదను |

**తాత్పర్యము :** శంకరా ! నా మోహము దేవతా స్త్రీలను రమించినను చావదు, సాక్షాత్తు బ్రహ్మపదవి సిద్ధించినను నాయాశ చావదు, జీవలక్షణమైన క్రోధము-సర్వలోకములను కబళించినను తీరదు. ఇంక ఈలోకములందలి సౌఖ్యములు నేనాశింపను నీసేవ చేసి పాపసాగరములను దాటి నీకడకు వచ్చెదను.

**సందర్భము :** మానవుడు కోరుకునే సుఖాలకు, ఆశలకు అంతే ఉండదని తాను కూడా వాటికి అతీతుడనుకానని చెప్పుకొనే సందర్భములోనిదీ పద్యము.

**43.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| చనువారిన్ | = | చనిపోయినవారిని |
| కని | = | చూసి |
| యేడ్చువారు | = | దుఃఖించు బంధువులు |
| తారు | = | తాము |
| ఆవేళన్ | = | ధర్మోదకములిచ్చునపుడు (పదవ రోజు) |
| ఆదేవునన్ | = | ఆస్నానాల రేవులో |
| మునుగంబోవుచు | = | మునుగుచు |
| జముడా | = | ఓ యముడా |
| ఏమున్ | = | మేము కూడా |
| సత్యంబుగా | = | నిజముగా |
| వత్తుము | = | వచ్చెదము |
| అనుమానము లేదు | = | సందేహము లేదు |
| నమ్ముమని | = | నమ్మవలసినదని |
| బాసచేయుట సుమీ | = | ప్రయాణము చేయుటే సుమా |

| | | |
|---|---|---|
| చెనటుల్ | = | బుద్ధిహీనులు |
| ముమ్మాటికిని | = | ఎప్పటికిని |
| దీని భావము | = | దశ దినకర్మల ఆంతర్యము |
| ఇదివో | = | ఇదియే సుమాయని |
| కానరు | = | గ్రహింపరు |

**తాత్పర్యము :** శంకరా ! చనిపోయిన వారిని గూర్చి పదవనాడు రేవులో మునుగుచు, యముడా ! మేము మాత్రము శాశ్వతముగా నుండమా ఏదో ఒకనాడు నిజముగా నీవద్దకు వచ్చెదము అని ప్రమాణములు చేయుటయే. ఈ భావము ఆ ఏడ్పులోనే యిమిడి యున్నది వివేక శూన్యులు మాత్రమే ఈ భావమును గ్రహింపలేరు.

**సందర్భము :** పుట్టిన ప్రతి ప్రాణి గిట్టక తప్పదు. కొంతమంది మూర్ఖులు ఈ సత్యాన్ని గ్రహించలేరని ధూర్జటి అంటున్న సందర్భములోనిదీ పద్యము.

**44.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| భవదుఃఖములు | = | పుట్టుకతో సంప్రాప్తమయ్యే కష్టాలు |
| భవదంఘ్రి స్తుతిచేతగాక | = | నీపాదసేవచేత తప్ప |
| రాజ కటములన్ | = | పురుగుల వంటి రాజులను |
| ప్రార్థించినన్ | = | ప్రాధేయపడినంత మాత్రముచేత |
| పాయునే | = | తొలగునా ? |
| తల్లి | = | మాతృమూర్తి |
| కారుణ్యదృష్టి విశేషంబునన్ | = | వాత్సల్య దృష్టితో |
| ఇచ్చు | = | ఇచ్చునట్టి |
| చంటంబలెన్ | = | చనుబాలతో వలె, |
| విలసత్ | = | పెరుగుచున్నట్టి |
| బాల | = | పిల్లవాని |
| క్షుధాక్లేశదుష్టవిధుల్ | = | ఆకలి బాధ |
| మేక మెడచుంటన్ | = | మేక మెడ క్రింద నున్న చన్నులతో |
| మానునే | = | తీరునా ? |

**తాత్పర్యము :** శంకరా ! సంసార దుఃఖములు నీపాదసేవచేసినచో తొలగునుగాని, అధములైన రాజులను సేవించి ప్రార్థించినచో తొలగునా ? పసిబిడ్డయాకలి తల్లి ప్రేమతో యిచ్చు చనుబాలతో తీరునుగాని, మేక మెడ క్రిందనున్న చన్ను గుడిచినచో తీరునా?

**సందర్భము :** నిరాఘాటంగా, నిర్భయంగా రాజుల్ని దూషించాడు ధూర్జటి. ఇప్పుడు అదే చేశాడు అధములైన రాజుల్ని సేవిస్తే ఏమొస్తుంది, నీపాదసేవ చేస్తే మోక్షమన్నా వస్తుందని చెప్పు సందర్భములోనిదీ పద్యము.

**45.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| అవనీ మండలి లోపలన్ | = | ఈ భూమండలములో |
| శివ శివేతి | = | శివ శివయని |
| ఆ భాషకోల్లోసికిన్ | = | స్మరించువానికి |

| | | |
|---|---|---|
| పవి | = | వజ్రాయుధము |
| పుష్పంబగున్ | = | పువ్వువంటిదగును |
| అగ్ని | = | దహించెడిదగు అగ్ని |
| మంచగున్ | = | చల్లబడిపోవును |
| అకూపారంబు | = | సముద్రము |
| భూమిస్థలంబవున్ | = | నేలయగును |
| శత్రుండు | = | శత్రువు |
| మిత్రుడౌన్ | = | స్నేహితుడగును |
| విషము | = | ప్రాణహానిని కల్గించునట్టి విషము |
| దివ్యాహారమూన్ | = | అమృతము వంటిదగును |
| ఎన్నగాన్ | = | ఎంచి చూడగా |
| సర్వవశ్యకరమాన్ | = | అందరిని వశము చేసికొన గలిగినది యగును |

**తాత్పర్యము :** శంకరా ! లోకంలో శివనామోచ్చారణము చేయు పుణ్యాత్మునికి వజ్రము - పువ్వగును, అగ్ని - మంచగును, సముద్రము - నేలయగును. పరమశత్రువు - మిత్రడగును. విషము - అమృతాన్నమగును. పరమశివా నీ నామము లోకములోని యందరను వశము చేసికొను ఉత్తమ సాధనమగును.

**సందర్భము :** "శివ" యన్న రెండక్షరాలు ఎంత మహిమగలవో 'శివ' నామాన్ని జపించేవారికి ఒన గూరే ప్రయోజనాలేమిటో చెప్పే సందర్భములోనిదీ పద్యము.

**46.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| కానలన్ | = | అరణ్యములో (అడవులలో) |
| కందమూల ఫలముల్ | = | దుంపలు, ఫలములు |
| లేవా | = | ఉన్నవి |
| గుహల్ లేవో | = | నివసించటానికి గుహలు ఉన్నవి |
| యేఋలన్ | = | వంకలలో |
| తోయముల్ | = | నీళ్ళు |
| లేవో | = | ఉన్నవి |
| పల్లవాస్తరణముల్ | = | చిగుళ్ళతో వేసిన శయ్యలు |
| లేవో | = | ఉన్నవి |
| విరక్తులన్ | = | వైరాగ్యముగల వారిని |
| మనుపన్ | = | రక్షించుటకు |
| సదా | = | ఎల్లప్పుడును |
| నీవు లేవో | = | నీవు ఉన్నావు |
| జాలింబూంది | = | విచారపడి |
| జనుల్ | = | ఈ మానవులు |

| | | |
|---|---|---|
| భూపాలురన్ | = | రాజులకు |
| సేవల్ చేయగన్ | = | సేవచేయుటకు |
| పోదురు | = | వెళ్ళెదరు |
| ఏలకో | = | ఎందులకో కదా ? |

**తాత్పర్యము :** శంకరా ! ఈ ప్రజలకు నిజముగా వైరాగ్యమే కలిగినచో అట్టివారు నివసించుటకు గుహలు లేవా ? తినుటకు కందమూల ఫలములు లేవా ? త్రాగటానికి సెలయేళ్ళలోని తేటనీరు లేదా ? పండు కొనుటకు చిగురుటాకుల శయ్యము లేవా ? రక్షించుటకు హృదయములో నీవు లేవా ? ఎందుకీ ప్రజలు రాజాశ్రయం కోసం తాపత్రయము నొందుదురో కదా ?

**సందర్భము :** రాజులన్నా, వారిని ఆశ్రయించి బ్రతకటమన్నా ధూర్జటికి పరమ అసహ్యం. అదే ఈ పద్యంలో ప్రదర్శించాడు, రాజుల్ని ఆశ్రయించి బ్రతకటం కంటె కానల్లో బ్రతకటమే మేలని చెబుతున్న సందర్భంలోనిదీ పద్యం.

**47.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| మును | = | పూర్వము |
| నేన్ | = | నేను |
| పుట్టిన | = | ఎత్తిన |
| పుట్టులు | = | జన్మములు |
| ఎన్నికలవో | = | ఎన్నిలేవు ? |
| మోహంబుచేన్ | = | మాయలోబడి |
| అందున్ | = | ఈ జన్మల్లో (గతించిన జన్మల్లో) |
| చేసిన | = | ఆచరించిన |
| కర్మంబుల | = | పనులు |
| ఎన్నిగలవో | = | ఎన్నిలేవు |
| చింతించినన్ | = | ఎంత ఆలోచించినను |
| కానను | = | ఆ పనులను గ్రహింపలేకున్నాను |
| ఈ జననం చేయని | = | ఈ జన్మ యొక్కటే యనుకొని |
| ఉన్నవాడను | = | భ్రమలో నున్నాను |
| నిన్నుకొల్చిన | = | నిన్ను ఆరాధించిన |
| పుణ్యంబునకున్ | = | సుకృతమునకు |
| కృపారతుడవై | = | దయగలవాడవై |
| ఇదియే | = | ఈ జన్మముతోనే |
| చాలింపవే | = | సరిపెట్టి నాకు మోక్షమీయవా ? |

**తాత్పర్యము :** శంకరా ! ఇదివరలో నేనెత్తిన జన్మలెన్నియో ! వానిలో మోహితుడనై నేను చేసిన కర్మ లెన్నియో ఎంత ఆలోచించినను తెలిసికొనలేకున్నానను. ఈ జన్మయే పరమార్థమని భ్రాంతిలో నున్నాను. నిన్నింతవరకు సేవించిన పుణ్య విశేషంబునకు సంతృప్తి చెంది ఈ జన్మముతో మోక్షమున ప్రసాదించి నన్ను అనుగ్రహింపవా ?

**సందర్భము :** ఎన్నిసార్లు జన్మించినా ఈ మానవ జన్మకు పరమార్థం లేదు. ఇహనైనా నేచేసిన సేవలకు తృప్తి చెంది మోక్షాన్ని ప్రాసదించమని శివుణ్ణి ప్రాధేయపడుతూ చెప్పిన పద్యం.

**48.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| తనువు | = | నా యీ శరీరము |
| ఎందాకన్ | = | ఎంతవరకు |
| ధరిత్రిన్ | = | భూమిమీద |
| ఉండున్ | = | ఉండునో |
| అందాక | = | అప్పటివరకు |
| ననున్ | = | నన్ను |
| మహారోగ | = | మాయరోగ (పెద్దలోగ) |
| దీపన్ | = | ఉద్రిక్తతలతో గలుగు |
| దుఃఖాదులన్ | = | బాధలు మున్నగువానిని |
| పొందకుండన్ | = | అనుభవింపకుండ |
| అనుకంపాదృష్టిన్ | = | దయాదృష్టితో |
| వీక్షించి | = | చూచి |
| ఆ వెనుకన్ | = | ఆ తరువాత |
| నీ పదపద్మముల్ | = | నీ పాద పంకజములను |
| తలచుచున్ | = | ధ్యానించుచు |
| విశ్వ ప్రపంచంబున్ | = | ఈ సమస్త ప్రపంచమును |
| పాసిన్ | = | విడిచిన |
| చిత్తంబునన్ | = | మెనస్సుతో |
| ఉండజేయగదవే | = | ఉండునట్లు చేయవా ! |

**తాత్పర్యము :** ఈశ్వరా ఈతనువెంత వరకు ఉండునో అంతవరకును రోగాది బాధలు లేకుండ రక్షించి ఆపైన ఈ ప్రపంచమునే విస్మరించు స్థితిలో నుండునట్లు చేసి నన్ను ఉద్ధరింపుము.

**సందర్భము :** ఈ సృష్టిలోని ఏ వస్తువు శాశ్వతం కాదు, మనిషి తాత్కాలికం, జీవితం బుద్బుదప్రాయం (నీటి బుడగతో సమానం) మనిషి కోరుకునే భోగభాగ్యాలు తాత్కాలికం. అందుకనే ధూర్జటి తనకు సంపూర్ణమైన ఆరోగ్యం ప్రసాదించమని వేడుకొనే సందర్భంలో చెప్పిన పద్యం.

**49.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| మలభూయిష్ట | = | మలముతో నిండిన |
| మనోజధామము | = | మార్మాంగము |
| సుషుమ్నాద్వారమో | = | స్త్రీ శరీరమునందలి అతిముఖ్య నాడియా ? (భాగమా) |
| ఆరు | = | అతిశయిల్లు |
| కుండలియో | = | సర్పరూపముననున్న కుండలినీశక్తియా |
| పాదకరాక్షియుగ్మములు | | |
| పాద | = | పాదములు |

| | | |
|---|---|---|
| కరా | = | చేతులు |
| అక్ష | = | కన్నులు |
| | | ఈ ఆరును |
| షట్కంజంబులో | = | ఆరు చక్రములా ? |
| మోము | = | ముఖము |
| జలజింబో | = | వేయిరేకుల పద్మమా ? |
| నిటలింబు | = | నుదురు |
| చంద్రకళయో | = | అమృతము స్రవించు చంద్రకళయా ? |
| సంగంబు | = | కలయిన్ |
| యోగంబు | = | యోగసిద్ధియా ? |
| గాసిరి | = | ఎంతో కష్టపడి |
| భువిన్ | = | లోకములో |
| | | జనులు |
| కాంతలన్ | = | స్త్రీలు |
| సేవింతురు | = | కొలుతురేమి ? |

**తాత్పర్యము :** శంకరా ! ప్రజలు స్త్రీ సాంగత్యము కొరకింత ప్రయాసపడుదురేల ? మల భూయిష్టమైన మర్మాంగము మూలాధార చక్రమా ? నూగారు కుండలియా ? పద్మములతో పోల్చబడు కాళ్ళు, చేతులు, కన్నులు షట్చక్రములా ? మొగము సహస్రార పద్మమా? నుదురు చంద్రకళయా ? అమృతము స్రవించుటకు సంయోగమే యోగసిద్ధియా ? ఎందుకే వెఱ్ఱితనము.

**సందర్భము :** మానవుని పుట్టుకకు కారణమైన ఏ అవయవమైతో ఉన్నదో, దానికోసం ఈ మానవులెందుకంతగా పరితపిస్తారు. అదేమైన ఈ శరీరంలో ముఖ్య అంగములలో నొకటి కాదు గదా అని ప్రశ్నించు సందర్భములోనిదీ పద్యము.

**50.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| రసముల్ | = | కావ్యమునందలి నవరసాలు |
| జలకంబుల్ | = | స్నానములుగాను |
| వాచాబంధములు | = | పదప్రయోగములు |
| ప్రసూనములు | = | పూవులుగాను |
| కలశబ్దధ్వనులు | = | మధురమైన శబ్దములందలి వ్యంగ్య ధ్వనులు |
| వాద్యముల్ | = | వేణు మృదంగాది వాద్యములుగాను |
| అలంకారంబు | = | శబ్దాలంకారములే |
| అంచితాంబరము | = | యేలైన వస్త్రముగాను |
| మెఱుంగులు | = | కవితా సౌందర్యములే |
| దీప్తుల్ | = | వెలిగెడి దీపములుగాను |
| మాధురీ మహిమ | = | కవిత్వమందలి మాధుర్యగుణమే |
| నైవేద్యము | = | నివేదనగానుజేసి |

| | | |
|---|---|---|
| భక్తిరంజలన్ | = | నాభక్తి ఒప్పునట్లుగ |
| నేర్చిన క్రియన్ | = | నేనేర్చిన విధముగా |
| దివ్యార్చనన్ | = | దివ్యమైన పూజను |
| కూర్చి | = | సమకూర్చి |
| | | నిన్ను |
| కొల్తున్ | = | సేవింతున్ |

**తాత్పర్యము :** శంకరా ! కావ్యమందలి రసములే స్నానముగాను పద్యము లేపూలుగాను, శబ్దముల వల్ల దోచెడు అర్థ ధ్వనులే భేరీ వాద్యములుగాను అలంకారములు వస్త్రములుగాను, కవితా సౌందర్యములే దీపములుగాను, మాధుర్య గుణమే నైవేద్యముగాను సమకూర్చి నాచేతనైనట్లు భక్తితో నిన్ను కవితార్చనము చేసి సేవించెదను.

**సందర్భము :** భగవదనుగ్రహం కోసం ఆదిత్యమూర్తిని దర్శించే విధానాలు అనేకం ఒక్కో భక్తుని అర్చనా విధానం ఒక్కో రకంగా ఉంటుంది. ధూర్జటి భగవంతుని సేవకు తానుపయోగించే పూజాద్రవ్యమేమిటో చెబుతున్న సందర్భములోనిదీ పద్యము.

**51.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| ఉపమ, ఉత్ప్రేక్ష | = | ఉపమ, ఉత్ప్రేక్ష మొ॥ అర్థాలంకారములతోను |
| ధ్వని, వ్యంగ్య | = | వాచ్యార్థముగాన్ మరొక అర్థము స్ఫురించు శబ్ద ప్రయోగముతోను |
| శబ్దాలంకార | = | శబ్ద ప్రయోగముతో నేర్పడు అలంకారముతోను గూడిన |
| విశేష భాషలకు | = | ఆలంకారికమై, అందమైన కావ్యభాషలకు |
| అలభ్యంబైన | = | అందని |
| నీరూపమున్ | = | నీ స్వరూపమును |
| ఏలీలల్ | = | ఏ విధముగా |
| నుతియింపవచ్చున్ | = | స్తుతింపగలము |
| చాలుంజాలున్ | = | చాలు చాలు |
| | | ఛీ |
| మాదృశకవుల్ | = | మావంటి కవులు |
| లజ్జింపరుగాక | = | సిగ్గుపడరుగాని |
| సత్యంబువర్ణించుచోన్ | = | సత్యమైన భగవత్స్వరూపమును వర్ణించుటకు |
| కవిత్వముల్, నిలుచునే | = | సరిపోవునా ? |

**తాత్పర్యము :** ఉపమా, ఉత్ప్రేక్ష మొదలగు అర్థాలంకారములతోను, ధ్వని, వ్యంగ్య, శబ్దాలంకారములతో గూడిన మనోహరమైన శైలిగల కావ్య భాషకు అందని నీరూపమునెట్లు స్తుతింపగలము ? నావంటి కవులు సిగ్గులేక యిట్లు పద్యాలలో స్తుతించుటకు సిద్ధపడుచున్నారు గాని, సత్య రూపమైన పరబ్రహ్మమును వర్ణించుటకు ఈ సామాన్య లౌకిక కవిత్వములకు శక్తియున్నదా ?

**సందర్భము :** ఏ భాషకు, ఏ భావానికి అందని నీ రూపం నాలాంటి సామాన్య కవుల కవిత్వానికి నిన్ను తెలుసుకొనే శక్తి యున్నదా ? అంటున్న సందర్భములో చెప్పిన పద్యము.

**52.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| పాపన్న | = | ఓ చిన్ని పాపడా |

| | | |
|---|---|---|
| పాలుంబువ్వయున్ | = | పాలలో గలిపిన యున్నమును |
| పెట్టెదన్ | = | పెట్టుదును |
| కుడువరా | = | తినుమురా |
| అన్న ! రా, లేలే లెమ్మన్నన్ | = | త్వరగా రమ్మని పిలిచినచో (ఆ పిల్లవాడు) |
| అరటిపండు కొనితే | = | అరటిపండుకొని తీసుకురా |
| లేకున్నన్ | = | అట్లుతేని యెడల |
| నేనొల్లనంటేన్ | = | నేనీయన్నము తిననంటే |
| తల్లిదండ్రులు, అపుడు, | = | ఆ విధముగానే తెచ్చి |
| అట్లే, తెచ్చి లాలింపరే | = | బుజ్జగించరా ? |
| వాత్సల్య లక్ష్మి | = | ప్రేమయనెడి సంపదతో గూడిన |
| లీలావచనంబులన్ | = | ఆదర వాక్యములతో |
| కుడుపరా | = | తినిపింపరా ? |

**తాత్పర్యము :** శంకరా ! ఓ చిన్నిపాపడా ! పాలును అన్నమును బెట్టెదము తినరా బాబూ ! యనగా వాడు, నాకు అరటిపండు తెచ్చి పెట్టినచో తిందునునను. అపుడు తల్లిదండ్రులు ఆ అరటిపండు కూడ తెచ్చి ఆ పాపనికి ఆదరవచనములతో ఆప్యాయతతో తినిపింపరా ? అనగా, నీవు నాకు తండ్రివి, నేను అజ్ఞానినైన పసిబాలుడను. నీవు నాకిచ్చిన ఇహలోక భోగములకు తృప్తిపడక, పరమున మోక్షము నిమ్మని పేచీపెట్టుచున్నాను గదా ! తండ్రివి నీవు వాత్సల్యముతో నాముద్దు చెల్లించి మోక్షపదమును నాకిచ్చి వేయరాదాయని భావము.

**సందర్భము :** పెట్టింది తినకుండా వేరేది కావాలని పిల్లవాడు తల్లిదండ్రులవద్ద పేచీకి దిగినట్లుగ ధూర్జటి ఆ భగవంతుణ్ణి తండ్రిగా భావించి మోక్షాన్ని ఇవ్వమని అడుగుతూ చెప్పిన సందర్భములోనిదీ పద్యము.

**53.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| నిమిషార్ధ | = | అరనిముసముండు |
| జీవనములందున్ | = | బ్రతుకులలో |
| ప్రీతి | = | ఇష్టము |
| పుట్టించి | = | కలిగించి |
| | | దానిలోనే |
| | | కలలంచున్ |
| శకునంబులంచు | = | మంచిచెడ్డ సూచనలనుచు |
| గ్రహయోగంబంచున్ | = | దుష్టగ్రహ సంపుటియని |
| సాముద్రికంబులటంచున్ | = | అరచేతి జోస్యములనుచు |
| తెవులంచున్ | = | రోగములనుచు |
| అరిష్టమనుచున్ | = | కీడనుచు |
| భూతంబులంచున్ | = | దయ్యములు పట్టుటయనుచు |
| విషాదులటంచున్ | = | విషము మొదలైన హానికర పదార్థములనుచు |

| | | |
|---|---|---|
| ప్రాణులకు | = | జీవులకు |
| | | ఎన్ని |
| సిలుగులు | = | కష్టములు |
| చేసితివయా | = | తెచ్చిపెట్టినావయ్యా |

**తాత్పర్యము :** శంకరా ! ఈ ప్రాణులవి అసలే అర్ధనిమేషముండు బ్రతుకులు. వానిలో కలలనియు, శకునాలనుచు, దుష్ట గ్రహకూటములనియు, అరచేతిలో జ్యోస్యములనియు, రోగాలనుచు, కీడులనుచు, భూతప్రేతాలనుచు, ఎన్ని కష్టాలు కలిగించి నావయా !

అల్ప జీవనములు మావి. అందులో ఇన్ని కష్టములెందుకు చొప్పించితివి ? మాకు సుఖపడు యోగ మీ బ్రతుకులు లేదు గనుక మోక్ష మిచ్చి దానిలోనైన మాకు సౌఖ్యమిమ్మని భావము.

**సందర్భము :** క్షణభంగురమైన ఈ జీవితం కష్టాలు, కడగండ్లమయం, ఈ జీవితంలో పొందలేని సౌఖ్యాన్ని మోక్షం ద్వారా కలిగించమని అడుగుతున్న సందర్భంలో చెప్పిన పద్యమిది.

**54.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| ఏ మనుజుడు | = | ఏ భక్తుడైన మనుజుడు |
| తలమీరన్ | = | శిరసు మీద |
| కుసుమ ప్రసాదమును | = | నీ నిర్మాల్యమైన పుష్ప ప్రసాదమును |
| అళికస్థానంబుపైన్ | = | నుదుటి మీద |
| భూతియున్ | = | నీ ప్రసాదమైన విభూతియు |
| గళసీమంబునన్ | = | మెడలో |
| దండ | = | రుద్రాక్షమాలికయు |
| నాసిక్తుదన్ | = | ముక్కుచివర |
| గంధ ప్రసారంబు | = | నీయభిషేకజల పరిమళమును |
| లోపలన్ | = | కడుపులో |
| నైవేద్యమున్ | = | నీకు నైవేద్యముగా పెట్టిన ప్రసాదాన్నమును |
| చేర్చున్ | = | చేర్చుకొని యుండునో |
| ఆ భక్తుండు | = | అట్టి భక్తుడు |
| నీకు ఎప్పుడున్ | = | నీ కెల్లప్పుడు |
| చెలికాడై | = | స్నేహితుడై |
| రేపుగిరిపైన్ | = | కైలాసము మీద విహరించును |

**తాత్పర్యము :** శంకరా ! ఏ భక్తుడు తన శిరస్సు మీద నీ నిర్మాల్యమైన పూలను, నుదటి మీద విభూతిని, మెడలో రుద్రాక్ష మాలికయు, ముక్కు చివర నీయభిషేక జల సుగంధమును, కడుపులో నీకు నివేదించిన అన్నమును బెట్టుకొని యుండునో అతడు నీకు ప్రాణ స్నేహితుడై వెండికొండపై ఎల్లప్పుడును నీతో విహరించుచుండునుగదా ! ఇవన్నియు ధరించుచున్న నాకు కూడ ఆ భాగ్యమును ప్రసాదింపుమని తాత్పర్యము.

**సందర్భము :** ఎటువంటి వేషధారణ కలిగిన భక్తుడంటె శివునికి ఇష్టమో చెప్పి అటువంటి వేషధారణే కలిగిన తనకు కూడ మోక్షాన్ని ప్రసాదించమని అడుగుతూ చెప్పిన సందర్భంలోనిదీ పద్యము.

**55.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| ఏవేళన్ | = | అన్ని వేళలయందు |
| భజింపన్ | = | అందరిని గౌరవించగా ! |
| | | నీకు |
| ఆలున్ | = | భార్యయైన పార్వతియు |
| మిత్రులున్ | = | కుబేరునివంటి స్నేహితులును |
| హితులున్ | = | విష్ణుమూర్తివంటి హితాభిలాషులు |
| ఇష్టార్థంబులు | = | కోరిన సంపదలు |
| ఈనేర్తురు | = | ఇచ్చెదరు |
| జాలిబడక | = | శ్రమపడక |
| ఆవిర్భూత | = | కలిగిన |
| మోదంబునన్ | = | సంతోషముతో |
| కాలంబెల్లన్ | = | కాలమంతయు |
| సుఖంబు | = | సుఖముగా గడచుచున్నది |
| ఇంక | = | ఇకమీదట |
| భక్తశ్రేణిన్ | = | భక్తులను |
| రక్షింపక | = | రక్షించే బాధ్యతను స్వీకరించక |
| శ్రీలు | = | సంపదలు |
| ఎవ్వారికిన్ | = | ఎవరికోసమని |
| కూడబెట్టెదవయా | = | దాచబెట్టెదవు |

**తాత్పర్యము :** ఈశ్వరా ! నీవు సర్వజ్ఞుడవు కనుక ఎవరికెప్పుడెట్టి మర్యాదలియ్యేనో గ్రహించి, వారికట్లు ఇచ్చెదవు. అట్లు చేయుటచే నీ భార్యయైన ఆదిపరాంబికయు, నీ కొడుకులైన గణపతి కుమారస్వాములును, నీ మిత్రులైన కుబేరాదులును, నీయాప్తులైన కేశవాదులును, నీకన్ని సౌకర్యములను సమకూర్చు చుందురు. వానినన్నటిని నీవు సుఖముగా ననుభవించుచు కూర్చుందువు. మరి నీభక్తుల మాటయేమి ? వారు నీవేదో యొరగబెట్టుదువని యెదురుచూచుచుందురు. అట్లు వారికి కూడా నియ్యకనీ సంపదలను ఎవ్వరికోసమని దాచబెట్టదలచినావో చెప్పుము.

**సందర్భము :** ధర్మమార్గంలో ధనార్జన అనేది మానవుని ధర్మం. ఆర్జించిన ధనాన్ని సత్కర్మల కోసం ఖర్చుపెట్టడం కూడా అంతే ధర్మం. ఈ సూత్రాన్నే ఆదిశంకరునికి కూడా ఆపాదించాడు ధూర్జటి. మంచితనంతో ఆర్జించిన సంపదను భక్తులకోసం దానం చెయ్యమని చెప్పే సందర్భంలోనిదీ పద్యం.

**56.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| సులభుల్ | = | తేలికగా మాటలకు జిక్కు వారును. |
| | | (కవిత్వమందలి యాసక్తితో సులభముగా పొందదగినవారు) |
| మూర్ఖులున్ | = | చెప్పినను గ్రహింపలేని మూర్ఖులును |
| ఉత్తమోత్తములు | = | చాల ఉత్తములు అయిన |
| రాజుల్ | = | వివిధ స్వభావములు గల రాజులు (ఉందురు) |

| | | |
|---|---|---|
| కల్గి | = | అట్టివారి ఆశ్రయము దొరికి కూడ |
| ఏ వేళన్ | = | ఎప్పుడైనను |
| నన్ను | | |
| అలతం బెట్టినన్ | = | వారు నన్ను బాధించినచో |
| నీ పదాబ్జములన్ | = | నీ పాదపద్మములను |
| పాయంజాలన్ | = | విడువలేను |
| నీవేమిచ్చినన్ | = | నీవు నాకేమి ప్రసాదించినను |
| శ్వేతాచలయేలుట | = | వెండి కొండను బాలించుట (శివపదవి) గాను |
| అంబునిధిలోన్ | = | సముద్రములో |
| కాపుండుట | = | కాపురముండుట (విష్ణు పదవి) గాను |
| అబ్జంబుపైన్ | = | తామరపవ్వు మీద |
| చెలువొప్పన్ | = | చక్కగా |
| సుఖియింపగాంచుట సుమీ | = | సుఖపడుట (బ్రహ్మపదవి) గాను భావింతును సుమా ! |

**తాత్పర్యము :** శంకరా ! రాజులలో భిన్న స్వభావములు గల వారుందురు. కొందరు మంచిమనసుతో ఆదరించువారు, కొందరు మూర్ఖులు, కొందరు చాల ఉత్తములు. వారి యాశ్రయము నాకు లభించినపుడు ఏకారణము చేతనైన వారు నన్ను చిన్న చూపు చూచినచో నీ పాదములాశ్రయించెదను. అప్పుడు నీవు దయతో నాకేమిచ్చినను దానిని ఈశ్వరపదవిగాను, విష్ణు పదవిగాను, బ్రహ్మ పదవిగాను భావించి సంతుష్టిని బొందెదను.

**సందర్భము :** విభిన్న ప్రవృత్తులు గల చక్రవర్తుల అనుగ్రహానికి పాత్రయైనా చివరకు తనకు శాశ్వతమైన చోటు పరమేశ్వరుని పాదపద్మములు చెంతనే యని కవి చెప్పుకొన్న సందర్భములోనిదీ పద్యము.

**57.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| తొలిన్ | = | ఆదిలో |
| తోబుట్లకై | = | సోదరులకోసమని |
| పోకుండ | = | ప్రాకులాడకుండ |
| ఏవారలతోడన్ | = | ఎవ్వరితోడను |
| పుట్టవు | = | కలిసి పుట్టలేదు (ఒంటరి వాడవు) |
| అందుచేతనే | | |
| కలదేతాద్రియు | = | వెండి కొండయు |
| అస్థిమాలికయు | = | ఎముకల దండయు |
| గోగంధర్వముల్ | = | ఎద్దును, లేడియు |
| పుస్కయున్ | = | చేతిలోని పుఱ్ఱెయు |
| పులితోలున్ | | |
| భసితంబు | = | భస్మమును |
| పాపతొడవుల్ | = | పాముల నగలును |
| కళాదుల్ | = | చంద్రకళ మొదలైనవి |

| | | |
|---|---|---|
| ఆ సిలువుల్ | = | ఆయన్నదమ్ములతోడి దొమ్ములాటలు |
| దూరము చేసికొంట | = | దూరము చేసి కొన్నావని |
| ఎఱిగియే | = | తెలిసికొనియే |
| కల్గెన్ | = | నిన్ను చేరినవి |
| మేలయ్యెన్ | = | దాని వలన వానికి మేలే జరిగినది |

**తాత్పర్యము :** ఈశ్వరా ! ఆదియందు నీవు తోబుట్టువు లెవ్వరును లేకుండ ఒంటరిగానే పుట్టినావు ! అన్నదమ్ములతో దాయ భాగముల కోసము పోరాటము లేదు. చాల ప్రశాంత జీవనము నీది. అందుకే వెండి కొండయు, ఎముకల దండయు, ఎద్దును, చేతిలోని లేడియు, పుఱ్ఱెయు, పులితోలును, భస్మమును, సర్పాభరణములును, తలపై చంద్రకళయు వచ్చి నిన్నాశ్రయించినవి. అనగా నీ సంపదలలో వాటాలు పెట్టనక్కరలేకుండ నీవి నీకేయున్నవి. కావున నిన్నాశ్రయించిన వారిని పోషించుటకు లోటుండదు. ఇన్నింటిని పోషించిన వాడవు, నీ పాదముల నాశ్రయించిన నన్ను కూడ పోషించలేవా ? అంతమాత్రమున నీకు లోటు కలుగునా యని తాత్పర్యము.

**సందర్భము :** శంకరా తోబుట్టువులు, దాయాదులు లేని ప్రశాంత జీవనం నీది' అందుకే ఎన్నో వస్తువులు నిన్ను ఆశ్రయించాయి. అట్లాగే నేను ఆశ్రయిస్తాను. నన్ను కూడ అనుగ్రహించి మోక్షాన్ని ప్రసాదించు అని ధూర్జటి మొరపెట్టుకొను సందర్భములోనిదీ పద్యం.

**58.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| శ్రుతులు | = | వేదములను |
| అభ్యాసము చేసి | = | అధ్యయనము చేసి |
| శాస్త్రగరిమల్ | = | శాస్త్రములందలి మహా విషయములను |
| శోధించి | = | పరిశీలించి |
| తత్వంబులన్ | = | వేదాంత విషయములను |
| మతిన్ | = | బుద్ధిలో |
| | | ఊహించి |
| శరీరము | = | ఈ బాహ్య శరీరము |
| అస్థిరము | = | శాశ్వతముకానిది |
| ఎన్నన్ | = | చూడగా |
| బ్రహ్మంబు | = | భగవత్తత్త్వమే |
| సత్యంబు | = | నిజము |
| కాంచితిమంచున్ | = | గ్రహించినామనుచు |
| సభలన్ | = | సభలలో |
| వృథావచనముల్ | = | వ్యర్థమైన మాటలు |
| చెప్పంగనేకాని | = | చెప్పుటయే యెఱుంగుదురుగాని |
| నిర్జిత చిత్త | = | మనసునుని గ్రహించినందు వలన గలుగు |
| స్థిర సౌఖ్యముల్ | = | శాశ్వత సౌఖ్యములు |
| తెలియరు | = | తెలుసుకొనలేకున్నారు |

**తాత్పర్యము :** ఈశ్వరా ! లోకములోనివారు, మేము వేదాలు చదివినాము, శాస్త్రాలు శోధించినాము, వేదాంత రహస్యములన్నియు పరిశీలించినాము. చివరికి బ్రహ్మయే సత్యము - శరీరము అనిత్యము అని గ్రహించినాము అని సభలలో చెప్పుదురు. కాని మనస్సును నిగ్రహించుటవలన అనగా వైరాగ్యముతో అన్నిటిని పరిత్యజించుటవలన సన్యాసియై, యోగియై పొందు శాశ్వత సౌఖ్యములను గూర్చి యాలోచించుట లేదు. మాటలు చెప్పుటయేగాని యెవ్వరు క్రియలో చూపలేకున్నారని భావము.

**సందర్భము :** వేదాధ్యయనం ద్వారా తెలుసుకొనే బ్రహ్మజ్ఞానం కంటే, వైరాగ్యం ద్వారా పొందే సౌఖ్యమే శాశ్వతమైనదనే విషయాన్ని ప్రజలు తెలుసుకొనలేకున్నారని ధూర్జటి భగవంతునితో మొరపెట్టుకొనే సందర్భములోనిది.

**59.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| నీవు | = | నీవే |
| గతియంచున్ | = | గతియని |
| భజించువారలు | = | సేవించువారు |
| అపవర్గంబున్ | = | మోక్షమును |
| పొందగాన్ | = | పొందుచుండగా |
| సంతతమున్ | = | ఎల్లప్పుడును |
| కూటకినై | = | తిండికొఱకై |
| చరింపనేల | = | పాట్లుపడుటెందుకు |
| ఆయుః | = | ఆయుర్దాయమే |
| అన్నం ప్రయచ్ఛతి | = | అన్నమును ఇచ్చును |
| అంచున్ | = | అనుచు |
| శ్రుతులు | = | వేదాలు |
| మొఱపెట్టగాన్ | = | ఘోషించు చుండగా ! |
| | | వినలేదా ? (ఒకవేళ విన్నను) |
| సంసారాంధకార | = | సంసారమను చీకటివల్ల |
| అభిదూషిత | = | పెద్దలు తిరస్కరించిన |
| దుర్మార్గులుగాన | = | చెడు మార్గమున నడిచినవారు గనుక |
| కానబడవో ? | = | ఆ వాక్యముల పరమార్థములు కనిపించుటలేదా ? |

**తాత్పర్యము :** ఈశ్వరా ! నీవేగతి యనుచు నిన్ను సేవించువారు మోక్షము నొందుచుండగా అజ్ఞానులైన కొందరు కూటికోసమని పాట్లుపడుచుందురేమి ? "ఆయుర్దాయమే అన్నము పెట్టు" నను వేదవాక్యమును వారు వినలేదా ? ఒకవేళ విన్నను పెద్దలు మెచ్చని సంసారమను చీకటిలోపడి చెడిపోవుటచేత ఆ వాక్యముల పరమార్థము బోధపడలేదా ?

**సందర్భము :** సంసారమనే చీకటిని పడకుండ ఆమహాదేవునే సమస్తమని నమ్మినవారికి మోక్షం కలుగుతుందని ధూర్జటి అంటున్న సందర్భములోనిదీ పద్యము.

**60.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| రతిరాజు | = | మన్మథుడు |
| ఉద్ధతిమీఱన్ | = | గర్వముతో |

| | | |
|---|---|---|
| ఒక్కమఱి | = | ఒకసారి |
| గోరాజాశ్వున్ | = | నంది వాహనముగల శివుని |
| ఒత్తబోన్ | = | తాకుటకు యత్నింపగా ! |
| అతండు | = | ఆ శివుడును |
| ఆదర్పకున్ | = | ఆ మన్మథుని |
| వేగనొత్తన్ | = | వేగముగా ఎదుర్కొనగా ! |
| గవయంబు | = | ఒక మృగమును |
| ఆబోతునున్ | = | మరొక ఆబోతును |
| తాకి | = | ఎదిరించి |
| ఉగ్రతన్ | = | తీవ్రముగా |
| పోరాడగనున్నన్ | = | పోరాడుటకు సిద్ధపడగా |
| ఆ+నడిమిన్ | = | ఆ మధ్యలో |
| లేగల్వోలెన్ | = | లేగ దూడలవలె |
| శోకానలస్థితిపాలై | = | దేవతలెల్లరు ఆర్తితో |
| మొఱపెట్టినన్ | = | మొరపెట్టుకోగా |
| మనుపవే | = | రక్షింపలేదా ? |

**తాత్పర్యము :** ఈశ్వరా ! మన్మథుడొకసారి నీమీద దాడి చేయుటకు సిద్ధపడగా నీవును వాని నెదురుకొంటివి. మీరిద్దరును కలబడు వృషభములవలె పోరాటమునకు సిద్ధపడుచుండగా దేవతలు తాము లేగలవలె నలిగిపోవుదమని భయపడి నిన్ను ప్రార్థింపగా వారిని రక్షించినావు గదా !

**సందర్భము :** ఎట్టి క్లిష్ట పరిస్థితుల్లోనూ తననాశ్రయించిన ఆర్తులను రక్షించే ఆ పరమేశ్వరుడి స్వభావాన్ని, సందర్భాన్ని ధూర్జటి జ్ఞాపకం చేస్తు చెప్పిన సందర్భములోనిదీ పద్యము.

**61.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| దేహికిన్ | = | శరీరమును ధరించిన మనుజునకు |
| అంతా సంశయమే | = | ప్రతి విషయమందును సందేహమే |
| శరీర ఘటనము | = | శరీరము యొక్క స్థితి |
| అంతా, విచారించె | = | ఆలోచించదగినదే |
| లోనంతా | = | హృదయములోనంతటను |
| దుఃఖపరంపరాన్వితమే | = | ఏ బంధములు చూచినను దుఃఖములు కలిగించునవే |
| మేనంతా | = | శరీరమంతయు |
| భయభ్రాతయే | = | ఎప్పుడే రోగమువచ్చునోయను భయముతో నడచునదే |
| అంతా | = | ఈ సంసారమంతయు |
| నాంత | = | అంతములేని |
| శరీరశోషణమే | = | శరీరపీడగలదియే |

| | | |
|---|---|---|
| దుర్వ్యాపారమే | = | మనము లోక వ్యవహారములో చేసెడివన్నియు చెడ్డపనులే (కర్మబంధములను కలిగించుటయే చెడ్డతనము) |
| నరుల్ | = | మనుజులు |
| చింతన్ | = | విచారమార్గముచే |
| నిన్నుతలంచి | = | ధ్యానించి |
| పొందరు | = | చేరుకొనరు |

**తాత్పర్యము :** ఈశ్వరా ! ఈ ప్రపంచములో పుట్టిన మానవునికి అంతా సందేహమే. శరీరము ఎంత కాలముండునో సంశయమే ! మనసులో దారపుత్రాది బంధనముల నేర్పరచుకొన్నందువలన అంతా దుఃఖమే ! శరీరమునకే రోగమెప్పుడు వచ్చునోయను భయమే. ఏ పని చేసినను అంతా శరీరరమును కృశింపజేయునదియే. మనుజుడు చేయుచున్న పనులన్నియు దుర్వ్యాపారములే (అనగా భగవంతుని చేరుటకై చేయు పనులు సద్వ్యాపారములు, అట్లుగాక బ్రతుకుదెరువునకై యితరులను బాధించు పనులన్నియు దుర్వ్యాపారములే) అంతేకాక ఇవి యన్నియును కర్మబంధములు కలిగించి పునర్జన్మములు కలిగించును గనుక కూడా దుర్వ్యాపారములే. వీనినన్నిటిని విడిచి నరులు నిన్నుచేరు ఉపాయము నాలోచింపరేమి ?

**సందర్భము :** క్షణ భంగురము, బుద్బుదప్రాయము అయిన ఈ శరీరము కర్మబంధాలతో తగుల్కొనేటట్లు చేసి పునర్జన్మకు కూడా కారణభూతమౌతున్నది. ఇటువంటి శరీరాన్ని విడిచి నిన్ను చేరు ఉపాయాన్ని ఆలోచించరేమని ధూర్జటి అడుగుతున్న సందర్భములోనిదీ పద్యము.

**61.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| రతిరాజద్వారా సౌఖ్యంబులన్ | = | రతిక్రీడలవలని సౌఖ్యములతో |
| సంతోషించితన్ | = | సంతోషపడినాను |
| బహురాజ ద్వారసౌఖ్యంబులన్ | = | చాలామంది రాజుల మందిరములలో వారిచ్చు గౌరముల వలని ఆనందములతో |
| శాంతం | = | ప్రశాంతిని పొందితిని చాలుఁజాలు. ఇంక |
| బ్రహ్మపద | = | మోక్షమనెడి |
| రాజద్వార సౌఖ్యమ్ము | = | రాజమందిర ద్వారములో గలుగు సౌఖ్యమును |
| చూపు | = | నాకు చూపింపుము |
| శాంతిన్ బొందెదనన్ | = | తాపత్రయములనుండి శాంతి బొందెదను |
| నీకరుణ చేన్ | = | నీదయచేత |
| నిశ్చింతన్ | = | ఏ చింతలును లేకపోవుటచే |
| శాంతుడనేదున్ | = | జన్మ పరంపరా దుఃఖముల నుండి విముక్తుడనై ప్రశాంత స్థితి నొందెదను. |

**తాత్పర్యము :** ఈశ్వరా ! ఇంతకాలమును స్త్రీలతో రతీ సౌఖ్యములనుభవించినాను. వానిపై విరక్తి గల్గినది. అవి ఇంకచాలు. రాజుల మందిరాలలో వారిచ్చు గౌరవ మర్యాదలు పొంది సంతోషించినాను. వానిమీద కూడ విసుగు పుట్టినది. అవికూడ ఇంక చాలు. ఈ పైన నీవు మోక్షపదమునకు దారి చూపుము. నీదయవలన మోక్షము నొంది ఈ ఆధ్యాత్మిక, ఆది భౌతిక, ఆది దైవికములనెడు తాపత్రయముల నుండి విముక్తడనై ప్రశాంతస్థితిలో నుండిపోయెదను.

**సందర్భము :** ఈశ్వరా ! జీవితంలో అన్ని సౌఖ్యాలు అనుభవించాను. అన్నిటి మీద విరక్తి కలిగింది; ఇకనన్ను మోక్ష మార్గం వైపుకు నడిపించు అంతేచాలునని వేడుకుంటూ చెబుతున్న సందర్భములోనిదీ పద్యము.

**62.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| అన్యులన్ | = | ఇతరులను |
| స్తోత్రము చేయనొల్లని | = | పొగడుట కిష్టపడని |
| వ్రతస్థుల్ పోలెన్ | = | వ్రతము పట్టినవారివలె |
| పుత్రీ పుత్ర కళత్ర | = | కూతుండ్రు, కొడుకులు, భార్యమున్నగు వారిని |
| రక్షణ కళాబుద్ధిన్ | = | రక్షించు నుద్దేశ్యముతో |
| తగిన వేసంబుతోన్ | = | ఆడంబరముగా వేషము వేసికొని |
| నృపాలాధమున్ | = | అధముడైన యొకరాజును |
| పాత్రంబంచున్ | = | యోగ్యుడనుచు |
| భజింపబోదురు | = | సేవించుటకు వెళ్ళుదురు |
| ఇదియున్ | = | ఇదేమైన |
| భావ్యంబె | = | సరియైన పనియా ? |
| మదిలోన్ | = | మనుసులో |
| అవ్వారి | = | అటువంటివారి |
| చారిత్రంబున్ | = | చరిత్రను |
| ఎన్నడున్ | = | ఎప్పుడును |
| మెచ్చన్ | = | మెచ్చుకొనుట |

**తాత్పర్యము :** ఈశ్వరా ! కొందరు, ఎప్పుడును ఎవ్వరిని పొగడనివారివలె మాటాడుచు, భార్యాపుత్రాదులను బోషించుకొనుటకై ఆడంబరముగా వేషము వేసికొని అధములైన రాజులను యోగ్యులనుచు స్తుతించుటకు సిద్ధపడుదురు. అటువంటివారిని నేను మెచ్చను.

**సందర్భము :** బ్రతుకుదెరువు కోసమని రాజులనాశ్రయించి వారిని పొగడటం అంటే తనకు సుతరామూ ఇష్టంలేదని ధూర్జటి చెప్పు సందర్భములోనిదీ పద్యము.

**63.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| నాదమను | = | ప్రణవనాదమనె |
| ఘంటారావమున్ | = | గంటధ్వనిని |
| బిందు | = | సహస్రారములోని బిందువునందలి (వేయిరేకుల పద్మము) |
| దీప | = | దీపరూపముగానున్న పరమేశ్వరి యొక్క |
| కళాశ్రేణి | = | కిరణములను గురించిన |
| వివేక సాధనములు | = | జ్ఞానమునకు కావలసిన పరికరములు |
| ఒప్పన్ | = | చక్కగా |
| పూని | = | సమకూర్చుకొని |
| అవలంకస్థితిన్ | = | చలించరీతిలో |
| నిల్పి | = | మనసులో స్థిరపరచుకొని |

| | | |
|---|---|---|
| ఆనందతారక | = | ఆనంద స్వరూపమై తరింపజేసెడు |
| దుర్గాటవిలో | = | కాలుపెట్టలేని యడవిలో |
| మనోమృగము | = | మనస్సనెడి మృగము యొక్క |
| గర్వస్ఫూర్తిన్ | = | నేనే వేగము గలదాననను గర్వమును |
| వారించు వారికిగా | = | నివారించెడు వారికి గదా |
| భావోగ్ర బాధలతికల్ | = | సంసార బంధములనెడు పెద్ద తీగలు |
| వీడున్ | = | వీడిపోవును |

**తాత్పర్యము :** ఈశ్వరా ! నాద బిందు కళారూపిణియై, శ్రీ చక్రాంతర వర్తినియైన భువనేశ్వరీదేవి యందు మనస్సును స్థిరముగా నిలిపి, ఆ దుర్గాదేవి దయవలన మనసు యొక్క వేగచాలన గర్వమును బోగొట్టినట్టి యోగులకు (శ్రీ విద్యోపాసకులకు) సంసార బంధములు తొలగిపోవును కదా !

**సందర్భము :** మనో వేగము, మనో గర్వము పోవాలంటే దుర్గాదేవి అనుగ్రహం తప్పనిసరి. ఆ అనుగ్రహాన్ని పొందే వైనాన్ని చెప్పే సందర్భములోనిదీ పద్యము.

**64.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| ఎట్లైన బొమ్మ | = | ఏదియెట్లైన గానిమ్ము |
| ఒక యర్థంబును | = | ఒక కోరికను |
| | | నిన్ను నేను |
| అడుగగా నూహింపను | = | అడుగుదమని యనుకోను |
| కవిత్వంబులు | = | నీవు చెప్పెడి కవిత్వాలు |
| నాకు జెందవని | = | నాకేమియు బనికిరావని |
| ఏమీయంటివా | = | ఏదో నిరసన భావములో మాటాడితివా (ఏమి చెప్పుదును) |
| నాదు జిహ్వకున్ | = | నానాలుకకు |
| నైసర్గిక కృత్యము | = | స్వభావ సిద్ధమైన పని |
| ఇంతియా సుమీ | = | ఇదే సుమా |
| ప్రార్థించుటేకాదు | = | ఇది నిన్ను ప్రార్థించుటకాదు |
| కోరికలన్ | = | మనసు నిండ కోరికలుంచుకొని |
| నిన్ను కానన్ | = | నిన్ను చూచుట |
| నాకు వశమా | = | నాశక్యమగునా (నాకు సాధ్యమౌతుందా) |

**తాత్పర్యము :** ఈశ్వరా ! ఏది ఏమైన గానిమ్ము. నిన్నొక్క కోరిక కూడ కోరవలెనని లేదు. మరి ఈ కవిత్వము లేమియు నాకు జెందవని యందువా ? ఇది నా నాలుకకు స్వభావము. ఇది కవిత్వము చెప్పకుండ ఉండలేదు. ఇదంతయూ నా కోరికలను దెలుపుట కనుకొంటివా ? కాదు కాదు : కోరికలున్నచో నిన్ను జూడగలుగుట నాకు శక్యమగునా ? అందుచేత ఈ పద్యములన్నియు కేవలము స్తోత్రములుగా భావింపుము.

**సందర్భము :** ఏ భక్తుడైనా స్వార్థ రహిత నిర్మల మనస్సుతో ఆ భగవంతుని ధ్యానించినప్పుడు మాత్రమే మోక్షప్రాప్తికి పాత్రుడౌతాడు. ఈ విషయాన్నే తనకూ ఆపాదించుకొని ధూర్జటి చెప్పే సందర్భములోనిదీ పద్యము.

**65.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| శుకముల్ | = | చిలుకలు |
| కింశుక పుష్పముల్ | = | మోదుగ పూలను |
| కని | = | చూచి |
| ఫలస్తోమంబటంచున్ | = | పండ్లు అనుకొని |
| సముత్సుకతన్ | = | ఉత్సాహముతో |
| చేరగబోవన్ | = | దగ్గరకుబోగా |
| | | అచ్చట |
| మహా దుఃఖంబు | = | నిరాశవలన గలిగెడు పెద్ద దుఃఖము |
| సిద్ధించున్ | = | కలుగును |
| కర్మ | = | వేద విహిత కర్మలను |
| కళా | = | కవిత్వాది కళలను గూర్చిన |
| భాషలకెల్లన్ | = | విషయములకు స్థానమైన |
| శాస్త్రంబుల్ | = | శాస్త్రములను |
| విలోకించు వారికిన్ | = | పరిశీలించుచు కాలక్షేపము చేయువారికి |
| నిత్యత్వమనీష | = | నిత్యస్వభావముగల పరమాత్ముని యందలి బుద్ధి |
| దూరమగున్ | = | నశించును |

**తాత్పర్యము :** ఈశ్వరా ! శుకములు మోదుగ పూలు జూచి పండ్లని భ్రాంతిపడి వెళ్ళగా వానికి నిరాశయే మిగులును. అట్లే శాస్త్రములు పరిశీలించి దైవతత్త్వమును గ్రహింపవలెనన్నచో వారికి దెలియునవి కర్మకాండలును. కవిత్వాది కళా విషయములును. అంతేగాని వారికి శాశ్వతుడవైన నీ స్వరూపమెట్లు బోధపడును.

**సందర్భము :** కేశల శాస్త్ర పాండిత్యంతో భగవత్తత్త్వము బోధపడదని చెబుతున్న సందర్భములోనిదీ పద్యము.

**66.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| ఒక్కొక్కరు | = | ఒక్కొక్క మానవుడు |
| ఒకరింజంపి | = | ఒకరిని నాశనము చేసి |
| | | తాము |
| పదస్థులై | = | పదవిలో నున్నవారై |
| బ్రతుకున్ | = | బ్రతుకుటకు |
| ఊహింతురేలకో | = | ఆలోచింతురెందుకో ? |
| తాము | = | వారు |
| ఎన్నడున్ | = | ఎప్పుడును |
| చావరో | = | చావకుండ బ్రతికియుందురా ? |
| తమకు, సంపదలు | = | ఐశ్వర్యములు |
| పోవా | = | నశింపకుండ శాశ్వతముగా నుండునా ? |

| | | |
|---|---|---|
| పుత్రమిత్ర కళత్రాదులతోడన్ | = | కొడుకులు, మిత్రులు, భార్యమున్నగువారితో గలిసి |
| నిత్య సుఖము | = | శాశ్వత సుఖమును |
| అందంగందురో | = | పొందగలరా ? |
| ఉన్నవారికిన్ | = | సంపదలున్నవారికి |
| ఎన్నడును | = | ఎప్పటికి |
| మృతి లేదా | = | చావు లేదా ? |

**తాత్పర్యము :** ఈశ్వరా ! కొందఱు ఒకరిని జంపి పదవిలో కొచ్చి బ్రతుకవలయునను కొందరు. తామెన్నడును చావకుండ నుందురా ? తమకు సంపదలు పోకుండ శాశ్వతముగ నిలుచునా ? రవిచంద్రాదులున్నంత కాలము తాము పుత్రులతో, మిత్రులతో, భార్యతో, శాశ్వతముగా సుఖములను భవించుచు భూమిపై నుండి పోవుదురా ? అట్లు సంపదలు కలిగియున్నచో వారికి చావుండదా? ఇవన్నియు ఆలోచింపరేమి ?

**సందర్భము :** ఈ లోకంలో ఏ మానవుడు శాశ్వతం కాదు, తానుకోరుకొనే సుఖాలు శాశ్వతం కాదు. సిరి సంపదలు మనిషి ఆయుష్షును పెంచలేవు. ఈ సత్యాన్ని తెలుసుకోమని అంటున్నాడు ధూర్జటి.

**67.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| నీ కారుణ్యము గల్గినట్టి నరుడు | = | నీ దయ గలిగిన మానవుడు |
| ఏ నీ చాలయమ్మున్ | = | ఏ నీచుడైన రాజు నాస్థానములోను |
| చొరడు | = | ప్రవేశింపడు |
| ఏ కార్పణ్యపు మాటలును | = | ఏ వంకర మాటలును |
| ఎవ్వారితోన్ | = | ఎవ్వరితోను |
| పలుకనరుగండు | = | పలుకడు |
| వేషముల్ | = | ఆడంబరమైన వేషములు |
| కైకోడు | = | వేసికొనడు |
| ఏమతముల్ | = | ఏమతధర్మములను |
| భజింపడు | = | పాటింపడు |
| ఇలన్ | = | భూమియందు |
| జీవన దశన్ | = | బ్రతుకు పోరాటములో |
| ఏ కష్ట ప్రకారంబులన్ | = | ఏ కష్ట స్థితులు గలిగినను |
| చీకాకై చెడిపోడు | = | క్రుంగిపోడు |

**తాత్పర్యము :** నీ దయను సంపాదించిన మానవుడు ఏ రాజాస్థానములకును పోడు, ఎవరితోను ఏ దుష్ట సంభాషణమును జేయడు. ఆడంబరముకోసమై వేషములు వేయడు. ఏ మతమును సేవింపడు. బ్రతుకుదెరువులో ఎన్ని కష్టములు వచ్చినను విచారముతో క్రుంగిపోడు.

**సందర్భము :** నీ అనుగ్రహానికి పాత్రమైన మానవుడు అన్నిటికి అతీతంగా స్థిత ప్రజ్ఞుడై ఉంటాడు. ఆ విషయాన్నే ఇక్కడు చెప్పున్నాడు ధూర్జటి.

**68.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| జ్ఞాతుల్ | = | అన్నదమ్ములు (ఒకే ఇంటి పేరుగలవారు) |
| ద్రోహులు | = | చాల ద్రోహబుద్ధిగలవారు |
| కపటేర్ష్యాది | = | వంచనతోను, అసూయమున్నగు గుణములతోను |
| వారు సేయుక్రియాదోషముల్ | = | వారు చేయు పనులవల్ల కలిగిన నష్టములను |
| సహింపరాదు | = | భరింపరాదు |
| మాతండ్రి ఆన | = | ఇది నిజము, మాతండ్రిపై ఒట్టు |
| ఇంచుక | = | కొంచెము |
| ఏన్ | = | నేను |
| ప్రతి కర్మంబు | = | ప్రతిక్రియ |
| చేయగాబోతే | = | చేయుటకు సిద్ధపడినచో, |
| దోషము | = | పాపము గల్గును |
| | | కాన |
| మాని | = | ప్రతిక్రియ చేయుట మాని |
| యతినైపో గోరినన్ | = | సన్యాసినై పోదమన్నను |
| సర్వదా | = | ఎల్లప్పుడును |
| చేతఃక్రోధము | = | మనసులోని కోపము |
| | | మానదు |
| ఎట్లానడతును | = | నేనెట్లు ప్రవర్తింపవలెనో చెప్పుము |

**తాత్పర్యము :** దాయాదులు ద్రోహులు, వారు అసూయతోను, మోసముతోను చేయు పనులవల్ల చాల కష్టములు గలుగుచున్నవి. అవి భరింపలేకున్నాను. ఇది నిజము, మా తండ్రిపై ఒట్టు, పోనివారిపై పగ తీర్చుకొనుటకేమైన జేయుదమన్నచో పాపము గలుగును. ఇవన్నియు వదలి సన్యాసినైపోదమన్నను మనసులో దాయాదులపై నాకున్న క్రోధము శాంతించుటలేదు. నన్ను ఏమి చేయమందువో చెప్పుము.

**సందర్భము :** సర్వ సంగపరిత్యాగిగా వేషం మార్చినంత మాత్రాన భగవదనుగ్రహం కలుగదు. మనసులో ఉండే అరిషడ్వర్గాలను జయించినపుడే మోక్ష ప్రాప్తి కలుగుతుంది, అయితే కామ క్రోదాధులను జయించే మార్గం చెప్పమని ధూర్జటి అడుగుతున్న సందర్భంలోనిది.

**69.** శ్రీకాళహస్తీశ్వరా

| | | |
|---|---|---|
| చదువుల్ నేర్చిన | = | బాగుగా చదువుకొన్న |
| పండితాధములు | = | నీచ బుద్ధిగల పండితులు |
| స్వేచ్ఛా భాషణ క్రీడలన్ | = | ఇష్టము వచ్చినట్లు మాటలాడు వినోదముతో |
| వదరన్ | = | ప్రేలుచుండగా |
| సంశయ | = | సందేహములనెడి |
| భీకరాటవులన్ | = | భయంకరారణ్యములలో |
| తోవల్ దప్పి | = | సరియైన దారుల నుండి తప్పిపోయి |

| | | |
|---|---|---|
| వర్తింపగాన్ | = | సంచరించుచుండగా |
| మదనక్రోధ కిరాతులు | = | కామక్రోధములనెడి కిరాతకులు |
| అందున్ | = | అక్కడ (మమ్ము) |
| కని | = | చూసి |
| భీమప్రౌఢిచేన్ | = | భీకరమైన బలముతో |
| తాకినన్ | = | దాడిచేయగా |
| చిత్తము | = | మా మనస్సు |
| చెదరున్ | = | పలు విధములుగా చెదరిపోవుచున్నది |
| చిత్తగింపదే | = | ఈ విషయమును గమనించి మమ్ము రక్షింపవా ? |

**తాత్పర్యము :** ధూర్తులైన పండితులు తమ మాటలగారడీలతో మోసపుచ్చు చుండగా, అవేమో మాకర్థముగాక సంశయారణ్యములలో తప్పుదారులలోబడి పోవుచున్నాము. అక్కడ కామక్రోధములనెడి కిరాతులు మమ్ముజూచి మామీదదాడి చేయగా మనసు చెదిరి మరింత మతిచెడి ప్రవర్తించుచున్నాము, మా యవస్థను గమనించి మమ్ము రక్షింపవా ?

**సందర్భము :** సర్వ సంగపరిత్యాగిగా వేషం మార్చినంత మాత్రాన భగవదనుగ్రహం కలుగదు. మనసులో ఉండే అరిషడ్వర్గాలను జయించినపుడే మోక్ష ప్రాప్తి కలుగుతుంది, అయితే కామ క్రోదాధులను జయించే మార్గం చెప్పమని ధూర్జటి అడుగుతున్న సందర్భంలోనిది.

## 6.2. సందర్భ సహిత వ్యాఖ్యలు :

1) **................................ చేయగల కార్యంబున్న సంసేవఁజే**
**సి నినుం గాంచెదగాక కాలముననో శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** కవి ధూర్జటి విరక్తుడై, వైరాగ్య భావంతో, ఆ పరమేశ్వరుని దర్శన భాగ్యమే పరమావధిగా భావించి, మోక్ష ప్రాప్తి కోసం పరితపిస్తూ ఆసర్వ వ్యాపకుణ్ణి మొరపెట్టుకొనే సందర్భంలోనిదీ వాక్యము.

| | | | |
|---|---|---|---|
| **అర్థము :** | చేయగల | = | చేయవలసిన |
| | కార్యంబున్నన్ | = | పనియేమైననున్నచో |
| | కాలమునన్ | = | జీవించియున్న కాలములోనే చేసి |
| | సంసేవన్ | = | ఆ సేవ వలన |
| | నినున్ | = | నిన్ను |
| | కాంచెదగాక | = | దర్శించెదను |

**భావము :** ఈ శరీరమును శాశ్వతముగా నుండునట్లు చేయుము. లేదా మరణానంతరము మరల జన్మింపకుండ చేయుము, ఈ రెండు పనులు నీకు సాధ్యముకానిచో ఆ సంగతి చెప్పుము. బ్రతికియున్నపుడే సకాలములో నేను చేయవలసిన పనులన్నిటిని చక్కబెట్టుకొని మరణానంతరము నిన్ను జూచుటకు వచ్చెదను అని భావము.

2) **................................ మత్తులై యేలచ**
**చ్చెదరో రాజులమంచు నక్కట కటా ! శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** అహంకారంతో, అజ్ఞానంతో విఱ్ఱవీగే కొంతమందిరాజుల్ని గురించి తూలనాడుతూ ధూర్జటి పలికిన సందర్భము లోనిదీ వాక్యము.

| **అర్థము :** | | | |
|---|---|---|---|
| | మత్తులై | = | మదము గలవారై |
| | రాజులమంచు | = | మేమును రాజులమేయని |
| | అక్కటకటా | = | అయ్యో |
| | ఏలచచ్చెదరని | = | ఎందుకు విఱ్ఱవీగెదరో కదా ! |

**భావము :** ఈశ్వరా ! ఒక రాజు పదునాలుగు మహాయుగాలు పరిపాలించాడు. (కృత,త్రేతా,ద్వాపర,కలియుగములు నాలుగును కలిసినది) మరొకరాజు ఉదయాద్రి నుండి అస్తగిరి వరకు నున్న భూమిని నిరాఘాటంగా పాలించాడు. ఇటువంటి మహారాజుల చరిత్రలను ఈ అల్పులైన రాజులు వినియుండలేదా ? తాము రాజులమేయని యేల గర్వపడుచుందురోనని భావము.

**3) .................................. నీ సేవచే**
**సి మహాపాతక వారి రాశిగడతున్ శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** మానవుడెంత దురాశపరుడో, క్రోధ, లాభ గుణాల తీవ్రత మానవుని యందే స్థాయిలో ఉంటుందని చెప్పి తాను మాత్రం ఏ సౌఖ్యాలు కోరుకోనని, నీ సేవకే అంకితమౌతానని ఆ పరమశివునికి మొఱపెట్టుకొనే సందర్భములోనిదీ వాక్యము.

| **అర్థము :** | శ్రీ కాళహస్తీశ్వరా | | |
|---|---|---|---|
| | నీసేవ చేసి | = | నీ సపర్యలకే అంకితమై |
| | మహాపాతక | = | మహా పాపములనెడి |
| | వారిరాశిన్ | = | సముద్రమును |
| | కడతున్ | = | దాటెదను |

**భావము :** శంకరా ! నా మోహము దేవతా స్త్రీలను రమించినను చావదు ! నా యాశ బ్రహ్మ పదవి వచ్చినను తీరదు ! నా జీవలక్షణమైన క్రోధము సర్వలోకములను మ్రింగినను శమింపదు. ఇంక ఈ లోకమందలి సౌఖ్యములు నేనాశింపను. నీసేవచేసి పాప సాగరములను దాటి నీ కడకు వచ్చెదనని భావము.

**4) .................................. ముమ్మాటికిం జూడగాఁ**
**జెనటుల్గానరు దీని భావ మిదివో శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** చనిపోయినవారికి పిండోదకాలు, దశదినకర్మలు చెయ్యటంలోని ఆంతరాయన్ని కొందరు మూఢులు తెలుసుకో లేరని వారిని నిందించే సందర్భములోనిదీ వాక్యము.

| | | | |
|---|---|---|---|
| **అర్థము :** | చెనటుల్ | = | బుద్ధి హీనులు |
| | ముమ్మాటికిని, దీని భావమును | | |
| | ఇదిలో | = | ఇది సుమాయని |
| | కానరు | = | గ్రహింపరు |

**భావము :** శంకరా ! చనిపోయినవారిని గూర్చి పదవనాడు రేవులో మునుంగుచు బంధువులు ఏడ్చుచుండుట, యముడా! మేము మాత్రము శాశ్వతముగా నుందుమా ? ఏదో ఒకనాడు నిజముగా వచ్చెదమని ప్రమాణములు చేయుటకే. ఈ భావము ఆ ఏడ్పులోనే యిమిడి వున్నది. వివేకహీనులు మాత్రము ఈ భావమును గ్రహింపలేరు.

**5) .................................. విశ్వప్రపంచంబుఁబా**
**సిన చిత్తంబున నుండజేయగదవే, శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** ఈ ప్రపంచాన్ని తృణప్రాయంగా భావించేటంత వైరాగ్యభావాన్ని కలిగించమని ఆ ఈశుని వేడుకుంటూ కవి అంటున్న మాటలు సందర్భములోనిదీ వాక్యము.

| | | | |
|---|---|---|---|
| **అర్థము :** | విశ్వప్రపంచంబున్ | = | ఈ సమస్త ప్రపంచమును |
| | పాసిన | = | విడిచిన |
| | చిత్తంబునన్ | = | మనసుతో |
| | ఉండజేయగదవే | = | ఉండునటు చేయవా ? |

**భావము :** ఈశ్వరా ! ఈతనువెంత వరకు భూమి మీద నుండునో అంతవఱకును రోగాది బాధలు లేకుండ రక్షించి, ఆపైన వైరాగ్యముతో ఈ ప్రపంచములోనే తృణప్రాయముగా భావించు స్థితిలో నుండునట్లు చేసినన్ను ఉద్ధరింపుము.

**6) .................................. గొల్తున్నినున్ భక్తిరం**
**జిల దివ్యార్చన కూర్చినేర్చిన క్రియన్ శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** ఆ పరమ శివునికి అనునిత్యము జరుగు ధూప దీప, నైవేద్యాది క్రతువును భక్తితో తన కవితార్చనము ద్వారా చేసి సేవించెదనని కవి చెప్పుకొను సందర్భములోనిదీ వాక్యము.

| | | | |
|---|---|---|---|
| **అర్థము :** | భక్తిరంజిలన్ | = | నా భక్తి వెలయునట్లుగా |
| | నేర్చిన క్రియన్ | = | నాకు చేతనైనట్లు |
| | దివ్యార్చనన్ | = | దివ్యమైన పూజను |
| | కూర్చి | = | సమకూర్చి |
| | నినున్ కొల్తున్ | = | సేవింతును |

**భావము :** శంకరా ! కావ్యమందలి రసములే స్నానముగాను, పద్యములే పూలుగాను, శబ్దముల వల్ల దోచెడు అర్ధ ధ్వనులే భేరీ వాద్యములుగాను, అలంకారములు వస్త్రములుగాను, కవితా సౌందర్యములే దీపములుగాను, మాధురగుణమే నైవేద్యముగాను సమకూర్చి నాచేతనైనట్లు భక్తితో నిన్ను సేవించెదనని కవి వాక్యములోని భావము.

**7) ................................ గవిత్వముల్ నిలుచునే సత్యంబు వర్ణించుచో !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** సత్యము, నిత్యము అయిన నీ పరమాత్మ స్వరూపమును వర్ణించుటకు సామాన్యమైన నాకవిత్వమునకు శక్తి లేదని భగవంతునితో వినమ్రంగా కవి చెప్పుకొను సందర్భములోనిది.

| | | | |
|---|---|---|---|
| **అర్థము :** | సత్యంబు వర్ణించుచున్ | = | సత్యమైన భగవత్స్వరూపమును వర్ణించుటకు |
| | కవిత్వముల్ నిలుచునే | = | సరిపోవునా ! |

**భావము :** ఉపమా, ఉత్ప్రేక్ష మొదలైన అర్థాలంకారములతోను, ధ్వని, వ్యంగ్య, శబ్దాలంకారములతో గూడిన మనోహరమైన శైలిగల కావ్య భాషకు అందని నీరూపమునెట్లు స్తుతింపగలము. నావంటి కవులు సిగ్గులేక యిట్లు పద్యాలలో స్తుతించుటకు సిద్ధ పడుచున్నారుగాని సత్య స్వరూపమైన పరబ్రహ్మను వర్ణించుటకు ఈ సామాన్య లౌకిక కవిత్వమునకు శక్తియున్నదా ? యని కవి భావము.

**8) ................................ నిమిషార్ధ జీవనములందున్ బ్రీతి పుట్టించియీ**
**సిలుగుల్ ప్రాణులకెన్ని చేసితివయా ? శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** బుద్బుద ప్రాయమైన జీవితం మీద ఎన్నో భ్రమలు రేకెత్తించి ఆపైన కష్టాలు, కడగండ్లపాలు జేస్తున్నా వెందుకని ఆ శంకరుణ్ణి కవి అడుగుతున్న సందర్భములోనిదీ వాక్యము.

| | | | |
|---|---|---|---|
| **అర్థము :** | నిమిషార్ధ | = | అరనిముసముండు |
| | జీవనములందున్ | = | బ్రతుకులలో |
| | ప్రీతి పుట్టించి | = | ఇష్టము కలిగించి |
| | ప్రాణులకు | = | జీవులకు |
| | ఎన్ని సిలుగులు | = | ఎన్ని కష్టములు |
| | చేసితివయా | = | తెచ్చిపెట్టినావయ్యా |

**భావము :** శంకరా ! ఈ ప్రాణులవి అసలే అర్ధ నిమేషముండు బ్రతుకులు, వానిలో కలలనియు, శకునాలనుచు, దుష్ట గ్రహకూటములనియు, అరచేతిలో జోస్యములనియు, రోగాలనుచు, కీడులనుచు, భూతప్రేతాలనుచు, ఎన్ని కష్టాలు కలిగించినవు. మాకు సుఖపడు యోగ మీబ్రతుకులో లేదుగనుక మోక్ష మిచ్చిదానిలోనైన మాకు సౌఖ్యమిమ్మని భావము.

**9) శ్రీ లెవ్వారికి, గూడబెట్టెదవయా ? శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** నువ్వు సమకూర్చుకొనే ఈ సౌకర్యాలు, ఐశ్వర్యాలు భక్తులకు కాదని ఎవరికోసము దాచబెట్టదలచావో చెప్పమని ధూర్జటి మహాకవి ఆ పరమశివుణ్ణి అడుగుతున్న సందర్భములోనిదీ వాక్యము.

**అర్థము :** శ్రీ కాళహస్తీశ్వరా !

| | | |
|---|---|---|
| శ్రీలు | = | ఆ సంపదలు |
| ఎవ్వారికిన్ | = | ఎవరి కోసమని |
| కూడబెట్టెదయవా | = | దాచిబెట్టెదవు |

**భావము :** నీ భార్యయైన ఆదిపరాంబికయు, నీ కొడుకులైన గణపతి, కుమారస్వాములను, నీమిత్రులైన కుబేరాదులును, నీయాప్తులైన కేశవాదులును నీకన్ని సౌకర్యములును, ఐశ్వర్యములును సమకూర్చుచుందురు. వానినన్నిటిని నీవు సుఖముగా ననుభవించుచు కూర్చుందువు. మరి నీ భక్తుల మాటయేమి ? వారికి గూడ నియ్యక నీ సంపదలను ఎవ్వరికోసమని దాచబెట్ట దలచినావో చెప్పమని భావము.

**10) ............................................................................ ని**
**ర్జిత చిత్తస్థిర సౌఖ్యముల్ దెలియరో శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** చదువు, అనుభవము, ఆచరణ ఈ మూడింటిలో ఆచరణ గొప్పది ధూర్జటి బాధంతా మానవులు తమ శాశ్వత సౌఖ్యం కోసం ఆచరణాత్మక పద్ధతిని అవలంభిచటంలేదని ఈ సందర్భంలో అన్నమాటలివి.

**అర్థము :** శ్రీ కాళహస్తీశ్వరా !

| | | |
|---|---|---|
| నిర్జిత చిత్త | = | మనసును నిగ్రహించినందువలన గలుగు |
| స్థిర సౌఖ్యముల్ | = | శాశ్వత సౌఖ్యములు |
| తెలియదు | = | తెలిసికొనలేకున్నారు |

**భావము :** ఈ లోకములోనివారు, మేము వేదాలు చదివినాము, శాస్త్రాలు బోధించినాము, వేదాంత రహస్యములన్నియు పరిశీలించినాము. చివరికి బ్రహ్మయే సత్యము - శరీరము అనిత్యము అని గ్రహించినాము అని సభలలో చెప్పుచుందురు, కాని మనస్సును నిగ్రహించుట వలన అనగా వైరాగ్యముతో అన్నిటిని పరిత్యజించుట వలన పొందు శాశ్వత సౌఖ్యములను గూర్చి యాలోచించుటలేదు. మాటలు చెప్పుటయేకాని యెవ్వరు క్రియలు చూపలేకున్నారని భావము.

**11) ............................ నడిమి వేగల్వోలె శోకానల**
**స్థితి పాలై మొఱవెట్టినన్ మనుపవే ?**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** ఒకానొక సందర్భములో సాక్షాత్తు దేవతల మొరను ఆలకించి రక్షించినావు. మరి ఎంత మొరపెట్టుకొనినా మా మొర ఆలకించవేమని ధూర్జటి ఆ శంకరుని అడుగుతున్న సందర్భములోనిదీ వాక్యము.

**అర్థము :** శ్రీ కాళహస్తీశ్వరా !

| | | |
|---|---|---|
| అన్నడిమిన్ | = | ఆ మధ్యలో |
| లేగల్వొలెన్ | = | లేగదూడలవలె |
| శోకానలస్థితిపాలై | = | దేవతలెల్లరు ఆర్తితో |
| మొఱవెట్టినన్ | = | మొరపెట్టుకోగా |
| మనుపవే | = | రక్షింపలేదా ? |

**భావము :** ఈశ్వరా ! మన్మథుడొకసారి నీమీద దాడిచేయుటకు సిద్ధపడగా నీవును వాని నెదురుకొంటివి. మీరిద్దరును గవయ వృషభవములవలె పోరాటమునకు సిద్ధపడుచుండగా దేవతలు తాము లేగల వలె నలిగి పోవుదుమని భయపడి నిన్ను ప్రార్థింపగా వారిని రక్షించినావు గదా !

**12) చింత న్నిన్ను దలంచి పొందరు నరుల్ శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** సందేహాస్పదము, సంశయాత్మకము అయిన ఈ శరీరంతో మానవుడు కర్మబంధాలలో తగుల్కొనుటయే కాని శాశ్వతంగా నిన్ను చేరుమార్గము నాలోచింపడని ధూర్జటి అంటున్న సందర్భములోనిదీ వాక్యము.

**అర్థము :** శ్రీ కాళహస్తీశ్వరా !

| | | |
|---|---|---|
| నరుల్ | = | మానవులు |
| చింతన్ | = | విచారణామార్గముచే |
| నిన్నుతలంచి | = | నిన్ను ధ్యానించి |
| పొందరు | = | చేరుకొనరు |

**భావము :** ఈశ్వరా ! ప్రపంచములో పుట్టిన మానవునికి అంతా సందేహమే. శరీరము ఎంతకాలముండునో సంశయమే ! మనసులో దారపుత్రాది బంధనముల నేర్పరచుకొన్నందువలన అంతా దుఃఖమే. శరీరమునకే రోగమెప్పుడు వచ్చునోయను భయమే. ఏ పనిచేసినను అంతా శరీరమును కృశింపజేయునదియే. మనజుడు చేయు పనులనన్నియు పునర్జన్మములు గలిగించును. కనుక వీటినన్నిటిని విడిచి నరులు నిన్ను చేరు ఉపాయమునాలోచింపరేయని భావము.

**13) ............................ శాస్త్రంబుల్ విలోకించువా**
**రికి నిత్యత్వ మనీష దూరమగునో శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** శాస్త్ర పాండిత్యంతో సత్యము, నిత్యము అయిన భగవంతుని దర్శించలేరని ధూర్జటి తన అభిప్రాయమును వ్యక్తము చేయుచున్న సందర్భములోని వాక్యమిది.

| | | | |
|---|---|---|---|
| **అర్థము :** | శాస్త్రంబుల్ | = | శాస్త్రములను |
| | విలోకించువారికిన్ | = | పరిశీలించుచు కాలక్షేపము చేయువారికి |
| | నిత్యత్వమనీష | = | నిత్య స్వభావముగల పరమాత్మునియిందలి |
| | దూరమగున్ | = | నశించును. |

**భావము :** ఈశ్వరా శుకములు మోదుగ పూలు జూచి పండ్లని భ్రాంతిపడి వెళ్ళగా వానికి నిరాశయే మిగులును. అట్లే శాస్త్రములు పరిశీలించి దైవతత్త్వమును గ్రహింపవలెనన్నచో వారికి దెలియునవి కర్మకాండలును, కవిత్వాది కళా విషయములును. అంతేకాని వారికి శాశ్వతుడవైన నీ స్వరూపమెట్లు బోధపడును అని భావము.

**14) ............................ యున్నవా**
**రికి లేదో మృతి యెన్నడుం గటకటా శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** ఎంతటి సువిశాలమైన సామ్రాజ్యాన్ని స్థాపించి పరిపాలించినా, ఎన్ని భోగాలు అనుభవించినా, మానవుడు మృత్యువుని తప్పించుకొనలేడని కవి చెప్పే సందర్భములోనిదీ వాక్యము.

**అర్థము :** శ్రీ కాళహస్తీశ్వరా !

| | | |
|---|---|---|
| ఉన్నవారికిన్ | = | సంపదులున్నవారికి |
| ఎన్నడున్ | = | ఎప్పటికి |
| మృతిలేదా | = | చావులేదా ? |

**భావము :** ఈశ్వరా ! కొందరు ఒకరిని జంపి పదవిలోనికి వచ్చి బ్రతుకవలయుననుకొందరు. తామెన్నడు చావకుండా నుందురా ? తమకు సంపదలు పోకుండ శాశ్వతముగా నిలుచునా ? రవిచంద్రాదులున్నంత కాలము తాము పుత్రులతో, మిత్రులతో, భార్యలతో శాశ్వతముగా సుఖములనుభవించుచు భూమిపైన నుండి పోవుదురా ? అట్లు సంపదలు గలిగియున్నచో వారికి చావుండదా? ఇవన్నియు ఆలోచింపరేమని కవి మాటలలోని అంతరార్థము.

**15) .............................. సర్వదా**
**చేతః క్రోధము మానదెట్లునడతున్ ? శ్రీకాళహస్తీశ్వరా !**

**కవి, కావ్య పరిచయము :** పై వాక్యము అష్టదిగ్గజ కవులలో నొకడిగా కీర్తింపబడిన ధూర్జటి మహాకవి విరచితమైన శ్రీకాళహస్తీశ్వర శతకము నందలిది.

**సందర్భము :** దాయాదుల మధ్య వైషమ్యాలు ముదిరితే ఎంత తీవ్ర పరిణామాలు చోటుచేసుకొనునో, వాస్తవ దృక్పథంతో కవి ధూర్జటి చెప్పు సందర్భములోనిదీ వాక్యము.

**అర్థము :** శ్రీ కాళహస్తీశ్వరా !

| | | |
|---|---|---|
| సర్వదా | = | ఎల్లప్పుడును |
| చేతః క్రోధము | = | మనసులోని కోపము మానదు |
| ఎట్లునడతున్ | = | నేనెట్లు ప్రవర్తించవలెనో చెప్పుము |

**భావము :** దాయాదులు, ద్రోహులు, వారు అసూయతోను, మోసముతోను చేయు పనులవల్ల చాలా కష్టములు కలుగుచున్నవి. అవి భరింపలేకున్నాను. ఇది నిజము. మా తండ్రిపై ఒట్టు. పోనీ వారిపై పగ తీర్చుకొనుటకేమైన జేయుదమన్నచో పాపము గలుగును. ఇవన్నియు వదలి సన్యాసినైపోదమన్నను మనసులో దాయాదులపై నాకున్న క్రోధము శాంతించుటలేదు. నన్ను ఏమి చేయమందువో చెప్పుము.

**ముగింపు :** ధూర్జటి తనకు మోక్షమివ్వమని పరమేశ్వరుని ప్రార్థిస్తూ లోకంలో ఉన్న వివిధ రకాల మనః ప్రవృత్తులు గల వ్యక్తుల గురించి వివరించినప తీరును తెలుసుకున్నాం.

## ఉపయుక్త గ్రంథాలు :

1. మహాకవి ధూర్జటి కవిత్వము - వ్యక్తిత్వము : డా॥ పొన్నెకంటి హనుమంతరావు
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా. శాస్త్రి
3. తెలుగు కవిచంద్రులు చేసిన వీనుల విందు - కర్రి నాగార్జున శ్రీ

**పి. ఆనందయ్య**
లెక్చరర్, తెలుగుశాఖ
వి.యస్.ఆర్. & ఎన్.వి.ఆర్. కళాశాల,
తెనాలి.

**పాఠం : 7**

# శ్రీకాళహస్తీశ్వర శతకము

(71-108 పద్యాలు)

**-ధూర్జటి**

**శీర్షికలు :**

7.0 లక్ష్యం

7.1 కఠిన పదాలకు అర్థ తాత్పర్యాలు, సమగ్ర వ్యాఖ్యలు

7.2 సందర్భ సహిత వ్యాఖ్యలు

## 7.0 లక్ష్యం :

ఈ పాఠ్యంలో 71 పద్యం నుంచి 108 పద్యం వరకు కఠిన పదాలకు అర్థాలు, ముఖ్యమైన పద్యాలకు సమగ్ర వ్యాఖ్యలు, సందర్భ సహిత వ్యాఖ్యలు మీరు చదవగలరు.

## 7.1 కఠిన పదాలకు అర్థ తాత్పర్యాలు, సమగ్ర వ్యాఖ్యలు :

**71.ప రోసిందేఁటిది రోతలేఁటిది....**

| | | |
|---|---|---|
| రోసిందేమిటి | = | అసహ్యపడితిని అనుటేగాని, |
| మనోరోగస్థుడై | = | మానసిక రోగం కలిగిన |
| దేహి | = | ప్రాణి (శరీరమును ధరించినవాడు) |
| రోతలేటిది | = | ఏమి అసహ్యించుకొనినట్లు? |
| మద+ఆపూతముల్ | = | గర్వము అను లేపనముతో (మై పూత) కూడినవి. |
| ఈ దేహముల్ | = | ఈ శరీరములు |
| సదా | = | ఎల్లప్పుడు |
| మూఢత్వమే కాని | = | అజ్ఞానమేతప్ప |
| మూసింది + ఏటిది | = | దేనిని విడిచినట్లు? |
| మూతలు + ఏటివి | = | దాపరికము లేవి? |
| వృధా | = | అన్నియు వ్యర్థములైనవి తప్ప. |

**తాత్పర్యం :**

శ్రీకాళహస్తీశ్వరా! మానవుడు, తాను ఏహ్య పడితిననునేగానీ అది బాహ్యమే తప్ప, మనసున మాత్రము కాదు. బూది పూసినా నను నేగానీ అంతకుమించి శరీరము గర్వమను పూతచే నిండినది. దుర్గుణములెన్నింటినో మూసితిననునే గానీ, ప్రతి విషయమందు మూఢత్వమే కనపడును. ఏదో చేసితిననునే గానీ వృధా పనులు తప్ప నిన్ను సేవించుటవంటి సత్కార్యములు చేయనేలేదు.

| | | |
|---|---|---|
| **72.ప** అభవున్ | = | పుట్టుకే లేని |
| కాంచీనాధున్ | = | కంచిలోని ఏకామ్రనాధుని |
| నాశీలంబు | = | నా ప్రవర్తన, నా నడవడిక |
| అణువైన | = | అణువంత అయిననూ, (అత్యల్పమైననూ) |

| | | |
|---|---|---|
| మేరువు+అనుచున్ | = | మేరు పర్వతమంత గొప్పగా భావించి |
| నీకృపాశ్రీ | = | నీ దయ అనెడు లక్ష్మి యొక్క |
| శృంగార విలాసహాసములచే | = | మనోహరమైన విలాసవంతమైన చిఱునవ్వుతో |
| రక్షింపవే | = | రక్షింపుము |

**తాత్పర్యం :**

ఈశ్వరా! నేను శ్రీశైల మల్లికార్జునుని సేవించితినా? అభవుడైన కంచిలోని ఏకామ్రేశ్వరుని పూజింతినా? కాశీ విశ్వేశ్వరుని ప్రార్థించితినా? మహాకాళేశ్వరుని కొలుచుచుంటినా? (లేదు). నా శీలము అణువంత స్వల్పమైననూ, దానినే మేరువంతగా భావించి, నీ దయాసంపదతోనూ, విలాసవంతమైన మందహాసముతోనూ, నన్ను రక్షింపుము.

| | | | |
|---|---|---|---|
| **73.ప** | అయవారై | = | అధ్యాపకులై |
| | తమ | = | తమయొక్క |
| | పాద + అంభోజతీర్థంబులన్ | = | పాదపద్మములను కడిగిన నీటిని |
| | సేవకుని | = | శిష్యునియొక్క |
| | అర్థప్రాణ దేహ+ఆదులు+అన్నియు | = | ధనము, ప్రాణము, శరీరము మొదలైనవన్నిము. |
| | నా సొమ్ము + అనవచ్చు | = | మాకు సంబంధించిన ఆస్తి అని చెప్పవచ్చు. (మాసొంతమని పలుకవచ్చు) |
| | సిరులన్ + నిందించి | = | భౌతికపరమైన సంపదలు వదలి |
| | నిష్క్రియతన్ | = | కర్మలను పరిత్యజించి |
| | ఆత్మన్ | = | మనస్సులో |
| | కానగరాదు | = | చూడజాలరుకదా! |

**తాత్పర్యం :**

పరమేశ్వరా! ఎంతటి పండితులైననూ శిష్యులకు ఉపదేశము చేసి గురువులై చరియింపవచ్చు అను నమ్మిన వారిచే పాదతీర్థములు త్రావించి, శిష్యుల యొక్క అర్థప్రాణదేహాదులన్నింటినీ తమ సొమ్ముగా భావించి ఏమైనా చేయవచ్చు. కానీ, ఇహలోకసౌఖ్యాలను రోసి, కర్మ పరిత్యాగము చేసి, నిన్ను ఆత్మలో చూడలేరుగదా!

74.ప మాయాజాండ కరండ కోటి బోడిగా మర్దించిరో విక్రమా
జేయుంగాయజు చంపిరో, కపటలక్ష్మీ మోహములన్ బాసిరో
ఆయుర్దాయ భుజంగ మృత్యువు ననాయాసంబున్ గెల్చిరో
శ్రేయోదాయకులౌదురెట్టు లితరుల్ శ్రీకాళహస్తీశ్వరా!

**కవి పరిచయం :**

ధూర్జటి మహాకవి 16వ శతాబ్దానికి చెందినవాడు శివభక్తుడు. శ్రీకాళహస్తీశ్వర మహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం. అనే రెండు ఉత్కృష్ట గ్రంథాలను రచించాడు. ఇతడు వాఙ్మనః కర్మలతో ఈశ్వరునే ధ్యానించేవాడు. శతక సాహిత్యంలో అత్యుత్తమమైనది శ్రీకాళహస్తీశ్వర శతకం. మొదట ఇతడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ఒకడుగా ఉన్నట్లు తోచును. కానీ, శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఎక్కడా కృష్ణదేవరాయల పేరు కన్పించదు. పైగా రాజనింద కనపడుతుంది. ఈ శతకంలో కూడా కవి ధూర్జటి పేరు ఎక్కడా ప్రస్తావించబడలేదు. క్రీ.శ.1740లో కస్తూరి రంగకవి శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని ధూర్జటి రచించినట్లుగా ప్రతిపాదించాడు. అంతేగాక శ్రీకాళహస్తీశ్వరమహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం ఈ రెంటిలోని రచనా సంవిధానం, శైలి పారమ్యం ఒకే విధముగా ఉంటాయి. ఈ శతకంలో ప్రధానంగా, రాజు తిరస్కారం భక్తి వైరాగ్య భావనలు కవి హృదయపు లోతుల నుండి ఆవిష్కరించబడ్డాయి.

**సందర్భం :**

ఇతర దేవతలెవ్వరూ ఈశ్వరునితో సాటిరారని తన అపార వీరభక్తిభావాన్ని ఈ పద్యంలో ధూర్జటి ప్రకటించాడు.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| శ్రీకాళహస్తీశ్వరా! | = | శ్రీకాళహస్తీశ్వరా! |
| ఇతరుల్ | = | నీవలె ఇతరులెవ్వరూ |
| మాయ + అజాండ | = | మాయతో నిండి బ్రహ్మాండమండలి |
| కరండకోటిన్ | = | గోళముల (గ్రహముల) సమూహమును |
| పొడిగా | = | నుగ్గు నుగ్గుగా |
| మర్దించిరో! | = | మర్దించినారా? |
| విక్రమ + అజేయున్ | = | పరాక్రమముచే జయింపలేని |
| కాయజున్ | = | మన్మధుని |
| చంపిరో | = | సంహరించారా? |
| కపట లక్ష్మీ మోహములన్ | = | కపటమైన ఐశ్వర్య భ్రాంతిని |
| పాసిరో | = | వదలినారా? |
| ఆయుర్థాయ | = | ఆయువు తీరినంత |
| భుజంగమృత్యువు | = | విషపు పాము వంటి మృత్యువును |
| అనాయసంబునన్ | = | శ్రమలేకుండా |
| గెల్చిరో | = | జయించినారా! (కావున ఇతరులెవ్వరూ) |
| ఎట్టి | = | ఏ విధముగా |
| శ్రేయోదాయకులు+ఔదురు | = | మేలు కలిగించు వారగుదురు? (కారు, అని అర్థము) |

**తాత్పర్యం :**

శ్రీకాళహస్తీశ్వరా! మాకు నీకంటే మేలు చేయువారెవ్వరూ లేరు. మాయతో నిండిన బ్రహ్మాండ గోళమును బద్దలు చేయగల వారెవ్వరు! నీవలె మన్మధుని జయము కావించిన వారెవ్వరు! ఎవ్వరూ సంపద మీది మోహమును వదలరు. అనాయసముతో మృత్యువును జయించలేరు. అందుకని, నీవే సర్వశుభములను కలిగించగలవు.

**సంధులు :**

| | | |
|---|---|---|
| మాయ + అజాండ | = | మాయాజాండ (సవర్ణ దీర్ఘ సంధి) |
| విక్రమ + అజేయున్ | = | విక్రమాజేయున్ (సవర్ణ దీర్ఘ సంధి) |
| ఎట్టులు + ఇతరుల్ | = | ఎట్టులితరుల్ (ఉకార సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| కరండకోటి | = | కరండముల యొక్క కోటి (షష్ఠీ తత్పురుష సమాసము) |
| విక్రమాజేయుడు | = | విక్రమముచేత అజేయుడు (తృతీయ తత్పురుష సమాసము) |
| భుజంగ మృత్యువు | = | భుజంగము వంటి మృత్యువు (ఉపమాన పూర్వపద కర్మధారయ సమాసము) |

**విశేషాంశాలు :**

ఈశ్వరుడు లయకారకుడు. సంసార భ్రాంతి లేనివాడు. అభుడు. ఇటువంటి భగవంతుని గొప్పగుణములను, ధూర్జటి చక్కగా ఈ పద్యంలో వర్ణించాడు. ఇతరులెవ్వరూ నీతో సాటి రావనుట, అతనికి గల భక్తి తీవ్రతను సూచించుచున్నది.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| మాయాజాం | డకరం | డకోటి | బొడిగా | మర్దించి | రోవిక్ర | మా |

ఇందు 'మ, స, జ, స, త, త, గ' అను గణములున్నవి గావున ఇది శార్దూలం 1-13 యతి స్థానం. ప్రాస నియమం కలదు.

75.ప. చవిగాంజూడ వినంగ, మూర్కొన తనూసంఘర్షణాస్వాద మొం
ద వినిర్మించెదవేల జంతువుల, చేతఃక్రీడలే పాతక
వ్యవహారంబులు సేయ, నేమిటికి మాయ విద్యచే బొద్దుపు
చ్చి, వినోదింపగా! దీననేమిఫలమో! శ్రీకాళహస్తీశ్వరా!

**కవి పరిచయం :**

ధూర్జటి మహాకవి 16వ శతాబ్దానికి చెందినవాడు శివభక్తుడు. శ్రీకాళహస్తీశ్వర మహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం. అనే రెండు ఉత్కృష్ట గ్రంథాలను రచించాడు. ఇతడు వాఙ్మనః కర్మలతో ఈశ్వరునే ధ్యానించేవాడు. శతక సాహిత్యంలో అత్యుత్తమమైనది శ్రీకాళహస్తీశ్వర శతకం. మొదట ఇతడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ఒకడుగా ఉన్నట్లు తోచును. కానీ, శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఎక్కడా కృష్ణదేవరాయల పేరు కన్పించదు. పైగా రాజనింద కనపడుతుంది. ఈ శతకంలో కూడా కవి ధూర్జటి పేరు ఎక్కడా ప్రస్తావించబడలేదు. క్రీ.శ.1740లో కస్తూరి రంగకవి శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని ధూర్జటి రచించినట్లుగా ప్రతిపాదించాడు. అంతేగాక శ్రీకాళహస్తీశ్వరమహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం ఈ రెంటిలోని రచనా సంవిధానం, శైలి పారమ్యం ఒకే విధముగా ఉంటాయి. ఈ శతకంలో ప్రధానంగా, రాజు తిరస్కారం భక్తి వైరాగ్య భావనలు కవి హృదయపు లోతుల నుండి ఆవిష్కరించబడ్డాయి.

**సందర్భం :**

ప్రాణులకు కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు ప్రసాదించి, వాటినే పాపహేతువులుగా ఎందుకు చేస్తున్నావని, నీకిది ఒక వినోద క్రీడయని, ధూర్జటి భగవంతుని ప్రశ్నించే సందర్భములోనిది.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| శ్రీకాళహస్తీశ్వరా! | = | శ్రీకాళహస్తీశ్వరా |
| చవిగాన్ | = | రుచుల కొరకు నాలుక |
| చూడ | = | చూచుటకు కన్ను |
| వినంగ | = | వినుటకు చెవులు |
| మూర్కొన | = | వాసన చూచుటకు ముక్కు |
| తనూ సంఘర్షణ | = | తనువుల కలయిక వలన |
| ఆస్వాదము + ఒంద | = | సంతోషించుటకు (చర్మమును) |
| జంతువుల | = | ప్రాణులను |

| | | |
|---|---|---|
| వినిర్మించెదవు + ఏల? | = | సృష్టించుట ఎందులకు? |
| చేతః క్రీడలే | = | పై మనో వికారముకు |
| పాతక వ్యవహారంబులు | = | పాపపు పనులుగా |
| సేయన్ + ఏమిటికి | = | చేయుట ఎందుకు? |
| మాయావిద్యచే | = | నీ మాయ అనెడి విద్యతో |
| ప్రొద్దుపుచ్చి | = | మానవుల కాలము గడిపి (ఆయువు తీర్చి) |
| వినోదింపగన్ | = | వినోదించుట వలన |
| ఏమి ఫలమో! | = | నీకేమి ఫలము లభించునోగదా! |

**తాత్పర్యం :**

ఈశ్వరా! రుచి, చూపు, వినికిడి, వాసన స్పర్శల నిమిత్తమై నీవే ఈ శరీరమునిచ్చి, తద్వారా మనస్సు పొందు వికారములే పాపకారణములుగా చేసి, నీమాయా విద్యచే కాలము గడుపుచున్నావు. ఇట్లు చేయుట వలన నీకేమి ఫలమోకదా!

**సంధులు :**

| | | |
|---|---|---|
| సంఘర్షణ + ఆస్వాదము | = | సంఘర్షణాస్వాదము (సవర్ణదీర్ఘ సంధి) |
| వినిర్మించెదవు + ఏల | = | వినిర్మించెదవేల (ఉకార సంధి) |
| వ్యవహారంబులు + చేయ | = | వ్యవహారంబులుసేయ (గసడదవాదేశ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| తనూసంఘర్షణ | = | తనువు యొక్క సంఘర్షణ (షష్ఠీ తత్పురుష సమాసము) |
| చేతః్క్రీడలు | = | చేతము యొక్క క్రీడలు (షష్ఠీతత్పురుష సమాసము) |
| పాతకవ్యహారములు | = | పాతకమైన వ్యవహారములు (విశేషణ పూర్వపద కర్మధారయము) |
| మాయావిద్య | = | మాయ అనెడి విద్య (రూపక సమాసము) |

**విశేషాంశాలు :**

భక్తుడు మానసిక సంఘర్షణకు లోనైనపుడు, తాను నమ్మి సేవించే భగంతుని అనేక రకాలుగా ప్రశ్నిస్తాడు. ప్రస్తుతం కవి ధూర్జటి పరిస్థితి కూడ అదే! ధూర్జటి యవ్వనములో ఉన్నప్పుడు భోగలాలసుడు. మానసిక పరిణితి పొంది, శివభక్తుడై, గతించిన జీవితమును, ఇతర ప్రాణుల జీన విధానాలను పరిశీలించి, నీమాయవిద్య మాపై ఎందుకు ప్రయోగిస్తున్నావని ప్రశ్నిస్తున్నాడు.

**ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| చవిగా | జూడవి | నంగమూ | ర్కొనత | నూసంఘ | ర్షణాస్వా | దమొం |

ఇందు 'స, భ, ర, న, మ, య, వ, - అను గణములున్నవి గాబట్టి ఇది మత్తేభ పద్యపాదము. 1-14 యతి స్థానము. ప్రాస నియమము కలదు.

| | | |
|---|---|---|
| **76.ప** వెనుకన్ + చేసిన | = | ఇంతకుముందు చేసిన |
| ఘోర దుర్దశల్ | = | భయంకరమైన చెడ్డపనులు |
| రాత + అయ్యెడున్ | = | అసహ్యము కలుగుచున్నది. |
| దుర్మరణముల్ | = | అకాల మృత్యువును (భయంకరమైన చావును) |

| | | |
|---|---|---|
| వీక్షింప | = | చూడగా |
| భీతి + అయ్యెడున్ | = | భయము కలుగుచున్నది. |
| నా విధుల్ + తలచియున్ | = | నే చేయుచున్న పనులను |
| కాలమునకున్ | = | ఈ నాటి కాలమునకు |
| చెనకున్ + చీకటినాయె | = | వ్యాప్తి చెందు అంధకారమువలెనున్నది. |

**తాత్పర్యం :**

ఈశ్వరా! నేను గతమున చేసిన పాపములకు అసహ్యము, వర్తమాన కృత్యములకు భయముకలుగుచున్నది. కొంచెము ముందు వెనుకగా వచ్చు మృత్యువును తలంచగా భీతి కలుగుచున్నది. కాలము మీదిమీదికి వచ్చు చీకటిలాగా ఉన్నది. నీవే రక్షింపుము.

77.మ. పరిశీలించితి మంత్ర తంత్రములు చెప్పన్వింటి సాంఖ్యాది యో
గ రహస్యంబులు, వేద శాస్త్రములువక్కాణించితిన్, శంకవో
దరయం గుమ్మడికాయలోను యవగింజంతైన నమ్మించి, సు
స్థిర విజ్ఞానము త్రోవఁ జెప్పగదవే శ్రీ కాళహస్తీశ్వరా!

**కవి పరిచయం :**

ధూర్జటి మహాకవి 16వ శతాబ్దానికి చెందినవాడు శివభక్తుడు. శ్రీకాళహస్తీశ్వర మహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం. అనే రెండు ఉత్కృష్ట గ్రంథాలను రచించాడు. ఇతడు వాఙ్మనః కర్మలతో ఈశ్వరునే ధ్యానించేవాడు. శతక సాహిత్యంలో అత్యుత్తమమైనది శ్రీకాళహస్తీశ్వర శతకం. మొదట ఇతడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ఒకడుగా ఉన్నట్లు తోచును. కానీ, శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఎక్కడా కృష్ణదేవరాయల పేరు కన్పించదు. పైగా రాజనింద కనపడుతుంది. ఈ శతకంలో కూడా కవి ధూర్జటి పేరు ఎక్కడా ప్రస్తావించబడలేదు. క్రీ.శ.1740లో కస్తూరి రంగకవి శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని ధూర్జటి రచించినట్లుగా ప్రతిపాదించాడు. అంతేగాక శ్రీకాళహస్తీశ్వరమహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం ఈ రెంటిలోని రచనా సంవిధానం, శైలి పారమ్యం ఒకే విధముగా ఉంటాయి. ఈ శతకంలో ప్రధానంగా, రాజు తిరస్కారం భక్తి వైరాగ్య భావనలు కవి హృదయపు లోతుల నుండి ఆవిష్కరించబడ్డాయి.

**సందర్భం :**

ధూర్జటి మహాపండితుడు. అనేక శాస్త్ర విజ్ఞాన రహస్యాలు తెలిసినవాడు. కాని, ఈ శాస్త్ర విజ్ఞానమంతా భౌతిక సుఖాల నిస్తుందేమోగానీ, భగవంతుని గూర్చి తెలియజెప్పే రహస్యాలిందులో లేవని, ఆ మార్గాన్ని తనకు బోధించమని పరమేశ్వరుని వేడుకునే సందర్భములోనిదీ పద్యము.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| శ్రీకాళహస్తీశ్వరా | = | శ్రీకాళహస్తీశ్వరా! |
| మంత్రతంత్రములు | = | మంత్రశాస్త్రమును, తాంత్రిక విజ్ఞానమును |
| పరిశీలించితి | = | శ్రద్ధగా చూచితిని |
| సాంఖ్య + ఆది | = | సాంఖ్యము మొదలైన |
| యోగ రహస్యంబులు | = | యోగ సంబంధమైన రహస్యములను |
| చెప్పన్ + వింటి | = | పెద్దలు చెప్పగా వినియుంటిని |

| | | |
|---|---|---|
| వేదశాస్త్రములు | = | వేదములను, అనేక శాస్త్రములను |
| వక్కాణించితిని | = | వల్లెవేసితిని |
| అరయన్ | = | కాని, ఆలోచించగా |
| గుమ్మడికాయలోని | = | పెద్ద గుమ్మడిపండంత (సందేహము) దానిలో |
| ఆవగింజంత + ఐనను | = | ఆవగింజంత పరిమాణమైననూ |
| శంక + పోదు | = | సందేహము తీరలేదు |
| నమ్మించి | = | నాకు నమ్మకము కుదురునట్లుగా |
| సుస్థిర విజ్ఞానము | = | శాశ్వతమైన మోక్షము నిచ్చు జ్ఞానమును పొందు |
| త్రోవ | = | మార్గమును |
| చెప్పగదవె | = | నీవే తెలియజెప్పుము |

**తాత్పర్యం :**

పరమేశ్వరా! మంత్ర తంత్రములెన్నింటినో పరిశీలించితిని. సాంఖ్యాది యోగశాస్త్ర రహస్యములను తెలిసికొంటిని. వేద శాస్త్రములను వల్లించితిని. ఇన్ని నేర్చినప్పటికీ, గుమ్మడి కాయలో ఆవగింజంత మాత్రమైనా, నా సందేహము తీరలేదు. దయతో నీవే నాకు మోక్షముపదేశింపుము.

**సంధులు :**

| | | |
|---|---|---|
| సాంఖ్య + ఆది | = | సాంఖ్యాది (సవర్ణదీర్ఘ సంధి) |
| శంక + పోదు | = | శంకవోదు (గసడదవాదేశ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| మంత్ర తంత్రములు | = | మంత్రములును, తంత్రములును (ద్వంద సమాసము) |
| యోగరహస్యములు | = | యోగమందలి రహస్యములు (సప్తమీతత్పురుష సమాసము) |
| వేదశాస్త్రములు | = | వేదములును, శాస్త్రములును (ద్వంద సమాసము) |
| సుస్థిర విజ్ఞానము | = | సుస్థిరమైన విజ్ఞానము (విశేషణ పూర్వపద కర్మధారయము) |

**విశేషాంశాలు :**

భౌతికమైన విద్యలు ఎన్ని నేర్చినప్పటికీ, అవి మానవునికి బ్రతుకు తెరువుకే ఉపయోగపడును కానీ, భగంత్సంబంధమైన జ్ఞానాన్ని ప్రసాదించవు. ఈశ్వరుని కరుణ వల్లనే అదిగూడ సాధ్యమౌతుంది. ఈ విషయాన్ని గ్రహించి, ధూర్జటి ఆ పరమేశ్వరునికే మోక్షమార్గాన్ని ప్రసాదించమని అర్థిస్తున్నాడు.

**ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| ప రి శీ | లించితి | మంత్రతం | త్రములు | చెప్పన్విం | టిసాంఖ్యా | దియో |

ఇందు 'స, భ, ర, న, చ, మ, య, వ' అను గణములున్నవి కాబట్టి ఇది మత్తేభ పద్యపాతము. 1-14 యతి స్థానము 'ఏ- ప్ప' ప్రాస నియమం కలదు.

| | | | |
|---|---|---|---|
| **78.ప** | మొదలున్ + చేసిన | = | ఇంతకుముందు చేసిన |
| | నిర్మూలంబుఁగా చేసి | = | మిగలకుండా చేసి, తొలగ ద్రోచి |

| | | |
|---|---|---|
| దుర్మదులై | = | గర్వించినవారై, అహంకరించినవారై |
| దురాత్ములు + ఎల్ల | = | దుర్మార్గులందరు |
| అధముల్ | = | నీచులు |

**తాత్పర్యం :**

హే త్రికాలజ్ఞా! పూర్వులొనర్చిన ధర్మశాస్త్రములు కాదని ఆధునికులు క్రొత్త శాస్త్రములు వ్రాయుచున్నారు. వీరి తర్వాత వచ్చినవారు, వీరు వ్రాసినవి చింపి తాము క్రొత్తవి వ్రాయుదురు గదా! ఇట్లు తరమునకొక ధర్మమును, అధములు ఎందుకు చేసెదరోకదా!

| | | | |
|---|---|---|---|
| **79.ప** | మనఃకామంబులు | = | మనస్సులోని కోర్కెలు |
| | ఈడేర్చునో | = | తీర్చునా? |
| | వీసంబు + ఐనను | = | ఏ కొంచెమైనను |
| | జగత్ + విఖ్యాతి | = | ప్రపంచ ఖ్యాతిని, కీర్తిని |
| | తోడ్తో | = | వెనువెంటనే |
| | ఉడుపవో | = | పోగొట్టవో, నాశనము చేయవో! |

**తాత్పర్యం :**

పరమేశ్వరా! ఈ సంసారము కొంచెమైనా సుఖాన్ని గలుగచేయు కోర్కెలీడేర్చునా? వీసమంతైనా వెంట వచ్చునా? లోకములో కీర్తి కలిగించునా? దోషములు తొలగించునా? కోరినచో నీ పరమేశ్వర తత్వము తెలియచెప్పునా? ఎందుకూ కొరగాని ఈ సంసార మందలి దురాశను తొలగించుము.

| | | | |
|---|---|---|---|
| **80.ప** | కూడు తక్కువగునే | = | ఆహారము తక్కువైతే |
| | ఓపక | = | సహింపలేక |
| | కుంపట్లు+ఎత్తుకోన్+చూచు | = | వేడికొరకు ప్రయత్నించును |
| | రోసి | = | ఏవగించుకొని, అసహ్యించుకొని |
| | కడన్ | = | అంత్యమందలి బ్రహ్మపదమును |
| | మర్త్యుల్ | = | మానవులు |
| | ఆసింపరుగాక | = | కోరుకోరుగదా! |

**తాత్పర్యం :**

హే విరాడ్రుపా! ఈ శరీరానికి ఒక్కపూట కొంచెం ఆహారం తక్కువైతే ఓర్చుకోలేదు. ఎండను భరించలేక నీడను వెదుకుతుంది. చలికి జడిసి వేడి కోసం తపిస్తుంది. వానకు ఇంటింటా తలదాచుకుంటుంది. అటువంటి ఈ శరీర బాధలు రోసి, మానవులు మోక్షాన్ని కోరుకోరు గదా!

| | | | |
|---|---|---|---|
| **81.ప** | వారణాసి | = | కాశీపట్టణము |
| | లోకులు | = | ప్రజలు |
| | జ్ఞానలక్ష్మి | = | జ్ఞానమనెడి సంపద చేత |

**తాత్పర్యం :**

హే సర్వాంతర్యామి! కేదారాది సమస్త పుణ్యతీర్థమును దర్శించుట ఎందుకు? నీ పాద ధ్యానముకలిగినప్పుడు ముంగిలి వారణాసి కాదా? కడుపే కైలాసం కాదా? నిన్ను మనస్సులో నిల్పినచో అజ్ఞానమనే దరిద్రము నుండి లోకులు విముక్తులౌతారు గదా!

| | | |
|---|---|---|
| **82.ప** తమకంబు + ఒప్ప | = | కోరికతో, తామసగుణ ప్రధానమై |
| పరద్రవ్యంబులన్ | = | ఇతరుల సంపదలను |
| ముచ్చిలంగ | = | దొంగిలించుటకు |
| వైరాగ్య పాశములన్ | = | వైరాగ్యము అనెడి త్రాళ్లలో |
| ముదంబు | = | సంతోషము |

**తాత్పర్యం :**

హే యోగీశ్వరా! నా మనస్సు పరస్త్రీలను, పరధనాన్ని కోరుకుంటున్నది. నా మనస్సనే దొంగను పట్టుకొని, వైరాగ్యమనే త్రాళ్లతో బంధించి, నీ చరణములకు స్తంభములకు కట్టివేసి, సంతోషాన్ని ఎప్పుడు కలిగించెదవో కదా!

| | | |
|---|---|---|
| **83.ప** వేధన్ | = | బ్రహ్మదేవుని |
| ధీచాతురిన్ | = | బుద్ధిబలముచే |
| ఆ గులాము | = | ఆ సేవకుడు, ఆ బానిస |
| క్షుద్బాధాదుల్ | = | ఆకలి మొదలైన కష్టములను |
| కృత్యంబైన | = | తప్పనిసరైతే |
| ధాత్రీశులన్ | = | రాజులను |
| చేయన్ + ఏటికి + అకటా! | = | చేయుట ఎందులకో కదా! |

**తాత్పర్యం :**

హే సర్వపోషకా! ఆ బ్రహ్మదేవుడు భూమిపై విద్వాంసులనేల సృష్టించవలెను? వారికి ఆకలి మొదలైన అవసరాలనేల కల్పించలెను? వారి బాధల నాధారము చేసుకొని, పండితులను పీడించు రాజుల నెందుకు సృష్టించవలెను?

| | | |
|---|---|---|
| **84. ప** పుడమిన్ | = | భూమియందు |
| ఒక బిల్వపత్రమునకు | = | ఒక్క మారేకు ఆకుతోనే |
| సారెసత్తులు | = | జంతికలు |
| కొఱగాకపోదురు | = | ప్రయోజనము లేకుండా పోవుచున్నారు. |

**తాత్పర్యం :**

పరమేశ్వరా! ఈ పుడమిలో ఒక్క బిల్వపత్రముతో నిన్ను పూజించి పుణ్యము పొందలేక ఇతరమైన అనేక దేవతలకు పప్పులు, ప్రసాదములు, కుడుములు, దోసెలు, గుగ్గిళ్లు మొదలైనవి అర్పించి జనులు కొరగాకుండా పోవుచున్నారు.

**85.ప.** విత్తజ్ఞానము పాదుచిత్తము, భవావేశంబు రక్షాంబువుల్
మత్తత్వంబు తదంకురంబన్నృతముల్ మఱాకు లత్యంత దు
ర్వృత్తుల్ పువ్వులు, పండ్లు మన్మధ ముఖావిర్భూత దోషంబులుం
జిత్తాభ్యున్నత నిబంధ భూజమునకున్ శ్రీకాళహస్తీశ్వరా!

**కవి పరిచయం :**

ధూర్జటి మహాకవి 16వ శతాబ్దానికి చెందినవాడు శివభక్తుడు. శ్రీకాళహస్తీశ్వర మహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం. అనే రెండు ఉత్కృష్ట గ్రంథాలను రచించాడు. ఇతడు వాఙ్మనః కర్మలతో ఈశ్వరునే ధ్యానించేవాడు. శతక సాహిత్యంలో అత్యుత్తమమైనది శ్రీకాళహస్తీశ్వర శతకం. మొదట ఇతడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ఒకడుగా ఉన్నట్లు తోచును. కానీ, శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఎక్కడా కృష్ణదేవరాయల పేరు కన్పించదు. పైగా రాజనింద కనపడుతుంది. ఈ శతకంలో కూడా కవి ధూర్జటి పేరు ఎక్కడా ప్రస్తావించబడలేదు. క్రీ.శ. 1740లో కస్తూరి రంగకవి శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని ధూర్జటి రచించినట్లుగా ప్రతిపాదించాడు. అంతేగాక శ్రీకాళహస్తీశ్వరమహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం ఈ రెంటిలోని రచనా సంవిధానం, శైలి పారమ్యం ఒకే విధముగా ఉంటాయి. ఈ శతకంలో ప్రధానంగా, రాజు తిరస్కారం భక్తి వైరాగ్య భావనలు కవి హృదయపు లోతుల నుండి ఆవిష్కరించబడ్డాయి.

**సందర్భం :**

ధూర్జటి సంసారాన్ని వేపవృక్షముతో పోల్చి చెప్పు సందర్భములోనిది.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| శ్రీకాళహస్తీశ్వరా! | = | పరమేశ్వరా |
| చిత్త | = | మనస్సనెడు |
| అభ్యున్నత | = | వృద్ధిపొందుచున్న, ఎత్తైన |
| నింబభూజమునకున్ | = | వేపవృక్షమునకు |
| విత్తు | = | విత్తనము |
| అజ్ఞానము | = | అజ్ఞానము |
| పాదు | = | పాదు |
| చిత్తము | = | మనస్సు |
| భవ + ఆవేశము | = | సంసారమందలి కోరిక |
| రక్ష + అంబువుల్ | = | ఆ చెట్టును రక్షించునట్టి నీరు |
| మత్తత్వంబు | = | మదము |
| తత్ | = | దానియొక్క |
| అంకురము | = | మొలక |
| అనృతముల్ | = | అసత్యములు |
| మాఱాకులు | = | లేత చిగుళ్లు |
| అత్యంత | = | అధికమైన |
| దుర్వృత్తులు | = | చెడుపనులు |
| పువ్వులు | = | పూలు |
| మన్మథముఖ | = | కామముచే |
| ఆవిర్భూత | = | పుట్టిన |
| దోషంబులు | = | దోషములు, పాపములు |
| పండ్లు | = | ఫలములు |

**తాత్పర్యం :**

పరమేశ్వరా! మనస్సనెడి వేపచెట్టుకు అజ్ఞానమే విత్తనము. మనస్సుపాదు. సంసారమందలి ఆవేశము నీరు. అహంకారము మొలక. అనృతములు చిగురాకులు. చెడ్డపనులు పూలు కామ క్రోధాది దోషములు పండ్లు.

**సంధులు :**

| | | |
|---|---|---|
| విత్తు + అజ్ఞానము | = | విత్తజ్ఞానము (ఉకార సంధి) |
| భవ + ఆవేశంబు | = | భవావేశములు (సవర్ణదీర్ఘ సంధి) |
| రక్ష + అంబువుల్ | = | రక్షాంబువుల్ (సవర్ణధీర్ఘ సంధి) |
| అతి + అంత | = | అత్యంత (యణాదేశ సంధి) |
| దుః + వృత్తులు | = | దుర్వృత్తులు (విసర్గసంధి) |
| ముఖ + ఆ విర్భూత | = | ముఖావిర్భూత (సవర్ణ దీర్ఘ సంధి) |
| అభి + ఉన్నత | = | అభ్యున్నత (యణాదేశ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| పాడు చిత్తము | = | పాడుదైన చిత్తము (విశేషణ పూర్వపద కర్మధారయము) |
| భవావేశము | = | భవ మందలి ఆవేశము (సప్తమిత తత్పురుష) |
| నింబభూజము | = | నింబ అను పేరుగల భూజము (సంభావనా పూర్వపద కర్మదారయం) |

**విశేషాంశాలు :**

ఈ పద్యంలో ధూర్జటి, సంసారము పట్ల తనకు గల వైరాగ్యాన్ని చక్కగా నిరూపిస్తున్నాడు. మనస్సు వేప చెట్టులాగా చేదుగా ఉంటే, దాని నుండి ఉద్భవించే విషయాలన్ని కూడా విపరీతమైన ఫలితాన్నే ఇస్తాయి. ఈ పద్యంలో రూపకాలంకారం చక్కగా పోషింపబడింది.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| విత్తజ్ఞా | నముపా | దు చిత్త | ము భవా | దేశంబు | రక్షాంబు | వుల్ |

ఇందులో 'మ, స, జ, స, త, త, గ,' అను గణములున్నవి కాబట్టి ఇది శార్దూల పద్యపాదము. 1-13వ అక్షరం యతి స్థానం. 'వి-వే' - ప్రాసనియమం కలదు.

| | | |
|---|---|---|
| **86.ప** మంజు ప్రబంధంబు | = | మనోహరమైన కావ్యములు |
| ఇష్టాపూర్తిన్ | = | గొప్ప కోరికతో, ఇష్టముతో |
| సద్బాంధవుల్ | = | నిజమైన బంధువులు |
| పుష్టాగత బాంధవంబు | = | పుట్టుకచే కలుగు బంధుత్వము |

**తాత్పర్యం :**

ఈశ్వరా! నీపై కావ్యము చెప్పుమన్నవాడు, నీ పద్యములు చదువుకొందునని వాడు, నీ సంబంధమైన ప్రబంధములను మిగులు ఇష్టముతో పఠించువాడు నిజమైన బంధువులగుచుదురుగానీ జన్మ జన్మలనుండి ఏర్పడిన చొట్టకములు నిజమైనవి కాదు.

| | | |
|---|---|---|
| **87.ప** సంపత్ + గర్వము | = | సంపద వలన కలిగిన గర్వము |
| రిపులన్ | = | శత్రువులను |
| జంకించి | = | భయపెట్టి |
| ఆకాంక్షలన్ | = | కోరికలను |
| కళంకములన్ | = | దోషములను |
| బంధ క్లేశ దోషంబులన్ | = | సంసార బంధము వల్ల కలిగిన బాధలను, దోషములను |
| వయో విలాసములు | = | వయస్సు వలన కలిగిన విలాసములను |
| భూతంబులన్ | = | భూతకోటుల యొక్క, పంచభూతముల యొక్క |

**తాత్పర్యం :**

ఈశ్వరా! ఇహలోక సంబంధమైన సమస్తైశ్వర్యములను వదిలించుకొని, అంతశ్శత్రువులను (భయపెట్టి), గెలిచి, కోరికలను జయించి, దోషముల నరికట్టి, స్వపర బంధుత్వాలను త్యజించి, కామాది వికారములను కుదించినచో నీ దర్శనము లభించునా?

| | | |
|---|---|---|
| **88.ప** రాజశ్రేణికి | = | రాజుల సమూహములకు |
| తరింపజేయగల | = | ఉద్ధరించగల, దాట గలిగినట్టి |
| ఏ ప్రొద్దు | = | ఏ వేళలయందు |
| నిర్వ్యాజ + ఆచారము | = | వాంఛారహితమైన పద్ధతి (కోరికలులేని పద్ధతి) |
| పాపరాజీ | = | పాపముల సమూహముల నుండి |
| జాత | = | పుట్టిన |
| అతిమద | = | అధికమైన గర్వముతో |
| అంధ బుద్ధులగుచున్ | = | కనుగాననివారగుచు |

**తాత్పర్యం :**

పరాత్పరా! రాజులకు దాసులై సిరుల నుపేక్షించుట సౌఖ్యమా? లేక, ఈ మానవ జన్మను తరింపజేయగల నిన్ను, సేవించుచు, వారి భారహితమైన ఆచారము సౌఖ్యమా? ఈ మానవులు పాపకర్మాచరణచే గర్వాంధులై, మూర్ఖులై నిన్ను తెలిసికొనలేకున్నారు.

| | | |
|---|---|---|
| **89.ప** ఈ మర్త్యుల్ | = | ఈ మానవులు |
| ధనభ్రాంతిన్ | = | ధనము మీది ఆశలను |
| విసర్జింపలేకున్నారు | = | వదలిపెట్టిలేకున్నారు |

**తాత్పర్యం :**

పరమేశ్వరా! అనునిత్యమూ తమ కనులముందు ఎందరు మరణించుచున్ననూ, మానవులు తమ మరణమును, ధన భ్రాంతిని విసర్జింపలేకున్నారు. వీరు నిన్ను సేవింపక, ఇతరులను సేవింతురేమో!

| | | |
|---|---|---|
| **90.ప** వన్నే! | = | అందమైన అలంకారము |
| దుప్పటము | = | వస్త్రము |
| బువ్వా! | = | ఆహారమా! |
| చేగిన్నే | = | చేతియందలి పాత్ర |
| భోగే | = | పామే |
| మానసము | = | మనస్సు |

**తాత్పర్యం :**

ఏనుగు చర్మమును వస్త్రముగా, విషమే ఆహారముగా, కపాలము భిక్షాపాత్రగా, ఉగ్రమైన పాములే కండహారముగా ఉన్నప్పటికినీ, ఐశ్వర్యలక్ష్మీ పతియైన శ్రీ మహావిష్ణువు నీయందు తన మనసునెట్లు లగ్నము చేసెనుగదా!

| | | | |
|---|---|---|---|
| **91.ప** | ద్వారద్వారములందు | = | ప్రతి గుమ్మమునందును |
| | కంచుకిజనవ్రాతము | = | రాజసేవకుల సమూహము |
| | దండములన్ | = | కర్రలతో |
| | దోరంతస్థలి | = | గుండెలపై |
| | నీ పరిజనులు | = | నీ సేవకులు |

**తాత్పర్యం :**

రాజాంతఃపురములో ప్రతి ద్వారము వద్ద కాపలాకాయు సేవకులు ధననిమిత్తము రాజు దర్శనము చేయగోరు వారిని దండించుచూ దుర్భాషలు పలుకుతుంటారు. మరి నీ భక్తులైనవారు, అటువంటి వారిని ప్రార్థించి, రాజు దర్శనము నాశించరు.

| | | | |
|---|---|---|---|
| **92.ప** | చీరానీకము | = | వస్త్రముల సముదాయము |
| | శీత + అమృత స్వచ్ఛ | = | చల్లని అమృతము వంటి స్వచ్ఛమైన |
| | వాఃపూరంబు | = | నీరు |
| | ఏఱులన్ + పాఱదో | = | నదులలో ప్రవహించదా! |

**తాత్పర్యం :**

హే ఆదిభిక్షూ! నీ భక్తులైన వారికి ప్రతి ఊరియందు ప్రజలు భిక్షపెట్టరా! నివసించడానికి గుహలు లేవా? వస్త్ర సముదాయము వీధులలో దొరకదా? చల్లని నీరు నదులలో లభించదా? తాపసులను బ్రోచుటకు నీవు లేవా? అయినను, సాధారణ ప్రజలు ఈ రాజాశ్రయమును ఎందుకు కోరుదురో కదా!

| | | | |
|---|---|---|---|
| **93.ప** | అశనబుద్ధిన్ + చూడ | = | భోజనము మీది ధ్యాసతో |
| | సత్ + క్రియలన్ | = | మంచి పనులచే |
| | నిన్ను భజింపక | = | నిన్ను సేవించక |

**తాత్పర్యం :**

పరమేశ్వరా! కొందరు నిన్ను సేవించుచూ, దయచూడుమని ప్రార్థిస్తారు. కానీ, నియమాన్ని అనుసరించే ఫలముంటుంది కదా! పిండిని బట్టే రొట్టెకదా! సత్క్రియలతో నిన్ను సేవించినచో, అభీష్టసుఖములెందుకు లభించవు?

94.ప. ఆరావంబుదయించె తారకముగా నాత్మాభ్రవీధిన్మహా
కారోకార మకారయుక్తమగు నోంకారాభిధానంబు, చె
న్నారున్విశ్వమనంగ, తన్మహిమచేనా నాదబిందుల్సుఖ
శ్రీ రంజిల్లగడంగు, నీవదెసుమా శ్రీకాళహస్తీశ్వరా!

**కవి పరిచయం :**

ధూర్జటి మహాకవి 16వ శతాబ్దానికి చెందినవాడు శివభక్తుడు. శ్రీకాళహస్తీశ్వర మహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం. అనే రెండు ఉత్కృష్ట గ్రంథాలను రచించాడు. ఇతడు వాఙ్మనః కర్మలతో ఈశ్వరునే ధ్యానించేవాడు. శతక సాహిత్యంలో అత్యుత్తమమైనది

శ్రీకాళహస్తీశ్వర శతకం. మొదట ఇతడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ఒకడుగా ఉన్నట్లు తోచును. కానీ, శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఎక్కడా కృష్ణదేవరాయల పేరు కన్పించదు. పైగా రాజనింద కనపడుతుంది. ఈ శతకంలో కూడా కవి ధూర్జటి పేరు ఎక్కడా ప్రస్తావించబడలేదు. క్రీ.శ. 1740లో కస్తూరి రంగకవి శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని ధూర్జటి రచించినట్లుగా ప్రతిపాదించాడు. అంతేగాక శ్రీకాళహస్తీశ్వరమహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం ఈ రెంటిలోని రచనా సంవిధానం, శైలి పారమ్యం ఒకే విధముగా ఉంటాయి. ఈ శతకంలో ప్రధానంగా, రాజు తిరస్కారం భక్తి వైరాగ్య భావనలు కవి హృదయపు లోతుల నుండి ఆవిష్కరించబడ్డాయి.

**సందర్భం :**

ధూర్జటి ఆత్మాకాశంలో ఓంకారనాదం మ్రోగుతున్నదని, అదే భవతారకమంత్రమని చెప్పు సందర్భంలోనిది.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| శ్రీకాళహస్తీశ్వరా | = | పరమేశ్వరా |
| ఆత్మ + అభ్రవీధిన్ | = | ఆత్మ అనెడి ఆకాశవీధిలో |
| మహత్ | = | గొప్పదైన |
| ఆకార | = | ఆకారముతో |
| ఉకార | = | ఉకారముతో |
| మకార | = | మకారముతో |
| యుక్తమగు | = | కూడిన |
| ఓంకార + అభిధానంబు | = | ఓకారమను పేరు గల |
| ఆరావంబు | = | శబ్దము |
| తారకముగా | = | తారకమంత్రముగా |
| ఉదయించెను | = | ఉదయించెను. |
| తత్ | = | ఆనాదము యొక్క |
| మహిమచేన్ | = | గొప్పదనముచే, మహత్యముచే |
| విశ్వమనంగ | = | ఈ విశ్వమంతా |
| చెన్నారున్ | = | ప్రకాశించుచున్నది |
| ఆ నాదబిందుల్ | = | ఆ నాదబిందు రూపమే |
| నీవు + అదె | = | నీవుగా, నీ రూపముగా |
| సుఖశ్రీ రంజల్ల | = | సుఖమనెడి సంపదను |
| కడంగు సుమా! | = | చేకూర్చుచున్నది సుమా! |

**తాత్పర్యం :**

ఆత్మ అనెడి ఆకాశవీధిలో ఓంకారనాదము భవతారకమంత్రముగా ఉదయించినది. ఆ నాదమే ఈ విశ్వమంతా ప్రకాశించు చున్నది. ఆ నాదబిందు రూపుడవే నీవుగా సుఖమనెడి సంపదను అనుగ్రహించుచున్నావు.

**సంధులు :**

| | | |
|---|---|---|
| ఆత్మ + అభ్రవీధి | = | ఆత్మాభ్రవీధి (సవర్ణదీర్ఘ సంధి) |
| మహాకార + ఉకార | = | మహాకారోకార (గుణసంధి) |
| ఓంకార + అభిదానము | = | ఓంకారభిదానము (సవర్ణదీర్ఘ సంధి) |

| | | |
|---|---|---|
| తత్ + మహిమ | = | తన్మహిమ (అనునాసిక సంధి) |
| నీవు + అదె | = | నీవదె (ఉకారసంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| ఆత్మాభ్రవీధి | = | ఆత్మ అనెడు అభ్రవీధి (రూపక సమాసము) |
| సుఖశ్రీ | = | సుఖమనెడి శ్రీ (రూపక సమాసము) |

**విశేషాంశాలు :**

తను అంతర్ముఖంగా దర్శించిన ఓంకార స్వరూపుడగు పరమాత్మను గూర్చి వివరిస్తున్నాడు కవి. ఆ కాంతిపుంజమే విశ్వమంతా వ్యాపించి ఉందని, ఆ నాదబిందు రూపమే శాశ్వత సుఖాన్నిస్తుందని తన ఆత్మానుభవాన్ని విశదీకరిస్తున్నాడు. ఈ పద్యంలో రూపకాలంకారము పోషింపబడింది.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| ఆరావం | బుదయిం | చెతార | కముగా | నాత్మాభ్ర | వీధిన్మ | హా |

ఈ పద్యములో 'మ, స, జ, స, త, త, గ,' అను గణములున్నవి కాబట్టి ఇది శార్దూల పద్యపాదము. 1-13వ అక్షరం యతి స్థానం. 'ఆ-నా' - ప్రాస నియమం కలదు.

| | | |
|---|---|---|
| **95.ప** పదివేల భంగుల | = | పదివేల విధములుగా |
| వేడగా | = | వేడుకొనగా, ప్రార్థించగా |
| లోభంబు + ఏటికి | = | లోభ గుణమెందులకు? |
| కృపాళుత్వంబునన్ | = | దయాగుణముతో |
| భవ్యంబు | = | శుభము |
| పరమార్థంబు + ఇచ్చి | = | మోక్షమనుగ్రహించి |
| నీ శ్రీ భాండాగారములో | = | నీ ధనాగారములో |
| కొఱంత + పడునా | = | తక్కువగునా? |

**తాత్పర్యం :**

శ్రీకాళహస్తీశ్వరా! పదివేల విధములుగా నీ భక్తులు నిన్ను సేవింపుచూ రక్షింపుమని ప్రార్థించగా, నీకు లోభ గుణమెందుకు? వారి కోరికలు దయతో తీర్చరాదా? వారికి పరమార్థము ననుగ్రహించినచో, నీ ఐశ్వర్యభాండాగారములో కొఱత కల్గునా?

| | | |
|---|---|---|
| **96.ప** ముదియంగా ముదియంగా | = | ముసలితనము రాగా |
| ఘనమౌ | = | ఎక్కువగుట |
| మోహంబు | = | వాంఛ, కోరిక |
| లోభము | = | పిసినారితనము |
| నిన్ను + ఆత్మ గొల్చి | = | నిన్ను మనస్సులో సేవించగా |

**తాత్పర్యం :**

హే దయామయా! పూర్వకాలమందు నీ భక్తులకు మోక్షము గ్రహించినావుగదా! మరి నేడెందుకీయవు? వయసుమీరిన

కొద్ది మోహముపెరుగుతుందన్నది సత్యము కదా! ఒక భక్తుడు (ధూర్జటి) ప్రతిదినము నిన్ను సేవింపుచూ ఆత్మ గొలిచి మొరపెట్టగా ఎందుకు కనికరింపవు?

97.ప. కాలద్వారకవాట బంధనము, దుష్కాల ప్రమాణ క్రియా
లీలా చాలక చిత్రగుప్త ముఖ వల్మీకోగ్ర జిహ్వాద్భుత
వ్యాళ, వ్యాళవిరోధి, మృత్యుముఖదంష్ట్రానాహార్య వజ్రంబు, ది
క్చేలాలంకృత, నీదునామ మరయన్ శ్రీకాళహస్తీశ్వరా!

**కవి పరిచయం :**

ధూర్జటి మహాకవి 16వ శతాబ్దానికి చెందినవాడు శివభక్తుడు. శ్రీకాళహస్తీశ్వర మహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం. అనే రెండు ఉత్కృష్ట గ్రంథాలను రచించాడు. ఇతడు వాఙ్మనః కర్మలతో ఈశ్వరునే ధ్యానించేవాడు. శతక సాహిత్యంలో అత్యుత్తమమైనది శ్రీకాళహస్తీశ్వర శతకం. మొదట ఇతడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ఒకడుగా ఉన్నట్లు తోచును. కానీ, శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఎక్కడా కృష్ణదేవరాయల పేరు కన్పించదు. పైగా రాజనింద కనపడుతుంది. ఈ శతకంలో కూడా కవి ధూర్జటి పేరు ఎక్కడా ప్రస్తావించబడలేదు. క్రీ.శ. 1740లో కస్తూరి రంగకవి శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని ధూర్జటి రచించినట్లుగా ప్రతిపాదించాడు. అంతేగాక శ్రీకాళహస్తీశ్వరమహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం ఈ రెంటిలోని రచనా సంవిధానం, శైలి పారమ్యం ఒకే విధముగా ఉంటాయి. ఈ శతకంలో ప్రధానంగా, రాజు తిరస్కారం భక్తి వైరాగ్య భావనలు కవి హృదయపు లోతుల నుండి ఆవిష్కరించబడ్డాయి.

**సందర్భం :**

ధూర్జటి, పరమేశ్వరుని నామమహిమ కొనియాడు సందర్భములోని దీపద్యము.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| శ్రీకాళహస్తీశ్వరా | = | పరమేశ్వరా! |
| దిక్ | = | దిక్కులనే |
| చేల + అలంకృత | = | వస్త్రములుగా అలంకరింపబడిన వాడా! (హే! సర్వవ్యాపకా!) |
| అరయన్ | = | ఆలోచించగా, విచారించగా |
| నీదు నామము | = | నీ నామస్మరణ |
| కాలద్వార | = | నరకపు ద్వారమునకు |
| కవాటబంధనము | = | తలుపులు మూయునది |
| దుష్కాల | = | యమలోకపు |
| ప్రమాణ క్రియ | = | ప్రమాణములననుసరించి, (ఆజ్ఞల నతిక్రమించక) |
| లీలాచాలక | = | విలాసముగా వర్తించు |
| చిత్రగుప్త | = | చిత్రగుప్తుని |
| ముఖ | = | ముఖమనెడు |
| వల్మీక | = | పుట్టయందలి |
| ఉగ్ర | = | భయంకరమైన |
| జిహ్వా + అద్భుత వ్యాళ | = | సర్పమనెడి నాలుకకు |

| | | |
|---|---|---|
| వ్యాళ విరోధి | = | గరుత్మంతుని వంటిది |
| మృత్యుముఖ | = | మృత్యుదేవత నోటిలోని |
| దంష్ట్ర | = | కోరలకు |
| అనాహార్య | = | ఆహారముకాలేని (ఆహారముగా స్వీకరింపలేని) |
| వజ్రంబు | = | వజ్రమువంటిది |

**తాత్పర్యం :**

హే! దిగంతవ్యాపీ! నీ దివ్యనామ స్మరణ, యమలోక ద్వారమును మూయునది, ఇంకను నరక భయమును, మృత్యుభయమును అది తొలగించును.

**సంధులు :**

| | | |
|---|---|---|
| వల్మీక + ఉగ్ర | = | వల్మీకోగ్ర (గుణసంధి) |
| జిహ్వా + అద్భుత | = | జిహ్వాద్భుత (సవర్ణదీర్ఘ సంధి) |
| చేల + అలంకృత | = | చేలాలంకృత (సవర్ణదీర్ఘ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| కవాట బంధనము | = | కవాటము యొక్క బంధనము (షష్ఠీ తత్పురుష సమాసము) |
| వ్యాళవిరోధి | = | వ్యాళమునకు విరోధి (షష్ఠీతత్పురుష) |
| ముఖదంష్ట్రలు | = | ముఖమందలి దంష్ట్రలు (సప్తమీతత్పురుష) |

**విశేషాంశాలు :**

ఈశ్వరుని నిరంతర నామస్మరణ ఎంత శక్తిమంతమైనదో ఈ పద్యంలో కవి వివరిస్తున్నాడు. చంద్రశేఖరుని నామము జపిస్తే యముడు సైతము ఏమీ చేయలేడు. భయంకరమైన మృత్యుముఖ దంష్ట్రలకు చిక్కి శివభక్తుడు నలిగిపోలేడు. మృత్యుంజయ నామము అంత శక్తి కలిగినదని, కవి చెప్పుచున్నాడు. 'దిక్చేలాలంకృత'- అని సంబోధించడంతో, పరమేశ్వరుని సర్వవ్యాపకత్వమును కవి నిరూపిస్తున్నాడు.

**ఛందస్సు :**

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| కాలద్వా | రకవా | టబంధ | నముదు | ష్కాలప్ర | మాణక్రి | యా |

ఇందులో 'మ, స, జ, స, త, త, గ,' అను గణములున్నవి కాబట్టి ఇది శార్దూల పద్యపాదము. 1-13వ అక్షరం యతి స్థానం 'కా-ష్కా' - ప్రాస నియమం కలదు.

| | | |
|---|---|---|
| **98.ప** లోక కంటకులచే | = | ప్రజలను పీడించు రాజులచే |
| ప్రాప్తించు | = | లభ్యమగు |
| పథ్యముకాదు | = | ఇష్టము కాదు |
| సర్వమునకున్ | = | అన్ని విషయములకు |
| మధ్యస్థుడై | = | మధ్యవర్తిగా చరించు (తటస్థముగా నుండు) |
| సత్యదానదయాదుల్ + కల | = | సత్యము, దానము, దయ గలిగిన |

నీ యట్ల = నీ వలెను
ముదము + ఒందుదున్ = సంతోషపడుదును

**తాత్పర్యం :**

ఈశ్వరా! లోకకంటకులైన రాజులచే లభించే సౌఖ్యము పదివేలైననూ నాకు ఇష్టము కాదు. అన్ని విషయములందు పక్షపాత రహితుడై సత్యదాన దయాది గుణములు గల రాజును నా కనుగ్రహించుము. అటువంటి పాలకుని నేను నీవలెనే భావించి సేవించి సంతోషమును పొందగలను.

**99.ప** భీతిన్ + పొందగన్ + ఏల = భయపడుట ఎందులకు?
హితవ్రాతంబు = మిత్రులందరికొరకు
ఏలవింపన్ = దుఃఖించుట
జంతువులకు = ప్రాణులందరికి
వాలయమైయుండగా = సహజమైనది కాగా, (సాధారణమైనది కాగా)
చేతోవిధిన్ = మనస్సు నందు

**తాత్పర్యం :**

అభిషేకప్రియా! ఈ ప్రపంచంలో తాతలు, తల్లులు, తండ్రులు, పెద్దలు మరణించుట చూచుటలేదా! మరి అటువంటప్పుడు మృత్యువుకు భయపడుట ఎందుకు? ఆలు, బిడ్డలు, మిత్రుల వలెనే మృత్యువు మానులకు జంతువులకు సమాన ధర్మమైనప్పుడు, ఈ మానవులు తమ మానస వీధిలో నిన్ను ఎందుకు సేవింపరు?

**100.ప** జాతుల్ + చెప్పుట = జాతకము చెప్పుట
మృషల్ సంధించుట = ఆబద్ధములు చెప్పుట
అపఖ్యాతిన్ + పొందుట = అపకీర్తిని పొందుట
కొండెగాడవుట = ఇతరులపై చాడీలే చెప్పుట
మిధ్యాతాత్పర్యములాడుట = ఉన్నవి లేనివీ చెప్పుట (ఇచ్చకపుమాట లాడుట)

**తాత్పర్యం :**

పరమేశ్వరా! జాతకములు చెప్పుట, అబద్ధాలాడుట, అన్యాయములు చేయుట, అపఖ్యాతి పొందుట, కొండెములు చెప్పుట, హింసాకృత్యములు చేయుట మొదలైనవన్ని పరద్రవ్యము నాశించియేకదా! అటువంటి సంపద ఎన్ని యుగములందు గలదు? (అనగా అశాశ్వతమని అర్థము)

**101.ప** చెడుగుల్ కొందఱు = దుర్మార్గులు కొందరు
చీకట్లు దూఱంగా = చెడుపనులు చేయుటకు
నిను + ఒల్లను + చాలు = నిన్ను అంగీకరింపను, ఇక చాలని
ఇల్ + వెడలన్ + త్రోచిన = ఇంటి నుండి వెళ్ళగొట్టిననూ

**తాత్పర్యం :**

ఈశ్వరా! కొందరు దుర్బుద్ధులతో కలసి, చెడు పనులకు నేను పాల్పడితినన్న కారణంగా నన్ను పరిగ్రహింపనని తరిమివేసిననూ, నేను నీమీది కోర్కెతో చూరు పట్టుకుని వ్రేలాడుదును. అపుడు నే కోరిన కోరికలు నీవెందులకు తీర్చవు?

**102.ప.** భసితోద్ధూళన ధూసరాంగులు జటా భారోత్తమాంగుల్ తపో
వ్యసనుల్ సాధిత పంచవర్ణరసనుల్ వైరాగ్యంతుల్ నితాం
త సుఖస్వాంతులు సత్యభాణ సముద్యద్రత్న రుద్రాక్ష రా
జి సమేతుల్ తుదనెవ్వరైన, గొలుతున్ శ్రీకాళహస్తీశ్వరా!

**కవి పరిచయం :**

ధూర్జటి మహాకవి 16వ శతాబ్దానికి చెందినవాడు శివభక్తుడు. శ్రీకాళహస్తీశ్వర మహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం. అనే రెండు ఉత్కృష్ట గ్రంథాలను రచించాడు. ఇతడు వాఙ్మనః కర్మలతో ఈశ్వరునే ధ్యానించేవాడు. శతక సాహిత్యంలో అత్యుత్తమమైనది శ్రీకాళహస్తీశ్వర శతకం. మొదట ఇతడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ఒకడుగా ఉన్నట్లు తోచును. కానీ, శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఎక్కడా కృష్ణదేవరాయల పేరు కన్పించదు. పైగా రాజనింద కనపడుతుంది. ఈ శతకంలో కూడా కవి ధూర్జటి పేరు ఎక్కడా ప్రస్తావించబడలేదు. క్రీ.శ.1740లో కస్తూరి రంగకవి శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని ధూర్జటి రచించినట్లుగా ప్రతిపాదించాడు. అంతేగాక శ్రీకాళహస్తీశ్వరమహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం ఈ రెంటిలోని రచనా సంవిధానం, శైలి పారమ్యం ఒకే విధముగా ఉంటాయి. ఈ శతకంలో ప్రధానంగా, రాజు తిరస్కారం భక్తి వైరాగ్య భావనలు కవి హృదయపు లోతుల నుండి ఆవిష్కరించబడ్డాయి.

**సందర్భం :**

శివునితో సారూప్యము గల శివభక్తుల నెవ్వరినైనా తాను సేవించుటకు పూనుకుంటానని ధూర్జటి చెప్పు సందర్భములోనిది.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| శ్రీకాళహస్తీశ్వరా | = | పరమేశ్వరా! |
| భసిత + ఉద్ధూళన | = | విభూతిని పూనుకొనుటవలన |
| ధూసర + అంగులు | = | బూడిదరంగులో గల శరీరము కలవారు |
| జటాభార | = | భారమైన జడలతో నిండిన |
| ఉత్తమాంగులు | = | శిరస్సు కలవారు |
| తపోవ్యసనులు | = | నిరంతరము తపోదీక్షలోనున్న వారు |
| సాధిత | = | సాధింపబడిన |
| పంచవర్ణ | = | పంచాక్షరీమంత్రమును |
| రసనుల్ | = | నాలుకపై కలారు (జపించువారు) |
| వైరాగ్యవంతులు | = | ప్రాపంచిక విషయాసక్తులు కానివారు |
| నితాంత | = | ఎల్లప్పుడు |
| సుఖస్వాంతులు | = | బ్రహ్మానందమును అనుభవించువారు (చిత్సుఖమును పొందువారు) |
| సత్యభాషణ | = | సత్యమును భాషించువారు |
| సముద్యత్ + రత్న | = | ప్రకాశించు రత్నముల వంటి |
| రుద్రాక్షరాజి | = | రుద్రాక్షమాలను |
| సమేతుల్ | = | ధరించినవారు |
| తుదన్ | = | (అటువంటి వారిని) చివరకు |
| ఎవ్వరైన | = | ఎవ్వరినైన (జాతి కుల భేదములు లేక) |
| కొలుతున్ | = | సేవింతును |

**తాత్పర్యం :**

ఈశ్వరా! విభూతి అలదిన శరీరము కలవారు, జటాభారమైన శిరస్సు కలవారు, పంచాక్షరీ మంత్రము జపించువారు. సుఖస్వాంతము గలవారు, రుద్రాక్ష మాలికలు ధరించి, నిన్ను గూర్చి ప్రార్థించు వారినెవ్వరినైనా నేను సేవింతును.

**సంధులు :**

| | | |
|---|---|---|
| భసిత + ఉద్ధూళన | = | భసితోద్ధూళన (గుణ సంధి) |
| ధూసర + అంగులు | = | ధూసరాంగులు (సవర్ణదీర్ఘ సంధి) |
| భార + ఉత్తమ | = | భారోత్తమ (గుణ సంధి) |
| తపః + వ్యసనుల్ | = | తపోవ్యసనులు (విసర్గ సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| ధూసరాంగులు | = | ధూసరమైన అంగము గలవారు (బహువ్రీహి సమాసం) |
| తపోవ్యసనులు | = | తపస్సే వ్యసనముగా గలవారు (బహువ్రీహి సమాసం) |
| సుఖస్వాంతులు | = | సుఖమైన స్వాంతము గలవారు (బహువ్రీహి సమాసం) |
| రుద్రాక్ష రాజి | = | రుద్రాక్షల యొక్క రాజి (షష్ఠీ తత్పురుష సమాసము) |

**విశేషాంశాలు :**

శివునికి, శివభక్తులకు భేదము లేదని, ధూర్జటి విశ్వాసము. బాహ్యమైన సారూప్యము గాక, అంతస్సారూప్యము గూడ ఇక్కడ ప్రధానమే. అందుకనే శివయోగులను, 'సాధిత పంచవర్ణరసనులు, వైరాగ్యవంతులు, నితాంతసుఖస్వాంతులు' అని ధూర్జటి సంభోదిస్తున్నాడు. శివ భక్తులకుండే అనేకమైన విశిష్ట లక్షణాలను వివరిస్తున్నాడు గాబట్టి ఈ పద్యంలో ఉల్లేఖాలంకారము గలదు.

**ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| భ సితో | ద్ధూళన | ధూసరాం | గులు జ | టాభారో | త్తమాంగుల్ | తపో |

ఇందు 'స, భ, ర, న, మ, య, - అను గణములున్నవి గాబట్టి ఇది మత్తేభము. 1-14 వ అక్షరము యతి స్థానము. 'భ-భా' ప్రాస నియమము కలదు.

| | | |
|---|---|---|
| **103.ప** జలజశ్రీగల | = | తామరపూలతో నిండిన |
| చత్రాతిలో | = | రాతిలో |
| వెలివాడన్ | = | వెలివేసిన వాడలో |
| నన్ను + ఏమిరోయంగ | = | నన్ను అసహ్యించుకొనుట ఎందుకు? |
| చెలువంబు + ఐన గుణంబు | = | నీచక్కని గుణము (దయా స్వభావము) |

**తాత్పర్యం :**

బండరాయిలో, పద్మములలో నిండిన నీరుండునా? అలాగే వెలివేయబడిన వారి వీధులలో సద్బ్రాహ్మణుని నివాస గృహ ముండునా? ఆ రెండు దోషములు నాలో కలవు. అనగా నేను చత్రాయి వంటి వాడను, వెలివేసిన వాడనని భావింపక నాలో నీవు మెచ్చిన గుణములెంచుకుని నన్ను రక్షింపుము.

| | | |
|---|---|---|
| **104.ప** నేడు + ఎల్లియో | = | నేడో, రేపో |
| కాయంబులు | = | శరీరములు |
| చెడుగుల్ | = | చెడ్డవారు |

**తాత్పర్యం :**

హే మృత్యుంజయా! ఇంక రెండు మూడు ఘడియలకైననూ కాకపోతే ఇవాళగానీ రేపుగానీ, కాక మరొక యేడాదికైననూ ఈ శరీరము భూమిపై పడక తప్పదు. అయినప్పటికినీ, ఈ మానవులు ధర్మకర్తనులు కాక, నీ పదభక్తిని పొందలేకున్నారు.

| | | |
|---|---|---|
| **105.ప** జితపంకేరుహ | = | పద్మములను జయించిన |
| పాదపద్మయుగళా | = | పద్మములవంటి పాదములుగల ఈశ్వరా! |
| క్షితిలో | = | ఈ భూమిలో |
| దొడ్డ | = | గొప్పవైన |
| తురంగ సామజములు | = | గుఱ్ఱములు, ఏనుగులు |
| ఆందోళకాతతులు | = | పల్లకీల సమూహము |
| సువస్త్రవ్రాత | = | మంచివస్త్రములు |
| భూషాకలాప | = | ఆభరణములు మొదలైనవి |
| తనూజాదికము | = | సంతానము |
| ఏమి దుర్లభము | = | అసాధ్యము! (కావు) |

**తాత్పర్యం :**

హే సర్వశుభంకరా! ఈ ప్రపంచములో ప్రజలు వారి ఆధిక్యమును, భోగలాలసతను నిరూపించుకొనుటకై గుర్రములను, ఏనుగులను, పల్లకీలను, విలాసినులను, వస్త్ర భూషాదులను, సంతానమును హద్దులుగా చెప్పుకొనుచున్నారు. పద్మముల వన్నెను జయించిన పాదములు గల పరమేశ్వరా! నీ పదధ్యానము చేయువారికి, ఇవన్నియు అప్రయత్నముగానే లభించునుగదా!

| | | |
|---|---|---|
| **106.ప** సలిలమ్ము | = | నీరు |
| చళుక ప్రమాణము | = | పుడిసెడు మాత్రమే |
| భవత్ + మౌళి | = | నీ యొక్క శిరస్సుపై |
| చంద్రఖండము | = | చంద్ర రేఖ |

**తాత్పర్యం :**

హే చంద్రశేఖరా! నీ లింగరూపముపై కొంచెము జలము నభిషేకించి, భక్తిపూర్వకముగా ఒక్క పుష్పమును సమర్పించిననూ, అటువంటి మానవుడు ధన్యుడై, గంగజటాజూటము చంద్రరేఖ గల నీ శుభస్వరూపమును అతడు గాంచగలడు. ఇదంతా నీ మహత్మ్యమేకదా!

| | | |
|---|---|---|
| **107.ప** నేత్రద్యుతి | = | కన్నుల కాంతి |
| విమలమ్ముల్ | = | స్వచ్ఛమైన |
| కమలాభముల్ | = | పద్మములతో సమానమైన |
| జిత | = | జయింపబడిన |

| | | |
|---|---|---|
| లసత్ | = | ప్రకాశించుచున్న |
| విద్యుల్లతా లాస్యముల్ | = | మెరుపుతీగెల విలాసములు |
| సుమనోబాణ | = | మన్మదుని బాణములకు |
| జయప్రదమ్ములనుచున్ | = | జయమును కల్గించుననుచూ |
| హరి | = | మనోహరమైన |
| మృగ + అక్షీనివహమ్ము | = | లేడి కన్నుల వంటి కన్నులు గల స్త్రీ యొక్క |

**తాత్పర్యం :**

శ్రీకాళహస్తీశ్వరా! కొందరు తమకు తాము అంతర్ముఖులై, జీవాత్మ పరమాత్మ సంయోగమును కాంచలేక ఆ దివ్యానందమును భరింపలేక, విద్యుల్లతల వంటి లాస్యము గల, మృగాక్షులను (సుందరీమణులను) కాంచుచుందురు.

108. ప. పటవద్రజ్జుభుజంగవద్రజత విభ్రాంతి స్ఫురచ్ఛుక్తి వ
ద్ఘటవచ్చంద్ర శిలాజపాకుసుమ రుక్సాంగత్య వత్తంచు వా
క్పటిమల్నేర్తురు చిత్సుఖంబనుభవింపన్ లేక దుర్మేధనుల్
చిటుకన్నం దలపోయజాతు రథముల్ శ్రీకాళహస్తీశ్వరా!

**కవి పరిచయం :**

ధూర్జటి మహాకవి 16వ శతాబ్దానికి చెందినవాడు శివభక్తుడు. శ్రీకాళహస్తీశ్వర మహత్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం. అనే రెండు ఉత్కృష్ట గ్రంథాలను రచించాడు. ఇతడు వాఙ్మనః కర్మలతో ఈశ్వరునే ధ్యానించేవాడు. శతక సాహిత్యంలో అత్యుత్తమమైనది శ్రీకాళహస్తీశ్వర శతకం. మొదట ఇతడు శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో అష్టదిగ్గజ కవులలో ఒకడుగా ఉన్నట్లు తోచును. కానీ, శ్రీకాళహస్తీశ్వర శతకంలో ఎక్కడా కృష్ణదేవరాయల పేరు కన్పించదు. పైగా రాజనింద కనపడుతుంది. ఈ శతకంలో కూడా కవి ధూర్జటి పేరు ఎక్కడా ప్రస్తావించబడలేదు. క్రీ.శ.1740లో కస్తూరి రంగకవి శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని ధూర్జటి రచించినట్లుగా ప్రతిపాదించాడు. అంతేగాక శ్రీకాళహస్తీశ్వరమహత్యం, శ్రీ కాళహస్తీశ్వర శతకం ఈ రెంటిలోని రచనా సంవిధానం, శైలి పారమ్యం ఒకే విధముగా ఉంటాయి. ఈ శతకంలో ప్రధానంగా, రాజు తిరస్కారం భక్తి వైరాగ్య భావనలు కవి హృదయపు లోతుల నుండి ఆవిష్కరించబడ్డాయి.

**సందర్భం :**

కుహనాపాండిత్యము గలవారు, అమాయకులైన ప్రజలకు ఎట్లు దుర్బోధలు గావింతురోయని ధూర్జటి వారిని నిందించు సందర్భంలోని దీపద్యం.

**ప్రతిపదార్థాలు :**

| | | |
|---|---|---|
| శ్రీకాళహస్తీశ్వరా! | = | పరమేశ్వరా! |
| అధముల్ | = | నీచులు |
| దుర్మేధనుల్ | = | దుష్టబుద్ధి గలవారు |
| పటవత్ | = | వస్త్రమందలి |
| రజ్జు | = | దారములను |
| భుజంగవత్ | = | పాములనియూ |
| ఘటవత్ | = | కుండలోని |

| | | |
|---|---|---|
| రజితవిభ్రాంతి | = | వెండివలె భ్రాంతి కల్గించి |
| స్ఫురత్ | = | ప్రకాశించు |
| శుక్తివత్ | = | ఆల్చిప్పలను |
| చంద్రశిలా | = | చంద్రకాంత శిలలనియూ |
| జపాకుసుమ | = | ఎఱ్ఱని మందారపూలను |
| రుక్ + సాంగత్యవత్ | = | సూర్యకిరణములనియు |
| అనుచున్ | = | అని బోధలు చేస్తూ |
| వాక్పటిమన్ | = | మాటల గారడీతో (చాతుర్యముతో) |
| చిత్+సుఖంబు+అనుభవింపన్ లేక | = | జ్ఞాన సిద్ధిని పొందలేక |
| చిటుకు + అన్నన్ | = | చిటుక్కుమన్ననూ |
| తలపోయజాతురు | = | ఏవో అర్థములు చెప్పుదురు |

**తాత్పర్యం :**

పరమేశ్వరా! నీచులైన దుర్మార్గులు కొందరు తమ మాటల గారడీతో ఏవేవో అర్థాలు కల్పించి చెబుతుంటారు. వస్త్రములోని దారాలను పాములని, కుండలోని నీటిలో ఉండే ఆల్చిప్పలను చంద్రకాంత శిలలని, మందార పువ్వులను సూర్యకిరణాలని తమకుహనా పాండిత్యము ప్రదర్శించుతారు.

**సంధులు :**

| | | |
|---|---|---|
| స్ఫురత్ + శుక్తి | = | స్ఫురచ్ఛుక్తి (శ్చుత్వ సంధి) |
| చిటుకు + అన్నన్ | = | చిటుకన్నన్ (ఉకార సంధి) |

**సమాసాలు :**

| | | |
|---|---|---|
| వాక్పటిమ | = | వాక్కు యొక్క పటిమ (షష్ఠీ తత్పురుష సమాసం) |

**విశేషాంశాలు :**

ఈ పద్యం ధూర్జటి దీర్ఘ సంస్కృత సమాస భూయిష్ఠ రచనకుదాహరణ. కుహనా పండితులు ఆకాలంలో కూడా ఎటువంటి దుర్బోధలు చేసి ప్రజల నాకట్టుకుంటారో చక్కని ఉపమానాలతో ఇందులో వివరించాడు ధూర్జటి. సత్యాసత్యాలకు మధ్య తారతమ్యం తెలుసుకోవాలని ఒక హెచ్చరిక ఇది. అసలైన చిత్సుఖాన్ని పొంది ఆత్మానందాన్ని అనుభవించేవారెవ్వరూ ఇటువంటి అకృత్యాలు చేయరని ధూర్జటి వివరిస్తున్నాడు.

**ఛందస్సు :**

| స | భ | ర | న | మ | య | వ | |
|---|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U | |
| పటవ | ద్రజ్ఝఝ | జంగవ | ద్రజిత | విభ్రాంతి | స్ఫురచ్ఛు | క్తి వ | (ద్ఘ) |

ఇందు 'స, భ, ర, న, మ, య' - అను గణములున్నవి గాబట్టి ఇది మత్తేభ పద్యపాదము. 1-14 యతి స్థానము. 'ప-భ్రా' ప్రాస నియమము కలదు.

## 7.2 సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 72.ప. నాశీలంబుణువైన మేరువనుచున్ రక్షింపవే

**కవి పరిచయం :**

ఈ వాక్యం ధూర్జటి రచించిన శ్రీకాళహస్తీశ్వర శతకంలోనిది. ఇతడు 16వ శతాబ్దానికి చెందిన కవి. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలోని అష్టదిగ్గజ కవులలో ఒకడని ప్రతీతి. శ్రీకాళహస్తీశ్వర శతకమే కాకుండా, శ్రీకాళహస్తీశ్వర మహత్మ్యమనే గ్రంథాన్ని గూడ ఇతడు రచించాడు. గొప్ప శివభక్తుడు.

**సందర్భం :**

ధూర్జటి శ్రీకాళహస్తీశ్వరుని, తనను రక్షింపుమని శరణు వేడుకునే సందర్భంలోనిది.

**వ్యాఖ్య :**

'నా నడవడిక అణువంత అత్యల్పమైననూ మేరుపర్వతమంతగా భావించి రక్షింపుము'

ఈశ్వరా! నేను శ్రీశైలేశుడైన మల్లికార్జుని పోయి సేవించలేను. కంచిలో గల ఏకామ్రనాధుని గూడ పూజింపలేను. ఎంతో దూరమందు గల కాశీవిశ్వేశ్వరుని కడకు వెళ్ళలేను. మహాకాళేశ్వరుని కూడా దర్శించలేను. అశక్తుడనైన నన్ను రక్షింపుము. నా ప్రవర్తన, శీల సంపద అత్యల్పమైప్పటికీ దానినే మేరువంత గొప్పగా భావింపుము. అనగా తన నడవడికలో దోషములే ఎక్కువగా ఉన్నప్పటికీ వాటిని పరిగణింపకుమని కవి ప్రార్థించుచున్నాడు.

### 75.ప. 'మాయావిద్యచే ప్రొద్దుపుచ్చి వినోదింపంగ దీననేమి ఫలమో"-

**కవి పరిచయం :**

(72వ పద్యానికి చెప్పినదే అన్ని పద్యములకు వ్రాయవలెను)

**సందర్భం :**

భగవంతుని లీలా వినోదాల పట్ల అనేక సందేహాలు కవి వ్యక్తం చేస్తున్నాడు. ఈ సృష్టిలోని ప్రాణులన్నింటికీ తానే కర్తయై కర్మేంద్రియ జ్ఞానేంద్రియాల నిచ్చి, వాటితో చేసిన కర్మయే మళ్లీ పాపహేతువువెందుకైనాయని ఈశ్వరుని కవి ప్రశ్నించు సదర్భం లోనిదీ వాక్యం.

**వ్యాఖ్య :**

'నీవు మాయ అనెడి విద్యతో ఎందుకు కాలక్షేపం చేయుచున్నావు? దీనివల్ల నాకేమి ఫలము కలుగును?'

ప్రాణులందరికీ భుజించుటకు నాలుక, వినుటకు చెవులు, చూచుటకు కన్నులు, సంతోషంకొరకు స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణ, ప్రేమ కల్పించి, మళ్లీ, ఆ కార్యాలకు, పాప కారణాలుగా ఎందుకు చేస్తున్నావు? ఈ అమాయక ప్రాణుల పట్ల నీమాయా విద్యనెందుకు ప్రదర్శిస్తున్నావు? దీని వల్ల నీకేమి ఫలము?

### 77.ప. 'శంకవోదరయం గుమ్మడికాయలోను యవగింజంతైన"-

**సందర్భం :**

భగంతుని గూర్చి తెలియజెప్పే జ్ఞానమే జ్ఞానము. ఇతర శాస్త్ర జ్ఞానం ఎంత నేర్చినప్పటికీ అవి మానవుని భౌతిక సుఖాలకు మాత్రమే పరిమితమౌతాయి అని ధూర్జటి తన అంతరంగాన్ని ఆవిష్కరించే సందర్భంలోనిదీ వాక్యం.

**వ్యాఖ్య :**

'సందేహం గుమ్మడి కాయంత ఉండగా, అందులో ఆవగింజంత పరిమాణమైననూ నివృత్తి కాలేదు'

"ఎన్నో మంత్రతంత్రాలు పరిశీలించాను. సాంఖ్యాది యోగ రహస్యాలనెన్నింటినో పెద్దలు చెప్పగా విన్నాను. వేద శాస్త్రాలను పఠించాను. కాని, గుమ్మడికాయలో ఆవగింజంత కూడా నా సందేహం తీరలేదు. నీవే దయతో మోక్షమార్గాన్ని అనుగ్రహించు' - అని ధూర్జటి పరమేశ్వరుని వేడుకుంటున్నాడు.

81.ప. **'కాదా ముంగిలి వారణాసి కడుపే కైలాసశైలంబు'-**

**సందర్భం :**

ఈశ్వరుని పాదపద్మాల మీద ధ్యానసిద్ధి కలిగినచో మిగిలిన పుణ్యక్షేత్రాలను దర్శించవలసిన అవసరం లేదు అని కవి చెప్పు సందర్భంలోనిది.

**వ్యాఖ్య :**

'ముందు వాకిలే వారణాసి, కడుపే కైలాస శిఖరము కాదా!'

భక్తులందరూ కేదారము మొదలైన సమస్త తీర్థాలను దర్శించడానికి వెళ్ళుట ఎందుకు? స్థిరమైన చిత్తములో నీ పాదపద్మాలను ఆశ్రయిస్తే అజ్ఞానమనే దరిద్రం నుండి ప్రాణులందరు విముక్తులౌతారు. అటువంటపుడు ముంగిలే వారణాసి, కడుపే కైలాసమౌతుందని కవి చమత్కరిస్తున్నాడు.

93.ప. **'నియమంబెంతో ఫలంబు నంతియకదా'**

**సందర్భం :**

'పిండిని బట్టే రొట్టె' - అనే నానుడి లోకంలో ఉన్నదే. అలాగే పూజనుబట్టే ఫలితముంటుంది కదా! అని ధూర్జటి చెప్పు సందర్భంలోనిదీ వాక్యము.

**వ్యాఖ్య :**

'నియమాలను బట్టే ఫలితముంటుంది కదా!'

కొందరు భక్తులు, తమమీద నీ దయను అనుగ్రహించమని ప్రార్థిస్తుంటారు. భక్తిని బట్టే ఫలితముంటుంది కదా! ఎంతగా తినాలని కోరిక ఉన్నప్పటికీ, పిండిని బట్టే రొట్టె కదా! ఈశ్వరా! సత్క్రియలతో నిన్ను సేవిస్తే ఇష్ట సుఖములు ప్రాప్తించకుండా ఉంటాయా?

95.ప. **'నీ శ్రీ భాండారములో కొఱంత వడునా!'-**

**సందర్భం :**

'భక్తులందరు నిన్ను సేవించుచుండగా వారి కోర్కెలు దయతో తీర్పరాదా! ఆ విధంగా వెంటనే తీర్చినచో నీ ఐశ్వర్య భాండాగారములో కొఱతపడునా? - అని భగవంతుని కవి ప్రశ్నించు సందర్భంలోనిదీ వాక్యం.

**వ్యాఖ్య :**

'నీ ఐశ్వర్య భాండాగారములో లోటు కలుగునా?'

పదివేల రకాలుగా నీ భక్తులందరూ నిన్ను సేవించుచున్నారు. దయా సముద్రుడవైన నీవు వారి కోర్కెలు తీర్చుటలో లోభమెందుకు? వారికి పరమార్థాన్ని అనుగ్రహించినట్లైతే నీ మహదైశ్వర్యమునకు లోటు రాదు కదా!

**101.ప "ఇల్వెడలం(ద్రోచిన(జూరువట్టుకొని నే(వ్రేలాడుదున్"-**

**సందర్భం :**

చెడు స్నేహాలతో ఇంతకు ముందు చేయరాని పనులు చేశాను. నీవు నా కృపకు అర్హుడవుగావని త్రోసివేసినప్పటికీ నీ పాద ధ్యానాన్ని వదలనని కవి ఆవేదనతో చెప్పు సందర్భంలోనిది.

**వ్యాఖ్య :**

"ఇంటి నుండి వెళ్లగొట్టిననూ, చూరు పట్టుకుని వ్రేలాడుదును'

పూర్వ జీవితములో చెడు స్నేహాలు మరిగి, చేయరాని తప్పులు చేసితిని. ఆ కారణము చేనీవు నా కరుణ పొందడానికి అర్హత లేదని నీవు గెంటివేసినప్పటికీ, నేను నిన్ను వదలను. నేను కోరుకున్న పరమార్థం సిద్ధించేదాక నిన్ను సేవిస్తాను.

**104.ప. 'ధర్మమార్గమొకటింబాటింపరీమానవుల్'**

**సందర్భం :**

నేడు కానీ రేపు కానీ ఈ శరీరమునకు మరణము తప్పదు. అది తెలిసి కూడా ఈ మానవులు ధర్మమార్గమున ఎందుకు చరించరు? అని ధూర్జటి ప్రశించు సందర్భములోనిదీ వాక్యం.

**వ్యాఖ్య :**

'ఈ మానవులు ఒక్కటిగూడా ధర్మమార్గమును అనుసరించరు'-

రెండు మూడు గడియలకో, కాకపోతే నేడో, రేపో, మరొక యేడాదికో గానీ ఈ శరీరము భూపతనమగును. భౌతిక శరీరమెన్నడూ శాశ్వతము కాదు. అయిననూ మనుషులు ధర్మ కార్యములను ఆచరించుటలేదు. నీమీద భక్తిని పెంపొందించుకొనుట లేదు.

**ముగింపు :**

ధూర్జటి తాను గొప్పవాడిని కానని, ఎన్నో పాపాలు చేసి ఉంటానని, గొప్పదైన మహమాన్వితమైన ఏ శైవక్షేత్రానికి వెళ్లలేదని, శివుని పూజించలేదని అయినా తనను బిడ్డగా చూసుకొని తప్పులను క్షమించి మోక్షాన్ని ప్రసాదించమని పరమేశ్వరుని ప్రార్థించిన తీరును తెలుసుకున్నాం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. మహాకవి ధూర్జటి కవిత్వము - వ్యక్తిత్వము : డా॥ పొన్నెకంటి హనుమంతరావు.

2. సాహిత్య చరిత్ర : డా॥ ద్వానా శాస్త్రి.

3. తెలుగు కవిచంద్రులు చేసిన వీనులవిందు : కర్రి నాగార్జునశ్రీ.

**డా॥ జి. వైదేహి**
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,
రీడర్ - తెలుగు శాఖ
టి.జె.పి.యస్. కళాశాల, గుంటూరు

**పాఠం : 8**

# శ్రీకాళహస్తీశ్వర శతకము

(ప్రశ్నలు - సమాధానాలు)

**- ధూర్జటి**

**శీర్షికలు :**

8.0 లక్ష్యం

8.1 ప్రశ్నలు - సమాధానాలు

## 8.0. లక్ష్యం :

శ్రీ కాళహస్తీశ్వర శతకంలోని ప్రశ్నలను వాటి సమాధానాలను తెలుపుటయే దీనిలోని ప్రధానాంశం.

## 8.1. ప్రశ్నలు - సమాధానాలు :

**1. ధూర్జటి భక్తి తత్పరతను వివరించుము ? (లేదా)**
**శ్రీ కాళహస్తీశ్వర శతకమునననుసరించి పరమేశ్వరునిపట్ల ధూర్జటికి గల భక్తి ప్రపత్తులు ఎటువంటివి ?**

జ॥ శ్రీ కృష్ణ దేవరాయల సభాభవనము నలంకరించిన అష్టదిగ్గజకవులలో ధూర్జటి ఒకడు. ధూర్జటి మనుమడగు కుమార ధూర్జటి తన కృష్ణరాయ విజయమునందు చేసిన ప్రశంసనుబట్టి ధూర్జటి రాయల ఆస్థానమున ఉండెనని ఊహించుటకు అవకాశము కలుగుచున్నది. కాని కాళహస్తీశ్వర శతకములో మాత్రము కృష్ణరాయలను గూర్చి ప్రస్తావన ఎక్కడ కనిపించదు. మొత్తము మీద ఈ కవి 16వ శతాబ్దానికి చెందినవాడనుట మాత్రము నిస్సందేహము.

ధూర్జటి శివభక్తి తత్పరుడు. శైవ విజ్ఞానమున సంపూర్ణ పాండిత్యము గలవాడు. అయినను అద్వైత విద్యానిధి. సాంఖ్యాదియోగ శాస్త్రములను చదివినవాడు. విపులమైన మంత్రతంత్రాది శాస్త్రములను పరిశీలించిన తత్త్వవేత్త. జీవితమును సంపూర్ణముగ అనుభవించి తుదకు సంసారమును రోసి వైరాగ్యమును పొందిన భక్త కవి. రక్తి నుండి విరక్తిని పొందిన జ్ఞాని.

ఇతడు శ్రీకాళహస్తి మహాత్మ్యము, శ్రీ కాళహస్తీశ్వర శతకము అను రెండు గ్రంధాలను రచించాడు. ఈ రెండు గ్రంథాలు భక్తి రసప్లావితములు. రాయల ఆస్థానములో ఉన్నప్పటికీ తన గ్రంథాలను ప్రభులైన రాయల కంకితము చేయక శివార్పణము గావించెను.

ఈ భక్తి జ్ఞాన వైరాగ్య సంపన్నమైన ఈ శతకమును, వయో వృద్ధుడైన పిమ్మట ధూర్జటి రచించి ఉంటాడు. మొట్టమొదటి పద్యంలోనే ఈ కవి పొందిన మానసిక పరిణతి పాఠకులకు విదితమౌతుంది. ఈ సంసారమేఘంలో సంపదలు మెరుపు తీగెల వంటివి. అనగా అవి చాలకొద్దికాలం మాత్రమే నిలిచి వుండేవి. ఆ మబ్బుల నుండి కురిసిన పాపాలకు జడివానలో నాతున : పద్మం వికాసాన్ని కోల్పోయింది. ఆ పద్మం తిరిగి వికసించాలంటే నీ కరుణ అను వెన్నెలను నాపై ప్రసరింపజేయుము. చిద్భావనలతో నా జీవితం వృద్ధి పొందుతుందని. భగవంతుని కరుణకోసం పరితపించాడు.

భగవంతుని కరుణా కటాక్షాలు పొందాలంటే నిశ్చలమైన భక్తి ఒక్కటే మార్గం. యజ్ఞయాగాదులు, జపతపాలు, వేద శాస్త్ర పఠనాలు మొదలైన వాటితో అవసరం లేదు. 'క్రిమి కీటకాదులు సైతం అనన్యభక్తితో నిన్ను సేవించి తరించలేదా ! జ్ఞానాన్ని ఉపదేశించే విద్యలన్నీ మిధ్యయే' అని తన అభిప్రాయాన్ని ఇలా వివరించాడు.

*"ఏ వేదంబు పఠించెలూత భుజగం బేశాస్త్రము ల్చూచె, తా*
*నే విద్యాభ్యసనం బొనర్చెకరి, చెంచే మంత్రమూహించె, బు*
*ధావిర్భావ నిధానముల్ చదువులయ్యా కావు ! మీ పాదసం*
*సేవా సక్తియె కాక జంతుతతికిన్ శ్రీ కాళహస్తీశ్వరా !"*

భగవంతుడు సర్వవ్యాపకుడు. ఆ సర్వ వ్యాపకత్వాన్ని దర్శించాలంటే ఆత్మదర్శనం పొంది ఆత్మజ్ఞానం పొందగలగాలి. లేకుంటే 'మన, తన' భేదాలు సర్వసామాన్యమే. ఆ సమ్యగ్దర్శనం కలగాలంటే ఈశ్వర కరుణా విశేషం మన మీద అపారంగా వర్షించాలి. నీటిలో ముంచినా, పాలలో ముంచినా నీవే దిక్కు అని త్రికరణ శుద్ధిగా ప్రతికర్మను భగవదర్పితం చెయ్యాలి. ఈ అనుభూతికోసం పరితపించే హృదయం ధూర్జటిది. అందుకనే 'నీరూపంబు దలంపగా తుదమొదల్‌నే గాన, నీవైనచో రారమ్మనియందు చెప్పవు, -- నీరన్ముంపుము పాలముంపుమిక నిన్నే నమ్మినాడంజుమీ' - అని తన హృదయాన్ని పరమేశ్వరుని ముందు కుప్పపోస్తాడు.

తన సర్వస్వమూ పరమేశ్వరుడని భావించాడు గాబట్టే ఈ భవబంధాలు, తల్లి, తండ్రి, అన్న, తమ్ముడ ఋణానుబంధాలు వ్యర్థమనీ, వీరెవ్వరూ తనను ఆదుకునే వారుకారని, సర్వదోష నివారకుడూ, సర్వపాప సంహారకుడైన ఈశ్వరుడు తాను నమ్మిన దైవమనీ సంసారమనే విషాద సముద్రాన్ని దాటించి శాశ్వతమైన సుఖాన్ని ఇవ్వగలిగిన దేవుడు ఈశ్వరుడేనని తన అంతరంగంలోని భక్తి ప్రపత్తులను నివేదన చేస్తూ

*"నిన్నున్నమ్మిన రీతి నమ్మనొరులన్, నీకన్న నా కన్న లే*
*రన్నల్దమ్ములు, తల్లిదండ్రులు గురుండా పత్సహాయుండు, నా*
*యన్నా ! యెన్నడు నన్ను సంసృతి విషాదాంభోధి దాటించి, య*
*ఛ్చిన్నానంద సుఖాబ్ధి తేల్చెదొలేదో శ్రీకాళహస్తీశ్వరా !"*

అని ప్రార్థించాడు.

అందుకనే నేను 'అమ్మ', 'అయ్యా' అని ఎవ్వరిని సంబోధించనప్పటికీ అది 'నిన్నే అని భావింపు'మంటాడు. 'నాకు తల్లి, తండ్రి, గురువు నీవే కాబట్టి ఈ సంసారమనే చిమ్మచీకటి నామీద కప్పకుండునట్లు రక్షింపు' మంటాడు.

'ఈశ్వరా ! నిన్ను త్రికరణశుద్ధిగా నమ్మి సేవించేవారికి ఎటువంటి గ్రహ దోషాలు, దుర్నిమిత్తాలు అంటవు. నీసేవ చేసిన వారికి క్లేశ బంధాలు తొలగిపోతాయి. అగ్నిహోత్రాన్ని మిడుతలదండు కప్పగలుగుతుందా ! అని ప్రశ్నిస్తాడు.

అనునిత్యం ఈశ్వరనామం జపించేవారికి, వజ్రాయుధం కూడా పువ్వుతో సమానమౌతుంది. అగ్నిమంచులాగా భాసిస్తుంది. సముద్రము కూడా భూమిలాగ నడవడానికి దారిచూపిస్తుంది. శత్రువులు మిత్రులుగా మారతారు. విషము కూడా దివ్యాహారమౌతుంది.

తాను మహాకవినై అనేక శబ్దార్థాలంకారాలతో జనరంజకంగా కవిత్వం చెప్పగలిగిన సామర్థ్యమున్నప్పటికీ, పరమేశ్వరుని దివ్యమంగళ రూపాన్ని వర్ణించడానికి ఈ భాషచాలదు. వీటికి అలభ్యుడు ఈశ్వరుడు. ఈ సత్యం తెలుసుకొన్నాడు ధూర్జటి. అందుకనే కవులమన్న అహంకారం వదలి అవాఙ్మానసగోచరుడైన పరమేశ్వరుణ్ణి భక్తితో వశం చేసుకోవాలిగానీ, కవిత్వంతోగాదని ఉద్బోధిస్తాడు.

*"ఏలీలన్నుతియింప వచ్చునుపమోత్ప్రేక్షాధ్వనివ్యంగ్య శ*
*బ్దాలం కార విశేష భాష కలభ్యంబైన నీరూపమును*
*చాలుంజాలు కవిత్వమున్నిలుచునే సత్యంబు వర్ణించుచో*
*ఛీ ! లజ్జింపరుగాక మీదృశకవుల్ శ్రీకాళహస్తీశ్వరా !'*

భగవంతుని మీద తనకుగల అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటిస్తూ 'నీ కారుణ్యము గల్గినట్టి నరుడే నీచాలయంబుచొరండే కార్పణ్యపు మాటలాడ నరుగండు...' అని, జీవితంలో ఎటువంటి కష్టం ఎదురైనప్పటికీ చీకాకై చెడిపోడని, అంటే స్థితప్రజ్ఞ అతని స్వాధీనమౌతుందని విశ్వసిస్తాడు.

ఎన్ని శైవక్షేత్రాలు దర్శించినా, దర్శించలేకపోయినా, తన శీలమణుతంత మాత్రమేనని, దానినే, మేరు పర్వతమంతగా భావించి దయ జూపించమని వేడుకుంటాడు. ఈ ప్రపంచమంతా భగవంతుని మాయ ఆవరించబడి ఉంటుందని, ఆ మాయను ఛేదించి భగవత్తత్త్వాన్ని తెలుసుకున్న భక్తునికి సత్యస్వరూపం సాక్షాత్కరిస్తుందని పేర్కొంటాడు.

ఎన్ని మంత్రతంత్రాలు నేర్చినా, యోగశాస్త్రాదివిద్యలు తెలుసుకున్నా పరతత్త్వాన్ని గొర్చిన సంపూర్ణమైన అవగాహన తన కింకా అంతుబట్టలేదని వేదనపడతాడు. తన సందేహం గుమ్మడికాయంత ఉండగా, అందులో ఆవగింజంత గూడా ఆరలేదని, తన సందేహనివృత్తిజేసి మోక్షమార్గాన్ని అనుగ్రహింపుమని ప్రార్థిస్తాడు. అజ్ఞాన స్థితి కలిగినప్పుడు మానవులు అజ్ఞానమనే దరిద్రము నుండి విముక్తులౌతారని చెబుతాడు. పిండికొద్దీ రొట్టెయనీ, భక్తితీవ్రతనుబట్టి ఫలముంటుందని తన ఆత్మాకాశంలో ఓంకారనాదం ప్రతిధ్వనిస్తుందని, ఆ నాదరూపుడైన భగవంతుడు విశ్వమంతావ్యాప్తి చెంది ఉంటాడనీ, ఆస్వామి ఆరాధనే భవతారకమనీ ప్రకటిస్తాడు.

ఈ విధంగా, పరిపక్వమైన మనస్సుతో, పరాకాష్ఠ స్థితికి చేరిన భక్తిభావంతో, సమస్తము ఈశ్వరమయం కాగా, తన అంతరంగ ఆవిష్కరణ చేస్తాడు ధూర్జటి ఈ శతకంలో. ఈ విధంగా ఈ శతకంలో ప్రతిపద్యంలోనూ శ్రీకాళహస్తీశ్వరా అని ఎలుగెత్తి తన భక్తి తత్పరతను చాటుకొని శతక వాఙ్మయం మొత్తానికి నాయక మణి మంటి శతాకాన్ని రచనచేసి, తన మనః పరిపూర్ణత్వానికి అక్షరరూపం ఇస్తాడు భక్తాగ్రేసరుడైన ధూర్జటి.

**2. శ్రీ కాళహస్తీశ్వర శతకంలో ధూర్జటి వెలువరించిన వైరాగ్య భావనలు వివరించండి ? (లేదా) ధూర్జటి ప్రదర్శించిన సంసార విముఖత ఎట్టిది ? (లేదా) కాళహస్తీశ్వర శతకాన్ననుసరించి ధూర్జటి యొక్క తాత్త్విక ధోరణి వివరించండి ?**

జ॥ శతక లక్షణాల్లో కవి ఆత్మీయత ప్రతిఫలిస్తుంటుంది. ఇది ప్రధాన లక్షణం. ఈ కాళహస్తీశ్వరశతకం, ధూర్జటి, తన జీవిత సంధ్యా సమయంలో పరిపక్వమైన చిత్తవృత్తితో సర్వసంగపరిత్యాగిగా పరమేశ్వరునికి అర్పించిన కానుక. ఐహికమంతా నిరర్థకమని గ్రహించి, మోక్షమార్గాన్ని ఉపదేశింపుమని ప్రార్థిస్తాడు. తానునేర్చిన విద్యలన్నీ మిథ్యలని భావిస్తాడు. పరమేశ్వరునిమీద అచంచల భక్తి ఒక్కటే తనను భవబంధ విముక్తునిగా చేయగలదని పరిపరి విధాలుగా తన ఆర్తిని స్వామికి నివేదించుకుంటాడు.

ఈ ప్రపంచమంతా అశాశ్వతమైనదనీ, ఎప్పటికైనా మరణం తప్పదని తెలిసికూడా మానవుడు మోహమనే సముద్రంలో పడి కొట్టుమిట్టాడుతుంటాడు. ఆ భ్రాంతిలోనేపడి సంచరిస్తూ పరమాత్మయందు చింతాకంతైనా మనస్సు నిల్పడని ఆశ్చర్యపడతాడు.

***“అంతామిథ్య తలంచి చూచిన నరుండ ట్లౌ టెరింగిన్, సదా***
***కాంతల్పుత్రులు నర్థముల్ తనువునిక్కంబంచు మోహార్ణవ***
***భ్రాంతింజెంది చరించుగాని, పరమార్థంబైన నీయందు, తా***
***చింతాకంతయు చింతనిల్పడు కదా ! శ్రీ కాళహస్తీశ్వరా !’***

‘నేను నిన్ను పూజించినందుకు ప్రతిగా నీవు నాకు జీతమియ్యవద్దు. ఏనుగులను, గుఱ్ఱాలను, సంపదలను కూడా నేనుకోరుకోను. నన్ను మాత్రం ఈ షణ్త్రయాలతోను, రాగద్వేషాలతోను నిండిన సంసారానికి ఒప్పగించవద్దు’ అని వేడుకుంటాడు. అంటే శాశ్వతానందసంధాయియైన మోక్షమివ్వమని ప్రార్థిస్తాడు ధూర్జటి.

‘ఆలున్‌బిడ్డలు తల్లిదండ్రులు ధనంబంచున్మహా బంధనం బేలా నామెడగట్టినాడవని’ పరమేశ్వరుని ప్రశ్నిస్తాడు. ఈ దుఃఖ వారాశిలో మునిగి నిన్ను సేవించలేకపోతున్నానని బాధపడతాడు.

‘యవ్వనంలో ఉన్నప్పుడు నిత్యము కామకేళీమత్తుడైనాను. ‘కాయల్గాచె వధూనఖాగ్రములకు కాయంబు’। కాబట్టి ఇంకనైనా నాకు వైరాగ్యాన్ని ప్రసాదించమని అర్థిస్తాడు ధూర్జటి.

ఎంతటి యోగీశ్వరులకైనా మనస్సును నిశ్చలంగా చేయటం అసాధ్యం. ఈ మనస్సును ఎంతగా దిగ్బంధనం చేసినప్పటికీ, అది అత్యంత వేగంగా సంసారసుఖాలవైపు పరుగులు పెడుతుంది. ఎలా బంధించాలి దీన్ని ? త్రుళ్ళిపడే మనస్సును ఎలా అదుపులో పెట్టాలి ? నీవే దీని పొగరు అణచగల సమర్థుడివి. లేకపోతే ఒక ప్రక్క కామినీజన సౌఖ్యాన్ని అసహ్యించుకుంటూనే మళ్ళీ ఆవైపే పరుగు పెడుతుంది. 'పుత్రమిత్ర ధన సంపద్భ్రాంతి'ని వదలీవదలకుండా ఉంది. 'నీకు సంప్రీతిగా సత్క్రియాలు చేసీ చేయనట్లుంటుంది. ఇలా ద్విధా ప్రవర్తించే ఈ మనస్సును అదుపులోకి తీసుకురావడానికి నీకే సాధ్యమౌతుంది' - అని పరోక్షంగా తనను ఉద్ధరించే భారాన్ని ఆ పరమేశ్వరుని మీదనే పెడతాడు ధూర్జటి.

బ్రతుకుమీద తీపి సర్వప్రాణులకు సహజమే. అయినా జీవచ్ఛ్రాద్ధము పెట్టుకున్న సన్యాసులు కూడా, తమకు మృత్యువు చేరువౌతుందని తెలిసి 'తన్నే వైద్యుడు చికిత్స బ్రోవగలడో ! యేమందు రక్షించునో' ? అని అన్ని దిక్కులకు పరుగులు పెడతారు. అంతేకానీ, జీవిత చరమాంకంలోనైనా నిన్ను ధ్యానించుదామనే బుద్ధి వారికి కలుగదు - ఎంత చిత్రమోకదా ! అని లోకరీతికి, మాయా మోహాలు త్రెంచుకోలేని ప్రాణుల జీవన భ్రాంతికి, ఆశ్చర్యపడతాడు ధూర్జటి.

ఈ భ్రాంతి నుండి బయటపడి పరిణితమైన చిత్తంతో 'బ్రతికినంతకాలం బ్రతికాను. నేను ఎన్నేళ్ళిక జీవించగలను ? నేనెవ్వరిని రక్షించాల్సిన అవసరమూ లేదు. కాబట్టి నన్ను చిన్నబుచ్చక ఏలుకొమ్మ'ని వైరాగ్యాన్ని ప్రకటిస్తాడు.

ఈ సంసారమనే అంబుధి చాలాలోతైనది అంతేకాదు ఇదొక సంకెలగొలుసు వంటిది. ముందు 'భార్య' అనే బంధాన్ని మెడకు కట్టి, ఆమెయందు సంతానాన్ని కల్పించి, వారివలన బంధుత్వాలు పెరిగి పోయి ఛేదించరాని ఈ సంకెళ్లలోనే మనిషి నిత్యం కొట్టుమిట్టాడు తుంటాడు. ఇంకనైనా ఈ బంధాల నుండి విముక్తుణ్ణి చెయ్యమని తన సంసార వైముఖ్యాన్ని ప్రదర్శిస్తాడు కవి.

కామక్రోధాదులను అరిషడ్వర్గాలు మనిషిని నిరంతరం వేధిస్తాయి. అమర స్త్రీలతో సుఖించిననూ నీమోహం తగ్గదు. బ్రహ్మపదము సిద్ధించినప్పటికీ మనిషికి ఆశ తీరదు. లోకాలన్నింటినీ మ్రింగినప్పటికీ క్రోధమనే ఆకలి తీరదు. 'ఇటువంటి సౌఖ్యాలను నామనస్సిపుడు కోరుకొనుటలేదు. నీసేవ చేసి, ఈ మహాపాతక వారాశిని దాటగలను' - అని మోహభ్రాంతి నుండి బయటపడి నిశ్చలమైన మనస్సుతో తరణోపాయాన్ని వెతుక్కుంటాడు ధూర్జటి.

నిశ్చలభక్తితో జ్ఞానస్థితిని పొంది, తద్వారా వైరాగ్యాన్ని అనుభవించి, మనస్సన్యాసియైన పిదప ఇదే తనకు ఆఖరు జన్మ కాగలదని ప్రకటిస్తాడు. ఈ జన్మలోనే మోక్షపదాన్ని అనుగ్రహించమని ప్రార్థిస్తాడు.

ప్రవచనాలు చెయ్యటంవేరు. వాటిని ఆచరించి చూపించడంవేరు. కొంతమంది డాంబికంగా, వేద శాస్త్రాదులన్ని అభ్యసించామనీ, ఈశరీరమే శాశ్వతమనీ, సత్యదర్శనము చేశామనీ సభలలో ప్రసంగిస్తూ ఉంటారు. కాని, నిజానికి వారెవరూ అరిషడ్వర్గాలను జయించి, సుస్థిరమైన జ్ఞానాన్ని పొందలేదు. అంటే, ఆనాటి సంఘంలో కూడా వృథా ప్రవచకులూ, డాంబికాలు ప్రదర్శించేవారు ఉండి ఉంటారు. వారినిక్కడ నిర్భీతిగా విమర్శిస్తున్నాడు ధూర్జటి.

ఈ సంసార బంధాలు 'కాసంతైన సుఖంబొనర్చునో ? మనః కామంబులీడేర్చునో ? జగద్విఖ్యాతి గావించునో ? వీసంబైనను వెంట వచ్చునో ?' - ఏమీ ఇవ్వలేవు. ఈ సంసార దురాశ ప్రాణులకు ఎందుకు తొలగించవని ప్రశ్నిస్తాడు.

మరణము సహజమైనదని తెలిసినప్పటికీ, తాతలు, తండ్రులూ మరణిస్తున్నప్పటికీ, మనిషి తాత్కాలిక వైరాగ్యాన్ని పొందుతాడు గానీ, శాశ్వత వైరాగ్యాన్ని పొంది, భవబంధాల నుండి విముక్తుడు కాలేడు కదా ! యని పశ్చాత్తాప పడతాడు.

ఈ విధంగా ప్రతిపద్యంలోనూ పండిన గుండెతో రాగరహితమైన మనస్సుతో, ఐహికసుఖాలు మెరుపుతీగెల వంటివని, పరమేశ్వరుని కరుణమాత్రమే దేహ భ్రాంతిని తొలగించగలదనీ, స్వయంగా అనుభవించి ఆ మార్గాన్ని అనుసరించి జీవన్ముక్తిని పొందిన మహనీయుడు ధూర్జటి కవీంద్రుడు.

### 3. శ్రీ కాళహస్తీశ్వర శతకాన్ని అనుసరించి ధూర్జటి వ్యక్తిత్వాన్ని వివరించండి ?

జ॥ శతకములన్నిటంటిలో దాదాపు ఆత్మాశ్రయ లక్షణము ప్రధానము. కేవలము కవి ఆత్మీయతను, అనుభూతులను, ఆశయాలను వెల్లడించడానికి కవి శతకరచన కుపక్రమిస్తాడు. పరాశ్రయ కవిత్వ ప్రధానమైన ఇతర కావ్యాలలో, ఈ అనుభూతి ఆవేశాలు ఏదైనా పాత్రపరంగా కవి ప్రకటించాలిగానీ, కావ్యంలో ప్రత్యక్షంగా చెప్పుటకు వీలులేదు. ధూర్జటి రక్తి నుండి విరక్తిని పొందిన మహాకవి కాబట్టి పశ్చాత్తాపంతో తన హృదయాన్ని చీల్చుకుని వచ్చిన భావాలన్నింటినీ దాపరికం లేకుండా ఇందులో వివరించాడు. పరిశీలనము, అనుభూతి, వ్యవహారజ్ఞానము శతకరచనకు మూలస్తంభాలని చెప్పవచ్చు. అనుభవరాహిత్యములో మనిషి ఉన్నతుడుకాలేడు. మనః పరిపాకము, చిత్తశుద్ధి లభించవలెనన్న, ఎన్నో జీవితానుభవాలను కవి ఎదుర్కొని ఉండాలి. ఈ శతకంలో ధూర్జటి వ్యక్తిత్వాన్ని తెలుసుకోవడానికి ప్రధానంగా మూడు లక్షణాలను పరిగణింపవచ్చును. అవి రాజగర్హణము, శివభక్తి, లోకజ్ఞత.

**రాజనింద :** 'శ్రీకృష్ణరాయ కిరీట కీలిత మణిగణార్చిత పదాబ్జద్వయశ్రీ వహించి'న ధూర్జటి రాజనింద ఎందుకు చేశాడని పాఠకుడు సందేహిస్తాడు. రాయల అనంతరము ధూర్జటి నాదరించి, ఆతని కవిత్వమును ఆరాధించిన రాజులులేరు. సత్కవిత్వము, సత్కవులను ఆదరింపగల హృదయ పరిపాకములేని 'రాజ' నామమాత్రుల వలన, ధూర్జటి మనః క్లేశము పొందియుండును. రాజాశ్రయము పోయిన తరువాత ధూర్జటి ఆర్థిక క్లేశములకు గుర్రై, దారిద్ర్యముతో బాధపడియుండును. కలిమిగల దినములలో బంధువులు, జ్ఞాతులు భార్యాపుత్రులు చూపిన ప్రేమ, కలిమిలేనపుడు చూపించరు. ఇది సహజమే. ఈ పరిస్థితులకు సున్నిత మనస్కుడైన కవి, ఎంతో బాధపడి, వైరాగ్యాన్ని పొందాడు. ధూర్జటికి 'రాజ' శబ్దమే పరమ అసహ్యమైనదిగా కనిపిస్తుంది. ప్రభువుల నుద్దేశించి అతడు 'రాజలోకాధముడు, రాజకీటములు, నృపాలాధములు, భూభృచ్చండాలుర'ని పేర్కొన్నాడు. అంతేకాదు 'రాజుల్మత్తులు, మూర్ఖులు, లోకకంటకులనియు, రాజంటే ధర్మము, క్షమ, సత్యభాషణము సౌజన్యము గలవాడేనని, జన్మాంతరమందైన రాజశబ్దమును తాను అంగీకరింపనని ప్రకటించాడు.

ఈ శతకంలో సుమారుగా పద్దెనిమిది పద్యాలతో ధూర్జటి రాజనింద చేశాడు. మత్తులైన రాజుల సేవలలో అతని మనస్సు విసిగిపోయింది. వారినాశ్రయించి, వారు కానుకలుగా అందించు 'అంభోజాక్షి చతురంతయాన తురగీ భూషాదులాత్మ వ్యధా బీజములు' జీవిత ప్రారంభ దశలో వీటన్నింటిని అనుభవించి పరితృప్తిని పొందాడు. కాని ఇవేవీ తనకు మోక్షలక్ష్మిని అనుగ్రహించలేవు. శాశ్వతమైన ఆ సంపదను అనుగ్రహించమని కాళహస్తీశ్వరుని ప్రార్థిస్తాడు.

*"మదమాతంగ ములందలంబులు హరుల్ మాణిక్యము ల్పల్లకుల్*
*ముదితల్ చిత్ర దుకూలముల్పరి మళంబుల్మో క్షమీజాలునే*
*మదిలో వీనిన పేక్షచేసి నృపధామ ద్వార దేశంబు గాం*
*చి దినంబుల్ వృధ పుత్తురజ్ఞులకటా శ్రీకాళహస్తీశ్వరా !' -*

రాజ సేవచేయుట కాలము వ్యర్థము చేయుటేయని కాబట్టి ఆ భోగభాగ్యాలనపేక్షించకూడదని ధూర్జటి పలుకుతున్నాడు. ధర్మాన్ని రక్షించాల్సిన రాజే అధర్మపరుడై అర్థాతురుడైతే ధర్మానికెక్కడ చోటుంటుందని ప్రశ్నిస్తాడు. ఈ 'రాజకీటముల సేవించుట' కంటే, 'నీపంచలో పడియుండి భిక్షాన్నమైనా చాల'ని కోరుకున్నాడు. 'అనేక యుగాల తరబడి పరిపాలించిన పూర్వరాజులు కూడ మరణించారు. కాని కొందరు రాజులు తమ పదవులు, అధికారాలు శాశ్వతమని మిడిసిపడుతుంటార'ని ఒకే పద్యంలో తన నిరసనను వ్యక్తం చేశాడు.

'ఈ నీచులైన రాజులను సేవించుటకంటే కొండలలో, కోనలలో నివసించి, కందమూలాలు భుజించి, చిగురుటాకుల సెజ్జపై నిద్రించి, ఆత్మతో శివుని ధ్యానించుట సర్వ శ్రేయోదాయకము' అని రాజగర్హణము చేశాడు.

రాజసేవ, భగవత్సేవలందేది మేల్తరమో, శ్రేయస్కరమో తెలియజాలనివారు మాత్రమే రాజసేవ చేయుదురు. సిరులనపేక్షించి, రాజశ్రేణికి దాసులగుటకంటె, ఈ జన్మను తరింపచేయగల ఈశ్వరుని సేవించుట మేలని భావించాడు.

కొంతమంది, తాముదేవుని తప్ప అన్యులను పొగడమని డాంబికాలుపల్కుతూ 'పుత్రీపుత్ర కళత్ర రక్షణ కళాబుద్ధి'తో అనగా, భార్యా బిడ్డలను పోషించు నిమిత్తము రాజాధములను స్తోత్రము చేయుచూ పొట్టనింపుకుంటున్నారని గర్హించాడు. ఇలా అనేక పర్యాయాలు, పలు సందర్భాలలో నిర్భీతిగా రాజనిందగావించాడు ధూర్జటి.

సాధారణంగా మానవులందరూ పుత్రులకోసమే పరితపిస్తూ ఉంటారు. వంశాన్ని నిలబెట్టేవాడని, వృద్ధాప్యంలో ఆధారంగా ఉంటాడని, పున్నామ నరకంనుండి తప్పించడానికి, తాము మరణించాక శ్రద్ధగా అపరకర్మలు చేస్తాడని మనుషులు భావించడం సహజం. అయితే సంతానం లేనివారి మాటేమిటి ? ఇవన్నీ భ్రమలు మాత్రమేనని, మానవులను సంసార సాగరం నుండి తరింప చేయగలిగినది నిశ్చల భగవద్ధ్యానము మాత్రమేనని ఒక పద్యంలో వివరిస్తున్నాడు.

*"కొడుకుల్ పుట్టరటంచు నేడ్తురవివేకుల్ జీవనభ్రాంతులై*
*కొడుకుల్ పుట్టరె కౌరవేంద్రునకనేకుల్ వారిచే నేగతుల్*
*వడసెం బుత్రులు లేనియా శుకునకున్ బాటిల్లెనే దుర్గతుల్*
*చెడునే మోక్ష పదంబపుత్ర కునకున్ శ్రీకాళహస్తీశ్వరా !"*

అవివేకులైన మానవులు జీవనభ్రాంతిలో తమకు పుత్ర సంతానం లేదని దుఃఖిస్తూ ఉంటారు. ధృతరాష్ట్ర మహారాజుకు నూర్గురు కుమారులు కలుగలేదా ! వారిచే అతడు ఎటువంటి దుర్గతులు పొందాడు ? శుక మహర్షి సంసార భ్రాంతిలేనివాడు. ఆజన్మ బ్రహ్మచారి. దివ్యజ్ఞాన సంపన్నుడు. మరి అపుత్రకుడైన ఆ మహర్షికి మోక్షం లభ్యం కాలేదా ! కాబట్టి ఇవన్నీ మోహాబ్ధిలో పడిన మనిషి గావించే ఆలోచనలు మాత్రమేనని చెబుతున్నాడు. ఇది ధూర్జటి కాలంనాటికే గాదు. ఈనాటికీ, ఏనాటికీ గూడ సమాజంలోని మానవులందరూ గమనింపవలసిన సత్యం. ఆ మహాకవి పలుకులు ప్రజలందరకు మార్గదర్శకాలు.

ధూర్జటి దాయాదులవలన కూడ గొప్ప బాధలనుభవించినట్లు ఒక పద్యంలో చెప్పుకున్నాడు. 'జ్ఞాతులుద్రోహులనియు, వారు కపటబుద్ధితో ఈర్ష్యాసూయలతో చేయు దుష్కార్యాలను సహించలేను. మాతండ్రిమీద ఒట్టుపెట్టి చెపుతున్నాను. వారికి తిరిగి ప్రతీకారం తీర్చుకోవాలని మనస్సు రగిలిపోతున్నప్పటికీ, నేను నీ భక్తుడినైన కారణంగా, దుర్మార్గపు పనులు తగదని మిన్నకున్నానని' చెప్పుకున్నాడు.

ఒక సందర్భంలో అమాయకులైన ప్రజలను మోసంచేస్తూ తమకంటే అధికులులేరని విర్రవీగుతూ పెడత్రోవ పట్టిస్తుంటారని తీవ్రంగా విమర్శించాడు. 'చదువుల్నేర్చిన పండితాధములు స్వేచ్ఛా భాషణ క్రీడలలో అహంకరించి మాట్లాడుచుండగా, 'అమాయకులైన వారిని నీవే రక్షింపవలెనని' ప్రార్థిస్తాడు. అంతేకాదు మరికొందరు నీచులు వస్త్రమందలి దారపుపోగులనే పాములని, కుండలోని ఆల్చిప్పలే చంద్రకాంత శిలలని, ఎర్రని మందార పుష్పాలనే సూర్యకాంతియని దుర్బోధలు చేస్తుంటారు. అది వారి వాక్పటిమకు నిదర్శనమే తప్ప వేరుకాదు. దుర్మోహాబ్ధిలో కొట్టుకుపోతూ, కుహనా సన్యాసులై సమాజాన్ని పెడత్రోవనుపట్టిస్తున్నారు. ప్రతిదానికి ఏదో ఒక కృత్రిమ అర్థాన్ని కల్పిస్తూ తమ పాండిత్యానికి ఎదురులేదని తిరుగుతుంటారని విమర్శించాడు.

మనిషిని మిక్కిలి ప్రభావితం చెయ్యగలిగినవి అంతశ్శత్రువులు. బయటి శత్రువులనేదో విధముగా నిర్జించవచ్చు. కానీ, లోపల ఉండే కామక్రోధాది శత్రువులను జయించడం సాధ్యంకాదు. వాటిని జయించడమే జీవన్ముక్తి. ఆ విధమైన ముక్తిమార్గాల్ని తనకు అనుగ్రహించమని పరిపరి విధాలుగా పరమేశ్వరుని వేడుకుంటాడు ధూర్జటి.

మరొకచోట తన పూర్వ జీవితంలో చేసిన అకృత్యాలు తలచుకుంటే అసహ్యం కలుగుతుందనీ, కొంచెం వెనుక ముందుగా వచ్చు మరణాన్ని తలచుకుంటే భీతి కలుగుతుందని, కాలము తనను కనికరిస్తుందాయని సందేహపడి, పశ్చాత్తప్తుడైనాడు.

చిట్టచివరకు పరిపక్వ మనఃస్థితిని పొంది, దూషణ భూషణ తిరస్కారాలకు అతీతుడై స్థిత ప్రజ్ఞుడైనాడు ధూర్జటి. భగవంతుని మీద అచంచల విశ్వాసమే అతనికి నిశ్చల మనస్సును స్థిరబుద్ధిని ఇవ్వగలిగింది. అందుకనే

*"నిను సేవింపగ నాపదల్వొడమనీ, నిత్యోత్సవం బబ్బనీ*
*జనమాత్రుండననీ, మహాత్ముడననీ, సంసారమోహంబుపై*
*కొననీ, జ్ఞానము కల్గనీ, గ్రహగతుల్ కుందింపనీ మేలు వ*
*చ్చిన రానీ, యవినాకు భూషణములే శ్రీకాళహస్తీశ్వరా !"*

పరమేశ్వరా ! స్థిర సంకల్పంతో నిన్ను సేవించునప్పుడు, ఆపదలు సంభవించినా, సుఖాలు కలిగినా, సామాన్యుడనిపించుకున్నా, మహాత్ముడుని నిన్ను సంబోధించినా, కీడు కలిగినా, మేలు కలిగినా అన్ని నాకు అలంకారాలే ! అని ద్వంద్వాతీత బుద్ధితో ప్రకటిస్తాడు. అంటే తాను శీతోష్ణాలకు, సుఖదుఃఖాలకూ మేలు కీళ్ళకు అతీతుడని చెప్పుకుంటాడు. అటువంటి మహత్తర జ్ఞానాన్ని పొంది ప్రవృత్తి మార్గంనుండి నివృత్తిమార్గం వైపు మళ్ళిన మహాభక్త శిరోమణి ధూర్జటి.

తాను ఉత్తమ కవితా శిల్ప నిర్మాణచాతురి కలవాడైన మహాకవియైనప్పటికీ, స్వీయకవిత పట్ల ఇసుమంతైనా అహంకారం లేని వినయ సంపన్నుడు ధూర్జటి. అందుకనే 'కవితా శక్తిన్ నిను సంప్రీతునిగా చేయంజాల' అని విన్నవించుకుంటాడు. అంతేకాదు 'ఉపమోత్ప్రేక్షా ధ్వని వ్యంగ్య శబ్దాలంకారములకు అలభ్యమైన' పరమేశ్వరుని రూపాన్ని వర్ణించడానికీ, స్తుతించడానికీ తనకు సామర్థ్యంలేదనీ, సమస్తము ఈశ్వరుని పాదసన్నిధిలో పరిత్యజించి ఆత్మార్పణ చేసుకున్న పరమసాత్వికమూర్తి ధూర్జటి.

సంపదలను పరిత్యజించి, అంతశ్శత్రువులను జయించి, జీవితం మీద ఆకాంక్షలను నశింపచేసుకొని, స్వపర బంధనాలు త్రెంచుకుని, సమస్తము పరమేశ్వరునికి నిష్కామయోగియై సమర్పణ చేసుకుంటే జీవితం ధన్యమౌతుందని, మోక్షమార్గం సాధ్య మౌతుందని తన ఆత్మాశ్రయ భావానికి అఖండమైన అభి వ్యక్తిని చేకూర్చి, అనంత సాహితీజగత్తులో శాశ్వత స్థానాన్ని పొందాడు మహాకవి ధూర్జటి.

**ముగింపు :** ఈ పాఠంలో ధూర్జటి వెల్లడించిన రాజుల ప్రవర్తనలను, లోకంలోని ప్రజల తీరుతెన్నులను, తనకు శివునిపైగల అపారమైన శివభక్తిని, వైరాగ్యభావంతో మోక్షాన్ని కోరుకున్న విధానాన్ని గురించి తెలుసుకున్నాం.

**రాదగిన ప్రశ్నలు :**

1. ధూర్జటి గావించిన రాజనిందను వివరించండి ?
2. ధూర్జటి అనుభవించిన మనః క్లేశాన్ని వివరించండి ?
3. శ్రీకాళహస్తీశ్వర శతకాన్ని బట్టి ఆ కాలంనాటి సామాజిక పరిస్థితులు రాయండి ?
4. ధూర్జటి కవితా రీతులు వివరించండి ?
5. ధూర్జటి కుహనా పండితులను విమర్శించిన విధానమెట్టిది ?

**ఉపయుక్త గ్రంథాలు :**


1. 'మహాకవి ధూర్జటి కవిత్వము - వ్యక్తిత్వము'. - డా॥ పొన్నెకంటి హనుమంతరావు
2. తెలుగు సాహిత్య చరిత్ర - డా॥ ద్వా.నా. శాస్త్రి
3. తెలుగు సాహిత్య చరిత్ర - తెలుగు అకాడమీ
4. 'కవిచంద్రులు చేసిన వీనుల విందు' - కర్రి నాగార్జునశ్రీ తెలుగు విశ్వవిద్యాలయం
5. శ్రీ కాళహస్తీశ్వర శతకము - 'గొల్లపూడి వీరాస్వామి సన్స్' (పబ్లిషర్స్), రాజమండ్రి.



**డా॥ జి. వైదేహి,** M.A., M.Phil., Ph.D,
రీడర్, తెలుగుశాఖ,
టి.జె.పి.యస్. కళాశాల, గుంటూరు.

**పాఠం : 9**

## ఆధునిక కవిత్వం

# మాతృ గీతాలు

**- నాయని సుబ్బారావు**

**శీర్షికలు :**

9.0 లక్ష్యం

9.1 కవి పరిచయం

9.2 పాఠ్యభాగ సందర్భం

9.3 పాఠ్యభాగ సారాంశం

9.4 పద్యాలకు అర్థ తాత్పర్యాలు

9.5 సందర్భ సహిత వ్యాఖ్యలు

9.6 ప్రశ్నలు - సమాధానాలు

### 9.0 లక్ష్యం :

మాతృగీతాలు అనే స్మృతి కావ్యాన్ని రచించిన కవి శ్రీ నాయని సుబ్బారావుగారు. విద్యార్థులకు ఆధునికాంధ్ర కవిత్వంలో వివిధ సాహిత్య ప్రక్రియలను పరిచయం చేసే లక్ష్యంతో ఈ స్మృతి కావ్యాన్ని పాఠ్యాంశంగా నిర్ణయించారు.

ఆంగ్లేయుల పరిపాలనా కాలంలో భారతీయులు ఆంగ్లభాషా సాహిత్యలను ఆధ్యయనం చేసారు. ఆంగ్ల సాహిత్యంలోని వైవిధ్యభరితమైన సాహిత్య ప్రక్రియలు వారిని ఆకర్షించాయి. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో భారతీయ సాహిత్యం వినూత్న పథంలో పయనించింది. తెలుగు సాహిత్యంలో కూడా ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయి. ఇట్టి నవ్యయుగానికి నాందిపలికిన కవితా వైతాళికుడు శ్రీ కందుకూరి వీరేశలింగం. అంతకు పూర్వం తెలుగు సాహిత్యంలో లేని నవల, ప్రహసనం, నాటకం, వ్యాసం, స్వీయచరిత్ర, జీవిత చరిత్ర మొదలైన ఎన్నో ప్రక్రియలను ఆయన శ్రీకారం చుట్టి యుగకర్తగా ప్రఖ్యాతుడైనాడు. ఆయన మార్గంలో తదనంతర తెలుగుకవులు నవ్యభావ విలసితంగా కావ్యరచన చేసారు. అనేక కవితోద్యమాలను నిర్వహించారు. అట్టి ఉద్యమాలలో భావకవిత ఒకటి. ఆత్మాశ్రయంగా కవులు సృష్టించిన ఈ శాఖలో స్మృతి కావ్యాల విభాగం ఒకటి. అట్టి స్మృతికావ్యాలలో అత్యుత్తమంగా పేర్కొన దగినది మాతృగీతాలు. ఆధునికాంధ్ర కవిత్వపు తీరు తెన్నులను గ్రహించటానికి ఈ కావ్యం ప్రామాణికంగా నిలుస్తుంది.

### 9.1 కవిపరిచయం : శ్రీనాయని సుబ్బారావు 1899-1978

ఆధునిక యుగానికి చెందిన ప్రయుఖ భావకవి, ఆదర్శోపాధ్యాయుడు, సౌజన్యమూర్తి శ్రీనాయని సుబ్బారావు. ప్రకాశం జిల్లాలోని 'పొదిలె' అనే గ్రామంలో 1899 అక్టోబరు 29వ తేదిన (వికారినామ సంవత్సర ఆశ్వయుజ బహుళదశమి ఆదివారం)జన్మించారు. తల్లి ఉదయమ్మ, తండ్రి కృష్ణారావు. పొదిలె, ఒంగోలు, మచిలీపట్నం, రాజమంహేంద్రవరం మొదలైన చోట్ల విద్యాభ్యాసం చేసారు. బి.ఏ పట్టభద్రులు. తొలుత నరసరావుపేట పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో సహఉపాధ్యాయునిగా చేరి క్రమంగా ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతిని పొందారు. 1957 వరకు అక్కడే పనిచేసి, రాజీనామా సమర్పించి హైదరాబాదు నగరం చేరి అక్కడే జీవించారు.

నాయని సుబ్బారావుగారి రచనలలో అత్యంత సుప్రసిద్ధమైన పద్యకావ్యం సౌభద్రునిప్రణయ యాత్ర. తన ప్రేయసివత్సలను కథానాయికగా చేసి రచించిన రమణీయ కావ్యమది. ఈ కావ్యరచన వలన భావకవులలో ప్రథమశ్రేణికి చెందిన రాయప్రోలు సుబ్బారావు. దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రీ, నండూరి సుబ్బారావులతో సమప్రతిభునిగ పరిగణన పొందారు. ఈ కావ్యరచనాకాలం 1937.

సుబ్బారావు తల్లి ఉదయమ్మ 1924లో మరణించారు మాతృస్మృతితో వారు రచించిన కావ్యం మాతృగీతాలు.

తరువాత చాలాకాలం వరకు వారు కావ్యరచన చేయలేదు. వారు రచించిన ఖండికలు భాగ్యనగరకోకిల అనే ఖండకావ్యంలో ప్రచురింపబడ్డాయి (1966). తన స్వగ్రామమైన పొదిలె పరిసరాల వర్ణన, పొదిలెమ్మ అనే దేవత గురించిన గాథలు, స్థలపురాణం పొందు పరుస్తూ వారు రచించిన కావ్యం జన్మభూమి (1973) ఈ కావ్యంలోని ప్రకృతివర్ణన మిక్కిలి రమణీయమైనది. తన మనోవేదనను వర్ణిస్తూ సుబ్బారావుగారు రచించిన కావ్యం వేదనా వాసుదేవము (1964) పన్నెండు ఖండాలుగా విభక్తమైన మకుటం లేని శతకమిది. సుబ్బారావుగారు తమ ఏకైక పుత్రుడు మోహనరావు మరణానంతరం రచించిన స్మృతికావ్యం 'విషాదమోహనము'. ఇది మధ్యక్కర పద్యాలలో రచించబడింది.

సుబ్బారావుగారు ప్రధానోపాధ్యాయునిగా పనిచేసినపుడు రచించిన హిందూదేశచరిత్ర, ఆకాలంలో పాఠ్యపుస్తకంగా ఉపయోగింపబడింది. 'ట్రెజర్ ఐలాండ్' అనే సాహసోపేత ఆంగ్ల కావ్యాన్ని 'నిధిద్వేప' మనే పేరుతో సుబ్బారావు అనువదించారు.

సుబ్బారావుగారు సౌజన్యమూర్తి వివాదరహితుడు. వారి కవిత్వం, వ్యక్తిత్వం ఉత్తమస్థాయికి చెందినవి. ఎన్నికష్టాలు ఎదురైనా, స్థిరచిత్తంతో ఎదుర్కొని తృప్తితో జీవితాన్ని గడిపారు. వారు జీవితంలో చవిచూసిన అనేక చేదు అనుభావాల ఛాయలు వారి కావ్యాలలో ప్రతిఫలిస్తుంటాయి. వారికావ్యాలు కరుణరసాత్మకంగా రూపొందటానికి జీవితాను భవాలే కారణం కావచ్చును.వేదన వాసుదేవంలోని ఈ పద్యం ఆయన మనోభావాలకు దర్పణం.

*"నాపత్నీ రమణీ సుధాప్రణయితానందమ్ములం దేలితిన్*
*నాపుత్రీ విదుషీయనో విసర విన్యాసమ్ములం బొంగితిన్*
*నాపుట్టెల్లను పండె నీదు చలువన్ మానాథ! సంసారసా*
*ఖ్యాపూర్ణమ్ముగ నేమి కావలయునయ్యా యింక నాకిచ్చటన్"*

ఇంతటి నిరాడంబరకవి దాదాపు ఎనభై సంవత్సరాల పరిపూర్ణ జీవితాన్ని గడిపి 1978 జూలై ఎనిమిదవ తేదిన (కాళయుక్తి ఆషాడ శుక్లతదియ) మరణించారు. వారి పుత్రిక విదుషీమణి ఆచార్య నాయని కృష్ణకుమారి. సుబ్బారావుగారు కళాప్రపూర్ణ బిరుదాంకితులు.

## 9.2 పాఠ్యభాగ సందర్భం :

కవినాయని సుబ్బారావుగారి తల్లి 1924లో మరణించింది. సున్నిత మనస్కుడైన కవి తల్లి మరణానికి తీవ్రంగా చలించాడు. ఆమె ఎడబాటును తట్టుకోలేక శోకసముద్రంలో మునిగాడు. ఆమెకై పరితపించాడు. బాల్యమాదిగా ఆమెతో తాను గడిపిన రోజులను, పొందిన అనుభూతులను, ఆమె పంచిన మమకారాన్ని ఆమె జరిపిన పండుగలను, ఆమె వలన వెల్లివిరిసిన జీవితానందాన్ని ఆమె పంచిన జీవన సౌరభాన్ని తలచుకుంటూ గతస్మృతులలో మైమరచాడు. ఆమె మరణం వలన లోకం శూన్యంగా, బ్రతుకు భారంగా పరిణమించిదని తలపోస్తూ మాతృస్మృతికి నీరాజనంగా కవి రచించిన క్యావమిది.

## 9.3 పాఠ్యభాగ సారాంశం :

నాయని సుబ్బారావుగారు తన తల్లి ఉదయమ్మ మరణానంతరం రచించిన కావ్యమిది. ఈ కావ్యంలో 21 విభాగాలలో ఒకొక్క విభాగంలో మూడు పద్యాల చొప్పున మొత్తం అరవైమూడు తేటగీతులున్నాయి. మాతృస్మృతికి కవి సమర్పించిన అక్షర సుమాంజలి 'మాతృగీతాలు'.

సున్నితమనస్కుడైన కవి తల్లిమరణానికి తట్టుకోలేక తీవ్ర దుఃఖావేశానికి లోనైనాడు. తన వేదనను ఆత్మాశ్రయరీతిలో స్వచ్ఛందంగా కవి నివేదించుకున్నాడు. ఈ నివేదనలో తల్లి ఒడిలో తాను పొందిన మమతానురాగాలు ప్రతి అక్షరంలో ప్రతి ఫలిస్తుంటాయి. తల్లినీడలో ప్రశాంతంగా గడిచిపోయే తమ జీవితాలను దుర్విధి అల్లకల్లోలం చేసిందని ఆమె మరణం తనకు ఆశనిపాతంగా పరిణమించిందని వారిందు పేర్కొన్నారు.

తల్లిమరణంతో శోకతప్తుడైన కవి తమ నట్టింటి దీపాన్ని ఆపి, తనను తల్లిలేని బిడ్డను చేసి, తన మనసులోని ఆశలన్నింటిని అడుగంటకోసిన దుర్విధిని నిందించాడు. దైవపూజకు వెళ్లిన ఆమె తనను మరచిపోతుందేమోనని కలవరపడ్డాడు. ఆమె తిరిగివస్తుందన్న ఆశతో దీపంపెట్టి, మంచినీళ్ల చెంబుతో పదిరోజులు కంటికి కునుకులేకుండా ఎదురుచూసాడు. కానీ అమృత సాగరపు అవతలి తీరం చేరిన తల్లి చౌడుభూములలోని నీటికోసం తిరిగిరాదని నిరాశచెందాడు.

పార్వతీదేవి వంటి ఆమె నిష్క్రమణతో తమకు శూన్యమే మిగిలిందని, ఆమె తిరిగి వచ్చేవరకు తనకడుపు మంటలు చల్లారవని, రుచులూరించు కుడుములు, ఉండ్రాళ్లతో ఆమె జరుపు వినాయకచవితి మళ్లీ వస్తుందో రాదోనని ఆందోళన చెందాడు. ఆమెను వైకుంఠానికి దివ్యాభరణంగా భగవంతుడు రప్పించుకున్నాడని, ఆమె వైకుంఠద్వారానికి ప్రాతఃకాలం చేసే అలంకారాల ఫలితంగా కలిగే పుణ్యం తనను సుకృతపు తెప్పపై తేల్చగలరని ఆశించాడు. చలిలో, ఎండలో, వర్షంలో అమ్మనీడన తానాశ్రయం పొందానని నేడు తనకా భాగ్యంలేదని దుఃఖించాడు. తానామె పూజకోసం పూజాద్రవ్యాలను సమకూర్చుకున్న తరుణంలో ఆమె దూరమైందని, తన జీవితం ఆమెస్మృతికి చెక్కబడిన శిలాశాసనమని, తన మనోమందిరమే ఆమాతృదేవతకు ఆలయమని నివేదించుకున్నాడు.

ఆమె తర్పణంగా ఉంచిన పిండాలను కాకులముట్టలేదని, ఆమె మనోవాంఛిలాలన్నీ తాను తీర్చి, సాంబ్రాణి ధూపంతో ఆమెకు ఆత్మశాంతి కలిగిస్తానని వాగ్దానం చేసాడు. తమ మనసు నామెకు అంకితం చేసానని తెలియచేసాడు, తానుకూడా ఆమె ఉన్నచోటుకు వస్తానని, అక్కడ అమృతంతో తడిసిన దారులలో తామిరువురూ చీకుచింతలు లేక తల్లీబిడ్డల ఆటలాడుకుందామని కోరాడు. తాను అలుగగా, ఆమె అన్నం కలిపి నోటికి తినిపించాలని తాను తినకపోతే నెత్తినమొట్టి, తన కన్నీరును చీర చెంగుతో తుడిచి తననాదరించాలని ఆశించాడు. రెండులోకాల హద్దులు ఒకటైన రేఖమీద తాను ఆమె ఒడిలో ఒళ్లు మరిచి నిద్రిస్తానని తనకు జోలపాడి చిచ్చికొట్టవలసినదిగా తల్లిని ప్రార్థించాడు. ఆ భగవంతుడు తల్లిని తన నుండి దూరం చేసి వాడిశూలాన్ని మనసులో గుచ్చాడు. ఒక బొట్టు నెత్తురు బయటకు రాకపోయినా అది మంటలు మండుతుంటుంది. ఏమిపాపం చేసానో కానీ నాబాధ తీరునట్లు ఒక కన్నీటి బొట్టైన రాలిపడదు, కాలపుస్తకపు పుటలన్ని వత్తుకొనిపోయి తీయుటకు అలవిగాక ఉన్నాయని తీవ్రవేదనను వ్యక్తం చేసాడు. తల్లి నవ్వుతూ నిద్రించిందికానీ, తన కడుపును మండిస్తూ మాయనాట్యరంగ తెరలను చించుకొని అనంత సౌఖ్యాలలో తేలి ఆడటానికి తమను విడిచివెళ్లిందని పరితపించాడు. ఇకపై ప్రతివత్సరం పుష్యబహుళ చతుర్ధశి ఆమె తిధికావటం వలన తన స్మృతిపథంలో వేదన రేపే రోజుగా మిగిలిపోతుందని భావించాడు.

బొంత ముళ్ల చెట్టు మధ్య ఉన్న మామిడి ఫలాన్ని కోయమని తల్లి ఆదేశించదని, దేహం రక్తసిక్తమౌతున్నా తాను యత్నం మానలేదని ఆఫలం చేతికందే సమయంలోనే తల్లి తనను వీడిపోయిందనీ దుఃఖించాడు. తాను స్నానానికి బావికి వెళ్లినపుడు అందలి అలలు చిన్ని తాబేలు తన స్థితిని చూసి జాలిపడ్డాయని, కప్పను మింగిన పాము నీకు అమ్మలేదని పలికిందని తాను హృదయపరితాపం పొందానని పలికాడు. పసితనంలో తల్లిస్తన్యం తాగి ఆమె చేతులలో లాలించే సమయంలో అమ్మ అనే మాటకు తనకు అర్థం తెలియదని యౌవన గర్వంలో తన మూర్ఖత్వంతో ఆమెను ఆవేదనకు గురిచేసానని, చివరకా మాతృమూర్తి దేహాన్ని చితిలో మంటలకు ఆహుతి చేసానని కవి విలపించాడు.

గత శివరాత్రి తల్లి సువర్ణముఖి నదిలో స్నానం చేసి కాళహస్తీశ్వరుని దర్శించిన తల్లి ఆ పుణ్యంలో తనకు భాగాన్ని పంచిందని, నేడు ఆకాశ గంగలో స్నానం చేసి, పరమేశ్వర సందర్శన భాగ్యాంతో తరించిన తల్లి తనను మరిచిందని పరితాపానికి లోనయ్యాడు. నేడు జటలు కట్టిన తన తలకు చిక్కుతీసి తలంటుపోసే వారెవ్వరూ లేరని ఆమె లేని లోపాన్ని తలచుకున్నాడు. తల్లి

గతంలో ఉగాదినాడు తనకు పంచి ప్రసాదం అమృతోపమానంగా ఉండేదని. నేడు బ్రాహ్మడు పంచిన వేపపూత పచ్చడి చేదుల ముద్దగా మింగరానిదిగా ఉందని తెలిపాడు. కాలకంఠుని వలె ఇట్టి చేదును తానిక మింగక తప్పదని తనకిక ఆధారం చేసుకొని ఈగీతాలను రచించాడు.

## 9.4 పద్యాలకు అర్థతాత్పర్యాలు :

| | | | |
|---|---|---|---|
| 1. | కర్మఠుడు | = | నెఱవేరు దాక ఒక పనిని చేయువాడు. |
| | నీలజలదము | = | నల్లని మేఘము |
| | నిర్ముక్త | = | విడువబడిన |
| | శైశిర | = | శిశిర ఋతువు యొక్క |
| | శర్వరీ | = | రాత్రి |
| | నిశ+అంతము | = | రాత్రి యొక్క చివర (వేకువ జామున) |
| | విరస+ఆత్మకుడు | = | విరసమైన మనసుకలవాడు |
| | విరాజమాన | = | ప్రకాశించుచున్న |
| | కంటక | = | ముళ్లు |
| | విపినమార్గముల | = | అడవిదారులలో |

**తాత్పర్యం :** తాననుకున్న ఆ పనిని నెరవేర్చిన ఆక్రూరుడెవ్వరు? నీల మేఘముల నుండి విడువబడ్డ ఆ చల్లనిగాలులతో కూడిన ఈ ప్రశాంతవేళ మా నట్టింట దీపాన్ని ఆపి మాకు తీవ్రమైన దుఃఖాన్ని అతడు కలిగించాడు.

సాయంసంధ్యాకాంతులతో ప్రకాశించే ఆకాశమధ్యంలో కారు చీకట్ల రాసులను కుమ్మరించినట్లుగా తమకు ఇంత తీవ్రదుఃఖాన్ని కలిగించిన ఆ విరసాత్మకుడెవ్వరు?

అమ్మ మరణంతో నాబతుకు ముళ్లచే ఆవరింపబడిన అరణ్యామార్గమైంది. నను తల్లిలేని బిడ్డను చేసి నా మనసులోని కోరికలన్ని అడుగంట కోసిన ఆనిర్దయా స్వాంతుడెవ్వడు?

| | | | |
|---|---|---|---|
| 2. | దేవళమ్ము | = | దేవాలయము |
| | పాదకంజమరందమ్ము | = | పాదపద్మమకరందము |
| | ప్రతిఅహము | = | ప్రతిరోజు |

**తాత్పర్యము :** నీవు పవిత్రంగా మడికట్టుకొని పండ్లు, పూలను తీసుకొని దేవుని పూజకై ఎక్కడికో వెళ్తున్నావు. నేను నీకొంగు పట్టుకని నిన్ననుసరించలేక కన్నీరు కారుస్తున్నాను.

నీవు గుడికి వెళ్లి, పూజలో మునిగి నిశ్చల ధ్యాన సమాధిలో నన్ను మరచిపోతావేమో.

నా కడుపు మంటలను ఆర్పుతూ ఆనాడు చనుబాలనిచ్చి నన్ను పోషించావు. అవి లోకనాధుని పాదపద్మాల నుండి జాలువారిన మకరందం వంటివి. అవి ఆకలినే కాక కడుపులోని చేదు కూడా కడిగివేయు శక్తిని కలిగినవి. అట్టి అమృత భిక్ష పెట్టిన నీవు నేడు దైవసన్నిధికి చేరి నన్ను ఒంటరిని చేసావు.

| | | | |
|---|---|---|---|
| 3. | కాచుకొంటిని | = | వేచిఉంటిని, ఎదురుచూసాను |
| | గుణములు | = | వింటినారులు, అల్లెతాడు |
| | బిట్టబిగిసిన | = | ఎక్కుపెట్టిన |
| | పిపాస | = | దప్పిక |

| | | |
|---|---|---|
| జడుడు | = | మూర్ఖుడు |
| వారాశి | = | సముద్రం |
| చవిటిపఱ్ఱు | = | చౌడు భూమి, సారహీనమైన నేల |

**తాత్పర్యం :** నువ్వు తిరిగి వస్తావనే ఆశతో నువ్వు వచ్చే దారిలో దీపాన్నుంచి, మంచినీటి చెంబుతో పదిరోజులు నేను అహర్నిశలు కళ్లుకూరుకొనిపోతున్నా కోర్కెతో ఎదురు చూసాను.

నాతల్లీ, నీవు తిరిగి రాలేదు. నా చెవులకు బిఱ్ఱు బిగిసిన వింటినారుల మోతలే వినిపించాయి కాని నీవు దప్పికతో నీరు తాగిన శబ్దం మాత్రం వినిపించలేదు.

నీకు దాహమే కాదని తెలుసుకోలేని మూర్ఖుణ్ణి నేను. అమృత సముద్రానికి అవతలి తీరం చేరిన నీకు ఈ చౌడుభూముల లోని నీరు ఎందుకు రుచిస్తుందిలే ?

| | | | |
|---|---|---|---|
| 4. | కన్నారు | = | కంటి నిండుగ |
| | భాష్పములు | = | కన్నీరు |
| | వల్లకాడు | = | స్మశానం |
| | కందర + అభ్యంతరమున | = | గుహలోపల |
| | చరణ | = | పాదముల |
| | శుశ్రూష | = | సేవ |

**తాత్పర్యం :** 'ఆమె పార్వతీదేవి. పూలరథంలా తరలి వెళ్ళింది. ఆమె రాకతో వల్లకాడు పూలవనంగా మారింది'. అని పరామర్శించటానికి వచ్చిన జనులు ఆమెను తలచుకొని కన్నీరు నింపారు.

నీవు పార్వతీదేవి వలె పుట్టిల్లు చేరి, హిమాలయ పర్వత గుహల్లో చేరావు. కానీ నువ్వు వచ్చేవరకు పరమశివుని పాద పూజలను ఎవరు చేస్తారు ?

మళ్ళీ నువ్వు ఎప్పుడు తిరిగివస్తావో. ఆకలితో నకనకలాడే నాకడుపులో కుడుములు, ఉండ్రాళ్లు ఎప్పుడు నిండుతాయో? ఈ లోకానికిక వినాయకచవితి ఉన్నదో, లేదో ?

| | | | |
|---|---|---|---|
| 5. | గమింప | = | దాటుట |
| | వైతరణీ | = | స్వర్గలోకంలోని నది |
| | అవనిసురుడు | = | భూమి యందు దేవుని వంటివాడు బ్రాహ్మణుడు |
| | శైవాలినీ | = | పద్మముల |
| | సహస్రము | = | వెయ్యి |
| | జన + అపవాదముల్ | = | జనుల నిందలు |
| | నీలవర్ణుడు | = | నల్లటి దేహవర్ణం కలవాడు విష్ణువు |
| | వైకుంఠము | = | విష్ణువు నివాస ప్రదేశం |
| | ప్రత్యుషః కాలము | = | ప్రభాతకాలం, వేకువ |
| | శృంగార ఫణితులు | = | అలంకారాలు |
| | సుకృతంపు తెప్ప | = | పూలవాన |

**తాత్పర్యం :** తల్లీ నువ్వు వైతరిణిని దాటాలంటే ఒక ఆవును దానమివ్వాలని నాకు బ్రాహ్మడు చెప్పాడు. కానీ నాపాదపద్మ స్పర్శ సోకగానే ఆ నదిలో వేయి దేవలోకపద్మాలు పుడతాయని నా నమ్మకం.

నీవంటి పుణ్యాత్మురాలు యమలోకానికి ఎంత దూరమో నాకు తెలుసు. తెలియని జనులు వేసే నిందలు నాకు నవ్వు పుట్టిస్తున్నాయి. ఏరికోరి నీవంటి పుణ్యమూర్తిని శ్రీమహావిష్ణువు వైకుంఠానికి దివ్యాభరణంగా పిలిపించుకున్నాడు.

తల్లీ వైకుంఠ మందిర ద్వారానికి ఉషోదయ కాలంలో నువ్వు ఎన్నో అలంకారాలను చేయగలవు. ఆవిధంగా నువ్వు చేసే పనులు నా జీవితానికి సుకృతపు తెప్పలై నన్ను తేల్చగలవు.

| | | |
|---|---|---|
| 6. చరణ పంకజము | = | పాదపద్మం |
| ఆసక్త | = | అనురక్త, ఆసక్తి కలిగినది |
| సుగతి | = | మంచిగతి (స్వర్గం) |

**తాత్పర్యం :** పుష్యమాసంలో నువ్వు నాకు దూరమైనావు. హరిపాద పద్మాలను సేవించాలన్న ఆసక్తితో నన్ను విస్మరించావు. నీపైట చెంగు కప్పుకోవటానికి నాకు దొరకలేదు. అందువల్ల నాచలి తీరింది.

తల్లీ నువ్వు ఎంత దయలేనిదానవు. కఠినమైన కాలచక్రానికి నన్ను కట్టేసి నువ్వు శాశ్వతంగా స్వర్గానికి వెళ్ళావా ?

మాఘమాసం తర్వాత మండుటెండలు వచ్చాయి. వర్షం లేని ఈ నేల మీద నన్ను రక్షించేవారే కరువయ్యారు.

| | | |
|---|---|---|
| 7. సుంత | = | కొంచం, లేశం |
| సమాయత్తము | = | సంసిద్ధం |
| సంతతుల్ | = | సముదాయాలు |

**తాత్పర్యం :** నేను మూర్ఖుడనై నీపూజకు కావలసిన వస్తువులను సమకూర్చుకోలేదు. నా అశ్రద్ధకిట్టి మరువరాని శిక్షను విధించటానికి నీకు చేతులెట్లాడినవి తల్లీ ?

నీ పూజకు వస్తు సముదాయాన్ని సిద్ధం చేసుకోవటానికి ఎంతోకాలం పట్టింది. ఒక్క సంవత్సరం నువ్వు ఓపిక పడితే నా ప్రయత్నం నెరవేరగలిగేది.

నా జీవితం నీ స్మృతికి చిహ్నమైన శిలా శాసనం. నా అంతరంగంలో ప్రతిష్టింపబడినది. మనోహరమైన నీ విగ్రహమే.

| | | |
|---|---|---|
| 8. ఉపభోగ్యము | = | ఉపయోగింపదగినది |
| తరుణమున | = | తగిన సమయంలో |
| చరణ పద్మాలకు | = | పద్మాల వంటి పాదాలకు |
| అలరు గుత్తులు | = | పూల గుత్తులు |
| అంఘ్రియుగము | = | పాదాల జంట |

**తాత్పర్యం :** దేవతలకు సమర్పింపదగిన పారిజాతసుమాన్ని నేను నా మనసులో పెంచుకున్నాను. తగిన సమయంలో మాతృదేవత పాదపద్మాలకు కుసుమాంజలిగా దాన్ని సమర్పించాలని నేను మనస్ఫూర్తిగా భావించాను.

కానీ నీ పవిత్రమైన పాదపద్మాలు నాకళ్లకు కనిపించనంత, నా చేతులతో తాకలేనంతగా దూరమైనాయి. దేవుని దుష్టబుద్ధి వలన ఆ పారిజాతం తొలిపూత పుట్టకముందే వాడిపోయింది.

ఆ పారిజాతాలను తుడిచివేయడం నాకు సాధ్యంకాదు. నా మనసులో ముద్రింపబడ్డ నీపాద చిహ్నలపై అవి రాలిపోతాయి. నీ కన్నీటిలో తడిసిన ఆపూల గుత్తులు అక్కడే వాడిపోతాయి.

| | | |
|---|---|---|
| 9. అభీష్టము | = | కోరిక |

**తాత్పర్యం :** తల్లీ నీ స్మృత్యర్థం పెట్టిన పిండాలను కాకులెందుకు ముట్టుకోలేదు. నీ మనసులో ఏవో అనుమానాలు ఆవరించాయేమో? నేను ఎన్నడైనా నీ కోరికను విస్మరించానా ?

రేపు నీకు తప్పక సాంబ్రాణి ధూపాన్ని ఉంచి మొక్కాలని నేను నిశ్చయించుకున్నాను. ఆ నిశ్చయము పంట కాపు నిశ్చయం వలె చంచలమైనదని నా హృదయం సిగ్గుతో కుంగిపోయింది.

నా అంతరంగంపై నీకు అనుమానం రవ్వంతైనా వద్దు. నా మనసు నీ కంకితం. నీ ఇష్టమైన దాన్ని దానిలో వ్రాసుకోవచ్చు.

| | | | |
|---|---|---|---|
| 10. | అమృత+అభిషిక్త పథములు | = | అమృతంతో తడుపబడ్డ దారులలో |

**తాత్పర్యం :** అమ్మా అక్కడ నీవేం చేస్తున్నావు ? నేను అక్కడికి వస్తాను. అమృతంతో తడపబడ్డ ఆదారులలో మళ్లీ నువ్వు నేను ఎట్టి చీకు చింతలు లేక తల్లిబిడ్డాటను ఆడుకుందాం.

నేను అలుగుతాను. అయినా నువ్వు అన్నం కలిపి తెచ్చి నానోటిలో కూరి తినిపిస్తావు. తినకపోతే నానెత్తిన మొట్టి తినిపిస్తావు. నాకళ్ళ నుండి జారే కన్నీటిని నీపైట చెంగుతో తుడిచివేస్తావు.

అమ్మా నువ్వు అక్కడ ఏం చేస్తున్నావో నాకు చెప్పవా ? నువ్వులేని ఈ జీవితం నాకు గడవటం లేదు. నన్ను నీ దగ్గరకు రానిస్తే చాలు. నీ పూజలకు నేను అడ్డంకాదు.

| | | | |
|---|---|---|---|
| 11. | మర్త్యలోకము | = | మానవలోకం |
| | నిశిధినీ | = | రాత్రి |

**తాత్పర్యం :** తల్లీ మనమధ్య గాఢంగా ఆవరించిన ఈ కాఱు చీకట్లను, మిణుగురు పురుగల కాంతిని ఆధారంగా చేసుకొని నేను దాటగలను.

అమ్మా నీవేలోకంలో ఉన్నావు. నీ పూజలన్ని పూర్తి అయిన తర్వాతనే, నీ ప్రేమపొంగులై స్రవింపగా ప్రేమవాహినిగా మారి నన్ను ముంచెత్తవలసింది.

రెండులోకాల పొలిమేర హద్దుపై నువ్వు కూర్చొని ఉండగ నేను నీ ఒడిలో మేనుమరచి నిద్రిస్తాను. నువ్వు చీకట్లు విచ్చేవరకు జోలపాడి, చిచ్చికొట్టగలవు.

| | | | |
|---|---|---|---|
| 12. | నిశిత | = | వాడి అయిన |
| | ఉద్వేగము | = | వెఱపు |
| | బాహిరిలక | = | బయటకు రాక |
| | ఆర్తి | = | బాధ |
| | దివారాత్రములు | = | పగలు, రాత్రి |

**తాత్పర్యం :** ప్రళయకాల శివుడు నాహృదయంలో వాడి అయిన శూలాన్ని గుచ్చాడు. నా మనసు ఎంత మండుతున్నా ఒక నెత్తురు చుక్కైనా బయటకు రాలేదు.

మనసులోని మంటలకు తోడు, రేయింబగళ్లు కడుపులో ఆకలిమంటలు తోడైనాయి. నాపాపఖర్మమేమో కానీ నావేదన తీరునట్లు ఒక కన్నీటి చుక్కైనా బయటకురాదు.

మధురప్రేమ స్వరూపిణి అయిన నామాతృదేవత కళ్లకు కనిపించే శుభోదయం నాకు లేదు. కాలపుస్తకపు వెనుక పుటలు విడదీయటానికి వీలుకానట్లు వత్తుకొనిపోయాయి.

| | | | |
|---|---|---|---|
| 13. | ఆస్య | = | ముఖ |
| | కంజము | = | పద్మం |
| | శైతల్య | = | చల్లదనం |

**తాత్పర్యం :** నువ్వు దూరమైన నీకోసం ఎంతగానో, రాత్రింబగళ్లు ఏడ్చాను. నీప్రసన్నమైన ముఖ కమలంలోని ప్రశాంతతను తలచుకోగానే నాదుఃఖం కొంత ఉపశమించింది.

నువ్వు నవ్వుతూ శాశ్వత నిద్రకుపక్రమించావు. నీ ప్రసన్నమైన ముఖంలోని అమృతం వంటి చల్లదనం కొంతైనా ఈ దౌర్భాగ్యుని జీవితమార్గంలో చిందితే చాలు.

నా కడుపును మండించిపోయిన నీకు నవ్వురాకుండా ఎట్లా ఉంటుంది ? అనంత వైభోగములపై కోర్కెతో ఈ మాయా నాట్యరంగం యొక్క తెరలను ఛేదించుకొని నువ్వు అదృశ్యమైనావు.

| | | | |
|---|---|---|---|
| 14. | మైపూత | = | పైన రాసుకునే పూత |
| | తమస్విని | = | చీకటి |
| | నైపథ్యము | = | పూర్వరంగం |

**తాత్పర్యం :** నువ్వు నాకు దూరమైన రోజు పుష్యమాసపు బహుళ చతుర్దశి. ఆనాటి రాత్రి దట్టమైన చీకట్లనే మైపూతలు లోకాన్నంతా ఆవరించి ఉండగా, నా కళ్లు భేదింపరాని ఆ కటిక చీకటిలో నువ్వు నన్ను తప్పించుకొని మటుమాయమైనావు.

ఆ చీకటి రాత్రి యొక్క వికృతవేషం నా మనసులో భయాన్ని నింపింది. నువ్వు వెళ్లిన మార్గంలో కొంచమైనా వెన్నెల జాడలేదు.

నువ్వు దూరమైన ఆ బహుళ పుష్యమి చతుర్దశి పూర్వరంగంగా నిలిచి ఇకపై ప్రతి వత్సరం ఆ తిథి వచ్చిన రోజు నాకు తీవ్రమైన హృదయవేదన కలుగవచ్చు.

| | | | |
|---|---|---|---|
| 15. | మత్ | = | నాయొక్క |
| | వాః కణమ్ము | = | కన్నీరు |
| | వారి నిధి | = | సముద్రం |
| | సుంత | = | కొంచం |
| | కొదమ | = | ధృడమైన |
| | పాద రాజీవము | = | పద్మము వంటి పాదం |

**తాత్పర్యం :** ఈ సముద్ర తీరమునందలి ఇసుకలో నాకన్నీరు వరదగా ప్రవహించింది. సాయంకాల సంధ్యాసమయ అరుణకాంతులలో నా దుఃఖం లీనమైంది. నీరాకకై నేనొక్కడను ఎంతకాలం నిరీక్షించగలను.

ఈ దుఃఖ సముద్రపు లోతులు తెలుసుకొనలేనివి. నువ్వు మునిగిన ఈ దుఃఖ సముద్రపు అడుగున వెలుతురేమైనా వ్యాపించగలదేమోనని నా ఆశ.

ఈ చీకట్లు మరింత వ్యాపించకముందే, ఈ సముద్రపు అలలు ఒక్కసారిగా ఎత్తివచ్చి, దాని ఒడ్డున వేచి వున్న నన్ను ముంచి నీపాదపద్మాలపై పడవేస్తే చాలు.

| | | | |
|---|---|---|---|
| 16. | రసాల వృక్షము | = | మామిడిచెట్టు |
| | యతనము | = | ప్రయత్నం |
| | బొంత జెముడు | = | ఒక రకమైన ముళ్ల పొద |
| | చెలియలికట్ట | = | సముద్రపుటంచు, కరకట్ట |

**తాత్పర్యం :** నువ్వు బొంతజెముడు చెట్లమధ్య ఉన్న తియ్యమామిడి చెట్టుకు ఉన్న పండొకటి కోయమన్నావు. దానిని కోయటానికి నేనెంత ప్రయత్నం చేసానో, ఆ సంగతి నాకే ఎఱుక.

ఆ బొంతజెముడు పూలు నా ప్రయత్నాన్ని చూసి ఎంతో పరిహాసం చేసాయి. నాదేహాన్ని ఎండుమిట్టలలోని ముళ్లు రక్తసిక్తం చేసాయి.

చివరికా పండు నాచేతిలో పడే సమయానికి నా మనసులో చిచ్చు రగిలించి నువ్వు కాలమనే సముద్రపుటంచులను దాటి నిష్క్రమించావు. నా ప్రయత్నమంతా వ్యర్థమైనదన్న నిరాశ మాత్రం నాకు మిగిలింది.

| | | | |
|---|---|---|---|
| 17. | విలయ | = | ప్రళయ |
| | తావక | = | నీ |
| | అంఘ్రియుగము | = | పాదాల జంట |
| | ఉత్తమాంగము | = | శిరస్సు, తల |
| | పూతము | = | పవిత్రం |
| | సద్యః | = | వెనువెంటనే |

**తాత్పర్యం :** నువ్వు రుచి చూస్తావన్న ఆశతో నేనెంతో శ్రమకోర్చి ఈ మధురమైన మామిడిపండును సేకరించాను. కానీ ఇంతలో ఊహింపరాని విధంగా ప్రళయకాల సముద్ర తరంగాలు నన్ను ముంచివేసాయి.

నువ్వు కూడా ఎంతో దురదృష్టవంతురాలివి. నీ నోము ఫలాన్ని నువ్వు అనుభవించ లేకపోయావు.

అమృతం వలే చల్లనైన నీపాదపద్మాలను నా శిరస్సుపై చేర్చుకుని పవిత్రతను పొందే అదృష్టానికి నేను కూడా నోచుకోలేదు.

అంతులేని దయకు సముద్రం వంటిదానివి. నిరంతరం ప్రసన్నతకు నెలవైన మధురమూర్తి ! ఓ మాతృమూర్తి, మమ్మలను నీ కరుణా కటాక్షములతో కాపాడి మా జీవయాత్రామార్గాలను ప్రకాశింపచేయవలసినది.

| | | | |
|---|---|---|---|
| 18. | ఏను | = | నేను |
| | కూపగర్భము | = | బావిలోపలికి |
| | సుళ్లు | = | సుడులు, అలలు |
| | శోకవహ్ని | = | శోకమనే అగ్ని |

**తాత్పర్యం :** నేను స్నానానికి బావి దగ్గరికి వెళ్లాను. లేత సూర్యుని కిరణాలు ప్రతిఫలించటం చేత బంగారుకాంతులను వెదజల్లే నీటిసుడులు అమ్మ ఏదిరా ? అని నన్ను ప్రశ్నించాయి.

ఆ బావిలో ఈదులాడే చిన్ని తాబేలు నన్ను చూసి నీటిని దాటుకుంటూ బావిలోపలికి వెళ్ళింది. దాని గమనం వలన నీటిపై రేగిన సుడులు నా మనసును చుట్టుముట్టాయి.

బావిలోని పాము పైకెగిరి కప్పను పట్టుకుంటూ నీకు అమ్మలేదని అన్నది. నేను శోకాగ్నిలో తపించే హృదయంతో అవును నాకమ్మలేదన్నాను.

| | | | |
|---|---|---|---|
| 19. | దుగ్ధములు | = | పితుకబడినవి, పాలు |
| | నిశిత శూలము | = | వాడియైన శూలం |
| | భాష్ప కణములు | = | కన్నీటి బిందువులు |
| | నిర్జీవము | = | జీవము లేనిది |
| | చితాగ్ని | = | అంత్య సంస్కారమునకు కట్టెల పోగుకు చేర్చిన నిప్పు |
| | వపువు | = | శరీరం, దేహం |
| | గుండెలవియు | = | గుండె పగులు |

**తాత్పర్యం :** నా పసితనంలో వాత్సల్య పూరితంగా నువ్వు అమృతంతో సమానమైన నీ చనుబాలను ఇచ్చి, నీ చేతులలో నన్ను లాలించావు. అప్పుడు అమ్మ అనే మాటకు అర్థమైనా తెలియనివాడను.

యౌవనదశలో మూర్ఖుని లాగా ప్రవర్తించి, నిన్ను దుఃఖంలో మరిగించాను. ఆ స్థితిలో కన్నీరు కార్చే నిన్ను చూసి 'అమ్మ' అనేమాట వాడి శూలంలాగా నా మనసులో గుచ్చుకున్నది.

ఇప్పుడు మరణించిన తరువాత నీ దేహాన్ని తెచ్చి అతి కఠోరంగా చితిలో ఉంచాను. నీ దేహాన్ని కాల్చి బూడిద చేసి దాన్ని గంగపాలు చేసాను.

| | | | |
|---|---|---|---|
| 20. | జల+అవగాహనము | = | నీటియందు మునుగుట |
| | పావన | = | పవిత్రమైన |
| | పరిపూత | = | పవిత్రమైన |
| | కటాక్షము | = | దయాప్రసాదం |
| | అతులిత | = | సాటిలేని |
| | ముహుర్ముహుర్ | = | మాటిమాటికి |

**తాత్పర్యం :** నేడు శివరాత్రి. క్రిందటి శివరాత్రికి నువ్వు పవిత్రమైన సువర్ణముఖీ జలాలలో మునిగి, శ్రీకాళహస్తీశ్వరుని కరుణామృతాన్ని నాకు పంచి పెట్టావు.

నిరుడు మెగిలేటిలో మునుగుతూ నన్ను గట్టుపై ఉంచావు. నేడు నన్ను విడిచి ఒంటరిగా కైలాసంలోని ఆకాశగంగ తుంపురులతో కూడిన అలలతో స్నానం చేయటం నీకు తగిందేనా ?

కైలాసం చేరిన నీ ముఖం చిరునవ్వుల కాంతులలో వెలిగిపోతున్నది. అంతులేని ఆనందాన్ని అందుకున్న నీ అంతరాత్మ తేజస్వంతంగా మెరిసిపోతున్నది.

| | | | |
|---|---|---|---|
| 21. | నూతన వత్సరాది | = | కొత్త సంవత్సరాది |
| | పాణి | = | చేయి |
| | యుగము | = | జంట |
| | కాలకూటోగ్రము | = | భయంకరమైన కాలకూటం |
| | అగ్రిమము | = | ముందుకు నడిపించేది |
| | కాలగళుడు | = | నీలకంఠుడు, శివుడు |

**తాత్పర్యం :** అమ్మా నేడు నూతన సంవత్సరాది. నువ్వులేని ఈ రోజు, జటలు కట్టిన నాతల చిక్కులు తీసి తలంటుపోసి సంస్కరించే వారెవ్వరూ లేరు. నీవు చేసిన సేవలను తలచుకొని నాహృదయం కరిగిపోతున్నది.

ఉగాది పండుగ నాడు బ్రాహ్మడు తెచ్చియిచ్చిన వేపపచ్చడి చేదుల ముద్దగా నాకనిపిస్తున్నది. పుట్టినది మొదలు నేటి వరకూ నువ్వు నాకు చేదును తినిపించలేదు. నువ్వు దూరం కావటం వలన చేదురుచి నాకు తెలిసి వచ్చింది.

తల్లీ కాలకూట విషం వంటి ఈ శోకాన్ని నాకు పరమాన్నం వలె నువ్వు నాకు పంచిపెట్టావు. నేటి నుండి వచ్చే ఉగాదులన్ని చేదునే పంచి నన్ను కాలగళుని చేయగలవు.

## 9.5 సందర్భ సహిత వ్యాఖ్యలు :

**1. అకట నట్టింటి దీపమ్ము నార్పినాడు.**

ఈ వాక్యం 'మాతృగీతాలు' అనే స్మృతి కావ్యంలోనిది. భావకవులలో అగ్రగణ్యులైన నాయని సుబ్బారావుగారు, తమ తల్లి మరణానికి చింతిస్తు రచించిన కావ్యమిది.

**సందర్భం :** తన తల్లిని తన నుండి దూరం చేసినవాడు క్రూరకర్మరుడని, ప్రశాంతమైన నిశాంతంలో, ఆమె ప్రాణాలను హరించి తమ నట్టింట్టి దీపాన్ని ఆర్పాడని దుర్విధిని, కవి నిందిస్తూ పలికిన పలుకులివి.

**భావం :** ఇంటికి దీపం ఇల్లాలన్నది ఆర్యోక్తి. ఆమె ఉనికి నట్టింట వేయికాంతులను వెదజల్లుతుంది. ఆమె మరణంతో ఇల్లు అంధకారబంధురమౌతుంది. తన తల్లి మరణంతో తమ ఆశాజ్యోతులు ఆరిపోయాయని, తమ యింటిదీపం, కంటి వెలుగు మలిగి పోయాయనే భావాన్ని ఈ పలుకుల్లో స్ఫురింపచేసాడు. నట్టింటిదీపం అన్నది ఒక చక్కని జాతీయ పదప్రయోగం.

**2. మఱచి పోదువో యేమో నామాట తల్లి.**

ఈ పద్యపాదం మాతృగీతాలు అనే స్మృతికావ్యం నుండి గ్రహించబడింది. కవి నాయని సుబ్బారావుగారు. భావ కవులలో ఉత్తమ స్థాయికి చెందిన కవులలో వీరొకరు. వారీ కావ్యాన్ని కరుణరసస్ఫోరకంగా, ఆత్మాశ్రయంగా రచించారు.

**సందర్భం :** తన తల్లి మరణానికి దుఃఖిస్తూ, 'అమ్మా నువ్వు దైవపూజకు పళ్లుపూలను తీసుకొని ఎక్కడికో వెళ్లావు. నేను నీ కొంగు పట్టుకొని నీవెంట రాలేకపోయాను. ఆ దైవపూజలో నిమగ్నమైన మనసుతో, నువ్వు నన్ను మరచిపోతావేమోనని నా భయం' అని కవి తల్లి నుద్దేశించి పలికిన పలుకులివి.

**భావం :** స్వర్గంలో దైవ సన్నిధికి చేరిన నీకు ఆదైవ ధ్యానమే తప్ప ఇహలోకంలో నీకై పరితపించే ఈ కన్నబిడ్డ గుర్తుంటాడో లేదో, ఆ దివ్యానందంలో నన్ను విస్మరిస్తావేమోనని కవి తన అంతరంగాన్ని వ్యక్తం చేసాడు.

**3. ఈ చవిటిపల్ల నీరమ్ము లేల వలతు.**

ఈ పద్యపాదం ఆధునికాంధ్ర కవులలో అగ్రగణ్యులైన నాయని సుబ్బారావుగారు రచించిన 'మాతృగీతాలు' అనే స్మృతి కావ్యం నుండి స్వీకరించబడింది.

**సందర్భం :** దూరమైన తన తల్లి తప్పక తిరిగి వస్తుందనే ఆశతో ఆమె వచ్చేదారిలో దీపాన్ని, మంచినీళ్ల చెంబును ఉంచి పదిరోజులు రాత్రింబగళ్లు కళ్లు నిద్రతో కూరుకొనిపోతున్నా ఆమెను చూడాలన్న కోర్కెతో ఎదురుచూసాడు. ఆమె తిరిగి రాలేదు. ఆ సందర్భంలో తన నిరాశను వ్యక్తం చేస్తూ కవి పలికిన మాటలివి.

**భావం :** అమ్మా ! నువ్వు అమృతసాగరానికి అవతలి తీరాన్ని చేరావు. అట్టి నీకు ఈ చౌడు భూములలోని నీళ్లు ఎట్లా రుచిస్తాయి. ఆ విషయం ఆలోచించలేని మూర్ఖుడను నేను అన్న కవిమాటల్లో తల్లి తిరిగి రాలేదనే నిష్ఠూరంతో పాటు దేవతల సాంగత్యం లభించిన నీకు మావంటి సామాన్యులు ఏవిధంగా నచ్చుతారులే అనే భావాన్ని కూడా కవి స్ఫురింపచేశాడు.

**4. ఈ జగతి నింక వినాయక చవితి లేదు.**

ఈ పద్యపాదం 'మాతృగీతాలు' అనే స్మృతికావ్యం నుండి గ్రహించబడింది. కవి నాయని సుబ్బారావు. తల్లి మరణానికి దుఃఖిస్తూ ఆమె స్మృత్యర్థంగా కవి రచించిన కావ్యమిది.

**సందర్భం :** పార్వతీదేవి తరలివెళ్లిపోయిందని, పూలరథము కదలిపోయిందని, వల్లకాడు పూలవనంగా మారిందని నిన్ను కడసారి చూడటానికి వచ్చి వారంతా కన్నీటితో నీగురించి పలికారు. నువ్వు పుట్టిల్లు చేరితే పరమేశ్వరునికి పూజలు చేసే వారెవ్వరు. మళ్లీ నువ్వు ఎప్పుడు వస్తావో. మా అందరికీ ఆనందాన్ని చేకూరుస్తావో అని తల్లి జరిపిన పండుగలను తలచుకుంటూ కవి పలికిన పలుకులవి.

**భావం :** తల్లి జీవించి ఉండగా వినాయకచవితి పండుగ రోజున కుడుములు, ఉండ్రాళ్లు చేసి తన కడుపునింపేదని, ఈనాడు ఆమె లేకపోవుటచే కడుపుమంటలతో అలమటించే తనకు రుచికరమైన భోజనం ఎప్పుడు లభిస్తుందోనని, ఇక ఈ లోకంలో వినాయక చవితి పండుగ ఉంటుందో లేదోనని కవి దుఃఖిస్తూ పలికాడు.

**5. నాదు సుకృతంపు తెప్పవై నన్ను తేల్చు.**

ఈ పద్యపాదం 'మాతృగీతాలు' అనే స్మృతికావ్యం నుండి గ్రహించబడింది. కవి నాయని సుబ్బారావు. తల్లి మరణానికి దుఃఖిస్తూ ఆమె స్మృత్యర్థంగా కవి రచించిన కావ్యమిది.

**సందర్భం :** తల్లిపోయిన తరువాత అంత్యక్రియలు చేసే సమయంలో, ఆమె స్వర్గంలో వైతరిణీ నదిని దాటాలంటే ఒక ఆవును దానం చేయాలని బ్రాహ్మణుడు కోరాడు. ఆ సమయంలో తల్లి పవిత్రతను తలుచుకుంటూ నీ స్పర్శసోకితే వేయి దేవలోక పద్మాలు పుట్టగలవని ఆమెను ప్రశంసిస్తూ కవి అన్న మాటలివి.

**భావం :** వైకుంఠ ద్వారానికి నువ్వు ఉషోదయకాలంలో రకరకాలైన అలంకారాలను చేస్తావు. ఆపుణ్య ఫలితం నా జీవితంలో సుకృతపు తెప్పగా నన్ను తేల్చగలదని తల్లినుద్దేశించి కవి పలికాడు.

**6. కాలచక్రమ్మునకు నన్ను కట్టివైచి**
**ఎగిరి పోతివ శాశ్వతమ్మగు సుగతికి**

ఈ పద్యపాదలు నాయని సుబ్బారావుగారు రచించిన మాతృగీతాలు అనే కావ్యం నుండి గ్రహించబడినది. స్మృతి కావ్యాలలో ప్రసిద్ధమైన కావ్యమిది.

**సందర్భం :** అన్ని కాలాలలో తల్లి తనకు అండగా ఉండేదని, నేడు చలికాలంలో ఆమె లేకపోవటం వలన చలితీర్చే ఆమె పైట చెఱగు లేక తన చలితీరిపోయిందని కవివాపోయాడు. తల్లీ నువ్వు ఎంతో దయలేని దానివి. కాకపోతే నాకిట్టి కఠిన శిక్షను విధిస్తావా అని ఆమెను ప్రశ్నిస్తూ కవి అన్నమాటలివి.

**భావం :** నన్ను ఒంటరిని చేసి పైలోకాలకు తరలిపోయావు. కాలమనే చక్రానికి నన్ను బంధించి, నువ్వు మాత్రం శాశ్వతంగా స్వర్గానికి తరలిపోవటం నీకు న్యాయమేనా అని కవి తల్లిని ఉద్దేశించి పలికాడు.

**7. చిన్ని నీవిగ్రహము ప్రతిష్ఠితము నాదు**
**నంతరంగమ్ము నీకు దేవ్యాలయమ్ము.**

ఈ పద్యపాదాలు 'మాతృగీతాలు' అనే స్మృతికావ్యం నుండి గ్రహించబడినవి. కవి భావకవులలో అగ్రగణ్యులైన నాయని సుబ్బారావుగారు.

**సందర్భం :** తల్లి పూజకై కవి చిరకాలం శ్రమించి మంచి పూజాద్రవ్యాలను సేకరించి, పూజకు సంసిద్ధమయ్యాడు. ఇంతలో అశని పాతంగా తల్లి మరణించింది. నువ్వొక సంవత్సరం ఓపిక పడితే నాకోరిక నెరవేరేది కదా అని దుఃఖిస్తూ కవిపలికిన సందర్భములోనివీ మాటాలు.

**భావం :** నా జీవితము నీ స్మృతికి చెక్కబడిన శిలాశాసనం. నీ మనోజ్ఞమైన విగ్రహం నా మనసనే దేవ్యాలయంలో ప్రతిష్ఠితమైనదని తల్లి పట్ల తనకు గల ఆరాధనను కవి వ్యక్తం చేసాడు.

**8. నామానసమ్ము నీకంకితమ్ము**
**వ్రాసికొను మందు నీయిచ్చవచ్చినట్లు.**

ప్రముఖ భావకవి శ్రీ నాయని సుబ్బారావు తల్లి స్మృత్యర్థం రచించిన 'మాతృగీతాలు' అనే స్మృతికావ్యంలోనివి ఈ పద్యపాదాలు.

**సందర్భం :** తల్లి అంత్యక్రియలలో పెట్టిన పిండాలను కాకులు ముట్టలేదు. ఆమె మనసులో ఏదో తీరని కోరిక ఉండి ఉండవచ్చునని, అందువల్ల ఆమె ఆత్మకు శాంతి చేకూరలేదని కవి భావించాడు. రేపు తప్పక సాంబ్రాణి ధూపాన్ని వేసి ఆమె కోరికను నెరవేరుస్తానని ఆమెకు మాటయిస్తూ కవి అన్న మటాలివి.

**భావం :** తనపై లేశమాత్రం అనుమానం వద్దని, తన మనసు ఆమెకు ఏనాడో అంకితమైనదని, అందులో ఆమె ఇష్టమైనదానిని వ్రాసుకొనవచ్చునని కవి తల్లిని ఉద్దేశించి పలికాడు. మరణించిన వారికి అంజలి ఘటిస్తూ పిండప్రదానం చెయ్యటం, సాంబ్రాణి ధూపాన్ని వేయటం హిందువుల సంప్రదాయం. వారి ఆత్మకు శాంతి కలగకపోతే కాకులు పిండాలను ముట్టవనే నమ్మకాన్ని తన మాటల్లో కవి స్ఫురింపచేశారు.

**9. 'నెత్తిపై మొట్టి తినిపింతు నిలువకుబుకు**
**చీర చెఱగున నాదు కన్నీరు తుడిచి'**

నాయని సుబ్బారావుగారు రచించిన మాతృగీతాలు అనే స్మృతి కావ్యం నుండి గ్రహించబడిన పద్యపాదాలివి. భావకవులలో ఉత్తమ స్థాయికి చెందిన కవులలో సుబ్బారావుగారొకరు.

**సందర్భం :** తల్లి పరలోకగతురాలైనందుకు కవి తీవ్రంగా విలపించాడు. ఆమె తిరిగి రాకపోవుటచే తానామె ఉన్నలోకాన్ని చేరుకుంటానని అక్కడ అమృతంతో తడిసిన దారులలో తామిద్దరు చీకుచింతలు లేక తిరిగి తల్లిబిడ్డాటలను ఆడుకుందామని కోరుతూ పలికిన పలుకులివి.

**భావం :** స్వర్ణలోకంలో కూడా తానామెతో ఆడుతూ అలుగుతానని అప్పుడామె అన్నాన్ని కలిపి నోటిలో కూరి తినిపించాలని తాను తినక బెట్టు చేస్తే నెత్తిన మొట్టి ఉక్రోషంతో తన కళ్లనుండి జారే నీటిని ఆమె పైటచెంగుతో తుడిచి తనను ఊరడించాలని కవిభావించాడు. ఈ మాటల్లో కవి బాల్యస్మృతులు తల్లితో అతనికి గల గాఢానుబంధం సువ్యక్తం అవుతున్నాయి.

**10. నిదుర పోదును జోలపాడుదువు నీవు**
**చిచ్చికొట్టుచు చీకటుల్ విచ్చుదనుక**

శ్రీ నాయని సుబ్బారావు భావకవులలో అగ్రగణ్యులు. వారు మాతృస్మృతితో రచించిన కావ్యం మాతృగీతాలు. ఆ స్మృతికావ్యం నుండి గ్రహించిన పద్యపాదాలివి.

**సందర్భం :** అంధకారబంధురమైన రాత్రి తల్లి మానవలోకపు సరిహద్దులుదాటిందని, దేవపూజపైగల వ్యామోహంలో కన్నకుమారుని విస్మరించటం తగదని తన ఆవేదనను వ్యక్తం చేస్తూ కవి పలికిన పలుకులివి.

**తాత్పర్యం :** తాను తల్లి కోసం ఈ లోకపుమేరలను చేరగలనని, స్వర్గలోకానికి, మానవలోకానికి సరిహద్దురేఖపై తన తల్లి ఒడిలో తాను నిద్రిస్తానని కవి పలికాడు. తాను నిద్రించే సమయంలో తనకు చిచ్చికొట్టి, జోలపాడి తెల్లవారు వరకు తల్లి లాలించాలని ఆయన కోరిక. కవి ఎంత ఎదిగినా అంత రంగంలో పసితనపు కోరికలు తల్లిపై మమకారం వీడిపోలేదు. అందువల్లనే ఆమె ఒడిలో తాను సేదదీరాలనే భావాన్ని ఇందు కవి స్పష్టంగా తెలియపరచాడు.

**11. కాల పుస్తకపుం బుటలేల వెనుక**
**వత్తుకొని పోయినవి తీయ నలవి గాక**

ఈ తేటగీత పద్యపాదాలు ప్రముఖ భావకవి వ్రాసిన మాతృగీతాలు అనే కావ్యం నుండి గ్రహించబడినవి. నాయని సుబ్బారావుగారు తల్లిమరణానికి దుఃఖిస్తూ ఆమె స్మృతికి నీరాజనంగా రచించిన స్మృతికావ్యమిది.

**సందర్భం :** తన ప్రాణప్రదమైన తల్లిని మృత్యువు పేరుతో ఆ భగవంతుడు విడదీసి తన హృదయంలో వాడి శూలాన్ని దింపాడని, ఆ శూలపుపోటు వలన హృదయంలో మంటలు చెలరేగాయే కానీ ఒక్క నెత్తురుబొట్టైనా ప్రవించలేదని కవి పలికాడు. తల్లి లేకపోవటం వలన హృదయంలో మంటలకు తోడు కడుపులో మంటలు కూడా జోడైనాయని అయినా తన బాధను వ్యక్తం చేయటానికి ఒక్క కన్నీటిచుక్కైనా రాలిపడదని కవి చింతిస్తూ పలికిన పలుకులివి.

**భావం :** మధురవాత్సల్యమూర్తి అయిన తల్లి కనువిందు చేసే శుభోదయాలు నాకికలేవు. ఆమెను స్మృతులలో తలచుకొని ఆనందిద్దామని భావించినా కాలపుస్తకము యొక్క వెనుక పుటలన్నీ వుత్తకొని పోయి విడదీయటానికి సాధ్యం కాని విధంగా ఉన్నాయని కవి తెలియచేసాడు.

**12. నాహృదయవేదనా పరిణామ మింక**
**వచ్చుగావలె వత్సర వత్సరమ్ము**

ఈ పద్య పాదాలు శ్రీ నాయని సుబ్బారావు రచించిన మాతృగీతాలు అనే స్మృతికావ్యంలోనివి. మాతృస్మృతికి కవితా నీరాజనంగా కవి కూర్చిన అక్షరరూపమిది.

**సందర్భం :** తన తల్లి పుష్యబహుళ చతుర్దశినాడు కళ్లు భేదింపరాని కటిక చీకటి రాత్రి తనను తప్పించుకొని మాయమైపోయిందని ఆ భీకరమైన రాత్రి ఆమె పోయిన మార్గాన్ని తెలుసుకోవటానికి లేతవెన్నెల పొడకూడా లేదని కవి దుఃఖిస్తూ పలికిన పలుకులివి.

**భావం :** నేటి నుండి పుష్యబహుళ చతుర్దశి పుణ్యతిధి తల్లి తిథిదినమైనదని ప్రతివత్సరమూ వచ్చే అతిథి తల్లి మరణదినంగా తన స్మృతిపథంలో నేపథ్యంగా నిలిచి తన హృదయంలో తీవ్ర వేదనను రేపగలదని ఆమె స్మృతి చిహ్నంగా ఆ రోజు నిలిచిపోతుందని కవి తెలియచేసాడు.

**13. "పానుపడని చిచ్చు రగిలించి పోయినావు**
**కాల సంద్రపు చెలియలి కట్టదాటి"**

ఈ తేటగీతి పద్యపాదాలు మాతృస్మృతికి అక్షర నీరాజనంగా నాయని సుబ్బారావుగారు రచించి సమర్పించిన మాతృగీతాలు అనే స్మృతికావ్యం లోనివి.

**సందర్భం :** తన తల్లి తనను బొంత జెముడు ముళ్ళమొక్కల మధ్య ఉన్న మామిడి చెట్టు ఫలాన్ని కోయమని ఆదేశించిందని దాన్ని కోయటానికి తాను పడిన పాట్లు తనకు ఎఱుక అని కోసే సమయంలో ముళ్ల వలన దేహం రక్తసిక్తమైనా తను లెక్కచేయలేదని తెలుపుచు కవి పలికిన పలుకులివి.

**భావం :** తల్లి కోర్కె తీర్చటానికి తాను అష్టకష్టాలు పడి దాన్ని నెరవేర్చే తరుణంలో తన కష్టాన్ని అపహాస్యం చేస్తూ ఆమె కాలసముద్రపు దూర తీరాలను దాటి కానరాని చోటుకు వెళ్లిందని తన ప్రయత్నమంతా వ్యర్థమైందని కవి పలికాడు.

తల్లి మరణం తనలో ఆరని చిచ్చురగిలించిందని తల్లి తిరిగిరాని లోకాలకు వెళ్లి తనను ఏకాకిని చేసిందని కవి అభిప్రాయం జీవిత గమనంలో ముళ్లవంటి అనేక సమస్యలుంటాయని అవి ఎంత బాధించినా వెనుదిరగక ప్రయత్నం చేసేవారికే మధురమైన జీవనఫలం లభిస్తుందనే భావాన్ని కవి ఈ మాటల్లో ప్రతీకాత్మకంగా స్ఫురింపచేసారు. జీవితంలో రసాలఫలం అనే భావాన్ని కవి ఇందు ధ్వనింప చేయటం విశేషం.

**14. 'అమ్మయేదిరా' యన్నవాయలులు నన్ను**

ఈ పద్యపాదం నాయని సుబ్బారావుగారు రచించిన మాతృగీతాలు అనే స్మృతి కావ్యంలోనివి. కవి తన తల్లి మరణానికి పరితపిస్తూ వ్రాసిన స్మృతి కావ్యమిది.

**సందర్భం :** తల్లిలేని బిడ్డడంటే అందరికీ లోకువ, సానుభూతి తల్లిలేని పిల్లవాడైన తనను చేతనా చేతనములైన వన్నీ ప్రశ్నించి సానుభూతిని ప్రకటిస్తున్నట్లు కవి భావించాడు. తల్లి మరణానంతరం ఉషోదయకాలంలో ఒంటరిగా కవిస్నానార్థం బావి దగ్గరకు వెళ్లాడు. అతణ్ణిచూసి, తల్లి ఒడ్డును ముద్దుగానే బావిలోని అలలు మీ అమ్మేదిరా అని ప్రశ్నించి జాలినొందినట్లు కవి భావించుకున్న సందర్భములోనివీ మాటలు.

**భావం :** లోకంలో అందరికీ అమ్మ ఉన్నది నాకు మాత్రం లేదు అని కవి తలచాడు. బావిలోని అలలు బావిగట్టును దాటిరావు తల్లి ఒడిలోని పిల్లవాడు అంతే. అందువలన తల్లి ఒడ్డుఅనే రక్షణలో ఉన్న అలలు నాకు అమ్మ ఉన్నది మీ అమ్మ ఏది అని కవి ప్రశ్నించినట్లుగా ఆయన భావించాడు.

**15. అమ్మకిది గుండెలవియు నర్థమ్ముచెప్పి**

ఆ పద్యపాదము నాయని సుబ్బారావుగారు రచించిన మాతృగీతాలు అనే కావ్యం నుండి గ్రహించబడింది. తెలుగు స్మృతికావ్యాలలో అత్యుత్తమమైనది మాతృగీతాలు.

**సందర్భం :** కవి తల్లి జీవించిన రోజులలో ఆమె విలువను తెలుసుకోలేక పోయానని చింతించాడు. పసితనంలో అమృతంతో పొల్చదగిన ఆమెచనుబాలనుతాగి, ఆమె చేతులలో లాలింపబడిన రోజులలో అమ్మ అనే మాటకు అర్థాన్నైనా తెలుసుకోలేక పోయానని, యౌవనగర్వంతో కన్ను మిన్నుగానక చరించి తల్లి కన్నీటికి కారకుడైన తాను ఆ కన్నీటిలో మాతృత్వపు మమకారపు విలువ గుర్తించలేని మూర్ఖుడనయ్యానని తనను తాను నిందించుకుంటూ పలికిన మాటలివి.

**భావం :** తల్లి బ్రతికి ఉన్నన్ని రోజులు ఆమె విలువ తెలుసుకోలేకపోయిన తాను ఆమె నిర్జీవమైన దేహాన్ని అతి కఠోరమైన చితాగ్నిలో కాల్చి బూడిద చేసి ఆ బూడిదను గంగపాలు చేసానని అమ్మ అనే పదానికి విధంగా గుండెలవిసిపోయే అర్థాన్ని తాను తెలిపానని తనను నిందించుకున్నాడు.

**16. ...... పరిపూతవై పంచినావు నాకు**
**కాళహస్తీశ్వరుని కటాక్షముల మధువు.**

ఈ పద్యపాదాలు నాయని సుబ్బారావుగారు రచించిన మాతృగీతాలు అనే స్మృతికావ్యం నుండి గ్రహించబడినవి.

**సందర్భం :** తల్లితో తాను గడిపిన రోజులను కవి స్మరించుకున్నాడు. గడిచిన ఏడు శివరాత్రి పర్వదినాన తాను తల్లితో కాళహస్తీశ్వర క్షేత్రాన్ని దర్శించినట్లు ఆనాడు అమ్మతో తాను గడిపిన ఆస్మృతులను మనోపేటికలో పదిలం చేసుకున్నట్లుగా తెలుపుతూ కవి వెలయించిన భావాలివి.

**భావం :** తల్లితో కవి శివరాత్రి నాడు కాళహస్తిని సందర్శించాడు. అతని తల్లి పవిత్రమైన సువర్ణముఖీనదిలో సుస్నాతయై దైవ దర్శనం చేసుకొని తనకు కూడా కాళహస్తీశ్వరుని కటాక్షమనే అమృతాన్ని ప్రసాదించినట్లు కవి భావన. ఈ మాటల్లో తల్లీ బిడ్డల అనుబంధం వ్యక్తమౌతున్నది.

**17. ఇంక ఁగల యుగాదుల నన్నుకాలగళుని జేసి**

ఈ మాటలు భావకవులలో అగ్రగణ్యులగు శ్రీ నాయని సుబ్బారావు రచించిన స్మృతికావ్యమైన 'మాతృగీతాలు' లోనిది. తల్లి దివ్యస్మృతికి అక్షరనీరాజనం ఈ కావ్యం.

**సందర్భం :** తల్లి జీవించినంతకాలం తనకు చేసిన సేవలను కవి స్మరించుకున్నాడు. ఆమె మరణానంతరం తల్లిలేని బిడ్డడైన తనను సంరక్షించే వారే కరువైనారని ఆయన అభిప్రాయం. ఆనాడు ఉగాది. అయినా జడలుగట్టిన తన శిరోజాలను చిక్కుతీసి తలంటేవారే లేరని అట్టి సేవలను చేసిన తల్లి అమృతహస్తాలీనాడు గుర్తురాగానే లోన హృదయం కదిలిపోతున్నది కవి తెలిపాడు. అమ్మ ఉగాది రోజున తినిపించిన ఉగాది పచ్చడి అమృతోపయానంగా ఉండేదని కవి నమ్మకం. కానీ ఆమె మరణానంతరం ఉగాది నాడు బ్రాహ్మడు తినిపించిన వేపపూత పచ్చడి చేదులముద్దగా ఉన్నదని తాను పుట్టిన ఇంతకాలానికిపుడు చేదును చవి చూసే స్థితి వచ్చిందని దుఃఖిస్తూ కవి పలికిన పలుకులివి.

**భావం :** తల్లి మరణమే తనపాలిట కాలకూట విషంగా పరిణమించిందని దానిని పరమాన్నంగ తల్లి తనకు పంచిందని మింగరాని కాలకూటాన్ని మింగిన శివుని వలె తానును చేదు నిజాన్ని భరింపక తప్పదని అందువలన తాను శివునితో సమానుడయానని కవి అభిప్రాయం.

## 9.6 ప్రశ్నలు - సమాధానాలు :

**1. 'మాతృగీతాలు' అనే కావ్యంలో కవి నాయని సుబ్బారావుగారు మాతృస్మృతిలో పరితపించిన విధం వివరించండి.**

జ॥ ఆధునిక ఆంధ్రకవులలో నాయని సుబ్బారావుగారు అగ్రగణ్యులు. భావకవితాయుగంలో రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నండూరి సుబ్బారావు మొదలైన కవులతో సమానమైన వారుగా ప్రతిపత్తిని పొందారు. రాసిలో తక్కువైనా వాసిలో ఎన్నదగిన కావ్యాలను రచించారు. ఆయన ఎద ఎంతో కోమలం. ధృడతరమైన భవబంధాలు మమతానురాగాలు కలవ్యక్తి. తల్లి మరణానికి పరితపిస్తూ వారు రచించిన స్మృతికావ్యం మాతృగీతాలు. 'శోకం శ్లోకంగా' అవతరించినట్లు వారి ఆవేదన కవిత్వంగా పరిణమించి ఈ కావ్యరూపం దాల్చింది తల్లి మరణానంతరం ఆమె ఎడబాటును తట్టుకోలేక దుఃఖార్తిలో బాల్యస్మృతులను నెమరువేసుకుంటూ నాయనివారు చేసుకున్న హృదయావిష్కరణకు అక్షర రూపం 'మాతృగీతాలు'.

నాయని తల్లి ఉదయమ్మ. ఆమె 1924లో మరణించింది. ఆమె స్మృతికి నీరాజనంగా కవి ఈ గీతాలను రచించారు. తన హృదయగత భావాలను తల్లిపై తనకు గల గౌరవాభిమానాలను ఇందు నివేదించుకుంటున్నట్లుగా గేయాల గమనం సాగుతుంది. ఇందులోని భావాలు ఆత్మాశ్రయరీతిలో సహజశైలిలో కరుణ రసాత్మకంగా హృదయాన్ని తాకుతాయి. తల్లి మరణంతో కవికి లోకమంతా శూన్యంగా గోచరించింది. అతని బ్రతుకు అంధకారబంధురమైంది. తనను దిక్కులేని వానిగా, ఏకాకిగా కవి భావించుకున్నాడు. అతని జీవితం తల్లిచుట్టు పెనవేసుకున్నది. ఉన్నదాని విలువ అది చేతిలో ఉన్నప్పుడు కాక చేజారిన తరువాత తెలుస్తుంది. అదే విధంగా తల్లిప్రేమ ఆమె దూరమైన తరువాతే కవికి మరింత మధురంగా అనిపించింది. శోకతప్తమైన హృదయంతో తల్లికి తనకు గల అనుబంధాన్ని కవి పాఠకులకు నేత్రగోచరం చేసాడు.

ప్రేమామృత మూర్తి అయిన తల్లిని తన నుండి దూరం చేసి తమ నట్టింటి దీపాన్ని ఆర్పి జీవన కాంతులను హరించి తనను "తల్లిలేని బిడ్డను గావించి మానసంపుటాసలన్నియు నడుగంటఁగోసినాడని" నిర్దయాస్వాంతుడు కర్మరుడైన దుర్విధిని కవి నిందించాడు. ఆమె ఎడబాటుకు తట్టుకోలేక తీవ్రమైన దుఃఖంలో మునిగాడు.

దేవపూజకు వెళ్లిన తల్లి కొంగుపట్టుకొని తానామెతో వెల్లలేకపోయానని దేవపూజలో నిమగ్నమైన ఆమెనుతనను విస్మరించవద్దని ప్రార్థించాడు. ఆమె తిరిగి తప్పక వస్తుందనే ఆశతో పదిరాత్రులు కళ్లుకూరుకొనిపోతున్నా ఆమె వచ్చేదారిలో మంచినీళ్ల చెంబును దీపాన్ని ఉంచి ఎదురు చూసాడు. కానీ ఆమె మరలిరాలేదు. నేను మూర్ఖుడను కాబట్టి ఈ విధంగా ఆలోచించాను కానీ అమృతసాగరపు అవతలి తీరం చేరిన నీవు " ఈ చవటిపట్టి నీరమ్ములేల వలతు" వని తల్లిని నిలదీసాడు.

'ఆమె పార్వతీదేవి. ఆమె మరణంతో పూల రథం కదిలిపోయింది. వల్లకాడు పూలవనంగా మారింది'. అని ఆమెను కడసారిగా చూడటానికి వచ్చిన జనులు ఆమెను ప్రశ్నిస్తూ పలికారు. నువ్వుపార్వతీదేవివే కానీ పుట్టిల్లు చేరితే పరమేశ్వరునికి పూజలు చేసేవారెవ్వరు? 'మళ్లీ నువ్వు ఎప్పుడు వస్తావో రుచులూరించు కుడుములు ఉండ్రాళ్లతో కడుపుమంటలనెప్పుడు చల్లారుస్తావో ఈ జీవితంలో ఇంక వినాయక చవితి ఉన్నదో లేదో అని కవి ప్రశ్నించాడు.

'ఒక ఆవును దానం చేస్తే నువ్వు వైతరిణిని దాటగలవని బ్రాహ్మడు పలికాడు కానీ నీస్పర్శసోకితే అమరశైవాలినీ సహస్రాలు పుడతాయి. నీకు యమలోకం ఎంతో దూరం. ఆ భగవంతుడే వైకుంఠానికి దివ్యాభరణంగా నిన్ను పిలిపించుకున్నాడు. తల్లీ వైకుంట ద్వారమందిరానికి నువ్వు ప్రభాతకాలంలో చేసే దివ్యాలంకారాలు నా జీవితాన్ని సుకృతపు తెప్పలై తేల్చగలవని' అమె పవిత్రతను స్మరిస్తూ కవి తెలిపాడు. తన తల్లిదయలేనిదని కాలచక్రానికి తనను శాశ్వతంగా బంధించి తాను స్వర్గానికి వెళ్లిపోయిందని తననిట్లు శిక్షించటానికి ఆమె చేతులెట్లాడె నాయని పరితపించాడు. నా గుండె గుడిలో నీమనోహరమైన విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నాను. నా జీవితం నీస్మృతికి చెక్కబడిన శిలాశాసనమని కవి ఆమెను స్మరించుకున్నాడు.

తల్లిపట్ల కవికి విశేషమైన ఆరాధనాభావం ఉంది. "నామనసున దేవజాతికి పూజార్హమైన పారిజాతవృక్షాన్ని పెంచుకున్నాను. తరుణమాసన్నమైన తరువాత దాన్ని నీపాదాలకు సమర్పించాలని భావించాను. కానీ ఆ పారిజాతం తొలిపూత పుట్టకమునుపే మృత్యువు నిన్నుహరించింది. నా కన్నీటిలో తడిసిన అలరుగుత్తులు బయటకు రాలేకపోతున్నాయి. అని కవి విలపించాడు.

ఆమె మనసులో తీరని కోరిక లేవో ఉండి ఉంటాయిని అతని అభిప్రాయం. అందువల్లనే అంత్యక్రియలలో ఉంచిన పిండాలను కాకులు ముట్టలేదని అనుమానపడ్డాడు. తల్లీ నీమనసు శాంతించునట్టు సాంబ్రాణి ధూపాన్ని వేసి నీకు మ్రొక్కతాను నా మనసు నీకంకితమైనది. " వ్రాసికొను మందునీ యిచ్చవచ్చినట్లు" అని మాతృఋణం తీర్చుకోవటానికి పరితపించాడు.

తల్లిని విడిచి ఉండలేక స్వర్గంలో నీవేంచేస్తున్నావని ప్రశ్నించాడు. స్వర్గంలో అమృతంతో తడుపబడ్డ దారులతో నీతో నేను సంచరిస్తాను. చీకుచింతలు లేక తల్లి బిడ్డల ఆటలను అక్కడ ఆడుకుందాం అని ఆశాభావాన్ని వ్యక్తం చేసాడు. ఈ సందర్భంలో తల్లి తనకు గోరుముద్దలను తినిపించిన చిన్ననాటి సన్నివేశాన్ని స్మరిస్తూ

*"నేనలుగుచుందు నన్నమ్మ నీవు కలిపి*
*తెచ్చి నానోటిలో కూరి తినక యున్న*
*నెత్తపై మొట్టి తినిపింతు నిలువ కుబుకు*
*చీర చెఱగున నాదు కన్నీరు తుడిచి"*

అంటూ తల్లితో పెనవేసుకున్న గాఢానుబంధాన్ని నెమరు వేసుకున్నాడు. తల్లిలేని బ్రతుకు గడువరానిదైనదని ఆవేదన చెందాడు. తల్లిలేని గాడాంధకారంలో మిణుగురు పురుగుల వెలుగును ఆధారంగా చేసుకొని తాను మానవలోకపు హద్దులను చేరాలని ఆశించాడు. దైవపూజలైన తరువాత పరమవాత్సల్య మూర్తి అయిన తన తల్లి ఒక నిముషమైనా తనను చేరదీస్తే చాలని కోరుతూ

*" రెండుపోలిమేర లొక్కటైన రేఖమీద*
*నేను యొడి యందున మేను మరచి*
*నిదురపోదును జోలపాడుదువు నీవు*
*చిచ్చికొట్టును చీకటుల్ విచ్చుదనుక"*

తనను లాలించాలని ఆమెను అర్థించాడు. దయలేని భగవంతుడు తన హృదయంలో వాడి శూలాన్ని గుచ్చాడని అట్టి మంటలకు తోడు కడుపు మంటలు జోడై తనను దివారాత్రాలు దహిస్తున్నాయని కానీ ఏమి పాపం చేసానోకానీ  ఒక్క కన్నీటి చుక్కైనా ఊడిపడటం లేదని విచారించాడు. మధుర వాత్సల్యవాహిని మాతృమూర్తి కనువిందు చేసే శుభోదయాలు తనకిక లేవని కనీసం స్మృతి పథంలో అయినా ఆమెను ఊహించుకుందామనుకుంటే

***కాలపుస్తకంబుపుటలేల వెనుక***
***వత్తుకొనిపోయి నవి తీయ నలవిగాక***

అని తన అసక్తతను వ్యక్తం చేసాడు. నీ కోసం నేనెంతో విలపించాను. కానీ నువ్వు నిర్ధయగా ఈ మాయాలోకపు నాట్యరంగ తెరలను చీల్చుకొని కనుమరుగైపోయావు. బిడ్డపై వాత్సల్యం కంటె స్వర్గసుఖాలపై నీకు వ్యామోహం ఎక్కువైందా అని ఆమెను నిలదీసాడు.

అతని తల్లి పుష్యమీ బహుళ చతుర్దశి రాత్రి యందు మరణించింది. అందువలన ఇక ప్రతివత్సరం ఆ తిధి తన  మనో వీధి యందు వేదనా తరంగాలను లేపగలదని పలికాడు. తల్లి తనను తీర్చిదిద్దటానికి ఎంత శ్రమించిందో కవి అంత రంగంలో బాగా నిలిచిపోయింది. ఆ భావాన్ని ప్రతీకాత్మకంగా వ్యక్తం చేస్తూ బొంతజెముడు ముళ్లమధ్య రసాలవృక్షాన్ని తల్లి చూపించిదని దాని మధుర ఫలాన్ని కోయవలసిందిగా ఆజ్ఞాపించిందని తెలిపాడు. ఆ బొమ్మజెముడు ముళ్లపట్టలు తన దేహాన్ని రక్తసిక్తం చేస్తున్నా తానా ప్రయత్నాన్ని విరమించుకోలేదని. తీవ్ర కష్టసాధ్యమైన ఆఫలం అదే తరుణంలోనే తనను అపహాస్యం చేస్తూ కాలసంద్రపు హద్దుల నామె దాటి వెళ్లిందని తెలిపాడు.

తన తల్లి కూడా ఒక రకంగా దురదృష్టవంతురాలనేనని కవి భావన. ఆ అమృత ఫలాన్ని ఆమె రుచి చూడలేదని ఆ సుకృతపునోము ఆమె నోచుకోలేదని సంతానపు ఉన్నతిని చూడకనే ఆమె తరలివెళ్లిందని అయినా పైలోకాలలో కూడా తన

ఉన్నతిని ఆశించే ఆమె పవిత్రమైన చల్లని పాదాలను తన తలపైదాల్చి పవిత్రతను సంతరించుకోవటము తన జీవన ధ్యేయం అని వివరించాడు. కటాక్షవీక్షణాలతో తన జీవన పథాన్ని వెలిగింపచేసే ఆమె ఆశీస్సుల నతడు ఆశించాడు.

తల్లిలేని బిడ్డ అయిన తనను చూసి లోకమంతా సానుభూతిని చూపిందట. బావికి స్నానానికి వెళ్లగా అందలి అలలు అమ్మ ఒడ్డును తాకుతూ 'మీఅమ్మ ఏదిరా' అని ప్రశ్నించాయట. బావిలో ఈదుతూ చిన్నతాబేలు తనను చూసి సుడులు రేపుతూ జలగర్భంలో మునిగినదట. ఆ సుడులు శూన్యానికి సంకేతమని కవి అభిప్రాయం కప్పను మింగిన నీటిపాము 'నీకమ్మలేదని' పలికిందని ప్రతీకాత్మకంగా కవి తెలిపాడు.

మాతృవాత్సల్యంలో బాల్యమాదిగా మునిగిన తాను ఆమాధ్యుర్యాన్ని విలువను తెలుసుకోలేక పోయాననే ఆవేదనను వ్యక్తం చేసాడు. తన రక్తాన్ని పాలుగామార్చి. మిక్కిలి ప్రేమతో అమృతం వంటి స్తన్నాన్నిచ్చి తన చేతులతో లాలించి పెంచిన తల్లిప్రేమను ఏమీ ఎరుగని ఆప్రాయంలో తెలుసుకోలేక పోయానని యౌవనంలో గర్వాంధకారంతో తల్లిని నిర్లక్ష్యం చేసిన తాను ఆమె కన్నీటి భాష్పాలలో మాతృప్రేమను గుర్తించలేని మూర్ఖుడను అయ్యానని తెలుపుతూ ఆ అమృతమూర్తిని

*" ఇప్పుడు నిర్జీవమైన నీవపువుతెచ్చి*
*అతి కఠోర భీషణము చితాగ్నియందు*
*కాల్చి బూడిద చేసి గంగకువదలితి*
*అమ్మ కింది గుండెలవియు నర్థమ్ము చెప్పి"*

అని ఆ తల్లిని చితిమంటలకు గురి చేసిన తన కాఠిన్యాన్ని కవి నిందించుకున్నాడు.

వెనుకటి శివరాత్రి నువ్వు నన్ను పదిలంగా వెంట బెట్టుకొని వెళ్లి సువర్ణముఖినదిలో సుస్నాతవై శ్రీకాళహస్తీశ్వరుని సందర్శించిన పుణ్యఫలాన్ని నాకు పంచావు. కానీ ఈ యేడు నన్ను వదిలి ఆకాశగంగలో మునిగి పరమేశ్వర సందర్శన భాగ్యం పొందటం నీకు న్యాయమేనా? అని తల్లిని ప్రశ్నించాడు. నువ్వు దూరమైన శిరోజముల చిక్కుతీసి ఉగాది పర్వదినాన నా తలంటు వారెవ్వరూ లేరు. నీవు తినిపించిన ఉగాది పచ్చడి మాధుర్యభరితం. కానీ నేడు బ్రాహ్మడు తినిపించిన వేపపూత పచ్చడి చేదుల ముద్ద నేను పుట్టి ఎరిగినది మొదలు నీవేనాడు చేదును రుచిచూపలేదు. నేడు ఆ చేదు నాకిక నిజమను విషయం స్పష్టమైనది. ఈ చేదును మింగుతు నేను కాలకూట విషాన్ని ఆహరించిన పరమ శివునితో సమానమైనానని కవి తన ఆవేదనను వ్యక్తం చేస్తూ పలికాడు.

మాతృగీతాలు అనే స్మృతికావ్యంలో కవి ఈ విధంగా నిష్కల్మషంగా తెరమరుగులు లేకుండా తన హృదయంలోని భావాలను ఉన్నవి ఉన్నట్లు ఆవిష్కరించాడు. ఈ కావ్యం ఆయన హృదయదర్పణంగా అభివర్ణించవచ్చు.

**2. స్మృతి కావ్యాలలో మాతృగీతాలు విశిష్టమైనది - వివరించండి.**

**లేదా**

**ఆధునికాంధ్ర కవులలో నాయని సుబ్బారావుగారు అగ్రగణ్యులు అనే విషయాన్ని 'మాతృగీతాలు' అనే కావ్యం ఆధారంగా నిరూపించండి.**

జ॥ కందుకూరి వీరేశలింగంగారి సంస్కరణాత్మకమైన సాహిత్యంతో తెలుగులో నవ్యభావ విలసితమైన సాహిత్య సృష్టి ప్రారంభమైంది. వారి అడుగుజాడలలో తదనంతర కవులు విలక్షణమైన విశిష్టమైన సాహిత్య సృష్టిచేసారు. భావంలో, భాషలో ఛందస్సులో నవ్యతకు ప్రాధాన్యమిచ్చి వినూత్న సాహిత్య సృష్టి చేసారు. ఆధునికాంధ్రకవిత్వంలో గురజాడవారి ముత్యాలసరాలు నవ్యయుగానికి నాందీగీతం పలికింది. భావకవిత్వమనే కవితాశాఖ ప్రారంభమై ఉద్యమరూపాన్ని దాల్చింది. రాయప్రోలు సుబ్బారావు, నండూరి సుబ్బారావు, బసవరాజు అప్పారావు, దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి వంటి ప్రతిభాశాలులు వైవిధ్యభరితమైన కావ్యసృష్టిచేసారు. అట్టి కవుల కోవకు చెందిన భావకవి నాయని సుబ్బారావు. ఆత్మాశ్రయ కవిత్వమైన భావకవితాశాఖకు చెందినవి ప్రణయ కవిత్వం, దేశభక్తి కవిత్వం, కర్షక సాహిత్యం; స్వీయానుభూతులను ఆధారంగా చేసుకొని రచించిన స్మృతి కావ్యాలు కూడా ఆ కవితా శాఖకు

చెందినవే. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలో ప్రారంభమైన కవితా ప్రక్రియ స్మృతిగీతాలు. పాశ్చాత్యుల ఆత్మాశ్రయ కవిత్వంలో Elegy (ఎలిజీ) ప్రధానమైనది.

## స్మృతిగీతాల లక్షణాలు :

స్మృతి గీతం అన్నది కరుణరసాత్మకమైన కవిత్వ ప్రక్రియ. "The elegy is a lyric expressive of melancholy or grief in particular when commemorative of dead friend" అని నిర్వచించారు. ఈ నిర్వచనంలో స్మృతిగీతం అంటే మిత్రస్మృతి అని ప్రత్యేకంగా పేర్కొనబడింది. ఆప్తులైన వారెవరైనను, వారి మరణం గురించి స్మృతి రూపంగా గేయమో పద్యసముదాయమో, కావ్యమో, వ్రాస్తే అది 'ఎలజీ' గానేడు పరిగణిస్తున్నారు. ఇట్టి ఎలిజీలు పాశ్చాత్య భాషల్లో బహుళప్రచారం పొందాయి. ఎలిజీ అనగానే స్ఫురించేది 'గే' వ్రాసిన "Elegy in a country chruch yard" అనే గీతం, మిల్టన్ వ్రాసిన లిసిడస్ (sycidas), కీట్స్ మరణానంతరం షెల్లీ వ్రాసిన ఎడోనెస్ (Adonoasis) Browing వ్రాసిన లాసేజియస్ (Lasaisiaz) మొదలైనవి. టెన్నిసన్ మిత్ర స్మృతిగా వ్రాసిన In Memorium అత్యంతప్రసిద్ధిమైనది. స్మృతి గీతాలలో కేవలం కవి వ్యక్తిగత విషయాలేకాక, తాత్విక దృక్పధాన్ని కూడా వెల్లడిస్తాడు. ఆంగ్ల సాహిత్యంలో ఎలిజీ మిత్రపరంగా, దేశనాయకపరంగా రూపొందిన ప్రక్రియ.

తెలుగు సాహిత్యంలో ఈ ప్రక్రియను శోకగీతం, శోక కావ్యంగా పేర్కొన్నారు. తాపీ ధర్మారావుగారు 1911 లో రచించిన ఇట్టి కావ్యాన్ని 'కారుణ్యము' అని పేర్కొన్నారు. డా.సి.నా.రె దీన్ని స్మృతిగీతం, స్మృతికావ్యం అని సమంజసంగా పేర్కొన్నారు. ఆపేరే ఈ ప్రక్రియకు స్థిరపడింది. స్మృతిగీత లక్షణాలు ప్రాచీనాంధ్ర సాహిత్యంలో కూడా ఉన్నాయి. శ్రీనాధుడు తన చివరి రోజులలో తన నింతవరకు ఆదరించి పోషించిన కవితాపోషకులను స్మరిస్తూ రచించిన చాటుపద్యమైన సీసంలో" కాశికా విశ్వేశుగలిసె .............. స్మృతి కావ్య లక్షణాలు ప్రస్ఫుటంగా ఉన్నాయి. రాయలవారి మరణానికి చింతిస్తూ ఆయనస్మృత్యర్థం పెద్దన రచించిన సీసపద్యం ఎదురైనచో తనమీద కరీంద్రములో కూడా స్మృతి కార్యలక్షణాలున్నాయి. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో ఎలిజీ లేక స్మృతి కావ్యం ఒక ప్రత్యేక కవితా శాఖగా విలసిల్లింది. వావిలాల వాసుదేవశాస్త్రి, రాయప్రోలు, బసవరాజు, నాయని విశ్వనాధ మొదలైన వారు స్మృతికావ్యకర్తలుగా లబ్ధప్రతిష్ఠులు.

తెలుగు కవులు దేశనాయక స్మృతి, సతీస్మృతి, సుతాదికస్మృతి, మిత్రస్మృతితో ఈ గీతాలు రచించారు. నాయనివారి మాతృగీతాలు, తెలుగు స్మృతికావ్యాలలో ఎన్నదగిన రచన విశ్వనాధ సత్యనారాయణగారు 'మాతృగీతాలు' లో 'తెలుగుబాలకుని క్రీడా వైభవమంతా' వెల్లడి అవుతున్నదని ప్రశంసించారు. డా॥ సి.నా.రె ఆప్తస్మృతి కావ్యాలలో మాతృగీతాలు శిఖరాయమానమైన రచన అని పేర్కొన్నారు. ఈ కావ్యంలో నాయని వారి ఆర్ద్రత కవితా ప్రతిభ అడుగడుగునా ప్రతిఫలిస్తున్నది.

మాతృగీతాలులో కవికి తల్లిపై గల ప్రేమానురాగాలు, గాఢానుబంధం సువ్యక్తమౌతున్నాయి. ఆమె మరణానంతరం అతని జీవితమంతా అంధకారబంధురంగా తోచించి ఆమె మరణం అతని పాలిట అశనిపాతమైంది. అందువల్ల దుర్విధిని నిందిస్తూ " నిన్ను తల్లిలేని బిడ్డను చేసి మానసంపుటానలనడు గంట కోసినాడని" విలపించాడు. ఆమె 'శాశ్వతంగా సుగతికి ఎగిరిపోయిందని తనకిక వినాయక చవితి, శివరాత్రి, ఉగాది ఇత్యాది పండుగ లేవీ లేవని విచారించాడు. స్వర్గంలో అమృతాభిషిక్తమైన పధములలో ఆమెతో చీకు చింతలు లేక తల్లిబిడ్డలాటలను ఆడుకుందామని కోరాడు. అక్కడ కూడా తాను 'అలుగుతానని', అపుడు తల్లి నెత్తిన మొట్టుచు అన్నమును కలిపినో నోటిలో కూరి తన కన్నీటిని పైట చెంగుతో తుడిచి ఊరడించాలని కవి ఆశించాడు. మానవ స్వర్గలోకాల పొలిమేరరేఖపై ఆమె ఒడిలో తాను

> **"నిదురపోదును జోలపాడుదువు నీవు**
> **చిచ్చికొట్టుచు చీకటులు విచ్చుదనుక"**

అంటూ ఆమెతో గలగాఢానుబంధాన్ని తలచుకుంటాడు మాతృస్మృతికి కవి సమర్పించిన అక్షర నీరాజనమిది.

మాతృగీతాలు అరవైమూడు తేటగీతులలో కూర్చిన కావ్యం. నాయని వారు సంస్కృతాంధ్ర భాషలలో మంచి పాండిత్యం కలిగిన వ్యక్తి. వారి రచనాశైలిని వివరస్తూ డా॥ సి.నా.రె తేటగీతులలో సుదీర్ఘసమాసాలను అలవోకగా ఇమిడ్చి కమనీయ భావాలను ఆకర్షించటం ప్రత్యేకమైన లక్షణంగా పేర్కొన్నారు. తేటగీతి కమ్మని తెలుగుపద్యం. సాంధ్యరాగ మంజుల రేఖా విరాజమాన మంగళాకాశ సీమంత రంగమందు" "లలిత పూజావిధాన సంలగ్న హృదయవావినిశ్చల ధ్యాన సమాధి" యందు "అవ్యయ దయాంబురాశి సద్యః ప్రసన్న మధురకీర్తి! శ్రీ మన్మహామాతృమూర్తి" "ప్రసన్నాంభోజ సుప్రశాంత విమలరేఖావిలీన భావముల" మొదలైన సుదీర్ఘసమాసాలు అలవోకగా గీత పద్యాలలో పొందుపరచి నాయనివారి కావ్యాన్ని రూపొందించారు.

తేటతెలుగు నుడికారపు మాధుర్యం కూడా ఆయన గీతాల్లో చోటుచేసుకున్నది.

**"నీవు మడిగట్టుకొని పోయినావు పండ్లు**
**పుష్పములు తీసికొని దేవపూజకెటకో**
**నేను నీకొంగు పట్టుక నీదువెంట**
**పోవుటకు లేక కన్నీటి బొట్లురాల్తు"**

అనే గీతంలో తెలుగు నుడికారంలో మాతృత్వపు మాధుర్యాన్ని విస్పష్టం చేసారు.

**"నేనలుగు చుందునన్నమ్మ నీవు కలిపి**
**తెచ్చి నానోటికి కూరి తినక యున్న**
**నెత్తిపై మొట్టి తినిపింతు నిలువకుబుకు**
**చీర చెఱగున నాదు కన్నీరు తుడిచి"**

అని అలతి అలతి వాక్యాలలో మనోహరమైన మాతృవాత్సల్యానుభూతిని దృశ్యమానం చేసారు.

నాయని సుబ్బారావుగారు పదహారణాల తెలుగు కవి. అందువల్ల వారి కవిత్వంలో జాతీయాలు లోకోక్తులు ఎక్కువగా తారసపడుతుంటాయి. 'చీకు చింత లేక' అడుగంటకోసి, కడుపుమంట, కనులుకూరుకొను, కన్నారు, చేతులాడె, పొనుపడనిచిచ్చు ఊంపపుకోత, కడుపుకోసికొనిపోవు, నట్టింటి దీపమ్మునార్పు, చేదులముద్ద, గడుపరానిది మొదలైన జాతీయాలను, పదబంధాలను నాయనివారు భావార్థస్ఫోరకం, సందర్భోచితంగా అత్యంత సహజంగా ప్రయోగించారు.

ప్రతీకాత్మకంగా నాయనివారు ఈ కావ్యంలో తెలిపిన భావాలు విశిష్టమైనవి. భావాన్ని వాచ్యంగాకాక ధ్వనిగా స్ఫురింప చేయటం వారి ప్రత్యేకత. బావిలోని తాబేలు తనను చూచి 'జలము తవ్వుకొనుచు' 'కూపగర్భం'లోకి వెళ్లినదట. అపుడు నీటిలో అలముకున్న 'సుళ్లే'ను తన పాలవిసరిందని కవి వర్ణన. ఇందు నీటిలోని సుడులను కవి శూన్యానికి సంకేతంగా స్వీకరించారు. సుడులు నీటిలో సున్నాలను చుడుతాయని, తల్లి మరణంతో తన జీవితం కూడా శూన్యమైనదనే ప్రతీకాత్మకమైన భావాన్ని నాయని వారిందు పొందుపరచారని, తానీ ప్రయోగాన్ని వేయిపడగలలో అనుసరించారని 'విశ్వనాథ' కొనియాడారు. 'కప్పను మింగిన నీటిపాము' అనే ప్రయోగంలో కూడా తల్లిని మింగిన కాలసర్పం అనే ప్రతీకను ఇమిడ్చారు. తల్లి మరణానికి కారణమైన కాలసర్పం నీకమ్మలేదనటంకూడా ప్రతీకాత్మకమే. తల్లిని ఉద్దేశిస్తూ ...

**నీవు చూపించు కోయమన్నావు బొంత**
**కరల నడిమి రసాల వృక్షమున ఫలము**
**నేను నొడిగట్టుకొని యెంతదాని గోయ**
**యతన మొనరించినాడనో అతని కెరుక**

అనే గీతంలో జీవన ఫలం రసాలం వంటిదని, దానిని అందుకునే ప్రయత్నంలో బొంతజెముడు ముళ్లవంటి అనేక అవరోధాలెదురై తాయనే ప్రతీకను కవి పొందుపరచారు.

ఏ కోరసః కరుణమేవ 'రసాలలో' 'కరుణ' అనేదే రసమని, మిగిలిన రసాలన్ని దాని రూపాంతరాలేనని భవభూతి తెలిపాడు. మనసును కరగించేది కరుణరసం. ఆ రసపోషణను అత్యంత సున్నితంగా కరుడు గట్టిన హృదయాలను సైతం కరిగించే రీతిలో పోషించగల సామర్ధ్యమున్న కవులు అరుదు. అట్టి కవులలో అగ్రగణ్యులు నాయని. తల్లి మరణానంతరం

**"నీవవచ్చెదవని మంచినీళ్ళ చెంబు**
**దీపమును పెట్టి కాచుకొంటిన యొకండ**
**నీపది దినమ్ములును రాత్రులింత కనులు**
**కూరుకొను చున్న నిన్ను చూచుకొనెడు కోర్కె"**

అని కవి తల్లికోసం చూసిన ఎదురుతెన్నులలో ఆయన కోరికేకాక తల్లి మరణానికి దుఃఖించే ప్రతిబిడ్డడి ఆవేదన కూడా ప్రతిఫలించి, కంటతడిని పెట్టిస్తుంది.

**"ఎంత దయలేని తల్లివే ఇంత జాలి**
**యెట్టిదో యెన్నడెరుగని యట్టి కఠిన**
**కాలచక్రమ్మునకు నన్ను కట్టివైచి**
**ఎగిరి పోతివ శాశ్వతమ్మగు సుగతికి"**

అని కవి తల్లి నుద్దేశించి పలికిన నిష్ఠురోక్తులలో కూడా తల్లి మరణానికి దురపిల్లే పిల్లవాని స్థితిని నాయనివారు, మనసుకరిగిపోయే విధంగా దృశ్యమానం చేసారు.

నాయనివారి మాతృగీతాలు నవ్యభావ విలసితమైన భావం, భాషలతో, తేటగీతులతో సులభశైలిలో పండిత పామరజన రంజకంగా విలసిల్లిన ఆధునిక కావ్యం. ఆప్త స్మృతి కావ్యాలకు ఒరవడి దిద్దిన రచన. భావకవులలో నాయని సుబ్బారావుగారి శైలి విలక్షణమైనది, విశిష్టమైనది.

**ముగింపు :** నాయని సుబ్బారావుగారు తన తల్లిగారిపై చూపించిన అమితమైన ప్రేమానురాగాలను, తల్లిమరణంతో వారు అనుభవించిన మానసికావేదనను గురించి ఈ పాఠం ద్వారా తెలుసుకున్నాం.

## ప్రశ్నలు :

1. 'మాతృగీతాలు' కావ్యంలో నాయని సుబ్బారావుగారు 'అమ్మ' కొరకు పరితపించిన విధానాన్ని వివరించండి.
2. స్మృతి కావ్యంలో 'మాతృగీతాలు' విశిష్టమైనది - విశదీకరించండి.

## ఉపయుక్త గ్రంధాలు :


1. తెలుగు విజ్ఞాన సర్వస్వము.
2. ఆధునికాంధ్ర కవిత్వము సంప్రదాయములు - ప్రయోగములు - డా॥ సి.నా.రె.
3. మాతృగీతాలు - నాయని సుబ్బారావు
4. జన్మభూమి - నాయని సుబ్బారావు


**వావిలాల ఝాన్సీ,** M.A., M.Phil.,
తెలుగు అధ్యాపకురాలు,
హిందూకాలేజ్, గుంటూరు.

**పాఠం : 10**

# బానిసల దండయాత్ర

**- ఆవంత్స సోమసుందర్**

**శీర్షికలు :**


10.0 లక్ష్యం.
10.1 కవి పరిచయం
10.2 పాఠ్యభాగ సందర్భం
10.3 పాఠ్యభాగ సారాంశం
10.4 కఠిన పదాలకు అర్థ తాత్పర్యాలు
10.5 సందర్భ సహిత వ్యాఖ్యలు
10.6 ప్రశ్నలు - సమాధానాలు


## 10.0. లక్ష్యం :

తెలంగాణా ప్రాంతంలో నిజామ్ నవాబు పాలనలో బానిస బ్రతుకులు అనుభవిస్తున్న ప్రజలు మేల్కొని చైతన్యవంతులై నవాబును ఎదిరించిన రీతిని వివరించటం ఈ పాఠం ప్రధానాంశం.

## 10.1. కవిపరిచయం :

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో 20వ శతాబ్దానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఈ శతాబ్దం నాది అని సగర్వంగా ప్రకటించు కున్నాడు శ్రీశ్రీ. ఆధునిక కవితా రంగంలో శ్రీశ్రీ తర్వాత పేర్కొనదగిన వ్యక్తులు దేవరకొండ బాలగంగాధర తిలక్, ఆవంత్స సోమసుందర్‌లు.

ఆంధ్రరాష్ట్రంలో సాహిత్య పోషణకు పిఠాపురం సంస్థానం పేరెన్నికగన్నది. ఆ పిఠాపురానికి దగ్గరలోని శంఖవరం గ్రామంలో కరణం కాళ్లూరి వారి ఇంట 1924 నవంబరు 18న సోమసుందర్ జన్మించాడు. పిఠాపురం గ్రామంలోని ఆవంత్స వారి యింటికి దత్తు వెళ్ళిన కారణంగా, ఆవంత్స వారి అబ్బాయిగా పెరిగి ఆవంత్స సోమసుందర్‌గా నామాంకితుడయ్యాడు.

హైస్కూలు విద్య పిఠాపురంలో గడిచింది. అక్కడ ఉన్న సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం అతనిలో పుస్తక పఠనాభిలాషను రేకెత్తించి, వాస్తవికమైన ప్రపంచ జ్ఞానాన్ని అర్థం చేసుకోవడంలో తోడ్పాటు నందించింది. విద్యార్థి దశలో క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా 1942లో ప్రభుత్వం తనని అరెస్టు చేసింది. రైతాంగ పోరాటాల్లో పాల్గొని, జైలు శిక్షలు అనుభవించాడు. పిఠాపురం తాలూకా కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో ప్రముఖ స్థానం వహించాడు. కళాశాల విద్యకై 1943లో కాకినాడ కాలేజీలో చేరాడు. కృష్ణశాస్త్రిని గురువుగా భావించాడు. కలకత్తాలో జరుగుతున్న అఖిల భారత విద్యార్థుల మహాసభలకు హాజరై, అక్కడ హౌరా రైల్వే స్టేషన్ సమీపంలో ఆకలి ఆకలి అంటూ అలమటిస్తున్న ఒక బిచ్చగాని మూలుగు విన్నాడు. ఆ బాధల మూలుగుల శబ్దాలను "మౌన ఘోష"గా వ్యక్తీకరించాడు.

**"ఆకలి వేస్తోందమ్మా అన్నం పెట్టమ్మా**
**స్వర్ణారుణ సస్యశ్యామలమ్మగు ఈజగతిని**
**దరిద్రమైన ఆకలితో చావలేను.**
**ఆశాసుమమాలా సౌరభమది వీడలేను**
**ఆకలి ! అమ్మా ! ఆకలి"**

ఈయన కవితారంభపు రోజుల్లో కృష్ణశాస్త్రి, విశ్వనాథల ప్రభావంతో పద్యరచన చేసినా, తదనంతర కాలంలో మార్క్స్ సిద్ధాంత ప్రభావానికి ఆకర్షితులై, అభ్యుదయ దృక్పథంతో రచనలు చేశాడు. అభ్యుదయ రచయితల సంఘం (అ.ర.సం.) ప్రారంభం నుండి కార్యవర్గ సభ్యులలో ఉన్న వీరు ఆనాటి నుండి (1943) వివిధ పత్రికల్లో తన రచనలను ప్రకటిస్తూనే ఉన్నారు.

సోమ సుందర్ సంస్కృత, ఆంధ్ర, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. వీరి కవిత్వంలో మానవతా దృక్పథం, విప్లవ ప్రబోధం, సామ్యవాద ధోరణి, సంస్కరణ దృష్టి అభ్యుదయ పథంలో నడుస్తాయి. నిరంతరం సాహితీ కృషీవలుడైన వీరి చేతి నుండి ఇప్పటి వరకు 60కు పైగా రచనలు వెలువడ్డాయి. తెలుగు సాహిత్యంలో సోమసుందర్ పలు ప్రక్రియలను సృష్టించారు. కావ్యాలు రాశారు. కథలు చెప్పారు. గీతాలు పాడారు. అనువాదాలు చేశారు. విమర్శనా గ్రంథాలు, కావ్య సంపుటాలు ప్రకటించారు. వ్యాస సంపుటాలు, జీవిత చరిత్రలు మొదలైన ప్రక్రియల్లో తన రచనా వైశిష్ట్యాన్ని ప్రదర్శించారు. కవిగా, విమర్శకునిగా, కథకునిగా ప్రముఖ స్థానాన్ని సాధించుకున్నారు. వీరి రచనలు :

**కావ్యాలు :** వజ్రాయుధం (1949), గోదావరి జలప్రళయం (1953), రక్తాక్షి (1956), మేఘరంజని (1962) సోమరసం-సుందరకాండ (1963), మా ఊరు మారింది (1977), సోమసుందర్ బృహత్కావ్యాలు (1981), దూపచ్ఛాయ (1999), హృదయంలో హిరోషిమా (1997), జీవనలిపి (1998). గంధ మాదనం (1994), చేతావని (1994)

**కథలు :** బానిసల దేశం (1950), సోమసుందర్ కథలు (1984)

**గీతాలు :** కాహళి (1952), ఆంధ్ర మహాసభల లక్ష్యాలకు అనుగుణంగా రాసిన పోరాట గీతాలు, వెన్నెలలో కోనసీమ (1977), మన సంగీతం (1994)

**విమర్శనా గ్రంథాలు :** శేషేంద్రజాలం (1975), కృష్ణశాస్త్రి కవితాత్మ (1980), రుధిరజ్యోతి దర్శనం (1982), పురిపండా ఎత్తిన పులి పంజా (1983), అగ్నివీణ ఆలపించిన అణు సంగీతం (1988), జాతికి జ్ఞాన నేత్రం (1988), సాహిత్యంలో సంశయ కల్లోలం (1989), అభివ్యక్తి (1992), నారాయణచక్రం (1995), గురజాడ గురుత్వాకర్షణ (2001).

**కవితా సంపుటాలు :** అనల కిరీటం (1975), రాలిన ముత్యాలు (1977), ఆ గతానికి శుభారంభం (1978), ఒక్క కొండలో వేయి శిల్పాలు (1982), ఇంగ్లాండు పర్యాటక కవితలు (1985), దోనాపాలా (1995), చిన్మయ లహరి (1997).

**వ్యాస సంపుటాలు :** కవిత్వం కాలాతీత కాంతిరేఖ (1984), అక్షర సుమార్చన (1990), నూరు శరత్తులు (1996), శరత్‌జ్యోత్స్న (1996) ఆ తరం కవితా తరంగాలు (1999), గోపుర దీపాలు (2000), కవితా కల్పవల్లి (2001).

**జీవిత చరిత్రలు :** లియోనార్డ్ డావిన్సీ మహా పురుషుని జీవనరేఖలను స్మరిస్తూ "లియోనార్డ్ డావిన్సీ" గ్రంథాన్ని (1986) రాశారు. భారతీయ సంగీతవేత్తల జీవనరేఖలను తెలియజేస్తూ 'హంసధ్వని' గ్రంథాన్ని (1987) వెలువరించారు.

**అనువాద రచనలు :** జర్మన్ కవి ఎర్నస్ట్ టోలర్ రచనకు అనువాదంగా 'మందీ - మనిషి' గేయనాటికను (1959) రచించారు. టాగూర్ తర్వాత అంతటి గొప్ప బెంగాలీ రచయిత అయిన బుద్ధదేవ్‌బోస్ జీవితాన్ని గురించి, అలోక్‌రంజన్ గుప్తా వ్రాసిన గ్రంథానికి తెలుగు అనువాదం చేశారు. ప్రొఫెసర్ జార్జి థామ్సన్‌గారి ప్రఖ్యాత సిద్ధాంత గ్రంథానికి "కవిత్వము-మార్క్సిజము" పేరుతో అనువాదం చేశారు.

ఇంతటి విస్తృతమైన సాహితీ వ్యాసంగం కలిగివున్న సోమసుందర్ కవిత్వాన్ని, విమర్శను రెండు కళ్ళుగా భావిస్తారు. కళా కేళినికేతన్ ద్వారా ప్రచురణపరంగా కూడా సాహితీసేవ చేస్తున్నారు. ఎందరో ఆధునిక అజ్ఞాత కవులకు సోమసుందర్ పరోక్ష గురువు, ఆదర్శనీయులు. వీరి విమర్శ కటువుగా ఉంటుంది. మెరమెచ్చు విమర్శలు, మొహమాటం మాటలు పలకడం ఈయనకు సరిపడవు. వీరు కవిత్వానికి, విమర్శకు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా 1975లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్మానించింది. 1979లో సోవియట్ ల్యాండ్ నెహ్రూ బహుమానం లభించింది. కృష్ణశాస్త్రి కవితాత్మ విమర్శ గ్రంథానికి 1980లో రాజా-లక్ష్మి ఫౌండేషన్‌వారి సత్కారాన్ని అందు

కున్నారు. 1991లో తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రతిభాపురస్కారం పొందారు. 1992లో తెలుగు విశ్వవిద్యాలయంవారు డి.లిట్. పట్టా ప్రదానం చేశారు. తెలుగు సాహితీ లోకంలో ఒక విశిష్ట స్థానాన్ని అలంకరించిన సోమసుందర్ ఆధునిక సాహితీరంగంలో అభ్యుదయ మార్గంలో పయనిస్తున్న మానవతా మూర్తి, మనసున్న కవి.

## 10.2. పాఠ్యభాగ సందర్భం :

'బానిసల దండయాత్ర' అనే ఈ పాఠ్యభాగం సోమసుందర్‌గారి వజ్రాయుధం కావ్యంలోనిది. అభ్యుదయ కవిత్వోద్యమంలో వచ్చిన ఉత్తమ కావ్యాల్లో వజ్రాయుధం ఒకటి. ఈ కావ్యరచనకు ప్రేరణ తెలంగాణా పోరాటమే. తెలంగాణా రైతాంగ పోరాట నేపథ్యంలో నిజాం నిరంకుశపాలనను అంతమొందించే ప్రజాయుధంగా - సోమసుందర్ వజ్రాయుధం కావ్యాన్ని రచించారు.

నిజాం రాష్ట్రాన్ని నిజామ్ ప్రభువు నేరుగా పాలించలేదు. ఈ ప్రాంతాన్ని సంస్థానాధీశులు, జమీందార్లు, మక్తేదార్లు, సేరీదార్లు, దేశ్‌ముఖ్‌లు, దేశ్‌పాండేలు చిన్న చిన్న ముక్కలుగా చేసుకొని పరిపాలించారు. వాటి ఆంతరంగిక పరిపాలన వారికే వదలి వేయబడింది. నిజాం ప్రభువు తనక్రింద జాగీర్దారుల నుండి నిర్ణీతమైన పన్నులతో పాటు అదనంగా నజరానాలు, కట్నాలు, రాజలాంఛనాలు స్వీకరించాడేకాని, ప్రజావసరాలకు ప్రాముఖ్యమిచ్చే ఎటువంటి శాసనాలు జారీ చేయలేదు. ఒక్క శాంతిభద్రతల విషయంలో మాత్రం క్రూరమైన శాసనాలు జారీచేశాడు. అసలు ఆనాటి కాలంమంతా పెద్ద పెద్ద భూస్వాములది, జాగీర్దార్లది, పటేళ్లది. వీళ్ళపాలనలో గ్రామాల పరిస్థితి ఎంతో దయనీయంగా తయారైంది. ప్రజల సౌకర్యాల కోసం ఏపనీ చేయలేదు. పాఠశాలలు లేవు. ఆసుపత్రులు లేవు. జన సామాన్యం నీటి ఎద్దడికి గురై త్రాగటానికి మంచినీరు దొరకని దుస్థితి పాలయ్యారు. రైతుల వ్యవసాయానికి కాలువలు, చెరువులు, బావులు త్రవ్వించకపోగా, పేద రైతులు రెక్కలు ముక్కలు చేసుకొని, పండించిన పంటలో అధిక భాగాన్ని శిస్తు కింద జమకట్టుకునేవారు.

నిజాం పాలనలో డబ్బున్న ప్రతివాడు గ్రామంలో పెత్తనం చెలాయించేవాడే. భూస్వాములు, రైతుల నుండి కిరాతకంగా పన్నులు వసూలే చేసేవారు. చాకలి, మంగలి, కమ్మరి, కుమ్మరి మొదలైన వివిధ వృత్తులవారి చేత బలవంతంగా, అన్యాయంగా వెట్టి చాకిరీ చేయించుకొనేవారు. అటువంటి సమయంలో నిజాం నిరంకుశత్వాన్ని ఎదిరించి, నిస్సహాయులైన ప్రజలకు సాయమందించ టానికి 1930లో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. ఈ సంఘం క్రమేణా తెలంగాణా ప్రజల జీవితంలో ఒక భాగమైంది. "పోరాడితే పోయేదిముంది, బానిస సంకెళ్లు తప్ప" - అనే ఆలోచనను ప్రజల్లో కలిగించింది ఆంధ్ర మహాసభ. ఆంధ్ర మహాసభ అండతో తెలంగాణా ప్రజలు దేశ్‌ముఖ్‌ల జాగీర్దార్ల, పటేళ్ళ దౌర్జన్యాలను, దోపిడీని ఎదిరించే దశకు చేరుకున్నారు. తెలంగాణాలో అత్యంత కిరాతకుడుగా పేర్గాంచిన విసునూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి దౌర్జన్యాలను ప్రజలు ప్రతిఘటించి, ఐక్యంగా నిలబడ్డారు. కుపితుడైన రామచంద్రారెడ్డి తన గూండాలచేత ప్రజానాయకుడైన దొడ్డి కొమరయ్యను 1946 జూలై 4వ తేదీన చంపించాడు. కొమరయ్య మరణవార్తతో, ప్రజలంతా ఏకమై, దేశ్‌ముఖ్‌ను, అతని కొడుకును, గూండాలను గ్రామం నుండి తరిమికొట్టారు.

ఈ వార్తలు పత్రికల్లో చదివి, తెలంగాణా వెలుపల ఉన్న ప్రజలు సంస్థానంలో జరుగుతున్న దుర్మార్గాలను గురించి, కొద్ది కొద్దిగా తెలుసుకోసాగారు. తెలంగాణా సాయుధ పోరాటం కొమరయ్య మరణంతో ప్రారంభమై, భారత కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో 1951 వరకు కొనసాగింది. ఈ అయిదేళ్ళ కాలం ఆంధ్రదేశ చరిత్రలో ప్రజాచైతన్యం ఉవ్వెత్తుగా పొంగి ప్రవహించినకాలం.

అనంతరం కాశింరజ్వీ నాయకత్వాన రజాకార్ సైన్యం ఏర్పాటైంది. రజాకార్లకు నిజామ్‌నవాబు అండగా నిలిచి, డబ్బు, ఆయుధాలు, పోలీసుల సహాయం అన్నీ అందించాడు. రజాకార్లు ప్రజల్ని చిత్రహింసలు పెట్టేవారు. ప్రజలంతా సమైక్యంగా, హిందూ-ముస్లింల తేడా లేకుండా ఎదిరించి పోరాడారు. గెరిల్లా పోరాట దళాలను నిర్మించి, ప్రజల్ని సాయుధుల్ని చేసి, పోరాటం సాగించటంలో ప్రతి గ్రామం నైపుణ్యాన్ని సంపాదించింది. ఆనాటి పోరాటంలో కవులు, కళాకారులు స్పందించారు. ఆవేశంతో కవిత్వాన్ని సృష్టించారు. ప్రజలకు ప్రబోధం చేసి, మేల్కొలిపారు. 'బానిస బ్రతుకుకన్నా, మరణమే మేలు' - అనే భావనను కలిగించి, పోరాట యోధులుగా తయారుచేశారు.

తెలంగాణా పోరాటానికి సంబంధించిన సాహిత్యాన్ని రెండు రకాలుగా పేర్కొనవచ్చు. పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని బాధల్ని చవిచూసి, మహోద్రేకంతో రచించిన సాహిత్యం మొదటిది. కాళోజి, దాశరథి, వట్టికోట ఆళ్వారుస్వామి, మగ్దుం మొహియుద్దీన్ వంటివారు ప్రత్యక్ష పోరాటంలో పాల్గొన్న అనుభవంతో, కవిత్వం ద్వారా ప్రజలను పురికొల్పి, నవాబుపై తిరుగుబాటు చేసేటట్లు ప్రేరేపించారు.

రెండవది తెలంగాణాకు వెలుపల ఉండి, పోరాటాన్ని గురించి తెలిసికొని, వారితో ఏకత్వాన్ని ప్రకటిస్తూ, వారి కష్టాలకు కావ్య రూపమిచ్చిన సాహిత్యం - సోమసుందర్ వజ్రాయుధం, ఆరుద్రత్వమేవాహమ్, అనిసెట్టి అగ్నివీణ, రమణారెడ్డి భువనఘోష ఈకోవలోకి వస్తాయి.

ఫ్యూడల్ రక్తం ప్రవహిస్తున్న దొరలకు ఆయుధాలు తుపాకులు, కత్తులు, లాఠీలు, జైలు గోడలు అయితే ఫ్యూడల్ వ్యవస్థను నరికివేయాలనుకున్న ప్రజలకు ఆయుధాలు, కొడవళ్ళు, కత్తులు, సుత్తులు, రోకళ్ళు, రాళ్ళూరప్పలు, కారం మూటలు, విశేషమేమంటే పైవేకాక పాటలు కూడా ఆయుధాలయ్యాయి. అలాంటి ఆయుధాల్నే తాను తయారు చేయాలని ఆరాటపడ్డారు సోమసుందర్. ఆపాటలే "బానిసల దండయాత్ర" పాటలు.

## 10.3. పాఠ్యభాగ సారాంశం :

బానిసల దండయాత్ర అనే పాఠ్యభాగం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం' కావ్యంలోనిది. ఈ గేయాన్ని ప్రజాయుధంగా వర్ణించారు డాక్టర్ సోమసుందర్. తెలంగాణా పోరాటాన్ని రెండు ప్రపంచాల మధ్య జరుగుతున్న సంఘర్షణగా కవి వర్ణించారు. ఇందులో ఒకటి తిరోగామిలోకం, రెండవది పురోగామిలోకం. ధనస్వామ్యస్వార్థాలకు ప్రతీక తిరోగామి లోకం. స్వాతంత్ర్యాభ్యుదయాలకు ప్రతీక పురోగామిలోకం. ప్రజాకాంక్ష పట్టని అధికారమదాంధులు తమస్వారీ నిరాఘాటంగా కొనసాగటానికి చేసే ప్రయత్నం తిరోగామి లోకంలో కనబడుతుంది. పరపీడన మంతరింపచేసి, భవిష్యత్తుపై ఆశతో సమసమాజ స్థాపనకు, మానవులంతా సుఖాలను పంచుకొనే వ్యవస్థ నిర్మాణానికి చేసే ప్రయత్నం పురోగామి లోకంలో కనబడుతుంది. ధనస్వామ్యవర్గం తమపాలన, దోపిడీ పద్ధతులను సుస్థిరంగా నిలుపుకొనే నిమిత్తం గడియారపు ఉక్కుముళ్ళను వెనుకకు త్రిప్పింది. పీడితులంతా ఏకమై దోపిడి, పీడనలకు స్వస్తి చెప్పే విధంగా ఎలుగెత్తి చాటించారు. ఈవిధంగా తెలంగాణా పోరాటాన్ని రెండవర్గాల రెండు స్వభావాల మధ్య జరిగే సంఘర్షణగా కవి వర్ణించారు.

ధీరులకు మొగసాల వంటి తెలంగాణా వీరుల్ని కాకతీయుల శౌర్యపటిమ చూపిస్తూ దండుగా కదలిరమ్మని కవి ప్రభోధిస్తున్నాడు. తెలంగాణా నవాబు అనుచరులు ప్రజల్ని దోచుకోవడంలో రాక్షసుల్లా వ్యవహరిస్తున్నారని వారిని ఎదుర్కోవడంలో తెలుగు వీరుడు చావుకు వెరవకూడదని హెచ్చరిస్తున్నాడు. తెలుగు వీరుడు పిరికి వాడుకాదని పిరికివానికి వేయి చావులని! చావుకు భయపడక మాతృభూమి స్వేచ్ఛకై పోరాడాలని కవి పిలుపు నిస్తున్నాడు. తెలుగు వీరుడు తన చివరి రక్తపు బొట్టువరకు పోరాడాలని ఉద్బోధిస్తున్నాడు. తెలంగాణా పోరాటం ముక్కోటి తెలుగు వాళ్ల విముక్తికి రాచమార్గమని ప్రేరేపిస్తున్నాడు. కఱ్ఱ, కత్తి, వడిశెల మొదలగు ఆయుధాలతో భస్మాసురుని వంటి నవాబు భరతం పట్టాలని ప్రజల్ని పురికొల్పుతున్నాడు. వంచకులైన రావణ, మారీచ, కీచకులు యుగధర్మానుసారంగా భస్మమై పోయారని పౌరాణిక ప్రకటనలను ప్రజలకు గుర్తుచేస్తున్నాడు. నిరంకుశులు, నియంతలైన హిట్లర్, టోజోలు, జార్లు, గోరింగులు ప్రజావ్యతిరేక పోరాటంలో మట్టికరచారని ఉత్సాహపరుస్తున్నాడు. అందుకే తెలంగాణా పోరాటంలో ప్రజలందర్ని కదలిరమ్మని పోరాడాలని, హైదరాబాద్ దాకాదండుగా కదలి, నరరక్కసులైన నవాబును, దేశ్‌ముఖ్‌లను పాతిపెట్టాలని ఉసిగొల్పుతున్నాడు.

నైజామ్‌పాదుషా ఖబడ్దార్ అంటూ తెలంగాణా ప్రాంతంలోని పీడిత శ్రామికులైన హిందూ ముస్లింలంతా తమ బానిస విముక్తికి, రాక్షస నవాబు నాశనానికి ఏకమయ్యారని కవి ఉద్ఘోషిస్తున్నాడు. గ్రామాల్లో ఉండే దేశ్‌ముఖులపై ప్రజాకోటి తిరుగుబాటు చేస్తుందని తెలుపుతున్నాడు. సూర్యాపేట, బాలేము ప్రాంతాలలో నవాబుకు వ్యతిరేకంగా పోరాటంలో పాల్గొన్న వీరుల ఆశలు నేరవేరతాయని కవి నమ్మబలుకుతున్నాడు. కొమరయ్య, అనంతయ్యలు పోరాటంలో అమరవీరులై చరిత్రలో చిరస్థాయిగా ఉంటారని

ప్రశంసలు కురుపిస్తున్నాడు. ఒకవీరుని మరణంతో పోరాటం ఆగిపోదని వేయిమంది వీరులు ఉద్భవిస్తారిని, ప్రతి నెత్తుటిబొట్టులో ప్రళయాగ్ని జ్వాలలు నవాబును దహించివేస్తాయని హెచ్చరిస్తున్నాడు. బానిసజనాల శల్యాలతో ఏర్చి కూర్చిన రాక్షస సింహాసనం ప్రజాపోరాట ధాటికి కదలిపోతుందని, నవాబు తుపాకులు, మరఫిరంగులు, మెషీన్‌గన్లూ ప్రజాశక్తి నాపలేవని ఖబడ్దార్, ఖబడ్దార్ అంటూ కవి నైజాం నవాబుకు హెచ్చరికలు పంపుతున్నాడు. నవాబు నిరంకుశత్వాన్ని అమానుషత్వాన్ని, నవాబుత్రవ్వించే గోరీల్లోనే ప్రజలు పాతేస్తారని ప్రజాస్వామ్య రూపంలో విశాలాంధ్ర ఏర్పాటవుతుందని కవి ఆకాంక్షిస్తున్నాడు.

జనగామలో నరరూపరాక్షసులైన నైజాంనవాబు అనుచరులు ఘోరమైన బీభత్సాన్ని సృష్టించారు. జనగామ రక్తసిక్తమై, పైశాచికరూపం దాల్చింది. పసికందులను చంపివేశారు. యువతుల ఉరోజాలను చీల్చివేశారు. జనగామ దద్దరిల్లింది ఇంటికొకమనిషిగా వీరుల సమూహం విప్లవ ప్రవాహంగా పొంగింది. ఈటెలు, బల్లెములు, నాటుతుపాకులు, రోకళ్లు, కారపుమూటలతో ప్రజావాహిని ఎదురుదాడులకు సిద్ధమైంది. గెరిల్లా నాయకుల పోరాటపటిమతో జనగామ ప్రజానీకం శత్రుమూకల్ని చీల్చిచెండాడి విజయభేరి మోగ్రించింది.

తెలంగాణా పోరాటం కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ప్రారంభమైంది. తెలంగాణా అంతటా అరుణ పతాకాలు ఎగురుతున్నాయి. ప్రజల్ని ఉత్తేజ పరుస్తున్నాయి. నిశ్శబ్ద వాతావరణంలో శ్రామికుడైన పదహారేళ్ల బాలుడు రాత్రివేళ రక్షణకై పహారాకాస్తున్నాడు. నవాబు దుండగుల ఫిరంగుల దాడిలో, సాహసంలో బాలచంద్రుని సోదరుడు, రుద్రమాంబ తమ్ముడు వీరగెరిల్లా ప్రాణాలు కోల్పోయాడు. అర్ధరాత్రి వేళ నవాబు సైన్యం దండెత్తి ముగ్గురు వీర గెరిల్లాలను పొట్టన పెట్టుకుంది. తుపాకుల ధ్వనులకు గుర్రాలు చెల్లాచెదరయ్యాయి. మైకం కమ్మిన గుర్రాలు రోడ్డుప్రక్కన కందకాలలో కూరుకుపోయాయి. తెలుగుతల్లికి కడుపు శోకం మిగిలింది. తుదిశ్వాస విడుస్తూ వీరగెరిల్లాలు తల్లీ ! ఏడవకమ్మా, ఈక్షతగాత్రుల, గతజీవులకోసం, నీదాస్య విమోచన కలిగించే సోదరులున్నారు. మళ్లీ జన్మన్నదిమాకుంటే చల్లని నీకడుపున జన్మిస్తాం అని విప్లవ సందేశాన్నిచ్చారు. మరణించిన మనతమ్ముల అంతరాత్మలు తెలుగుజాతికి ఉక్కుకవచంగా, రక్షాబంధనంగా, దీక్షాకంకణంగా చిరకాలం నిలుస్తాయని పోరాటంలో మరణించినవారి ఆత్మల ఆనందానికి పిడికిలి బిగించి, పోరాటం సాగిద్దామని నాజీనైజాం, రాక్షసరజాకార్ల, పోలీసుల, ద్రోహుల రక్తంతో తమ్ముల ఆత్మశాంతికి దోసిళ్లతో తర్పణమిద్దామని కవి ప్రజల్ని ప్రేరేపిస్తున్నాడు.

దుర్మార్గుడైన నవాబు రాజ్యంలో ప్రాణత్యాగంచేసి రక్తంధారపోసి బందీలైన వారి వారసుల్లో చైతన్యం ప్రవహించింది. ఆయుధాలు ధరించి పోరాటంలోపాల్గొన్నారు. అశనిపాతంలా, బడబానలంలా తుపానులా ఆదానవుల దుర్గాలను ముట్టడించారు. సాధారణ బానసలే సుశిక్షితులైన సైనికులుగా శత్రువ్యూహాలను చిత్తుచేసి ఓడించారు. యుద్ధభూమిలో స్త్రీలు విజృంభిస్తూ రాక్షసులను మట్టుపెట్టే ప్రళయకాలపు కాళికా దేవతల్లా కనబడుతున్నారు. యుద్ధం బీభత్సంగా ఉంది. రాక్షస సంహారోత్సవ మహాక్రతువు విజయవంతంగా ముగిసి ఫలిస్తుందని కవి ఆకాంక్ష. ఈ యాగం ఫలించిన కారణంగా తెలుగుతల్లి పసిడికాన్పు కొత్త పంటనిస్తుందని కవి భావన పాత బానిస వ్యవస్థ నశించి, నూతన స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వ్యవస్థ ఏర్పాటవుతుందని కవి నమ్మకం.

నల్లగొండ తెలంగాణాకు నడిబొడ్డు ప్రాంతం, నైజాం నవాబు దుర్మార్గాలకు నెలవైన ప్రదేశం. నవాబు పీడ విరగడయిన తర్వాత ప్రజల్లో ఆనందం తాండవించింది. చుట్టుప్రక్కలా నవ్వులు వెల్లివిరిశాయి. రైతులంతా ఉమ్మడిగా భూములు పంచుకున్నారు. పేదల, రైతుకూలీల సభలు నల్లగొండ లోయల్లో ప్రతిధ్వనించాయి. పల్లెల్లో పంచాయితీల పాలన ఏర్పడింది. నూతన చట్టాలతో నవజీవనం కొనసాగింది.

కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో కొనసాగిన తెలంగాణా పోరాటంలో విజయసాధనకు విప్లవ సంకేతంగా నిలబడింది ఎర్రజెండా. ఈ ఎర్రజెండాను సర్వజన స్వాతంత్ర్యదాత, సౌభాగ్య శాంతి ప్రదాత, యువశక్తి నవశక్తి ప్రేరేపిత అని కవి ప్రశంసించాడు. కష్ట జీవుల కలతను కదిలించే జెండా మృష్టాన్న సాధనకు పోరాడే జెండా అని శ్లాఘించాడు. శ్రామిక, కర్షకుల జీవితాశయాన్ని ఫలింపజేసేది, బానిసల బరువును ఛేదించేది, మానవులకు తెరువు చూపించేది అరుణ పతాకమని, సర్వజన సౌభాగ్యం, అభ్యుదయ శాంతి కొరకు ఎర్ర జెండాను ఎగురవేయాలని కవి ప్రబోధం.

## 10.4. కఠిన పదాలకు అర్థాలు, తాత్పర్యం

| | | | |
|---|---|---|---|
| 1. | అసుర | = | రాక్షసమైన |
| | వృద్ధవృకోదరులు | = | ముసలితోడేళ్లు (స్వార్థపరులు) |
| | జాత్యంధులు | = | గుడ్డివారు |
| | ఏహ్యమాన | = | అసహ్యమైన |
| | రుజాగర్భ | = | వ్యాధిగ్రస్తమైన |
| | తిరోగామి | = | వెనుకకు నడచునట్టి |
| | పీడితజనులు | = | పీడింపబడువారు |
| | అభ్యుదయము | = | ప్రగతి, అభివృద్ధి |
| | పురోగామి | = | ముందుకు నడిపించునట్టి |
| | సంఘర్షణ | = | పోరాటం |
| | కాంక్ష | = | కోరిక |
| | దివాంధాలు | = | గుడ్లగూబలు |
| | చిరంతనము | = | ప్రాచీనము |
| | వక్రగతి | = | వంకరమార్గము, చెడుమార్గము |
| | ఏలుబడి | = | పాలన |

**తాత్పర్యం :** రెండు ప్రపంచాల మధ్య అంటే పాలకులు, పాలితుల మధ్య, తిరోగామి పురోగామి లోకాల మధ్య కొనసాగుతున్న వర్గ సంఘర్షణ చిత్రించబడింది. రాక్షసులైన వృద్ధవృకోదరులు, పుట్టుగుడ్డివారు, అభివృద్ధి నిరోధకులైన ధనస్వాములు, వారి స్వార్థాలను సమర్థించే ప్రతినిధులతో కూడిన రోగగ్రస్తమైన తిరోగామి లోకమొకటి. ఇది అసహ్యించుకోదగినది. ప్రజాతంత్రయుగంలో శాంతికాముకులై పీడితజన ప్రతినిధులై స్వాతంత్ర్యభ్యుదయాలను కాంక్షించే శాంతిమయమైన పురోగామి లోకం మరొకటి. రెండులోకాలకు పాలిత పాలకుల మధ్య జరుగుతున్న సంఘర్షణను యుగధర్మంగా చూడలేకపోతున్న, అధికారపీఠమెక్కిన గుడ్లగూబలను కవి నిరసించాడు. అధికారపు స్వారీ సడలుతున్న భయంతో, ప్రజల్లో వస్తున్న తిరుగుబాటును ఆపే ప్రయత్నం వారిది.

భవిష్యత్తునాశించి యువశంఖాన్ని పూరించి, పరపీడనాన్ని అంతంచేసి, సమధర్మాన్ని స్థాపించి నరులంతా సౌఖ్యంగా, సమానంగా పంచుకొనేందుకు ప్రయత్నించే సమసమాజ వ్యవస్థ మరోకవైపు. ఈ రెండు వ్యవస్థల మధ్య నిరంతరం సాగే వర్గ సంఘర్షణే వర్గపోరాటం.

తరతరాల చీకటిలో నిరాశతో మగ్గుతున్న నిర్భాగ్యులు తామనుభవిస్తున్న దుర్భర దారిద్ర్యానికి సమాధి కట్టదలచి, శంఖం పూరిస్తుంటే, తమదోపిడీ పాలనను, స్వార్థపరమైన తమవర్గ ప్రయోజనాన్ని స్థిరంగా నిలపటానికి, ప్రజలందరిపై తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు కాలగమనాన్ని ఆపేందుకు గడియారంలోని ముళ్లను వెనక్కి తిప్పుతున్నారు ధనికులు.

వర్గ సంఘర్షణలో పీడితులంతా ఏకమై, సైనికుల దోపిడి, పీడనలను నిరసిస్తూ వారి దౌర్జన్యాలను సమాధికట్టేందుకు గళాలెత్తి గర్జిస్తుంటే ధనికస్వామ్య ప్రతినిధులు స్వార్థాలతో తమ ఆధిపత్యాన్ని నిలుపుకొనేందుకు కాలగమనాన్ని ఆపే ప్రయత్నం చేస్తున్నారు.

| | | | |
|---|---|---|---|
| 2. | ధీరులు | = | వీరులు, ధైర్యవంతులు |
| | మొగసాల | = | రచ్చబండ |

| | | |
|---|---|---|
| జీవనోద్భూతము | = | జీవము నుండి పుట్టినది |
| క్రాంతి | = | ఉద్యమం |
| జాగృతము | = | మేలుకొల్పు |
| దీర్ఘహేమంతము | = | ఎక్కువకాలం ఉండే చలి |
| రాక్షసుడు | = | దుర్మార్గుడైన నవాబుకు ప్రతీక |
| ముష్కరుడు | = | కిరాతకుడు, క్రూరుడు |

**తాత్పర్యం :** దుర్మార్గుడైన నిజాం నవాబు తెలంగాణా ప్రజలను మిక్కిలి క్రూరంగా హింసిస్తున్నాడు. అతడిపై తిరుగుబాటు చేసేవిధంగా ప్రజల్ని ప్రేరేపిస్తున్నాడు కవి. కాకతీయుల శౌర్యపటిమతో ముందుకు సాగండి. ధీరులకు మొగసాల అయిన తెలంగాణా ప్రాంతం విప్లవోజ్జ్వల చరిత్ర సృష్టించాలి. రాక్షస స్వభావం కలిగిన నవాబు పాలనకు చరమగీతం పాడితేనే అది సాధ్యమవుతుంది. నవాబు, అతని ప్రతినిధులు స్వార్థంతో కుమ్మక్కై, ప్రజలను దారుణంగా హత్య చేస్తున్నారు. పిరికితనాన్ని వదలి వీరత్వంతో పోరాడండి. తెలుగు వీరుడికి తిరుగులేదని చాటి కడదాకా పోరాడండి.

తెలుగు గడ్డ దీర్ఘకాలం నుండి అనుభవిస్తున్న పీడనను తొలగించుకొని ఉజ్జ్వలమైన, సుఖప్రదమైన వసంతాన్ని అందుకోబోతుంది. హేమంతం బాధలకు, వసంతం సుఖాలకు ప్రతీకలు. తెలుగు ప్రజలు బాధలను పోగొట్టుకొని, సుఖప్రదమైన నవయుగాన్ని సాధించుకోవాలి. అదే మూడుకోట్ల తెలుగువారికి విముక్తి మార్గం. ఇదే భారతదేశ స్వాతంత్ర్య సమరానికి చివరి ఘట్టం కావాలి. నిజాం పీడన విరగడైతేనే సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్లని కవి భావించారు.

భస్మాసురుని వంటి క్రూరుడైన నవాబు హైద్రాబాదులో దాగి ఉన్నాడు. తనకు రక్షణగా దేశ్‌ముఖ్‌లనే కుక్కలను కాపలాగా ఉంచుకొన్నాడు. వాడిని అనుసరించేవారు, సమర్థించే తొత్తులైన జాగీర్దార్లు, భూస్వాములంతా రావణ, మారీచ, కీచకుల వంటి మోసగాళ్లు. ప్రజలందరు కలసి కత్తులు, కర్రలు, వడిసెలు మొదలగు ఆయుధాలతో నవాబును చుట్టుముట్టి పాతిపెట్టాలి. విశాలాంధ్రలో స్వర్గాన్ని నిలపాలని కవి ఆకాంక్ష.

| | | | |
|---|---|---|---|
| 3. | ఖబడ్దార్ | = | హెచ్చరిక |
| | ప్రభవం | = | పుట్టుక |
| | ప్రళయాగ్నులు | = | ప్రళయకాలమందలి అగ్నులు |
| | శల్యములు | = | ఎముకలు |
| | అమానుషత్వం | = | క్రూరము |

**తాత్పర్యం :** 'ఖబడ్దార్' - అని కవి నిజాం నవాబును హెచ్చరించాడు. ఈ హెచ్చరికలో నిజాం నవాబుకి అంత్యకాలం సమీపించిందని అర్థమవుతుంది. బానిసత్వ విముక్తికి, క్రూర నవాబు పతనానికి హిందూ మహమ్మదీయులంతా ఏకమై, దేశ్‌ముఖ్‌ను ప్రతిఘటించేందుకు పోరాడుతున్నారు. సూర్యాపేట మారుమూల ప్రాంతాల్లో నవాబు దుర్మార్గులకు గురైన ప్రజల గుండెలు మండుతున్నాయి. వారి గుండె మంటలు చల్లారేటట్లు పోరాటం సాగించాలి. దేశ్‌ముఖ్‌ల దురాగతానికిబలైన గెరిల్లా నాయకులు కొమరయ్య, అనంతయ్య చిరస్థాయిగా నిలుస్తారని అమరవీరులను కీర్తించాడు. ఒకవీరుడు మరణిస్తే వేలాది వీరులు పుట్టుకొస్తారు. పోరాటం ఆగదు ఒక నెత్తుటి బొట్టులోనే ప్రళయాగ్నులు ప్రకాశిస్తాయని విప్లవాత్మకంగా ప్రబోధించాడు.

నవాబు ఎందరో స్త్రీలను మానభంగాలు చేసిన దుర్మార్గుడు. అందుకే కీచకుడన్నాడు. కీచకుడైన నవాబు పీచమణచటానికి ప్రజలంతా సింహగర్జనలతో మృతవీరులను స్మరిస్తూ, నవయోధులను సృజిస్తూ, దండెత్తి వస్తున్నారు. బానిస జనుల ఎముకలపై నిర్మించిన నవాబు సింహాసనం కుప్పకూలి పోతుంది. ఎదిరించిన ప్రజాసమూహాన్ని అడ్డుకునేందుకు నవాబు ప్రయోగించే మెషీన్‌గన్లు మరఫిరంగులు, తుపాకులు విషవాయువులు సరిపోవని, పనికిరావని, ఆపలేవని కవి చెప్పారు.

| | | | |
|---|---|---|---|
| 4. | విజయుడు | = | అర్జునుడు |
| | గాండీవము | = | అర్జునుని ఆయుధం |
| | పాంచజన్యం | = | విష్ణువు పూరించే శంఖం |
| | కొమ్ముబూరా | = | కొమ్ముతో చేసిన వాద్యము |
| | కైపు | = | మైకము |
| | బెబ్బులులు | = | పెద్దపులులు |
| | మైమరచు | = | పరవశించు |
| | పుడమి | = | నేల |
| | ఉడుకెత్తు | = | తపించు |
| | క్రకచాత్మ | = | రంపంవలె క్రూరమైన మనసుగల |
| | మిసిమి | = | కాంతిమంతమైన |
| | ఉరోజములు | = | వక్షోజములు |
| | రుద్రుడు | = | శివుడు |
| | తాండవము | = | శివుని నాట్యము |
| | ఉరకలు | = | ప్రవాహాలు |
| | బందూకులు | = | తుపాకులు |

**తాత్పర్యం :** అమరవీరుడైన కొమరయ్య అజేయ పరాక్రమవంతుడు అతడు గాండీవాన్ని సంధించే అర్జునుడని, పాంచజన్యాన్ని పూరించే విష్ణువని, తెలంగాణా గెరిల్లా నాయకుడని, ప్రజాస్వామ్యాన్ని చాటి చెప్పే అధ్యాపకుడని ప్రశంసించాడు.

సామాన్యప్రజలకు శత్రువులైన రజాకార్లు ప్రజల యిళ్లను పెట్రోలుపోసి తగులబెడుతున్నారు. జనగామలో ఆధునిక ఆయుధాలైన మెషీన్‌గన్లతో ముట్టడిస్తున్నారు. భూమి దద్దరిల్లేటట్లు ఇంటికొక మానవుడు వీరుడై విజృంభించాడు. శత్రువులు జనగామ ప్రాంతాన్ని రక్తసిక్తం చేశారు. మానవులను చంపి,నరమాంస భక్షకులయ్యారు. నరరూపరాక్షసులై దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారు. పసికందులను పొట్టనబెట్టుకున్నారు. అందమైన యువతులను మానభంగాలు చేసి ఉరోజాలను చీలుస్తున్నారు.

శ్రమజీవులంతా రజాకార్ల దుండగాలను ఎదిరించేందుకు కదిలింది. రైతులు, కూలీలు, బాధితులు, పీడితులు యుద్ధవీరులై విజృంభించి తమశక్తి చూపించారు. ఆపుజా సముద్రం నుండి లేచిన అతను ప్రళయకాల మహారుద్రుడిలా విజృంభించాడు. అతడే గెరిల్లానాయకుడు. తిండితిప్పలు లేకుండా అవిశ్రాంతంగా పోరాడిన అమరవీరుడతడు. ప్రజావాహిని ఎదురుదాడులకు దిగింది. ఈటెలు, బల్లెములు, నాటుతుపాకులు, రోకళ్లు, కారపుమూటలతో కదిలారు. రాక్షసులైన శత్రువులను కూల్చారు. మృత్యువును జయించి జనగామలో విజయభేరి మోగ్రించారు.

| | | | |
|---|---|---|---|
| 5. | వసంతశర్వరి | = | వసంతకాలపు రాత్రి |
| | పూతనది | = | పవిత్రమైన నది |
| | పులినస్థలములు | = | ఇసుక తిన్నెలు |
| | విజయధ్వజము | = | జయచిహ్నము |
| | జీమూతాలు | = | మేఘములు |
| | సోపానాలు | = | మెట్లు |
| | ముష్కరులు | = | దుర్మార్గులు |

| | | |
|---|---|---|
| సొలోపు | = | మైమరచిన |
| క్షతగాత్రులు | = | గాయపడ్డ శరీరములు కలవారు |
| గతజీవులు | = | మరణించినవారు |
| దీక్షాకంకణము | = | దీక్షతో కట్టుకునే వ్రత సూత్రము |
| తర్పణము | = | చనిపోయినవారి ఆత్మశాంతికి విడుచునీళ్లు |

**తాత్పర్యం :** కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణా పోరాటం ఆరంభమైంది. వసంతకాలపు రాత్రుల్లో, నదీతీరాల్లో పాతిన విజయధ్వజాల్లా అభిమానం ఉన్న గుండెల్లో అరుణ పతాకాలు ఎగురుతున్నాయి.

అడవి పొదల్లో దట్టంగా ఆవరించిన మేఘాల గర్జనలు కీచురాళ్ల ధ్వనుల్లా ఉన్నాయి. నిశ్శబ్దవాతావరణం పెఠేల్మని మ్రోగీ ఫిరంగి శబ్దాలకు విచ్ఛిన్నమై పోయింది. శ్రామికుడైన పదహారేళ్ల బాలుడు సమసమాజ స్థాపనకై, రాత్రివేళ రక్షణకై పహారాలో ఉన్నాడు. రెండు నెలలు తుపాకి పట్టిన అనుభవాన్ని స్మరించుకుంటున్న తరుణంలో తెలుగుతల్లి ముద్దు బిడ్డడు, సాహసంలో బాలచంద్రుని సోదరుడు ప్రాణాలు పోగొట్టుకున్నాడు. అర్ధరాత్రి ముష్కరులు దండెత్తి ముగ్గురు వీరగెరిల్లాలను హతమార్చారు. తుపాకుల మోతలతో గుర్రాలు చెల్లా చెదురై రోడ్డు ప్రక్క కందకాల్లో కూరుకుపోయాయి. తుపాకీ గుండ్లకు వీరగెరిల్లాలు అభిమన్యుల్లా నేలకొరిగారు. తెలుగుతల్లికి కడుపుశోకం మిగిలింది. అంతిమఘడియల్లో ఆవీరులు విప్లవసందేశం అందించారు. "తల్లీ ! ఏడవకమ్మా! ఈక్షతగాత్రుల, గతజీవుల కోసం నీదాస్యవిమోచన కలిగించే అన్నలున్నారు. మళ్లీ జన్మఅన్నది మాకుంటే చల్లని నీకడుపున జన్మిస్తాం" అని ఓదార్చారు. మరణించినవారి అంతరాత్మలు తెలుగుజాతికి ఉక్కు కవచాలుగా, రక్షాబంధనాలుగా, దీక్షాకంకణాలుగా చిరకాలం నిలుస్తాయి. వారి ఆత్మల శాంతికై పిడికిలి బిగించి నేడే పోరాటం సాగిద్దామన్నాడు. నాజీలైన నిజాం రాక్షసరజాకార్లు, పోలుసుల, ద్రోహుల రక్తంతో వారి ఆత్మల శాంతికి రక్త తర్పణ మివ్వాలని కవి విప్లవ ప్రబోధం చేశారు.

| | | | |
|---|---|---|---|
| 6. | అశనిపాతము | = | పిడుగుపాటు |
| | బడబానలము | = | నీటి అడుగున ఉండే అగ్ని |
| | మేరువులు | = | మేరు పర్వతాలు |
| | విలయము | = | ప్రళయము |
| | విస్ఫులింగాలు | = | నిప్పుకణికలు |
| | జ్వలనము | = | ప్రకాశము |
| | కవాతు | = | సైనికులు చేసే సాధన |
| | అంగలార్చు | = | దుఃఖించు |
| | దానవులు | = | రాక్షసులు |
| | ఝుంఝూనిలం | = | వానతో కూడిన పెనుగాలి |
| | మహాక్రతువు | = | పెద్దయాగము |
| | ప్రళయకాలకాళికలు | = | ప్రళయకాలమందలి కాళికాదేవివలె |
| | నారీమతల్లులు | = | స్త్రీలు |
| | విపత్తు | = | ప్రమాదం |

**తాత్పర్యం :** కిరాతుడైన నవాబు రాజ్యంలో స్వేచ్ఛకోసం నెత్తురులర్పించి, ప్రాణత్యాగం చేసిన వీరులను చూసిన వారి వారసులకు నరనరాల్లో చైతన్యం ప్రవహించింది. బానిసలంతా ఏకమై, బందీలంతా ఒక్కటై ఆయుధాలు ధరించి, నవాబును ఎదిరించేందుకు సిద్ధమయ్యారు. వారి చేతులను బంధించిన గొలుసులు మంచు బిందువుల్లా కరిగిపోయాయి. మోసపుటుచ్చుల కుత్రలు వారి

గొంతులను బంధించలేవు. గాఢ నిద్రావస్థలో ఉన్న వీరులంతా జూలు విదిల్చిన సింహాల్లా మేల్కొన్నారు. పిడుగుపాటులా, బడబానలంలా నిజాం దుర్గాలను ముట్టడించారు.

సాధారణ బానిసలే సుశిక్షతమైన సైనికుల్లా ప్రళయాగ్నుల్లా ప్రకాశిస్తున్నారు. కర్రసాము, కత్తిసాము కవాతుల ద్వారా సాహసంతో శత్రు వ్యూహాలను చిత్తుచేసి, ఓడిస్తున్నారు. చీకట్లో ఎర్రని భూతాలై దానవులను కూలుస్తున్నారు. యుద్ధభూమిలో స్త్రీలు విజృంభించడం చూస్తే రాక్షసులను మట్టుబెట్టే ప్రళయకాలపు కాళికాదేవతల్లా ఉన్నారు.

యుద్ధం భీకరంగా సాగుతుంది. శత్రువులు ప్రళయకాల ఝంఝూనిల ధాటికి నేలకొరుగుతున్నారు. రాక్షస సంహారోత్సవ మహాక్రతువు విజయవంతంగా ముగుస్తుంది. సమాజపీడ విరగడవుతుందని కవి విశ్వాసం. బందిపోటు పిశాచాలు నశిస్తాయి. తెలుగుగడ్డ సుఖిస్తుంది. ఈ యాగం ఫలించినందుకు తెనుగుతల్లి పసిడికాన్పు కొత్తపంటనిస్తుందన్న ప్రయోగంతో పాత బానిస వ్యవస్థ నుంచి కొత్త స్వేచ్ఛా స్వాతంత్ర్యాల వ్యవస్థ అవతరిస్తుందని కవి ఆకాంక్షించారు.

| | | | |
|---|---|---|---|
| 7. | బంజర్లు | = | బీడు నేలలు |
| | ప్రత్యర్థులు | = | శత్రువులు |
| | తునుమాడు | = | సంహరించు |
| | పరిధి | = | హద్దు |
| | ఆనందాశ్రులు | = | ఆనంద భాష్పాలు |
| | విరుల వాన | = | పూల వాన |
| | కర్షకులు | = | రైతులు |
| | తరంగాలు | = | అలలు |

**తాత్పర్యం :** తెలుగుగడ్డ నడిబొడ్డైన నల్లగొండ నవాబు దుర్మార్గాలకు ఆక్రోశించింది. నవాబు పీడన విరగడైన తర్వాత, ఆ ప్రాంతపు ప్రజల్లో విజయానందం వెల్లివిరిసింది. నల్లగొండ పరిసర ప్రాంతాల్లో నవ్వులు ప్రతిధ్వనించాయి. రైతులంతా ఉమ్మడిగా అడవులు, బంజర్లు, బీళ్లు సమతలం చేసి పంట భూములుగా మార్చుకున్నారు. భూ దేవత కన్నులపంటగా పండిన పంటలతో సుఖించారు. పేదల, రైతు కూలీల సభలు నల్లగొండ లోయల్లో ప్రతిధ్వనించాయి. ప్రజారాజ్య పరిషత్తులతో పల్లెల్లో పంచాయితీల పాలన ప్రారంభమైంది. నూతన చట్టాలతో నవజీవనం స్వేచ్ఛగా సాగింది.

పండిన బంగారు పంటలను మానవులంతా అన్నదమ్ములవలె సమానంగా పంచుకొనే సమధర్మం నెలకొన్నది. శత్రువులను సమిష్టిగా ఎదుర్కొనే ధైర్యం ప్రజాపరమైంది. ఆ ప్రాంతంలో ఆనందం నిండింది. నల్గొండ ప్రాంత ప్రజలు తమ బిడ్డలే పాలకు లైనందుకు పండుగ సంబరాలను సంతోషంగా జరుపుకుంటున్నారు. పరిసర ప్రాంతాలలో ఆనంద భాష్పాలు జాలువారాయి. పూలవాన కురిసింది. కొత్త జీవనంతో రైతుల్లో సంతోషానికి హద్దుల్లేకుండా ఉంది. రాక్షసుడైన నవాబు గుండెలను చీల్చినంత సంతోషంగా, ఇన్నాళ్లు వాడి చీకటిలోకంలో ఉన్న భూముల్ని చీల్చి చీల్చి దున్నుతూ నవ్వుతున్నారు. వారి నవ్వులు ముత్యాల ముగ్గుల్లాగా, సాగరతరంగాల తెల్లని నురగల్లాగా ఆకాశం వరకు విస్తరించాయి.

| | | | |
|---|---|---|---|
| 8. | ధాత | = | బ్రహ్మ |
| | మృష్టాన్నము | = | సంతృప్తికరమైన భోజనము |
| | స్వర్ణయుగము | = | బంగారుయుగము (మంచికాలము) |
| | తెరువు | = | మార్గము |
| | త్రాత | = | రక్షించునది |

**తాత్పర్యం :** కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణా పోరాటం జరిగింది. ఎర్రజెండా స్ఫూర్తి ప్రదాత అయింది. అందుకే ఎర్రజెండాను సర్వజన స్వాతంత్ర్యదాతగా, సౌభాగ్య శాంతి ప్రదాతగా, యువశక్తి నవశక్తి ప్రేరణగా, సర్వసమానత్వ స్థాపనకు హేతువుగా ప్రశంసించాడు. కష్టజీవుల కలతలను కూల్చేది, మృష్టాన్న సాధనకు పోరాడేది ఎర్రజెండా. ఆ జెండా క్రిందకు వస్తే శ్రామిక కార్మిక కర్షక సంక్షేమ లక్ష్యమైన సమసమాజ స్థాపన సాధించబడుతుంది. స్వర్ణయుగావిర్భావం జరుగుతుంది. కమ్యూనిస్టుపార్టీ ఆశయమిదే.

బానిసత్వాన్ని ఛేదించేది, మానవత్వపు తెరువు చూపించేది, సర్వజన సౌభాగ్య ప్రదాయిని, అభ్యుదయ శాంతికామిని అయిన ఎర్రజెండాను ఎగురవేయాలని కవి ప్రబోధించాడు.

## 10.5. సందర్భసహిత వ్యాఖ్యలు :

1. **గడియారపు ఉక్కుముళ్లు, వెనుకకు త్రిప్పారు వారు.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** ధనవంతులు తమ పరిపాలన నిర్విఘ్నంగా కొనసాగేందుకు గడియారంలోని ఉక్కుముళ్ళలా విజృంభిస్తున్న శ్రామిక కార్మిక ప్రజల చైతన్యాన్ని నిరోధించు సందర్భములోనిది.

**భావం :** తిరోగామి లోకానికి ప్రతినిధులు ధనవంతులు, వారి ప్రతినిధులు. పురోగామి లోకానికి ప్రతినిధులు శ్రామిక కార్మిక కర్షక ప్రజానీకం. ఈ కార్మిక కర్షక ప్రజానీకపు చైతన్యాన్ని నిరోధించే సందర్భంగా కవి పలికిన మాటలు.

గడియారం ప్రజలు నివసిస్తున్న సమాజానికి ప్రతీక. ఉక్కుముళ్ళు సమాజంలోని కార్మిక కర్షక ప్రజానీకానికి చిహ్నం. ఉక్కుముళ్ళు వెనకకు త్రిప్పడం అంటే వారి చైతన్యాన్ని అడ్డుకోవడమే.

2. **కాకతీయుల శౌర్యపటిమ చూపించండి.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** దుర్మార్గుడు, నిరంకుశుడైన నైజాం నవాబు దుర్మార్గాలను ఎదుర్కొనేందుకు కార్మిక కర్షక ప్రజానీకాన్ని చైతన్యపరచే సందర్భంలోనిది.

**భావం :** తెలంగాణా ప్రాంతంలోని వీరులందరిని నవాబుపై తిరుగుబాటు చేయడానికి కదలండి కదలండి అని ప్రేరేపిస్తూ, వారిలో శౌర్యాన్ని పాదుకొల్పేందుకు చారిత్రక శౌర్య పటిమకు ప్రసిద్ధి చెందిన కాకతీయుల శౌర్యాన్ని ప్రదర్శించమని కవి ప్రబోధించాడు.

3. **తెలుగు వీరుడు మరణమెరుగడని చాటండి.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** దుర్మార్గుడైన నైజాం నవాబుపై ప్రజలను తిరుగుబాటు చేయమని ప్రబోధించే సందర్భంలోనిది.

**భావం :** ప్రజాస్వామ్య సంస్థాపనకు దుర్మార్గుడైన నవాబు పరిపాలన అంతం కావాలి. నవాబు యొక్క అనుచరులైన జాగీర్దార్లు దేశ్‌ముఖ్‌లు రాక్షసులవలె ప్రజలను బాధిస్తున్నారు, చంపుతున్నారు. అందుకు బాధితులైన ప్రజల్ని పురికొల్పుతూ 'తెలుగు వీరుడు మరణ మెరుగడని చాటండి' అనడంలో విజయసాధనలో తెలుగువీరుడు తిరుగులేని వీరుడని ప్రబోధిస్తున్నాడు కవి.

4. **పిరికివానికి వేయి చావులని తెలపండి.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** నిరంకుశుడు, దుర్మార్గుడైన నైజాం నవాబుపై ప్రజల్ని తిరుగుబాటు చేయండని కవి ప్రేరేపిస్తున్న సందర్భంలోనిది.

**భావం :** చావుకు భయపడనివాడు తెలుగువీరుడని, అతనికి ఓటమి తెలియదని కవి ప్రజల్ని పురికొల్పుతున్నాడు. పిరికివాడు ముందుకు అడుగు వేయలేడని, ప్రతిక్షణం చావు భయంతో చస్తాడని ప్రకటిస్తున్నాడు. కాబట్టే పిరికివానికి వేయి చావులని తెలుపు తున్నాడు. పిరికితనాన్ని పారద్రోలి, ధైర్యంతో ప్రజలు తిరుగుబాటు ఉద్యమంలో కలవాలని కవి ఆలోచన.

**5. భస్మాసురునకిపుడె భరతమ్ము పట్టండి.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** భస్మాసుర లక్షణాలు కలిగిన నైజాం నవాబు నాశనాన్ని చూడాలని ప్రజలకు ప్రబోధిస్తున్న సందర్భంలోనిది.

**భావం :** వరమిచ్చిన శివుణ్ణి నాశనం చేయడానికి పూనుకున్న వ్యక్తి భస్మాసురుడు. రైతుల, కార్మికుల, శ్రామికుల రక్తాన్ని పీల్చి, భోగాలనుభవిస్తూ, వారిని మట్టుబెట్టే ప్రయత్నాలు చేస్తున్న వ్యక్తి నైజాం నవాబు. ఇక్కడ కవి నైజాం నవాబును భస్మాసురునితో పోల్చటం సమంజసంగా ఉంది. అందుకే భస్మాసురుని వంటి నైజాం నవాబును నాశనం చేయుమని కవి ప్రబోదిస్తున్నాడు.

**6. ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** తెలంగాణా పోరాటంలో నవాబు దుర్మార్గాలకు గురై మరణించిన కొమరయ్య, అనంతయ్యలను సంస్మరించే సందర్భంలోనిది.

**భావం :** నైజాం నవాబుకు తొత్తులైన దేశ్‌ముఖులు ప్రజల్ని క్రూరంగా హింసిస్తున్నారు. ఈ హింసను ఎదుర్కొని తెలంగాణా ప్రజలు పోరాడుతున్నారు. పోరాటంలో నవాబు, నవాబు అనుచరులైన దేశ్‌ముఖ్‌ల కుట్రలకు, తుపాకీగుండ్లకు గురై, ప్రాణాలు పోగొట్టుకున్న కొమరయ్య, అనంతయ్యలు అమరవీరులు. వారు చరిత్రలో శాశ్వతంగా నిలుస్తారు. ఈ అమరవీరుల స్ఫూర్తితో ఇంకా ఎంతో మంది వీరులు పుడతారు. అందుకే కవి ప్రజల్లో ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవిస్తారని ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేస్తున్నాడు.

**7. అతడే ప్రజాస్వామ్య జగతి కధ్యాపకుడు.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** తెలంగాణా పోరాటంలో అమరవీరుడైన కొమరయ్యను ప్రస్తుతించే సందర్భంలోనిది.

**భావం :** కొమరయ్య మరణంతో తెలంగాణా పోరాటం రూపురేఖలు సరికొత్త పంథాను సంతరించుకుంది. కొమరయ్య ధైర్య సాహసాలు ఉన్న గెరిల్లా నాయకుడు. తెలంగాణ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తి. నైజాం నవాబు దుర్మార్గాన్ని ఎదుర్కొని ప్రజాపక్షం వహిస్తూ ఉద్యమించిన అధ్యాపకుడతడు. దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి దుష్టపన్నాగానికి బలై ప్రాణాలు పోగొట్టుకున్నాడు. ఇక్కడ కొమరయ్య గొప్పతనాన్ని శ్లాఘిస్తూ, గెరిల్లా దళాలకు ఉత్సాహాన్ని కలిగించడం కవిభావన.

**8. పుడమి తల్లికి తనువు పులకరించింది.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** నిరంకుశుడు, దుర్మార్గుడైన నవాబు సైనికుల దుర్మార్గాలను ఎదుర్కొనడానికి తెలంగాణా ప్రజలు సిద్ధమవుతున్న సందర్భంలోనిది.

**భావం :** దుర్మార్గులైన నవాబు సైనికుల దారుణ మారణకాండతో జనగామ రక్తసిక్తమైంది. కనికరం లేకుండా, పసిపిల్లలను కూడా చంపారు. యువతులను చెరిచి, వారి వక్షోజాలను చీల్చివేశారు. ఈ దౌష్ట్యాలను ఎదుర్కొనడానికి ఇంటికొక వీరుడు జన్మించాడు. కార్మిక వర్గ నాయకులు ధైర్య సాహసాలతో పోరాడారు. ఈ పోరాటానికి పుడమితల్లి పులకించిందని కవి భావన. తెలంగాణా ప్రజల పోరాటదీప్తికి భూమాత పులకించిందని కవి ఉద్దేశం.

**9. నీదాస్యవిమోచన కంకణులున్నారమ్మా అన్నలు.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** తెలంగాణా పోరాటంలో ప్రాణాలు వదలిన అమరవీరులు చివరిసారిగా భూదేవికి విప్లవ సందేశాన్నిచ్చే సందర్భం.

**భావం :** మూడుకోట్ల ప్రజానీకం నివశిస్తున్న తెలుగునేలకు, తల్లికి, సోదరులకు చివరిసారిగా సందేశాన్ని తెలిపారు. తల్లీ! ఏడువకమ్మా ! ఈ క్షతగాత్రుల, గతజీవుల కోసం నీదాస్య బంధాలను తొలగించేందుకు అన్నలున్నారమ్మా అని విప్లవ సందేశాన్నిచ్చారు. మళ్లీ జన్మ ఉంటే నీకడుపున పుడతామని మాతృభక్తి భావంతో తెలిపారు. తెలంగాణా ప్రజల బానిస బంధాలను ఛేదించేందుకు మిగిలిన సోదరులు కంకణ బద్ధులవుతున్నారని వారి ప్రగాఢ విశ్వాసం.

**10.** మనతమ్ముల ఆత్మల శాంతికి దోసిళ్లతో తర్పణమిద్దాం.

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** తెలంగాణా పోరాటంలో ప్రాణాలు వదలిన వీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న సందర్భం.

**భావం :** దుర్మార్గుడైన నవాబు పరిపాలనను ఎదుర్కొని చేస్తున్న పోరాటంలో ఎంతో మంది వీరులు నవాబు, నవాబు అనుచరులైన రజాకార్లు, వారికి అండదండగా ఉండే ద్రోహులు, పోలీసుల ఘాతుకాలకు బలయ్యారు. వారందరు మనసోదరులు. వారి ఆత్మలు శాంతించడానికి దోసిళ్లతో తర్పణమిద్దాం-అని కవి మానవ ధర్మాన్ని గుర్తుచేస్తున్నాడు.

**11. రక్కసులకు ప్రళయకాల కాళికలై భయపెట్టే నారీమతల్లులు**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** నైజాంనవాబు అనుచరులైన రజాకార్లు తెలంగాణా పోరాటంలో స్త్రీలను చిత్రహింసలు పెట్టేటప్పుడు, వీరనారీమణులై స్త్రీలు విజృంభించి ఎదిరించిన సందర్భంలోనిది.

**భావం :** తెలంగాణా పోరాటంలో మతఛాందసులైన రజాకార్లు స్త్రీలను చెరిచారు, వక్షోజాలు కోసి బాధలకు గురిచేశారు. ఈ దౌష్ట్యాలను సహించని స్త్రీలు ఎక్కుపెట్టిన ధనుస్సుల్లాగా, ప్రళయకాలమందలి కాళికామాతల్లాగా శత్రువులను భయపెట్టి తరిమికొట్టారు. స్త్రీల తిరుగుబాటు పోరాటానికి జయచిహ్నమని కవి భావన.

**12. తెనుగుతల్లి పసిడికాన్పు కొత్తపంట ధరిస్తుంది.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** తెలంగాణా ప్రజలకు నవాబు పాలన అంతమై కొత్త వ్యవస్థ ఏర్పడుతుందన్న ఆశతో వర్ణించు సందర్భం.

**భావం :** తెలంగాణా ప్రజల పోరాటంలో నవాబు నిరంకుశత్వం నశిస్తుందని, బానిసత్వం తొలగిపోతుందని, తెలుగుభూమి సుఖసంతోషాలు పొందగలదని కవి ఆశాభావం. ఇక్కడ తెనుగుతల్లి పసిడికాన్పు నూతన వ్యవస్థ కు నాంది పలుకుతుందన్న భావంతో కొత్తపంట ధరిస్తుందని కవి ప్రయోగం చేశాడు.

**13. విశ్వవాణి గొంతులో కొత్తజీర పలుకుతుంది.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** నిరంకుశ పాలనపోయి, ప్రజాస్వామ్య వ్యవస్థ వస్తుందనే ఆశాభావంతో కవి పలికిన సందర్భంలోనిది.

**భావం :** నైజాంనవాబు దుర్మార్గపు పాలన అంతరించి, పోరాటం కారణంగా నూతన వ్యవస్థ ఏర్పడుతుందని భావికాలంలో చరిత్రలో ప్రజాస్వామిక వ్యవస్థ ఆవిర్భవిస్తుందని కవి ఆలోచన, ఆకాంక్ష. కవికలలు పండాయి. అందుకే విశ్వవాణి గొంతులో నూతన వ్యవస్థ యొక్క స్వరాలు వినిపించాయి.

**14. బానిసత్వపు బరువు ఛేదించుజెండా, మానవత్వపు తెరువు చూపించు జెండా.**

**పరిచయం :** ఈ వాక్యం డాక్టర్ ఆవంత్స సోమసుందర్ రచించిన 'వజ్రాయుధం'లోని బానిసల దండయాత్ర అను పాఠ్యభాగం నుండి గ్రహించబడినది.

**సందర్భం :** తెలంగాణాలో ప్రజల పక్షాన నిలిచి పోరాటం చేసిన కమ్యూనిస్టుపార్టీ చిహ్నమైన ఎర్రజెండాను ప్రశంసంచే సందర్భం.

**భావం :** తెలంగాణా పోరాటంలో ప్రజలకు అండగా నిలిచింది ఎర్రజెండా. యువశక్తికి నవశక్తిని కూర్చేది సర్వసమానత్వానికి నాంది పలికేది, కష్టజీవుల కలతలను పోగొట్టేది, మృష్టాన్నసిద్ధికి పోరాడేది ఎర్రజెండా.

దుర్మార్గుడు, నిరంకుశడైన నైజాంనవాబును ఎదిర్కొని, బానిసత్వాన్ని పారద్రోలి మానవత్వపు మార్గాన్ని చూపించింది ఎర్రజెండా. కాబట్టే కవి ఎర్రజెండాను ప్రశంసిస్తున్నాడు.

## 10.6. ప్రశ్నలు - సమాధానాలు :

**1. "బానిసల దండయాత్రలో సోమసుందర్ తెలంగాణా పోరాటాన్ని ప్రభోదించిన తీరును వివరించిండి.? (లేదా) బానిసల దండయాత్రలో కవి వెలిబుచ్చిన అభిప్రాయాలను తెలపండి.? (లేదా) నిజామ్ ప్రభువును వ్యతిరేకిస్తూ అతనిపై తిరుగుబాటు బావుటా ఎత్తమని కవి ప్రజల్ని ప్రేరేపించిన తీరుతెన్నుల్ని వివరించండి ?**

జ॥ నైజాం ప్రాంతాన్ని పాలిస్తున్న నవాబు నిరంకుశడు, దుర్మార్గుడు. అతని దుర్మార్గరీతులను బాగా ఒంటబట్టించుకున్నవారు నవాబు క్రింద పనిచేసే అతని తొత్తులైన జాగీర్దార్లు, భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, పటేళ్లు మొదలైనవారు. వీరు చేసే, చేయించే క్రూరచర్యలు, పీడనలను ప్రజలు భరించలేకపోయారు. నవాబుగారి తొత్తులంతా విలాస వంతమైన భవనాలలో సుఖాలలో తేలిపోతుంటే సామాన్యజనం నీటి ఎద్దడికిగురై త్రాగేందుకు మంచినీళ్లు దొరకని స్థితిలో దుఃఖిస్తున్నారు. నిజాం నవాబు ప్రజలకు కనీసావసరాలను సమకూర్చలేకపోయాడు. రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించకపోగా, జాగీర్దారులు పేదరైతులు కష్టించి పండించిన పంటలో ఎక్కువ భాగాన్ని శిస్తు కింద లాగేసుకోసాగారు. చాకిలి, మంగలి, కుమ్మరి మొదలగు వివిధ వృత్తులవారి చేత బలవంతంగా వెట్టిచాకిరి చేయించుకునేవారు. తమకు అనుకూలంగా ప్రవర్తించనివారిని ఎన్నో విధాలుగా హింసించేవారు. ఆహింసలకు తట్టుకోలేని సామాన్యప్రజలు బాంచను నీ కాల్మొక్తాదొరా ! అంటూ వారి పాదాల దగ్గర బానిసలై నికృష్టంగా బతికేవారు. ఈ స్థితిని గమనించిన కవులు తమ గళాలు విప్పారు. కలాలు విదిలించారు. నిజాం నిరంకుశత్వాన్ని నిరసిస్తూ కావ్యాలు వెలువరించారు.

తెలంగాణా పోరాటం సందర్భంలో వచ్చిన సాహిత్యాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు. పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని, బాధల్ని అనుభవించి, తీవ్రావేశంతో రచించిన సాహిత్యం మొదటిదికాగా తెలంగాణా వెలుపల ఉండి పోరాటాన్ని గూర్చి తెలిసికొని వారితో ఏకీభవిస్తూ వారికష్టాలకు కావ్య రూపమిచ్చినది రెండవది. మొదటి దానికి కాళోజి, దాశరధి, ఆళ్వారుస్వామి, మఖ్దూమ్

మొహియుద్దీన్, గంగినేని వంటివారు ప్రతినిధులైతే, రెండవదానికి సోమసుందర్,ఆరుద్ర అనిసెట్టి రమణారెడ్డి మొదలగువారు ప్రతినిధులుగా నిలబడ్డారు.

బానిసల దండయాత్ర ఆవంత్స సోమసుందర్‌గారి వజ్రాయుధం కావ్యం నుండి గ్రహించబడింది. అభ్యుదయకవితా ఉద్యమంలో వెలువడిన ఉత్తమ కావ్యాలలో వజ్రాయుధం ఒకటి. తెలంగాణా పోరాటంలో నేపథ్యంగా డాక్టరు సోమసుందర్ నిజాంనవాబు పరిపాలనను అంతమొందించే ప్రజాయుధంగా వజ్రాయుధాన్ని రచించారు.

వజ్రాయుధంలో ప్రజల్ని హింసించే నవాబును సోమసుందర్

**“ఖబడ్దార్ ఖబడ్దార్**
**నైజాం పాదుషాహే**
**బానిసత్వ విముక్తికై**
**రాక్షసత్వ నాశముకై**
**హిందూ - ముస్లిం పీడిత**
**శ్రమజీవులు ఏకమైరి”** అని హెచ్చరించాడు.

వర్గ సంఘర్షణ చిత్రిస్తూ, ఇది రెండు ప్రపంచాల మధ్య, రెండు లోకాల మధ్య కొనసాగుతున్న సంఘర్షణఅని తెలిపాడు. ఇక్కడ రెండు ప్రపంచాలంటే పాలకులు - పాలితులు లేదా పీడకులు - పీడితులు. రెండు లోకాలంటే ధనికులు - పేదలు. పాలకులు లేదా పీడకులు ఎల్లప్పుడూ పాలితులు లేదా పీడితులు తమ బంధాల నుండి బయటపడి, స్వేచ్ఛగా తిరగకుండా ఉండాలని ఆలోచిస్తారు. పీడన తట్టుకోలేని పీడితులు, పేదలు కలిసి తిరుగుబాటుతో యువశంఖం పూరిస్తూ, సమధర్మం కోరుతూ సామ్యవాద వ్యవస్థకై పోరాటం చేయాలనుకుంటారు. పాలకులది తిరోగామలోకం, పీడితులది పురోగామిలోకం. ఈ రెండు లోకాల మధ్య పేద, ధనిక ప్రపంచాల మధ్య జరుగుతున్న సంఘర్షణే వర్గ సంఘర్షణ.

నిజాం నవాబుపై తిరుగుబాటుకు పీడితులైన హిందూ, ముస్లిం ప్రజలంతా ఏకమై పోరాడాలని కవి ప్రభోదించాడు.

**‘కదలండి కదలండి కదలిపోరాడండి**
**కాకతీయుల శౌర్య పటిమ చూపించండి**

**తెలంగాణా!తెలంగాణా! ధీరులకు మొగసాల’** - అంటూ తెలంగాణాకు కీర్తించారు. తెలంగాణా ప్రజల్ని ప్రేరేపించారు. నిజాం నిరంకుశత్వానికి రజాకార్లు, పోలీసులు, ద్రోహులు మద్దతు ఇచ్చారు. వారంతా ఒక్కటే ప్రజల్ని చిత్రహింసలు పెట్టారు. స్త్రీలను మానభంగం చేశారు. వక్షోజాలు కోశారు. ఈదారుణకాండను నిరసిస్తూ - “రాక్షసులు రాక్షసులు రాజీలుపడ్డారు, ఘోరహత్యకు మనల గురిచేసినారు'' - అని నిజాంనవాబు పీడన విధానాన్ని వివరించాడు.

పీడితులంతా సమైక్యమై నిజాంనవాబును ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు. వారిని పోరాటం సాగించమని ప్రేరేపిస్తూ తెలుగు వీరుడి గొప్పదనాన్ని తెలియజేశాడు.

**“తెలుగు వీరుడు మరణ మెరుగడని చాటండి**
**పిరికివానికి వేయి చావులని తెలపండి**
**పోరాడండి పోరాడండి పోరాడండి బ్రతుకుకై**
**పోరాడండి స్వేచ్ఛకై”** - అంటూ పిడిత ప్రజానికంలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. "Coward Diesmanyatimes" అనే ఆంగ్లసూక్తి ఆధారంగా ‘పిరికివానికి వేయి చావులని’ ప్రయోగం చేశారు.

నిజాం వ్యతిరేక పోరాటంలో అమరులైన మృతవీరులు కొమరయ్య, అనంతయ్యలను అజేయులుగా కీర్తిస్తూ, వారు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తారని సంస్మరించాడు. వారిని స్మరిస్తూ, విప్లవ పోరును ఉడికిస్తూ పోరాటయోధులకు ప్రబోధిస్తూ

**"ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు**

**ఒక నెత్తుటి బొట్టులోనే ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు"** - అని ఉత్సాహపరిచాడు.

జనగామపై నవాబుసైనికులు దాడిచేసి గృహదహనాలు చేస్తూ, ప్రజల్ని నానారకాలుగా హింసిస్తూ, వారి ధనమానాలను కొల్లగొట్టారు. ఆధునిక ఆయుధాలతో ముట్టడించారు. అదిచూసి సహించలేని ప్రజలు, ఇంటికొక వీరుడిగా విజృంభించి పోరాడారు. శ్రామికులంతా పోరాటానికి సమైక్యంగా సిద్ధమయ్యారు. పుడమితల్లి పోరాటదీప్తికి పులకించిపోయింది. తెలుగుతల్లికి ముద్దుబిడ్డడు ఒక పదహారేళ్ల ధీర గెరిల్లా. అతడు రాత్రివేళ పహారాలో శత్రువుల తుపాకీ గుండ్లకు బలైపోయాడు. గుహలో నిద్రిస్తున్న ముగ్గురు వీరులను శత్రువులు దారుణంగా నేలకూల్చారు. వారంతా దేశాభిమానంతో వీరాభిమన్యుల్లా పుడమితల్లి ఒడిలో ఒరిగిపోయారని, వారిని కవి కీర్తించాడు. చనిపోయిన ఆవీరులు పుడమితల్లికి చివరిసారిగా ఒక విప్లవాత్మక సందేశాన్నిచ్చారు. తల్లీ ! ఏడవకమ్మా ! మళ్లీ జన్మన్నది మాకుంటే, చల్లని నీకడుపున జన్మిస్తామన్నారు. నాజీనిజాం, రాక్షసరజాకార్లు, పోలీసులు, ద్రోహుల రక్తంతో బానిసత్వ విముక్తికై అసువులు బాసిన తమ్ముళ్ల ఆత్మల శాంతికి దోసిళ్లతో తర్పణమిద్దామని కృతజ్ఞతాపూర్వకంగా పలికారు.

ప్రజా పోరాట పటిమను నవాబుకు తెలియజేస్తూ

**"నైజాం కీచకుడా ! నీపీచమణచ ప్రజలంతా**

**ఒక పిడికిట ఒకగొంతుక ఒక మ్రోతై ధ్వనిస్తారు**

**మృతవీరుల స్మరిస్తారు, నవయోధుల సృజిస్తారు"** - అని ప్రజలు జరిపే సమైక్య పోరాటం వలన నవాబు పతనం కాకతప్పదని, కవి స్పష్టం చేశాడు.

నవాబు తన సింహాసనాన్ని బానిసల, పీడితుల శల్యాలతో నిర్మించుకున్నాడు. బానిసత్వాన్ని పాతిపెట్టేందుకు ప్రజలు సాగించేపోరులో, ఆ సింహాసనం కూలిపోతుందని కవి ధ్వనింపచేశాడు. తననెదిరించిన ప్రజల్ని నిరంకుశంగా చంపించి, పాతి పెట్టేందుకు నవాబు ముందుగా గోతులు త్రవ్వించాడు. ఆ గోతుల్లోనే నవాబు అమానుషత్వాన్ని, నిరంకుశత్వాన్ని ప్రజలే పాతేస్తారని కవి హెచ్చరిక చేశాడు. నవాబు అంతరిస్తే విశాలాంధ్రలో ప్రజాస్వామ్యం ఏర్పాటవుతుందని కవి ఆకాంక్ష.

దుర్మార్గుడైన నవాబు, క్రూరుడైన అతని దుండగులచేతుల్లో చిత్రహింసలకు గురైన స్త్రీలంతా కాళికా మాతల్లా విజృంభించారు. ప్రజాపోరాటంలో పాల్గొన్నవారంతా విజయుల్లా ఈటెలు, బల్లాలతో ముందుకురికారు. ఆడమగతేడాలేకుండ నాటు తుపాకులు, రోకళ్లు, కారాల మూటలతో కదలి, జనగామలో జయభేరి మ్రోగించారు. రాక్షసులను కూల్చారు. కవిక్రాంతదర్శి. కనుకనే ఈ విషయాన్ని

**"ఈయాగం ఫలిస్తుంది**

**రాక్షస సంహారోత్సవ**

**మహాక్రతువు ఫలిస్తుంది**

**ప్రయత్నాలు ఫలిస్తాయి** - అని ఆశించారు.

ఆయన కోరుకున్నట్లుగానే తెలుగుతల్లి పసిడికాన్పు కొత్త పంట ధరించింది. నవ జీవనం పరిమళించింది.

నవాబుపై విజయాన్ని సాధించిన తరువాత రైతులు, పేదలు, కూలీలు నల్లగొండ లోయల్లో సమావేశమై, అడవులు, బీళ్లు, బంజర్లు సమతలం చేసి, సమిష్టి వ్యవసాయ పథకానికి ఆలోచించారు. భూదేవత కన్నులపంటగా పండించిన పంటలతో ఉమ్మడిగా సౌఖ్యాన్ని పొందడమే సమ సమాజ లక్ష్యం.

కమ్యూనిస్టు పార్టీ అండదండలతోనే నిజాం నవాబుపై తిరుగుబాటు పోరాటం జరిగింది. ఆపార్టీ చిహ్నమైన ఎర్రజెండాని

**"కష్ట జీవుల కలతకదిలించు జెండా**
**మృష్టాన్న సిద్ధికై పోరాడు జెండా**
**బానిసత్వపు బరువు ఛేదించు జెండా**
**మానవత్వం తెరువు చూపించు జెండా"** - అని కవి ప్రశంసించారు.

తీవ్ర భావావేశంతో, అభుద్యయ భావాలతో సోమసుందర్ తెలంగాణా పోరాట ఆవశ్యకతను తెలియజేస్తూ, ప్రజలను ముందుకురకమని ప్రబోధించాడు.

**2. "పీడిత తాడిత ప్రజల చైతన్యాయుధం - వజ్రాయుధం" - సమర్థించండి. (లేక)**
**బానిసల దండయాత్రలో సోమసుందర్ వెల్లడించిన అభ్యుదయ కవితారీతులను తెలపండి. (లేక)**
**"తెలంగాణా పోరాటంపై వెలువడిన ఉత్తమ కావ్యాల్లో వజ్రాయుధమొకటి" - చర్చించండి.**

జ॥ దుర్మార్గుడైన నిజాం నవాబు పాలనలో ప్రజలు ఎన్నో కష్టాలు పడ్డారు. జాగీర్దార్లు, పట్వారీలు, రైతుల్ని శిస్తుల కోసం వేధించారు. సామాన్య జనాన్ని చాకిరీతో విలవిలలాడేటట్లు చేశారు. అటువంటి నవాబు నిరంకుశత్వాన్ని నిరశిస్తూ, అభ్యుదయ కవులంతా తమ కలాలకు కొత్త ఊపిరినిచ్చారు. ప్రత్యక్షంగా పోరాటంలో పాల్గొని కాళోజి, దాశరధి, ఆళ్వారుస్వామి, గంగినేని వంటి కవులు కావ్యాలు రాశారు. తెలంగాణాలో జరుగుతున్న ఘోరదురంతాలను వెలుపల నుండి వార్తల ద్వారా తెలుసుకొని స్పందించి, కవిత్వం రాసిన వారిలో సోమసుందర్, ఆరుద్ర, అనిసెట్టి వంటివారు ఉన్నారు.

సోమసుందర్ తన వజ్రాయుధం కావ్యాన్ని - నవాబు దుర్మార్గాన్ని అంతం చేసేందుకు సామాన్య ప్రజలంతా కలసి చెయ్యెత్తిన ప్రజా ఆయుధంగా రచించారు. తెలంగాణా పోరాటంపై వచ్చిన ఉత్తమ కావ్యాల్లో వజ్రాయుధం ఒకటని విమర్శకులు ప్రశంసించారు. వజ్రాయుధమందలి బానిసల దండయాత్రలోని "ఖబడ్దార్" అను గేయానికి ప్రజల్లో బహుళ ప్రచారం లభించింది. ఈ గేయం నిజాంపాదుషాకు తుది హెచ్చరిక - అని ఆచార్య కె.వి.ఆర్. నరసింహం అన్నారు.

వజ్రాయుధం కావ్యంలోని 'బానిసల దండయాత్ర' పాఠ్య భాగాన్ని పరిశీలిస్తే, దానిలో సోమసుందర్ వ్యక్తం చేసిన అభ్యుదయ భావాలు స్పష్టమవుతాయి.

అభ్యుదయ కవితా రీతులను గూర్చి డాక్టర్ సి. నారాయణరెడ్డి "ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగాలు" అనే తన సిద్ధాంత గ్రంథంలో వివరించారు. 1. వర్గ సంఘర్షణ, 2. విప్లవ ప్రబోధం, 3. వీరగాధాకథనం, 4. యుద్ధ విముఖత - శాంతి కాముకత, 5. సమసమాజ నిర్మాణం, 6. తెలంగాణా విముక్తి, 7. రాష్ట్రోదయం. ఈ అభ్యుదయ కవితారీతుల్లో సోమసుందర్ వజ్రాయుధంలోని బానిసల దండయాత్రలో పైన పేర్కొన్న అభ్యుదయ కవితారీతుల్ని పరిశీలిద్దాం.

1. **వర్గ సంఘర్షణ :** అభ్యుదయ కవిత్వంలో ప్రధానమైంది వర్గ సంఘర్షణ. ఇందులో గత నిరసన, బూర్జువా వ్యవస్థ తిరస్కారం ప్రధానమైన అంశాలు.

**'రెండు ప్రపంచాల మధ్య**
**రెండు లోకాల మధ్య**
**సాగుతున్న సంఘర్షణ'గా -** వర్గ సంఘర్షణను సోమసుందర్ చిత్రించారు. ధనస్వాములు, వారి ప్రతినిధులంతా స్వార్థ పరులు, అసుర వృద్ధవృకోదరులు, అంధకార జాత్యంధులు, అభివృద్ధి నిరోధకులు. వాళ్లు కోరుకునే లోకం వ్యాధిగ్రస్తమైన తిరోగామి లోకం.

ప్రజాస్వామ్య కారకులు, పీడిత జనప్రతినిధులు, స్వాతంత్ర్యాభ్యుదయాలను కాంక్షించే శాంతిమయమైన వ్యవస్థ పురోగామి లోకం. పాలకులు - పాలితులకు సంబంధించిన తిరోగామి - పురోగామి లోకాలకు, ధనిక-పేద ప్రపంచాలకు మధ్య జరుగుతున్న సంఘర్షణే వర్గ సంఘర్షణగా వర్ణించాడు.

**2. విప్లవ ప్రబోధం :** నిజాం నవాబు నిరంకుశత్వాన్ని నిరసిస్తూ, దారుణ మారణకాండకు పాల్పడుతున్న నవాబు తొత్తులైన జాగీర్దార్లు, దేశ్‌ముఖులు, రజాకార్లు మొదలగు దుర్మార్గుల చేష్టలను గర్హిస్తూ, పోరాటానికి ప్రజల్ని కవి పురికొల్పారు. పీడిత ప్రజలంతా హిందూ-ముస్లిం భేదం లేకుండా ఏకమయ్యారు.

**"కదలండి కదలండి కదలిపోరాడండి**
**కాకతీయుల శౌర్యపటిమ చూపించండి**
**తెలంగాణా తెలంగాణా ధీరులకు మొగసాల**
**రాక్షసులు రాక్షసులు రాజీలు పడ్డారు**
**ఘోరహత్యలకు మనల గురిచేసినారు**
**ఖబడ్దార్ ఖబడ్దార్ నైజామ్ పాదుషాహే"** అని నవాబుపై అతని రాక్షసానుచరులపై తిరుగుబాటు చేయండని వారికి బోధించారు. "తెలుగువీరుడు మరణమెరుగడని చాటండి, పిరికివానికి వేయి చావులని తెలపండి" అని తెలుగు వీరుల శక్తిని చాటిచెప్పాడు.

**3. వీరగాథా కథనం :** అభ్యుదయ కవులు రచించిన గెరిల్లా పోరాటాలకు సంబంధించిన అంశాలన్నీ వీరగాథా కథనంలోకి స్వీకరించవచ్చు. అడవుల్లో దాగి, కాయకసరులు తింటూ, అష్టకష్టాలకోర్చి, నవాబు సైన్యాన్ని, పోలీసుల్ని అదనుచూసి ఎదిరించడమే లక్ష్యంగా వీరి పోరాటాలు సాగాయి. గెరిల్లా పోరాటంలో సాహసోపేతంగా పోరాడి, ప్రాణాలు కోల్పోయిన కొమరయ్య, అనంతయ్యల పరాక్రమాలు ఈ పాఠ్యభాగంలో వీరోచితంగా వర్ణించబడ్డాయి. జనగామలో జమ్మికొమ్మపైకెక్కి గాండీవాన్ని వెదుకు అర్జునిడిలా, పాంచజన్యాన్ని పూరిస్తున్న విష్ణువులా, గెరిల్లా నాయకుడ్ని కవి వర్ణించాడు. జనగామలో గృహదహనాల సందర్భంగా, అతడు విజృంభించిన తీరును ప్రళయకాల మహారుద్రుడు, తాండవ జటాజనిత భద్రుడుగా బీభత్సం సృష్టించాడని వర్ణించాడు.

యువ గెరిల్లా వీరమరణం పొందిన సందర్భంలో అతడిని ఆంధ్రమాత దివ్య చరిత ప్రసవించిన ధీర గెరిల్లాగా బాలచంద్రునకు సోదరుడిగా, రుద్రమాంబ తోబుట్టువుగా అభివర్ణించాడు.

విప్లవ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన కొమరయ్య, అనంతయ్యలను అజేయులుగా తెలుగునేల చరిత్రలో చిరస్థాయిగా నిలిచే మహనీయులుగా ప్రశంసించారు. వారి వారసులుగా గొప్ప వారసులు పుట్టుకొస్తారని చెప్పిన మాటలు ఆవేశపూరితంగా ఉన్నాయి.

**"ఒక వీరుడు మరణిస్తే వేలకొలది ప్రభవింతురు**
**ఒక నెత్తుటి బొట్టులోనే ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లు"** తాయని వీరగాథా కథనం చేశారు.

**4. సమసమాజ నిర్మాణం :** సమ సమాజం సిద్ధించాలంటే వర్గ సంఘర్షణ తప్పదని, అదే సరైన ఆయుధమని అభ్యుదయ కవులు భావించారు. బానిసల దండయాత్రలో నిజాం నవాబు నిరంకుశ పాలన అంతమయ్యాక, ప్రజలంతా నల్లగొండ లోయల్లో పేదలు, రైతులు, రైతుకూలీలు ఉమ్మడిగా సమిష్టి వ్యవసాయంకోసం బీళ్లు అడవులు, బంజర్లు సమతలంగా చేసుకొని, పంటలు పండించుకోవాలనుకున్నారు. వారి ఆలోచనలను ప్రశంసిస్తూ - కవి

**"లక్షమంది నినదించిన కోర్కెలు**
**ఆశల ప్రతిధ్వనించిన లోయలు"** అని తాను ఆశించిన సమసమాజపు ఆశయాన్ని కీర్తించారు.

**"పుడమితల్లి పసిడిపంట**
**మానవులంతా కాచుకొనే న్యాయం**
**పుడమితల్లి బంగరు పంటలు**
**నరులంతా సోదరులై పంచుకునే ధర్మం"** అని మానవులంతా సోదరులై సమపథంలో వర్తించాలని కోరుకున్నారు.

5. **తెలంగాణా విముక్తి :** తెలంగాణా విముక్తి కోసం వజ్రాయుధం కావ్యం రాయబడింది.

**"భవిష్యత్తు స్వరూపాల చరిత్ర గతి లిఖిస్తోంది**
**విశ్వవాణి గొంతుకలో కొత్తజీర పలుకుతోంది"**

అని, తెలంగాణా భారతదేశంలో విలీనం కాకముందే, భవిష్యత్తును ఊహించిన, కాంక్షించిన క్రాంతదర్శి కవి. ఈ యాగం ఫలిస్తుందని మహాక్రతువు ఫలించి, రాక్షసుడైన నవాబు అంతంతో రాక్షస సంహారోత్సవం జరుగుతుందని ఆశించిన అభ్యుదయకవి సోమసుందర్.

ప్రబోధ కవిత్వంలో శిల్పం, వ్యంగ్యం, ధ్వని వంటి లక్షణాలకు ప్రాధాన్యం అంతగా ఈయనవసరంలేదు. సూటిగా ప్రజల హృదయాలలో నాటుకొనేటట్లు చెప్పడమే కవి లక్ష్యంగా ఉండాలి. తెలంగాణాకి ఇవతల మనమున్నాం తెలుగువాళ్లం. ఇక్కడి తెలుగు ప్రజలకి అక్కడి తెలంగాణాలో జరుగుతున్న ఘోరాలన్నీ పాటలు పాడి, తాను చెప్పాల్సిన అవసరం ఉంది. అది తాత్కాలిక ప్రయోజనం మాత్రమేకాదు. చరిత్రలో శాశ్వతంగా ఉండేది జానపదగీతం. ఆ జానపదుల బాధలను దండోరా వేసేదే పాట. జానపద గీతం జాతికి జ్ఞాననేత్రం కాగలదన్న చైతన్యంతో పాటలల్లుతున్నాడు.

సోమసుందర్ ప్రజల పక్షం వహించి కలం కదపనారంభించాడు. వజ్రాయుదంలో ఉద్యమ స్థాయినందుకున్న మధ్య భాగంగా మారింది. ఈ శతాబ్దిలో నిజంగా జరిగిన ఘట్టాలే తన కవితకు ఊపిరిపోశాయి. బానిసల దండయాత్ర వస్తుతః వాస్తవం. సంవిధానంలో కొంత కాల్పనికత ఉంది. ఆ కాల్పనికత పప్పులోని ఉప్పు వంటిదే కాని, భావకవిత్వంలో వలె పంచదారకాదు. బానిసల దండయాత్ర రిపోర్టుకాదు కవిత్వమే. పాత్యేగే యేచ మధురం. కావున దాన్ని శ్రద్ధగా చదివి స్పందించవలసిందే.

ఇప్పటివరకు వజ్రాయుధం పలు ముద్రణలకు నోచుకోవడం దాని గొప్పదనానికి నిదర్శనం. తెలంగాణా పోరాటంపై వెలువడిన ఉత్తమ కావ్యాల్లో వజ్రాయుధం ఒకటి అని పేర్కొనడం సమంజసం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. భావయిత్రి - కారయిత్రి - రచన : డాక్టర్ మిరియాల రామకృష్ణ
2. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగాలు - రచన : డాక్టర్ సి. నారాయణరెడ్డి

**ముగింపు :**

పాలించటం వేరు. పీడించటం వేరు. పాలనలో బాధ్యత ఉంటే ప్రజాభిమానం పెరుగుతుంది. అదే పీడన కనిపిస్తే, ప్రజా తిరుగుబాటు మొదలవుతుంది. తెలంగాణా ప్రాంతంపై అధికారాన్ని చెలాయిస్తూ నిజాంనవాబు కొనసాగించిన పాలనలో కనీస బాధ్యతకన్నా, అధిక పీడనే కనిపిస్తుంది. ప్రజలకు కావలసిన కనీస సౌకర్యాలు కల్పించలేని పరిపాలనలో హీనంగా బ్రతకడం కంటె, చేతనైనంతవరకు నిరంకుశ ప్రభువు నెదిరించి, తమ హక్కుల్ని సాధించుకోవాలనుకున్నారు తెలంగాణా ప్రజలు. ఆ ఆలోచనే వారిని ఆవేశపరుల్ని చేసింది, ఆచరణలో పెట్టించింది. ఆ ప్రజల తిరుగుబాటు తీవ్రతను ప్రత్యక్షంగా చూచి, ఆ పోరాటంలో పాల్గొని రచనలు చేసినవారు కొందరున్నారు. ప్రత్యక్షంగా తెలంగాణా పోరాటంలో పాల్గొనకపోయినా, అక్కడి విషయాలను తెలుసుకొని ప్రజాప్రగతిని కోరే అభ్యుదయవాదిగా సోమసుందర్ స్పందించి రచన చేశారు. తాను రచించిన బానిసల దండయాత్రలో కవి ప్రధానంగా ప్రజా ప్రబోధం చేశారు. ఎదుటివారిని పీడించడం ఎప్పుడూ వినాశకరమే. ప్రజలపై నిరంకుశంగా ప్రవర్తిస్తే, ఆ ప్రజలే నిలువునా పాతేస్తారు. అవమానింపబడేవాడు అణచివేతకు గురైనవాడు, పీడించబడేవాడు ఒక్కసారిగా చైతన్యవంతుడై, ఎదురు తిరిగితే, చేయి పైకెత్తితే, అతని ధాటికి ఎవరూ తట్టుకోలేరు. తెలంగాణా ప్రాంతంలో జరిగిందిదే. బానిసల దండయాత్రలో రచయిత స్పష్టం చేసింది యిదే. కనుక పాలించే ప్రభువు ప్రజల్ని కన్నబిడ్డల్లా చూచుకోవాలిగాని, కానివారిలాగా భావించకూడదు, వారిని నిర్లక్ష్యం చేయకూడదు. సాటి మనిషిని మనిషిగా చూడాలి, మానవత్వం చూపాలి. అలా చూపని పక్షంలో, ఆ వ్యక్తి నుండి తిరుగుబాటు ఎదురవుతుందని ఈ పాఠం స్పష్టం చేస్తుంది.

**డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు**
రీడర్, తెలుగు విభాగం,
ఆర్.వి.వి.ఎన్. కాలేజి, గుంటూరు.

**పాఠం : 11**

# నగరంలో వాన

**- కుందుర్తి ఆంజనేయులు**

**శీర్షికలు :**


11.0 లక్ష్యము

11.1 కవి పరిచయము

11.2 పాఠ్యభాగ సందర్భము

11.3 పాఠ్యభాగ సారాంశము

11.4 కఠిన పదాలు - అర్థ తాత్పర్యాలు

11.5 సందర్భ సహిత వ్యాఖ్యలు

11.6 ప్రశ్నలు - సమాధానాలు


## 11.0. లక్ష్యం :

ఆధునిక కవిత్వము త్రొక్కిన క్రొత్తదారులను విద్యార్థులకు పరిచయం చేసి 'పద్యమునకు', 'వచన కవిత్వము'నకున్న వ్యత్యాసమును కుందుర్తి ఆంజనేయులుగారి 'నగరంలో వాన' ఆధారంగ విద్యార్థికి వివరించటం ప్రధాన లక్ష్యం.

ప్రాచీన కవి సమయాలు, సంస్కృత సమాస భూయిష్టమైన పద బంధాలు, చవి దప్పిన ఛందస్సులు - కాలానుగుణంగ ఎలా మారుతాయో, ఎలా మారినవో సోదాహరణగా ప్రస్తుత పాఠ్యభాగం ఆలంబనంగా బోధించటం ఈ పాఠ్యలక్ష్యము. క్రొత్త ఉపములు, క్రొత్త పలుకుబళ్ళు, క్రొత్తదీ, సమకాలీనమైనదీ, సులభమైనదీ ఐన వ్యావహారిక భాష ప్రజలకు ఎంత చేరువౌతుందో సామాన్య మానవునిలో ఎలా చైతన్యాన్ని నింపుతుందో తెలియచెప్పటం - ఈ పాఠ్య లక్ష్యము.

## 11.1. కవి పరిచయం :

గుంటూరు జిల్లా కోటవారిపాలెం మునసబు రామయ్యగారి సంతానం కుందుర్తి ఆంజనేయులుగారు. పుట్టింది డిసెంబరు 16, 1992లో. "ఆత్మ విశ్వాసపు కండ కలవాడు కొందఱున్నారు లోకంలో, అందులో నేనొకణ్ణి' అని ధైర్యంగా చెప్పగలిగిన ఆంజనేయులు గారు తొలినాళ్ళలో పద్య పఠనానికి, పద్య రచనకు ఆకర్షితులై జాషువా, విశ్వనాథలను అనుకరించడానికి మొదలు పెట్టారు. ఆంధ్ర క్రైస్తవ కళాశాల గర్వంగా చెప్పుకోదగ్గ కవి శిఖామణి.

భావ కవిత్వము ఏలుతున్న రోజుల్లో - విద్యార్థి దశలో - ఆంజనేయులుగారు కూడా కాలప్రవాహపు ఒరవడిలో కొట్టుకు పోయారు. ఫలితంగా 'సాహితీకం' అన్న భావ కవిత్వ పద్యకావ్యం వెలసింది. యౌవనోద్దీపనకాలంలో 'రసధుని' (భావ కవిత్వం), వృత్త పద్యాలలో విరహార్తిని తెలిపే 'అమావాస్య', 'నా ప్రేయసి' అన్న ఖండకావ్యాలు దర్శనమిచ్చాయి.

రెండవ దశలో అంటే 1941 తర్వాత మార్క్సిస్టు భావాలు, శ్రీశ్రీ అనర్గళ శైలీ విశృంఖలతలను స్వంతం చేసికొన్నారు. భూస్వామ్య వ్యవస్థలో శ్రామికుల తిరుగుబాటును 'తెలంగాణా' అన్న పేరుతో 16 పర్వాలను 16 దినాల్లో పూర్తి చేసి తన కవితా దీక్షకు అద్దం పట్టారు. తొలి 'తెలుగు వచనకావ్యం' వ్రాసిన ఘనత 'తొలి తెలుగు విప్లవ జ్యోతి' వ్రాసిన ప్రత్యేకత ఆంజనేయులు గారిది. అందుకే ఆయనను 'వచన కవితా పితామహుడు' అని గౌరవంగా సంభావిస్తారు.

గతి తార్కిక సిద్ధాంతపు అవగాహన, సామాజిక చైతన్యం సంఘ పురోగమనం - ఇవీ కుందుర్తి వారి కవితా లక్ష్యాలు. 'చదువు సంధ్యలు రాని రోడ్డు మీద పామరుని ఉద్దేశించినదని' తన కవితను గూర్చి కుందుర్తి చెప్పినారు. సంప్రదాయాన్ని పరిశీలించి, హేతువాదంతో తర్కించి, శాస్త్ర ప్రమాణాలకు దీటుగా నిలబడే దాన్నే కవితా వస్తువుగా స్వీకరించటం ఆయనకు ఆనవాయితీ.

పాండిత్య ప్రకర్ష ఆయనకు రుచించదు. సంస్కృత భాషా ప్రాగ్భల్యము ఆయన దరికి చేరదు. ఆంగ్ల పదాల ప్రాచుర్యం సహించదు. తేట తెలుగు పదాల తియ్యదనం కోరుకొనేవారు తెలుగుదనపు నెయ్యాన్నే కోరుకొనేవారు. 'ప్రయోజనం తండ్రిగా, పరమ సౌందర్యం తల్లిగా పలికే ప్రతి పలుకు రసానంద కల్పవల్లి'.

**ఇతర రచనలు :**

పైన ప్రసంగ వశాన తెల్పిన కవితలుగాక మరికొన్ని :-

- నయాగరా (1944లోని కవితా సంకలనం)
- యుగే యుగే
- నాలోని నినాదాలు
- హంస ఎగిరిపోయింది (భార్యా సంస్మరణము)
- 'తీరా నేను కాస్త ఎగిరిపోయాక' (ఆధ్యాత్మికం)
- మేఘమాల
- ఇది నా అజెండా
- బతుకు మాట (ఆత్మ కథ)
- 'జయిస్తుంది'
- 'తరువాత'
- 'మన్యంలో' (అల్లూరి సీతారామరాజు చరిత్ర)
- 'దండియాత్ర' (ఉప్పు సత్యాగ్రహం స్ఫూర్తితో పాలకవర్గం పై తిరుగుబాటు మొదలైనవి.)
- 'నాదారి నాది'
- 'ఆశ', 'శిక్ష ఏమిటి ?', 'ఆచార్ల గారమ్మాయి' (నాటికలు)

**రచనలో వైవిధ్యము :**

పద్యాన్ని ప్రక్కకునెట్టి వచన గేయానికి పట్టంకట్టారు.

**'బహుశా ఇదే మొదలనుకుంటాను,**
**గేయాలు తెచ్చిన కొత్త వెలుగు**
**ఆధునిక యుగంలో ఒక పూర్ణ కావ్యంగా**
**బ్రతుకును వర్ణించండి'**

అంటూ కొండంత విశ్వాసం ప్రకటించారు. కాలానికి అనుగుణంగా కవిత రావాలని కోరుకున్నారు. ఆంగ్లోపాధ్యాయునిగా ఉన్నా, ప్రిన్సిపాల్‌గా పనిచేసినా అనువాదకునిగా కొనసాగినా తెనుగు వచన కవిత్వాన్ని ఆజన్మం ఆరాధించారు. స్నేహితులతో కలసి 'నవ్యకళాపరిషత్తు' (నరసరావుపేట) స్థాపించినా, ఆశయ సాధనకై 'ఫ్రీవర్స్ ఫ్రంట్' (1958) ఏర్పరచినా తెనుగు వచన కవిత్వానికి జవాన్ని, జీవాన్ని నింపటానికే ప్రయాసపడ్డారు.

**గౌరవ పురస్కారాలు :**

- 'సోవియట్ భూమి' నెహ్రూ అవార్డు లభించింది. (1969)
- 'కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు' (1977)
- ఆంధ్ర సాహిత్య అకాడమి అవార్డు (1970) (నగరంలో వానకు)

కుందుర్తి ఆంజనేయులుగారి 'విమర్శ' వ్యాసరూపాన్ని పొందింది. ఆయన కవితలు 'మేరేబినో' అన్న కవితా సంకలనంగా హిందీ భాషా వాక్యంలో తెలుగు వెలుగుల్ని సహజమైన ఉపమానాలు, సరళమైన భాష, నవ్విస్తూ చురుకలు వేసే పసందైన ధోరణి, ఒక విధమైన ధ్వని విన్యాసంతో మెళకువలు, మనిషి జీవితంపై ప్రభావం చూపే పరిసరాల వర్ణనము, కారణకార్య సంబంధాన్ని దాటిపోని హేతువాద వైఖరి - ఇవన్నీ కుందుర్తి వారి కవితల్లో కన్పించే మెఱుపులు.

## 11.2. పాఠ్యభాగ సందర్భము :

1967 సంవత్సరంలో 'నగరంలో వాన' అన్న వచన కవితను ప్రాచీన కవిత్వానికి ప్రత్యామ్నాయం ఎలా ఉండాలో అలా వ్రాసి కృతకృత్యుడైన మహాకవి కుందుర్తి వారు ప్రాచీన కవిత్వపు పద్య రూపాల్ని గౌరవిస్తూనే, సున్నితంగా వాటిని తిరస్కరిస్తూ 'వచన కవితా వైభవాన్ని' పరిచయం చేసిన వ్యవహారవేత్త కుందుర్తివారు.

పద్యం పాతకాలానికి చెందితే వచనకవిత్వం వర్తమానానికి చెందినదని, ఛందస్సు భావాన్ని గొంతు నొక్కుతుందని, ఆడంబరమైన భాష భావ వ్యక్తీకరణకు ఆటంకమని, అష్టాదశ వర్ణనలలోని 'పురవర్ణన' ప్రాచీన కావ్య ప్రబంధాలలో వెఱ్ఱితలలు వేయటము చూచి 'పురవర్ణన' ఎలా ఉండాలో మచ్చుకు ఓ ఉదాహరణగా రచించిన పాఠ్యభాగం - 'నగరంలో వాన'.

ప్రబంధాలలోని అతిశయోక్తులు, అంగాంగ వర్ణనలు, వేశ్యా వృత్తి ప్రవృత్తుల ప్రశంసలు, రాజుల విలాస జీవితాలు వినీవిని, కనీకని విసుగెత్తి అవి సామాన్య జనజీవనానికి ఆమడదూరం ఉండేవని, జనాన్ని జాగృతం చేయటానికి అవి పనికిరావని ఆయన క్రొత్తగా వచనకవిత్వ శకానికి మాదిరిగా 'నగరంలో వాన'ను చిత్రించారు.

ఈయన బాటలో శ్రీరంగం నారాయణబాబుగారి 'విశాఖపట్టణం' సమకాలీన జీవితచిత్రబింబానికి ప్రతిబింబంగా మారింది. ఆయన స్థాపించిన 'నవ్యకళాపరిషత్తు' సభ్యులైన ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసు, అనిశెట్టి మొదలైనవారి కవితల్లో సమకాలీనమైన సామాన్య మానవునిలో చైతన్యాన్ని కలిగించే కొత్త వచన కవిత్వం చోటు చేసికొంది. వారికి నాయకత్వం వహించి పురవర్ణన ఎలా ఉండాలో 'నగరంలో గాలివాన'లో సోదాహరణంగా ప్రదర్శించారు.

ప్రకృతికి ప్రజా జీవితానికి విడదీయరాని బంధం ఉంది. 'వాన' ప్రకృతిలోని మరో సుకృతి. ఆ 'వాన' కూడ 'పల్లె' మీద పడిన వానకాదు 'నగరం'లో పడితే ఎలా ఉంటుందో - చెప్పిన తీరే 'నగరంలో వాన' అన్న పాఠ్యభాగ సందర్భం.

## 11.3. పాఠ్యభాగ సారాంశము :

ఆ నగరం హైదరాబాదు. జల్లులు జల్లులుగా నగరంలో కురుస్తున్న వాన కవి ఊహాంచలాల్లో కదుల్తున్న కవిత్వంలా ఉంది. నగర ప్రజలకు ఆవాన ఆశుకవితతో ఆశీస్సులు కురిపిస్తున్నట్లున్నది. ఎడతెరపి లేకుండా కురిసేవాన మెరుపులతో ఆకాశం తళుక్కు మంటుంది.

ఆ ఆకాశానికి అంత సంతోషం ఎందుకు ? ప్రశ్నించుకొన్న కవికి కొన్ని సమాధానాలు తోచాయి.

వానిలో ఒకటి - మింటిలో ఎక్కడో ఎత్తులో ఉండే మేఘాలు తమ అందాల్ని చినుకుల కుప్పలుగా పోస్తున్నాయి. ఫలితంగా స్వచ్ఛంగా తళతళలాడే నగరపు సిమెంటు రోడ్లు అద్దాల్లాగా మారిపోయాయి. ఆ అద్దాల్లాండి సిమెంటు రోడ్లమీదకు మెడలు వంచి తమ అందాల్ని చూచుకొన్న మేఘాలు ఆనందంతో మెలికలు తిరుగుతూ మిలమిల మెరుస్తున్నాయి. ఇంద్రుని వజ్రాయుధం దెబ్బకు రెక్కలు పోగొట్టుకున్న పర్వతాలు వలె ఉన్న రెండంతస్థుల బస్సుల్ని చూచి మేఘాలు కొండ శిఖరాలనుకొని క్రిందికి దిగి వచ్చాయి. తీరా వచ్చాక అవి కొండ శిఖరాలుకావని తెలిసికొన్నాయి. తిరిగి పైకి పోవడానికి ఒళ్ళు బద్ధకం వేసి - ఎంతో కాలానికి నగర దర్శన భాగ్యం లభించిందని - ఆ రాత్రికి సినిమా చూసి ప్రొద్దుగాల వెళ్ళొచ్చని, అక్కడే నిలబడిపోయాయి. పులకించిన సంతోషాన్ని వర్షంగా కురిపించాయి.

ఎండి పగుళ్ళువారిన నోరు తెరిచి కూచున్న నేలతల్లి - నడి బజారులో పడిపోయిన మూర్ఛవాడు బిందెల బిందెల నీటితో దాహం తీర్చుకొన్నట్లు నీటిని పీల్చివేసింది. పల్లె సీమలలో వర్షాకాంత పదిదుక్కుల లెక్కల్లో కురిసినా అది సస్య సమృద్ధికి సంకేతమే.

కాని వర్షం అంటే చికాకు పడే నగర ప్రజల వీపులు చిల్లులు పడేంతగా 'వాన' కురుస్తుంది. వర్షం అక్కరలేని నగరంలో పడే 'వాన' అవసరం లేనప్పుడే వద్దన్నా దొరికే అప్పులా ఉంది. చిరుజల్లులతో ప్రారంభమై వర్షాన్ని ఏమాత్రమూ - ఆహ్వానించని నగరంలో ఉదయపు జల్లులాగవచ్చు, రాత్రి వచ్చి ఇక కదలని చుట్టంలా తాపీగా కురుస్తుంది.

చిరు ఉద్యోగి తనకు వచ్చే చాలీచాలని జీతపు రాళ్ళను మిగిల్చుకొని ఒక గొడుగుకూడ కొనుక్కోలేడని 'వాన'కూ తెలుసు. నగరంలో ఉంటూ నాగరికత ముసుగులో 'గోనెసంచీ' కప్పుకోడనీ తెలుసు. గొడుగూ లేక గోనె సంచీలేక వానలో తడిసి, వణికి, జ్వరంతో మంచమెక్కితే చిటపట చిలిపి జల్లుల వాన తానెంత ఘనకార్యం చేశానో అని కిటికీల్లోంచి తొంగిచూస్తుంది. నగరంలో ఆఫీసులు వదిలేవేళ ఐదు గంటలని 'నగరంలో వాన'కు తెలుసు. ఉన్నిసూటు వేసుకొన్న వాణ్ణి వదలి తెల్లారితే మరోజత మార్చుకోలేని నిరుపేద మీద విరుచుకుపడుతుంది. అప్పటికదాక మేఘపు పొలుకులేకానరానిది అకస్మాత్తుగ కుండపోతగా కురుస్తుంది.

పలకను పుస్తకాలను గొడుగులా పెట్టుకొని పరుగెత్తే బడిపిల్లవాడు కాలుజారి పడతాడని తెలుసు లేదా ప్రక్కన జారిపోయే కారు చిమ్మిన మురికి నీటితో తడిసిపోతాడని తెలుసు - అందుకు బడిప్లిలవాణ్నే, వాళ్ళ అమ్మ ఆడిపోస్తుందని తెలుసు. అందుకు కారణం వానేనని వాళ్ళు కారణం వెతికేలోగా అమాయకంగా వెలిసిపోతుంది నగరంలోని వాన.

వర్షం వస్తుందని కొత్తగా కొనుక్కున్న గొడుగు వెంట బెట్టుకొని నాగేశ్వరరావు వెళ్ళాడని 'నగరంలోని వాన'కు తెలుసు. అందుకే ఆ రోజుకు వానపడలేదు. కాని ఇంటికి చేరిన నాగేశ్వరరావు తను వ్యర్థంగా శ్రమపడ్డానని బాధపడుతుంటే నగరం నాలుగు మూలల్లో విరగబడి వికటాట్టహాసం చేస్తూ ఉరుముల ఫెళ ఫెళార్భాటంతో నాగేశ్వరరావును భయపెట్టింది - 'వాన'.

'నగరంలో వాన'కు దయాధర్మ గుణాలు ఆపాదించబడ్డాయి. మూడు రోజుల పసికందును ముద్దుగా ఒడిలో గుండెలకు అద్దుకొంటూ ఆస్పత్రి నుండి బయటకు వస్తున్న బాలింతరాలిపై 'నగరంలోని వాన', 'కాసింత దయదలచి' పూలజల్లులా కురుస్తుందే గాని భోరున కురవదు.

స్వాతంత్ర దినోత్సవపు వేడుకల్లో రెండు మూడు గంటలసేపు బారులు తీరి నిలుచున్న పసి బాలబాలికలు - ఆనాటి జ్ఞాపకంగా ఏ పండు పెడతారో, ఏ చిరుతిండి పెడతారో ఎదురు చూస్తుంటారు. ఆ పసి పిల్లలపై కనికరంతో సన్నని తుప్పరనే కురుస్తుంది. కాని కసితో వర్షించదు. 'నగరంలో వాన' పడుతున్నపుడు సూర్యోదయం ఎలా ఉంటుంది ?

నగరపు నాగరికతా పాసనకు అలవాటుపడ్డ సూర్యుడు ప్రొద్దున్నే రేడియోలో వచ్చే తెలుగువార్తలు విని ఆ చివఱ చెప్పే వాతావరణపు వివరణలు కూడ విన్నతర్వాతే నిద్రలేస్తాడు.

పస్తులున్న మనుష్యుల్ని చూసి భూమ్మీది మనుష్యులెవరూ కంటతడి పెట్టుకోవటల్లేదు కాని హృదయం ఉన్న ఆకాశం మాత్రం కంటి తడిపెట్టుకొంటున్నది. సున్నితమైన విమర్శ. హెచ్చిన ఉత్సాహంతో కురుస్తున్న వాన సూర్యునికి అడ్డంగా దడికట్టి నట్లుండి ఉదయం నుండి ఊపిరి సలపడం లేదు అన్నవర్ణన అనుభవానికి మచ్చుతునక. మేఘాల మధ్య కూరుకుపోయిన సూర్యుడు రిక్షాలోకూచున్న ఘోషా సుందరిలా ఎన్నిసార్లు ముసుగు తొలగించుకుని చూడాలని ప్రయత్నించాడో నగరంలో స్థిరంగా కురుస్తున్న ఉదయకాలపు వర్షపు భీభత్సానికి చక్కని అక్షర చిత్రం ఇది.

'నగరంలో వాన' సూర్యుని ప్రాణాల తీసే ప్రతాపాన్ని తగ్గించింది. వేవేల కిరణాలతో కత్తుల్లా భయపెట్టే సూర్యుని నేర్పు- 'నగరంలో వాన' ఓర్పుతో తగ్గింది. అన్ని వనరులు ఉన్న మానవుణ్ణి ఇక్కడి సూర్యునితో పోల్చాడు. ఎన్ని వనరులు ఉన్నా పరిస్థితులు కలసిరాకపోతే బ్రతుకులో ఏదీ సాధించలేము అన్న సత్యం అధికారికంగా వివరించబడింది.

దట్టంగా కురుస్తున్న 'నగరంలో వాన'తో సూర్యుని కదలికే అనుమానాస్పదమైంది. వేటాడటానికి మంచులేదు. ఆకాశాన్ని మండిద్దామన్నా మబ్బులు పగలని కంచుకోటల్లా చుట్టుముట్టాయి. చిన్న శ్లేషతో 'పగలు' - అనే పేరు గల దినం 'పగల'ను అనే కంచుకోటల్లాంటి మేఘాల మధ్య భర్త కాదన్న భార్యలాగ ముఖాన ఓ బొట్టైనా లేకుండ కళాహీనంగా కూర్చుందన్న ఉత్ప్రేక్ష మనసుకు హత్తుకు పోతుంది. 'నగరంలోని వాన'తో ఉక్కిరి బిక్కిరైన సూర్యుణ్ణి ఉద్యోగం వూడిన కొత్తల్లో సిఫార్సులకోసం ఎవరిని

బడితే వాళ్ళను యాచిస్తూ ఏదో ఒక దేవుణ్ణి ప్రార్థించే వ్యక్తితో పోల్చడం కుందుర్తి సామాజిక నిశిత పరిశీలనకు ఉదాహరణ. రోజంతా 'నగరంలో వాన' కురుస్తూ ఉంటే - ఏ మిట్ట మధ్యాహ్నానికో నేనున్నానని కన్పించే సూర్యుణ్ణి పిల్లకాయలు చప్పరించిన పిప్పరమెంటు బిళ్ళలా ఊహించడం కుందుర్తికే చెల్లింది. సూర్యుడు కన్పించినదాకే అన్నం ముట్టం అనే వ్రతం పట్టిన ముసలమ్మలకోసం ఓసారి కన్పిస్తాడు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం 'నగరంలో వాన' కురుస్తూనే ఉంది. సాయంత్రం మూడు గంటలకే చీకటి పడినట్లుగా ఉండే మబ్బు దుప్పట్లున్న పడమటి కొండ వైపున్న పడగ్గదికి చేరుకొని ముసుగు దన్నాడట.

నాలుగు కాండలు (రామాయణ భాగాలతో పోల్చి)గ ఉన్న నగరాల నాగరికతా కావ్యాన్ని జీర్ణించుకొన్న సూర్యుడు ఇప్పుడు 'సోమరి'గా మారితే 'నగరంలో వాన' కారణంగా మూడుపూటలా విజృంభించిన చలిపులిగా మారి ఎముకలు కొరికేస్తుందనటం అందరికి సాధ్యం కాదేమో.

ముత్యాల వంటి చినుకులు పడే దారి కనుక్కొని అదే దారిలో నిచ్చెనవేసికొని, ఊహాలనే మెట్లుగా చేసి, మేఘాలు క్రమ్మిన ఆకాశంలోకి వెళ్ళి క్రిందున్న భూగోళాన్ని చూచిన కుందుర్తికి కనిపించిన నగరం గడ గడ వణకుతూ, నడిసంద్రంలో తేలుతున్న ద్వీపంలా ఉంది. పగిలిన మంచుకొండ ముక్కలు జలబిందువులుగా మారి ముసురుగా కమ్ముకుంటే గూట్లోకి చేరిన గువ్వలా నగరం నక్కి కూర్చుంది. హైదరాబాద్ నగర కాంతకు ఆకాశపు పెండ్లి కొడుకు కట్టిన తాళి బొట్టులా 'హుస్సేన్‌సాగర్'ను వర్ణించడం అమోఘమైన ఊహా శాలీనతకు చిహ్నం. 'నగరంలో వాన'లో కార్లు బాలవీరులు విసిరిన కత్తిపడవల్లా ఉన్నాయి. విమానపు ముందు భాగంలో మెరిసే ఎర్రని విద్యుద్దీపం 'ఎర్రరాయి చెక్కిన ముక్కు పుడక'లా ఉంది. విమానం పావురంలా పరుగెత్తుతుంది. ఆకాశరాజు 'వాన'తో చేసిన దాడికి నగరం నలిగిపోయింది. రంగు రంగుల రబ్బరు దుస్తుల్లో (రెయిన్ కోట్స్) ఎక్కడో ఒక్కరు తప్ప నగరంలో దాదాపు కదలికే లేదు అంతా నిశ్శబ్దం. వర్షం పడుతుంటే రైళ్ల రాకపోకలు ఆగిపోయాయి. ఆఫీసులో ఫైళ్లకు కదలిక లేదు. వారాంతపు సెలవుల చట్టం ఉల్లంఘించిన కిరాణావర్తకుని ప్రస్తావనలో వ్యంగ్య విమర్శ ఉంది. ఎందుకూ పనికిరాని ట్రాఫిక్ పోలీసు సిమెంటు గొడుగు ప్రస్తావన కుందుర్తి సునిశిత పరిశీలనకు నిదర్శనము. సమయానుకూలంగా 'పావలా' దూరాన్ని 'రూపాయి పావలా'గ మార్చమని వర్ష దేవతను రిక్షావాండ్లు వేడుకొంటున్నారు. పాలబిందె మీద కట్టిన గుడ్డమూత పూర్తిగా తీసేసి అన్నప్పుడు ఆ పాలవాని ఉద్దేశ్యం స్ఫురిస్తే 'అమ్మో అమ్మో' అని గుండెలు బాదుకోవటమే. నగరంలో వర్షం కారణంగా మూలబడిన బెడ్ లైట్లు మరమ్మత్తులకు నోచుకొంటున్నాయి - గృహిణుల ప్రయత్నాలలో మడిబట్టలారవని ఓ ముసలమ్మ దిగులుపడితే, అంత వానలోనే చేటాకు చేమంతిపూలకై వర్షంలోనే తంటాలు పడ్డాడు క్రొత్తగా పెండ్లైన ఓ యింటివాడు. మర్నాడు కాలేజీకి సెలవు ఇవ్వకపోతే సమ్మె చేయాలని ఒక విద్యార్థి శపథం చేస్తే, వానా వానా వల్లప్ప అంటూ పసివాళ్ళు పరుగులు తీస్తున్నారు. ఇలా అరగంటలో అనంత కోటి దృశ్యాలను చూడగలగడం కుందుర్తి ఆలోచనా వైవిధ్యానికి ఈ 'నగరంలో వాన' గీటురాయి.

అప్పటివరకు ఊహల మెట్ల మీద మేఘాల గుండెల్లో ఉన్న ఊహ నేలమీదకు మళ్ళింది. ఏ జల బిందువులు ఏవిధంగా నేల రాలాయో వివరంగా చెప్పడం ఈ అధ్యాయపు లక్ష్యం.

జవరాలి జడలో వలచిన గులాబీ రేకుల మీద ప్రాకి నేలరాలిన 'ముసలి జలబిందువు' కోటి జన్మల కోరిక నెరవేరిందట. మురికి కూపం కూరుకుపోయిన జలబిందువు, విద్యుద్దీపం మీదికి ఎక్కి నక్కిన జలబిందువు, చీకట్లో చెట్లక్రింద పడి దారి తెన్నూ తేలిక చిందులు తొక్కిన జలబిందువు, త్రాగిన వాడి పెదవి మీద పడ్డ పడ్డ చినుకు మత్తెక్కి తైతక్కలాడింది. మందు సీసాలో పడ్డ చినుకు చేదెక్కింది. పల్లెటూరి పంట చెరువులో పడక నగరానికొచ్చినందుకు పశ్చాత్తాప పడింది. సరస్వతి స్తన్యమంత మధురమైన మరో బిందువు విశ్వవిద్యాలయావరణంలో పడి పునీతమైంది. చార్మినార్ గోపురపు ఔన్నత్యం మీద పడిన నీటి బిందువు ధీమాగా, సింహాసనం మీద కూర్చునట్లు కాలిమీద కాలు వేసుకొని మీసం మెలేసుకొంటూ సగర్వంగా నాలుగు మూలలు చూసిందట. 'చీటికి మాటికి' 'కోర్టు' (శ్లేష) కెక్కడం చీదరేసి చింది ప్రక్కనే ఉన్న మూసీలో ముక్కు మూసుకుందట. 'శాసనసభా శిఖరం' మీదపడిన జలబిందువు శాసించడం చేర్చుకొని ఆకాశాన్ని 'చాలిక వర్షం' అని శాసించిందట.

ఇదీ 'నగరంలో వాన' - కుందుర్తికి తెలిసిన 'హైదరాబాదు నగరంలో వాన' శ్లేష - పగలు (84) కోర్టు కెక్కటం

## కవితలోని విశేషాలు :

1. **సమకాలీనతకు**

- నగరంలో సినిమా చూడడం
- రేడియోలో తెలుగులో వార్తలు చివర వాతావరణం
- రిక్షాలో కూర్చున్న ఘోషా సుందరి
- తగరపు తాళిబొట్టు
- వారాంతపు సెలవుల చట్టం ఉల్లంఘించిన కిరాణా వర్తకుడు
- పావలా దూరాన్ని 'సవారూపాయి'కి పెంచాలనే రిక్షా వాండ్లు
- సమ్మె చేయాలని శపథం పట్టాడు చదువుకొంటున్న కుర్రాడు
- చీటికి మాటికి 'కోర్టు' కెక్కడం
- శాసన సభా శిఖరం
- సిమెంటు రోడ్డు
- రెండంతస్థుల బస్సులు
- నడిబజారులో పడిపోయిన మూర్ఛవాడు

2. **లోకజ్ఞత**

(1) J =‹ ¬Ò ..è„ Є_Èy` Í<u>అప్పులు</u> సులభంగా లభించినట్లు.

(2) జల్లు రాత్రి వచ్చిన చుట్టంలా తిష్టవేస్తుంది తీరిగ్గా

(3) చాలీ చాలని జీతపు రూకల

(4) గోనె సంచి కప్పుకోవటం.

(5) బ్రతుకులో సాధించదలచిన దానికి పరిస్థితులు కలిసిరాని మానవ మాత్రుడిలా (అన్నీ ఉన్న సూర్యుడు)

(6) పిల్లకాయలు తియ్యగా తినే పిప్పరమెంటు బిళ్ళలా (సూర్యుడు ఉన్నాడనిపించే)

(7) "వానలో సైకిలుకు కట్టిన పాలబిందె మీద గుడ్డమూత పూర్తిగా తీసేసిన పాలవాడు ..."

(8) 'జెండా వందన సమయం' మొదలగునవి

3. **అలంకారాలు - ఉపమానాలు :**

(1) పరుగెత్తే రెండంతస్తుల బస్సుల్ని చూసి గిరి శిఖర భ్రాంతితో క్రిందికి దిగిన మేఘాలు.(భ్రాంతి మదాలంకారము)

(2) <u>మూర్ఛవాడు</u> బిందెలతో దాహం త్రాగినట్లు పగుళ్లుబారి నోరు తెరుచుక్కూచున్న <u>భూదేవికి.</u> (ఉపమానం)

(3) అవసరం లేనప్పుడడిగితే <u>అప్పులు</u> సులువుగా లభించినట్లు అక్కరలేని నగరంలో కూడ వాన పుష్కలంగా కురుస్తుంది. (ఉపమానం)

(4) రాత్రికి వచ్చిన <u>చుట్టంలా</u> తిష్ట వేస్తుంది తేలిగ్గా

(5) బ్రతుకులో సాధించదలచిన దానికి పరిస్థితులు కలిసిరాని మానవ మాత్రుడిలా

(6) పగలనే పేరు సార్ధకమై పతి ఒల్లని భార్యలాగా

(7) పడమటి కొండ పడగ్గది. (రూపకాలంకారము)

(8) ఆకాశపు పెండ్లికొడుకు (రూపకాలంకారము)

(9) గూట్లోకి చేరిన గువ్వలా (ఉపమాలంకారము)

(10) నగరకాంతకు మెళ్లోకట్టిన తగరపు తాళిబొట్టులా (ఉపమాలంకారము)

(11) కార్లు బాలవీరులు విసిరిన కత్తిపడవల్లా. (ఉపమాలంకారము)

(12) ఎర్రరాయి చెక్కిన ముక్కుపుడకలాంటి (ఉపమాలంకారము)

(13) పావురంలా పరుగెత్తుతోంది. (ఉపమాలంకారము)

(14) పల్లెసీమలో పరుగెత్తుతోంది. (ఉపమాలంకారము)

(15) పగలను, కోర్టుకెక్కడం (శ్లేషాలంకారాలు)

4. **హాస్యం**

(1) సాయంత్రపు షికారుకై మూడుగంటలు ముస్తాబై దవనం బేరమాడుతూ నుంచున్న జవరాలు.

(2) సైకిలుకు కట్టిన బిందె మీద (పాల) గుడ్డమూత పూర్తిగా తీసేసిన పాలవాడు.

(3) ముసలి జల బిందువు.

5. **సంప్రదాయ ప్రణవత :**

(1) పక్షాలు పోయినా పాదాలు వచ్చి పర్వతాలు పోరాడుచున్నట్లు. (ఇంద్రుడు, వజ్రాయుధము)

(2) ఆయన 'రథం' ఆగిందో నడుస్తోందో (సూర్యరథం)

(3) ఏదో ఒక దేవుణ్ణి ఆశ్రయించడం.

(4) అన్నం ముట్టని వ్రతం.

(5) నాలుగు 'కాండలు' (రామాయణం)

(6) తెల్లవారితే మడిబట్ట లారవని

(7) 'కోటి జన్మాల కోరిక'

(8) 'చదువుల తల్లి స్తన్యం' (సరస్వతి)

## 11.4. కఠిన పదాలు : అర్థ తాత్పర్యాలు :

| | | |
|---|---|---|
| 'నగరంలో వాన' | = | 'భాగ్య' నగరంలో వాన |
| ఊహాంచలాలు | = | ఊహల చివరలలో |
| ఊహ + అంచలములు | = | |
| ఆశు కవిత | = | అప్పటికప్పుడు ఛందోబద్ధంగా అలవోకగా నోటితో చెప్పే కవిత |
| అనంత ధారా సమేతం | = | అంతం లేకుండ పడే ధారలతో కూడినది |
| అంబరం | = | ఆకాశము |
| సంబరం | = | సంభ్రమము (సంతోషము) |
| పక్షాలు | = | రెక్కలు |
| పాదాలు | = | కాళ్ళ అడుగులు (బస్సులకున్న చక్రాలు) పురాణాల ప్రకారం పూర్వ పర్వతాలకు రెక్కలుండేవి. అవి ఆరెక్కల కారణంగా మునిజన స్థానాల్ని ఆక్రమించి ఆశ్రమవాసులకి బాధ కలిగిస్తూ ఉంటే మునుల యొక్క కోరికమేర ఇంద్రుడు ఆ పర్వతాల రెక్కలను వజ్రాయుధంతో |

| | | |
|---|---|---|
| | | నరికివేశాడు. 'దధీచి' అనే ముని ఆత్మాహుతి చేసికోగా మిగిలిన వెన్నెముకతో తయారుచేసిన ఆయుధమే వజ్రాయుధము. |
| గిరిశిఖర భ్రాంతి | = | పర్వతాల శృంగములనెడి అపోహతో. |
| బహుకాల నగరదర్శన భాగ్యప్రాప్తి | = | ఎంతో కాలానికి నగరాన్ని సందర్శించే అదృష్టము కలిగిందనే తృప్తి. 'బహుకాల నగర దర్శన భాగ్యప్రాప్తి'ని 'బహుకాల భాగ్యనగర దర్శన ప్రాప్తి'గా మార్చుకొంటే - భాగ్యనగరమైన హైదరాబాదు గుర్తుకొస్తుంది. |
| పది దిదుక్కులు | = | 'దుక్కి'లు + లు > దుక్కులు<br>- నాగలి నీరు - దుక్కి<br>- పది నాగేటిచాళ్ళలో పడినంత నీరు. |
| వానమేనా | = | వర్షములనెడి పల్లకీలు (రూపకము) |
| వర్షాకాంత | = | వర్షమనెడికాంత (రూపకము) |
| పుష్కలంగా | = | సమృద్ధిగా |
| స్వాగతం | = | ఆహ్వానం (సు+ఆగతం) |
| ఉన్నవాడు | = | ధనవంతుడు |
| నిర్మేఘము | = | మేఘములులేని |
| కుంభవర్షం | = | కుండతో పోసినట్లు పడేవాన |
| ముమ్మరం | = | ఎక్కువగా |
| ఘోషా సుందరి | = | నిలువెల్ల కప్పుకొన్న పై వస్త్రం (ముస్లిం స్త్రీలు) |
| మెయిలు | = | మేఘము |
| శతసహస్ర కిరణాల బాకులు | = | లక్ష కిరణాలనెడి కత్తులు |
| చాకచక్యం | = | నేర్పు |
| వేయి వెలుగుల దొర | = | సూర్యుడు |
| ఉర్వి | = | భూమి |
| పగలు+అనే | = | దినము అనే |
| పగలను | = | విడిపోను |
| సార్థకమైన | = | అర్థవంతమైన |
| దివసం | = | పగలు |
| ఉద్యోగం | = | ఉన్నతమైన యోగము |
| సిఫార్సు | = | తెలిసినవారితో అనుకూలంగా చెప్పించడం |
| నాలుగు కాండలు | = | నాలుగు భాగాలు (కాండలు రామాయణ భాగాలు) |
| ముప్పొట | = | మూడు పూటలు |
| పరస్పరం | = | ఒకదానికొకటి |
| సమాంతరంగా | = | సమాన దూరం కలిగి ఎదురెదురుగా ఉన్న |
| వర్షాదిలో | = | వర్షాకాలం ప్రారంభంలో |

| | | |
|---|---|---|
| మేఘావృత గగనం | = | మేఘములచే ఆవరింపబడిన ఆకాశం |
| మేదిని వైపు | = | భూమి వైపు |
| ఉడు వీధి | = | ఆకాశ వీధి |
| శతకోటి శకలాలు | = | నూరుకోట్ల ముక్కలు |
| శతాబ్దాలు | = | శత+అబ్దములు = నూఱు సంవత్సరాలు |
| టపా | = | తపాల సరంజామా |
| ఉల్లంఘించిన | = | దాటిన |
| సవారూపాలు | = | రూపాయి పావలా |
| వర్షాధి దేవత (వర్ష+అధి దేవత) | = | వర్షముపై అధికారముగల దేవుడైన వరణుడు |
| ఫల్లాంగు | = | మైలు దూరంలో ఎనిమిదో వంతు |
| చటాకు | = | కొలమానంలో భాగం |
| గృహస్థు | = | ఇంటివాడు |
| అనంతకోటి దృశ్యాలు | = | లెక్కలేనన్ని దృశ్యాలు (కంటికి కన్పించేవి) |
| ముస్తాబై | = | అలంకరించుకొని |
| దవనం | = | పూల మధ్యలో చేర్చి కట్టే పరిమళం కలిగిన మొక్కలు |
| అధరోష్ఠం | = | పెదవి మీద |
| స్తన్యం | = | పాలు |
| కోర్టుకెక్కటం (శ్లేష) | = | (ఎ) పోట్లాట తీర్చుకోటానికి న్యాయమర్థించి పదే పదే న్యాయస్థానాలు తిరగటం. (బి) నీటి బిందువు 'కోర్టు' భవనం పైకెక్కడం. |

## 11.5. సందర్భ సహిత వ్యాఖ్యలు :

**1. గిరిశిఖర భ్రాంతితో క్రిందికి దిగి వచ్చిన మేఘాలు.**

**పరిచయం** : ఈ వాక్యం కుందుర్తి ఆంజనేయులుగారిచే రచింపబడిన నగరంలో వాన అనే పాఠ్యభాగం నుండి స్వీకరించబడింది.

**సందర్భం** : 'నగరంలో వాన' అను వచన కవితా ఖండికలోనిది. రెండతస్తుల బస్సులు (డబల్ డెక్కర్స్) నగరంలో ఉంటే హైదరాబాద్‌లో అటూ ఇటూ తిరుగుతూ ఉంటే అవి పర్వతాలేమో అని వర్షించ డానికి వచ్చిన మేఘాలు మరింత దగ్గరగా దిగివచ్చాయి.

**భావం** : రెండంతస్తుల బస్సులను చూచి కొండ కొమ్ములనుకొని మేఘాలు క్రిందికి దిగి వచ్చాయని భావం.

ఇక్కడ అద్భుతమైన భావ చిత్రం కలదు. మేఘాలు భ్రాంతి పడ్డాయి అనడంతో - అక్కడ 'భ్రాంతి మదలంకారము' స్పష్టమౌతుంది.

**వివరణ** : 'రెక్కలు తెగిపోయినా' అన్నమాటతో పూర్వము ఇంద్రుడు తన వజ్రాయుధంతో పర్వతాల రెక్కలు తెగకొట్టిన పౌరాణిక గాథ గుర్తుకు వస్తుంది. 'రెక్కలు' పర్వతాలు ఎక్కడికి పోవాలంటే అక్కడికి పోవటానికి ప్రాచీనకాలంలో ఉపయోగపడేవి. పర్వతాల వంటి ఆకారాలు కలిగిన రెండతస్తుల బస్సులు అనడం అతిశయోక్తి అలంకారం ఔతుంది. 'రెక్కలకు' బదులు 'పాదాలతో పారాడు

తున్న'వి అనడంలో బస్సుల అడుగున ఉన్న చక్రాలు ఆ రెక్కల పని చేస్తున్నాయి అని సూచించడం జరిగింది.

**విశేషం** : ఆధునికతను (బస్సులను) ప్రాచీనతతో (పురాణ కథ) ముడిబెట్టడం - కుందుర్తికే సాధ్యం

పై వాక్యంలో అంతర్లీనంగా స్ఫురించే హాస్యం ఆయన హాస్యప్రియత్వానికి ఓమచ్చుతునక.

గిరిశిఖరం = కొండపైనున్న కొనదేలిన భాగము (కొండ కొమ్ము)

భ్రాంతి = ఒక దానిని జూచి (రెండస్తుల బస్సులు) మరొకటి అనుకోవటం (గిరి శిఖరాలు)

మేఘాలు = ఇంద్రుని, ఆయుధం ఐన 'వజ్రాయుధానికి' మాతృకలు పర్వతాలపై దాడికి సిద్ధపడ్డాయి మేఘాలు

**2. "అవసరం లేనప్పుడేడిగితే అప్పులు సులువుగా లభించినట్లు"**

**పరిచయం** : ఈ వాక్యం కుందుర్తి ఆంజనేయులుగారిచే రచింపబడిన నగరంలో వాన అనే పాఠ్యభాగం నుండి స్వీకరించబడింది.

**సందర్భం** : నిజంగా వర్షం కావలసిన చోట కురవక, వర్షం వద్దు బాబోయ్ అన్నచోట కురిస్తే ఎవరూ హర్షించరు.

**భావం** : అవసరం లేనప్పుడే అప్పులు చాలా తేలికగా లభిస్తాయని భావం.

**వివరణ** : పగుళ్ళువారిన నేల వానకావాలని అఱ్ఱులు చాస్తుంది. కాని అక్కడ వాన కురవదు. నగరంలో పడిన వాన - బజారులో మూర్ఛ వచ్చిపడిపోయిన బిచ్చగాడు బిందెలతో నీరు త్రాగినట్లు - నీరు ప్రక్కన పడి వ్యర్థమైనట్లు అనవసరంగా వాన కురుస్తుందని వ్యంగ్యము, వ్యథ.

పల్లెల్లో పదిచుక్కలైన ఫలితాన్నిస్తాయి. నగరంలో అంతా వ్యర్థమే.

**విశేషం** : కవిత్వంలో సమకాలీన జీవన చిత్రాన్ని అద్భుతమైన అందటికి అనుభవంలో ఉన్న విషయాన్ని ఉపమానంగా చెప్పటం కుందుర్తి ప్రత్యేకత.

అవసరం అని అప్పుకెళ్తే ఎక్కడా ఒక్కచిల్లి గవ్వగూడ పుట్టదు. కాని ఏ అవసరం లేకపోయినా అప్పులు సులభంగా దొరుకుతాయని వ్యంగ్యధోరణిలో జీవన చిత్రాన్ని చిత్రించారు.

**3. ఆకాశం ఆ క్షణాన చిల్లిపడుతుంది.**

**పరిచయం** : ఈ వాక్యం కుందుర్తి ఆంజనేయులుగారిచే రచింపబడిన నగరంలో వాన అనే పాఠ్యభాగం నుండి స్వీకరించబడింది.

**సందర్భం** : అప్పటి వరకు ఆఫీసుల్లో పనిచేసి ఇంటి ముఖం పట్టిన ఉద్యోగులపై హఠాత్తుగా అనుకోని విధంగా అప్పటి వరకు చిన్న ముక్కైన కన్పించని మేఘాలు కుండపోతగా వర్షాన్ని కురిపించే సందర్భంలోనిది.

**భావం** : ఆ క్షణంలోనే ఆకాశానికి చిల్లిపడిపోయింది అంటే పెద్దవాన కురుస్తుంది అని భావం.

**వివరణ** : 'ఆకాశం చిల్లి పడింది' ఆకాశానికి చిల్లి పడటం మనం చూడం. కాని ఒక వేళ చిల్లిపడితే పైన అంతా నీరు ఉంటే ఆ నీరంతా ఒక్కసారి ధారాపాతంగా పడితే 'కుంభ వృష్టి' (కుండపోత) తప్పదు. ఇది అచ్చమైన తెనుగు నుడికారం. తెనుగుదనం పులుముకొన్న ప్రయోగం.

**విశేషం** : కుందుర్తి ఆంజనేయులుగారు గతితార్కిక సిద్ధాంతానికి సన్నిహితంగా నడిచిన మహాకవి అందుకే సూటు (రైన్‌కోటు) వేసికొన్న ధనవంతులను, మరుసటి రోజుకు బట్టలు లేని పేద వారిని పక్క పక్కనబెట్టి పేదవారి పక్షం వహించి ఈ కుండపోత వర్షం కూడ పక్షపాతంతో వ్యవహరిస్తుందని ప్రకృతికి చురకలు వేశాడు.

**4. చలి ఎముకలు కొరికేస్తుంది.**

**పరిచయం** : ఈ వాక్యం కుందుర్తి ఆంజనేయులుగారిచే రచింపబడిన నగరంలో వాన అనే పాఠ్యభాగం నుండి స్వీకరించబడింది.

**సందర్భం** : చలి తీవ్రతను వర్ణించే సందర్భంలోనిది 'ఎముకలు కొరికేయడం' అనేది చక్కని తెనుగు నుడికారం. నగరంలో వాన ఆగకుండా అదే పనిగా పడుతుంటే, వెచ్చదనాన్నిచ్చే సూర్యుడు కనుమరుగైన వేళ - చలి విజృంభించి - ప్రజలను ఎలా బాధిస్తుందో వర్ణించిన సందర్భంలోనిది.

**భావం** : చలి ఎముకలను కొరికే విధంగా ఉంది అంటే చలి గడగడా వణికిస్తుందని భావం.

**వివరణ** : మిట్ట మధ్యాహ్నం సమయంలో ఉజ్జ్వలంగా ప్రకాశించి ఉష్ణాన్ని ఇవ్వవలసిన సూర్యుడే - వాన తీవ్రతకు వాన తెరల మాటున దాక్కున్నాడు.

సూర్యుణ్ణి 'పిప్పరమెంటు బిళ్ళ'తో పోల్చడం సమకాలీన జీవనానికి ప్రతిబింబం. పగటిపూట మధ్యలోనే తోకముడిచి పడమటి కొండల్లో ముసుగుతున్నాడని, సూర్యుడు సోమరిగా మారాడని, ఉదయించడానికి జంకేడని అప్రాణి వాచకాలకు ప్రాణవంతంగా చెప్పడం కవిత్వానికి కండ బట్టింది.

చలి తీవ్రమైంది కనుకే ఎముకలు కొరికేస్తుందని అందుకు కారణాలు వివరించారు కుందుర్తివారు.

**5. ఆకాశరాజు చేసిన దాడికి నగరం నలిగిపోయింది.**

**పరిచయం** : ఈ వాక్యం కుందుర్తి ఆంజనేయులుగారిచే రచింపబడిన నగరంలో వాన అనే పాఠ్యభాగం నుండి స్వీకరించబడింది.

**సందర్భం** : కుండపోతగా పడిన వానతో నగరపు జనజీవనం స్తంభించిపోయింది. కవి తన భావుకతకు రెక్కలు కట్టుకొని దాని భయానక దృశ్యాన్ని విహంగవీక్షణంలో జూచే సందర్భంలోనిది.

**భావం** : ఆకాశరాజు అంటే ఇక్కడ వర్షం. వర్షం చేసిన దాడికి నగరం నలిగిపోయిందని భావం.

**వివరణ** : 'ఆకాశరాజు' - ఎవరో కాదు విజృంభించిన కుంభ వృష్టి.

దాడి - శత్రువు మీదకు విరుచుకుపడే పద్ధతి.

'నలిగిపోయిన నగరం' జలంతో నిండిపోయింది. మధ్యలో మునిగిన కార్లు పిల్లలు కాగితంతో తయారుచేసిన పడవల్లా ఉన్నాయి. బాలలు 'వీరులు' కావటం మూలాన పడవలు కత్తిపడవలైనాయి. ఉవ్వెత్తున ఎగిరే విమానాలు టపా మోసుకొస్తున్న పావురంలా మారిపోయాయి. సమకాలీన నగర జీవితానికి అద్దం పట్టిన కవిత 'నగరంలో వాన' రబ్బరు బొమ్మల్లా కన్పించే వారంతా వాన మధ్యలో రంగు రంగుల్లో కన్పించే అల్ప ప్రాణులైన మానవులు.

ఈవిధంగా నగరంలోని వాన బీభత్సాన్ని చిన్న చిన్న తెలుగు నుడికారపు సొంపుల్లో కురుస్తున్నట్లు వర్ణించారు.

## 11.6. ప్రశ్నలు - సమాధానములు :

**1. 'నగరంలో వాన'లో కుందుర్తి ఆంజనేయులుగారి రచనా నైపుణ్యాన్ని పరిశీలించండి. (లేదా) 'వచన కవితా పితామహుని'గా కుందుర్తి ఆంజనేయులుగారి కవితాముద్రను వివరించండి.**

జ॥ వచన కవిత్వానికి పట్టం కట్టిన రచన 'నగరంలో వాన' పడుతుంది వర్షం - ఐనా దానిలోని 'సామాజిక దర్శనం', 'సామాజిక స్పృహ' అనంతమైనది. దానికి సున్నితమైన హాస్యాన్ని జోడించారు. కసుకందకుండా మందలించారు. విమర్శ అంటూ పేర్కొనకుండ

విమర్శించారు. సమకాలీనమైన ఉపమలు, ఉత్ప్రేక్షలు దొర్లించారు. 1967లో వ్రాసిన ఈ 'కవితా ఖండిక' అఖండ విజయాన్ని అందుకొన్నది.

జల్లులు జల్లులుగ కురుస్తున్న వానను ఊహల చివరలలో కదలాడే కవిత్వంతో పోల్చడం, కొత్తదనం నగర ప్రజలపై ఎడతెగకుండపడుతున్న వానను ఆశు కవితతో పోల్చడం ప్రజలకు ఆశీస్సులైనాయని పల్కటం ఎవ్వరూ ఊహించనివి. ఆకాశం మెరిస్తే - ఆ మెరుపు సిమెంటు రోడ్డుపై ప్రతిఫలిస్తే - మేఘాలు తలలు వంచి తమ అందాన్ని చూసుకొన్నాయని మురిసిపోతాయని వర్ణించడం, సంతోషంతో చినుకులను కుప్పలు తిప్పలుగ మెలికలు తిరుగుతూ త్రుళ్ళుతున్నాయి అని చెప్పడం ఆయనకే చెల్లింది.

రెండతస్థుల బస్సుల్ని పరుగెత్తుతున్న పర్వతాల్లా ఊహించటం, ఆ బస్సుల్ని పర్వత శిఖరాలని మేఘాలు భ్రాంతి పడటం, నగర దర్శనానికి వచ్చిన మేఘాలు రాత్రంతా 'సినిమా' చూసి వెళ్ళవచ్చు అని అనుకొన్నాయని చమత్కరించడం కుందుర్తివారికే చెల్లుతుంది. 'సిమెంటు రోడ్లు', 'రెండతస్తుల బస్సులు', 'సినిమా' ఇవన్నీ సమకాలీన సమాజానికి దర్పణాలే.

పగుళ్ళు వారిన భూమి, అకస్మాత్తుగా పడిపోయిన మూర్ఛవాడు బిందెలతో నీళ్ళు త్రాగడం - ఆయన ప్రకృతి పరిశీలనము నకు ఉదాహరణ. పల్లెల్లో వర్షమంటే సస్య సమృద్ధికి చిహ్నం. అవసరంలేని వర్షాన్ని అవసరం లేనప్పుడు పుట్టిన అప్పులా వర్ణించడం ఆయన అనుభవానికి తార్కాణం.

'ప్రొద్దున్నే వచ్చిన వాన, రాత్రి వచ్చిన చుట్టం' పోరని సామెత. ప్రజల వీపులు చిల్లులు పడేలా పడుతున్న వానను 'రాత్రి వచ్చిన చుట్టంలా' వర్ణించడం ఆయన లోకజ్ఞతకు ఉదాహరణ.

తక్కువ జీతంతో జీవితాన్ని నెట్టుకొస్తున్న బడుగు ఉద్యోగి 'గోనె సంచి' నెత్తిమీద పెట్టుకొంటే నామోషీ అని గొడుగు కొనలేని అతడు తడుస్తూ వెళ్ళడం - మనిషి మనస్తత్వాన్ని కుందుర్తి ఎంతగా చదివాడో అనిపిస్తుంది. వణుకుతున్నాడు ఇంట్లో కుంపటి ముందు కూచున్నాడు. ఎంతచేసినా జర్వంతో మంచంపట్టాడు. తాను చేసిన ఘనకార్యం కళ్ళారా చూడాలనిపించి చిలిపిగా కిటికిలోంచి తొంగి చూస్తుందట. సీరియస్‌గ వర్ణిస్తున్నవాన మధ్యలో మెరుపులాగ కన్పించే సున్నితమైన హాస్యం లోలోనే ఆనందింప జేస్తుంది.

ధనికులైన ఉద్యోగి జోలికి వెళ్ళని వాన మార్చుకోవటానికి మరో చొక్కా కూడ లేని నిరుపేదపై ఆకాశం చిల్లిపడ్డట్టు కురవటం అసలు ప్రకృతికే పేదలపై కరుణలేదని చిన్న చురకవేశాడు.

బురదలో జారిపడ్డ బడిపిల్లవారిపై వేగంగా పోయే కారు నీటిని ఎగజిమ్మినా - పిల్లవాడినే తల్లి కసురుకొంటుంది. తల్లీ కొడుకులకు గల్లిగజ్జాలు పెట్టి ఏమీ తెలియనట్లు ముంగిలాగ వానవెలసి పోయిందని చెప్పటం ఎంతో గడుసైన విషయం.

వస్తుందను కొన్న సమయంలో వాన రాకపోవటం, రాదను సమయంలో ఉరుములు మెరుపులతో భయంకరంగా రావటం వాన గడుసరితనాన్ని కుందుర్తి ఎంతో గడుసుగా వర్ణించారు.

మూడురోజుల పసిపాప ముద్దుగా హత్తుకొంటు ఆస్పత్రి నుండి ఇంటికెళ్ళే బాలెంతరాలిని కరుణించింది వాన. అందుకే అక్కడ పూలజల్లైంది. 'చిరు తిండి' కోసం బారులు తీరిన బాలబాలికలపై అందునా ఆగస్టు 15వ తారీకున జాలితో సన్నని తుంపరలా కరిగిపోయింది వాన. వానకు దయ, జాలి ఎప్పుడు ఎక్కడ చూపించాలో తెలుసట.

సూర్యుడు కూడ నగరాల నవనాగరికతలోని రుచి మరిగాడట. అందుకే ప్రొద్దున్నే లేవటానికి బద్దకిస్తున్నాడట. ఎక్కడో వర్షభావం, పస్తులున్న ప్రజలు గుర్తుకు వచ్చిన వాన సానుభూతితో ఇబ్బడి ముబ్బడిగా కంటతడి పెట్టిందట.

'పగలు' అనే, శ్లేష పదంతో భర్త కాదన్న భార్య ఎలా ముఖం మాడ్చుకొని కూచుందో అలా పగలు కూచుందని చాలా సహజంగా గృహ వాతావరణాన్ని వర్ణించాడు.

'నగరంలో వాన' సందర్భంగా సూర్యుని మీద విసరిన ఉత్ప్రేక్షలు హాస్య స్ఫూర్తికి మచ్చు తునకలు సూర్యుడు ఆ వాన ముసుగులో నుండి బయటకు కన్పించటానికి దేవుళ్ళ సిఫారసు కోరడం - నిరుద్యోగి ఉద్యోగానికై సిఫారసు చేయించడం వంటిదని, మధ్యాహ్నం అతికష్టం మీద కనిపించే కనిపించని సూర్యుణ్ణి పిల్లలు తినే పిప్పరమెంటు బిళ్ళ పరిమాణంలో ఊహించటం ఒకింత నవ్వుపుట్టించినా వాస్తవానికి ఎంతో దగ్గరగా ఉంటుంది. సూర్యుని చూస్తేగాని భోజనం చేయమని చాదస్తం వున్న ముసలమ్మ కోసం అలా కనిపించాడని - మూఢ నమ్మకాన్ని ఒక కుమ్ము కుమ్మాడు. 'పడమటి కొండ పడగ్గది', 'సూర్యుడు సోమరిగా తిరగడం' వంటి పదప్రయోగాలు కుందుర్తికే చెల్లుతాయి.

చదివేకొద్దీ తరగని ఉపమానాలు, సమకాలీనమైన చమత్కారాలు, పురాణ ప్రణవమైన కథాకమీషులు, మన మధ్య కళ్ళ ముందు జరిగే సంఘటనల నుండి ఎన్నుకొన్న ఉపమానాలు, ఉత్ప్రేక్షలు కుందుర్తి లోకజ్ఞతకు కవితా ప్రజ్ఞకు పట్టం కడుతుంది.

ఆయన చెప్పేటప్పుడు సాధారణ విషయమైనా అసాధారణంగా అందరినీ ఆకట్టుకొనే నైపుణ్యం 'నగరంలో వాన'లో అడుగడుగునా కొట్ట వచ్చినట్లుంటుంది. తెలుగు కవితలో క్రొత్త ఒరవడితో వెలసిన 'నగరంలో వాన' తెలుగు సాహిత్యం ఉన్నంత వరకు 'క్రొత్త నగ' లాగ ఉంటుంది. క్రొత్త తరానికి ప్రేరణగా మారుతుంది.

**2. కుంభవృష్టి తాకిడికి నగరం నలిగిపోయింది. కుందుర్తి బాటలో నలిగిపోయిన నగరాన్ని వర్ణించండి. (లేదా) 'వర్షం' దెబ్బకు నలిగిపోయిన నగరాన్ని - విహంగ వీక్షణంలో కుందుర్తి చూచినట్లు వర్ణించండి.**

జ॥ కుందుర్తి కవిత్వం వాస్తవానికి సన్నిహితంగా ఉంటుంది. సహజత్వానికి ప్రాణం పోసినట్లుంటుంది. సమకాలీన సామాజిక వ్యవస్థను ప్రతి అక్షరంలో అక్షయం చేసినట్లుంటుంది. అర్థంకాని పదాల ప్రయోగంతో గారడీ చేయడం ఆయన కవిత్వానికి చాలా దూరం. స్పష్టత ఆయన ఆయుధం.

కుండపోతగా పడిన వర్షపు తాకిడికి అతలాకుతలమైన నగరాన్ని తాను మధ్యలో ఉండి చూడలేదు. ఊహల మెట్లెక్కి మేఘాలతో నిండిన ఆకాశాన్ని చేరుకొన్నాడు. అక్కడి నుండి బిక్కు బిక్కు మంటున్న నగరాన్ని చూచాడు. చుట్టూ నీరు మధ్యలో నగరం నడి సముద్రంలో తేలాడుతున్న ద్వీపం గుర్తుకు వచ్చింది. నగరంలోని ప్రజలు భయంతో గజ గజ లాడిపోతున్నారు. ఆకాశంలో ఒక మంచుకొండ, అది బ్రద్దలైంది. బ్రద్దలై ముసురుగా కప్పి నగరాన్ని ముంచెత్తుతుంది. భయంతో దిక్కు తెలియని స్థితిలో నక్కి కూర్చున్న గువ్వలా నగరం ఉందనటం కుందుర్తివారి భావుకతకు నిదర్శనము.

నగరం అంటే హైదరాబాద్ నగరం. దానిలోని హుస్సేన్‌సాగర్‌ను తగరపు తాళిబొట్టులా ఊహించడం ఆకాశాన్ని పెళ్ళి కొడుకును చేయటం, నగరకాంతకు ఆ తాళిని కట్టించడం ఇదంతా అద్భుతమైన ఒక ఊహాసౌధం.

నీరు కట్టలు తెంచుకొని ప్రవహిస్తుంటే నగరంలో కదలలేక కదులుతున్న కార్లు కాగితప్పడవల్లా కన్పిస్తున్నాయి. ఆ బాలలు వీరులు కావటం వల్ల కాగితప్పడవలు 'కత్తి' పడవలైనాయి. ఇంతలో కదులుతున్న విమానం - దానిముందు కాంతిని విరజిమ్మే ఒక విద్యుద్దీపం కంటబడింది. ఎఱ్ఱజాయి చెక్కిన ముక్కు పుడకలా కవికి తోచింది. ఆ విమానంలో తొంగిచూస్తున్న పావురంలా కన్పించింది. సమాజాన్ని చూడగలగడం అందరికి చేతగాదు.

నగరం పై నుండి మేఘాల సౌధం నుండి చూస్తున్న కుందుర్తి ఊహకు అక్కడక్కడ కదులుతున్న మనుషులు కన్పించారు. రంగులద్దిన బొమ్మల్లా కదులుతున్నారు.

జన జీవనయాత్ర కకావికలైంది. వచ్చే రైలు, పోయే రైలుతో కళ కళలాడుతున్న నగరం బోసిబోయింది. ప్రభుత్వ ఉద్యోగులు అప్రకటిత శెలవులు తీసికొన్నారు.

సెలవు రోజుల్లో కూడ చట్టానికి వ్యతిరేకంగా లావాదేవీలు జరిపే కిరాణా వర్తకుని దుర్బుద్ధిని నిశితంగా విమర్శించాడు. వాన ఎక్కువ కావడం వల్లనే వాడి వ్యాపారం ఆగిపోయిందన్నాడు. అతన్ని అదుపు చేయవలసిన అధికారగణంపై పరోక్షమైన విమర్శ కూడ ఉంది.

ఆత్మరక్షణ అందఱికి సాధారణ విషయమని, అందుకే జడివాన దెబ్బకు విరిగిపడిన సిమెంటు గొడుగు లేకపోయే సరికి ట్రాఫిక్ పోలీసు - తనకు మామూలు కూడ ఇవ్వని ప్రక్క అంగట్లో తలదాచుకోవటం - ఆత్మరక్షణ కోసమేనని ఇది అందఱికి సాధారణమేనని వివరించాడు.

రిక్షావాళ్ళు ఇంకా ఎక్కువ వర్షం కురియాలని కోరుకోవటం పావలా రావలసినచోట రూపాయి సంపాదించటానికని అంటూ ఇటువంటి అవకాశవాద తత్వాన్ని ఎక్కడ ఉన్నా నిరసించాలన్నాడు.

'కోర్టు కెక్కటం' అనే పదంతో శ్లేష సాధించారు కుందుర్తివారు. వర్షం కోర్టు భవనాలపై పడడం ప్రస్తుతార్థం ఐతే. కోర్టు భవనం పైకెక్కి చిందిన చినుకు ప్రక్కనే ఉన్న మూసీనదిలోపడి ముక్కు మూసుకుందుట. ముక్కుమూసుకోవటం అంటే ప్రాణం తీసుకోవటమే. అలానే తగాదాల్లో కోర్టుకెక్కిన వారి పరిస్థితి ప్రాణాంతకం ఔతుందని శ్లేషతో చమత్కరించి హెచ్చరించారు.

శాసనసభ అధికారంతో కూడి శాసించే సభ. ఆ శాసనసభ మీదపడిన వాన చినుకు శాసించే శక్తిని పుంజుకొని ఆకాశం వంక చూచి 'ఇంక చాల్లే' అని శాసించడం వంటి ప్రయోగాలు కోకొల్లలు.

కుండపోతగా కురిసిన వర్షంలో నలిగిపోయిన హైదరాబాదు నగరాన్ని విహంగ వీక్షణంతో చూచిన కుందుర్తి - కవితా భావుకత ప్రశంసార్హమైనది.

**ముగింపు :** నగరంలో వానకురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో, ప్రజల రోజువారీ కార్యక్రమాలు ఎలా ఉంటాయో హాస్యరూపంలో తెలుసుకున్నాం.

**ప్రశ్నలు :**

1. 'నగరంలో వాన'తో కుందుర్తి ఆంజనేయులుగారి రచనా నైపుణ్యాన్ని పరిశీలించండి.
2. కుందుర్తి బాటలో నలిగిపోయిన నగరాన్ని వర్ణించండి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. నగరంలో వాన - కుందుర్తి.
2. ఆధునికాంధ్ర కవిత్వము - సాంప్రదాయాలు - ప్రయోగాలు - డా॥ సి. నారాయణరెడ్డి.

**పోలె ముత్యము,** M.A., M.A.,M.Phil.,
ఆంధ్రోపన్యాసకులు,
ఆంధ్ర క్రైస్తవ కళాశాల,
గుంటూరు.

**పాఠం : 12**

## గద్యభాగం
# బాలచంద్రుడు
సప్త స్వరాలు (వ్యాస సంకలనం)

**- సురవరం ప్రతాపరెడ్డి**

**శీర్షికలు :**


12.0 లక్ష్యం

12.1 రచయిత పరిచయం

12.2 పాఠ్యభాగ సందర్భం

12.3 పాఠ్యభాగ సారాంశం

12.4 కఠిన పదాలకు అర్థాలు

12.5 పాఠ్యభాగంలోని పద్యాల భావార్థ వివరణ

12.6 ప్రశ్నలు - సమాధానాలు


## 12.0. లక్ష్యం :

సప్తస్వరాలు అనే వ్యాస సంకలనంలో మొదటి వ్యాసం బాలచంద్రుఁడు. అభినవ అభిమన్యుడైన బాలచంద్రుని ధైర్య సాహసాలను, శౌర్య పరాక్రమాలను విద్యార్థులకు పరిచయం చేసి ఉత్తేజం కలిగించటం ఈ వ్యాస రచయిత ప్రధానోద్దేశం. తెలుగునాట పలనాటిసీమ పౌరుష పరాక్రమాలకు పేరెన్నిక కన్న గడ్డ. పలనాటి వీరభారత కథను, హైందవ వీరుల ఔన్నత్యాన్ని తెలుగు విద్యార్థులకు రచయిత ఈ వ్యాసంలో దృశ్యమానం చేసారు.

## 12.1. రచయిత పరిచయం :

సప్తస్వరాలు అనే వ్యాస సంకలనంలోని మొదటి వ్యాసం బాలచంద్రుడు. ఈ వ్యాసాన్ని శ్రీ సురవరం ప్రతాపరెడ్డి రచించారు. శతాబ్దాల తరబడి బానిసత్వంతో కుంగిపోయిన తెలంగాణా ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని, చైతన్యాన్ని కలిగించిన మహనీయులు శ్రీ ప్రతాపరెడ్డి. తెలంగాణా సర్వతో ముఖమైన వికాసానికి మేలుకొలుపులు పాడిన వైతాళికులు. 'గోలుకొండ' పత్రికా సంపాదకులుగా వీరు తెలుగుజాతిని జాగృతం చేసారు.

శ్రీ ప్రతాపరెడ్డి క్రీ.శ. 1886 సంవత్సరం మహబూబ్‌నగర్ జిల్లా, అలంపూర్ తాలూకాలోని ఇటికంపాడు గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు శ్రీమతి రంగమ్మ, శ్రీ నారాయణరెడ్డి. బాల్యం నుండి రెడ్డిగారికి భాషాధ్యయనంపై మక్కువ ఎక్కువ. నిరంతర గ్రంథ పఠనం ద్వారా బహు భాషలలో వీరు కూలంకషమైన పాండిత్యాన్ని గడించారు. ఉపనిషత్తులను, వ్యాకరణ, తర్క, మీమాంసలను అభ్యసించారు. హైదరాబాద్ నిజాం కళాశాలలో, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో విద్యాభ్యాసం చేసి బి.ఏ., బి.ఎల్. పట్టాలను పొందారు. కొన్ని సంవత్సరాలు హైదరాబాదులో న్యాయవాదవృత్తిని అవలంబించారు. ఆ వృత్తిలో మన్వాది శాస్త్రాల లోతుపాతులను తరచి చూసారు. వృత్తిరీత్యా న్యాయవాది అయినా ప్రవృత్తిరీత్యా ప్రతాపరెడ్డిగారు భావుకులు, పరిశోధకులు, కవి, రచయిత. అందువలన న్యాయవృత్తికి స్వస్తి చెప్పి రచనా వ్యాసంగం చేపట్టారు.

విద్యార్థి దశలోనే రెడ్డిగారు రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టారు. పినాకిని, కళ, రెడ్డిరాణి అనే పత్రికలలో పుంఖాను పుంఖాలుగా వ్యాసాలను రచించి ప్రచురించారు. జాతీయోద్యమ కాలంలో వివిధ ఉద్యమాలలో పాల్గొన్నారు. తెలుగుజాతిని తీర్చి దిద్దటానికి కంకణం కట్టుకున్న వీరు గ్రంథాలయోద్యమంలో చురుకైన పాత్రను వహించారు. **1925**లో ప్రముఖ 'గోలుకొండ' పత్రికకు సంపాదకులై **1948** వరకూ ఆ పత్రిక నిర్వహణ బాధ్యతలను వహించారు. నిజాం నిరంకుశ ప్రభుత్వాన్ని ఎదిరించి నిలిచి, సాంస్కృతికంగా తెలుగుజాతిని చైతన్యపరిచారు. ప్రజావాణి అనే పత్రికను కూడా రెడ్డిగారు కొంతకాలం నిర్వహించారు.

రెడ్డిగారు **1924** నుండి **34** వరకు రెడ్డి వసతి గృహానికి అధిపతిగా ఉండి, చక్కని గ్రంథాలయాన్ని, అముద్రిత తాళపత్ర గ్రంథాలను దానికి అనుబంధంగా చేర్చారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు వ్యవస్థాపకులలో ఒకరు. **1944-45**లలో దానికి అధ్యక్షునిగా పనిచేసారు. వనపర్తి నియోజకవర్గం నుండి శాసనసభ్యునిగా ఎన్నికై, రాజకీయాలలో క్రియాశీలమైన పాత్రను వహించారు. వారికి ఆయుర్వేదంపై ఎంతో మక్కువ. పిల్లల పాటలలోని రహస్యాలను కనుగొని ప్రకటించారు. హైదరాబాదు ఆయుర్వేద సంస్థకు ప్రధమాధ్యక్షునిగా చాలాకాలం పనిచేశారు.

ప్రతాపరెడ్డి కవి, నాటక రచయిత, నవలాకారుడు, పరిశోధకుడు, భాషావేత్త. పరిశోధనాత్మకమైన దృక్పథంతో వివిధ విషయాలను అధ్యయనం చేసి రెడ్డిగారు జాతిరత్నాల వంటి గ్రంథాలను రచించారు. 'నిజాము రాష్ట్ర పాలనము', 'మొగలాయి కథలు', 'గ్రామ దర్పణము', 'మద్యపానము', 'సంఘోద్ధరణము', 'యువజన విజ్ఞానము', 'కర్నూలు రాజవంశావళి', 'కాశ్మీరు ట్రాజెడి', 'గ్రంథాలయాలు', 'హిందువుల పండుగలు', 'పూనా వ్యవసాయ ప్రదర్శనము, 'హైందవ ధర్మవీరులు', 'గోలుకొండ కవుల సంచిక', 'లిపి సంస్కారము', 'రామాయణ విశేషములు', 'ఆంధ్రుల సాంఘిక చరిత్ర' మొదలైన వైవిధ్య భరితమైన అంశాలతో కూడిన గ్రంథాలనెన్నిటినో రచించారు. రెడ్డిగారి రచనలలో ఆంధ్రుల సాంఘిక చరిత్ర చాలా విశిష్టమైనది. తెలుగువారి సామాజిక శైలిని క్రీస్తు పూర్వము నుండి ఆధునిక యుగము వరకు అధ్యయనం చేసి వివిధ విషయ వివరణతో కూర్చిన గ్రంథమది. కేంద్ర సాహిత్య ఎకాడమీ ఈ గ్రంథానికి ఐదువేల రూపాయల బహుమతిని ప్రకటించింది. కేంద్రసాహిత్య ఎకాడమీవారిచే బహుమతిని పొందిన తొలి తెలుగు గ్రంథమిది. రెడ్డిగారు శుద్ధాంతకాంత అనే నవలను, తుకారామ్ అనే నాటకాన్ని, చంపకీ భ్రమర ప్రబంధాన్ని రచించారు. ఇవి అముద్రితాలు. ప్రతాపరెడ్డిగారు **1953** సంవత్సరంలో దివంగుతులైనారు.

పరిశోధనాత్మకంగా, వివిధ విషయ వివరణతో, సరళమైన శైలిలో ప్రతాపరెడ్డిగారు గ్రంథరచన చేసారు. ప్రస్తుత వ్యాసం రెడ్డిగారి రచనా నైపుణ్యానికి, తెలుగుజాతి సంస్కృతిపై గల గౌరవాభిమానాలకు మచ్చుతునక. బాలచంద్రుని పాత్రను రెడ్డిగారీ వ్యాసంలో అత్యంత సహజంగా చిత్రీకరించారు.

## 12.2. పాఠ్యభాగ సందర్భం :

పల్నాటి యుద్ధానికి దారితీసిన పరిస్థితులను, దానికి కారకులైన వ్యక్తులను, ఈ వ్యాసకర్త వివరంగా తెలియజేసారు. భారత యుద్ధంలో వీరవిహారం చేసి యుద్ధభూమికి బలైన అభిమన్యుని వలె పల్నాటి యుద్ధంలో వీర విజృంభణ చేసి, శత్రువులను ఓడించి వీరస్వర్గాన్ని అలంకరించిన హైందవ ధర్మవీరుడు బాలచంద్రుఁడు. అతని సాహసోపేతగాథను పరిచయం చేసే సందర్భంలో రచించిన వ్యాసమిది.

## 12.3. పాఠ్యభాగ సారాంశం :

ఉత్తర హిందూ దేశానికి చెందిన హైహయ వంశజులు కొందరు అనుగురాజు నాయకత్వంలో దక్షిణ దేశానికి వలస వచ్చారు. చందవోలు రాజకుమార్తె మైలాంబను అనుగురాజు వివాహం చేసుకొనటం వలన పలనాడును అరణంగా పొంది, గురిజాల రాజధానిగా పరిపాలన సాగించాడు. తరువాత అనుగురాజు 'భూరమ', 'వీరవిద్య' లనే ఇద్దరు స్త్రీలను కూడా వివాహం చేసుకున్నాడు. అతనికి మైలాంబ వలన నలగామరాజు, వీరవిద్య వలన మలిదేవుడు, భూరమ వలన నరసింహరాజు మొదలైన కుమారులు కలిగారు. అనుగురాజు మంత్రి బ్రహ్మనాయుడు. చిరకాలం సంతానం లేకపోవడం వలన కన్నమనాయుడనే మాలను పెంచుకున్నాడు. ఆ తరువాత బ్రహ్మనాయునికి ఐతాంబ వలన బాలచంద్రుడనే కుమారుడు కలిగాడు.

అనుగురాజు మరణానంతరం నలగామరాజు రాజ్యాధికారం పొందాడు. అతనికి రెడ్డి కులానికి చెందిన నాగమ్మ మంత్రిణి. ఆమె కుట్రలు పన్ని మలిదేవాదులను రాజ్యం నుండి వెళ్లగొట్టించింది. మలిదేవాదులు మాచర్లలో పరిపాలన సాగిస్తుండగా, ఆమె కోడి పందాల నెపంతో వారి నాహ్వానించి, మాయోపాయంతో బ్రహ్మనాయుని ఓడించింది. అందువల్ల మలిదేవాదులు రాజ్య భ్రష్టులై ఏడు సంవత్సరాలు వనవాసం చేయవలసి వచ్చింది. గడువు తీరిన తరువాత ఒప్పందం ప్రకారం రాజ్యాన్ని తిరిగి ఇమ్మని బ్రహ్మనాయుడు అలుగురాజును వానితో రాయబారం పంపాడు. నాగమ్మ రాయబారికి విషం పెట్టించి, చంపించింది. అందువలన యుద్ధం తప్పనిసరి అయింది. రెండుపక్షాలు కార్యమపూడి అనే యుద్ధ భూమిని చేరాయి. ఓటమిని శంకించిన నాగమ్మ, రాయబారం నుండి సంధిప్రయత్నాలను ప్రారంభించింది.

బ్రహ్మనాయని కుమారుడైన బాలచంద్రుడు నూత్న వివాహితుడు. అతనికి ఈ యుద్ధ విషయాలను తెలియనివ్వక గోప్యంగా ఉంచారు. ఈ తరుణంలో అతనికి యుద్ధ విషయాలు తెలిసే సందర్భం ఒకటి తటస్థ పడింది. ఒకనాడు వీధిలో బొంగరాలాట లాడుతూ, బాలచంద్రుడు విసిరిన బొంగరం గురితప్పి, ఆ వినోదాన్ని తిలకిస్తున్న ఒక వైశ్య యువతికి తగిలింది. మూర్ఛితురాలైన ఆమె కొంతసేపటికి స్పృహలోకి వచ్చింది. ఆమె బాధతో ఓరి దుర్మార్గుడా ! పోతు సింహము వలే వదరుతున్నావు. మీ తండ్రులు యుద్ధభూమిలో ఉన్నారు. వారితో చేరి నీపరాక్రమాన్ని శత్రువులపై చూపవచ్చును కదా అని బాలచంద్రుణ్ణి నిందించింది. బాల చంద్రుడామెను సమాధాన పరిచి తల్లి ఐతాంబను యుద్ధ వివరాలను తెలుపవలసినదిగా గుచ్చి గుచ్చి ప్రశ్నించాడు. ఆమె తప్పని సరిగా ఆ వివరాలను తెలిపింది. ఏకైక కుమారుణ్ణి యుద్ధభూమికి పంపటం ఇష్టంలేక ఆమె వారించింది. బాలచంద్రుడు వినలేదు. భార్య అనుమతిని తీసుకొనవలసినదిగా మాంచాల వద్దకు అతణ్ణి పంపింది.

మగువ మాంచాల తొట్రుపడలేదు. రణరంగధీర నీకు విజయము చేకూరగలదని అతనికి ఆయుధమిచ్చి, ప్రోత్సహించి యుద్ధభూమికి సాగనంపింది. బాలచంద్రుడు తల్లి ఆశీస్సులను పొంది, సోదరసమేతంగా యుద్ధభూమికి బయలుదేరాడు. తన బ్రాహ్మణ సోదరుడైన అనపోతును యుద్ధభూమికి దూరంగా ఉండాలని బాలచంద్రుడు భావించాడు. ఒక వంకతో మాంచాల వద్దకు అతణ్ణి పంపాడు. త్రిపురాంతకం చేరి అనపోతును యుద్ధానికి రావద్దని ఒట్టుపెట్టి, ఒక కమ్మవ్రాసి రచ్చ చెట్టుకు కట్టి ముందుకు సాగాడు. నాగులేటి తీరంలో, కార్యమపూడిలో విడిది చేసిన ఉభయ సైన్యాలను చూసి ఇనుమడించిన ఉత్సాహంతో ఉరకలు వేసాడు.

మలిదేవుని దర్శనార్థము బయలుదేరిన బాలచంద్రుని కన్నమనాయుడు నివారించాడు. కానీ అతడు లెక్కచేయలేదు. సభను తన వీరాలాపాలతో కల్లోల పరిచాడు. ఇంతలో అందరినీ కలవరపరచే వార్త ఒకటి వచ్చింది. అనపోతు తనను బాలచంద్రుడు కట్టడి చేసినందుకు కలవరపడి, ఆత్మహత్యను చేసుకున్నట్లుగా అందిన వర్తమానమది. ఆవార్త వినగానే వీరులంతా ఆహార పదార్థాలను ఏటిలో కుమ్మరించారు. బాలచంద్రుడు శత్రువులను హతమార్చి కానీ శాంతింపనని శపథం చేసాడు. ఎవరు వారింపచేసినా అతని నిశ్చయంమారలేదు.

బాలచంద్రుడు సోదర, పరివారసమేతంగా శత్రువులను ఎదుర్కొన్నాడు. నలగామరాజు, నరసింహరాజు, నాగమ్మ యుద్ధ సన్నద్ధులైనారు. ఉభయ పక్షాలకూ భీకరంగా తలపడ్డాయి. బాలచంద్రుడు అరివీర భయంకరంగా యుద్ధం చేసాడు. సోదర సమేతంగా యుద్ధభూమిలో వీరవిహారం చేసిన అతడి ధాటికి తట్టుకోలేక శత్రుసైన్యాల కకావికలు అయింది. నరసింహరాజు వారిని కూడదీసి, ధైర్యం చెప్పి, తాను నాయకత్వం వహించి సేనలను ముందుకు నడిపాడు. ఒక వీరుడు ఏనుగుపై వీరోచితంగా పోరాడటం చూసిన బాలచంద్రుడు, అతడే నరసింహరాజని భ్రమించి, అతనిని ఎదుర్కొని చంపి, తలను ఖండించి తనతండ్రికి, రాజుకి సమర్పించాడు. కానీ తన పొరపాటును తెలుసుకొని తిరిగి యుద్ధభూమిని చేరాడు.

నరసింహరాజు తోకతొక్కిన పాములాగా బాలచంద్రుని ఎదిరించాడు. వారిద్దరికీ తీవ్రమైన ద్వంద్వ యుద్ధం జరిగింది. నరసింహరాజు అంకుశంతో పొడవుగా బాలచంద్రుని పేగులు బయటకు వచ్చాయి. వాటిని అదిమి బాలచంద్రుడు బల్లెంతో నరసింహరాజును చంపి, అతని తలను బ్రహ్మనాయునికి అర్పించాడు. బాలచంద్రుడు మళ్ళీ యుద్ధభూమి చేరి, శత్రు సంహారం చేసి వీరమరణం పొందాడు.

వీరాధివీరుడైన బాలచంద్రుడు శత్రువుల నోడించి కీర్తికాముడైనాడు. నేటికీ ప్రతి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు సర్వవర్ణాలవారు అతనికి వీర పూజలను చేస్తున్నారు. పల్నాటి పల్లెలలో అతని యశోగానం నేటికీ వినిపిస్తున్నది. పల్నాటి వీరభారతంలో బాలచంద్రుడు అభినవ అభిమన్యుడు.

## 12.4. కఠిన పదాలకు అర్థాలు :

| | | |
|---|---|---|
| వలస | = | స్వదేశాన్ని విడిచి పరదేశానికి పోవుట |
| గురిజాల | = | 'గురిజాల'గా నేడు పిలువబడుతున్న పల్నాటికి చెందిన ప్రాంతం |
| అరణము | = | వివాహ సయములో అల్లునికి, కుమార్తెకు ఇచ్చే ధనం |
| మాయ+ఉపాయము | = | మాయతో కూడిన ఆలోచన, కుతంత్రము |
| యుద్ధ క్షేత్రము | = | యుద్ధభూమి |
| ఏకైక కుమారుడు | = | ఒక్కడే కొడుకు |
| యుద్ధ కుశలుడు | = | యుద్ధము నందు నేర్పరి |
| వీరవైష్ణవము | = | విష్ణుని పరమదేవునిగా పూజించు హిందూమతశాఖ |
| బొంగరములాట | = | బాలక్రీడా విశేషము (పిల్లల ఆట) |
| ఉర్వీశుడు | = | రాజు |
| వడి | = | వేగము |
| పోతుసింహమురీతి | = | సింహపు పిల్లవలె |
| పరి పరి విధములు | = | రకరకాలుగా |
| కానక కన్న సంతానము | = | లేక లేక పుట్టిన పిల్లలు (జాతీయము) |
| ప్రాణాంగన | = | ప్రియమైన భార్య |
| అనుజులు | = | తమ్ములు |
| కించిత్తు | = | కొంచమైన |
| సంచలింపక | = | కలవరపడక |
| తొట్రుపడక | = | వేగిరపడక |
| నలినాయతాక్షి | = | కలువల వంటి విశాలమైన కళ్లు కలది. |
| వినత+ఆత్మజుడు | = | వినత కుమారుడు, గరుత్మంతుడు |
| సామీరి | = | వాయునందనుడు - భీము హనుమంతుడు |
| శాత్రవ | = | శత్రువు |
| ఆనపెట్టి | = | ఒట్టుపెట్టి |
| ఇనుమడించిన | = | రెట్టించిన |
| కాకలు తీరిన యోధులు | = | మిక్కిలి నేర్పరులైన వీరులు (జాతీయము) |
| ప్రల్లదము | = | పరుషమైన మాట |

| | | |
|---|---|---|
| జ్యేష్ఠ పుత్రుడు | = | పెద్ద కొడుకు |
| ధరణీశుడు | = | రాజు |
| రక్త సిక్తము | = | రక్తంతో తడిసినది |
| పక్వాహారము | = | వండిన ఆహారము |
| కళేబరము | = | శరీరము |
| పంద | = | పిరికివాడు |
| ద్వంద్వ యుద్ధము | = | ఒక వీరుడు మరొక వీరునితో చేసే యుద్ధం |
| తోఁక ద్రొక్కిన పాము | = | కోపాన్ని పొందిన పాము (జాతీయము) |
| ఉభయులు | = | ఇద్దరు |
| అంకుశము | = | ఏనుగును మచ్చిక చేసుకొనుటకు ఉపయోగించు పదునైన ఆయుధం |
| చండ ప్రకోపి | = | తీవ్రమైన కోపాన్ని పొందినవాడు |
| స్మరించుచు | = | తలచుకొనుచు |
| అంత్య సంస్కారము | = | చనిపోయిన తర్వాత చేసే క్రియలు |
| పాలికలను | = | యుద్ధభూమి |
| కీర్తికాయుడు | = | కీర్తిశేషుడు |
| అభినవ | = | నూతన |

## 12.5. పాఠ్య భాగంలోని పద్యాల భావార్థ వివరణ :

ఈ పాఠ్యభాగంలో ఉదహరింపబడినవి ద్విపద పాదాలు.

**1. పుట - 7 :**

| | | |
|---|---|---|
| వైరులతో | = | శత్రువులతో |
| మీ అయ్యలు | = | మీ తండ్రులు |
| వడి | = | వేగం |

**తాత్పర్యం :** 'ఓరి దుర్మార్గుడా ! ఓరి దురాత్ముడా ! మీ తండ్రులందరు గొప్ప సైన్యంతో రాజు (నలగామరాజు) నెదిరించి యుద్ధ భూమిని చేరారు. నీవు సింహపు పిల్లవలె చెలరేగుతున్నావు. వారితో నువ్వు కలిసి నీపరాక్రమాన్ని ప్రకటించవచ్చు' అని బొంగరపు దెబ్బతిన్న వైశ్య యువతి బాలచంద్రుని నిందిస్తూ పలికింది.

**2. పుట - 8 :**

ప్రాణపదమైన భార్యను చూడడానికి వచ్చినపుడు ఒంటరిగా రావలెను కాని, ఇతరులను వెంట తెచ్చుట నీకు ఎట్టి నీతి అని మాంచాల ప్రశ్నించగా బాలచంద్రుడు తమ్ములను పంపివేశాడు.

**3. పుట - 9 :**

| | | |
|---|---|---|
| సాహసము+ అబ్బు | = | ధైర్యం కలుగును |
| శాత్రవ విజయము | = | శత్రువులపై జయము |
| ఘన పూజలు | = | గొప్ప పూజలు |

**తాత్పర్యం :** కలువల వంటి విశాలనయన అయిన మాంచాల యుద్ధ వార్త వినగానే తొట్రుపడలేదు. బాలచంద్రుని నవ్వుతు ప్రోత్సహించింది. 'మన్మధుని వంటి సౌందర్యం కలవాడా ! మహావీరుడా యుద్ధభూమిలో నీకు గరుత్మంతుని వంటి బలము కలుగ గలదు. వాయుపుత్రులైన భీమ, హనుమంతుల వలె నీకు సాహసం కలుగుతుంది. నీ ఆయుధం శత్రువులపై నీకు జయాన్ని కలిగిస్తుంది. కలియుగంలో నీకు గొప్పపూజలు లభిస్తాయి'' అని ప్రాణనాథుని ఆశీర్వదించి, ఆయుధమిచ్చింది.

**4. పుట - 10 :**

| | | |
|---|---|---|
| పరమ పావనమూర్తి | = | మిక్కిలి పవిత్రమైనవాడు |
| చెలఁగినవాడు | = | ప్రసిద్ధుడైనవాడు |
| దట్టించి | = | ధిక్కరించి |
| ధరణీశుడు | = | భూమికి అధిపతి, రాజు |
| వాక్+గర్వము | = | గర్వముతో కూడిన మాటలు |

**తాత్పర్యం :** 'పరమ పవిత్రునిగా ప్రఖ్యాతుడైన బ్రహ్మనాయునికి పెద్ద కుమారునిగా ప్రసిద్ధుడవు. అత్యంత ఉత్తమునకు పుట్టిన నువ్వు రాజుగారి ఎదుట ధిక్కరిస్తూ పలకటం తగినదేనా ? చిన్నవాడవైన నీకు ఈ అహంకారంతో కూడిన మాటలెందుకు ?' అని కన్నమదాసు బాలచంద్రుని వారించాడు.

**5. పుట - 11 :**

| | | |
|---|---|---|
| తునుమాడి | = | ముక్కలు చేసి |
| జానువు | = | మోకాలు |
| జంఘలు | = | పిక్కలు |
| ఈప్సితము | = | కోరిక |
| అని | = | యుద్ధం |

**తాత్పర్యం :** 'బాలచంద్రుడు కత్తితో శత్రువుల తలలను ఖండించాడు. మణికట్లను ముక్కలు చేసాడు. తలలను నఱికి నేల మీద దొర్లించాడు. మోచేతులను విరిచాడు. ముక్కులను చెక్కాడు. నుదురు చీల్చాడు. దౌడలను ఊడపీకాడు. పళ్లురాల్చాడు. కనుగుడ్లను పగల గొట్టాడు. చేతులను వాల్చాడు. వక్ష స్థలాలను చీల్చాడు. తొడలను విరగగొట్టి, మోకాళ్ళను ఊడదీసాడు. పిక్కలను విరిచాడు. ఈ విధంగా తన తమ్ములతో కలసి కోరిక తీరునట్లు బాలచంద్రుడు యుద్ధభూమిలో విహరించాడు.

**6. పుట - 12 :**

| | | |
|---|---|---|
| పెండ్లాల | = | భార్యలను |
| బిట్టు + ఏడ్చు | = | బిగ్గరగా ఏడ్చు |
| వల్మీకములు | = | పుట్టలు |
| వెన్ను+ఇచ్చు | = | పారిపోవు |
| ఈ+భంగి | = | ఈవిధంగా |
| సమర రంగము | = | యుద్ధభూమి |
| భయ జనకము | = | భయాన్ని పుట్టించునదై |

**తాత్పర్యం :** ఆ యుద్ధభూమిలో శత్రువులందరూ చెల్లా చెదరైనారు. వారు బాలచంద్రుని ధాటికి తట్టుకోలేక రకరకాలుగా ప్రవర్తించారు. కొందరు చివరికాలం సమీపించిందన్న భయంతో భార్యలను తలచుకొని బిగ్గరగా ఏడవసాగారు. కొందరు పుట్టలలో దూరి మునుల వలె నటిస్తూ ప్రాణాలను కాపాడుకొనచూసారు. మరికొందరు గడ్డిమోపులలో దూరి శవాలవలె కదలక మెదలక దాగారు. ప్రాణ భయంతో కొందరు వెన్ను చూపారు. ఈ విధంగా యుద్ధభూమి అత్యంత భయంకరంగా, చూడ శక్యంకాని విధంగా భీతిని కొలుపునట్లుగా ఉన్నది.

**7. పుట - 14 :**

| | | |
|---|---|---|
| చండవిక్రమము | = | తీవ్రమైన పరాక్రమం |
| మేర | = | హద్దు, మర్యాద |
| అతుల సాహసులు | = | అంతులేని ధైర్యం కలవారు |
| కుంతంబులు | = | ఈటెలు, బల్లెములు |
| కదిసిరి | = | సమీపించిరి |
| విక్రమ+అధికత | = | గొప్ప పరాక్రమంతో |
| నలుగుఁల | = | - |
| ఐతాంబసుతుడు | = | ఐతాంబ కుమారుడైన బాలచంద్రుడు |
| దివి | = | స్వర్గము |
| భాస్కరుడు | = | సూర్యుడు |
| అస్త+అద్రి | = | అస్తమించు అద్రి, పడమటి కొండ |
| సాంద్రమై | = | దట్టంగా |
| జగమున | = | లోకంలో |
| క్రమ్మె | = | వ్యాపించాయి |

**తాత్పర్యం :** బాలచంద్రుడు తన సోదరుల మరణవార్త వినగానే తీవ్ర కోపాన్ని పొందాడు. అతడు తన రోషావేశాన్ని ఆపుకొనలేక వేలాడే పేగులను అదిమిపెట్టి, యుద్ధానికి బయలుదేరాడు. యుద్ధభూమిలో మరణించిన తన తమ్ములను తలచుకొని మిక్కిలి దుఃఖించాడు. 'మిమ్మల్ని విడిచి ఉండటం నాకు సాధ్యం కాదు. నేను మీ దగ్గరకు వస్తాను. నామాటను మీరు నమ్మండి' అని అతను చాటి చెప్తూ, యుద్ధభూమిలో నిర్భీతిగా నిలిచాడు. ఆ సమయంలో గొప్ప సాహసులైన శత్రువీరులు కొందరు ఈటెలను ధరించి 'కో' అని అరుస్తూ ఆ బాలుణ్ణి ఎదిరించారు. బాలచంద్రుడు వెనుకడుగు వేయలేదు. శత్రువులను చంపి చివరకు నేలకొరిగాడు. వీర మరణాన్ని పొంది వీరస్వర్గంలోని వీరులను చేరాడు. అట్టి సమయంలో సూర్యుడు పడమటికొండలో అస్తమించాడు. లోకంలో దట్టమైన చీకట్లు వ్యాపించాయి.

## 12.6. ప్రశ్నలు - సమాధానాలు :

**1. పల్నాటి యుద్ధానికి కారణాలు తెలపండి. (లేదా)**
**పల్నాటి యుద్ధాన్ని పిల్ల భారత యుద్ధంగా పేర్కొనటానికి గల కారణాలను వివరించండి.**

జ॥ గుంటూరు జిల్లాలోని పల్నాడు పౌరుషానికి, పరాక్రమానికి పెట్టింది పేరు. ఆ ప్రాంతంలో క్రీ.శ. 1050 ప్రాంతంలో జరిగిన యుద్ధమే పల్నాటియుద్ధం. భారతయుద్ధానికి, పల్నాటి యుద్ధానికి ఎన్నో పోలికలు వున్నాయి. అందువలన ఈ యుద్ధాన్ని పిల్ల భారత యుద్ధమని, పల్నాటి వీర భారతమని కూడా వ్యవహరిస్తారు.

ఉత్తర హిందూదేశం నుండి హైహయ వంశానికి చెందిన వారు కొందరు ఆంధ్రదేశానికి వలసవచ్చారు. వారి నాయకుడు అనుగురాజు. అతడు చందవోలు రాజవంశానికి చెందిన మైలాంబను వివాహం చేసుకున్నాడు. పలనాటిని భరణంగా పొంది 'గురిజాల'ను రాజధానిగా చేసుకొని రాజ్యపరిపాలన చేసాడు. అనుగురాజుకు మైలాంబ యందు నలగామరాజు అనే కుమారుడు కలిగాడు. అనుగురాజు భూరమ, వీరవిద్య అనే ఇద్దరు కాంతలను వివాహమాడి వారి యందు నరసింహరాజు, మలిదేవుడు, మరి ఇద్దరు కుమారులను పొందాడు. అనుగురాజు మంత్రి వెలమనాయకుడైన బ్రహ్మనాయుడు. అతడు వీరవైష్ణవాభిమాని. సంఘ సంస్కర్త. అతడు మాలకులానికి చెందిన కన్నమ నాయుడనే వాడిని పెంచుకున్నాడు. తరువాత ఐతాంబ అనే భార్యవలన బాలచంద్రుడనే కుమారుడతనికి కలిగాడు.

అనుగురాజు మరణానంతరం నలగామరాజు పలనాటి సీమకు రాజైనాడు. అతని మంత్రిణి రెడ్డి కులానికి చెందిన నాగమ్మ. ఆమె వీరశైవమతాభిమాని. కుట్రలకు, కుతంత్రాలకు మారుపేరు. అన్నదమ్ముల మధ్య కుట్రలుపన్ని మలిదేవాదులను పల్నాటి నుండి వెళ్లగొట్టించింది. బ్రహ్మనాయునితో మలిదేవుడు మాచర్లకుపోయి అక్కడ పరిపాలన ప్రారంభించాడు. కాని వారి ఉన్నతిని చూసి సహింపలేని నాగమ్మ మాయోపాయాలచే బ్రహ్మనాయుని కోడిపందాలకు ఆహ్వానించి, పందెం వేసి మోసంతో వారి రాజ్యాన్ని గెలుచుకుంది. ఓడినవారు పదేళ్లు వనవాసం చేయాలి. ఆ షరతు ప్రకారం మలిదేవుడు బ్రహ్మనాయునితో మాచర్లను వీడి కృష్ణా నదిని దాటి మండాది అనే ప్రాంతంలో కాలం గడిపాడు.

ఏడేళ్ళ గడువు ముగిసింది. తమ రాజ్యానికై మలిదేవుడు అలుగురాజు అనే వ్యక్తితో రాయభారం పంపాడు. నాగమ్మ కుయుక్తులకు లొంగి నరసింహరాజు రాయబారికి విషముపెట్టి చంపించాడు. యుద్ధము అనివార్యమైంది. బ్రహ్మనాయుడు సైన్యాన్ని సమీకరించుకొని నాగులేటి తీరంలో ఉన్న కార్యమపూడి అను యుద్ధక్షేత్రంలో విడిది చేసాడు. అక్కడ నలగామరాజు కూడా యుద్ధ ప్రయత్నాలను ప్రారంభించాడు. అతని సైన్యం చాలా పెద్ద సంఖ్యలో ఉన్నది. సంఖ్యలో పోల్చి చూస్తే బ్రహ్మనాయుని సైన్యం చాలా చిన్నది. కానీ అతని పక్షంలో వీరులంతా ప్రాణాలకు తెగించినవారు. నలగామరాజు సైన్యసమేతంగా కార్యమపూడి చేరాడు. యుద్ధం జరిగితే బ్రహ్మనాయుని పక్షానికే జయావకాశాలు మెండుగా ఉన్నాయి. ఈ సంగతిని గ్రహించిన నాయకురాలు నాగమ్మ కాలయాపన చేయటం కోసం కుతంత్రాలకు దిగింది. సంధికి ప్రయత్నిస్తున్నట్లు రాయబారాలు జరిపింది. బ్రహ్మనాయుని పక్షం వారు లా విషయమై చర్చలు చేయసాగారు.

బ్రహ్మనాయుని ఏకైక కుమారుడు బాలచంద్రుడు సాటిలేని మేటి వీరుడు. యువకుడు. యుద్ధ విద్యలలో నేర్పరి. నూత్న వివాహితుడైన అతనికి యుద్ధం జరగబోతున్న విషయమే తెలియన్వీలేదు. ఒకనాడు బాలచంద్రుడు మిత్రులతో బొంగరాలాట ఆడుతుండగా, ఆ ఆటను చూడానికి ఊరిలో వారంతా గుమికూడారు. బాలచంద్రుడు విసిరిన బొంగరం గురి తప్పి వినోదాన్ని తిలకిస్తున్న వైశ్య యువతికి తగిలింది. ఆమె స్పృహతప్పి, కొంతసేపటికి తేరుకొని 'పోతు సింహమువలే ఉన్నావు. మీ తండ్రితో యుద్ధ భూమికి వెళ్లి నీపరాక్రమాన్ని శత్రువులపై చూపరాదా' అని నిందించింది. ఆమె మాటవలన బాలచంద్రుడు ఉత్తేజితుడై యుద్ధ వృత్తాంతాన్ని చెప్పవలసినదిగా తల్లిని గుచ్చి గుచ్చి ప్రశ్నించాడు. ఆమె బాలచంద్రునికి తెలుపలేక ఆ విషయాలను తెలిపి, అక్కడికి వెళ్లవద్దని వారించింది. బాలుడు వినకపోవుటచే భార్య అనుమతి పొందమని, బాలచంద్రుణ్ణి మాంచాల దగ్గరకు పంపింది.

ఆ వార్త విని మగువ మాంచాల తొట్రుపడలేదు. బాలచంద్రునికి ఆయుధాన్నిచ్చి, ప్రోత్సహించి పంపింది. తల్లి దీవెనలను పొంది బాలచంద్రుడు యుద్ధభూమికి బయలుదేరాడు. తన బ్రాహ్మణ సోదరుడగు అనపోతును యుద్ధము నుండి వారించుటకై తన భార్య దగ్గర యేదో మరిచిపోయాను తమ్ముని వెనుకకు పంపాడు. త్రిపురాంతం చేరి అనపోతును యుద్ధానికి రావద్దని కట్టడి చేస్తూ లేఖ వ్రాసి, బాలచంద్రుడు నాగులేటి ప్రాంతాన్ని చేరాడు. ఉభయ సైన్యాలను చూసి వీరోత్సాహంతో ఉరకలు వేసాడు.

అతని రాకవలన సంధి కార్యమిక పొసగదని అందరూ భావించారు. ఎవరు వారించినా వినక బాలచంద్రుడు మలిదేవుని దర్శింపబయలుదేరాడు. ఉద్రేక పూరితములైన మాటలతో సభనంతా అల్లకల్లోలం చేసాడు. అనపోతు బాలచంద్రుడు తనను యుద్ధానికి రాకుండా కట్టడి చేసిన సంగతిని గ్రహించి ఆత్మాహుతి చేసుకున్న వార్త ఆ సమయంలో బాలచంద్రునకు తెలిసింది.

బాలచంద్రుడు పెడబొబ్బలుపెట్టి శత్రువులందరిని హతమార్చికాని శాంతింపనని శపథం చేసాడు. ఎందఱు వారించినా బాలచంద్రుని నిర్ణయం మారలేదు.

బాలచంద్రుడు సోదర, పరివార సమేతంగా యుద్ధభూమిలో వీరవిహారం చేసాడు. శత్రువులను ఊచకోత కోసాడు. అతని ధాటికి తట్టుకోలేక శత్రుసైన్యం కకావికలైంది. శత్రవులు ప్రాణభయంతో వెన్నుచూపారు. నరసింహరాజు తన సైనికులకు ధైర్యమిచ్చి తాను నాయకత్వం వహించి యుద్ధాన్ని కొనసాగించాడు. పోరు తీవ్రతరమైంది. యుద్ధభూమిలో ఒక సాహసిని నరసింహరాజుగా భావించి, బాలచంద్రుడు అతనిని ఎదుర్కొని తలను ఖండించి రాజుకు సమర్పించాడు. తన పొరపాటును తెలుసుకొని తిరిగి యుద్ధ భూమిలో నరసింహరాజును ఎదుర్కొన్నాడు. వారిద్దరికీ కర్ణార్జునవలె, రామరావణులవలె ద్వంద్వయుద్ధం భీకరంగా జరిగింది. నరసింహరాజు అంకుశంలో బాలచంద్రుని పొడవగా పేగులు బయటకు వచ్చాయి. బాలచంద్రుడు వాటిని అదిమిపెట్టి, బల్లెంతో నరసింహరాజును చంపి అతని తలను మలిదేవునికి సమర్పించాడు.

తన తమ్ములందరూ యుద్ధభూమికి బలి అయిన సంగతిని తెలుసుకొని బాలచంద్రుడు విచారించి, శత్రు సంహారం చేసి తాను కూడా వారిని స్వర్గంలో కలుస్తానని ప్రతిజ్ఞ చేసాడు. శత్రు సంహారం చేసి యుద్ధ భూమిలో ఒరిగిపోయాడు. అంతటితో పల్నాటి యుద్ధం ముగిసింది.

పల్నాటి వీరగాథను పిల్లభారతంగా అభివర్ణిస్తారు. రెండు యుద్ధాల మధ్యగల పోలికలు దానికి కారణం అన్నదమ్ముల మధ్య రాజ్యసంబంధమైన తగవుల వల్ల ఈ యుద్ధాలు సంభవించాయి. కౌరవులు, పాండవుల ఉన్నతిని చూసి సహించలేక పోయినట్లే, నలగామరాజాదులు మలిదేవుని ఔన్నత్యాన్ని సహించలేకపోయారు. పాండవుల రాజ్యాన్ని కౌరవులు మాయాద్యూతంలో ఓడించి అపహరించినట్లు, మలిదేవుని రాజ్యాన్ని నలగాముడు కోడిపందాలలో గెలుచుకున్నాడు. దుర్యోధునునికి శకుని దుర్బోధ చేసినట్లె, నలగామునకు నాయకురాలు దుర్బోధ చేసింది. పాండవులు 12 సంవత్సరాలు వనవాసం చేసారు. మలి దేవాదులు ఏడు సంవత్సరాలు వనవాసక్లేశాలను అనుభవించారు. పాండవులు రాయభారం జరిపి రాజ్యాన్ని తిరిగి పొందడానికి ప్రయత్నించినట్లె, మలిదేవుడు రాయబారిని పంపాడు. కౌరవులు రాయబారి అయిన కృష్ణుణ్ణి బంధించి అవమానింపగా, నాయకురాలు రాయబారి అలుగురాజును నరసింహరాజు ప్రోత్సాహంతో విషం పెట్టి చంపించింది. నలగామరాజు సైన్యం దురోధ్యనుని సైన్యం వలె సంఖ్యలో పెద్దది. మలిదేవుని సైన్యం పరిమితిలో చిన్నదైనా పాండవుల వంటి అరివీర భయంకరులు అతనికి అండగా నిలిచారు. 'యతో ధర్మస్తతో జయః' అన్నట్లు పాండవుల వలె మలిదేవుడు జయించాడు. కానీ జయం పాండవులకు ఆనందం ఇవ్వనట్లె మలిదేవునకు కూడా ఆనందాన్ని ఇవ్వలేదు. ఇరువురు బంధుమిత్ర మరణానికి దుఃఖించారు. యువకుడైన అభిమన్యుని వలె బాలచంద్రుడు యుద్ధభూమిలో అసహాయ శూరునిగా నిలిచి జయించాడు. వీరమరణాన్ని పొందాడు. పల్నాటి యుద్ధం పిల్ల భారతముకాగా అందు అభినవ అభిమన్య కుమారుడు బాలచంద్రుడు. పల్నాటి వీరగాధ చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచి వున్నది.

**2. బాలచంద్రుడు అభినవాభిమన్యుడు - సమర్థించండి. (లేదా)**
**బాలచంద్రుని పరాక్రమాన్ని వర్ణించండి.**

జ॥ పల్నాటిసీమకు మంత్రిగా వ్యవహరించిన బ్రహ్మనాయుని కుమారుడు బాలచంద్రుడు. అతనికి ఐతాంబ అనే భార్య యందు కలిగాడు. బ్రహ్మనాయుడు వీరుడు. సంఘ సంస్కర్త. వీరవైష్ణవాభిమాని అతనికి చిరకాలం సంతానం కలగకపోవటం వలన కన్నమ నాయుడనే మాలను పెంచుకున్నాడు. తదుపరి అతనికి బాలచంద్రుడు కలిగాడు. బాలచంద్రుడు మహావీర తేజో యుక్తుడు. యుద్ధ కుశలుడు.

నలగామరాజు, బ్రహ్మనాయుడు సైన్యసమేతంగా యుద్ధ సన్నద్ధులై కార్యమపూడి అనే క్షేత్రాన్ని చేరారు. సంధికై సంప్రదింపులు జరుగుతున్న తరుణమది. ఈ యుద్ధపు ముచ్చటలేవి బాలచంద్రునకు తెలియదు. ఒకనాడు బాలచంద్రుడు తన మిత్రులతో కూడి బొంగరములాడ మొదలు పెట్టాడు. ఊళ్లోవారంతా ఆ ఆటను చూడటానికి గుమికూడారు. బాలచంద్రుడు బొంగరాన్ని

విసరగా అది గురి తప్పి వినోదాన్ని తిలకించే ఒక వైశ్య యువతి కాలికి గుచ్చుకొన్నది. మూర్ఛితురాలైన ఆమె కొంత సేపటికి తేఱుకొని

*"ఓరి దురాత్ముడ ! ఓరి దుర్మార్గ !*
*మీయయ్యలెల్లను మించిన బలిమి*
*చేరి వైరులతోడ శ్రీ యుద్ధభూమి*
*నుప్పొంగుచున్న వారుర్వీశు నెదుట*
*వారిలోఁ గలయు నీవడి కానవచ్చుఁ*
*బోఁతు సింహము రీతిఁ బొదలుచున్నావు"*

అని పరివిధాల నిందించింది. ఆమె మాటల వలన బాలచంద్రుడు యుద్ధం జరుగబోతున్న సంగతిని గ్రహించాడు. తల్లిని గుచ్చి గుచ్చి ప్రశ్నించి వివరాలను తెలుసుకున్నాడు. ఆమె కుమారునికి తెలుపలేక తెలిపి యుద్ధానికి వెళ్లవద్దని అర్థించింది. కానీ బాలచంద్రుడు కృత నిశ్చయుడైనాడు. అందువలన అతనిని మాంచాల వద్దకు పంపి వారించాలని ఆమె తలచి, భార్య అనుమతిని తీసుకొనవలసి నదిగా ఆమె దగ్గరకు పంపింది.

**మాంచాల ప్రోత్సాహం :** సోదర సమేతంగా వచ్చిన బాలచంద్రునికి మాంచాల స్వాగతమిచ్చి పాదపూజ చేసింది. ప్రాణప్రదమైన భార్య దగ్గరకు సోదరులతో వచ్చుట ఏపాటిరీతి అని ఆమె ప్రశ్నించగా బాలచంద్రుడు వారిని వెనుకకు పంపాడు. బాలచంద్రుడు యుద్ధానికి సెలవు ఇవ్వవలసిందిగా ఆమెను కోరాడు. మాంచాల కలవరపడక

*"నవ్వుచు దీవించె నలినాయతాక్షి*
*రతిరాజసుందరా ! రణరంగధీర*
*వినతాత్మజుని లావు వెసనీకుఁ గల్గు*
*సామీరికుండిన సాహసమబ్బు*
*శాత్రవ విజయంబు సమకూరు నీకు*
*నీయాయుధము వడినిచ్చు జయము"*

అని ప్రాణనాథుని ఆశీర్వదించి, ఆయుధ మిచ్చి ప్రోత్సహించి యుద్ధభూమికి సాగనంపింది. బాలచంద్రుడు తన సోదరులతో తల్లికి పాదపూజ చేసి యుద్ధానికి బయలుదేరాడు.

దారిలో తన బ్రాహ్మణసోదరుడగు అనపోతును యుద్ధం నుండి వారించాలని నిశ్చయించుకున్నాడు. తన భార్య దగ్గర ఏదో మరచానని, తెచ్చి ఇమ్మని అనపోతును వెనుకకు పంపిసాగిపోయాడు.

**అనపోత వృత్తాంతం :** బాలచంద్రుడు త్రిపురాంతకం చేరాడు. ఒక తాటాకుపై అనపోతును యుద్ధభూమికి రావద్దని ఆనపెట్టి వ్రాసి రచ్చచెట్టుకు తగిలించి ఊరివారికీ విషయం తెలిపి మరింత ముందుకు సాగాడు. నాగులేటి తీరాన ఉన్న యుద్ధ క్షేత్రాన్ని చేరాడు.

**బాలచంద్రుని వీరోత్సాహం :** బాలచంద్రుని రాకతో సంధి కార్యంపై పిడుగుపడ్డదని అందరు నిశ్చేష్టులైయ్యారు. ఎందరు వారించినా వినక మలిదేవుని దర్శనానికి బయలుదేరాడు. అతని మామ కన్నమనాయుడు బాలచంద్రునిపై కోపించాడు. అయినా బాలచంద్రుడు వెనక్కితగ్గలేదు. మీకత్తులు తుప్పుపట్టినవి. వలసలో గట్లు, చెట్లుపట్టి అలసిపోయారు. మనకు జరిగిన అవమానాలకు మీరు ప్రతీకారం తీర్చుకోలేరని బాలచంద్రుడు పలికాడు. కాకలు తీరిన యోధులుండగా, నీవేమి తీర్చరివని కన్నమనాయుడు బాలచంద్రుని మాటలను ఖండించాడు. నీవెంతవాడవు ? నన్ను ధిక్కరించటానికి నీకేమధికారమని బాలచంద్రుడు పలుకగా కన్నమనాయుడు పరమపావన బ్రహ్మనాయునికి జ్యేష్ఠ పుత్రుడవు. చిన్నవాడవు నీకు వాగ్గర్వమేల అని నిలదీసాడు. అయినా బాలచంద్రుడు లెక్కచేయక, సంధి కార్యాలు పొసగవని. తన యోధులందరికీ రోషాన్ని, ఉద్రేకాన్ని కలిగించాడు.

ఇట్టి సమయంలో బాలచంద్రునికి ఒక ఘోర వార్త తెలిసినది. బాలచంద్రుడు తనను యుద్ధానికి రాకుండా కట్టడి చేసిన విషయాన్ని గ్రహించి అనపోతు బాకుతో పొడుచుకొని ఆత్మాహుతి చేసుకొన్న వర్తమానం, దానితో మాడచి అనే వనిత తెచ్చిన రక్తసిక్తమైన అనపోతు జంధ్యము మొదలైనవి చూసి బాలచంద్రుడు చండప్రకోపి అయినాడు. శత్రువులను హతమార్చి కాని శాంతింపనని బాలచంద్రుడు శపథం చేసాడు.

**బాలచంద్రుని వీరవిహారం :** బాలచంద్రుడు సోదరసమేతంగా గుఱ్ఱాలనెక్కి పరివారసమేతంగా శత్రువులతో తలపడ్డాడు. నలగామరాజు పక్షం కూడా యుద్ధభూమి చేరింది. బాలచంద్రుడు వారితో భీభత్సంగా యుద్ధం చేసాడు.

*"కత్తులచేఁదలల్ ఖండించి వైచి*
*మణికట్లఁ దునుమాడి మస్తకవితతి*
*ధరమీద నొరగంగ ధట్టించి నఱికి*
*మో చేతు లెడ చేసి ముక్కులు చెక్కి*
*......................................................*
*కనుగ్రుడ్లు పగులంగఁ గరములుద్రాల*
*బలువైన ఱొమ్ములు బవియలు గాగ"*

యధేచ్ఛగా బాలచంద్రుడు శత్రు సంహారం చేసాడు. అతని ధాటికి తట్టుకోలేక శత్రువీరులలో కొందరు పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నారు. కొందరు గడ్డిలో శవాలవలె కదలక మెదలక నిలిచిపోయారు. చెట్టు పుట్టలను ఆశ్రయించారు. నలగామరాజు సైన్యం బాలచంద్రుని ధాటికి కకావికలు కాగా నరసింహరాజు వారికి ధైర్యాన్ని నూరిపోసి తాను నాయకత్వం వహించి యుద్ధాన్ని కొనసాగించాడు. ఇరుపక్షాలకు తీవ్రమైన యుద్ధం జరిగింది.

**నరసింహరాజుతో ద్వంద్వయుద్ధం :** బాలచంద్రుడు ఏనుగుపై యుద్ధాన్ని సాగించిన ఒక సాహసిని నరసింహరాజుగా భావించి, తమ రాయబారికి విషమిచ్చి చంపిన అతనిని విడువ కూడదని తలచి, ఆ వీరుణ్ణి చంపి అతని తలను తండ్రి, రాజు ఉన్న చోటికి తీసుకొనిపోయాడు. వారివలన అతడు నరసింహరాజు కాదని తెలుసుకొని తిరిగి యుద్ధభూమికి వెళ్లాడు. పౌరుషమున్నచో తనతో ద్వంద్వ యుద్ధం చేయమని, నరసింహరాజునుద్దేశించి బాలచంద్రుడు పలికాడు. అతడు తోకతొక్కిన పాములాగా ముందుకు వచ్చాడు. వారిద్దరూ కర్ణార్జునులవలే, రామరావణులవలె, ఇంద్రవృతులవలె భీకర పోరాటాన్ని కొనసాగించారు. నరసింహరాజు అంకుశంతో బాలచంద్రుని పొడవగా అతని పేగులు బయటకు వచ్చాయి. బాలచంద్రుడు వాటిని అదిమి బల్లెంతో నరసింహరాజును చంపి అతని తలను తండ్రికి సమర్పించాడు.

**బాలచంద్రుని వీరమరణం :** యుద్ధభూమిలో తన సోదరులంతా మరణించారన్న సంగతిని గ్రహించి బాలచంద్రుడు దుఃఖించాడు. వ్రేలాడు పేగులను అదిమిపెట్టి, 'మిమ్ములను నేను విడిచి ఉండలేను' అని వారినుద్దేశించి పలుకుతూ యుద్ధభూమిలో నిర్భయంగా నిలిచాడు. అతుల సాహసులు కొందరు 'కో' అని అరుస్తూ బాలచంద్రుని తాకగా తాను 'కో' అని ప్రత్యుత్తరమిచ్చి వారందరనూ హతమార్చాడు. శత్రు సంహారం చేసి వీరమరణం పొందాడు.

*"............... భాస్కరుఁడస్తాద్రికేగె*
*సాంద్రమై చీకట్లు జగమునఁ గ్రమ్మె"*

వీరాధివీరుడైన బాలచంద్రుడు విజయాన్ని సాధించి కీర్తికాముడైనాడు. నేటికి పల్నాటిసీమలో పల్లెపల్లెలో అతని యశోగానాన్ని చేస్తున్నారు. సర్వవర్ణాలవారు, సర్వమతములవారు కార్యమపూడిలో కార్తీక శుద్ధ ఏకాదశినాడు అతనికి వీరపూజలను చేస్తున్నారు. పల్నాటి భారతయుద్ధంలో బాలచంద్రుడు అభినవ అభిమన్యుడు.

**ముగింపు :**

క్రీ.శ. 11, 12 శతాబ్దాలలో తెలుగుదేశంలో హిందూమతశాఖలైన వీరశైవం, వీరవైష్ణవం విశేష ప్రచారంలో ఉన్నాయి. శివుని పరమదేవునిగా ఆరాధించే వాళ్లు వీరశైవులు. విష్ణువును పరదేవునిగా పూజించే వాళ్ళు వీర వైష్ణవులు. శివుని పూజించేవారంతా సోదర సమానులు. వారి మధ్య కుల, వర్గ, లింగ విచక్షణ లేదు. తమ మతానుయాయుల్ని సమానులుగా చూసేవారు. వైష్ణవులు కూడా అంతే. శైవులంటే వైష్ణవులకు, వైష్ణవులంటే శైవులకు పడేదికాదు. ఆ రెండు మతాల మధ్య ఎంతో విద్వేషభావం వుండేది. పల్నాటివీరులలో బ్రహ్మనాయుడు వీరవైష్ణవాభిమాని. నాయకురాలు నాగమ్మ శైవమతాభిమాని. పల్నాటి యుద్ధానికి ఈ మతపరమైన వైషమ్యాలు కూడా కారణమని కొందరి అభిప్రాయం.

బ్రహ్మనాయుడు సంఘ సంస్కర్త. కుల, వర్గ, విచక్షణను నిరసిస్తూ చాపకూడును ఏర్పాటుచేసి సహపంక్తి భోజనం చేసిన అభ్యుదయవాదిగా చరిత్ర సృష్టించాడు. అన్ని కులాలకు చెందిన స్త్రీలను వివాహమాడాడు. అతనికి బాలచంద్రుడు వెలమకాంత ఐతాంబయందు అనుపోతుబ్రాహ్మణ భార్యయందు పుట్టారు. కన్నమదాసు అనే మాలను పెంచుకున్నాడు.

**రాదగిన ప్రశ్నలు :**

1. పల్నాటి యుద్ధానికి కారణాలను తెలపండి. (లేదా)
   పల్నాటి యుద్ధాన్ని పిల్ల భారతంగా వ్యవహరించటానికి కారణాలను తెలపండి.
2. బాలచంద్రుడు అభినవాభిమన్యుడు - ఎట్లో సమర్థించండి. (లేదా)
   బాలచంద్రుని పరాక్రమాన్ని వర్ణించండి.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. తెలుగు విజ్ఞాన సరస్వము
2. సప్త స్వరాలు - సంకలన కర్త కె. ఈశ్వర్
3. రామాయణ విశేషాలు
4. ఆంధ్రుల సాంఘిక చరిత్ర



**వావిలాల ఝాన్సీ,** M.A., M.Phil.,
తెలుగు అధ్యాపకురాలు,
హిందూకాలేజ్,
గుంటూరు.

పాఠం - 13

# ఐకమత్యం

- కందుకూరి వీరేశలింగం

**శీర్షికలు :**

13.0 లక్ష్యం
13.1 కవి పరిచయం
13.2 పాఠ్యభాగ సందర్భం
13.3 పాఠ్యభాగ సారాంశం
13.4 కఠినపదాలకు అర్థాలు
13.5 ప్రశ్నలు - సమాధానములు
13.6 ఐకమత్యం - సారాంశం

## 13.0 లక్ష్యం :

'ఐకమత్యమే బలం' అనే మాటను సార్థకంచేస్తూ ఐకమత్యము యొక్క గొప్పతనాన్ని దానివల్ల కలిగే లాభాలను విద్యార్థులకు తెలియచేయడమే ఈ పాఠ్యాంశం యొక్క లక్ష్యం. ఐకమత్యంతో సాధించరాని కార్యమంటూ ఏదీ లేదు. ప్రస్తుత సమాజంలో ఐకమత్యంతో జీవించడం ఎంతో అవసరం. ఆ ఆవశ్యకతను తెలియచేసి విద్యార్థులు సమసమాజ నిర్మాణానికి పూనుకోవాలని, ప్రగతిని సాధించాలని తెలియచెప్పడమే ఈ పాఠం యొక్క ముఖ్య ఉద్దేశం.

## 13.1 కవి పరిచయం :

ఆంధ్రదేశాన జన్మించిన మహనీయుల్లో ఆధునిక యుగకర్తగా, స్త్రీ విద్యకు పాటుపడి ప్రోత్సాహించిన మహోన్నత వ్యక్తిగా, వితంతు వివాహాలను జరిపించిన సంఘ సంస్కర్తగా, నవయుగ వైతాళికుడుగ పేరు పొందినవారు శ్రీ కందుకూరి వీరేశలింగం గారు. తాను ఆచరించిన మహాశయాలకై జీవితాన్ని ధారపోసిన ధన్యజీవి.

వీరు రాజమహేంద్రవరంలో 1848 ఏప్రిల్ 16న పున్నమాంబా సుబ్రహ్మణ్యములనే పుణ్యదంపతులకు జన్మించాడు. చిన్నతనం నుండి విద్య అంటే చాల యిష్టం. ఆంధ్ర భాషలో పాండిత్యాన్ని సంపాదించాడు. ఆంగ్ల ప్రవేశ పరీక్షలో జయం పొందాడు. తెలుగులో కవితలు చెప్పడమే కాకుండా చక్కని ఉపన్యాసాలు చేస్తుండేవారు. తాను మనఃపూర్వకంగా నమ్మిన దానిని ఆచరించడానికి ఎప్పుడూ వెనకాడేవాడు కాడు. రాజమండ్రి ధవళేశ్వరాలలో ఉపాధ్యాయుడుగా పనిచేశారు. ఆనాడు బాల వితంతువుల స్థితి మిక్కిలి దయనీయంగా వుండటంచే వారికి పునర్వివాహం చేసి మోడువారిన జీవితాలను చిగురింపచేసి సమాజాన్ని సంస్కరించి ఎన్నో వివాహాలను తన ఆధ్వర్యంలో జరిపించాడు. 'వివేక వర్ధని' అనే మాస పత్రికను స్థాపించి సంస్కరణలను దాని ద్వారా సాధించాడు. రాజమండ్రిలో వితంతు శరణాలయాన్ని స్థాపించి అనాథలైన వితంతువులకు ఎంతో మేలు చేశాడు. స్త్రీలకు విద్య ఎంతో అవసరమని వారికి మంచి ప్రవర్తన సౌశీల్యం అలవడుతుందని తెలియచేసే వ్యాసాలు వివేకవర్ధనిలో ఎన్నో వ్రాశాడు. స్త్రీ విద్యా విముఖులైన పలువురు పెద్దలతో ఆయన వాదించి వారిచేతనే 'స్త్రీ విద్య' బహుళ ప్రయోజనకారి అని ఒప్పించి కొందరి సహాయంతో ధవళేశ్వరంలో ఒక బాలిక పాఠశాల స్థాపించాడు. ఈ విధంగా ఆయన కృషి క్రమంగా ఫలించి ప్రతి గ్రామంలో ప్రతి

పట్టణంలో బాలిక పాఠశాలలు వెలిశాయి. ఆయన సంస్కరణలకు మెచ్చి 1893లో ప్రభుత్వం ఆయనకు 'రావు బహద్దూరు' అనే బిరుదు నిచ్చింది. సాంఘిక పరంగానే కాకుండా సాహిత్యపరంగా ఎన్నో నూతన ప్రక్రియలకు మార్గదర్శకుడయ్యాడు. మొదట 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము' వంటి సంప్రదాయ సిద్ధమైన రచనలు చేశారు. ప్రబంధాల వల్ల ప్రయోజనంలేదని 'సరస్వతి నారద సంవాద' మనే ఖండ కావ్యాన్ని వ్రాసి నాటి సాహిత్య సరస్వతి దురవస్థను వర్ణించారు. విషయ ప్రధానం, విజ్ఞానదాయకం, సర్వజన సుబోధకంగా వుండే తేలికపాటి రచనలు చేసి 'గద్య తిక్కన' అనే బిరుదు పొందారు. తెలుగులో నవల, స్వీయచరిత్ర, వ్యాసం, విమర్శ. విజ్ఞానశాస్త్ర గ్రంథాలను మొట్టమొదట రచించినది వీరేశలింగం గారే. వీరి 'రాజశేఖర చరిత్ర' మొట్టమొదటి నవల. 'గలివర్స్ ట్రావెల్స్' అనే ఆంగ్ల గ్రంథాన్ని అనుసరించి 'సత్యరాజాపూర్వ దేశయాత్రా' అనే హాస్యరస ప్రధానమైన ఆక్షేపక గ్రంథాన్ని వ్రాశారు. మొదటి జీవిత చరిత్రకూడా ఆయనే వ్రాశారు. విక్టోరియా మహారాణి జీవిత చరిత్ర, జీసస్ చరిత్ర మొదలగునవి ఆయన రాసిన చరిత్రలు. 1910 లో స్వీయచరిత్ర వ్రాశారు. ఆయనకు శాశ్వత కీర్తి ఇచ్చింది 'ఆంధ్రకవుల చరిత్ర'. నన్నయ నుండి నేటి వరకు గల కవుల చరిత్రలను వారి కాలాలను రచించిన గ్రంథాలను శాసనాధారాలతో నిర్ణయించి మూడు భాగాలుగా తీర్చి దిద్దారు. కవి చరిత్ర పరిశోధకులకు ఇప్పటికి ఇదే ఆధార గ్రంథం. ఇంకా జ్యోతిశ్శాస్త్ర, శరీర శాస్త్రాది గ్రంథాలను వ్రాశారు. నాటకాలలో కాళిదాసుని 'అభిజ్ఞాన శాకుంతలం' అనువాదం చేశారు. 'మాళవికాగ్ని మిత్రం' 'ప్రబోధ చంద్రోదయం' 'రత్నావళి' మొ॥ సంస్కృత నాటకాలను అనువాదం చేశాడు. ఈ విధంగా ఆంధ్ర వాఙ్మయానికి ఆయన చేసిన సేవ అపారము. ఆయన గ్రంథాలు 120 పైగా ఉన్నాయి. ఆయన శైలి సరళం, సుందరం, నిర్దుష్టంగా వుండి సర్వజనులకు అర్థమై సుకుమారమైన హాస్యంతో కూడుకొని హృదయాహ్లాదంగా వుంటుంది. ఆధునికులలో ఇంతటి ప్రతిభా పాటవాలు కలవారు చాల తక్కువ. దుర్బల శరీరము, అనారోగ్యం అయినా సాంఘిక సాహిత్య రంగాలలో విశేష కృషిసల్పి ఆయన నూతన యుగ ప్రవర్తకుడై సుస్థిర కీర్తిని పొందారు.

## 13.2 పాఠ్యభాగ సందర్భం :

1875లో రాజమండ్రిలో ప్రావిన్షియల్ స్కూల్ క్లబ్‌ను స్థాపించారు. ఆ రోజుల్లో ఇటువంటి సభలు సంఘాలు ఆంధ్రదేశంలో ఎన్నో వెలిశాయి. 'ఐకమత్యం' అనే విషయాన్ని గురించి కందుకూరి వారు ప్రావిన్షియల్ స్కూల్ క్లబ్‌లో ఉపన్యసించారు. ఆయన తాను చేయబోయె ప్రసంగాన్ని ముందుగానే వ్యాసంగా వ్రాసి వుంచుకునేవారు. ఆనాడు వారు చేసిన ప్రసంగమే ఈ ఐకమత్యం పాఠం.

## 13.3 పాఠ్యభాగ సారాంశం :

మహాజనులారా నేను ఈ రోజు ఐకమత్యం గురించి చెప్పుచున్నాను. జాగ్రత్తగా వినండి. ఎక్కువ మంది ఒకే విషయంపై ఒక అభిప్రాయం కలిగి వుండడమే ఐకమత్యం. మానవుడెప్పుడూ ఒంటరిగా ఏ కార్యాన్ని సాధించలేడు. చేయడానికి పూనుకున్న అందరూ మెచ్చుకునే విధంగా చేయలేడు. చిన్న కార్యాలు చేయటంలో సహితం మనుష్యుడు ఇతరుల సహాయం కోరడం తప్పని సరి. మనం తినే తిండి, కట్టుకునే బట్ట విషయంలో ఎందరో కష్టపడి పని చేస్తేగాని అవి మనకు లభించడం లేదు. ముందుగా భూమిని దున్నాలి. అది ఒకరు చేయాల్సిన పని. మరికొందరు విత్తనాలు చల్లి మొలిచిన తర్వాత పొలానికి నీరు పెట్టి కలుపు తీసి కష్ట పడాలి. పైరు పెరిగిన తర్వాత ఎలుకలు, చిలుకలు మొ॥ వాటి నుండి వానిని కాపాడుతూ ధాన్యాన్ని కొందరు జాగ్రత్త చేయాలి. ధాన్యం ఇల్లు చేరిన తరువాత కొందరు దంపి బియ్యంగా చేయాలి. చివరకు కొందరు బియ్యం వండి అన్నం చేయాలి. ఈ విధంగా ఇంత మంది పాటుపడినపుడు ఒక్క పూట సుఖంగా తినడానికి పట్టెడన్నం రాదు. ఇదే కాకుండా పంట పనికి కావాల్సిన కొడవళ్ళు, దంచడానికి రోళ్ళు, రోకళ్ళు, వంట పాత్రలు అవి చేయడానికి ఎందరో కష్టపడాలి. అదే విధంగా మనం నిత్యం ధరించే వస్త్రాల కోసం కూడా ప్రత్తి పండించి దాని నుండి నూలు మార్చి వస్త్రాలు తయారు చేయడానికి చాల మంది

పాటుపడాలి. సుఖంగా మనకు నీడ నిచ్చే ఇంటి సంగతి ఇలాంటిదే. ఇటుకలు, పెంకులు తయారు చేయాలి. గోడలు పెట్టువారు, తలుపులు, బల్లలు మొ॥ కోయువారు, మేకులు, బందులు తయారుచేయువారు ఇలా ఎందరో కష్టపడితేనే ఇల్లు సిద్ధం కాదు. ఒక్క మనిషి ఉండటానికి, తింటానికి, కట్టుకోవడానికి, ఇంత మంది కష్టపడవలసి వస్తే అనేక మందికి ఉపయోగపడే మహా పనుల విషయంలో ఇంకెంత మంది జనుల యొక్క తోడ్పాటు అవసరమో మనం ఊహించుకోవచ్చు. దీనిని బట్టి మనం చేయబోయే కార్యం యొక్క గొప్పతనాన్ని బట్టి ఎందరి తోడ్పాటు అవసరం అవుతుందని తెలుస్తుంది. కాబట్టి ఐకమత్యం లేక ఒక్క కార్యం కూడా జరగదని అది ఎంతో అవసరమని తెలుస్తుంది.

భగవంతుని సృష్టిలోనే మనుష్యులు ఒకరికొకరు తోడ్పాడాలని, ఒకరి సహాయం ఒకరికి అవసరమనే ఉద్దేశంతో జీవులను సృష్టించాడు. దేవుని ఉద్దేశానికి విరుద్ధంగా మనుష్యుడు ఏకాకిగా ఉండటానికి ప్రయత్నం చేయకూడదు. మనుష్యులతో కలిసి వుండటం మానవ ధర్మం. ఒంటరిగ ఉండటం మృగ ధర్మం. అట్టివాడు బంధుమిత్రుల సహాయం లేక ఇల్లు వాకిలి లేక కంద మూలాదులు తింటూ చెట్ల నీడలో నివసిస్తూ దిగంబరుడుగా జీవించాల్సి వుంటుంది. అప్పుడు కూడ మనిషి కష్టపడాలి. ఎందుకంటే జంతువులకు మందపాటి చర్మం వుండి దానిపై వెంట్రుకలు వుంటాయి. అందుకు అవి ఎండ, వానా, చలి నుంచి తప్పించు కుంటాయి. కానీ మనిషి తట్టుకోలేడు. అలాగే ఆత్మరక్షణకు జంతువులకు కొమ్ములు, కోరలు వుంటాయి. మనిషికి అవి వుండవు. కాబట్టి జంతువు కంటె మనిషి అల్పమైన ప్రాణి. అందుకే మనుషులలో సంఘీ భావం వుంటే తప్ప బలం కలుగదు. అప్పుడే మనుష్యుడు అన్ని ప్రాణులను తన వశం చేసుకో కలుగుతాడు. తానే అన్నింటికి రాజై వాటిని ఏల కలుగుతాడు. ఒంటరిగా వున్న చలి చీమకే భయపడి దూరంగా పోవలసిన వాడవుతాడు. స్వజాతికి బలహీనుడయినా సంఘీభావంతో బలవంతు డవుతాడు. అప్పుడు తన యిష్టం వచ్చిన వానిని రక్షించటానికి, శిక్షించటానికి సమర్థుడగుతాడు. ఒంటరిగ ఉన్నప్పుడు లేడిని కూడా వశం చేసుకోలేనివాడు సంఘీభావంతో ఉన్నప్పుడు సింహము వంటి క్రూరమృగాల మందల్ని సహితం వశపరచుకుంటాడు. మనుష్యుని యొక్క సుఖ సంతోషాలు, అభివృద్ధి సంఘ బలాన్ని అనుసరించి వుంటుంది. మనుషులందే కాక మృగాలలో సహితం సంఘీభావం వున్న జంతువులే విశేషమైన అభివృద్ధిని పొందుతున్నాయి. ఒంటరిగ వున్న పులి సంవత్సరానికి మూడు, నాలుగు పిల్లలను పెడ్తున్నా పులుల సంఖ్య అభివృద్ధి చెందలేదు. సంవత్సరానికి ఒక్క దూడను మాత్రమే ఈనుతున్న గోవుల సంఖ్య అధికమై ఊరూర మందలు మందలుగ పెరుగుతుంది. అందుకే సమస్త జంతువుల్లో మనుష్యుడు ఒక్కడే సంఘీభావంతో సుఖపడాలి. అడవుల్లో వుండేవారిని 'మృగప్రాయులు' అంటూ వుంటాం. అంటే పశువులతో సమానమైన వాళ్ళు అని అర్థం. ఎందుకంటే వాళ్ళు ఎక్కువ మందితో సహవాసం లేకపోవడమే. ఎక్కువ మందితో సహవాసం చేసేవాళ్ళని నాగరికులు అంటున్నారు. వాళ్ళే ఎక్కువ సుఖాలని అనుభవిస్తున్నారు. ఒకరికొకరు తోడ్పడటమే ఇందుకు ముఖ్యకారణం. ఒక ఊరిలోనివారే కాక దేశంలో వుండే ప్రజలందరి మధ్యా ఐకమత్యం అవసరం. లేనిచో పరస్పర ద్వేషం, వైషమ్యం ఏర్పడుతాయి. దాంతో తగాదాలు వస్తాయి. ఐకమత్యం లేకపోవడంతో ప్రజలకి పనికి వచ్చే ఒక్క పని వాళ్ళు చేయలేరు. ఈ విధంగా ఒక రాష్ట్రంలో ఐకమత్యం లేకపోతే ఇతర రాష్ట్రాల వాళ్ళు దండెత్తి వచ్చి దేశాన్ని ఆక్రమిస్తారు. ప్రజల్లో ఐకమత్యం వుంటే శత్రువులకు భయం వుంటుంది. అడుగు ముందుకు వేయలేరు. ప్రజలలో ఐకమత్యం లేకపోతే స్నేహం, అన్యోన్యత, ప్రేమా వుండవు. వాళ్ళకి క్షేమం కూడా కలుగదు. ఒకరి అభివృద్ధికి ఇంకొకరు ఆటంకం కలుగ చేయాలని చూస్తూ వుంటారు. ఒక తెగవారు చెడిపోతే రెండవ తెగవారు సంతోషిస్తూ వుంటారు. ఇలాగే రెండో వర్గం వారు బాధపడితే మొదటి వర్గం వారు సంతోషిస్తారు. ఇది ఎవరికి మంచిది కాదు. అందుకే ప్రజా క్షేమాన్ని కోరేవారు ప్రజల్లోని ఐకమత్యం కోసం కృషిచేయాలి.

ఒకనికి సాధ్యం కాని పనిని పదిమంది తలచుకుంటే అది సులభంగా నెరవేరుతుంది. ఇందుకు ఉదాహరణగా ఉత్సవ సమయాల్లో ఎంత బలవంతుడైనా రథాన్ని లాగలేడు. కానీ బలహీనులు అయిన పదిమంది కలిసి లాగితే రథం తేలిగ్గా కదలుతుంది. అసలు నాగరికతకు గుర్తు ఐకమత్యమే. నిజమైన నాగరికతగల దేశాల వారు ఐకమత్యం చేత ప్రపంచంలో ఎంతో గొప్ప స్థితికి

వచ్చారు. ఐకమత్యం అనేది దేహబలం, విద్యాబలం కంటే గొప్పది. ప్రజల్లో ఐకమత్యం తగ్గితే దేశం కూడ తన గొప్పతనాన్ని పోగొట్టుకొని కష్టాల పాలు పడుతుంది. మనం స్వాతంత్రం పోగొట్టుకొని పరతంత్ర పాలనలోకి పోవడానికి కారణం మనలో ఐకమత్యం లేకపోవడమే. మనలో ఐకమత్యం వుంటే ఎంతటి బలంగల దేశమైనా మనవంక కన్నెత్తి చూసేది కాదు. మనం పరాయి పాలనలోను క్రూరులయిన తురుష్కుల పాలనలో ఎన్ని కష్టాలు పడ్డామో. హిందూ స్త్రీలు వాళ్ళ చేతుల్లో పడిన కష్టాలు తలుచుకుంటే ఇప్పటికి శరీరం గజగజ వణకుతుంది. ఇప్పుడు పాలిస్తున్న ఆంగ్లేయులు ప్రజలకు మేలు కలిగించే పనులు చేస్తున్నారు. అందుకే మనం పడిన కష్టాలను మరచిపోయి సుఖపడుతున్నాం. ఆంగ్లేయుల ఐకమత్యం వల్ల మనం కూడ ఐకమత్యం నేర్చుకున్నాం. మన జనాభాలో నాల్గోవంతు లేని ఆంగ్లేయులు సముద్రాలు దాటి వచ్చి ఇంత విశాల దేశాన్ని పరిపాలిస్తున్నారంటే అది వాళ్ళ ఐకమత్యాన్ని సూచిస్తోంది. ఒక్క కట్టెను విరవడం తేలిక. అదే ఒక కట్టెల మోపును ఒకేసారి విరవాలంటే ఎంత బలవంతునికైనా సాధ్యంకాదు. ఆఖరికి పురుగులు కూడ సంఘీభావంతో గొప్ప కార్యాలు సాధిస్తున్నాయి. అడవుల్లో నివసిస్తున్న గుర్రాలు మందలుగా నివసిస్తూ సింహానికి కూడా భయపడకుండా లోబడకుండా జీవిస్తున్నాయి. అంత పెద్ద జంతువుల కన్నా మన కాళ్ళ కిందపడి చచ్చే చీమల సంగతి చూసినట్లైతే అవి బారులు తీరి బలవంతమైన పామును నిమిషంలో చంపుతున్నాయి. చిన్ని ప్రాణులే ఐకమత్యంతో ఇంత లాభాన్ని పొందుతుంటే జ్ఞానం కలిగిన మనుషులు మాత్రం కలిసిమెలిసి వుండి దేశాభివృద్ధికి తోడ్పడక పోవడం ఎంతో విచారకరం. జడ పదార్థాల్లో కూడ ఈ ఐకమత్యం మనకు కనబడుతుంది. గడ్డిపోచ ఒక్కటిగా వుంటే పుటుక్కున తెగుతుంది. పెక్కు గడ్డిపోచలను కలిపి పేనితే తాడుగా ఏర్పడి మదపుటేనుగును కట్టి పడేస్తాయి. అలాగే నూలు పోగులు చాల కలిసి పగ్గమై బలమైన రథాన్ని కూడా లాగ కలుగుతున్నాయి. ఇలా ఏ వస్తువు చూసినా మనకొక పాఠం అందులో కనబడుతుంది. వాటిని చూసి నేర్చుకొని ప్రజలు ఐకమత్యంతో పనిచేస్తే దేశాన్ని బాగు చేయ కలుగుతారు. ఐకమత్యం లేకపోతే ఏ దేశంలోనైనా ఏ కాలంలోనైనా మంచి పనులు వర్ధిల్లవు. వ్యాపారం, కళలు, శాస్త్రాలు, విద్యలు ఏ రంగమైనా ఐకమత్యం లేకపోతే అభివృద్ధిని సాధించలేవు.

మన వారికి కలిసి పని చేయడం తెలియదు. తానే తెలివి కలవారమని అనుకుంటూ ఎవరిని నమ్మరు. ఒక మోసగాడి మాటలు మాత్రం నమ్మి సొమ్ము పోగొట్టుకుంటారు. అది చూసి మిగతా వాళ్ళు ఎవరిని నమ్మక ఏకాకులవుతారు. ఇప్పుడే కొన్ని సంఘాలు ఏర్పడుతున్నాయి. అందులో మోసం చేసే వాళ్ళు వున్నారు. కృష్ణమ్మ శెట్టి సోదరులు మొదలయిన వారు ఆకర్షణీయమైన పేర్లు పెట్టి జనాన్ని మోసం చేస్తున్నారు. ఆ వాణిజ్య సంఘంలో ఆ శెట్టిగారు, ఆయన తమ్ముడు మాత్రమే సభ్యులుగా వుంటారు. ఎక్కడో ఒకచోట మోసం జరిగితే జరగవచ్చుగాని నిజంగా ఐకమత్యంతో వ్యాపారం చేస్తే తప్పక లాభాలు వస్తాయి. ఇలా వ్యాపారంలోనే గాదు ఏ పనిలోనైనా సంఘాలు సమాజాలు ఏర్పరచుకుంటూ అసాధ్యమయిన పనులు కూడా సులభంగా సాధించుకోవచ్చు. ఈ కారణం చేత గొప్ప తెలివి గలవారు మహాధనవంతులు సాధించలేని కార్యాలను గూడా చాలా దేశాల్లో సామాన్యులు గూడా సాధించ కలుగుతున్నారు. పశ్చిమ దేశాల్లో యంత్రాలు నిర్మించడానికి శాస్త్రాలు అభివృద్ధి చెందడానికి కారణం వారు సంఘాలుగ చేరి పని చేయుటమే. తాగుబోతు తనాన్ని మాన్పాలన్నా, జ్యోతిశ్శాస్త్రాన్ని వృద్ధిచేయాలన్నా మరి ఏ మంచి కార్యం చేయాలన్నా సంఘాలుగా ఏర్పడి ప్రచారం చేయవలసి వుంది. ఇలాంటి సంఘాలు యూరప్ ఖండంలో లక్షల సంఖ్యలో వున్నాయి. వాళ్ళను చూచి ఇప్పుడు మన వాళ్ళు కూడా మన దేశంలో సమాజాలు ఏర్పరచుకొని పనిచేయడం నేర్చుకుంటున్నారు. ఇలా సమాజాలు తయారైతే ఎంత గొప్ప పనైనా చేయవచ్చు. సమాజం వలన తమ అభిప్రాయాలు తొందరగా వ్యాపిస్తాయి. ఒకే రకపు అభిప్రాయాలు, భావాలు ఉన్నవారు ఒకచోట చేరుతారు కాబట్టి వాళ్ళంతా ఒక మహా సైన్యంలాగా పనిచేసి విజయం సాధిస్తారు. ఆ సంఘం చేరి నలుగురు తరచుగ మాట్లాడుకోవడం వల్ల ధైర్యం, ఉత్సాహం కలుగుతాయి. నలుగురు కలవడం వల్ల మంచి మంచి ఆలోచనలు ఉపాయాలు తడతాయి. తమ పనులకు తోడ్పడేవారు వాటిని ఒప్పుకునే వారు ఉన్నారని తెలుసుకోవడం వలన ప్రతి వ్యక్తికి రెండింతల ఉత్సాహం కలుగుతుంది. జ్ఞానం అభివృద్ధి చెందుతుంది. తరచుగా సమాజాలకు వస్తారు కాబట్టి ప్రజల్లో ఐకమత్యం అభివృద్ధి చెందుతుంది. దాంతో మంచి పనులు చేయాలనే కోరిక వారికి

పెరుగుతుంది. ఒక సమాజం వలన కలిగే ప్రయోజనం అందులో సభ్యుల మాటలను బట్టి నిర్ణయించగూడదు. కేవలం ప్రసంగాలతో ప్రయోజనం లేదు. దేశానికి ఉపయోగ పడే పనిని త్వరగా చేయవలసివుంది.

సమాజాలు ఎప్పుడూ ప్రజల్లో తెలివిని అభివృద్ధి చేసి ఆలోచనను వృద్ధిచేసి, సత్యవర్తనం ప్రోత్సాహపరచి దుష్టత్వాన్ని అణచి వేయడానికి, స్వాతంత్రాన్ని, సత్యాన్ని వ్యాపింప చేయడానికి దేశాభివృద్ధికి తోడ్పడడానికి ఉపయోగపడాలి. కేవలం వినోదం, కాలక్షేపం కోసం సభలు చేసే పక్షంలో సమాజ సభ్యులకు కానీ, ప్రజలకు గానీ ఎటువంటి ప్రయోజనం కలుగదు. కనుక మన సమాజం ఇంతవరకు చెప్పిన వాటిలో కొన్నిటినైన నిర్వహించాలని నా కోరిక నెరవేరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. ఈ విషయాన్ని ముగిస్తున్నాను.

## 13.4 కఠినపదాలకు అర్థాలు :

| | | |
|---|---|---|
| ఐకమత్యం | = | ఒకే విషయంపై అందరూ ఏకాభిప్రాయం కలిగి వుండటం (లేదా) కలిసి కట్టుగా వుండటం. |
| సావధాన మనస్కులు | = | మనస్సు పెట్టి జాగ్రత్తగా వినడం |
| ఘనకార్యం | = | గొప్ప పని |
| సర్వజన శ్లాఘ పాత్రం | = | జనులందరి చేత మెప్పుపొందడం |
| పెంటకట్టి | = | ఎరువువేసి |
| యువనిక | = | పొట్టు, తాలు |
| అపేక్షించుట | = | కోరుట |
| మృగప్రాయుడు | = | జంతువుతో సమానుడు |
| శీతవాత+ఆతపబాధలు | = | చలి, వేడి గాలుల వల్ల బాధలు |
| వైషమ్యము | = | శత్రుత్వం |
| బాహుయుద్ధం | = | చేతులతో పోట్లాట |
| వాక్కలహము | = | నోటితో పోట్లాడుట |
| నిరంకుశము | = | కఠినంగా |
| సమస్త శ్రీయములు | = | అన్ని శుభాలు |
| ఉచ్ఛదినములు | = | గొప్ప దినములు |
| కడగండ్లు | = | కష్టాలు |
| న్యాయ+ఏకావలంబులయిన | = | న్యాయమును పాటించు వారయిన |
| హూనా ప్రభువులు | = | ఆంగ్లేయ రాజులు |
| ఏకచ్ఛత్రం | = | ఒకే గొడుగు క్రింద (ఒకే రాజ్యం) |
| అశ్రమ సాధ్యులు | = | శ్రమలేకుండా జయింపబడేవారు |
| మంద | = | గుంపు |
| భూతదయ | = | ప్రాణులపై దయ |
| జడ పదార్థములు | = | కదలిక లేని వస్తువులు |
| వెంటి | = | గడ్డితో పేనిన తాడు |
| వంచకుడు | = | మోసగాడు |

| | | |
|---|---|---|
| విత్తము | = | ధనం |
| శీఘ్రకాలం | = | తొందరగా |
| కాలయాపన | = | కాలం గడపడం |
| లేశం | = | కొంచెం |
| చిరకాలం | = | చాలకాలం |

## 13.5 ప్రశ్నలు - సమాధానములు :

**1. ఐకమత్యం వల్ల వచ్చే లాభాలను వివరించండి.**

**(లేదా)**

**ఐకమత్యం గురించి వీరేశలింగం గారి ఉపన్యాసం వివరించండి.**

**(లేదా)**

**ఐకమత్యం యొక్క విశిష్టతను (ప్రాముఖ్యతను) వివరించండి.**

జ. కందుకూరి వీరేశలింగం పంతులు గారు గొప్ప సంఘసంస్కర్త. 'రాజమండ్రి ప్రొవిన్షియల్ స్కూల్ క్లబ్' లో ఐకమత్యాన్ని గురించి ఉపన్యాసం ఇచ్చారు. మన దేశానికి ఉన్న చీడల్లో మొదటి చీడ ఐకమత్యం లేకపోవడం. దేశప్రజల్లో ఐకమత్యం ఉంటే సాధించలేనిది ఏమీ లేదని మనం ఆంగ్లేయుల పాలనలో మగ్గిపోవడానికి కారణం మనలో ఐకమత్యం లేకపోవడమే నని ఆయన ఈ ఉపన్యాసంలో వివరించారు.

**ఐకమత్యం - ఆవశ్యకత**

అనేకులు ఒకే విషయంలో ఏకాభిప్రాయం కలిగి ఉండడమే ఐకమత్యం. ఐకమత్యం వల్లనే మానవుడు సుఖంగా జీవించ కలుగుతున్నాడు. మనం కట్టుకునే బట్ట తినే తిండి ఎందరో కృషి వలన వాటిని అనుభవిస్తున్నాం. వ్యవసాయంలో కూడా ఎంతో మంది కష్టపడి పనిచేస్తేనే పంట ఇంటికి వస్తుంది. పొలం దున్నడానికి పనికి వచ్చే నాగళ్ళు, పొలం కోయడానికి ఉపయోగించే కొడవళ్ళు తయారు చేయాలి. అంటే ఎందరో సహకారం కావాలి. ధాన్యం ఇంటికి వచ్చాక కూడా వండటానికి పనికిరావు. వాటిని దంచి చెరిగిన తరువాత వండాలి. అలాగే బట్టలు పత్తి పండించి, దారాలు తీసి నేస్తేనే బట్ట తయారవుతుంది. దీనికి ఎందరో సహకారం కావాలి. ఇల్లు కట్టడం ఒక్కరితో అయ్యే పనికాదు. టాపీ, వడ్రంగి ఇలా ఎందరో వుండి కలిసి కట్టుగా కడితేనే ఇల్లు తయారు అవుతుంది. ఒక మనుష్యుడు జీవించడానికి ఇంతమంది సహకారం అవుతుండగా, దేశానికి ఉపయోగపడే పనులు చేయడానికి ఎంతమంది సహకారం అవసరమో మనం ఊహించుకోవచ్చు. దేవుడు కూడా మానవులు ఒకరికొకరు సహాయ సహకారులుగా వుండడం కోసం సృష్టించాడు. దానికి విరుద్ధంగా మనిషి ఒంటరిగా ఉండడము పశు లక్షణం. మానవుడు సహజంగానే దుర్భలుడు. జంతువుల వలె ఆత్మరక్షణ చేసుకోలేడు. వాటికయితే సహజంగా దేవుడు ఇచ్చిన కొమ్ములు, ధృఢ చర్మం వుంటుంది కాబట్టి వాటికవే రక్షించుకుంటాయి. కానీ మానవుడు ఒంటరిగా ఆత్మరక్షణ చేసుకోలేడు. అతడి బలం అంతా ఐకమత్యం లోనే వుంది.

సంఘీభావం సమస్త బలాలను ప్రసాదిస్తుంది. సంఘ బలాన్ని అనుసరించి మనుషుల సుఖ సంతోషాలుంటాయి. ఒంటరి అయిన పులి ఎన్ని పిల్లలను పెట్టిన వాటి సంఖ్య అభివృద్ధి చెందదు. సంవత్సరానికి ఒక్క దూడను మాత్రమే పెట్టే ఆవు మందలుగా అభివృద్ధి చెందుతున్నాయి. అడవుల్లో నివసించే ప్రజలు బయటి ప్రపంచం వారితో ఎటువంటి సంబంధ బాంధవ్యాలు లేకపోవడం వల్ల మృగాలతో సమానంగా జీవిస్తున్నారు. మనుషుడు ఎంతమందితో సహజీవనం కలిగి వుంటాడో అంతగా సుఖపడతాడు. ఒక ప్రాంతంలో నివసించే ప్రజలు ఐకమత్యంగా ఉండకపోతే ఇరువురకు అసూయ ద్వేషం ఎక్కువై చివరకు

శత్రువులుగా మారతారు. ఐకమత్యం లేని దేశాన్ని ప్రక్క దేశాల వారు తేలికగా జయిస్తారు. ఐకమత్యం వుంటే శత్రువులు సహితం కీడు చేయలేరు. ప్రజలు క్షేమంగా సుఖంగా వుండాలంటే ప్రజల్లో ఐకమత్యం ఉండడానికి సరి అయిన ప్రయత్నాలు చేయాలి.

నాగరికతకు గుర్తు ఐకమత్యంగా ఉండడమే. ప్రపంచంలో ఏ దేశం అయినా అభివృద్ధిని సాధించింది అంటే దానికి ఐకమత్యమే కారణం. ఐకమత్యం లేకపోతే ప్రజలు స్వాతంత్ర్యాన్ని పోగొట్టుకుంటారు. మన దేశంలో కూడ ఐకమత్యం లేకపోవడం వల్లే ఆంగ్లేయుల పాలనలోకి వెళ్లి బానిసలుగ మగ్గిపోయాము. (19వ శతాబ్ది నాటి జనాభ లెక్కల ప్రకారం) 25 కోట్లు వున్న దేశంలో కేవలం నాలుగు వంతుల ప్రజల చేతుల్లో స్వాతంత్రం పోవడానికి ముఖ్యకారణం ఐకమత్యం లేకపోవడమే. పరదేశాల నుండి వచ్చిన వారు మనల్ని ఎన్ని బాధలు పెట్టారు. స్త్రీలను, వృద్ధులను ఎన్ని రకాలుగ హింసించారు. అవమానించారు. తరువాత ఆంగ్లేయుల పాలనలోకి వెళ్ళాము. సముద్రాలు దాటి మన దేశానికి ఆంగ్లేయులు రాగలిగారంటే వారిలో ఉండే ఐకమత్యమే ఇందుకు ముఖ్య కారణం. మనలో ఐక్యత లేకపోవడం వల్లనే బానిసలుగా అయ్యాము.

మనుషుల్లో కాకుండా, సృష్టిలో మృగాలు, కీటకాలు మొదలగునవి ఐకమత్యంలో వుండి ఎన్నో లాభాలను పొందుతున్నాయి. అడవుల్లో గుఱ్ఱాలు మందలు మందలుగా నివసించడం వల్ల సింహాలను ఎదిరించి విజయాన్ని సాధిస్తున్నాయి. చిన్ని ప్రాణులు ఐకమత్యంతో వుండి ఎన్నో గొప్ప కార్యాలు సాధిస్తున్నాయి. చీమలు బారులుగా తీరి బలవంతమైన సర్పాన్ని చంపుతున్నాయి. మృగాలే కలిసి జీవించి పనులు చేసుకుంటుంటే జ్ఞానం అధికంగా కలవాడు మృగాల కంటే తెలివైనవాడు అయిన మానవుడు ఐకమత్యంతో ఉంటే ఎంతటి గొప్ప కార్యాన్ని అయినా సాధించ కలుగుతాడు. ఐక్యతగా ఉన్నప్పుడే వాణిజ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఎవరో ఏదో మోసం చేశారని వ్యాపార రంగం నిరాశ పడకుండ ఐక్యతను సాధించాలి. 'కృష్ణమ సెట్టి సహోదరులు' మొదలైన పేర్లలో కొందరు అబద్ధపు వాణిజ్య సంఘాలు స్థాపించి ప్రజలను మోసం చేశారని అందరూ అలాంటి వారే వుంటారని అనుకోకూడదు. ధనబలం, మాటబలం ఒక్కచోట చేరితే ఐక్యతతో వుంటూ అలాంటి మోసకారుల ఆట కట్టించి వ్యాపార సంఘాలను విజయవంతంగా నడిపించవచ్చు. అనేక లాభాలను పొందవచ్చు. పాశ్చాత్య దేశాల్లో ఇట్టి సంఘాలు లక్షల సంఖ్యలో వున్నాయి. వాళ్ళు యంత్రాలు నిర్మించడానికి, సాంకేతిక శాస్త్రంలో నిపుణులు కావడానికి కారణం వాళ్ళంతా సంఘాలుగా చేరి పనులు చేయడమే, కృషితో పాటు ఐక్యతను కలిగి వుండడమే.

సమాజం ఏర్పడడం వల్ల ఐకమత్యం అభివృద్ధి పొందుతుంది. ఐకమత్యానికి ఉన్న శక్తి దేనికి లేదు. ఒక అభిప్రాయం కలవారు ఒకచోట చేరితే అది ఒక మహా సైన్యం అయి బలాన్ని ఇస్తుంది. అందరూ ఒకచోట చేరడం వల్ల ఒకరి అభిప్రాయాలు ఒకరు తెలుసుకోవడం మంచి ఆలోచనలు కలిగి వాటిని చర్చించుకోవడం వాని వల్ల మంచి ఉపాయాలు తట్టి మంచి కార్యాలు చేయడానికి ఉత్సాహం కలుగుతుంది. తమవంటి ఆలోచనలు, అభిప్రాయాలు ఉన్నవారు తమతో వున్నారని తెలిస్తే ఉత్సాహం రెట్టింపు అవుతుంది. అందుకే ప్రజలు సంఘంగా ఏర్పడి ఐకమత్యంతో పనిచేసి ప్రజల్లో వివేకాన్ని, సత్ప్రవర్తనను అధికం చేయడానికి బాగా ప్రయత్నం చేయాలి. ఐకమత్యం విలువ అందరూ తెలుసుకోవాలి. తెలియని వారికి తెలియచెప్పాలి. కలిసి మెలిసి ఉండేట్లుగా ప్రజలను ఒప్పించాలి. అపుడే దేశానికి క్షేమం కలుగుతుంది. ప్రజలు హాయిగా సుఖ సంతోషాలతో వుంటారు.

## 13.6 ఐకమత్యం - సారాంశం :

కందుకూరి వీరేశలింగం గారి ఉపన్యాసం ద్వారా ఐకమత్యం యొక్క గొప్పతనాన్ని దానివల్ల కలిగే లాభాలను తెలుసు కుంటారు. మీరు కూడా చుట్టు ప్రక్కల వారికి, తెలిసిన వారికి ఐకమత్యం యొక్క గొప్పతనం తెలియచేయండి. దాని వల్ల

పొందబోయే లాభాలను వివరించండి. మీ జీవితాలను మంచి మార్గంలో పయనించడానికి ప్రయత్నం చేయండి. 'ఐకమత్యమే మహాబలం' అని చాటండి.

**ఆధార గ్రంథాలు**


1. సప్తస్వరాలు - లార్సెను పబ్లికేషన్స్, హైదరాబాదు.

2. విజ్ఞానసర్వసం - రెండవ సంపుటి - తెలుగు విశ్వవిద్యాలయం.



డాక్టర్ బి. జ్యోతి స్వరూపరాణి
రీడర్, తెలుగు శాఖాధిపతి
జె.యమ్.జె. కళాశాల
తెనాలి.

**పాఠం : 14**

# పాండురంగ మహాత్మ్యము

(వ్యాసము)

**- పుట్టపర్తి నారాయణాచార్యులు**

**శీర్షికలు :**

14.0 లక్ష్యము

14.1 కవి పరిచయము

14.2 పాఠ్యభాగ పరిచయము

14.3 పాఠ్యభాగ సారాంశము

14.4 కఠిన పదాలు - అర్థ తాత్పర్యాలు

14.5 ప్రశ్నలు - సమాధానాలు

## 14.0. లక్ష్యం :

'పాండురంగ మహాత్మ్యము' పద్యకావ్యమైనను వచనము ద్వారా పరిచయము చేయుట. తెనాలి రామకృష్ణుఁడు వ్రాసిన ప్రబంధము 'పాండురంగ మహాత్మ్యము'. అష్టదిగ్గజాలలో ఒకడై, శ్రీకృష్ణదేవరాయల ఆస్థానములో 'పదగుంఫనాన్ని'కి పేరెన్నికగని, హాస్యప్రియత్వానికి, పాండితీప్రకర్షకు, చమత్కారానికి మారుపేరుగ ఉన్న రామకృష్ణుడు భట్టరు చిక్కాచార్యుల ద్వారా వైష్ణవాన్ని స్వీకరించి 'రామలింగడు' కాస్త 'రామకృష్ణుడై' విష్ణుకథా ప్రధానమైన పాండురంగ మహాత్మ్యాన్ని రచించాడు. వీరూరి వేదాద్రికి అంకితం చేశాడు.

'పండరీపురం' లోని 'పాండురంగ'ని మాహాత్మ్యాన్ని' చెప్పటానికి మొత్తం తొమ్మిది ముఖ్య కథల ఆధారంగ ఒక సూత్ర బంధాన్ని నడిపించాడు. ఆ కథలలోని రెండవ కథ 'నిగమశర్మోపాఖ్యానము (తృతీయాశ్వాసములోనిది), తొమ్మిదవ కథ 'అయుత, నియుతోపాఖ్యానములు ప్రస్తుత పాఠ్యభాగములోనివి.

## 14.1. కవి పరిచయం :

అనంతపురం జిల్లా చియ్యేడులో మార్చి 28వ తేదీ 1919 సంవత్సరం జన్మించిన నారాయణాచార్యులు బహు భాషా పాండిత్యము కలవారు. వారి ఇంటిపేరు 'పుట్టపర్తి'. వారి కవిత్వధారకు ఆంధ్రదేశం ఇచ్చిన బిరుదు 'మహాకవి'. ఆయన బహురూపసియైన సరస్వతిని సాక్షాత్కరించుకొన్నందులకు ఆయన పొందిన సార్థకమైన బిరుదు 'సరస్వతీపుత్ర', 1974 సంవత్సరంలో భారత ప్రభుత్వం ఆయనను 'పద్మశ్రీ' బిరుదుతో సత్కరించింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆయనకు 'గౌరవ డాక్టరేట్' బిరుదునిచ్చి తనను తాను గౌరవించుకొంది.

**బహుభాషా పాండిత్యము :**

సంస్కృతము, ఆంధ్రము, కన్నడము, మలయాళము, తమిళము, హిందీ, మరాఠీ, ఆంగ్లము మొదలైన పదునాలుగు భాషల పరిచయమే కాదు పాండిత్యము కలిగిన మహా మనిషి. కేరళ విశ్వవిద్యాలయంలో 'మలయాళ భాషా' నిఘంటు నిర్మాణంలో ఆయన పాత్ర ప్రశంసింపదగినది. ఢిల్లీలోని 'కేంద్ర సాహిత్య అకాడమీ' వారికి చెందిన బహు భాషా గ్రంథాలయమునకు అధికారిగ చేసిన సేవ మరువ రానిది. కళాశాలలో తనకు స్థానము దొరకనప్పుడు 'ఆశుకవిత'ను ప్రదర్శించి తద్వారా కళాశాలలో ప్రవేశించిన

ఘనత ఆయనది. పదునాలుగేండ్ల చిఱుత ప్రాయంలోనే 'పెనుగొండ లక్ష్మి' - అన్న పద్యకావ్యాన్ని వ్రాసిన మేధావి. తాను విద్వాన్ పరీక్ష వ్రాసే నాటికి ఆ 'పెనుగొండలక్ష్మి' అన్న కావ్యమే తనకు పాఠ్యగ్రంథంగ ఉండటం ఆయన జీవితంలోని అనేక విశేషాల్లో - మరపురాని విశేషం. భావ కవిత్వంతో ప్రారంభమైన కవితావేశం, అభ్యుదయ కవిత్వంతో విమర్శనాత్మక ధోరణులలో వైవిధ్యాన్ని ప్రదర్శించింది. అవధాన విద్య వారికి వెన్నతో బెట్టిన విద్య. సంగీతాన్ని సాహిత్యంతో ముడిబెట్టిన సారస్వత మూర్తులు; సరస్వతీ పుత్రులు నారాయణాచార్యులవారు.

**ఇతర కృతులు :**

వీరు శతాధిక గ్రంథకర్తలు. వానిలో కొన్ని షాజీ (తొమ్మిదవ ఏట వ్రాసిన పద్యకావ్యము) పెనుగొండ లక్ష్మి (పదునాలుగవ ఏట వ్రాసిన పద్య కావ్యము) సాక్షాత్కారము, తెలుగు తీరాలు, అగ్ని వీణ, గాంధీ మహా ప్రస్థానం, పండరీ భాగవతం, జనప్రియ రామాయణం, మేఘ దూతం, సిపాయి పితూరీ, శ్రీనివాస ప్రబంధం మొదలైనవి.

ఇవిగాక 'శివతాండం' అనే భక్తిరసపూర్ణమైన గేయకావ్యము వ్రాసిరి. ఆయన స్వయముగ వాగ్గేయకారులు అగుటచే ఆ కావ్యము భావోద్వేగ పూరితమగు, గంభీర స్వర సంభ్రమముతో సంగీత స్వరితముగను సాగినది.

మహా భారత విమర్శనము, విజయనగర సామాజిక చరిత్ర, ప్రబంధ నాయికలు ఆయన వచన రచనకు, విమర్శనా దృష్టికి మంచి ఉదాహరణములు.

## 14.2 పాఠ్యభాగ పరిచయము :

పద్య ప్రబంధమై, ఆంధ్ర పంచమహాకావ్యములలో లెక్కింపబడిన 'పాండురంగ మహాత్మ్యము', ఒక విధంగా దురవగాహ మైనది. అందుకే పుట్టపర్తివారు దానికి సంక్షిప్తముగా, వ్యాసరూపమైన ప్రామాణిక విమర్శను రచించిరి. తెనాలి రామకృష్ణుని 'పద గుంఫనము'లోని అర్థ, భావ, సామాజిక, కౌటుంబికమైన సౌందర్యమును వెల్లడి చేసిన విధమే ఈ పాఠ్య సారాంశము.

ఈ వ్యాసమందు నిగమశర్మోపాఖ్యానము (తృతీయశ్వాసము) అయుత నియుతోపాఖ్యనము (పంచమాశ్వాసము)లను తనదైన శైలిలో పాఠకుని పరిచయము చేసెను.

చివరగా తనదైన వ్యాఖ్యానమును మొగమాటము లేకుండా చెప్పి సదసద్విమర్శనకు ఒక మంచి మార్గమును చూపినాడు.

'పాండురంగ మహాత్మ్యము' సహజముగా ఉత్తర భారతదేశంలో పుండరీక క్షేత్ర సంబంధిత కథ. విజయనగర రాజధానిలో 'విఠలాలయము'ను బట్టి తెలుగువారికి కూడ పరిచయమైనదీ పాండురంగని మహాత్మ్యము. రామకృష్ణుడు తన కథకు మూలం 'స్కంధ పురాణం' అని చెప్పెను. పద్మ పురాణంలోనే కన్పించే ఈ కథ చిన్న చిన్న మార్పులతో మొత్తము తొమ్మిది కథల ఆధారముగ పుండరీక క్షేత్ర మహాత్మ్యాన్ని చాటి చెప్పే భక్తిరస ప్రధానమైనది.

## 14.3. పాఠ్యభాగ సారాంశము :

కళింగ దేశములోని 'పీఠికాపురం'లో 'సభాపతి' అనే పండితుడు వుండేవాడు. ఆ పండితునికి పుట్టిన కొడుకే నిగమశర్మ. తండ్రి ఆశల కనుగుణంగా 'నిగమ'ము అంటే వేదము - అని దానిలో నిష్ణాతుడు కావలెను. కాని 'తానొకటి తలస్తే దైవమొకటి తలచునట్లు పేరులోనే 'నిగమ' శర్మగాను, నిజ జీవితంలో ఆపేరును 'నేతి బీరకాయ'గా మిగిల్చినాడు.

నిగమశర్మకు నూనూగు మీసాల వయసూ, అందము రెండూ తోడైనవి. చెడు స్నేహము, స్త్రీలోలత్వము అతనిని బంధించి వేసినది. తాను చదివిన చదువు వక్రమార్గమునకే దారి చూపినది. ధనవంతుడగుటచే పదిమందిని వెంటబెట్టుకొని పొగరుబోతుగ మారినాడు. అతనికి వివాహము కూడ జరిగినది. విలాస జీవితానికి అలవాటుపడి తాను చేయవలసిన దైనందిన పవిత్ర కర్మల్ని మంట కలిపాడు. హోమాగ్నిని రాజచేయడం, ముప్పూటలా సంధ్య వార్చడం, వేదాలు వల్లించడం, ఆచమనం చేయడం మరచిపోయాడు. ఎప్పుడూ స్త్రీలతో కూడిన ఆలోచనలు, విటులతో నర్మ సంభాషణలు మననం చేస్తూ ఉండటం అతని నిత్యకృత్యమైంది.

అందుకు సొమ్ము కావాలి. ఇల్లు గుల్ల చేశాడు. ఋణపత్రాల ద్వారా అందినంత తెచ్చి ఋణగ్రస్థుడై తీర్చలేక పరవుపోగొట్టు కున్నాడు. తన ఆభరణాలు, తల్లి ఆభరణాలు, తండ్రి పత్రాలు అన్నీ వేశ్యలపాలైనాయి.

సరిగా ఈ విషయాలన్ని విన్న నిగమశర్మ అక్క తమ్ముణ్ణి బాగు చేయాలనే ఉద్దేశ్యంతో పుట్టింటికి వచ్చింది 'నిగమ శర్మ' అక్కకు ఈ కావ్యంలో పేరు లేదు. కాని 'నిగమశర్మ అక్క'గా సాహిత్యంలో అజరామరమైన స్థానం సంపాదించుకొంది.

**నిగమశర్మ అక్క :**

అనుకోకుండ ఊడిపడిన తమ్ముణ్ణి ఎంతో ప్రేమగా పిలిచింది. అతని భార్యకు భర్తకెలా సపర్యలు చేయాలోనేర్పి మరీ సేవలు చేయించింది. తలంటు ఐన తర్వాత మంచి బట్టలు కట్టించి తమ్ముని కూర్చోబెట్టి కబుర్లలోకి దించింది. ప్రేమతో పలకరించింది. 'ఏరా తమ్ముడు' అంటూ చనువుతో దగ్గరైంది. చంటి పిల్లాడికి పాలు తాపిస్తూ, తమ్ముడి తల దువ్వుతూ, ఈరుపెనతో తీసిన పేలగ్రుడ్లను చిటిలిస్తూ మొదలుపెట్టింది. అతని భార్య తమలపాకులు అందిస్తున్న సమయంలో తాను చెప్పదలచుకొన్న మంచి మాటలు నీతులతో కలిపి చెప్పటం ప్రారంభించింది.

వేదములు చదువుటకు మధ్యలో ఆటంకము కలుగుతుందని, నన్ను చూట్టానికి రాలేదని తానే సర్ది చెప్పుకొంది. నీవు వస్తావని ఎదురు చూచి చూచి నా కళ్ళు వాచిపోయాయి. మీ బావగారు కూడ నిత్యం నీ కొఱకు ఎదురు చూస్తూ ఉంటారని చెప్పింది.

పనిలో పనిగా - బ్రహ్మ నుండి ఇప్పటి వరకు వచ్చిన వంశ ప్రతిష్టను జ్ఞాపకం చేసింది. నిన్నే నమ్ముకొని అగ్నిసాక్షిగ నీకు భార్యయైన ఈమెను ఏలుకోవడం లేదని ఒక చురక తగిలించింది. నీవు ధర్మశాస్త్రంలో పాండిత్యం సంపాదించి ఎందుకు ప్రసిద్ధుడవు కాలేకపోయావురా అని వాపోయింది. చిలుక పలుకుల వంటి నిరర్ధకమైన చదువుతో, నిలకడలేని 'పిల్లి శీలము'తో, పదిమందికి ఎగతాళిగా ఎందుకు మారావని తమ్ముణ్ణి ప్రేమతో పలకరిస్తూనే, మందలించింది. నా తమ్ముడు యజ్ఞం చేసేటప్పుడు నాకు వేదిక ప్రక్కన గొప్ప పీఠం వేసి సత్కరిస్తావని ఎంతో ఆశపడ్డానని తన నిరాశను వెల్లడించింది. ఇంత మూర్ఖంగా ఎందుకు మారావని - దుఃఖిస్తూనే హితోపదేశం చేసింది.

**నిగమశర్మ, తరువాత చరిత్ర :**

ఒక చెవితో విని మరొక చెవితో వదిలి వేసే చంచల మనస్సుగల నిగమశర్మ నమ్మకంగా ఉన్నట్లుండి - ఒక అర్ధరాత్రిలో చడీచప్పుడు లేకుండ యింటిలో సొమ్మంత దొంగిలించి పారిపోయాడు. అడవిదారిలో దొంగలు నిగమశర్మను కొట్టి సొమ్మును దోచుకున్నారు. నిగమశర్మకు ఒక కాపు కొడుకు వైద్యం చేయించాడు. తర్వాత ఇంటికి తీసుకొనివెళ్ళాడు. అక్కడ ఆషాఢభూతిలాగ మెలగి కాపు కోడలితో అక్రమ సంబంధం పెట్టుకొని - తిన్న యింటి వాసాలే లెక్కించే ధూర్తుడయ్యాడు. ఆమెతో లేచిపోయి బోయ వారితో కలిసి కల్లు త్రాగి భ్రష్టుడైనాడు. కాలం కలిసిరాలేదు. ఆమె అకస్మాత్తుగ చనిపోయింది. తరువాత ఒక మాలెతను పెండ్లి చేసుకొని, ఒక కొడుకును కూడ కన్నాడు. అక్కడా అతన్ని దైవం చిన్న చూపే చూసింది. కుటుంబాన్ని పోషించడానికి 'వేట'కు వెళ్ళి వచ్చే సరికి 'తన భార్య, కుమారుడు' అగ్నికి ఆహుతి ఐపోయారు. నిగమశర్మ దుఃఖానికి అవధి లేకుండా పోయింది. కుటుంబ పోషణ తన కర్తవ్యమ్మని తెలిసికొనేటప్పటికి కుటుంబమే లేకుండ పోయింది.

తన బ్రాహ్మణ్యాన్ని వెలకట్టి, సౌందర్యం శాశ్వతం అని, కులం కంటె కామం గొప్పదని అనుకొన్న నిగమశర్మకు జ్ఞానోదయ మైంది. విరక్తితో ప్రయాణించి తెలియకుండగనే పుండరీక క్షేత్రం చేరాడు. తీర్థంలో స్నానంతో స్వామి దర్శనం లభించింది. పూర్వ జన్మలో చేసిన పుణ్య ఫలితంగా యమపాశాలను పుణ్యక్షేత్రానికి రక్షగా ఉంచిన చక్రాయుధం త్రెంచింది. విష్ణు భక్తులు గరుత్మంతుని రెక్కలమీద వైకుంఠానికి తీసుకొనివెళ్ళారు. ఇతని పేరు మారి 'కుమారుడు'గ పరమేశ్వరుని పార్శ్వ చరుడుగా మారాడు. విష్ణు మూర్తికి ఇష్టుడుగా మారాడు.

ఇంతవరకు కథా సారాంశాన్ని చెప్పిన నారాయణాచార్యులుగారు ఎంత పాపం చేసినా వాడు వైకుంఠానికి వెళ్తాడు పూర్వజన్మ సుకృతంతో అనే విషయాన్ని సున్నితంగా విమర్శించాడు. ఈ కథ ద్వారా 'నిగమశర్మ'కు చివరలో ఒక పట్టుదల పెరిగింది. భోజనం చేయనని భీష్మించుకొన్నాడు. భార్యాబిడ్డలపై ఏకాగ్రత పెరిగింది. పెరుగవలసింది భగవంతుని మీద ఇక్కడ మరో విశేషం స్థల మహాత్మ్యం. పుండరీక క్షేత్రమహాత్మ్యం వలననే నిగమశర్మకు ఉత్కృష్టమైన స్థితి లభించింది.

## అయుత నియుతోపాఖ్యానము

ఈ కథ పంచమాశ్వాసములోని తొమ్మిదో కథ. అంటే చివరి కథ. ఈ కథ కూడ పుండరీకక్షేత్ర మహాత్మ్యాన్ని చెప్పే లక్ష్యంతోనే ప్రారంభింపబడింది. కాశీ పుణ్యక్షేత్రంలో వేయిమంది శిష్యగణంతో ఉంటున్న అగస్త్యునికి తన శిష్యులలో అయుతుడు, నియుతుడు అంటే ప్రత్యేకమైన అనురాగము. అందుకే వారికి వివాహం చేయడానికి 'బ్రహ్మ'ను వేడి ఆయన కుమార్తెలైన గాయత్రి, సావిత్రులను తెచ్చి వారిని పెండ్లాడమని కోరెను. ఆయుతుడు పెండ్లాడుటకు నిరాకరించగా, ఆ కన్యల నిద్దఱిని నియుతునికే ఇచ్చి పెండ్లి చేసెను.

తన మాటను కాదనిన అయుతుని ఆశ్రమము నుండి వెడలగొట్టెను. అయుతుడు బయటకు వచ్చి, ఎంతో దుఃఖపడి, గార్హస్థ్య సంబంధమైన జీవితమును అసహ్యించుకొనెను. అక్కడే తెనాలి రామలింగని కవితా చమత్కారములు, ఉక్తి వైచిత్ర్యములు ధ్వనించినవి.

విరక్తుడైన అయుతుడు తపస్సు చేసెను. అది మహోగ్రతపమగుటచే ఇంద్రుడు బ్రాహ్మణ వేషముతో నలుగురు శిష్యులతో, ఒక దూడతో వచ్చి అయుతునకు అతిథిగా మారెను. ప్రస్థావన వశమున ఆ మాయా బ్రాహ్మణుడు గార్హస్థ్య (సంసార) ధర్మ ప్రాశస్త్యమును ఉగ్గడించెను. అయుతునికవి రుచింపలేదు. స్త్రీ సంగమమందలి అనర్థములను ఏకరువు బెట్టెను. మాయా బ్రాహ్మణ రూపమున వచ్చిన ఇంద్రుడు తాను తిరిగి వెళ్ళుచు తనతో తెచ్చిన 'దూడ'ను కావలెననియే అచట వదలి వెళ్ళెను. ఆదరములేని దూడను చూచి బక్కచిక్కన దానిని కుదురుగా సాకెను. ఫలితముగా అది ఆరోగ్యముతో నుండి ప్రతి ఏడాదికొక దూడను ఈనుచుండెను. దాని ఆగడములు మితిమీరిపోయెను. అయుతుడు సహించలేకపోయెను. దానిని కొంతలో కొంత నివారించుటకు మెడలో ఒక పెద్ద కఱ్ఱ కట్టెను. ఆ ఆవుకు కోపము వచ్చెను. అయుతునకు జ్ఞానోదయము కలుగచేయవలెనని సమీపమున తపస్సు చేసికొనుచున్న వాధూల మహర్షి స్థానమును తన గిట్టలతో మట్టగించెను. ఆ మహర్షి పై గట్టిన పుట్టలు పగిలి పాములు మేల్కొన్నవి. వాధూలునకు కోపము వచ్చి సమీపముననే ఉన్న అయుతుని 'కప్ప'పు కమ్మని శపించెను. అయుతుని వాధూలునకు తన కథనంత చెప్పికొని శాపమోచనమును వేడగా - పుండరీక క్షేత్రమందలి నరసింహస్వామిని చేరుమని చెప్పెను. ఆ క్షేత్రమందే అయుతుడు 'కప్ప'గా మారెను. ఆ క్షేత్రమునకే స్వామిని సేవించుటకు వచ్చిన కనా కుబ్జ నగరపు రాజకుమారి 'కప్ప'గా మారిన అయుతుని చూచి తన చెలికత్తెలతో కూడ ఆ కప్పతో చాలా సేపు ఆడి, కేవలము క్రీడాసక్తితో ఆ కప్పను ఒక ఋషిపై విసరినిది. అతనికి కోపము వచ్చి ఆ రాకుమారిని, ఆమె చెలికత్తెలను కప్పలుగా మారమని శపించెను. 'కప్ప' రూపములో ఉన్న అయుతునికి వీరందరు భార్యలైరి. వారి వలన అతనికి సంతానము కలిగెను. గృహస్థాశ్రమ ధర్మము గొప్పదని చెప్పుటకు ఈ కథ వ్రాయబడెనా ? లేక పుండరీక క్షేత్ర మహాత్మ్యము యొక్క గొప్పతనము చెప్పుటకు వ్రాయబడినదా అనునది విమర్శకు నోచుకొన్నది.

మొదటి కథయైన నిగమశర్మోపాఖ్యానములో అతడు అద్భుత రసమును కొంత పోషించి, అయుత నియుతుల కథలో ఆ అద్భుత రసమునే ప్రతిపద, ప్రతిపద్యములో నింపెను. రామకృష్ణుని పలుకుబడిలోని క్రొత్తదనం, కల్పనలోని చాతుర్యము, ప్రతి వర్ణనలోని గడుసుదనం, పదప్రయోగంలోని గుంఫనము చెప్పుకోగదినవి. స్వకపోల కల్పనలు, ప్రౌఢమైన భాష, లోకోక్తులు, అలంకారములు రామకృష్ణుని రచనలో పుష్కలము.

నారాయణాచార్యులు కవులను 'వట్టి కవి', అని 'శిల్పియైన కవి' అని విభజించి, 'వట్టి కవి' కథను మాత్రమే చెప్పికొనుచుపోవుననియు, 'శిల్పి'యైన కవి కథా కథనములో చిత్ర విచిత్రములైన శిల్పములను చెక్కునని చెప్పెను. రామకృష్ణకవిని 'శిల్పియైన కవి'గా ప్రశంసించెను.

## 14.4. కఠిన పదాలు : అర్థ తాత్పర్యాలు :

**పుట. 29**

| | | |
|---|---|---|
| కళింగ దేశాభరణము | = | 'కళింగ' అను పేరు కలిగిన దేశమునకు అలంకారము |
| అగ్నిహోత్రి | = | 'అగ్నిష్టోమ'మని యజ్ఞమును చేసినవాడు. |
| నిగమశర్మ | = | నిగమశర్మ - సభాపతి కుమారుడు<br>నిగమము = వేదము |
| హోమాగ్ని | = | హోమమునకు పనికి వచ్చు నిప్పు. ఇది 'జమ్మి' కఱ్ఱలచే పుట్టించునది. |
| విరహ జ్వర+ఆర్తుడు | = | విరహము = రతిలేక ఉండుట - అనగా ఎడబాటు కలిగియుండుట<br>విరహజ్వరము (విరహమనెడు జ్వరము)<br>రూపకాలంకారము (సవర్ణదీర్ఘ సంధి)<br>ఆర్తుడు = దుఃఖించువాడు |
| వెచ్చనూర్చు | = | వెచ్చన్+ఊర్చు (వేడి నిట్టూర్పులు విడుచును) |
| సంధ్యకు | = | ఉదయకాలపు సూర్యునికి - దోయిలించి ప్రార్థించుట |
| ప్రార్థనాంజలి | = | రెండు చేతులు జోడించి చేయు ప్రార్థన.<br>ప్రార్థన+అంజలి (సవర్ణదీర్ఘ సంధి) |
| ఘటింపడు | = | చేయడు |
| ఎరగు | = | నమస్కారము చేయును. |
| ఈర్ష్యాకషాయితలకు | = | ఈసు చెంది, కనులు ఎఱ్ఱబారిన భార్యలకు |
| ఆగమ వాదంబు | = | వేద సంబంధమైన తర్కము |
| తనడు | = | తృప్తి చెందడు |
| విటవాదములు | = | వేశ్యల విషయములో పోటీపడు విటుల యొక్క పోట్లాటలు |
| వేగిలేచి | = | ప్రొద్దుననే లేచి |
| కంచుభృత్+పాద+ఉదకము | = | పూజానంతరము మిగిలిన నీరు |
| యౌవత+అధర+సీధువు | = | యువతులైన స్త్రీల పెదవుల మధువును |
| ఆని | = | త్రాగి |
| చొక్కు | = | సంతోషించును |

**పుట. 30**

| | | |
|---|---|---|
| అపఘనంబు | = | దేహము |
| ఘటింప | = | ధరించుటకు |
| కరసఖ+శిర | = | చేతిగోళ్ళ యొక్క కొనల చేత |
| లిఖిత+జాత | = | వ్రాయబడిన, పుట్టిన |
| నూత్న+క్షతాంకముల్ | = | క్రొత్తవైన గాయముల వంటి చిహ్నములు |
| సమ్మతించు | = | సంతోషముతో ఒప్పుకొనును |

| | | |
|---|---|---|
| ఆరజము | = | ఇష్టము |
| దుర+విహార+హారి | = | చెడు తిరుగుళ్ళ యందు సంతోషడెడు నిగమశర్మ |

**పుట. 31**

| | | |
|---|---|---|
| ప్రతి+ఊహము = ప్రత్యూహము | = | ఆటంకము |
| చక్షూ రాజీవ యుగము | = | కనులు అనెడు పద్మముల జంట |
| నిన్గన్గోకున్కి - నిన్+కన్+గోక+ఉన్కి | = | నిన్ను కనుగొనక ఉండుట |
| నీరాకల్ | = | నీవు వచ్చుటను |
| మదిగోరు | = | మనసులో కోరుకొనును |
| చంద్రు పొడుపున్ | = | చంద్రుడు ఉదయించుటకు |
| నీరాకరంబుంబలెన్ | = | సముద్రము ఎట్లు కోరుకొనునో అట్లు |

('రాక' - అను పదమునకు - వచ్చుట, అని పూర్ణచంద్రుడని అర్థములున్నవి.)

| | | |
|---|---|---|
| పరమేష్ఠి | = | బ్రహ్మ |
| విశుద్ధ తరము | = | పవిత్రమైన తరము |

**పుట. 32**

| | | |
|---|---|---|
| దఱిఁద్రొక్కియున్న | = | ముసలి తనమునకు చేరువై ఉన్న |
| పఱచవై | = | ఎవరికి పనికిరానివాడవై |
| ఇల్లాలితాకార - ఈ+లాలిత+ఆకార | = | ఈ అందమైన ఆకారముగల |
| ధర్మశాస్త్రార్థ విత్తముల | = | ధర్మశాస్త్రముల అర్థములనెడి ధనములను |
| విత్తములచే | = | డబ్బుచే |

### 1) 'ఊష్మాని .... దుర్విహారహారి'

**తాత్పర్యము :** తన కిష్టమైన వానినే చేయును, కాని తనకు కష్టమైనవి చేయడు అని అర్థము వచ్చే పద్యమిది. నిగమశర్మ తనలో పుట్టిన విరహము వలన దేహమందు వేడిపుట్టి వేడిగాలులలో కూడిన నిట్టూర్పులు వదులును. కాని యజ్ఞమునకు కావలసిన 'హోమాగ్ని'ని రాజచేయడానికి నోటితో 'ఉఫ్' అని మాత్రము ఊదడు. ఈర్ష్యతో కనులు ఎర్రగా మారిన స్త్రీలకు సంధ్యా సమయంలో వారిని మంచి చేసికోవటానికి నమస్కారము చేస్తాడుగాని సూర్యునికి మాత్రం సంధ్యా వందనం చేయడు. వేదార్థాల వివరణలో వచ్చు వాదోపవాదములలో పాల్గొన్నడుగాని విటుల మధ్య వచ్చే పోట్లాటలకు మధ్యవర్తిగా ఉండటానికి పాల్గొంటాడు. తెల్లవారు ఝామున లేచి త్రాగవలసిన విష్ణుపాద తీర్థాన్ని త్రాగడం మానాడుగాని యువతుల సమూహాల తేనియలను మాత్రం తన్మయంతో త్రాగడం అలవాటు చేసికొన్నాడు. ఎంతో పరిశుద్ధమైన తిరుమణిని ధరించటం వదిలేశాడు గాని స్త్రీల కొనగోళ్ళచే చేయబడ్డ క్రొత్త గుర్తులను మాత్రం ధరిస్తాడు.

### 2) 'ప్రారంభించిన ... నీరాకరంబుంబలెన్'

**తాత్పర్యము :** ఒరే తమ్ముడా ! నన్ను చూడటానికి రాని కారణం నీవు చదవటానికి ప్రారంభించిన వేద పాఠానికి ఆటంకం కలుగుతుందని భావించావు కదూ ! నిన్ను చూడాలని ఎదురు చూస్తూ నాకళ్ళు కాయలుగాచాయి. మీ బావగారు గూడా సముద్రం ఏ విధంగా చంద్రుని కోసం ఎదురు చూస్తుందో అలానే ఎదురుచూస్తూ ఉంటారు. నీరాకనే కోరుకుంటారు.

### 3) "పరమేష్ఠి నుండి ... గుణంబేలనీకు"

**తాత్పర్యము :** మనకు మూలపురుషుడైన బ్రహ్మ దగ్గర నుండి నీదాకా (నిగమశర్మ వరకు) ఉన్న మన వంశపు గొప్ప తనాన్ని గుర్తుకు తెచ్చుకో. అవసాన దశలో ఉన్న తల్లిదండ్రులను సంతోష పెట్టలేకపోయావు. అందమైన నీ భార్యను ఏలుకోలేకపోయావు.

| | | |
|---|---|---|
| శీలము | = | స్వభావము |
| పిల్లి శీలము | = | ఎవరికి తెలియకుండ అది ఇది ఎత్తుకుపోయే స్వభావము |
| చిల్కల చదువులు | = | అర్థము ఏమాత్రము తెలియని కంఠో పాఠముగ చెప్పెడు చదువులు (అర్థము తెలియకుండగనే వల్లించిన చదువులు) |
| నాతోడ | = | నాకు తోడు బుట్టువుగ పుట్టిన నా తమ్ముడ ! |
| బేలవు | = | మోస పోతిని |

**పుట. 33**

| | | |
|---|---|---|
| సుజిన స్తవనీయ | = | మంచివారి చేత పొగడదగిన |
| నయ ప్రసక్తి | = | నీతితో కూడిన సందర్భము |
| వేది | = | వేదిక |
| వేవురిలోపల | = | అనేకుల మధ్య |
| ఆడుకొందు | = | చెప్పికొందును |
| కుడి వలన | = | కుడి దిక్కున |
| కొమరు | = | అందము |
| బిసరుహాక్షి | = | పద్మముల వంటి కన్నులు గలది |
| లబాయిలు దిబాయిలు | = | 'లబో', 'దిబో'మని ఏడ్చుట |

**పుట. 35**

| | | |
|---|---|---|
| పొన్నాకుపై తేనె | = | పొన్నచెట్టు ఆకుపై ఏ విధంగా తేనె నిలబడదో - అలా ఆధారములేని |
| సన్న+చెంద్రిక+మోవి మాధుర్యము | = | సన్నగ ఎఱ్ఱగ ఉన్న పెదవి యొక్క తీయదనము |
| వేమాఱు | = | అనేకసార్లు |
| ఆమని | = | వసంతము |
| చంపక | = | సంపెంగ |
| దామ | = | పూలదండల |
| గంధంబు | = | సువాసనలు |

పండితులను సత్కరించి తద్వారా కీర్తిప్రతిష్ఠలు అందుకోలేకపోయావు. నీ చదువులు అర్థము లేనివైనాయి. నీ నడతలు నిలకడలేని వైనాయి. కపటం అడుగడుగునా నీలో పేరుకొందని నీతో ఉన్న వారే నాతో చెప్పి నవ్వుకొనేట్లు చేస్తున్నావు. ఈ విధమైన చెడు గుణం నీకెలా అబ్బింది. ఇంతటి మూర్ఖుడవెట్లయ్యావు ? కారణం ఏమిటి ?

### 4) "నాదు సహోదరుండు ... దమ్ముఁడా"

**తాత్పర్యము :** నా తమ్ముడు మంచి పేరున్న, పొగడబడుతున్న ప్రజలచే బ్రహ్మను మించినవాడని కొనియాడబడడం ఆశించాను. నీవు చేయతలపెట్టిన యజ్ఞమునందు పెద్దపీట వేసి నన్ను అలంకరిస్తావని అనుకొన్నాను. కాని ఈ విధంగా అన్ని విధాలా చెడిపోయిన వానిగా నిన్ను ఊహించలేదు. (తమ్ముడా) !

### 5) "కుడి వలన నింతయోరగా కొమరు .... బిసరుహాక్షి"

**తాత్పర్యము :** కుడి దిక్కు నుండి కొంచెము వాలి తన బిడ్డ పాలు త్రాగుతూ ఉండగ నిగమశర్మ అక్క ఈ విధంగా అన్నది.

### 6) "ఎల్లరు నెల్లచో ధనములిచ్చి మృగాక్షులఁగొండు ... నింతయున్"

**తాత్పర్యము :** అందఱూ అందమైన స్త్రీలను డబ్బుతో కొందురు. కాని నేను (నిగమశర్మ) నా పరిశుద్ధమైన బ్రాహ్మణత్వము నిచ్చి నిన్ను కొనుక్కున్నాను. నీ అందమైన నల్లని దేహం శాశ్వతమని భ్రమపడ్డాను. మెరుపు మెరిసినంత సమయంలో తృటిలో అది కరగిపోతుందని, మరగిపోతుందని ఊహించలేకపోయాను.

### 7) "ఈ కడ జాతి నాతికి .... గాంచి మించుటల్"

**తాత్పర్యము :** అందఱూ ఈ కాపు స్త్రీకి ఈ బ్రాహ్మణుడు బానిసలా దొరికిపోయాడు, అంటూ నన్ను కోపగించి ఉమ్మినా కళంకములేని నీ ముఖ చంద్రుని చూచి శాశ్వతంగా అమృతం లభిస్తుందని భ్రమలో పడ్డాను.

| | | |
|---|---|---|
| వలపోత | = | ప్రేమ తలంపు |
| ఎడరు | = | సమయము |
| పాలవంటి కులము | = | పరిశుద్ధమైన కులము |

**పుట. 36**

| | | |
|---|---|---|
| పరిజనము | = | పనివారు |
| మృగాక్షులు | = | జింకవంటి విశాలమైన కన్నులుగల స్త్రీలు |
| కొంఁడ్రు | = | కొనెదరు |
| ఓ పల్లవ పాణి | = | లేతనైన చేతులు గలదానా |
| నిక్కము | = | నిజము |
| ధ్రువంబు | = | నిజము |
| విద్యుల్లతక (విద్యుత్+లతిక) | = | మెఱుపుతీగ కంటె |
| అధిక | = | ఎక్కువైన |
| అభినయ | = | నటించుట యందలి |
| ధూర్వహము | = | బరువును వహించినది |

**పుట. 37**

| | | |
|---|---|---|
| రాకకుబోకకు | = | వచ్చి బోవునపుడు |
| జనపరంపర | = | జనులు |
| కెంపగు జూడ్కి | = | కనులలో ఎరుపు వచ్చునట్లున్న కోపపు చూపులు |
| అంబూకృతము | = | ఉమియుట |
| తలంకన్ | = | ఊహింపక |
| కలంక+ముక్త | = | మచ్చ నుండి విడచిపెట్టబడిన |

**పుట. 38**

'వానికి ఱెప్ప మూతపడుటలేదు' - నరసింహస్వామిని పుండరీక తీర్థము చూస్తు రెప్పవేయుట లేదని చెప్పి - 'మత్స్యావతారము' తో ప్రారంభించి దశావతారములు చెప్పెను.

### 8) "ఒక యింత ఱెప్పవేయక .... నా ధరణీ సురుడు"

**తాత్పర్యము :** ఈ సీస పద్యములో 'దశావతారాలు' శ్లేష నాధారంగా చెప్పబడటం రామకృష్ణ కవికే చెల్లినది.

**పుట. 38**

| | | |
|---|---|---|
| - ‘తెప్పవేయక చూచుట’ | - | మత్స్యావతారము’ (సహజ గుణాలతో స్ఫురణకు దోపింపజేయుట) |
| - ‘తలగొట్టుకొనుట’ | - | కూర్మావతారము (తల లోనికి పెట్టుకొనుట) |
| - ‘బిలము తెలువు | - | వరాహావతారము (భూమిలోనికి చొచ్చుకొనిపోవుట) |
| - ‘స్తంభోద్భవము’ | - | నరసింహావతారము (హిరణ్యకశిపుని సంహరించుటకు స్థంభములో నుండి పుట్టు) |
| - ‘తిరియువాడు’ | - | వామనుడు (మూడడుగల నేలను యాచించుట) |
| - ‘అస్రము’ | - | పరశురాముడు (అస్రము = రక్తము చిందించుట) |
| - హా-పోయితే’ | - | రామావతారము (సీతను గూర్చి రాముని శోకము) |
| - ‘బహు విధాసక్తి’ | - | బలరామావతారము (‘సుర’ యందలి ఆసక్తి) |
| - చేరగారాని దర్శన స్థితి’ | - | బుద్ధావతారము (షడ్దర్శనములో - బౌద్ధ దర్శన మొకటి) |
| - ‘బాడబాగ్ని’ | - | ‘కల్కి’ (బడబము = అగ్ని, గుఱ్ఱము) గుఱ్ఱము కల్కికి సంకేతము |

| | | |
|---|---|---|
| దుఃఖ జలధి | = | దుఃఖమనెడు సముద్రము |
| బ్రుథివిలో | = | భూమి లోపలి భాగము |
| చొఱు | = | ప్రవేశించు |
| గమించు | = | పొందును |
| చెయిచాచు | = | అడుగును |
| దొప్పదోగు | = | తేలియాడును |
| భార్య గుఱిచి | = | ‘సీత’ ను గూర్చి |
| విభ్రాంతి | = | ఆశ్చర్యముతో భ్రమనం అనుభవించుట |
| దానవారాతి (దానవ+అరాతి) | = | రాక్షసుల శత్రువైన విష్ణువు |
| తదవతార దశకము (తత్+అవతార+దశకము) | = | విష్ణువు యొక్క పది అవతారములు |
| మున్నె | = | ముందుగానే |
| ధరణీసురుడు | = | బ్రాహ్మణుడైన నిగమశర్మ |

ఒక వైపు అగ్నికి ఆహుతియైన తన కుటుంబాన్ని గూర్చి దుఃఖిస్తున్న ‘నిగమశర్మ’ హృదయ విదారకత్వాన్ని వర్ణిస్తూనే దశావతారాలు సంజ్ఞా మాత్రంగా నిరూపింపబడ్డాయి.

త్వరలో విష్ణువుతో కలసిపోయే ‘నిగమశర్మ’ ముందుగానే ఆయన దశావతారాల్ని తానే ధరించాడని ఉత్ప్రేక్షించడం గొప్ప ఆలోచన.

- కొంచెమైనా ‘రెప్పవేయ కుండటం’ ‘చేప లక్షణం - కనుక ఇది మత్స్యావతారం’
- తలకొట్టుకొని దుఃఖ సముద్రంలో మునగటం - తల లోపలికి ముడుచుకోవటం ‘తాబేటి లక్షణం - కనుక ఇది కూర్మావతారం.
- భూమి రంధ్రములోకి దూరబోవటం - వరాహావతారము.
- కొయ్యబారిన (స్థంభోద్భవ) నిగమశర్మ - స్థంభము నుండి పుట్టిన నరసింహావతారము.

- మూడడుగుల నేల యాచించిన వానివలె - అన్నప్పుడు వామనావతారము.
- 'అస్రము' అను మాటచే 'కన్నీరే' గాక రక్తము కూడ స్ఫురించినది - కనుక ఇది పరశురామావతారము.
- 'హాపోయితే' అనుటచే - రామావతారము.
- బహువిధ+ఆసక్తి అనుటచే 'బలరాముని' సురాపానము గుర్తుకు వచ్చును. ఇది బలరామావతారము.
- చేరగారాని 'మత స్థితి' అనుటచే - బుద్ధావతారము.
- బడబాగ్ని (బడబం = గుఱ్ఱం) అని సూచించుటచే 'కల్కి' అవతారము .

ఇట్లు దశావతారములు ఒక్కొక్క పదముచే స్ఫురింపజేయుట కవి రామకృష్ణుని చమత్కార శేముషికి గీటురాయి.

### 9. "ఉత్తాల ఫణిభుక్ ... పోవుపథమునందు"

**తాత్పర్యము** : నిగమశర్మ భగవత్ సారూప్యాన్ని పొందటం అత్యద్భుతంగా వర్ణింపబడింది.

నిగమశర్మను వైకుంఠమునకు తీసికొని పోవుటకు వేయి సూర్యుల కిరణముల ప్రకాశముతో సమానమైన, ఆకాశ మార్గమున పోగల విమానము పంపబడినది. విష్ణువు వలె బయలుదేరుచుండగా దారిలో ఆయన దేహమునకు చెమట పట్టకుండగ గరుత్మంతుని ఱెక్కలు అనెడి విసనకర్రలచే గాలి విసరబడినది. విష్ణువునకు పడకయైన ఆదిశేషుడు తన పడగను ముత్యాల గొడుగులాగ మార్చి ఎండపడకుండా చేశాడు. వైకుంఠమునకు వచ్చుచున్న నిగమశర్మను చూచుటకు

**పుట. 39**

| | | |
|---|---|---|
| సారూప్యము | = | సమానమైన రూపము |

**పుట. 40**

| | | |
|---|---|---|
| అరుణ కిరణ | = | సూర్యుని కిరణములు యొక్క |
| సహస్ర | = | వేయితో |
| అభము | = | సమానము |
| ఉత్తాల | = | ఎత్తైన |
| ఫణి+భుక్ | = | పాములను భక్షించు (గరుత్మంతుని) |
| గరుత్ | = | రెక్కలు అనెడు |
| తాలవృంత | = | విసనకర్రల (తాటియాకులతో చేయబడిన) |
| అనిల | = | గాలిచేత |
| ఘర్మాంబువు | = | చెమట అనే నీరు |

ఎగబడ్డ దేవతలను విష్వక్సేనుడు చేతి బెత్తాలతో" భయపెట్టి అతనికి దారి చేశాడు. భృగు మహర్షి, భరద్వాజ మహర్షి ఇరువురి స్వస్తి వచన'లతో నిగమశర్మ భగవంతుని సారూప్యాన్ని పొందాడు.

### 10) "ఆజాను దీర్ఘంబులై హరిన్మది ... మునీంద్ర"

**తాత్పర్యము** : భగవంతుని సారూప్యాన్ని పొందిన నిగమశర్మ బాహువులు పచ్చలు పొదిగిన స్థంభములైనట్లు, తాను ధరించిన పూలమాలలు మెరుపులు వలెను, అతని విశాల నేత్రాలు తెల్లని తామర పూరేకులు వలెను. అతని ముఖము అప్పుడే పుట్టిన లేత సూర్యుని బింబమువలెను ప్రకాశిస్తున్నాయి.

## 11) చేరువ చేరువై కడు ... (జూచుచున్

**తాత్పర్యము :** అప్పటి వరకు నిగమశర్మ మహాపాపి. పూర్వజన్మలో అతడు చేసిన తపస్సు పండినది. ఈ జన్మ చివఱకు అది పరిపక్వమైనది. అందుచేతనే పుండరీక క్షేత్రంలో సంగమ తీర్థంలో స్థిరంగా ఉండే ఆ క్షేత్ర స్వామి నరసింహస్వామిని పలుమారులు దర్శించారు.

**పుట. 40**

| | | |
|---|---|---|
| చారు | = | అందమైన |
| మౌళి | = | శిరస్సు (తల) |
| ప్రత్యగ్ర | = | క్రొత్తగా నున్న |
| ముక్త | = | ముత్యాల |
| ఆతపత్రీభవత్ | = | గొడుగు అగుచున్న |
| శేష | = | ఆదిశేషునిచే |
| వారిత | = | అడ్డగించబడిన (పోగొట్టబడిన) |
| ఆతపము | = | ఎండగలది |
| కటాక్ష (కట+అక్ష) | = | కంటి యొక్క చివఱల నుండి వచ్చు |
| విహృతి | = | (చూపుల) విహారము |
| సూత్రవతీశ | = | సూత్రవతీ దేవి యగు భర్తయైన విష్వక్సేనుని |
| దోర్వేత్ర (దోః+వేత్ర) | = | చేతియందలి బెత్తముచేత |
| దత్త | = | ఇవ్వబడిన |
| అవకాశము | = | సమయము (ఎడమ నున్న దేవతలు గలది) |
| పార్శ్వ | = | ప్రక్క |
| తలములు | = | భాగములు |
| భృగు, భరద్వాజ ప్రభృతి | = | భృగు, భరద్వాజ మున్నగు మహర్షులచే |
| కృత | = | చేయబడిన |
| స్వస్తి (సు+అస్తి) | = | మంచి జరుగుగాక అని చెప్పు |
| వాక్+భరము | = | మాటల భారములు |
| ఖరములు | = | ప్రతిధ్వనించినవి |
| ఆజాను దీర్ఘంబులై | = | మోకాలివరకు వ్రేలబడుచు పొడవుగా నున్న |
| హరిన్మణిమయ - హరిత్+మణిమయ | = | పచ్చలు పొదిగిన |
| కులస్వాముల | = | మాతృకలు |
| దివ్య గంధములు | = | దేవతా సంబంధించిన సువాసనలచే |
| ఉద్రేకించి | = | విజృంభించి |
| విద్యుదంకుర రేఖలు | | |
| విద్యుత్+అంకుర+రేఖలు | = | విద్యుత్తు నుండే అప్పుడే పుట్టిన మెరుపుల కాంతులకు |

**పుట. 41**

| | | |
|---|---|---|
| జోడు | = | సమానము |
| కాంచన | = | బంగారు |
| నలిన | = | తామరల |
| పాండుర | = | తెల్లనైన |
| పద్మ పత్రములు | = | తామర రేకులు |
| వెడద కన్నులు | = | విశాలమైన కన్నులు |
| చాల+అర్క+బింబములకున్ | = | లేత సూర్య బింబములకు |
| అనుబింబ పంక్తులు | = | ప్రతిబింబాల సమూహాలు |
| ఆస్య | = | ముఖము యొక్క |
| ప్రభలు | = | కాంతులు |

**పుట. 43**

| | | |
|---|---|---|
| మోక్షగామి | = | మోక్షమునకు వెళ్ళువాడు |
| పచేళిమము | = | పండినమై (అనుభవ యోగ్యమై) |
| భవద్వ్యజినావళి (భజత్+వ్యజిన+ఆవళి) | = | భగవంతుని సేవజేయు ప్రపంచమునందలి జన సమూహము |
| నృకంఠీరవదేవ (నృ+కంఠీరవ+దేవ) | = | న=నర, కంఠీరవ = సింహ - నరసింహదేవుడు |
| నిత్య | = | ఎల్లకాలము |
| సదనీ కృత్య | = | నివాసము చేసికొని |
| సంగమ తీర్థరాజ | = | తీర్థములలో శ్రేష్ఠమైన |
| వార్ధాకలన్ | = | జలములందు |
| తత్+పరమ+ధామ+పతిన్ | = | ఆ గొప్పవాడైన ఆ క్షేత్ర ప్రభుని |

## అయుత నియుతోపాఖ్యానము

**పుట. 45**

| | | |
|---|---|---|
| మొలపూసలుగ పెరుగుట | = | (నక్షత్రములు ఆకాశములో ఎత్తుగా ఉండునవి) అవి 'మొల' ఎత్తున కట్టుకొను పూసలైనవనుటచే వింధ్య పర్వతము ఎంతో ఎత్తుగా పెరిగినదో ఊహించుకోవచ్చును. |
| వాసోనిగ్రహము | = | వస్త్రములు ఉన్నవో లేదో అను ఇబ్బంది |
| ఎన్నరు | = | లెక్కబెట్టరు |
| నీరు+పట్టు - నీర్పట్టు | = | దప్పికను గూడ |
| గణింపరు | = | లెక్కింపరు |
| సాటింపరు | = | లెక్కజేయరు |
| ఆసాయమ్ముగ | = | సాయంత్రమగు వరకు |
| ఆ నిశాత్యయముగా | = | రాత్రియై ఉదయము వచ్చు వరకు |

| | | |
|---|---|---|
| ఆమ్నాయముల్ | = | వేదములు |
| గ్రోల్చుచోన్ | = | నేర్చికొనునపుడు |
| ఆసీన | = | కూర్చొనుటచే వచ్చు |
| ప్రచలాయితము | = | (కదలక) కునుకుపాటు (రానీయరు) |

**తాత్పర్యము :** అగస్త్య మహర్షి తన శిష్యులైన అయుత, నియుతులను గూర్చి అనుకొనిన ఘట్టములోనిది.

నా శిష్యుడైన అయుత, నియుతులు తమకు కట్టడానికి బట్టలు లేవని అనుకోరు. ఎంత దప్పికయినా లెక్కచేయరు. జుట్టు మాసెనని బాధపడరు. దేహము ఎంత బాధ చెందినా పట్టించుకోరు. రాత్రి పగలు నిర్విరామంగా వేదములు చదువుతారేగాని కునుకుపాటును కూడ రానీయరు. వీరు ఎంత బుద్ధిమంతులో !

**పుట. 46**

| | | |
|---|---|---|
| ఉపపురంధర | = | నహుషుని (కొంతకాలం దేవేంద్ర పదవి అనుభవించి భ్రష్టుడైనవాడు) |
| భ్రూ | = | కనుబొమ్మల |
| భంగములు | = | ముడులు (కోపముతో ముడుచుకొనినవి) |
| అఖిల | = | నశించని |
| స్తంభనమునకు | = | వింధ్య పర్వతమును అడ్డగించుటకు |
| చులుక+ఆకృతులు | = | దోయిలి యొక్క ఆకారములు |
| లోక ప్రతిష్ఠ | = | లోకములను నిలుపు నిమిత్తము |
| దుష్ట నిగ్రహ | = | దుర్మార్గులను చంపుటకు |
| శిష్ట సంతుష్టి | = | ఉత్తములైన వారికి సంతోషము నిచ్చుటకు |
| రోష | = | కోపముతో |
| భీషణ | = | భయంకరమైన |
| రేఖానిరూఢ | = | ముఖ వర్చస్సుతో స్థిరమైన |
| గాఢ వీలన్ | = | గొప్ప మీసముతో |
| ప్రోడలు | = | నేర్పరులు (ప్రౌఢలైన వారు) |

**తాత్పర్యము :** అగస్త్యుని లోకకళ్యాణ కారకమైన కోప సంఘటనలు జ్ఞాపకము చేయబడినవి.

నూరు యజ్ఞాలు చేసి 'నహుషుడు' ఇంద్ర పదవిని పొంది, సప్తర్షుల్ని అవమానించి, మనిషి తలగల సర్పంగా శపింపబడినాడు అగస్త్యునిచే.

మేరు పర్వతంతో పోటిబడి, సూర్యచంద్రుల గమనానికి అడ్డుపడిన వింధ్య పర్వతాన్ని - అగస్త్యుడే దాన్ని అణచివేశాడు. దేవతల కోరికమేర సముద్రలములో దాగికొనిన కాలకేయాది రాక్షసులను వెలికి తీయడానికి సముద్రాన్ని అగస్త్యుడే పుక్కిలిబట్టాడు.

**పుట. 47**

| | | |
|---|---|---|
| జాఠరాగ్ని | = | ఆకలి మంట |
| ఉర్వీధరములు | = | పర్వతములు |
| కుచకుంభములు | = | చనులు అనెడి కుండలు |
| యుగము | = | జంట |

| | | |
|---|---|---|
| వాడి | = | పదునైన |
| కైదువులు | = | ఆయుధములు (కత్తులు) |
| మున్నీట | = | సముద్రమందు |
| నిడుజూపుదాలు | = | పదునైన అందమైన స్త్రీల చూపులు |
| నీత | = | లోతైన |
| నాభి | = | బొడ్డు |

**పుట. 48**

| | | |
|---|---|---|
| చెడగారు | = | అందమైన |
| కాల+అహి | = | నల్లని త్రాచున |
| తోడుకుట | = | పట్టుకొనుట |
| నూగాడ | = | స్త్రీ సంబంధమైన రోపకం |
| పనిచినన్ | = | ఆజ్ఞాపించినచో |
| మామక | = | నాయొక్క |
| కాయా | = | శరీరము |
| కర్మగతులు | = | చేష్టలు |
| మొఱ్ఱోయనంగ | = | వద్దనినను |
| మాడుపట్టు | = | నడినెత్తి |

**పుట. 49**

| | | |
|---|---|---|
| హిమవత్పర్వతము | = | హిమవంతుడు |
| గార్హాస్థ్యము | = | గృహస్థాశ్రమము |
| కీలారము | = | ఆవుల మంద |

**పుట. 50 "వత్సనాభీ గంధవహమయ్యె .................... తొలంగుదూఱు"**

| | | |
|---|---|---|
| నీవార పాకములు | = | నివ్వరిధాన్యమునకు |
| వత్సనాభీ | = | వసకొమ్ముయను |
| గంధవహము | = | విషపుగాలిలో సమానమైనది |
| ఈ జిన్నమును ఉక్కలు | = | ఆ ఆవు యొక్క ముందలి కాలి గిట్టలు |
| కఠినకుద్దాల వక్త్రములయ్యె | = | గట్టిపడిన గడ్డపాఱల ముఖముల వంటి చివరలు |
| చటుల | = | విస్తరించిన |
| దవానలచ్ఛటలు | = | అడవిలో పుట్టి అగ్నిజ్వాలలు |
| ఈ గిడ్డికటుజిహ్వా | = | ఈ ఆవు కఠినమైన కాలుక |
| బహిర్నికాయము లకున్ | | |
| బహః+నికాయములకున్ | = | ఆశ్రమమునకు బయట ఉన్న 'కుశ' (దర్భల) వనమునకు |
| ఆరణోచ్చారణోద్భృతులు | | |

| | | |
|---|---|---|
| ఆరణ+ఉచ్చారణ+ఉద్ధృతులు | = | గర్భస్రావం కలిగించే మాత్రోచ్చారణపు పెద్ద ధ్వనులు |
| ఈ తొఱ్ఱు | = | ఈ ఆవు |
| కంఠ + హుంకృతులు | = | భయంకరంగా అరిచే అరుపులు |
| మొగమోడి | = | మొగమాటపడి |
| దూల ఏల | = | దురద ఎందుకు |
| లాడి గావింతున్ | = | బలి చేస్తాను |
| దూఱు | = | అపనింద |
| వత్సయుతముగ | = | దూడ సహితముగ |

**తాత్పర్యము :** అయుతుని ఆశ్రమములో మాయా బ్రాహ్మణ వేషమున వచ్చిన ఇంద్రుడు వదలివెళ్లిన ఆవు బలసి విశృంఖల విహారము చేయుచున్నప్పటి పద్యము.

ఆ ఆవు పై నుండి వీచు గాలి నివ్వరి ధాన్యమును వస అను విషపుగాలి వలె నాశనము చేయుచున్నది. కంద దుంపలను ఆ ఆవు గిట్టలు గడ్డ పలుగుల్లాగా కఠినమై త్రవ్వి త్రొక్కివేస్తున్నాయి. యజ్ఞము నందుపయోగించు దర్భల వనములు దీని నాలుక నుండి వచ్చు దావాగ్ని వలె కాల్చివేస్తున్నాయి. ఆ ఆవు అరిచే భయంకరమైన అరుపులకు ఆడు జింకల గర్భములు విచ్చిన్నమైనవి. ఇక్కడి మునులు మొగమాటముతో ఏమియు అనుటలేదు. ఈ అరణ్యమునకు దీనిని బలియిచ్చెదను.

**పుట. 51 "మట్టిన బిట్టు .................... మేల్కొనన్"**

| | | |
|---|---|---|
| మట్టిన | = | కాలితో త్రొక్కిన |
| బిట్టు | = | వెంటనే |
| మండిపడి | = | కోపగించి (పాఠాంతరమా మిట్టపడి = ఎగిరిపడి) |
| పుట్టనెట్టు | = | పుట్ట ఉన్న చోటును |
| అవిసి | = | పగిలి |
| శ్రవశ్శకుంతముల్ - శ్రవః+శకుంతముల్ | = | చెవులపై గూళ్ళుకట్టిన పక్షులు |
| చట్టుపలు | = | లెక్కలు |
| జరూచ్చటాచ్ఛరిన్ | = | దట్టమగు జడల సమూహముతో |
| త్రుట్టెలు కట్టి | = | పెనవేసికొని |
| నిద్రిలు | = | నిద్రించునట్టి |
| మరుత్+భుక్+కులము | | |
| +అధీశమరుద్భుగధీకులము | = | గాలిని ఆహారముగా తీసికొను శ్రేష్ఠమైన పాములు సంతానము |
| మేల్కొనన్ | = | మేల్కొనునట్లుగా |

**తాత్పర్యము :** అయుతుని యొద్ద గల ఆవు వలన క్రుమ్మగా ఎత్తుగా పెరిగిన ఆ పుట్ట ఒక్కసారి పగిలిపోయినది. అందు తపస్సుచేసి కొంటున్న వాధూల మహర్షి చెవులలో గూళ్ళు కట్టుకున్న పక్షులు రెక్కలు విప్పి పారిపోవుటకు సిద్ధపడ్డాయి. ఆయన జడల గుంపులో గుంపులు గుంపులుగా నిద్రించే పాములు ఒక్కసారి మేల్కొన్నాయి.

| | | |
|---|---|---|
| ద్విరుక్తటకారము - ద్విః+ఉక్త+టకారము | = | రెడుసార్లు పలుకబినట అను అక్షరము (ట్ట్) |

**పుట. 52**

వైలక్షణ్యము = విలక్షణము యొక్క భావము (విశేషించి చెప్పదగిన గుణము)

## 14.5. ప్రశ్నలు - సమాధానములు :

**1. నిగమ శర్మ గుణశీలములను వివరించుము (లేదా)**
**నిగమ శర్మ కథను ఆధారముగ పుండరీకక్షేత్ర మహాత్మ్యాన్ని వివరించండి.**

జ॥ తెనాలి రామకృష్ణుని అద్భుత రసావహమైన ప్రబంధము పుండరీకక్షేత్ర మహాత్మ్యాన్ని చెప్పే స్థలమహాత్మ్యము. ఆక్షేత్ర ప్రభావము వలన జరిగిన అద్భుతములను తొమ్మిది చిన్న చిన్న కథలలో పాండురంగ మహత్మ్యము అను గ్రంథమందు వివరింపబడినది. వానిలో 'నిగమశర్మ' ఉపాఖ్యానము ఒకటి. ఇది తృతీయ శ్వాసమందు కలదు.

1. నిగమశర్మ స్వేచ్ఛా వర్తనం

2. నిగమ శర్మ వేశ్యాలంపటత్వం దొంగబుద్ధి

3. నిగమశర్మ అక్క నీతి బోధ

4. నిగమశర్మ కక్కుర్తి, కాపుస్త్రీతో కాపురం

5. మాలెతతో కాపురం, కుటుంబం మీద మమకారం

6. పుండరీక క్షేత్రంలో పుణ్యలోకాలకు చేరటం.

**H పాఠ్యభాగ సారాంశము చూడుము**

**2. అయుత నియుతోపాఖ్యానము నందలి సారాంశమేమి ? (లేదా)**
**తెనాలి రామకృష్ణుని 'అద్భుతరస పోషణము' అయుత నియుతో పాఖ్యానము ద్వారా నిరూపింపుడు. (లేదా)**
**పాండురంగ మహత్మ్యమునందలి అయుత నియుతో పాఖ్యాతము వలన తెలియ వచ్చు క్షేత్ర మహత్మ్యమేమి?**

జ॥ తెనాలి రామకృష్ణుని ఉత్కృష్ట కావ్యము పాండురంగ మహత్మ్యము. కథలలో నిగమశర్మ కథ తప్ప రసనిర్భరమైన కథలు లేవనే చెప్పాలి. కాని స్వకపోల పాలితమైన వర్ణనలతో అద్భుతరసపరిపోషణ జరిగించిన తీరు ప్రశంసార్హమైనది. తెనుగునందిలి పంచమహాకావ్యములలో స్థానము సంపాదించుకొనినది.

1. అగస్త్యుని శిష్యులలో శ్రేష్ఠమైనవారు అయుతుడు, నియతుడు

2. నియుతుడే బ్రహ్మపుత్రికలైన సావిత్రి గాయత్రీలను వివాహము చేసికొనుట

3. అయుతడు గృహస్థాశ్రమాన్ని నిరాకరించి తపస్సు చేసికొనుట

4. ఇంద్రుడు మాయాబ్రాహ్మణ వేషములో వెళ్ళి గృహస్థాశ్రమ ధర్మాల్ని బోధించి అయుతుని మార్చలేక తనవెంట తెచ్చిన కామధేనువును వదలివెళ్ళుట

5. ఆ కామధేనువు వలన అయుతునికి కలిగిన వేదన

6. వాధూలుని శాపము కప్పగా మారుట

7. అయుతుని సంసారము గృహస్థాశ్రమ ధర్మపు గొప్పతనము

8. పుండరీక మహాత్మ్యము

**3. తెనాలి రామకృష్ణుని కవితావైభవమును వర్ణింపుము.**

1. సంభాషణా నిర్వహణము

2. నుడికారపు సొంపు

3. అలంకారముల సౌభాగ్యములు

4. సందర్భానుగుణమైన కల్పనాదికములు

5. రస నిర్భరత్వము

## శైలీవైగనిగ్యము:

తెనాలి రామకృష్ణుని కవిత్వము అనితరసాధ్యమైనది సీసపద్యములలో అనేకమైన భావమును సులభతరం చేశాడు. '.........ఊదనొకొల్లుడు గాని ................ఘటింపడుగాని ............దనడుగాని............... గ్రోలడుగాని

ఒకటి చేయలేడుగాని మరొకటి చేయగలడను భావమును చెప్పిన తీరు గొప్పది.

'ఇల్లాలిన్ - ఈలలితాకరన్' , 'విత్తముల విత్తములచే' అను ప్రాసలచే పద్యరచనకు మెఱుగులు కూర్చినాడు

'చక్షూ రాజీవ యుగమ' ను సిద్ధ సమాసములోని సొగసును తెనుగునందు అంటగట్టినాడు రాక అన్న పదంలో పలికించిన శ్లేష పండితాదరం పొందింది.

'నిగమ్మశర్మ' శీలమును 'పిల్లిశీలమని' అతని చదువులు 'చిలుక పలుకులు' ని విమర్శించిన రీతి ఆయన శైలికే తురాయి యైనది.

## నుడికారపు సొంపు :

భాషా ప్రాగల్భ్యానికి, భాషలోని అందపు అయువుపట్టులన్నియు నుడికారములో ముడిపెట్టిబడినవి. 'దటిద్రొక్కియున్న' - అని అన్నప్పుడు 'అవసానదశను చెప్పకయే చెప్పుచున్నది, అగ్నిసాక్షిగా, పిల్లి శీలము, చిల్కల చదువులు, పొన్నాకుపై తేనే, తెప్పవేయక, తలగొట్టకొని, చెయిచాచు మొదలైనవి కావ్యమునందు తళుకులీనుచున్నవి.

అట్లే అయుత నియుతోపాఖ్యానము నందును నీర్వట్టు, తలల్ మాసెంగాయనన్, మొట్టోయనుగలింగంబు గట్టుట వంటివి కొల్లలుగ నున్నవి.

## అలంకారపు సౌభాగ్యాములు :

అలంకారములు సహజ సౌందర్యానికి అదనపు సొమ్ములు.

**యమకము :** 'ఇల్లాలి ఇల్లా లితాకార'
విత్తముల విత్తములచే

ఒకే విధమైన పదములు అర్థ భేదములతో ప్రయోగించుట యమకము.

ఈ 'కడజాతి నాతికి', "బుద్ధి గలంక కలంక ముక్త చంద్రాకృతి బొల్చు" "హి హీ .. మహిదేవుడు" 'రాక బోవకున్', 'పరంపర - కెంపగు' ప్రయోగములన్నియు 'యమకము'ను పోషించినది. "ఉత్తాల ఫణిభుగ్గరుత్తాల మొదలగునవి.

## శ్లేషాలంకారము :

నిగమశర్మ మరికొంత సేపటిలో భగవంతునిలో కలిసిపోవుననగా - ఆ సన్నివేశమును 'దశావతార వర్ణనము'తో పరోక్షముగా వర్ణింపబడినది. అందుకు శ్లేషాలంకారము ప్రాణవంతముగా ప్రయోగింపబడినది.

'రెప్పవేయన్' అన్నప్పుడు మత్స్యావతారము

'తలకొట్లుకొని' అన్నప్పుడు కూర్మావతారము మొదలైనవి పదయాత్ర ప్రయోగమున 'శ్లేష' అద్భుతుగా పోషించబడినది.

'మట్టిన బట్టి మండిపడి' - అను పద్యమునందలి ద్విరుక్త టకార పునరుక్తి, ఆవు చేసిన ఘోరమును, కఠినాతికఠినమైన పద ప్రయోగముతో నిరూపించాడు.

'ఉత్తాలఫణి భుగ్గరుత్తాల ...' అను పద్యమునందలి సంస్కృత సమాస రచనము ఆయనకే చెల్లినది.

**రసనిర్భరత్వము :**

నిగమశర్మ అక్రమ ప్రణయ సామ్రాజ్యమును 'పొన్నాకుపై తేనె', 'మోవి మాధ్యుర్యము' అను ఆమని (వసంత కాలపు) బుగుబుగలతో శృంగారాభాసమును వర్ణించినాడు.

పశ్చాత్తాప్త సమయమున 'ఏ ఁబరవని పావన వంశంబిచ్చికొంటె', '..కడజాతి నాతికి హిహీ మహిదేవుడు చిక్కె', అనుట యందు కరుణ రసమొల్కినది.

"ఒక యింత ఔప్పవేయక ..." అను పద్యము నందలి దశావతార వర్ణనము అద్భుత రసమునకు పెన్నిధి.

నిగమ శర్మ 'కుముదుఁడను పేర బరమేశు గొలుచుట' నిగమశర్మ పరమధామమునకు పోవుట అన్నియు చిత్రవిచిత్రములైనవి. అద్భుత రస నిర్భరమైన పాండురంగ మహాత్మ్యము రామకృష్ణుని చేతిలో అద్భుత రసప్రధానమైన నవకథా మాలికగ రూపొందినది.

ఈ విధముగ తెనాలి రామకృష్ణుడు 'యేరా తమ్ముడ !' అని ప్రేమాస్పదమైన సంభాషణముతో ప్రారంభించి, తెనుగునుడి కారపు తాలింపులతో కథలకు రుచిపెంచి, సాహిత్యపు విలువలను పెంచే శబ్దాలంకార అర్థాలంకారములతో కావ్యశోభను ఇనుమడింపజేసి, సందర్భానుసారమైన కల్పనతో, అద్భుత రసప్రధానముగ నడిపించిన 'పాండురంగ మహాత్మ్య' కర్త స్తవనీయుడు. తెనుగు సాహిత్యమున్నంత వరకు ఆయన యశఃకాయుడే.

**ముగింపు :** పుండరీక క్షేత్రం యొక్క స్థల మహాత్మ్యాన్ని నిగమశర్మ, అయన, నియతుల కథల ద్వారా తెలుసుకొన్నాం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. పాండురంగ మహాత్మ్యము - తెనాలి రామకృష్ణుడు.
2. సప్తస్వరాలు (సంక) - కె. ఈశ్వర్.

**ప్రశ్నలు :**

1. నిగమవర్మ గుణశీలములనెన్నుము.
2. అయుత నియుతోపాఖ్యాన సారాంశమేమిటి ?
3. పాఠ్యభాగమాధారంగా తెనాలి రామకృష్ణుని అద్భుత రసపోషణమును వివరించండి.

**పోలె ముత్యము,** ఎం.ఎ., ఎం.ఏ., యం.ఫిల్.,
ఆంధ్రోపన్యాసకులు,
ఆంధ్ర క్రైస్తవ కళాశాల,
గుంటూరు.

**పాఠం : 15**

# పరిచయం

(సప్తస్వరాల నుండి)

- శ్రీశ్రీ

**శీర్షికలు :**


15.0 లక్ష్యం
15.1 కవి పరిచయం (శ్రీశ్రీ మరియు గురజాడ)
15.2 పాఠ్యభాగ సందర్భం
15.3 పాఠ్యభాగ సారాంశం
15.4 కఠిన పదాలకు అర్థాలు
15.5 ప్రశ్నలు, సమాధానాలు


## 15.0. లక్ష్యం :

గురజాడ రచించిన 'ముత్యాల సరాలు' కవితా సంపుటికి ముందుమాటగా శ్రీశ్రీ 'పరిచయం' వ్యాసం రచించారు. గురజాడ రచనల్లోని సృజనాత్మకత, సామాజిక స్పృహ ఆయన్ని మహాకవిగా నిలబెట్టాయని ఖండాంతర కీర్తిని సంపాదించాయని శ్రీశ్రీ వెల్లడించారు.

## 15.1. కవి పరిచయం :

శ్రీశ్రీగా ప్రఖ్యాతి చెందిన శ్రీరంగం శ్రీనివాసరావు ఆధునిక మహాకవులలో ఒకరు. ఆయన రచించిన 'మహాప్రస్థానం' అనే ఆధునిక కావ్యసంపుటి నేటి వర్ధమానకవులకు ఆరాధ్యం, అనుసరణీయం. గురజాడ అప్పారావు 'ముత్యాలసరాలు' రాసిన సంవత్సరం బరంపురంలో సామూహిక వర్ణాంతర భోజనం ఏర్పాటు చేసిన సంవత్సరం శ్రీశ్రీ విశాఖపట్టణంలో జన్మించిన సంవత్సరం 1910 కావడం విశేషం. తొలితరం రచయితలలా శ్రీశ్రీ కూడా బాల్యంలో గ్రాంధిక పద్యాలు, నాటకాలు, అనువాదనవలల రచన చేసాడు. ఎనిమిదవ యేటనే కందపద్యం రాసి తండ్రి ఆదేశాన్ననుసరించి అప్పకవీయ, సులక్షణసారాలను అధ్యయనం చేసాడు. చిన్నవయసులోనే వీరనరసింహ విజయసింహులు అనే నవలను సావిత్రీ సత్యవంతము అనే పద్యనాటకాన్ని రచించారు. పదిహేనేళ్ళ వయసులో 'పరిణయ రహస్యం' అనే నవలను రచించారు. పదహారు ఖండికలతో 'ప్రభవ' పద్య సంపుటి ఇంటర్మీడియట్ చదువుతూ 1928లోను, సుప్తాస్థికలు పద్యరచన 1929లోను వెలువరించారు. 1931లో ఆయన బి.ఏ. పట్టా పుచ్చుకున్నారు.

బతుకుతెరువు కోసం శ్రీశ్రీ అనేక ఉద్యోగాలు చేసారు. విశాఖపట్నంలోని మిసెస్ ఎ.వి.యన్. కళాశాలలో ఒక సంవత్సరం పాటు డెమాన్‌స్ట్రేటర్‌గా, హార్బర్‌లో గుమాస్తాగా, 'విశాఖ' పత్రికలో రిపోర్టర్‌గా, 'ఆంధ్రప్రభ'లో సబ్‌ఎడిటర్‌గా, ఆకాశవాణిలో ఉద్యోగిగా, అనందవాణిలో సబ్‌ఎడిటర్‌గా చేసి చివరికి సినిమా రచయితగా స్థిరపడ్డారు.

కవితలు, కథానికలు, నాటికలు, విమర్శవ్యాసాలు, శతకాలు, గ్రంథ సమీక్షలు, ఆత్మకథ వంటి భిన్న సాహితీ ప్రక్రియల్లో రచనలు చేసారు.

ప్రభవ, మహాప్రస్థానం, మరోప్రస్థానం, మరో ప్రపంచం, చరమరాత్రి, గురజాడ, మూడు యాభైలు, ఖడ్గసృష్టి, వ్యాసక్రీడలు శ్రీశ్రీ రచనల్లో ప్రముఖమైనవి. శ్రీశ్రీ రచనల్లో మహాప్రస్థానానికి వచ్చిన ఖ్యాతి మరిదేనికి రాలేదు. ప్రస్థానం అంటే గొప్పప్రయాణం అని అర్థం. వర్గభేదాలు, దోపిడి దొంగలు గల నేటి సమాజాన్ని బాగుచేయడానికి సామ్యవాదమే సరియైన మార్గం అని శ్రీశ్రీ ప్రగాఢ విశ్వాసం. అభ్యుదయ కవులకు ఆరాధ్యుడైన శ్రీశ్రీ 1983లో పరమపదించారు.

## 15.2. పాఠ్యభాగ సందర్భం :

శ్రీశ్రీ దృష్టిలో తెలుగులో ముగ్గురు మహాకవులు ఉన్నారు. ఆదికాలంలో తిక్కన, మధ్యకాలంలో వేమన, ఆధునిక కాలంలో గురజాడ. రచనా బాహుళ్యం వల్లకాక, తెలుగుతనానికి ప్రాతినిధ్యం వహించి, తెలుగు భాషకు గల ప్రత్యేకతను ప్రదర్శించడం వల్లనే వీరు జగద్వంద్యులయ్యారు. వారిలో గురజాడ అప్పారావు కవిత్వం గురించి, మరీముఖ్యంగా 'దేశభక్తి' గీతం యొక్క ప్రాశస్త్యాన్ని గురించి ప్రస్తుత వ్యాసంలో శ్రీశ్రీ వివరించారు. ముత్యాలసరాలు గ్రంధానికి శ్రీశ్రీ 'పరిచయం' పేరుతో పీఠిక రచించాడు.

## 15.4. పాఠ్యభాగ సారాంశం :

తెలుగుసాహిత్యంలో శ్రీశ్రీకి నచ్చిన మహాకవులు ముగ్గురు. ఒకరు తిక్కన ఆయన తెలుగు సాహిత్యం ప్రారంభపు కాలం నాటివాడు. రెండవవాడు వేమన ఈయన మధ్యయుగం నాటివాడు. ఇక ఆధునిక కాలంలో శ్రీశ్రీకి నచ్చిన కవి గురజాడ అప్పారావు. ఎక్కువ సంఖ్యలో రచించడం వల్ల వీరు మహాకవులయ్యారనుకోరాదు. తెలుగు దనానికి వీరు ప్రతినిధులు. తెలుగు భాషకు గల ప్రత్యేకతను వీరు తమ రచనల ద్వారా తెలియజేసారు. అందుచేతే లోకం వీరిని గుర్తించింది నమస్కరించింది.

**నిక్కమైన మంచినీల మొక్కటిచాలు**
**తళుకుబెళుకురాలు తట్టెడేల**

అని వేమన ఒక ఆటవెలది పద్యంలో అన్నాడు. గురజాడ విషయంలో యిది పూర్తిగా సరిపోతుంది. గురజాడ కవితలన్నీ కలిపినా ఒక చిన్న పుస్తకమే అవుతుందిగాని అంతకంటే ఎక్కువ కాదు. ఆయన ఇంకా ఎక్కువ రాస్తే ఎంత గొప్ప సాహత్యసంపద మనకు లభించేదో అనిగాని మనం దిగులు పడవలసిన అవసరం లేదు. ఒకవేళ గురజాడ రాసినవన్నీ నశించిపోయి కేవలం 'దేశభక్తి' అనే గీతం ఒక్కటి మిగిలినా చాలు అతడు చాల గొప్పకవి అనీ, ప్రపంచస్థాయిలోనే లెక్కింప దగినవాడనీ చెప్పవచ్చు.

దేశభక్తి అనే గీతం సర్వప్రపంచంలోని అందరు మానవులకూ జాతీయగీతం వంటిది. శ్రీశ్రీ దృష్టిలో మన రామాయణ, భారతాలలో సమానమైన విలువ ఈ గీతానికి ఉంది. కొంతకాలానికి ఈ దేశభక్తి గీతం ఎంతగొప్పదో ఇంకాబాగా అందరికి తెలుస్తుంది. ఆధ్యాత్మిక ప్రపంచంలో భగవద్గీతకున్న స్థానం కవితా ప్రపంచంలో 'దేశభక్తి' గీతానికుంది. ఈ కవితలో సందేశం ఏదో ఒక ప్రదేశానికిగాని, ఒక కాలానికిగాని పరిమితమైనది కాదు. ఈ గీతం పావురంలాగా ప్రశాంతంగా కువకువలాడుతూ ఉంటుంది. అదే సమయంలో సింహంలాగా గర్జిస్తుంది. వేదాలు ప్రభు సమ్మితాలని, కావ్యాలు కాంతాసమ్మితాలని అంటారు. ఒకే సమయంలో ప్రభుసమ్మితంగా కాంతా సమ్మితంగా కూడా కావ్యం ద్వారా మానవత్వాన్ని ఉపదేశించే గీతం దేశభక్తి.

వేమన ఆటవెలది అనే ఛందస్సులో తాను ఇవ్వదలచుకున్న సందేశాన్ని ఇచ్చాడు. అలాగే గురజాడ 'ముత్యాలసరాలు' అనే ఛందస్సులో తన భావాల్ని వెల్లడించాడు. తన కంటే ముందు ఉన్న ఆటవెలదిని వేమన స్వీకరించి తన సొంతం చేసుకున్నట్లుగా, గురజాడ కూడ జానపద ఛందస్సును కొద్దిగా మార్చి తనది చేసుకొని 'ముత్యాలసరాలు' అని పేరుపెట్టాడు. గణఛందస్సులు ప్రాచీన రాజరిక పద్ధతికి అయితే, మాత్రాఛందస్సు ప్రజాస్వామ్యానికి గుర్తు. ఈ విధంగా కవిత్వాన్ని ప్రజలపరం చేసాడు గురజాడ అని చెప్పవచ్చు.

ఆధునిక ప్రజాస్వామ్యంలో ప్రజల్లో చైతన్యం వచ్చినా ఇంకా మూఢవిశ్వాసాలు, అంధానుకరణలు పోలేదు. అందుకే గురజాడ భావాలకు అనుకున్నంతగా గుర్తింపురాలేదు. తమిళులు సుబ్రహ్మణ్యభారతిని, మలయాళీలు వల్లథోల్, బెంగాలీలు రవీంద్రభారతిని గౌరవించినట్లుగా, గుర్తించినట్లుగా తెలుగువారు గురజాడని గుర్తించలేదు. ముఖ్యంగా 'కన్యాశుల్కం' వంటి నాటకాన్ని రచించిన గురజాడ వీళ్ళందరి కంటే ఏ మాత్రం తక్కువవాడు కాదు. చెప్పాలంటే వాళ్ళకంటే గొప్పవాడు.

ఇక 'పూర్ణమ్మకథ' అదొక ఏకాంక విషాదాంత నాటికలాగా ఉంటుంది. అలాగే 'లవణరాజు' కథ చదువుతుంటే షేక్స్పియర్ రచించిన Mid Summer Nights Dreams అనే నాటకం గుర్తుకువస్తుంది. తిక్కనకు లాగానే గురజాడది కూడ నాటకీయ కథనం. ఇద్దరూ వర్ణనలను Graphic గానూ Cinematographic గా చేసారు.

గురజాడ అభ్యుదయభావాలను గలవాడు. ఆయన తోకచుక్కను గుర్చి రాసిన కవితలో మూఢ విశ్వాసాల్ని ఖండించాడు. తోకచుక్కను సంఘసంస్కరణ ప్రయత్నానికి ఎత్తిన జెండాలాగా గురజాడ అభివర్ణించాడు. గురజాడ రచనల్లోని సృజనాత్మకత తెలుగుసాహిత్యానికి ఖండాంతరఖ్యాతి తీసుకురాగలట్టిది.

## గురజాడ అడుగుజాడ

అధునిక కవులకు గురజాడ జాడ అడుగుజాడ. ప్రాచీన కవితా దృక్పధాన్ని ఛేదించి కవితకు వాకిళ్ళు తెరచిన వైతాళికుడాయన ఆధునిక సాహిత్య వ్యాప్తికి గిడుగు రామమూర్తి పంతులుగారి వ్యావహారిక భాషోద్యమం దోహదం చేసింది. ఆ మార్గంలోనే గురజాడ అప్పారావు. 'కన్యాశుల్క' నాటాకాన్ని సంస్కరణ దృక్పధంలో వ్యావహారిక భాషలో రచించి నాటక లోకంలోనే కన్యాశుల్కాన్ని మణిపూసలా నిలిపారు.

జాతీయోద్యమ కాలంలో గురజాడ దేశభక్తి తత్పరతను ప్రబోధిస్తూ 'ముత్యాలసరాలు' రచించాడు. ఇందులో అభ్యుదయదృక్పధం, సంస్కరణ దృక్పధం, విశ్వమానవప్రేమ, వసుధైక కుటుంబవాంఛ, శాస్త్రీయదృక్పధం, మూఢవిశ్వాసనిరసన మొదలైన లక్షణాలున్నాయి. పాతకొత్తలమేలు కలయికగా 1910లో ముత్యాలసరాలు వెలువరించారు. జనసామాన్యం కోసం తేటైన సరళమైన గేయఛందస్సు ముత్యాలసరాలు. ఇందులో దేశభక్తి, కన్యక, పూర్ణమ్మ, లవణరాజుకల వంటి గొప్పకవితలున్నాయి.

బహుముఖ ప్రజ్ఞాశాలిగా కవిత్వం, నాటకం, కథానిక, శ్వాసం మొదలైన ప్రక్రియలన్నింటిని చేపట్టే సంస్కరణ దృక్పధం కోసం సద్వినియోగం చేసిన సంస్కర్త గురజాడ. ఆయన రచనలన్నింటా అభ్యుదయ భావాలు పుష్కలంగా ఉన్నాయి. సంస్కరణ దృక్పధం, దేశభక్తి, తత్పరత, శాస్త్రీయ దృక్పధం, విశ్వమానవసౌభ్రాతృత్వం, మానవతావాదం గుబాళిస్తాయి. ముఖ్యంగా ఆయనలోని జాతీయదృక్పదానికి, విశాలదృష్టికి, అభ్యుదయ కామకతకు, విశ్వమానవ సౌభ్రాతృత్వానికి స్వర్ణపతాక 'దేశభక్తి' ఖండిక. ఆచార్య సినారె అభిప్రాయ జనగణమన వంటిదన్న విషయం అక్షరసత్యం. ఇందులో ఎక్కడా ప్రత్యేకించి ఒక్క భారతదేశానికి సంబంధించి ప్రశంసలేదు. ఏదేశం వారికైనా దేశభక్తిని ప్రబోధించే విశాలదృక్పధం వుంది. అందుకే ఇది విశ్వమానవ జాతీయగీతం. ఆంగ్లంలో టెన్నిసన్ రచించిన Love than thy landఅ నే గేయ ప్రభావంతో గురజాడ ఈ గేయాన్ని రచించి ఉంటాడన్న సినారె అభిప్రాయం గమనింపదగినది. ఆధునిక సాహిత్య చరిత్రను గొప్పగా ప్రభావితం చేసి గురజాడ అజరామరుడు. సాహితీప్రియులకు ఆరాధ్యుడు.

### 15.4. కఠిన పదాలకు అర్థాలు :

| | | |
|---|---|---|
| ఆదికాలంలో | = | పూర్వకాలంలో, తెలుగుసాహిత్యం ఆరంభదినాల్లో |
| రచనాబాహుళ్యం | = | ఎక్కువరచనలు |
| జగత్+వంద్యులు | = | లోకముచే నమస్కరింపదగినవారు |
| పుష్కలం | = | అధికం |
| విస్తృతం | = | విరివిమైనది |
| విస్మరించలేదు | = | మరిచిపోలేదు |
| నిక్కమైన ... తట్టెడేల | = | నిజమైన మంచినీలం ఒక్కటైనా చాలు, రంగురాళ్ళు తట్టెడున్నా వ్యర్థమే |
| అక్షరాలా అన్వయిస్తుంది | = | సరిగ్గా సరిపోతుంది |
| అమూల్యనిధులు | = | ఖరీదు చెప్పలేనంత సంపదలు |
| ఇతిహాసాలు | = | ఇట్లు జరిగెనని చెప్పునవి (రామాయణ భారతాలు) |

| | | |
|---|---|---|
| యధార్థం | = | నిజం |
| సంతరించుకొను | = | పొందు |
| ఆధ్యాత్మిక | = | పరలోక |
| రవళించు | = | ధ్వనించు |
| క్ష్వేళాధ్వని | = | సింహగర్జన |
| స్ఫురింపజేయు | = | గుర్తుచేయు |
| ప్రభుసమ్మితం | = | రాజుగారి ఆజ్ఞ |
| కాంతాసమ్మితం | = | ప్రియురాలు చెప్పేవిధం |
| ముత్యాలసరం | = | ముత్యాలదండ (గురజాడ తన ఛందస్సుకి పెట్టినపేరు) |
| జానపద | = | గ్రామీణ |
| నామధేయం | = | పేరు |
| గణబద్ధఛందస్సు | = | గణాలకు పరిమితమయ్యే ఛందస్సు |
| ఫ్యూడలిజం | = | రాచరికం |
| మాత్రాబద్ధఛందస్సు | = | మాత్రలకు పరిమితమైన ఛందస్సు |
| గమనం | = | నడక |
| పరివర్తక | = | మార్పు |
| ప్రగతి నిరోధికతత్వం | = | ముందుకుపోవడాన్ని అడ్డగించేతత్వం |
| అలంకారప్రాయుడు | = | అలంకారంవంటివాడు |
| పరాకాష్ట | = | తుట్టతుద |
| మృత+శకటికం | = | మృచ్ఛకటికం = మట్టిబండి |
| నిస్సందేహంగా | = | అనుమానం లేకుండా |
| గ్రాఫిక్ | = | చిత్రీకరణ |
| సినిమాటోగ్రఫీ | = | సినిమా చిత్రీకరణ |
| మేలిమి | = | బంగారం |
| బెడగులు | = | అందాలు |
| పస | = | కాంతి |
| తెగులు | = | జబ్బు |
| ఇరవని | = | స్థానమని |
| పతాకం | = | జెండా |
| ప్రవచించాడు | = | బాగా చెప్పాడు |
| శుకము | = | చిలుక |
| వొట్టి శాస్త్రజ్ఞులు | = | నిరుపయోగమైన శాస్త్రజ్ఞానము గలవారు |
| ఖండాంతరఖ్యాతి | = | ఇతర ఖండాలకు పేరువ్యాపించడం |
| సృజనాసామర్థ్యం | = | కల్పనాశక్తి |
| నమోవాకాలు | = | నమస్కారాలు |

## 15.5. ప్రశ్నలు - సమాధానాలు

**1. తెలుగుభాషకు ఖండాతర ఖ్యాతి తీసుకురాగల సాహితీ స్రష్ట గురజాడ - వివరించండి. (లేదా)**
**శ్రీశ్రీ 'పరిచయం' చేసింది ఎవరిని? ఏ విధంగా పరిచయం చేసాడు? (లేదా)**
**గురజాడ రచనల్లోని వైశిష్ట్యాన్ని 'పరిచయం' వ్యాసం ఆధారంగా వివరించండి.**

జ॥ ఆకాశమార్గంలో పయనించే తెలుగుకవితా రథాన్ని భూమార్గం పట్టించి, భూకంపం పుట్టించి 'అనితరసాధ్యం నామార్గం' అని చాటిన ప్రజాకవి శ్రీశ్రీ. కలంపేరు శ్రీశ్రీ కాగా అసలు పేరు శ్రీరంగం శ్రీనివాసరావు. 'కష్టజీవి'కి ఇరువైపులా నిల్చేవాడే 'కవి' అని కొత్తనిర్వచనం ఇచ్చిన కవి శ్రీశ్రీ.

సమాజాన్ని చైతన్యపరచి, అభ్యుదయ కవిత్వానికి యుగకర్తగా వుండి, కొత్తతరానికి బాటలు వేసి, తనవాణిని జాతి జనులు పఠించే మంత్రంగా విరచించి, ప్రపంచ పీడిత జనానికి బాసటగా నిల్చి తెలుగు కవిత్వంలో నిలువెత్తు సంతకంగా నిలిచిన శ్రీశ్రీ ప్రజాకవి.

ఇటువంటి శ్రీశ్రీకి అభిమానమైన కవిత్రయం తిక్కన, వేమన, గురజాడ, ఈ ముగ్గుర్ని ఆయన మహాకవులుగా భావించాడు. గురజాడ అప్పారావు రచించిన 'ముత్యాలసరాలు' గ్రంథానికి శ్రీశ్రీ 'పరిచయం' పేరుతో పీఠిక రచించాడు.

**గురజాడ ప్రత్యేకత :** ఈ ముగ్గురిలో గురజాడ రచనలు రాశిలో తక్కువే. కానీ వేమన చెప్పినట్లు నిక్కమైన మంచి నీలమొక్కటి చాలు. గురజాడకు ఈ వాక్యం బాగా అన్వయిస్తుంది. గురజాడ ఎక్కువ గ్రంథాలు రాస్తే అమూల్యనిధి లభించేది కదా అని ఎవరూ చింతపడన్కరలేదు. ఆయన రచించిన 'దేశభక్తి' గీతం ఒక్కటి చాలు, ఆయన్ని ప్రపంచకవులలో ఒకడుగా లెక్కించదగిన మహాకవి అని ఋజువు కావటానికి.

**దేశభక్తి గీతం :** ఈ గీతం ప్రపంచ మానవుల జాతీయగీతం. రామాయణ, మహాభారతాది ఇతిహాసాలు కున్న విలువ ఈ గీతానికి ఉంది. కాలం గడిచేకొలదీ ఆ గీతానికి విలువ పెరుగుతున్నవి. ఇది ఒక కాలానికి, ప్రదేశానికి పరిమితమైనదికాదు. ప్రభుసమ్మితంగానూ, కాంతాసమ్మితంగానూ మానవతను ఉపదేశించేగీతమిది.

**ముత్యాలసరం :** గురజాడ జానపద గీతాల్లోని మాత్రా ఛందస్సును తనదిగా చేసికొని దానికి 'ముత్యాలసరం' అని పేరు పెట్టాడు. అంతకు ముందే ఉన్న ఆటవెలది ఛందస్సును వేమన సొంతం చేసుకున్నట్టు గణఛందస్సుల ఫ్యూడలిజం నుండి తెలుగు సాహిత్యాన్ని మాత్రా పద్యాలలో సంఘసంస్కరణ దృక్పధాన్ని వినిపించినట్లుగా గురజాడ ముత్యాల సరాలలో అభ్యుదయ కవితాగానం చేసాడు.

**కన్యాశుల్కం :** ప్రతిభాషవారూ ఎవరో ఒక కవిని ఆకాశానికి ఎత్తుతారు. తమిళులు సుబ్రహ్మణ్యభారతిని, మలయాళులు వల్లథోల్‌నూ, బెంగాలీలు రవీంద్రనాథ్ ఠాగూర్‌ను ప్రశంసిస్తారు. నిజానికి మహానాటకాన్ని గురజాడ రచించాడు. అదే కన్యాశుల్కం. శూద్రకుడు రచించిన మృచ్ఛ కటికం నాటకంలోని వసంతసేన పాత్రకంటే గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకంలోని మధురవాణి ఇంకా గొప్పది. రవీంద్రుని నాటకాలు కవిత్వ రూపకాలు. కాళిదాసు కవిత్వంతో నిండిన నాటకాలు రచించాడు. గురజాడ 'కన్యాశుల్కం' గూడ జీవితంలోంచి పుట్టుకొచ్చిన కవిత్వంతో కూడిన నాటకమే.

**పూర్ణమ్మ :** పూర్ణమ్మ కధ ఏకాంక విషాదాంత నాటికలాగా అనిపిస్తుంది. దీనిలో ఉండే బాధ తీవ్రత వలన కన్నుల వెంట నీరు వస్తాయి. ఇక్కడే గురజాడకీ, తిక్కనకీ సమాన ధర్మం కనిపిస్తుంది. ఇదే నాటకీయ కథనం. ఇద్దరూ సంఘటనలను Graphic గా Cinematographic గా చిత్రిస్తారు.

చివరి ఈ చరణాలు చదవగానే ఒక మహాకావ్యాన్ని చదివిన అనుభూతి కలుగుతుంది.

**'కన్నుల కాంతులు కలువలు చేరెను**
**మేలిమి చేరెను మేలిపసల్**
**హంసల జేరెను నడకల బెడగులు**
**దుర్గను చేరెను పూర్ణమ్మ'**

**ప్రగతిశీల దృక్పథం :** గురజాడది సంపూర్ణమైన ప్రగతిశీల దృక్పథం. తోకచుక్క అరిష్టదాయకమనే మూఢ విశ్వాసాన్ని ఖండించాడు.

**దూరబంధువు ఇతడు భూమికి**
**దారిపోవుచు చూడవచ్చెను**
**తెగుల కిరవని కతల పన్నుచు**
**దిగులు చెందుటదేటి కార్యము**
**తలతు నేనిది సంఘసంస్కర**
**ణ ప్రయాణ పతాకగాన్**

దీనివలన గురజాడ అభ్యుదయ దృక్పథం స్పష్టం అవుతుంది. గాంధీ హరిజనోద్యమాన్ని ప్రారంభించక ముందే గురజాడ యిలా ప్రవచించాడు.

**మంచిచెడ్డలు మనుజులందున**
**యెంచిచూడగ రెండె కులములు**
**మంచియన్నది మాలయైతే**
**మాల నేనగుదున్**

వాస్తవికతకు నివాళులెత్తిన గురజాడ ఇలా అంటాడు.

**పుస్తకంబులలోని మాటలు**
**విస్తరించుచు నను భవమ్ముల**
**తత్వమెరుగక శుకములగుదురు**
**వొట్టి శాస్త్రజ్ఞుల్**

ఒక్క కవితలోనే కాదు తన సకల రచనలలో కూడ గురజాడ అవలంభించిన పద్ధతి ఇదే.

తెలుగ భాషకు ఖండాతర ఖ్యాతి తీసుకురాగల సృజనా సామర్థ్యం ప్రదర్శించే మహాకవిగా గురజాడకి శ్రీశ్రీ నమోవాకాలు అర్పిస్తున్నాడు ఈ వ్యాసంలో.

**ముగింపు :** గురజాడ గొప్పదనాన్ని తెలుగు భాషా సాహిత్యంలో వారికున్న స్థానాన్ని శ్రీశ్రీ వ్యక్తీకరించిన విధానాన్ని తెలుసుకున్నాం.

**ఉపయుక్త గ్రంథాలు :**


1. పూర్ణమ్మ - గురజాడ
2. దేశభక్తి - గురజాడ
3. సప్తస్వరాలు - (సంక) కె. ఈశ్వర్



**డాక్టర్ సిహెచ్. సుశీలమ్మ**
రీడర్, తెలుగుశాఖ
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
గుంటూరు.

**పాఠం - 16**

## ఛందస్సు

# దశవిధయతులు, షడ్విధ ప్రాసలు

**శీర్షికలు :**

16.0 లక్ష్యము

16.1 యతి

16.2 ప్రాసము

## 16.0 లక్ష్యం :

యతి, ప్రాసముల గురించి వివరించుటయే ఈ పాఠం ప్రధానాంశం.

## 16.1 యతి :

'యతి' యను శబ్దము సంస్కృతము. యతి యను శబ్దము విరతి, విశ్రాంతి, విరామ మను పేర్లతో సంస్కృతము నందును, వడి, వళి అని తెలుగునందును పిలువబడుచున్నది. యతి శబ్దమునకు విచ్ఛేదమని యర్థము. విచ్ఛేదమన పదచ్ఛేదమని యర్థము గ్రహింపవలెను. పద్యము యొక్క ప్రతి పాదములోను యతిస్థానముండును. ఆచోట పదచ్ఛేదము కావలెను. అనగా ఏక శబ్దము ప్రయుక్తము కారాదని సంస్కృత ఛందోనియమము. సంస్కృతమున ప్రాసనియమము అసలే లేదు. సోదర భాషలైన అరవ, కన్నడములందు ప్రస్ఫుటముగ యతి, ప్రాసలు లేవు. అరవమున యతి ఉన్నది కాని విస్పష్టముగ కనిపించదు. కన్నడమున ప్రాస స్పష్టమే కాని యతి అనుమానమే. అయితే తెలుగున నన్నయ మాత్రము అరవము నందలి యతిని, కన్నడము నందలి ప్రాసను గ్రహించి మెరుగులు దిద్ది మహోన్నతస్థితికి చేర్చినాడు. యతి, విశ్రాంతి, విరతి మొదలైన సంస్కృత పదముల కంటె 'వడి' 'వళి' అను తెలుగు పదములు మన 'యతి' స్వరూప స్వభావములను పట్టి చూపగలవు. వేగము, మడత అను అర్థముగల ఈ రెండు పదములు తెలుగులోని యతి యొక్క వేగమును, మలుపును గుర్తుచేయుచున్నవి. తెలుగులో పద మధ్య యతి గొప్పది.

**ఉదా :** కాదనకిట్టిపాటి యపకారము - ముందుగా నియత స్థానములో వచ్చిన అక్షరమే వచ్చుట యతిగా చెప్పిరి. అయితే వివిధ కారణముల వలన ఆ అక్షరమునకు సజాతీయ సమాన సాదృశ్య వర్ణములను వాడుట జరిగినది. ఇందుకు ఎన్నో కారణములు. ఏకస్థాన జన్యత అనునది ముఖ్య కారణము, తద్భవ వ్యాజ మనునది మరియొక ముఖ్య కారణము, వ్రాత క్రమము కూడ మరియొక హేతువే. ఇట్టి హేతువులు మరికొన్ని కలసి యతి ప్రపంచమును అనంతముగ పెంచినవి. అప్ప కవి కొన్నిటిని తీసివేసి 41 యతులను నిర్వచించినాడు. ముఖ్యముగా స్వరయతులు, వ్యంజనయతులు, ఉభయయతులు అని చెప్పవచ్చును. ఖండము, అఖండము కూడా యతులు పెరుగుటకు కొంత దోహదపడినవి. ఎక్కువగా సంధిలో సాధారణ నియమములను దాటుట వలన ఎన్నో అఖండయతులు ఏర్పడినవి. ఒక రకముగా చూచినచో వృద్ధియతి కూడా ఇట్టిదే. అఖండ అనంత వాఙ్మయమున ఇట్టి విస్తరణ అనివార్యమనియే చెప్పవచ్చును.

### 1. స్వరయతి :

స్వరమనగా అచ్చు. 'అ' కారమునుండి 'ఔ' కారము వరకు గల అచ్చులలో ఏయే అచ్చులు పరస్పరము యతి చెల్లునో

ఈ స్వరయతిలో నిరూపింపబడును.

(1) అ, ఆ - ఐ, ఔ లు
(2) ఇ, ఈ - ఎ, ఏ లు
(3) ఉ, ఊ - ఒ, ఓ లు

ఈ అక్షరములు పరస్పరము ఒకదానితో ఒకటి యతి చెల్లగలవు.

తెలుగులో అయిన - ఐన
అయిదు - ఐదు
అవుర - ఔర
అవును - ఔను

అని కూడా వ్రాయ వచ్చును. ఇట్లే 'ఐ - ఔ' ల లో "అయి - అవు" అను నుచ్ఛారణ యుండుట చేతను వీనికి అకారముతో మైత్రి ఏర్పడినది.

ఇక 'ఇ - ఈ' లు 'ఎ - ఏ' లతో యతి చెందుట కూడా సంధ్యక్షర సామ్యము వలననే జరుగును. 'ఋ' కారము అక్కడక్కడ 'ఎ' కారముగ మారుట తద్భవములందు కనిపించును. ఉదా:- మృగము - మెకము మొదలైనవి. అందుచేత 'ఇ - ఈ' లతో 'ఋ - ఋా' లు యతి చెల్లుటలు ఇబ్బంది లేదు. ఆ + ఉ = ఇ గ మారును. అందుచేత 'ఒ - ఓ' లతో 'ఉ - ఊ' లు యతి చెల్లవచ్చును. ఉదా:- నయ+ఉన్నత = నయోన్నత ఇట్లు స్వరమునకు స్వరములో నున్న యతి యగుటచే దీనికి స్వరయతి అను పేరు సార్థకమగుచున్నది.

## 2. వర్గయతి :

క వర్గ, చ వర్గ, ట వర్గ, త వర్గ, ప వర్గ ఈ అయిదు వర్గల యందు అనునాసికాక్షరములను విడచి మొదటి నాల్గక్షరములు పరస్పరము యతి చెల్లుటను వర్గయతి యందురు. అనగా ఆయా వర్గలలోని అనునాసికాక్షరములు తక్కిన నాల్గక్షరములవలె సమానోత్పత్తి స్థానము కలవయ్యును. నాసికోచ్ఛారణము అధికముగా నుండుటచే తొలి నాల్గక్షరములతో యతి చెల్లదు.

ఉదా:- కందిమధ్యగేహ+ఖండితారిసమాహ
ఖంజనాభదేహ+గానమోహ
గరుడ పక్షివాహ+ఘనవాహజస్నేహ -

ఇట్లే తక్కిన వర్గాక్షరముల కుదాహరణము లరయునది.

## 3. అఖండయతి :

సర్వ సాధారణముగ సంధిస్థానమును విడదీసి పరపదము యొక్క ఆది వర్ణమునకే యతి వేయుట సంప్రదాయము. ఇది స్వరప్రధానవళి లక్షణము. ఇందుకు భిన్నముగా అఖండయతి నిలుచుచున్నది. ఒక్కొచో విడగొట్టక అఖండముగా నున్న ఆ సంధ్యక్షరమునకు కూడ యతి వేయుటను అఖండయతి యందురు.

ఉదా:- రామాలయము అను ఈ ఉదారహణము నందు 'మా' అను వర్ణము సంధిలో సిద్ధించిన అక్షరము అగుట వలన విడదీసి మాత్రమే యతి వేయుట సామాన్య నియమము అనగా 'రామ+ఆలయము' అని విడగొట్టి 'ఆ' కారమునకు మాత్రమే యతి వేయవలసి యున్నది. ఇందుకు భిన్నముగ అఖండయతిలో 'మా' మొత్తమునకు యతి వేయుట గలదు. అఖండమునకు యతి వేయుట వలన దీనికీ పేరు వచ్చినది.

ఉదా:- ఇది పెనుఁబాము చందమున ..........
తుదినొక చోట వైచుట య+థోచిత కార్యము అయ్యెడున్గదా

యథ+ఉచిత - ఇది సాధారణ నియమము

అసాధారణ నియమము ప్రకారము తు - థో కి యతి వేయుట.

## 4. ప్రాదియతి :

ప్ర, పర, అప, సం, అను, సు, ప్రతి, అపి, నిర్, దుర్, అధి, ని, ఉప, అభి, ఉత్, ఆ, వి, అతి, అవ, పరి - అను ఈ ఇరవదింటిని ఉపసర్గలని యందురు. 'ప్ర' ఆదిగాగలవి కావున వీటిని ప్రాదులనుచున్నారు. ప్రాదులకు (ఉపసర్గలకు) అచ్చుతో సంధి జరిగిన సిద్ధించు రూపములకు యతిని రెండు విధములుగ వేయవచ్చును. దీనిని ప్రాదియతి యందురు.

ఉదా:- సమంచిత (సమ్+అంచిత) అను చోట 'మ' కారమునకు గాని 'అ' కారమునకు గాని యతి చెల్లును.

సూక్తి (సు+ఉక్తి) ఆద్యక్షరమునకు 'సు' తో గాని 'ఉ' కార స్వరముతో గాని యతి నిలుపవచ్చు. ఇట్లే మిగిలిన ఉపసర్గలకును అరయునది.

## 5. బిందుయతి :

వర్గయతిలో ఆయా వర్గల యొక్క తొలి నాల్గక్షరములు ఆ వర్గ తుది యనునాసికముతో యతి చెల్లవని చెప్పబడెను. కాని ఆయా వర్గాక్షరములు పూర్ణబిందు పూర్వకమైన యెడల ఆ వర్గ అనునాసికాక్షరముతో యతి చెల్లునని బిందు యతి నిరూపించుచున్నది. బిందువు వలననే యతి యగుట వలన దీనిని బిందుయతి యని యందురు.

ఉదా:- నందనోద్యాన మం+దారకేచ్ఛాయల
మణిమయ స్తంభ శుంభద్దీప కళికలు

## 6. ప్లుతయతి :

అచ్చులకు హ్రస్వ, దీర్ఘ, ప్లుత భేదము లుండును. ఏకమాత్రా కాలికము హ్రస్వము కాగా, ద్విమాత్రా కాలికము దీర్ఘమగును, త్రిమాత్రా కాలికమును ప్లుతమందురు. ప్లుతాంత మందున్న పదములను విడగొట్టి ఆ ప్లుతాక్షరములకే యతి వేయుటను ప్లుతయతి యందురు.

ఉదా:- నీవేగతి కావవే రఘుప+తీ శరణాగత వజ్ర పంజరా!

'వే-తీ' యతి నుదజాలవు. ఇచ్చట (నీవు+ఏ) నీవే అనుచోట 'ఏ' కారము ప్లుతమై యున్నది. (రఘుపతి+ఈ) రఘుపతీ అనుచోట 'ఈ' కారము ప్లుతమై యున్నది. రెండు ప్లుతములను విడదీసి యతి వేయుట జరిగినది.

## 7. సంయుక్తాక్షరయతి :

భిన్న హల్లుల కలయికను సంయుక్తమందురు. క్ష, జ్ఞ, ర్త, స్త్ర, ర్జ్య, ర్త్స్య - మొ॥. సంయుక్తాక్షరము నందలి ఏ ఒక్క హల్లునకైనను యతిని వేయవచ్చును. అనగా భిన్న హల్లులను వేరుచేసి యతి వేయుటకు వీలున్నది కావున అన్ని హల్లులకును యతి వేయ పనిలేదు.

ఉదా:- క్ష్మాధరం బాతపత్రంబు+గా ధరించె - క - గ

క్ష్మాకుమారుని బోరను+సంహరించె - ష - స

క్ష్మారుహంబునకై నివిం+పపతి నొంచె - మ - ప

పైన ఒక్కొక్క పాదమున ఒక్కొక్క హల్లునకు యతి గూర్చబడినది. సంయుక్తాక్షరము పాదాదియందు గాని యతి స్థానమందు గాని యుండవచ్చు.

## 8. ఎక్కటియతి :

ఎక్కటియతినే ఏకతరయతి అని కూడా పిలుతురు. ఎక్కటి యనగా అసహాయము, అద్వితీయము, ప్రత్యేకము, పరాపేక్షలేనిది, రెండవ దానితో కలియనిది, ఏ యక్షరమున కాయక్షరమే మైత్రిగలది ఎక్కటియతి.

ఉదా:- 'ర - ఱ' లను గ్రహింపవచ్చును. ర-ఱ లు సవర్ణములయ్యును వీనికి యతి మైత్రి నిషిద్ధము. రేఫతో రేఫే యతి చెందగలవు.

"ల-డ" ల మైత్రి కూడా కొందరు ఒప్పుకొనలేదు. కావున వీటిని గూడా ఎక్కటియతిలో చేర్పవచ్చును.

ఉదా:- రాజ కులైక భూషణుడు రాజ మనోహరుండు అన్య రాజతే చంద్రికా

..................................

రాజిత సర్వలోకు డపరాజిత భూరి భుజా కృపాణధా

రాజు శాంత శాత్రవ పరాగడు రాజ మహేంద్రు డున్నతిన్

## 9. పోలికయతి :

సంస్కృతమున ఉపమానములైన అజంత, హలంత, కర్మవాచక, పదములకు కర్త్రర్థకమున వర్తమాన, భూత, భవిష్యత్కాల, భావార్థములందు ఆచారార్థమున క్రమముగా యమాన, యిత, యిష్యమాణ, యితప్రత్యయములు వికల్పముగా వచ్చును. ఈ ప్రత్యయములు వచ్చినపుడు పూర్వాచ్చునకు దీర్ఘము కూడ వచ్చును. వీటిని క్యాఙంత శబ్దములు అందురు.

ఉదా:- కుమారాయిత, భద్రాయిత మొ॥ పదములను గ్రహింపవచ్చును. ఇటువంటి ఉదాహరణములందు భద్ర +యిత, కుమార+యిత అని విడగొట్ట వలయునే గాని భద్ర+ఆయిత, కుమార+ఆయిత అని విడగొట్టరాదు. అది సంధి వలన వచ్చిన దీర్ఘము కాదు. అందుచేత ఇచ్చట అఖండమునకే యతి వేయవలెను. నన్నయ, తిక్కనలు వ్యంజన మైత్రియే పాటించిరి.

(ఎ) కుమా।రాయిత శక్తిశాలి ధృత+రాష్ట్రుడు రాజ్యము సేయుచుండె

(బి) భ।ద్రాయిత మూర్తియై హరిహ+రంబగు రూపము దాల్చి

పై ఉదాహరణములందు పోలిక ఎట్లన (ఎ) కుమారునితో సమానమైన శక్తి కలవాడని (బి) భద్రాయిత మంగళమే స్వభావముగా కలవాడని చెప్పుటలో కలదు. కావున పోలికయతి యని చెప్పవచ్చును.

## 10. సరసయతి :

ఇందు మూడు వర్గములు కలవు.

(ఎ) అ-య-హ - లు పరస్పరము

(బి) చ-ఛ-జ-ఝ-శ-ష-స - లు పరస్పరము

(సి) న-ణ - లు పరస్పరము

మిత్రాక్షరములుగ యతి చెల్లును.

(ఎ) అత్తునకు సంధి రానిచో యడాగమము వచ్చి మేన+అత్త = మేనయత్త యని యడాగమము, హంస-అంచ ఇత్యాదులలో వికృతిలో 'హ' కారము 'అ' కారమగును, గనుక 'అ-య-హ' లు పరస్పరము యతి చెల్లును. ఇట్లే యాగము - ఆగము ను గ్రహించవలెను.

(బి) శంక - జంకు, హంస - అంచ, కలుష - కలుచ మొదలగు వైకృత రూపభేదముల ననుసరించి చ వర్గ - శ వర్గలకు యతి మైత్రి చెల్లును.

| | | | | |
|---|---|---|---|---|
| (సి) | నార+అయన | - | నారాయణ | ఇత్యాది శబ్ద సంధులందును 'న' కారము 'ణ' త్వముగ మార్పుచెందును. కావున 'న-ణ' లు పరస్పరము యతి చెందును. |
| | త్రి+నయన | - | త్రిణయన | |
| | ప్ర+అన | - | ప్రాణ | |
| | గుణము | - | గొనము | |
| | రామ+ఇన | - | రామేణ | |

## 16.2 ప్రాసము :

తెలుగు పద్యములందు ప్రతిపాద ద్వితీయాక్షరము ప్రాసమని వ్యవహరింపబడును. ప్రాసలో హల్లునకే మైత్రి చెల్లును. యతిలో వలె హల్లు మీది స్వరమైత్రి యపేక్షితము కాదు. అనగా యతిలో స్వర వ్యంజనములు రెండు ప్రధానములు. ప్రాసలో వ్యంజనమే ప్రధానము. ప్రాసములోనే హల్లున కాహల్లే సాధారణముగా జెల్లును. యతిలో వలె సవర్గములు (క - ఖ - గ - ఘ ఇత్యాదులు) చెల్లవు. ప్రాస స్థానములో ద్విత్వము, సంయుక్తము, పూర్ణబిందు పూర్వకము, విసర్గ పూర్వకము అగు నక్షర యొక్క పాదములో నున్న యెడల మిగిలిన మూడు పాదములందు నట్లె యుండవలెను. నిండు సున్న ముందున్న అన్ని పాదములందట్లే యుండవలయును కాని అరసున్నకీ నియమము లేదు. ప్రాస పూర్వాక్షరము తొలి పాదమున గురువైనచో అన్నిట గురువే యుండవలయును. తొలి పాదమున లఘువు మొదట నున్నచో నన్నిట లఘువే యుండవలయును.

ప్రాస భేదములు - (1) సుకరప్రాసము (2) అనుప్రాసము (3) దుష్కరప్రాసము (4) అంత్యప్రాసము (5) ద్విప్రాసము (6) త్రిపాసమని ప్రాసలు ఆరు విధములుగా నుండును.

### (1) సుకరప్రాసము :

సుకరప్రాసమనగ సమప్రాసమని కూడ చెప్పవచ్చును. సాధారణముగ నాలుగు పాదములందు సమాక్షరములు వచ్చినచో అది సమప్రాసమని లేక సుకరప్రాసమని పిలువబడును. అనగా అరసున్న ఉన్నచో అరసున్న, నిండు సున్న ఉన్నచో నిండు సున్న, ద్విత్వమున్నచో ద్విత్వము, సంయుక్తమున్నచో సంయుక్తము సాధారణముగ వచ్చినచో సుకరప్రాసమని చెప్పనొప్పును.

ఉదా:- (ఎ) ఇందుగలడందు లేడని, సందేహము వలదు చక్రి

(బి) ప్రహ్లాద వరదుఁగొల్వగ । నాహ్లాదము మానసంబునందు జనించున్

(సి) సూక్ష్మముగాఁదలంచిన ... లక్ష్మియుఁబ్రాణమున్ సరియె

### (2) దుష్కరప్రాసము :

దుష్కర ప్రాసమనగ కష్టసాధ్యమైన ప్రాసమనియర్థము. ప్రాసాక్షరముగ విశిష్ట సంయుక్తాక్షరములు నిలిపి వ్రాసినచో దుష్కరప్రాసమగును.

ఉదా:- ప్రా గ్జ్యాన్యితిషంబు గడిసిస । దృగ్జ్యాటంకృతులు.... దృగ్జ్యాత్న్ను ......
దంష్ట్రీ శరీర మాధవ, దంష్ట్రభానవ .......

## (3) అనుప్రాసము :

ఇది ఒకరకముగా అలంకారమనియే చెప్పవచ్చును. ఏదేని ఒక పద్యములో ఒక అక్షరముగాని రెండక్షరములు గాని వెంటవెంటనే పునరావృత మగుటను అనుప్రాసమని చెప్పవచ్చును. ఇది ఎక్కువగా చిత్రకవిత్వమున లభ్యమగును. భాగవతమున పోతనామాత్యుడు కూడ అనుప్రాసములను ఎక్కువగానే వాడినాడు. నన్నయభట్టు మాత్రము అక్షర రమ్యతనే సాధించినాడు. అక్షరరమ్యత ఒకింత ఎక్కువైనచో అనుప్రాసమగును.

ఉదా:- (ఏ) బహుభాషల బహువిధముల బహుజనముల వలన వినుచు
బహు యాగంబుల ఫలంబు పరమార్థమిలన్
(బి) భారత భారతీ సుభగభస్తి ...........

## (4) అంత్యప్రాసము :

పద్యమునందు పాదాంతమున వచ్చిన వర్ణములే నాల్గు పాదముల యందును వచ్చిన యెడల అంత్యానుప్రాస మందురు. ఇది ఎక్కువగా నేటి ఆధునిక గేయ కవిత్వమున కనిపించును.

ఉదా:- ధర్మ తత్వఘ్నులు ధర్మశాస్త్రంబని, ఆధ్యాత్మవిధులు వేదాంతమని
నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబని, కవి వృషభుల్ మహా కావ్యమని

## (5) ద్విప్రాసము :

ప్రతి పాదమునందును రెండవ అక్షరము, మూడవ అక్షరము నియతముగ ప్రాస లక్షణములను కలిగి యుండుటను ద్విప్రాసమందురు.

ఉదా:- దోసంబు లేక వస్తుని
వాసంబై వెలయ । జెప్ప వలయును ద్వంద్వ
ప్రాసం బుచితాక్షరవి
న్యాసంబుగఁ గృతుల రేచ - నయ తత్వనిధీ!

మీది పద్యము ప్రాస స్థానమునందు సం అను అక్షరముతో పాటుగ 'బ' వర్ణము కూడ నున్నది. అనగా ప్రాసస్థానము నుండి రెండక్షరములు పాదమున సమానములై వ్యవహరించు చున్నవి. ప్రాసమున వ్యంజనము ప్రధానము, స్వర మప్రధానము అనగా మారుచుండ వచ్చును. కావుననే మూడు పాదములందు 'సంబు' అని యుండి ద్వితీయ పాదమున 'సంబై' అని స్వరము మారినప్పటికి ద్విప్రాసమున కుదాహరణముగ గ్రహింపబడినది.

## (6) త్రిప్రాసము :

పద్యము నందలి ప్రతి పాదములు రెండవ అక్షరము, మూడవ యక్షరము, నాల్గవ యక్షరము నియతముగ వచ్చుటను త్రిప్రాస యందురు.

ఉదా:- దానమున సత్యమున నభి
మానమునం బోల్పనీ స-మానము ధరణిం
గానమనం ద్రిప్రాసము
దానమనోహర మగును బు-ధ స్తుత చరితా!

మీది పద్యమున ప్రాసమునందు వరుసగా నమున, నమునం, నమనం, నమనో - అని యుండి మూడక్షరములు సామ్యమును చూపుచున్నవి. కావున దీనిని త్రిప్రాసమని యందురు.

## ముగింపు :

యతులలోని రకాలు గురించి, ప్రాస భేదాలను గురించి ఈ పాఠం ద్వారా తెలుసుకున్నాం.

## ఉపయుక్త గ్రంథాలు :

1. అప్పకవీయము
2. ఆంధ్ర చంద్రాలోకము

పి. ఆనందయ్య
లెక్చరర్ - తెలుగు శాఖ
q.† Ç !P ~Ÿ& ఎన్.వి.ఆర్. కళాశాల
తెనాలి.

**పాఠం : 17**

# అలంకారములు

**శీర్షికలు :**

17.0 లక్ష్యం

17.1 శబ్దాలంకారములు

17.2 అలంకారములు

## 17.0. లక్ష్యం :

కావ్యానికి శోభ నిచ్చేవి అలంకారములు. ఇవి పద్యం యొక్క అర్థాన్ని ఆశ్రయించు కొని వుంటాయి. అలంకరించేది అలంకారం. ఇవి రెండు విధాలు.

1. **శబ్దాలంకారాలు :** శబ్దాన్ని అనుసరించి ప్రయోగింపబడేవి.
2. **అర్థాలంకారాలు :** అర్థాన్ని అనుసరించి ప్రయోగింపబడేవి.

   అర్థంతో కూడిన చమత్కారం కలిగిన అలంకారాలు.

కావ్య సంబంధమైన అలంకారాలను గురించి "అలంక్రియతే అనేన ఇత్యలంకార" అని సౌందర్య మలంకారం అని లాక్షణికులు వివరించారు.

1. **శబ్దాలంకారాలు :** ఛేకానుప్రాస, వృత్త్యానుప్రాస, యమకము, అనుప్రాస, ముక్తపదగ్రస్తం మొదలైనవి.
2. **అర్థాలంకారాలు :** (1) ఉపమ, (2) ఉత్ప్రేక్ష, (3) రూపక, (4) అర్థాంతరన్యాస, (5) అతిశయోక్తి, (6) దృష్టాంత, (7) ఉల్లేఖ, (8) శ్లేష మొదలగునవి

## 17.1. శబ్దాలంకారాలు :

1. **అనుప్రాస అలంకారము :** అనుప్రాసాలంకారము (1) ఛేకాను ప్రాస, (2) వృత్యను ప్రాస, (3) లాటాను ప్రాస, (4) అంత్యాను ప్రాస అని నాల్గు విధాలు.

1. **ఛేకాను ప్రాసాలంకారము :** వ్యవధానం లేకుండా అర్థ భేదంగల రెండేసి హల్లుల జంటలు ప్రయోగింపబడతాయి.

   **సంస్కృత లక్షణం :**"భవే దవ్య వధానేన ద్వయోర్వ్యంజన యుగ్మయోః
   ఆవృత్తిర్వ్యచుద్రై, ఛేకాను ప్రాస ఇష్యతే"

   **ఉదా :** కందర్ప దర్పదములగు
   సుందర దరహాస రుచుల సుందరి యందం
   బందం గూరగ శంకర
   వందారు దారు విశ్వవరు నర్చించెన్

   **సమన్వయం :** ఇందులో దర్ప, దర్ప దారు, దారు అనే హల్లుల జంటలు వ్యవధానం లేకుండా వెంట వెంటను వచ్చాయి కాబట్టి ఛేకాను ప్రాసాలంకారం అయింది.

2. **వృత్త్యను ప్రాసాలంకారము : సంస్కృత లక్షణం :** ఏక ద్వి ప్రభృతీవాంతు వ్యంజనానాంయధాభవేత్ పునరుక్తిరసా నామ వృత్త్యను ప్రాస ఇష్యతే. ఒకటి గాని రెండు లేక మూడు హల్లులు మరల మరల రావడమే వృత్త్యను ప్రాస.

హరి హరి సిరి యురమున గల
హరి హరి హయి కొరకు దనుజ నడుగం జనియెన్

**సమన్వయం :** ఇందు 'ర' కారము అనేక సార్లు రావడం చేత వృత్త్యను ప్రాస అలంకారం అయింది.

3. **లాటాను ప్రాసాలంకారము :** ఒకే పదము అర్థ భేదం లేకుండా తాత్పర్య భేదంతో అనేకమార్లు ప్రయోగింపబడుట లాటాను ప్రాసము.

**ఉదా :** కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాధు వర్ణించు జిహ్వ జిహ్వ

**సమన్వయం :** కరములు - చేతులు        కరములు - చేతులు
జిహ్వ - నాలుక        జిహ్వ - శ్రేష్టమైన నాలుక

దీని తాత్పర్యం విష్ణువును పూజించు చేతులు శ్రేష్టమైన చేతులని, ఆయనను వర్ణించని నాలుక శ్రేష్టమైన నాలుక కాదని. అర్థం ఒకటే అయితే తాత్పర్యం చెప్పేటప్పుడు విశేషంగా చెప్పడం వల్ల లాటాను ప్రాస అయింది.

4. **అంత్యాను ప్రాసాలంకారము :** అన్ని పాదాల అంతమందు శబ్దార్ధముతో సంబంధం లేక కేవలం అంత్యాక్షరాలు సమానంగా లయబద్ధంగా ఉండుట అంత్యాను ప్రాస అలంకారము.

**ఉదా :** సుదతీ నూతన మదనా
మదనాగ తురంగ పూర్ణ మణమయ సదనా

ఇందు పాదాంతమందు మదనా, సదనా అను వర్ణాలు సమానంగా ప్రయోగించినందువల్ల అంత్యానుప్రాస అయింది.

**ఉదా :** చదువురాని మొద్దు
వద్దు మనకు వద్దు
కదల లేని ఎద్దు
వద్దు రైతు కొద్దు

**సమన్వయం :** ఈ గేయంలో అన్ని పదాల చివర 'ద్దు' వచ్చింది. కాబట్టి ఇది అంత్యాను ప్రాసాలంకారం అయింది.

5. **యమకము :** అర్థ భేదముగల పదములను మరల మరల ప్రయోగించుట.

**ఉదా :** లేమా ! దనుజుల గెలువంగ లేమా
లేమా - స్త్రీని పిలుచుట
గెలువంగలేమా - జయించగలం

**సమన్వయం :** ఇందులో పదం ఒక్కటే అయినా అర్థం మాత్రం వేరుగా వుంది. వేరు వేరు అర్థాలు కల ఒక పదాన్ని మరల మరల ప్రయోగించటం వల్ల యమకాలంకారం అయింది.

## 17.2. అర్థాలంకారాలు :

### I. 1. (అ) ఉపమాలంకారము :

**సంస్కృత లక్షణం :** ఉపమాయత్ర సాదృశ్య లక్ష్మీరుల్ల సతీద్వయోః
హంసీవ కృష్ణా తే కీర్తి స్వర్గంగా మనగాహతే

**ఆంధ్ర చంద్రాలోకం :** వర్ణ్యముపనూన ముపనూన వాచకము స
మాన ధర్మము సంఘటింప నగు - నుపమ
హంసి నీచందాన నీకీర్తి యబ్జనాభ
యభ్ర గంగావ గాహనం బాచరించు

ఉపమానమునకు ఉపమేయమునకు సామ్యరూపమైన సౌందర్యము సహృదయ రంజకముగా వర్ణించి చెప్పిన ఉపమాలంకారం. ఇందులో ఉపమానం, ఉపమేయం, ఉపమావాచకం, సమాన ధర్మం అనే నాలుగు భాగాలుంటాయి.

1. ఉపమేయం - పోల్చే వస్తువు - ముఖము, కన్నులు మొదలగునవి.
2. ఉపమానం - పోలికకు తెచ్చే వస్తువు - చంద్రుడు, పద్మము మొదలగునవి.
3. ఉపమావాచకం - పోలికను చెప్పు శబ్దము - వలెన్, పోలెన్, కైవడి, భంగిన్ మొదలగునవి.
4. సమాన ధర్మం - పోల్చుటకు ఆధారమైన ధర్మము - ఉన్నది.

**ఉదా :** ఓ రాజా నీ కీర్తి హంసవలె ఆకాశ గంగలో మునుగుచున్నది.

| | | |
|---|---|---|
| ఉపమేయం | - | కీర్తి |
| ఉపమానం | - | హంస |
| ఉపమావాచకం | - | వలె |
| సమానధర్మం | - | మునుగుట |

**సమన్వయం :** రాజు యొక్క కీర్తిని హంసతో పోల్చి చెప్పటం వల్ల ఉపమాలంకారం అయింది.

**(ఆ) లుప్తోలంకారము :** పూర్ణోపమాలంకరాము నందుండు విషయాలైన ఉపమేయం, ఉపమాన, ఉపమావాచక, సమాన ధర్మాలలో ఒకటిగాని రెండు లేక మూడు గానీ లోపించి నట్లైతే అది లుప్తోపమ అలంకారం అవుతుంది. ఇది 8 విధాలు.

1. వాచకలుప్త : ఉపమా వాచకం లోపించి మిగిలిన లక్షణాలు ఉన్న అలంకారం.
2. ధర్మలుప్త : సమాన ధర్మము లోపించిన అలంకారము.
3. ధర్మవాచక లుప్తు : సమాన ధర్మము, ఉపమా వాచకము రెండు లోపించిన అలంకారము.
4. వాచకోపమేయ లుప్త : ఉపమావాచకము, ఉపమేయము రెండూ లోపించిన అలంకారము.
5. ఉపమాన లుప్త : ఉపమానం లోపించిన అలంకారం.
6. వాచకోపమానలుప్త : ఉపమావాచకం, ఉపమానం లోపించుట.
7. ధర్మ ఉపమాన లుప్త : సమాన ధర్మం, ఉపమానం లోపించుట.
8. ధర్మ ఉపమాన వాచక లుప్త : సమాన ధర్మం, ఉపమానం, ఉపమా వాచక లోపించిన అలంకారము.

ఈ విధంగా ఉపమాలంకారం పూర్ణోపమాలంకారంగాను 8 విధాలైన లుప్తోపమాలంకారంగాను విలసిల్లుతుంది.

2. **ఉత్ప్రేక్షాలంకారము :**

**సంస్కృత లక్షణం :** సంభావనా స్యాదుత్ప్రేక్షా వస్తు హేతు ఫలాత్మనా
ఉక్తా నుక్తా స్పదాద్యాతు సిద్ధా సిద్ధాస్పదేపరే.

**తెలుగు లక్షణం :** విదితము లుత్ప్రేక్షలు పెం
పొది వెడఁగావ్యముల యందు నుక్తా నుక్తా
స్పదమును సిద్ధా సిద్ధా
స్పదము నన్ వస్తు - హేతు - ఫల రూపము నన్.

ఉత్ప్రేక్ష అంటే ఊహించుట అని అర్థం. ధర్మ సామ్యాన్ని బట్టి ఉపమేయమును ఉపమానముగా ఊహించుట.

ఉపమేయమును - విషయము, ప్రస్తుతం, వర్ణ్యము, ప్రకృతము అని

ఉపమానం - విషయ, అప్రస్తుతం, అవర్ణ్యము, అప్రకృతము అని అలంకారికులు వ్యవహరించారు.

ఈ అలంకారము వస్తువు, హేతువు, ఫలమును బట్టి సంభావించుట ద్వారా ఇది హేతూత్ప్రేక్ష, ఫలోత్ప్రేక్ష, వస్తూత్ప్రేక్ష అని 3 విధాలుగా చెప్పబడుతుంది. ఈ మూడు తిరిగి ఒక్కొక్కటి 2 విధాలుగా, మొత్తం 6 విధాలుగా చెప్పబడుతుంది.

1. వస్తూత్ప్రేక్ష - 1. ఉక్త విషయ వస్తూత్ప్రేక్ష.
   2. అనుక్త విషయ వస్తూత్ప్రేక్ష.
2. హేతూత్ప్రేక్ష - 1. సిద్ధ విషయ హేతూత్ప్రేక్ష
   2. అసిద్ధ విషయ హేతూత్ప్రేక్ష
3. ఫలోత్ప్రేక్ష - 1. సిద్ధ విషయ ఫలోత్ప్రేక్ష
   2. అసిద్ధ విషయ ఫలోత్ప్రేక్ష

**1. ఉక్త విషయ వస్తూత్ప్రేక్ష :**

**లక్ష్యం :** చక్రవాకీ వినియోగాగ్ని జనిత ధూమ
సమిది యని శంక చేసెదఁదిమిర పటవీ

**లక్షణం :** ఒక వస్తువునకు మరి యొక వస్తువు యొక్క తాదాత్మ్యము చెప్పుట వస్తూత్ప్రేక్ష అలంకారం. ఇది ఉక్తమైన ఉక్త విషయం వస్తూత్ప్రేక్ష అవుతుంది.

**ఉదా :** 'ఈ చీకటిని చక్రవాకము యొక్క విరహాగ్ని నుండి పుట్టిన పొగ అని నేను తలంచెదను.

**సమన్వయం :** చీకటికి పొగతో తాదాత్మ్యం చెప్పబడింది. చీకటి నల్లగా వుంటుంది. పొగ నల్లగా వుంటుంది. చీకటిని చీకటిగా చెప్పక చక్రవాకము యొక్క విరహము నుండి పుట్టిన పొగగా ఊహించబడింది. కావున ఉత్ప్రేక్ష అయింది. ఇందు విషయమైన "చీకటి" చెప్పడం చేత ఉక్త విషయ ఉత్ప్రేక్ష అయింది.

| | | |
|---|---|---|
| ఉపమేయము (విషయము) | - | చీకటి |
| ఉపమానము (విషయ) | - | పొగ |

**2. అనుక్త విషయ వస్తూత్ప్రేక్ష :**

ఒక వస్తువు యొక్క తాదాత్మ్యమును మరొక వస్తువునకు చెప్పేది. ఇందు (ఉపమేయము) చెప్పబడదు.

**ఉదా :** అంగములకు పూత పూయుచున్నట్లు. ఆకాశము కాటుకను వర్షించుచున్నది.

**సమన్వయం :** 'పూయు చున్నట్లు, కాటుక వర్షించుచున్నట్లు' అని ఉపమానము మాత్రమే చెప్పబడింది కానీ విషయము (ఉపమేయం) చెప్పబడలేదు.

చీకటి వ్యాపించి వుంది. చీకటి పడింది అని చెప్పుటకు బదులుగా పూత పూయుట, వర్షించుట అని మాత్రం చెప్పుటచే విషయము అనుక్తమయింది. చీకటి పడింది అను విషయము చెప్పకుండనే "చీకటిని" స్ఫురింప చేయుటచే ఇది అనుక్త విషయ వస్తూత్ప్రేక్ష అయింది.

చీకటి - ఉపమేయము

కాటుక, పూత - ఉపమానం

II. 1. **హేతూత్ప్రేక్ష :** హేతువు కాని దానిని హేతువుగా ఊహించుట. ఇది (1) సిద్ధ విషయ హేతూత్ప్రేక్ష, (2) అసిద్ధ విషయ హేతూత్ప్రేక్ష అని రెండు విధాలు.

1. **సిద్ధ విషయ హేతూత్ప్రేక్ష :** హేతువు సిద్ధమైనచో అది సిద్ధ విషయ హేతూత్ప్రేక్ష అవుతుంది.

**ఉదా :** "రక్తౌ తనాంఘ్రీ మృదువౌ భువి విక్షేపణాధ్రువమ్"

"ఓ కాంతా నీమృదు పాదములు భూమిపై మోపుట వల్ల ఎఱ్ఱబారినవని నేను తలంచెదను"

**సమన్వయము :** కాంతా పాదములు సహజంగాను ఎఱ్ఱగా వున్నాయి. కానీ భూమి మీద పెట్టడం వల్ల ఎఱ్ఱబారినవి అని చెప్పుటచే ఆ ఎరుపు దనానికి కారణం భూమిపై పెట్టడం అని 'కారణం' వల్ల ఇది హేతూత్ప్రేక్ష అయింది. ఎంతమెత్తని పాదాలయిన భూమిపై పెట్టుట సిద్ధ విషయం. ఇక్కడ హేతువు సిద్ధ విషయగతమైంది. కాబట్టి సిద్ధ విషయహేతూత్ప్రేక్ష అలంకారం అయింది.

2. **అసిద్ధ విషయ హేతూత్ప్రేక్ష :** అసిద్ధమైన విషయమును హేతువుగా ఊహించిన అసిద్ధ విషయ హేతూత్ప్రేక్ష అవుతుంది.

**ఉదా :** "త్వన్ముఖా భేచ్ఛయానూనం పద్మైర్వైరాయతే శశీ"

ఓ యువతీ ! నీముఖ కాంతిని పొందగోరి చంద్రుడు పద్మములలో వైరము పూనుకున్నాడు.

**సమన్వయము :** చంద్రుడు కలువలకు మిత్రుడు. పద్మములు సూర్యుడు వచ్చినపుడే వికసిస్తాయి. అది ప్రకృతి సహజం. కానీ చంద్రుని విరోదానికి కారణం యువతి యొక్క ముఖ కాంతిని పొందాలని, వైరము పూనాడు అని హేతువుగా చెప్పబడింది. అచేతనుడైన చంద్రునికి ఇట్టి కోరిక కలగడం అసంభవం. అసిద్ధ విషయము. అసిద్ధ విషయమును హేతువుగా భావించుటకు అసిద్ధ విషయము హేతూత్ప్రేక్ష అలంకారం అయింది.

III. 1. **ఫలోత్ప్రేక్ష :** ఫలము కాని దానిని ఫలముగా ఊహించినచో అది ఫలోత్ప్రేక్ష అలంకారం అవుతుంది. ఇది (1) సిద్ధ విషయ ఫలోత్ప్రేక్ష, (2) అసిద్ధ ఫలోత్ప్రేక్ష అని రెండు విధాలు.

1. **సిద్ధ విషయ ఫలోత్ప్రేక్ష :** సిద్ధ విషయమును ఫలముగా ఊహించుట.

**ఉదా :** "మధ్యః కి కుచయోర్ధృత్యై బద్ధ కనకదామభిః"

ఓ యువతీ ! కుచములను ధరించుటకే కాబోలు నీ నడుము బంగారు గొలుసులతో కట్టబడినది.

**సమన్వయము :** నడుము స్వయంగానే కుచములను మోస్తుంది. కానీ బంగారు గొలుసులు బిగించుట చేతకాదు. నడుము కుచములను మోయుట సిద్ధ విషయము. బంగారు గొలుసులచే నడుమును బిగించుటకు ఫలము కుచ ధారణము ఫలంకాదు. కానీ సిద్ధ విషయమైన కుచధారణమును ఫలముగా భావించడం వల్ల ఇది సిద్ధ విషయ ఫలోత్ప్రేక్ష అయింది.

2. **అసిద్ధ విషయ ఫలోత్ప్రేక్ష :** అసిద్ధమైన విషయమును ఫలముగా భావించుట అసిద్ధ విషయ ఫలోత్ప్రేక్ష.

**ఉదా :** "ప్రాయోబ్జ త్వత్పదేనైక్యం ప్రాప్తుం లోయే తమస్యతి"

ఓ యువతీ ! అనేక విధాలుగా నీ పాదాలలో ఐక్యము పొందడానికి పద్మము నీటిలో తపస్సు చేస్తుంది.

**సమన్వయము :** పద్మం నీటిలో ఉండడం దాని ప్రకృతి సహజ గుణం. అంతే కానీ యువతి యొక్క పాదాలతో ఐక్యం చెందడం కాదు. పద్మానికి అలాంటి ఫలప్రాప్తికూడా అసిద్ధ విషయం. అలాంటి అసిద్ధ విషయాన్ని పద్మము యొక్క నీటిలో వుండి తపస్సుకు ఫలంగా భావించడంచే ఇది అసిద్ధ విషయ ఫలోత్ప్రేక్ష అయింది.

కాబోలు, తలచెదను, అనునట్లు, శంకించెదను మొదలగునవి ఉత్ప్రేక్ష యొక్క సూచక పదాలు. ఇవి ఉన్న ఉత్ప్రేక్ష అలంకారం అవుతుంది.

**3. అర్థాంతరన్యాసాలంకారము :**

**సంస్కృత లక్షణం :** "ఉక్తిరర్థాంతర న్యాసస్స్యాత్సామాన్య విశేషయోః
హనుమానబ్ది మతర ద్దుష్కరం కిం మహాత్మనామ్"

**తెలుగు :** సర్వసామాన్యమును విశేషించు నుక్తి
యమర నర్థాంతర న్యాసమునగ బరగు
ఆంజనేయుడు లంఘించె నంబురాశి
యహమ దుస్తర మెద్ది మహాత్ములకును

సామాన్యమును విశేషము చేతగానీ, విశేషమును సామాన్యం చేతగానీ సమర్థించుట అర్థాంతరన్యాసాలంకారం. సామాన్యం అంటే లోకంలో సాధారణంగా జరిగే విషయం. విశేషం అంటే లోకంలో ఎవరూ చేయరాని గొప్ప విషయం.

**ఉదా :** <u>విశేషాన్ని సామాన్యంచే సమర్థించుట</u>
హనుమంతుడు సముద్రాన్ని లంఘించాడు
మహాత్ములకు సాధ్యంకానిది లేదుకదా

**సమన్వయం :** హనుమంతుడు సముద్రాన్ని దాటడం విశేషం. మహాత్ములకు సాధ్యంకానిది లేదు అని సామాన్యంగా దాన్ని సమర్థిస్తున్నాం.

**2. సామాన్యాన్ని విశేషంతో సమర్థించుట**

**తెలుగు :** అల్పవస్తువైన నధిక గుణాఢ్యంసం
బంధమునను గౌరవంబు గాంచు
కుసుమ సుమాలతోడఁ గూడుటచేగాదె
త్రాడు తలల చేతఁ దాల్పబడియె

**సంస్కృతం :** గుణవద్వస్తు సంసర్గాద్యాతి స్వల్పోపి గౌరవమ్
పుష్ప మాలాను షంగేణ సూత్రం శిరసిధార్యతే

**సమన్వయం :** పూవులలో కూడిన దారాన్ని శిరస్సున ధరిస్తున్నాం. మంచివారలతోడి సంసర్గం వల్ల అల్ప వస్తువులు కూడా గౌరవాన్ని పొందుతాయి. సామాన్యమైన దారం విశేషమైన పూవులలో కలియడంవల్ల గౌరవం పొందుతుంది. కావున అర్థం తరన్యాస అయింది.

**4. రూపకాలంకారము :**

**సంస్కృత లక్షణం :** విషయస్య భేదతాద్రూప్య రంజనం విషయ స్వయత్
రూపకం తత్ త్రిధాధిక్యన్యూనత్వా భవయోక్తిభిః

**తెలుగు లక్షణం :** ప్రకట మగునట్టి విషయంబునకు విషయ్యు
భేదతా ద్రూప్య రంజనం బేదియదియ
రూపకం బిది మూడు తేరుల దనర్చు
నధికతా న్యూనతానుభయ పచనాస్తి

ఉపమేయమునకు ఉపమానము తోడి అభేదమునుగాని, తాద్రూప్యమును గాని వర్ణించిన యెడల రూపకాలంకారము అగును. ఉపమానమునందు ఉపమేయ ధర్మాన్ని ఆరోపించుట.

ఈ అలంకారము ప్రధానంగ (1) అబేధ రూపకము, (2) తాద్రూప్య రూపకమని రెండు విధాలు కాగా ఇవి అధిక, న్యూనత, అనుభయా భేదములచే మొత్తం 6 విధాలు అవుతున్నాయి.

1. అభేద రూపకము - 1. అధికాభేద రూపకం
 - 2. న్యూనాభేద రూపకం
 - 3. అనుభయా భేద రూపకం

2. తాద్రూప్య రూపకం - 1. అధిక తాద్రూప్య రూపకం
 - 2. న్యూన తాద్రూప్య రూపకం
 - 3. అనుభయా భేద తాద్రూప్య రూపకం

1. **అబేధ రూపకము : 1. అధికాబేధ రూపకం :** ఉపమేయ, ఉపమానములకు అభేధమును చెబుతూ ఆధిక్యతను చెప్పుట.

**ఉదా :** ఈ రాజు సమదృష్టి స్వీకరించి విశ్వమేలుచున్న పరమేశ్వరుడు. ఇందు రాజుకు శివునికి అభేదము కలదు. శివునకు లేని సమదృష్టి రాజుకు అధికంగా చెప్పడంచే అధికాభేద రూపకం అయింది.

2. **న్యూనాభేద రూపకం :** ఉపమాన, ఉపమేయములకు అభేదమును చెబుతూ ఉపమేయానికి న్యూనత్వమును ఆసాదించుట.

**ఉదా :** ఇతడు మూడవ కన్నులేని ఈశ్వరుడు

రాజు - ఉపమేయం, శివుని - ఉపమానం. ఇద్దరికి అభేదం చెప్పబడింది. కానీ రాజుకు మూడోకన్ను లేదు అని న్యూనత్వాన్ని చెప్పడంచే న్యూనభేద రూపకం అయింది.

3. **అనుభయా భేదరూపకం :** ఉపమేయ ఉపమానములకు అభేదము చెబుతూ ఉపమానం కంటె ఉపమేయానికి న్యూనతకానీ, ఆధిక్యతగానీ లేకుండా చెప్పుట అనుభయా భేదరూపకం.

**ఉదా :** క్షణములో పురములు భస్మీభంతం చేసిన శివుడు ఇతడేకదా. పురములను క్షణంలో బూడిద చేయుట రాజులను శివుని తోను సమానంగా వుంది. శివునకు రాజునకు అభేదం చెప్పబడింది. ఉపమేయం రాజు ఉపయానం శివుడు. ఇద్దరికి అధ్యికత కానీ న్యూనత కానీ చెప్పలేదు. కాబట్టి అనుభయా భేదరూపకం అయింది.

2. **తాద్రూప్య రూపకం :** 1. అధికతాద్రూంప్యరూపకం

ఉపమేయమునందు తాద్రూప్యాన్ని బట్టి ఉపమానాన్ని ఆరోపించుట తాద్రూప్య రూపకం అవుతుంది.

ఉపమానం కంటె ఉపమేయాన్ని అధికం చేసి చెప్పేది.

**ఉదా :** ఈ ముఖ చంద్రుడు కళంకములేని చంద్రుని వలె ఉన్నాడు. ఇందు ముఖం నందు చంద్రునితో తాద్రూప్యం వుంది. ఉపమేయమైన ముఖం చంద్రుడు ఉపమానమైన చంద్రుని కంటి కళంకము లేనివాడు. అంటే చంద్రునికు లేని కళంక రాహిత్యం ముఖము నందు అధికంగా చెప్పుటచే అధిక తాద్రూప్య రూపకం అయింది.

**2. న్యూనతాద్రూప్యరూపకం :** ఉపమాన ఉమేయాలకు తాద్రూప్యము చెబుతూ ఉపమేయానికి న్యూనత్యమును ఆసాదించుట.

**ఉదా :** ఈమె పాలిసంద్రము నందు జన్మించని అపరలక్ష్మీ ఉపమేయం - అపరలక్ష్మీ. ఉపమానం - లక్ష్మీ. ఇద్దరికి తాద్రూప్యంవుంది. కానీ పాలసంద్రమందు జన్మించకపోవడం అందున్న న్యూనత్యం కాబట్టి న్యూనతాద్రూప్యం అయింది.

**3. అనుభయా భేదతాద్రూప్యం :** ఇందు ఉపమాన ఉపమేయాలకు తాద్రూప్యం ఉంటుంది. న్యూనతకానీ ఆధిక్యతగాని ఉండదు.

**ఉదా :** ఈస్త్రీ యొక్క ముఖచంద్రం చేతనే నేత్రానందం కలుగుచుండగా ఇంక చంద్రునితో పనియేమి.

ఇందు ముఖానికి చంద్రునికి తాద్రూప్యం చెప్పబడింది. చంద్రుడు ఉపమానం. స్త్రీ ముఖ చంద్రం ఉపమేయం. స్త్రీ ముఖం వల్లె ఆనందం కలుగుతుంటే ఇక అసలు చంద్రుడు అపసరం లేదు. ఇందు ఉపమేయమైన ముఖానికి ఆధిక్యత గాని న్యూనతగానీ చెప్పలేదు. కాబట్టి ఇది అనుభయా భేదతాద్రూప్యం అయింది.

**5. అతిశయోక్తి అలంకారం :** ఒక వస్తువును ఉన్నదాని కంటె అతిశయించి వర్ణించుట అతిశయోక్తి

గోరంతను కొండంతలుగ వర్ణించడం. ఉన్నదానికంటె ఎక్కువ చేసి చెప్పుట ఈ అలంకారం 8 విధాలు.

1. రూపకాతిశయోక్తి
2. సాపహ్నతిశయోక్తి
3. భేదకాతిశయోక్తి
4. సంబంధాతిశయోక్తి
5. అసంబంధాతిశయోక్తి
6. అక్రమాతిశయోక్తి
7. చపలాతిశయోక్తి
8. అత్యంతాతిశయోక్తి

**1. రూపకాతిశయోక్తి :** ఉపమానం మాత్రం చెప్పి ఉపమేయాన్ని మరుగుపరచి చెప్పుట రూపకాతిశయోక్తి.

ఉదా : నల్ల కలువల జంట నుండి వాడియైన బాణములు వెలువడుచున్నవి.

| | | |
|---|---|---|
| కలువలు | - | ఉపమానము |
| కళ్ళు | - | ఉపమేయం |
| బాణములు | - | ఉపమానం |
| చూపులు | - | ఉపమేయం. |

యువతి యొక్క నేత్ర ద్వయం నుండి వాడియైన చూపులు వెలువడినవి. ఉపమేయం చెప్పక కేవలం ఉపమానం మాత్రం చెప్పుటచే రూపకాతిశయోక్తి అయింది.

**2. సాపహ్నతిశయోక్తి :** అపహ్నతితో కూడియున్న సాపహ్నతిశయోక్తి అలంకారం అవుతుంది.

**ఉదా :** ఓ రాజా నీమాటల యందే అమృతం ఉండగా భ్రాంతి మతులు దానిని చంద్రునిలో వెదకుచున్నారు.

రాజా నీమాటలలోనే అమృతం అన్నది అతిశయోక్తి. చంద్రునిలో వున్నది అమృతం కాదు. అనునది అపహ్నతి. ఇందు అతిశయోక్తి అపహ్నతితో కూడి ఉంది కాబట్టి సాపహ్నతిశయోక్తి అయింది.

**3. భేదకాతిశయోక్తి :** లోకసామాన్య విషయాలనే భిన్నంగా వర్ణించి చెప్పుట.

**ఉదా :** ఈ రాజు యొక్క గాంభీర్యమే వేరు. ఇతని ధైర్యమే వేరు. లోకప్రసిద్ధమైన ధైర్య గాంభీర్యాల కంటే రాజులో లోకోత్తమైన గాంభీర్య ధైర్యాలు కలవని చెప్పడం. మామూలుగా ఉండే గాంభీర్య ధైర్యాలు కన్నా ఈ రాజులో ఎక్కువ చేసి చెప్పడం. భేదంగా చెప్పడం చేత భేదకాతిశయోక్తి అయింది.

**4. సంబంధాతిశయోక్తి :** సంబంధాతిశయోక్తి స్స్యాదయోగే యోగకల్పనకు సౌధాగ్రాణి పురస్యాస్య స్పృశన్తి విధుమండలమ్. సంబంధముకాని చోట సంబంధమున్నట్లు వర్ణించుట సంబంధాతిశయోక్తి అలంకారము.

**ఉదా :** ఈ పట్టణము యొక్క మేడ భాగములు చంద్రమండలమును అంటుచున్నవి.

నిజంగా మేడలు చంద్రమండలమును అంటవు. చంద్రమండలానికి మేడలకు సంబంధము లేకున్న ఉన్నట్లు వర్ణించినందున సంబంధాతిశయోక్తి అయింది.

**5. అసంబంధాతిశయోక్తి :** సంబంధం ఉన్నా లేదని చెప్పుట అసంబంధాతిశయోక్తి అలంకారం.

**ఉదా :** ఓ రాజా నీవు దాతవగుచుండగా (యాచకులమైన) మేము కల్ప వృక్షాదులను ఆదరింపము.

యాచకులు కఠిన వరాలు తీర్చే కల్ప వృక్షాన్ని ఆశ్రయించుట సహజం యాచకులకు కల్ప వృక్షానికి సంబంధం వున్నా లేనట్లు చెబుతూ, రాజు యొక్క దాన గుణాన్ని ఎక్కువ చేసి చెప్పడం వల్ల అసంబంధాతి శయోక్తి అయింది.

**6. అక్రమాతిశయోక్తి :** కార్య కారణములు రెండూ ఒకేసారి జరుగుట అక్రమాతిశయోక్తి అలంకారం.

**ఉదా :** రాజు వింటి నారిని బాణములు సంధించగానే శత్రువులు నేలకూలిరి.

రాజు బాణములను వదలిన తర్వాత శత్రువులు నేలకూలుట సహజం. కానీ ఇక్కడ రాజు యొక్క బాణములు వింటినారిని తాకిన వెంటనే శత్రువులు నేలకు కూలుతున్నారని, శర సంధాన కార్యం - శత్రు పతన కార్యం ఒకేసారి జరిగినట్లు వర్ణించడం వల్ల ఇది అక్రమాతిశయోక్తి అయింది.

**7. చపలాతి శయోక్తి :** కారణ ప్రసక్తి మాత్రంగాను కార్యం ఉత్పన్నమైనట్లు వర్ణించుట. చపలాతిశయోక్తి అలంకారం.

**ఉదా :** ప్రియుడు ప్రయాణమై వెళ్ళుచున్నానని చెప్పగానే ప్రియురాలికి ఉంగం కడియమైంది.

నాయకుని ప్రయాణం వినగానే నాయిక కృశించడంవల్ల ఉంగరం కడియం అయిందని దీని అర్థం. నిజానికి నాయకుడు దూరప్రాంతం వెళ్ళిన తర్వాత కొన్ని రోజులకు నాయిక విరహవేదనచే చిక్కి ఉంగరం కడియమౌతుంది. కానీ ఇక్కడ ప్రయాణ వార్త వినగానే ఉంగరం కడియమైందని చెప్పుట చేత చపలాతిశయోక్తి అయింది. ప్రియుని ప్రయాణ వార్త కారణం, నాయిక సన్న బడటం కార్యం. రెండూ ఒక్కసారే జరిగినని కాబట్టి చపలాతి శయోక్తి అయింది.

**8. అత్యంతాతిశయోక్తి :** కారణము ముందు తర్వాత కార్యం చెప్పుట క్రమం. సహజం. కానీ కార్యం ముందు చెప్పి తర్వాత కారణం చెప్పుట అత్యంతాతిశయోక్తి అలంకారం.

**ఉదా :** ముందు నాయిక కోపం పోయింది. తరువాత నాయకుడు నాయికను ఊరడించెను.

నాయకుని ఊరడింపు ముందు, తర్వాత నాయిక కోపం పోవుట సహజం. వర్ణించడం కూడా అలాగే వర్ణించాలి. కానీ దీనికి వ్యతిరేకంగా ముందు కోపంపోవుట, తర్వాత ఊరడించుటకు వర్ణించుటచే దీనిని అత్యంతాతిశయోక్తి అలంకారం అంటారు.

**6. దృష్టాంతాలంకారము :**

**సంస్కృత లక్షణం :** "చేద్బింబ ప్రతిబింబత్వం దృష్టాంత స్తదలంకృతిః
త్వమేవ కీర్తిమాన్రాజన్ విధు రేవ కాంతిమాన్"

**తెలుగు లక్షణం :** కృతిబింబ ప్రతి బింబా
కృతి (దగ దృష్టాంత మగును - నీ వనము
న్నత కీర్తి సమన్వితుడవు
సిత కిరణుడు, కాంతియుతుడు క్షితి నను పోలినన్

ఉపమాన ఉపమేయ ధర్మాలను బింబ ప్రతిబింబ భావంతో వర్ణించుట దృష్టాంతం.

**ఉదా :** ఓ రాజా నీవే కీర్తిగలవాడవు. చంద్రుడే కాంతిగలవాడు.

**సమన్వయం :** ఇందు రాజు ఉపమేయం. చంద్రుడు ఉపమానం. కీర్తి, కాంతి, రెండింటి ధర్మాలు వేరు వేరు. అయినా వెలుగుట అనే ఒకే సాదృశ్యం చెప్పడం వల్ల దృష్టాంతాలంకారం అయింది. రాజు కీర్తితో వెలుగుతాడు. చంద్రుడు కాంతితో వెలుగుతాడు రాజు విషయం చెప్పేటప్పుడు రాజుబింబము. చంద్రుడు ప్రతిబింబము. చంద్రుడు విషయం చెప్పేటప్పుడు చంద్రుడు బింబము. రాజు ప్రతిబింబము. ఇద్దరి గొప్పదనం 'వెలుగు' కాబట్టి బింబ ప్రతిబింబ భావంతో దృష్టాంత మయింది.

**7. ఉల్లేఖాలంకారము:**

**సంస్కృత లక్షణం :** బహుభిర్బహు దోల్లేకాదేక స్యోల్లే ఇష్యతే
స్త్రీ భిః కామోర్ధిభి స్స్వర్ధుః కాలశ్శత్రుభిరై క్షిసః

**తెలుగు లక్షణం :** పెక్కు విధముల నొక్కని( పెక్కువార
లెన్న మల్లేఖ మగునది యెటుల నన్న
అంతడు గన్పట్టి వింతల కతను డనగ
అర్థులకు కల్పకము, కాలు(డరుల కనగ

ఒకే వస్తువును అనేకులు అనేక విధాలుగా భావించినచో అది ఉల్లేఖాలంకారం అవుతుంది.

**ఉదా :** అతనిని స్త్రీలు మన్మథునిగాను, యాచకులు కల్పతరువుగాను, శత్రువులు యమునిగాను తలంచారు.

**సమన్వయం :** ఒకే వ్యక్తిని స్త్రీలు, యాచకులు, శత్రవులు, రకరకాలుగ ఊహించడం వల్ల ఇది ఉల్లేఖాలంకారం అయింది. అనగా ఒకే వ్యక్తిలో అనేక ధర్మాలు చెప్పబడినవి కాబట్టి ఉల్లేఖం.

**మరొక విధంగా ఉల్లేఖం :**

**లక్ష్యం :** ఒకే వస్తువును వేర్వేరు ధర్మాలను బట్టి ఒకే వ్యక్తి భిన్న వస్తువులుగా భావించడం ఉల్లేఖం.

ఉదా : అతడు వాక్కులందు బృహస్పతి, కీర్తియందు అర్జునుడు, బాణ ప్రయోగమున భీష్ముడు.

సమన్వయం : ఒకే వ్యక్తిలోని భిన్న ధర్మాలను బట్టి అతనిని బృహస్పతిగాను, అర్జుననిగాను, భీష్మునిగాను భావించు కున్నందున ఉల్లేఖం అయింది. అనగా ఒకే వ్యక్తిలో అనేక ధర్మాలు చెప్పబడినవి కాబట్టి ఉల్లేఖం.

**8. శ్లేషాలంకారము :** నానార్థ సంశ్రయ శ్లేషో వర్ణ్యా వర్ణ్యో భయాశ్రతః అనేక అర్థాలు గల శబ్దాలను ప్రయోగించిన శ్లేషాలంకారం ఇది ప్రకృత, అప్రకృత ప్రకృతా ప్రకృతా శ్లేషలని మూడు విధాలు

**1. ప్రకృత శ్లేష :** రెండర్థాలు ప్రకృతము అయితే అది ప్రకృత శ్లేషాలంకారం.

**ఉదా :** పుష్కర నేత్రుడు, మాధవుడు, చతురాత్మా భుజపటిష్టుడు బాణాంతకుడు, కాలసానవతంసుడు. నిత్యము మము రక్షించుగాక.

**సమన్వయం :** కమలముల వంటి నేత్రాలు కలవాడు లోకాలన్నింటిని నాలుగు భుజాలచే రక్షించే సామర్థ్యము కలవాడు బాగాసురునికి యముని వంటివాడు నెమలి పించాన్ని తలపై ధరించినవాడు లక్ష్మీవల్లభుడు అయిన విష్ణుమూర్తి మమ్ము నిత్యము రక్షించు గాక అని ఒక అర్థం.

2. సర్పముల వస్త్రాలుగా కలవాడు సకల భవనాలను తన భుజబలంతో కాపాడువాడు. మన్మధుని బూడిద చేసినవాడు, చంద్రుని తలపై ధరించినవాడు అవనివాసుడు. పార్వతి భర్త అయిన శివుడు మమ్మ్ము నిత్యము రక్షించు గాక.

ఇందులో హరి, హరుల విషయం చెప్పబడింది. రెండు అర్థాలు ప్రధానమైనవి. రెండు ప్రకృతములే, కాబట్టి ఇది ప్రకృత శ్లేష.

**3. అప్రకృత శ్లేష :** ప్రకృతమును చెప్పేటప్పుడు అప్రకృతం జ్ఞాపకం వచ్చిన అది అప్రకృత శ్లేష

**ఉదా :** ఆ స్త్రీ అబ్జసుందరముఖి, ప్రవాళధరోష్ఠ, కాంచనాభంగి అచలోరుకటి.

**సమన్వయం :**

| | | |
|---|---|---|
| అబ్జము | - | పద్మము, చంద్రుడు |
| ప్రవాలము | - | పగడము, చిగురు |
| కాంచనం | - | బంగారం, సంపెంద |
| అచలము | - | కొండ, భూమి |

ఒక అర్థంలో ఆమె పద్మం వంటి అందమైన ముఖం, పగడం వంటి పెదవి, బంగారం వంటి దేహం, కొండ వంటి నితంబము కంది అని ఒక ప్రకృతార్థం.

అప్రకృతార్థంలో చంద్రుని వంటి ముఖం, చిగురాకు వంటి పెదవి, సంపెంగ పువ్వు వంటి సువాసనతో కూడిన మృదువైన శరీరం భూచక్రమంతటి బిరుదులు కలది అని పై అర్థం చెప్పేటప్పుడు రెండో అర్థం అప్రకృతం. క్రింది అర్థం చెప్పేటప్పుడు పైన చెప్పిన అర్థం అప్రకృతం. ఈ విధంగా ప్రకృతార్థం చెప్పేటప్పుడు అప్రకృతార్థం స్ఫరించినచో అది అప్రకృత శ్లేష.

**3. ప్రకృతా ప్రకృత శ్లేష :** ప్రకృతము, అప్రకృతము రెండు ప్రధానంగా స్ఫూరించినచో, రెండూ గ్రహించిన అది ప్రకృతా ప్రకృత శ్లేష.

**ఉదా :** ఉచ్ఛరద్భూరి కీలాలుడైన వాహినీ పతి విరాజిల్లెను

**సమన్వయం :** పైకి ఉబుకు చున్న రక్త ధారలు కలవాడు అయిన సేనాపతి ప్రకాశంచెను. అతి ప్రకృతార్థం. ఇది సేనాపతి పరమైన అర్థం. పైకి లేచుచున్న గొప్ప బలం కలవాడు నదులకు భర్త అయిన సముద్రుడు విరాజిల్లెను ఇది సముద్రపరమైన అర్థం.

అప్రకృతార్థం

| | | |
|---|---|---|
| కలాల | - | రక్తము, జలము |
| వాహినీ | - | సేనాపతి, సముద్రం. |

సేనాపతి అర్థం ప్రకృతంగా చెప్పునపుడు సముద్ర పరమైన అర్థం అప్రకృతం.

సముద్ర పరమైన అర్థం, చెప్పునపుడు సేనాపతి పరమైన అర్థం అప్రకృతం.

ఈ విధంగా ప్రకృతా ప్రకృతం రెండూ స్పష్టంగా ప్రధానంగా చెప్పడం చేత ప్రకృతా ప్రకృత శ్లేష అయింది.

**ముగింపు :** ఈ పాఠం ద్వారా అలంకారం గురించి శబ్ద, అర్థాలంకారాలలోని వివిధ రకాలను గురించి ఉదాహరణలతో సహా తెలుసుకున్నాం.

## ఉపయుక్త గ్రంథాలు :

1. బాల వ్యాకరణం 2. ఆంధ్ర చంద్రాలోకం

**డాక్టర్ బి.జ్యోతిస్వరూపరాణి.**
రీడర్. తెలుగుశాఖ, అధ్యక్షులు,
జి.యమ్.జి.కళాశాల, తెనాలి.